కర్పూరమంజరి

మొదటిప్రకరణము

"అహహా! జన్మస్థానవియోగదుఃఖము దుస్సహము గదా! ఆలుబిడ్డల, నన్నదమ్ముల, నాప్తబంధుమిత్రుల, విడుచుట యెంతకష్టమో, స్వదేశమును విడుచుటయు నంతకష్టమె. వేదాంతశాస్త్రజ్ఞులీ యనురాగ మజ్ఞానజనిత మనియు, మమత్వము లేనివారలే విజ్ఞానులనియుఁ జెప్పుదురు. కాని యది యొప్పుకొనఁదగినమాట కాదు. ప్రపంచమున నరుఁడు జీవించునంతకాలము మమత్వాదులు లేక యుండుట యసంభవము. స్వాభిమానము, బంధుజనాభిమానము గృహాభిమానము, దేశాభిమానము, మతాభిమానము, మొదలగునవి శ్లాఘ్యములే యగును గాని, గర్హ్యములుగావని నాయభిప్రాయము. నే నెంతప్రయత్నించుచున్నను నామనసునుండి యీయభిమానమును బాఱఁదోలఁ జాలకున్నాఁడను. కటకటా! మూఁడుతరములనుండి మా కుటుంబమునకుఁ గాపురమై, నాకు జన్మభూమియై, సకలసంపదలకుఁ బుట్టినిల్లయి ముక్తిప్రదాయకము లగునగరములలో నొకటియై, విలసిల్లు నుజ్జయినీ మహానగరమును నేనింక నెన్నఁడైన గన్నులపండువుగఁ జూడఁ గలుగుదునే? వసంతకాలమున సాయంసమయంబుల శిప్రానదీతీరంబునకుం బోయి యాయేటినీటిబొట్టులఁ గలిసి వీచుమందమందమలయానిలయంబులు నెమ్మేను సోక నెన్నఁడైన సౌఖ్య మనుభవింతునే? ప్రదోషకాలమున నాలయంబునకుఁ జని, సకలభువనరక్షకుఁడగువిరూపాక్షు, మహాకాళేశ్వరు నింక నెన్నఁడైనఁ జేతులారఁ బూజించి, మనసార ధ్యానింపఁగలుగుదునే? వత్సరాజు ప్రద్యోతమహా

రాజనందన యగువాసవదత్తాదేవిని పిత్రుగృహమునుండి తీసికొనిపోయి నవిచిత్రకథలు పల్లియలనుండి వచ్చుచుట్టములకు నెన్నఁడైన వీనులవిందుగ వినిపింతునే! అంతభాగ్యము నావంటియదృష్టహీనునకుఁ గలుగదు. నే నెక్కడ యుజ్జయిని యెక్కడ? పరమసాధ్వి యగునిల్లాలిని ప్రపంచ మెట్టిదో యెఱుఁగనిపసిబిడ్డనయినశిశువుగఁ బుట్టినింట నునిచి దిక్కుమాలినపక్షినయి కానిదేశములఁ జరియింపు మని పద్మగర్భుఁడు నాకెన్నఁడట మూఁడుబంతుల వ్రాసి యుండ నేను సుఖించు టెట్లు? ఓ మహాకాళేశ్వరా! నాకిట్టిదుర్భర మగునవస్థ గలుగుటకు నాచేసిన దోస మేమి? అతిథులకు నభ్యాగతులకు మునుమున్న పెట్టక నన్నంబు గుడువ. వైశ్వదేవంబు సేయక యిల్లు వెడల. నీపాదారవిందధ్యానము చేయక నిదురవోప. అబ్రాహ్మణకర్మంబుల నాచరింప. అట్లు మెలఁగుచున్నను నాకిట్టిగతి ప్రాప్తించుటకుఁ గారణ మేమి? భవతారకంబు లగునీయడుగుఁదామరల నొకసారియైన ధ్యానింపనిఖలులు, కలకండంబులకన్నఁ దియ్యనగునీనామంబు నెన్నఁడును స్మరింపనికష్టులు, మంగళప్రద మగునీకోవెలఁగడప నొకతూరియైనఁ ద్రొక్కచూడనిమొక్కలులు, విశ్వమోహనం బగు నీసుందరవిగ్రహంబు మఱపున నైనఁ గనుంగొననియధములు, ధనధాన్యములు నాయురారోగ్యములు, నిత్యకల్యాణంబులు గలిగి వర్ధిలుచుండ నాజన్మశుద్ధుఁడనై, విప్రుఁడనై, ఘనాంతస్వాధ్యాయవేత్తనై, వేదాంతశాస్త్రపరిజ్ఞాతనై, విశేషించి నీచరణారవిందసేవకుఁడనై, నలువురలోఁ దలయెత్తుకొని గౌరవముగాఁ గాలక్షేపము సేయుచున్న నే నిట్లు దుస్తరదుఃఖసముద్రమునం బడి యుండ నుపేక్షించుట నీకు న్యాయమే? అయ్యయ్యో! నిష్కారణముగాఁ గర్మసాక్షి యగు భగవంతుని దూఱనేల? పూర్వజన్మకృత మగుకర్మమే దీనికిఁ గారణము. ఆకర్మయే [illegible]ముగాఁ జేసి, కాశ్మీరనేపాళవిదర్భదేశములను గోబ్రాహ్మణ

పక్షపాతులు, వైదికమార్గప్రవర్తకులు నయి, ధర్మస్వరూపు లయిన రాజులు పరిపాలించు చుండ మాళవదేశమునకు బ్రాహ్మణద్వేషియు వేదబాహ్యుఁడు ననంగతుఁడు నగు పరమనాస్తికుఁడు బౌద్ధరాజు సుదర్శనుఁ డేల దాఁపుర మయ్యె. నావలె నాసుదర్శనుఁడెన్నఁడైన నుజ్జయినీనగరంబు విడచి, మనస్తాపంబుఁ జెందునే? నావలె నెన్నఁడైన నాదురాత్ముఁడు తనయాలుబిడ్డలఁ బాసి యేకాకియై చరించునే? నాయుసు రెన్నఁడైన వానికి వానికుటుంబమునకుఁ దగులునే ? ఏల తగులక పోవు? సాధు లగునగ్రజన్ము లొక్కనిముసము ననుభవించు చిత్తక్షోభము నూఱుమడుంగులై, పెయిజన్మముల నైనఁ దత్కారకులకు ఫలము గట్టికుడుపక పోదు. పాడియుఁ, బంటయు, సిరియు, సంతతియుఁ గలిగి, పండువలె నున్న నాకాపురము గూలంద్రోసినయారాజాధముని దైవంబు సెఱుప కుండునే? ప్రాణంబులు కంఠంబున నుండు నంతకాలమును నే నాతనితోఁ బగ సాధించి నాయావచ్ఛక్తి వినియోగించి పరరాజుల వానిపై దండువిడియఁ బంపి, యాతని రాజ్యభ్రష్టుని గావించి యుజ్జయినీనగరము పాడుచేసి, యాలుబిడల నెడబాపి, వానినమ్మినప్రజల నిడుమలఁ గుడిపి, వేధింపక పోయితి నేని నేను బ్రాహ్మణుఁడను గాను. ఇదియే నాశపథము. దేవసింహుఁడు, హిరణ్యమిశ్రుఁడు, సత్యమిహిరుఁడు మొద లగుబౌద్ధపండితు లందఱుఁ దమ రాజునుం గూడి నాకొనర్చినయపకారమునకుఁ బ్రతిఫల మనుభవింతురుగాక! మాళవదేశస్థు లందఱుఁ బరమవైదికుఁ డగుఛాందసబ్రాహ్మణుఁడు రుద్రభట్టుమహాత్వ మించుక యేఱుంగుదురు గాక! సరే! అది యటుండ నిమ్ము. ఇప్పుడు నేనే దేశమునకుఁ బోయి వసింతును? తక్కినవిషయంబులకన్నఁ గాశ్మీరంబు సుభిక్షం బని విందు. దానికి రాజధాని యగుశ్రీనగరము సార్థకనామమై సిరులకు నివాస మని విందు. దానిం బాలించు హేమచంద్రమహారాజు బ్రాహ్మణపక్షపాతి యని నాడుక

కలదు. కావున నానగరంబునకుం బోయి తల దాఁచుకొనుట యుచితము. అచ్చట నే నెవ్వరి నెఱుంగుదును? క్రొత్తవారి నెవ్వ రాదరింతురు? ఏ మయినను సరే దైవముపై భారము వైచి పోయెదను. అదిగో! నా యెట్టయెదుట నొకపల్లియ కానవచ్చుచున్నది. చీఁకటి వడకుండ నాగ్రామము చేర వలయును. ఇది యరణ్య మగుటచే దైవోపహతుండ నగు నేను మఱికొన్ని యుపద్రవములపాలు గావలసి వచ్చును. భాస్కరుఁడును నావలెనే తనతోంటి తేజము డీలుపడి యొక మారుమూల దలదాఁచుకొను చున్నవాఁడు" అని తనలోఁ దాను వితర్కించుకొనుచు నొక బ్రాహ్మణుఁడు వేసవికాలమున నొకనాఁటి సాయంకాలము సింధునది తూర్పుటొడ్డునఁ గలయొకయడవిలో నుండి ముందరిపల్లెకుఁ జీఁకటి పడకుండఁ బోవలయు నని విసవిస నడచుచుండెను.

అతఁ డేఁబదిసంవత్సరములు దాఁటినవాఁడు. శరీరము దబ్బపండువంటి పచ్చనిచాయ గలిగి స్థూలమై యుండెను. అతఁడు పొడుగరి యన వచ్చును గాని స్థూలముగ నుండుటచేఁ జూచువారి కించుక పొట్టిగఁ గానఁబడుచుండును. మెడలో బంగారుతీఁగెను జుట్టినరుద్రాక్షతావళమును, దలకుఁ జుట్టినవిలువ గలపచ్చనికాశ్మీర సేలువ, చెవులనలంకరించు కనకకుండలములు, చుట్టఁజుట్టి వీఁపుపై నిడుకొన్న కృష్ణాజినము, వ్రేల నున్న కాశికాముద్రయుంగమును దద్బ్రాహ్మణుఁడు శిష్టుఁడనియు, విద్వాంసుండనియుఁ దెలుపు. కాని కన్నులు మేడికాయలట్లు పెద్దవై యెఱ్ఱజీరలుగలవై చూపఱ కించుక వెఱపు గొలుపుచుండును. స్వభావముచేత నావిప్రుఁడు ధూర్తవర్తనుఁడు కోపకాఁడు నై నట్లు వానిమొగము జూచువారు మునుముందె యూహింప వచ్చును. ఆమహీసురుఁడు మధ్యాహ్న మంతయు నెండలో నడచుటచే వానిమొగ మెంతయు సూర్యకిరణసంతప్తమై జేవురించి చెమ్మటలు గారు చుం

డెను. దీర్ఘప్రయాణంబున నతఁ డతిశ్రాంతుఁ డై యెడనెడఁ జెట్లనీ డల నించుక విశ్రమింప నిచ్ఛగించెను. కాని పొద్దు కుంకు చుండు టయు మార్గము నిమ్నోన్నత మగుటయుఁ, జిఱుచీఁకటులు గ్రమ్మ నారంభించుటయు, నెంచి సాధ్య మయినంత వేగముగఁ బో వలసి వచ్చెను. పథికు లెంతవిసురుగ నడచినను శ్రాంతు లగునప్పుడు వారికి గమ్యస్థానము గడుంగడు దవ్వున కరిగినట్లు తోఁచును గదా! ఎంత నడచినను బ్రాహ్మణుఁడు చీఁకటి పడునప్పటికి గ్రామము చేర లేక పోయెను. నిర్జన మగునాప్రదేశము సహజముగ ధైర్యశీలుఁ డగు నాతనికి భయము గొలుపఁజొచ్చెను. రాత్రి యనునంగనతలవెండ్రు కలవలెఁ గాఱుచీఁకటులు నలుదెసలఁ గ్రమ్మెను. ఘాతుకమృగంబులు, దుష్టసర్పములు, చోరకిరాతులు, భూతపిశాచములు బ్రాహ్మణునితలఁ పున నిలువ నతఁడు భయకంపితుఁడై మాటిమాటికి వెనుకకుఁ దిరిగి చూచుచు హరినామస్మరణము జేయుచుఁ జేతికఱ్ఱతో నేలఁ దట్టుచుఁ దాఁ జేయు చున్నపనిఁ దా నెఱుంగక యెట్టెటో నడుచు చుండెను.

ఇట్లు విహ్వలచిత్తుఁ డగునాజన్నిగట్టు చేసినదోసంబు మూర్తీ భవించెనో యన నొకకిరాతుఁడు నల్లమేనివాఁడు వాని వెనువెంటనే వచ్చి చేతిదుడ్డుకఱ్ఱతోఁ దలపై నొక్కపెట్టు పెట్టెను. వెంటనే బ్రా హ్మణుఁడు గొడ్డలిపెట్టునం బడు చెట్టులాగున హరహరా యనుచు నేలం గూలె.

రెండవప్రకరణము.

ప్రపంచమునందలికొండలలో హిమాలయపర్వతమే మహో న్నత మయినది. ఇది నిరంతరమును మంచునకు నెలవగుటచే దీని కా పేరు గలిగినది. ఈమంచుఁగొండ యార్యావర్తమున కుత్తరదిగ్భాగ

మునఁ దూర్పునుండి పడమరకు వ్యాపించి భగవన్నిర్మితమగు రాతిగోడ
చందంబున దుర్భేద్య మయి యుండు. ఆధిక్యతనుబట్టి మనపూర్వు
లీనగమునకుఁ బర్వతరాజ మనుబిరుదము నిచ్చిరి. ఆవైశాల్యము,
నాయౌన్నత్యము, నాగాంభీర్యము నొక్కమాఱు గన్నవారు శైల
చక్రవర్తినామము దానియందు సార్థక మయ్యె నని తలఁపక పోరు.
ఏశైలంబు తలదాఁచుకొనుటకు లేక వల్లకాడులఁ గాపుర ముండు
మూఁడుకన్నులవేల్పునకు నిలువనీడ యయ్యె, నేనగాధిరాజుకడుపున
నుదయింప వలయు నని దాక్షాయణి కోరి పార్వతి యయి జన్మమందె,
నేకొండరాజు తనయనుంగుఁగూఁతురును గాళ్ళుకడిగికన్యాదానమిచ్చి
చిరబ్రహ్మచర్యముచే వేతలఁ బడుమహేశ్వరు నొకయింటివానిఁ జేసె,
నేమహీధరగుహాంతరంబులు ప్రమథగణంబుల కోలాహలంబులకును,
పిడుగులచప్పుడు వోలె వినంబడునందీశ్వరుని అంకెలకును బ్రతిధ్వను
లిచ్చుచుండు, నే భూధరకూటములు తమప్రియులం గలసిమెలసియెడ
లేనిమమతల విహారంబు సలుపుకిన్నరవిద్యాధరబాలికల కాటపట్టు
లయ్యె, నేకుధరంబును దపోనిష్ఠు లగు రాజర్షి, బ్రహ్మర్షి, దేవర్షి, గణం
బులకు యజ్ఞభూమి యై దేవతల కన్నసత్ర మయ్యెనని పురాణంబుల
వినుచుందుమో, యేగుబ్బలి భువనపావనము లగుసింధుగంగాప్రముఖ
నదీమతల్లికలకుఁ గన్నతల్లియై విలసిల్లునో, యేగట్టులదారకటిప్రదేశ
మునందె మేఘమండలములు చరియించు చుండునో, యాహిమవంత
ము, దీర్ఘశృంగములతో, దుర్గమారణ్యములతో, నమూల్యరత్న
ములతో, సువర్ణాదిలోహములతో, నుత్తమదివ్యౌషధులతో, గైరి
కాదిధాతువులతో, బహుసత్వములతో, నెల్లప్పుడుం బాఱుసెలయేళ్ళ
తో, సొబగుమీఱుచరియలతో, నిండి యుండి చూపఱకుఁ గనులపం
డువు సేయుచు నాశ్చర్యమును సంతోషమును భయమును గొలుపుచుఁ
బరమేశ్వరుని యనంత మహిమంబును బ్రకటించు చుండును. ఈచలి

కొండ కుత్తరభాగమునఁ గైలాసంబున సింధునదిజనించె. సింధుశబ్దము
నకు సముద్రమర్థ మగుటచే నీనదిపొడవు వెడల్పులం జూడ చిన్న సము
ద్రమో లేక సముద్రునిబిడ్డయో యని సందియము తోఁచును. ఈమ
హానది పుట్టినచోటు వదలి కొంతదనుక టిబెట్టు దేశమునఁ బ్రవహించి
యనంతరమునఁ గాశ్మీర దేశంబు జొచ్చి తన్మధ్యభాగంబునఁ బాఱి య
వ్వలఁ బాంచాలసింధు దేశములు ప్రవేశించి, యనేకోపనదులం గలిసి చ
వుటిపట్టుల రత్నగర్భలుగఁ జేసి, పట్టణంబులఁ బల్లియల నుండుజనం
బులకు జీవనంబు లొసంగుచుఁ బలుపాయలై పశ్చిమసముద్రమునఁ
బడుచున్నది. ఈనదియొడ్డున నిప్పటికిని దట్టంబులగు కారడవులు కొన్ని
కొన్ని తావులం గలవు. ఈగ్రంథమునఁ జెప్పఁబడుకథ, శాలివాహనశక
ప్రారంభమునకును విక్రమార్కశక ప్రారంభమునకుఁ జాలమున్నె జరి
గిన దగుటచే నాకాలంబున నిప్పటికన్న దుష్టమృగకీర్ణశరణ్యంబు
లగునరణ్యంబులు విశేషంబుగ నుండెను. కాశ్మీరదేశ మిప్పటియట్లు
చిన్నదిగ నుండక యాకాలమున, మిగులఁ బెద్దదై యిప్పుడుపంజాబనఁ
బడు దేశమును జాలవఱ కాక్రమించెను. చీనాబనునుపనదిసింధునదితోఁ
జేరుప్రదేశమున కుత్తరమున నొకయామడదూరమున సింధునది పరి
సరంబున నొకయడవిలో నొకచిన్నపల్లె యుండె. ఆపల్లియందు
బోయలు మొదలగునాటవికులే గాని బ్రాహ్మ క్షత్రియ వైశ్య
లెవ్వరును గాఁపుర ముండుట లేదు.

నాగరకులమొగ మెన్నఁడును గనుంగొనని యాగ్రామవాసుల
సమీపమున గాఁపుర ముండుటకు నూరుపే రెవ్వరికిఁ దెలియనిపురుషులు
కొందఱు వచ్చి యెందుచేతనో యచటఁ గాలముఁ బుచ్చుచుండిరి.
వారిలో నాఁడువాం డ్రెవ్వరును గానఁబడరు. తెలివిమాలినవనౌకసులు
వారి పూర్వవృత్తాంతములఁ గూర్చి తఱచి యడుగక, వారివేషభాష
లంగనుంగొని సందియపడక వారికిం దమచేతనైనసాయంబు నెఱపుచు

వారితోఁ గలసిమెలసి యుండిరి. ఒకనాఁ డానాగరికులలో నొకఁడు సేవకులిరువురితో మధ్యాహ్నము వేఁటకుం జని యెం దేని జరియించి కొన్ని పులుఁగుల మృగములఁ జంపి చచ్చినవానిని సేవకులిరువురు మోసి తేర సాయంకాలమున కెప్పటియట్లిల్లు సేర లేక, చీఁకటులు గ్రమ్మినవెనుక నదియొడ్డున నడచి వచ్చుచు వెంట వచ్చుపరిచారకులలో నొకనితో నిట్లనియె. "కరటకా! మన మీవేళఁ జాలయాలస్యముఁ జేసితిమి. వేఁట మొదలగుదుర్వ్యసనములం దగిలినవారికి నాఁకలియు దప్పియుఁ బ్రొద్దును దెలియ వని పెద్దలు సెప్పుమాటలు నిశ్చయములే యని నేను దలంచెద. మనము నడచుచున్న దరణ్యప్రాంతము, గ్రమ్మినది కాఱుచీఁకటి, కావున జాగరూకతతో నడువుఁడు" అని పలుకఁ గరటకుండు వానితో "స్వామీ! కొంచెము ప్రొద్దుపోయిన నేమి? కావలసినన్ని మృగములు పక్షులు లభించినవి. మన మింక గొంతసేపటి కైన నిల్లు సేరక పోము. మనము మువ్వుర మున్నాము గనుక నంతగ భయపడ వలసినది లేదు." అని పలికి వాఁ డింక నేదియో యనఁ బోవుచుండ "నయ్యయో! కటకటా! యేమిచేయుదు" నని యొక యార్తనాదము వారిచెవులం బడె. ఆపురుషులు మువ్వు రాశబ్దము విని నిశ్చేష్టులయి నిలిచి యది యేమయి యుండు నని తమలోఁ దాము మెల్లఁగ విచారించుకొని, మఱిమఱి నట్టిశబ్దము వినఁబడక పోవుటచే మరల సాగి నడచుచుండిరి. వారుకొన్నిగజములదూరము నడుచునప్పటికి ముందు నడచుచున్న కరటకునికాలి కేదియో తగిలెను. వెంటనే వాఁడు పీనుఁగపీనుఁగ యని యఱచుచు వెనుకకుం బఱుగెత్తెను. వాని యజమానుఁడైననాగరకుఁడు "కరటకా! భయపడకు భయపడకు. పీనుఁగున కంత వెఱుపవలెనా? ప్రాణమున్న జంతువులు హాని సేయఁగలవు గాని మృతకళేబరములు లే మపకరింపఁ జాలవు గదా. దగ్గఱకుఁ బోయి చూతము రమ్మని పిలిచి దృఢమనస్కుఁడయి ముందుకు నడచుటయు యజమానుని

వెంటఁ గరటకుఁడును గరటకుని వెంట రెండవ సేవకుఁడగు పింగళుఁడును నడిచిరి. అతఁడా కళేబరముఁ సమీపించునప్పటికి పాదములు నెత్తుటం దడిసిన నేలం దాఁక వాని మేను పులకరించెను. ఈయాశ్చర్యమేమయి యుండు నని యాపురుషుఁడు విచారింప నారంభింప నంతలో “అయ్యా! నేను బిడుఁగను కాను. భగవదనుగ్రహముచేత నిప్పటికి సజీవుఁడనే. నాయందనుగ్రహముంచి నా గాయములకుఁ గట్టు కట్టినా కించుక సాయంబు సేయుదురేని నేనాజన్మాంతము మీకుఁ గృతజ్ఞుఁడ నయి విధేయుఁడనయి యుందు” నని కొన్ని మాటలు హీనస్వరముగ వినఁబడెను. ఆపలుకులు విని యజమానుఁడును సేవకులును పడియున్న వాఁడాపగలో నున్న మనుష్యుఁడని యెంచి దగ్గఱకుఁబోయి “అయ్యా! నీ వెవఁడవు? ఏల యిట్లు పడి యున్నవాఁడ” వని యడుగ నామను ష్యుఁడు గద్గదస్వరముతో వారి కిట్లనియె. “అయ్యా! నేనొక బ్రాహ్మ ణుఁడను. నాపూర్వవృత్తాంతమంతయు సవిస్తరముగ మీకెఱిఁగించుట కిది సమయముకాదు. నాకిప్పు డోపికయు లేదు. ప్రస్తుతచరిత్ర మెఱిఁ గించెద వినుఁడు. ఈరాత్రి మునుపుఁ గనుంబడుపల్లెకుఁ బోవలయునని వడివడి నీదారిని నడుచుచుండ దుష్టుఁడొకచోరుఁడు నాకుం దెలి యకుండ నావెంబడి వెంటనంటివచ్చి చేతిదుడ్డుకఱ్ఱతో నానడినెత్తి పగుల మోఁదెను. ఆప్రహారముతోఁ దలకుం జుట్టికొన్న సేలువయొక మూలం బడ నెత్తినుండి కొన్నెత్తురు జొటజొటఁగారఁ గొడ్డట నఱకినతరువు వలె నేను హాహాకారము సేయుచు నేలఁ గూలితిని. అంతట నాతఁడు నారత్నకుండలములు చెవుల వ్రేలియుండఁగాను దొంగిలించుకొని యెం దేనిం జనియె. నన్నుం గనికరించి యాయూరికిం గొంపోయి నాగాయ ములు మాన్ప వేఁడెద.” అని జాలి గదురఁ బలుకుటయు, వానిని లేవఁ దీయుమని యజమానుఁడు సేవకులం బనిచి, బ్రాహ్మణునకు ధైర్య ముజెప్పి మెల్లమెల్లఁగ నడిపించుచు నూరికిం దోడ్కొనిపోయి గాయం

బులకుఁ దగుచికిత్సలఁ జేసి పాలుద్రావ నిచ్చి పన్నుండుటకు మంచము వేయించి బహువిధంబుల నాదరించె. తరువాత నాలుగైదుదినములకు బ్రాహ్మణునిగాయము కుదుర నారంభింప వానికాయంబుక్రమక్రమముగ దృఢంబు గాఁ జొచ్చెను. ఆవిప్రుఁ డొకనాఁడు నిజప్రాణసంరక్షకుఁ డగునాపురుషుని నామధేయంబు నెఱుంగఁ గోరి యడుగ నాతఁడు కొంచెము విచారించి "అయ్యా! న న్నిచటివారు సుమిత్రుఁ డందురు. ఏపే రయిన నేమి నన్ను మీ రిచ్చవచ్చినపేరం బిలువుఁ" డని ప్రత్యుత్తర మిచ్చెను. తనపేరు చెప్పుట కతఁడుసందేహించినట్లు కనఁబడుటయు వానియున్నతావు ననికియు, వానిసుందరాకారంబునకును మృదుభాషణంబులకును దగని వై యుంటయు, బుద్ధిం దలపోసి యతండు ప్రచ్ఛన్నవేషుఁ డై యుండవచ్చు నని బ్రాహ్మణుఁ డూహించి యడిగి తెలిసికొనఁగోరి సమయమునిరీక్షించుచుండెను. సుమిత్రుఁడు సేవకులును బ్రాహ్మణునియెడ భయభక్తులు గలిగి యుపచారములు సేయు చుండిరి.

మూఁడవ ప్రకరణము.

ఆపద లిల్లు గట్టుకొని కాఁపుర ముండ వని తెల్పుటకో యనఁ జీఁకటులు గడచిపోయె. దుఃఖానంతరమున సుఖంబు లిట్లె వచ్చు నని యెఱుఁగఁ జేయుటకో యనఁ గృష్ణపక్షంబు గడముట్టుటయు మాపులు వెన్నెలలు గాయఁ జొచ్చెను. దుఃఖానుభవమునఁ గలుషంబు లగు మొగంబులు సుఖానుభవంబునఁ గళావంతము లగు నని వెల్లడిచేయుటకో యన దిశాముఖంబులు నిశలఁ దెలివి నొందె. దేశ మజ్ఞానాంధకారమగ్న మగునప్పుడు మిగులం దేజరిల్లుకించిజ్జ్ఞులు దేశము జ్ఞానదీప్తి

మంతం బగునాఁడు తమయూరు పేరు లేక యుండుననునీతి లోకంబు నకుఁ జాటుటకో యన మున్ను జీఁకటిరాత్రులఁ దళతళ మని మెఱసిన నక్షత్రంబులు వెన్నెలలో వెలుఁగు డిందుపడి కానఁబడ వయ్యె. రాజు లొకవేళ జనుల కార్తికరులయి మఱియొకవేళ నానందకరు లగుదు రనుమాట నిజమని ప్రకటించుటకో యన నిశా రా జగుచంద్రుఁడు హేమంతఋతువున జగజ్జనులను, జలిచేత వడకించిన చల్లని కిరణములచేత నే యావసంతరాత్రులలో జనుల నానందాబ్ధిఁ దేలించుచుఁ గువలయా నందప్రదా యకుఁ డయియుండెను. అంతటిస్వచ్ఛమూర్తులకయిన నెం తటికళావంతుల కయిన, నెంతటిసన్మార్గవర్తనులకయిన వెదకిచూచిన నించుకలోప ముండకపో దనుపలుకు నొక్కి వక్కాణించుటకో యన స్వచ్ఛమయి, షోడశకళాపరిపూర్ణమై యాకసంబు నలంకరించు చంద్ర మండలమున మచ్చ యూరకుం గానఁబడఁజొచ్చెను. నిండుచందురుండు పండువెన్నెలలు గాయుచున్న యనాఁటిరేయి సుమిత్రుఁడు నడివాకిట నొకచాఁప వేయించుకొని వెన్నెలలో బ్రాహ్మణుఁడుం దానునుగలిసి కూరుచుండి పురాణగాథలు పూర్వరాజులచరిత్రములు నాతనివలన విను చుండెను. కరటకుఁడు పింగళకుఁడు మొదలగుసేవకులు పగలెల్ల నొడలు వంచి పనిచేయుటచే మేను మఱచి గాఢముగ నిద్రించుచుండిరి. గ్రామమంతయు మాటుమణఁగి నిశ్శబ్దమై యుండెను. కొంతసేపు పురా ణగాథలు విని సుమిత్రుఁడు బ్రాహ్మణుని జూచి "ఆర్యా! మీ ముఖవర్చస్సును బాండిత్యప్రభావమును జూడ మీరు సామాన్యులరు గా రని తోఁచుచున్నది. మీ రెవ్వరో యే దేశమునుండి యెం దరుగు చున్నవారో, యిట్లగుటకుఁ గారణ మెద్దియో నా కెఱుంగఁ జేయ వేఁడెదను. నేను మీకు విధేయుఁడ నగుశిష్యుఁడను గాని యన్యుఁడను గాను. మీచరిత్రము గోప్య మగునేని నే నది యిచ్చటనే మఱచిపోవఁ గలవాఁడనని శపథంబు జేసెద. మందభాగ్యుఁడ నగునేను నాచరిత్ర

మును మీకు విన్నవింపఁ దలఁచుచున్నాఁడను. కాని మునుముందు మీరు నన్ను నమ్మి, మీకథ నెఱింగింతు రేని యన్నియుఁ దెలిపెదను. కావున ననుగ్రహించి సెలవిం"డని ప్రార్థించె. ఆ వేఁడికోలు విని మహీం సుమతుఁడును గొంకొకవసి యాకసంబునకుఁ దల యెత్తి చూచి విచారించి, యెట్టకేల కెట్లు తనవృత్తాంతముఁ జెప్పఁదొడంగె. "ఓసుమిత్రా! మిత్రదర్శనము లేమిచే శోషిల్లిన నామనఃపద్మము మిత్రుఁడవగు నిన్నుఁ జూచి మరల వికాసవంత మయినది. ఆప్తబాంధవుల నందఱ విడిచి వచ్చిన నాకు దైవము నీయాకువై లోకబాంధవుఁడ వగు నిన్నుం జూపె. భాగ్యహీనం బగు నాచరిత్రమును జెప్పెద వినుము. ఆర్యావర్తమునకును దక్షిణాపథంబునకును నడుమను మాళవదేశము గలదు. ఆ దేశంబున కలంకార మగు నుజ్జయినీపురంబు నా కాఁపురంబు. నా పేరు రుద్రభట్టు. నా తండ్రి కుమారభట్టు మంత్రశాస్త్రపారంగతుం డై పేరు వోసిన వాఁడు. మా తాత మహాదేవభట్టు సతతాన్నప్రదాతయయి మడిమాన్యంబుల విక్రయించి బ్రాహ్మణసంతర్పణములు జేసి కుటుంబమునకుఁ బేదఱికముఁ దెచ్చినను వంశమునకుఁ గావలసినంత కీర్తిధనము సంపాదించి యిచ్చి పోయెను. కూటికిఁ బేద యయినను గులమునకు సంపన్నుఁ డగుటచే మా తండ్రి యొరుల నాశ్రయింపక నీచవృత్తులకు నింద్యకర్మలకు నొడఁబడక, తన కున్నంతలోఁ గడుపుకొని తనివి గలిగి పదిమందిలో నింతవాఁడు లేఁ డనిపించుకొని గౌరవంబుగఁ గాలక్షేపము జేసె. నేనును మా తండ్రి నడచిన తెన్నున నడువఁ దలంచి కులగౌరవములకు భంగము రాకుండ దినములు గడుపుచుంటి. నా పూర్వపుణ్యవశమున నా జనకుఁడు నా కనపహార్యం బగు విద్యాధనంబు నొసంగి పోయెను. నా ప్రజ్ఞాదికములు నేను జెప్పుకొనుట యనుచితమే యగును గాని క్రొత్తవాఁడ నగుటచే నించుక నుడువ వలసి వచ్చెఁ గావున మీరు క్షమియింతురు గాక! చతుర్వేదము లధిగమించితి. షడ్దర్శనములు

నేర్చితిని. చతుష్షష్టికళలు నలవఱచుకొంటి. నాపాండిత్యప్రభావమున కక్కజపడి యాదిశేషునకైనఁ జతుర్ముఖునకైన వంకలు దిద్దఁగలకాశీకానగరపండితులు నాకు విద్యానిధి యనిబిరుదొసంగిరి. శాస్త్రచర్చల యం దెంతెంతదిగ్దంతులనైన నే నవలీల నోడిచిపుచ్చుటం జేసిలోకులునన్నుఁ బ్రతివాదిభయంకరుండని చెప్పుకొను చుందురు. అత్తకోడఱికపుఁబగచే లక్ష్మియు సరస్వతియు నొకతావున నుండ నిచ్చగింపరు గావున నాకడ విద్య యెంత యతిశయముగా నుండెనో నాయింటఁ బేదఱికమంతయతిశయముగా నుండెను. మాళవదేశస్థులభాగ్యదోషమున నుజ్జయినీనగరంబు రాజధానిగఁ జేసికొని సుదర్శనుఁ డనుబౌద్ధమతస్థుఁ డొకరాజు పాలించు చున్నవాఁడు. అతఁడు పండితపక్షపాతి యగుటచే నాకీర్తి కర్ణాకర్ణిగ విని తన కొలువుకూటమునకు నన్నుం బిలిపించి, యుచితాసనం బిడి తనదేశీయు లగుకొందఱుపండితులతో నన్ను వాదింపఁ బనిచి నాప్రసంగంబులకుఁ గడు మెచ్చి యానాఁడు మొదలు నన్నుఁ దనయాస్థానపండితులలో నొకనిగాఁ జేసికొనినబహుమానముగ సగౌరవంబుగ నన్నాదరించె. అతనియాస్థానమున హిరణ్యమిత్రుఁడు ధర్మగుప్తుఁడు దేవసింహుఁడు సత్యమిహిరుఁడు మొదలగు బౌద్ధపండితు లనేకులు విద్యాధనులు గలరు. వారికి నాకు వేదములఁ గూర్చి యభిప్రాయభేదములు గలిగి వాదములు సంభవించుచుండుటం జేసి మనస్పర్థలు వొడముచు వచ్చినవి. రాజు బౌద్ధుఁ డగుటచే మతవిషయముల నాతో నేకీభవింపక వారితోఁ గలియు చుండు. ఇట్లు సుదర్శనుం గొలిచి జీవయాత్ర నడపు చుండ విదర్భరాజునకు మాయేలికకు నెల్లలఁగూర్చి పొరపులు వొడమినవి. ఆవివాదంబులు పరిష్కరింపు మని తనమంత్రులలో నొకఁ డగుకేసరి యను నాతని నియోగించి వానికిం దోడుగ నన్నుం బొమ్మని మారాజానతిచ్చె. మేమిరువురముం జని వివాదహేతువు లగుప్రదేశంబులఁ జూచి విదర్భరాజు

పక్షమే న్యాయ మని యెంచి, మా తేనికి విన్నవించి యాప్రదేశంబు నైదక్షుల కిప్పించితిమి. మాపైఁ గిట్టనివారు కొందఱు మేము విద ర్భేశ్వరునియొద్ద లంచములు గ్రహించి తత్పక్షమునఁ దీర్పులుచెప్పితి మని మానృపునితోఁ గొండెములఁ జెప్పి కినుకఁ దెప్పించిరి. రాజును మొట్టమొదట వారిమాటలు విశ్వసింపక కొంతకాలంబు వోయిన వెనుక సాక్ష్యంబు విచారించి మమ్ము నేరస్థులుగా నెంచి దండ్యుల మని నిశ్చయించి మమ్ముం గొఱతవేయు మని పలువురు పురికొల్పిననెందు చేతనో యట్లు సేయక మాసర్వధనంబులు దాను గైకొని మమ్ము దేశంబునుండి వెడలనడిచె. నావిద్యకు నాగౌరవంబునకుఁ దగనిపని నేను జేసితి నని నమ్మి ప్రజలును, "యథా రాజా తథాప్రజా" యను మాట నిశ్చయముగ రాజుతోఁబాటు నాపై నలిగిరి. భార్యను బుత్ర సమేతముగఁ బుట్టినింటి కనిపి నేఁ బట్టతో నిలు వెడలి కాశ్మీర దేశ మున వసియింపవలయు నని బోవుచు మీపాలఁ బడితి. నాయనా! రా జులు విశ్వసనీయులు గారు. వారితోఁగూటములు పాములతోఁ జెలగా టములు. వారిపోరాములు కత్తులమీఁదిసాములు. వారినెయ్యములు పులులతోడి వియ్యములు. వారియనుగ్రహంబులు నీటిబుగ్గలువోలె క్షణవినశ్వరంబులు. వారియాగ్రహంబులు చిరస్థాయికంబులు. వారి స్సంపదలు మెఱుపుఁదీఁగెలట్లు చంచలంబులు. వా రొనరించునప కారంబులు శాశ్వతంబులు. వారియాకారంబులు క్రొత్తచిలుకట్లు దర్శనీయంబులు. అంతరంగంబులు విషాశయంబులు. వారిమొగం బులు పుష్పసుకుమారంబులు. మానసంబులు వజ్రకఠినంబులు. వారి దయావృష్టు లెవ్వరిపైఁ గురియుచుండునో వారిమీఁదనే పిట్టలుక లనుపిట్టపిడుగులు వడుచుండును. వారి కేల యాగ్రహంబు గలుగునో యేల యనుగ్రహంబు వొడమునో యెఱుంగ నలవి కాదు. సహజదుర్గు ణంబులకుఁ దోడు మారాజు బౌద్ధమతావలంబకుఁడు. వానికి దైవంబు

నాస్తి గురువునాస్తి దయ నాస్తి ధర్మము నాస్తి సర్వము నాస్తి. అట్టి పాపకర్ముఁ డగుటచేతనే నన్నింత చేసె. పిల్లలు గలవాఁడను, పెద్ద వాఁడను, పేదవాఁడను, కుటుంబభారము మోయలేక కడుపుకక్కుఱతి చే నాల్గువరాలసొమ్ము దింటినే యనుము. ఇంతమాత్రమున నన్నింత క్రూరశిక్షపాలు సేయఁ జెల్లునే. నాభార్య భూలోకమాత. పరమ సాధ్వి. గోలుగోలు మని యేడ్చుచు నిలువెడలి పుట్టినింటికిం జనియె ఆయుసురు వానికిఁ దగులక పోవునే? వాఁడు ధర్మాత్ముఁడఁట! మంచి రాజఁట! మహాశాంతుఁడఁట; వానిధర్మము మంచిపోను. వానిరాచ ఱి కము కడతేఱిపోను. ఆదురాత్మునివానియాస్థానపండితులను, నేమిచేసి నను దోసము లేదు. దైవానుగ్రహమువలన నేను బ్రతికియుంటి నేని వారిపాట్లు మీకండ్లనే చూడఁగలరు. వేదములు పౌరుషేయములఁట; తత్కారణమున నప్రమాణములఁట వసిష్ఠాది మహర్షులు మనవంటి సామాన్యమనుష్యులే యఁట, గోమాంసభక్షకు లఁట; దేవాలయ ములో నివిగ్రహములు కాలురాళ్లఁట; పూర్వజన్మములఁట; పురాణ ము లన్నియుఁ గల్పనాకథ లఁట! విశ్వసనీయములు గావఁట. భగ వంతుఁడు లేఁడఁట. పరమభాగవతోత్తములు దొంగలఁట. ఇట్లు ప్రేలువారినోళ్లెన్నఁ డేని పడిపోవునే? వారి నాలుకలు చీలికలు గా వలదే? అయినను నీపరుషవాక్యముల నానోట రానీయనేల? భగవం తుఁడే పాలించుచున్నాఁడు. కలిప్రభావ మతిశయ మయిన యీదిన ములలో దురాత్ములకే సమస్తకళ్యాణములు లభించుచున్నవి. సద్ధ ర్మలే దురవస్థలఁ బడుచున్నవారు. పరమ ఛాందసుఁడ నగు నేనేమి రాజద్రోహము సేయుట యేమి! ఇంతమాత్ర మారాజాధమునకుఁ దోఁ చినది కాదు. వానికొలువున నున్న బౌద్ధపండితులు నాకుం దమకుం గల దొంటిస్పర్ధల మనంబులఁ బెట్టుకొని నేను లంచగొండి నని రాజు తోఁజెప్పి నన్నింతచేయించి యుందురా యని యనుమానము నాము

నన్నునఁ గలదు. పాపపుణ్యములు భగవంతుఁ డెఱుఁగు. ఇంతకన్న నేఁ జెప్పవలసినది లేదు. ఇదియె నావృత్తాంతము " అని చెప్పి యా బ్రాహ్మణుఁడు కన్నులనీరు వెట్టుకొని యూరకుండెను. ఆతనిపలుకులు వినిన వెనుక సుమిత్రునిమనసు జాలిచేఁ గరఁగి వికల మగుటయు నా తఁడు తనయుత్తరీయపుచెంగుతో విప్రునికన్నీరు తుడిచి యిట్లనియె. "భూసురోత్తమా! నీకథ వినినపిదప నీవు నిర్దోషి వని నాకుం బొడక ట్టినది. నీవు వెఱవనక్కఱ లేదు. నీ వెందరిగిన నచ్చట నభ్యుదయంబు గలుగు. నీవు కాశ్మీరంబునకుఁ బోవుదు నను చుంటివి. అదియే యవ శ్యమాచరణీయము. నా మేసం బ్రాణంబు లున్నంతకాలము నేను నీ కాప్తమిత్రుండ నై యుండెద. ఈమాటఁ దప్పితి నేని విశ్వేశ్వరుని పాదంబు లాన!" అనుటయు బ్రాహ్మణుఁడు సుమిత్రుని గౌఁగిలించు కొని సంతోషపారవశ్యము నంది "నాయనా! నాపాలిదైవంబవు, చిం తామణివి" యని స్తోత్రముఁ జేసి వానిగుణంబులు పలువిధములఁ బొగడఁ జొచ్చెను.

నాల్గవప్రకరణము.

అంతశ్శోకమునుబాహ్యోపచారములుమాన్పఁజాలవు. చక్కని వెన్నెలలు జల్లనిజలములు మంచిగందపుఁబూఁతలు శరీరమునకు సౌఖ్య మొసంగి నేర్చును గాని శోకాగ్నిచే మఱుఁగు చున్నమనస్సునకు శాంతి కలుగఁజేయఁ జాలవు. ఎండవేఁడిమిచే మలమలమాఁడిననేలను కుంభవృష్టి గురిసి చల్లబడఁ జేయునట్లు దుఃఖానలసంతప్త మగుమన స్సును కృపారసశీతలంబు లగునాప్తులవచనంబు లే శోకపువేఁడిమి నడఁచి శాంతి నొందింపఁ గలవు. నాఁటిరాత్రి బ్రాహ్మణుఁడెంతసేపు

పండువెన్నెలలోఁ గూరుచున్న నంతసేపు చంద్రకరస్పర్శనంబునవాని మేను జల్లపడినను, సుమిత్రునినోటనుండి చల్లనిమాటలు బయలు వెడలువఱకు మనస్సు శోకమునుండి విముక్తి జెందదయ్యె. అత్యాదరమును జూపుసుమిత్రునివచనములు వినినతోడనే రుద్రభట్టు తన దుఃఖము నంతను మఱచి వానిఁ నించుకసేపు కొనియాడి యిట్లనియె. "మిత్రనిధీ! నాయవస్థ నవిస్తరముగ విన్నవించితిని. నీపరిచయంబు గలుగుట మొదలు నీవృత్తాంతంబు విన నాకుం గుతూహలము వొడమి యున్నది. నాయుదంతము నీ కెఱింగించినవెనుక నీచరితంబు నాకుం దెలుపునట్లు నీవు వాగ్దానము చేసి యుంటివి. నాకథ నేముగించితినిగాన నింక కొఱంత నీయదియె. నిన్నుం జూచినప్పటినుండియు నదియేమో కాని నీవు ప్రచ్ఛన్న వేషుఁడ వనియు గోప్య మగుకారణాంతరమున నీ వీకుగ్రామమున వసింప వలసె ననియు నాకు గట్టిగఁ దోఁచు చున్న యది. నీముఖవిలాసంబును నీమాటలపొందికయు నీప్రజ్ఞయుఁ జూడ నీ వుత్తమరాజకులంబునఁ బుట్టి యుందు వనియు మహీమండలంబును బాలింప సమర్థుఁడ వనియు సులభముగఁ దెలిసికొనవచ్చును. నీమనస్సు దీర్ఘవిచారభారముచేతఁ గ్రుంగి యున్న దని నీ వెంత దాఁచినను నీ మొగంబున స్పష్టముగఁ జదువవచ్చును. కుండలో నిడినదీపములాగు నీవిపల్లియ నుండుటం జేసి జగంబునకు నీసహజ తేజము గానఁబడుచుండుట లేదు. గడ్డిలోఁ గప్పఁబడియుండు కాయమట్లు మేఘములచాటున మఱుఁగుపడి యుండుసూర్యబింబమట్లు నిగురుగప్పిననిప్పులట్లు నీవిట్లుండుటకుఁ గారణ మేమి? నీవు నాకు సుమిత్రుఁడ వగుదువు కాని నీపేరు సుమిత్రుఁడు గా దని నామనస్సు చెప్పు చున్నది. నీచరితంబు పరమ రహస్యముగా నుండవలయు నని నీవు కోరుదువేని నే నదియెవ్వరికిని వెలిపుచ్చ. నీకథ వినినపిదప మనస్నేహబంధంబు మఱింతదృఢ మగు నని నాకు నమ్మకముకలదు. అందుచేఁ జతురంగమున రెండుగుజ్జము

లొకదానికొకటి కొంపగ నుండి యన్యోన్యసంరక్షణమును జేసికొని నట్లు నాకు నీవును నీకు నేనును సాహాయ్యము గావించుకొని సుఖింప వచ్చును. నాప్రతిజ్ఞాదికములు నేను జెప్పకొనం గూడదు కాని యీరుద్రభట్టు పరమఘాండసుఁ డట్లు నీ కగపడుచున్నను లోకవ్యవహారములఁ జక్కఁగ నెఱిఁగినదిట్టర సుమీ! బూడిదఁ బూసికొని తావశముఁ దప్పుడు పనులు జేసికొనుచున్న వీఁడు నాకేమిసాయముచేయఁ గలఁడని నీవు తలఁప వలదు. శాస్త్రాభ్యాసముచే బుద్ధినిపుణత యతిశయించినలోకజ్ఞుఁడను గాక వేదజ్ఞుఁడను గాను. రాజనీతిం దెలుపు శుక్రనీతి మొదలగు గ్రంథములు నామూలాగ్రముగఁ జదివినవాఁడ. కత్తిచేఁబూని పగతుర గొంతులుకోయఁజాలనుగాని యింటియొద్దనుండి మిత్రుల కుపాయంబులు జెప్పి యపాయంబులు గడిపి శత్రువుల నిర్మూలింపఁ జాలుదును. కావున నింక సందియంపడక నీయుదంతము నెఱిఁగింపుము" అని రుద్రభట్టు పలుకుటయు సుమిత్రుఁడు బ్రాహ్మణుఁడు విశ్వాస ముంచఁదగినవాఁ డనియు నేకార్యమునలుపుటకయిన సమర్థుఁ డనియు నెఱిఁగి తనవృత్తాంతముఁ జెప్పఁదగునా తగదాయని రెండుమూఁడుసారులు తనలోఁదాను వితర్కించుకొని కొంతకాలము నుండి తన హృదయమును బీడించుచున్న శోకభారమునకుఁ గారణము వెల్లడించుటయే యుక్తమ మని యెట్టకేలకు నిశ్చయించి యిట్లని చెప్పఁదొడంగె. "విప్రపుంగవా! నీ చెలికారంబు గలిగినది మొదలు బహుశాస్త్రంబులు కరతలామలకంబుగ నీ వెఱుంగుటయు రాజనీతి విశారదుఁడ వగుటయు నీసంభాషణంబులం దేటపడియె. నాచరిత్రంబు నిన్నుఁబోలుసజ్జనుం డెఱిఁగినచో నాకందువలనఁ గొంతలాభ మే యగును గాని నష్టంబు గలుగదు. మనస్సు శోకపూరిత మగునప్పుడు మానుషుఁడు తనదుఃఖము నొరుల కెఱింగించినచో నదికొంతయుపశమించును. సంతోషవార్తలితరుల కెఱింగించినకొలఁది యానందము హెచ్చు.

కావున నాకథ నీకెఱింగించుటకు మున్న నాకుం బరమాప్తుం డగు నొకనికథ దెలుప వలసి యున్నది. తెలిపెద వినుఁడు. భూమండల మునఁ గలదేశము లన్నింట భారతఖండమె ప్రశస్తతమము. అందా ర్యావర్తము శ్రేష్ఠము. అందు హిమవత్ప్రాంతము పుణ్యప్రదము. అందుఁ గాశ్మీరముదర్శనీయము. ఆ దేశంబుకుంకుమపువ్వునకుంబుట్టిన తావు. కాశ్మీరమునం దది యుదయించుటచేతనే దానికిఁ గాశ్మీర మని పేరుగలిగె. మంచిగంధంబును బచ్చకప్పూరంబును జాజిపూవులునచ్చట సమృద్ధిగా లభించుటం జేసియు నేల సకలసస్యములు సమృద్ధిగఁబండు టం జేసియు నచ్చటియేఱు లెడతెగక పాఱుచుఁ బొలములకుఁదోఁట లకు జీవనము లోసంగుటం జేసియు నచటియంగనలముందర వేల్పుటు విదలు దిగదుడుపున కయినఁ బనికిరా కుండుటం జేసియు నదిభూలో కస్వర్గ మని కొందఱుకవులు వర్ణించియుండిరి. వేయేల? అచ్చటి పూఁదోఁటలు నందనవనంబులు. అచటికాంతలప్సరసలు. అచటియేఱు లమృతస్రవంతులు. ఆ దేశంబునకు రాజధాని శ్రీనగరము. కామధే నువు కల్పవృక్షము లేనివెలితి యొక్కటియె కాని దానికి నమరావతం బునకు భేద మించుకయు లేదు. ఆవిషయంబునకు విక్రమసేనుఁ డను రాజు నాయకుఁడయి చిరకాలము మహీభారముఁబూనిప్రజలంగన్న బిడ్డలట్లు కాపాడి ధర్మస్వరూపుఁ డనిపించుకొని కొన్నియేండ్లక్రిందట కీర్తిశేషుఁ డయ్యె. వానికి రెండుకన్నులంబోలె నిరువురుకుమారులు హేమచంద్రుఁడు చిత్రభానుఁ డనువార లున్నవారు. తండ్రిపరోక్షమున జ్యేష్ఠుఁ డగుహేమచంద్రుఁడు రాజ్యమున కభిషిక్తుఁ డయి గద్దె యెక్కి ప్రజాపాలనంబు జేయు చున్నవాఁడు. హేమచంద్రుఁడు చిత్ర భానునియెడఁ బుత్రస్నేహము నిలిపి వానికిం దండ్రిలేనివెలితిలేకుండఁ గాపాడుచువచ్చె. "పితృసమో జ్యేష్ఠః" యను లోకోక్తి ననుసరించి చిత్రభానుఁడు సోదరునియెడగురుభక్తి భజియించుచు నన్న

మన్ననలకుం బాత్రుఁడై యువరాజై యుండె. ఇట్లుండఁ బాం
చాలదేశాధీశ్వరుం డైనమహేంద్రదేవుగారాబుకూఁతు రగునరవింద
యనుకన్యకు స్వయంవరంబు ప్రవర్తిల్లె. ఆస్వయంవరంబునకు నిఖిల
దేశంబులనుండి రాజకుమారు లందఱుఁ బోయియుండిరి. అరవిందా
దేవి తామరపువ్వుకన్న సుకుమార మగుమేనిజిగిం దాల్చియొప్పు. హే
మచంద్రుఁడు చంద్రునకు వంకలు దిద్దఁ గలసోయగమువాఁడు. హేమ
చంద్రునిగుణరూపంబుల నరవిందయు నరవిందగుణరూపంబుల హేమ
చంద్రుఁడును విని చున్కి వారి కొండొరులపై వలపులు నిలిచె. ఆకా
రణంబున నాబాలిక స్వయంవరమునఁ హేమచంద్రునే వరియించె. ఆ
యెలనాఁగను బాణిగ్రహణము జేసికొని హేమచంద్రుఁడు తనయంతి
పురంబునకుం దోడ్కొని వచ్చినదాదిగ నేఁటిదనుక నాబోఁటి గీచిన
గీటు దాఁటఁడు. ఆమెమాట కెదురు వలుకఁడు. ఆమెయాన శిరసావ
హించు. వేయేల? ఆతని కామె పెట్టినదే భిక్షము. ఆనెలఁత యేమి
మాయలు పన్నెనో యేమిమందులు పెట్టెనో యెట్టివలపులు గొలిపెనో
యెట్టికొండెములు సెప్పెనో కాని యామె యంతిపురమున నడుగువెట్టి
నదిమొదలు రాజునకుఁ దమ్మునిపైఁ దొంటియనురాగము నిలువ
దయ్యె. బ్రాహ్మణోత్తమా! ఒక్కనెలవునఁ బుట్టినను రాజునకుం
దమ్ములకు సహజవైర మగుట లోకప్రసిద్ధము గదా. తమ్ములు వికా
సము గలిగి విలసిల్లునప్పుడు రాజు చూపోపమిచే నచట నుండక యావ
లికిం బోవు. అతఁ డట్లుండుటచేఁ దమ్ములును వానివర్తనం బనుస
రించి రాజు సంపూర్ణుఁడయి శోభిల్లునపుడు మొగంబులు ముడుచు
కొనియుంట యాశ్చర్యముగాదు. రాజు మహోన్నతపదమున నుండు
టయుఁ దమ్ము లడుగంటి యుండుటయు సంభవించుచుండును. గాన
వారి కైకమత్యము సాధారణంబుగాఁ గుదురదు. దానికిం దోడు ప్రియ
ండ్రి సోదరుల విడువుమని చెవి నిల్లుగట్టుకొని పోరుచు విసము

నూరి పోసినట్లు నేరములు జెప్పుచు రవ్వంత తప్పు గలిగిన దాని దోహదము చేసి పెంచుచుఁ గోపాగ్ని రవులుకొనునట్లు సమిధలవంటి మాటలు ప్రయోగించు చుండు రేని యింకఁ జెప్ప వలసిన దేమి? మహాత్మా! ఆఁడుదానిచేతిబొమ్మవలె నుండి యది యెట్లాడించిన నట్లాడుమగవాఁడు తనవారి కపకారంబు జేయఁడే ? అదిగాక స్త్రీలు భర్త మనస్సెఱిఁగి సమయోచితంబుగఁ గీ లెఱిఁగి వాతఁబెట్టినట్లు కిట్టనివారి పైఁబగలు బొడమించుటలోఁ గడుం బ్రోడ లనుట నీ వెఱుంగుదువు. అందుచే నన్నదమ్ములకు స్పర్ధలు జనించె. ఆయద నెఱిఁగి కొండెగాండ్రు తమ్మునిపై నేరముల నన్నతో, నన్నపై నేరములు తమ్మునితో నున్నవి కొన్ని లేనివికొన్ని చెప్పి వైరంబు వర్ధిలఁ జేసిరి. అయ్యా ! మీతోడం జెప్ప మఱచితి. హేమచంద్రునివివాహ మయిన కొన్ని దినములకుఁ జిత్రభానునకును బరిణయం బయ్యె. విదర్భేశ్వరుం డగురాజవాహనుని గాదిలికూఁతురు సౌభాగ్యవతి యిందుమణి వానిభార్య. ఈలలనవలనఁ జిత్రభానునకు జగన్మోహనాకార యగు నొకకూఁతురు చక్కదనంపుదీవి యగు నొక్కకుమారుఁడునుద్భవించిరి అరవిందాదేవివలన హేమచంద్రమహారాజునకును సోయగంబున మదనుం జంపి పుట్టినకుమారు లిరువురుగలరు. హేమచంద్రునకుఁగొడుకులెకాని యాఁడుబిడ్డలు కలుగనందున నతఁడు సోదరునిపై ద్వేషమున్నను వానికూఁతురును తనకూఁతు రట్లు మిక్కిలి గారాబమునం బెంచుచుండె. ఆబాలిక యల్లారుముద్దుగా నుండుటనో మగఁడు గారాము జేయుటనో యరవిందయు మఱందికూఁతును మక్కువమెయిఁ బెంచుచుండె. విదర్భరాజపుత్రి చిత్రభానునిభార్య యగుటచే నాదేశస్థులు కొందఱు శ్రీనగరమునకు వచ్చి చిన్నరాజు నాశ్రయించి జీవించుచుండిరి. ఇట్లు దినము లొకవిధమునఁ గడచు చుండ యువరాజు భాగ్యదోషమున నానగరమున రాజును విషప్రయోగముచేతఁ గడ

తేల్పవలయునని, దురాత్ములు కొందఱు గుటరి పన్నిరి. రాజద్రో హులు తమలోఁదా మైకమత్యము లేనిమొఱకు లగుటచే నొండొరుల తోఁ బోరాడి సంకల్పము గొనసాగింప లేకపోయిరి. ఒకరి నొకరు చెలుపఁ దలఁచియాదురాత్ములు రహస్యములను మెల్ల మెల్ల జాఱవిడువఁ గ్రమక్రమంబునఁ గుటరి బయలువడియె. అందున్నవారిలోఁ గాశ్మీర దేశస్థుఁ డొక్కఁడును లేక యందఱు విదర్భనుండి వచ్చిన చిత్రభా నునియాశ్రితులే యగుటం జేసియుఁ బ్రజలెల్లఁ జిత్రభానుఁడు పరమ దుర్మార్గుఁడు నాఁడే యిది పన్నియుండఁబోలు నని యైకకర్త్యముగఁ బలుకుటంబట్టియు రాజునకు సోదరునిపై గట్టియనుమానము దగిలెను. దానికిం దోడుగ నరవిందాదేవియు నందు దొరకెనని లోకపవాద మున కనుగుణముగఁ దాళము వేయుటంజేసి రాజున కాగ్రహం బుద యించె. అతనియనుమానము స్థిరపడునట్లు వైదర్భులలోఁ బ్రధాన పురుషులు కొందఱు నడిరేయి పాఱిపోయిరి. అంతట హేమచంద్రుఁడు తక్కిన వైదర్భులం బట్టి తెప్పించి కారాగృహంబులం బెట్టించె తగు శిక్షలం జేయించి తమ్మునిం బిలిపించి "వత్సా! నీవు కష్టచరిత్రుఁడ వై విసముబెట్టి నాయుసురుల నపహరింపఁ దలఁచినను భ్రాతృవాత్స ల్యమున నీప్రాణంబులు తీయుటకు నాకుఁ జేతు లాడ కున్నయవి. మనజనకుఁడు తీఱిన దాదిగ నీవు దుస్సహవాసములఁ జేసి చేయరాని పనులఁ గావించి యకార్యములు జేయవల దని మందలించినందులకు నన్ను నిందించి నీకు మాతృసమాన యగునరవిందపై నపవాదం బులు మోపి కూళవై వర్తించితివి. కడుపు చించినఁ గాళ్ళ పైఁ బడు నన్నట్లు నిన్ను శిక్షించిన నాయపకీర్తి నాకే కదా యని దూర మాలోచించి నీచేఁతలు బయలుపుచ్చక కడుపులోఁ బెట్టికొని సైఁచితిని. ఇంక నీతో నేను వేగఁ జాల. నిన్నిట నుండనిచ్చుట పక్కలోఁ బామును బెట్టికొనుట. కావున నీ వింక నాలుబిడ్డలతో నే

దేశంబున కైనఁ జని యచట నుండుము. నీకుఁ గావలసిన విత్తము నే నంపు చుండెద. ఇంతకన్న నే నీకుఁ జేయునది లేదు. విదర్భకుం జని నీయత్తవారియింట నుంట యుచితము. అక్కడనైన బుద్ధి గలిగి సుగుణనిధాన మగువిక్రమసేనునకుఁ గొడుకవై నందుకుఁ దండ్రిని దుర్యశముపాలు సేయక జాగరూకతతో మెలఁగునది" అని పలికి కన్నీరు పెట్టుకొనుచు వాని నావలకుం బనిచె.

ఆఱవ ప్రకరణము.

మనుజుఁడు చింతాక్రాంతుఁ డగునప్పుడు నిముసములు గడియ లై గడియలు జాములై నిశలు దీర్ఘములై తోఁచు. నగుఁడు బంధు మిత్రులతోఁ బ్రసంగించునప్పుడు జాములు గడియలై గడియలు నిము సములై మాపులు కులుచలై కనంబడును. అందుచే మనుష్యులొండొ రులతోఁ జెప్పుకొనుకథలు ముగియకపోవుటయు రాత్రులుమాత్రమే గడచి పోవుటయు సంభవించు చుండు. ఆ రాత్రి సుమిత్రుఁడు బ్రాహ్మ ణునితోఁ గాశ్మీరరాజుతమ్మునివృత్తాంతముఁ గొంతవఱకుఁ జెప్పిన ప్పటికి మూఁడుయామములు గడచె. తెల్లవాఱవచ్చు చున్నది గావున జారచోరులు మొదలగునిశాచరులు తమతమసంచారంబు లింక ము గింపవలసినదోహో యని కాలపురుషుఁడు వేయు కేకవలె (కొక్కొరో కో యని జాముకోడి కూసె, అదివఱకు వెన్నెలలు వ్యాపించిన తావు లందుఁ గ్రమక్రమంబున నీడలు వ్యాపింపఁ దొడంగె. తఱిపివెన్నెల లంతకంతకుఁ బలుచన కాఁ దొడంగె. అప్పుడు బ్రాహ్మణుఁడు సుమి త్రునితో "నయ్యా! తెల్లవాఱవచ్చుచున్నది. మనప్రసంగంబులింకము గింపవలయు. నీచరిత్రంబు నే వినఁగోర నీ వది చెప్పక మఱియొకనివృ

త్తాంతము వినిపింపఁ దొడంగితివి. ఆతనికిని నీకును గలసంబంధ మెట్టిది యో నే నీవఱకు నెఱుంగఁజాల నైతి. కావున కాలయాపనము జేయక నా కెఱింగింపఁ దగినయంశము లన్నియు సాధ్యమగునంతశీఘ్రముగ నెఱింగింపుము. 'అసాధ్యదమృతం విష, మ్మని బుధులు పలుకవినవే" యనిపలికె వేగిరపెట్టె. అప్పుడు సుమిత్రుండును రుద్రభట్టుతో ని ట్లనియె. "ఆర్యా! కాశ్మీర రాజు సోదరునకును నాకును గలసంబంధబాంధవ్యములు కొన్ని కారణములచేత మీకిపుడు నేనెఱింగింపకున్నను ముందు ముందు మీ రెఱుంగక పోరు. మీకనులు గప్పి నే నేకార్య మొనరింపను. కావున నాపైసమయమై మీసందేహము విడిచి మిగిలినకథ వినుండు. హేమచంద్రుఁడు సోదరుఁ డగు తన్నిట్లు స్వదేశమునుండి వాఱఁదోలునని చిత్రభానుఁ డెన్నండుఁ గలనైన ననుమానించి యెఱుంగఁడు గావున తనయన్నపలుకులు విని యతఁడు నిశ్చేష్టుఁడయి తాను నిర్దోషి నని రాజుతో విన్నవింప మనసులోఁ దలంచియు నోట మాట రాక నిలువంబడియె. అతఁడు కొంతవడికి ధైర్యము దెచ్చుకొని యేవియో పలుకఁ బోవునప్పటికే రాజు తావు విడిచి పోవుటయుఁ బరిజనులు చిత్రభాను నచటనుండి యావలకుం దోడ్కొని పోవుటయు సంభవించె. గంగిగోవువ కలుకపుట్టినట్లు గుణరత్నాకరుఁ డగు హేమచంద్రునకుఁ గినుక వొడముటచే నది యనివార్యమని యెంచి మంత్రులు సామంతులు రాజబంధువులు మిత్రులుయున రాజుపక్షమున నొక్కమాటయుం జెప్పక యూరకుండిరి. అనంతరము చిత్రభానుఁడు తనయంతిపురమున కరిగి పాన్పుపైఁ బండుకొని చింతాక్రాంతచిత్తుం డయి తనభావిస్థితిం గూర్చి తలపోతలకుం జొచ్చె. భార్య యగునిందుమణి మగని డాసి దుఃఖించుటకుం గారణం బడిగి యాతనిచే నుత్తరంబు వడయనేఱక యావలకుం జని పరిచారకు నొక్కనిం బిలిచి యడిగి వానివలన భర్త మనస్తాపకారణంబు నెఱిఁగి భయశోకవిహ్వల యయి యొకచోటఁ

గూర్చుండి బాష్పాకులితనేత్ర యయి వగవసాగెను. తలిదండ్రులముఖ దైన్యమునవలోకించికొడుకుంగూఁతురు తమముద్దుమొగంబులుచిన్న వోవ నాటపాటలు మాని కన్నులనీరు నించుకొనిరి. భార్యాభర్తలయు బిడ్డలయు దెసఁ గనుంగొని పరిచారకులు గ్రుడ్లనీళ్లు గ్రుక్కుకొనఁజొచ్చిరి. అప్పుడు యువరాజు తనమనంబున నిట్లని వితర్కించుకొనియె "అక్కటా! ఆగర్భశ్రీమంతుఁడ నయి మహారాజకుమారుఁడ నయి యభిమాన ధనుఁడ నయి సౌఖ్యంబు లవ్వారిగా నందిననే నింక నే దేశంబుల నేవి ధంబునఁ గాలంబు బుచ్చువాఁడ. అనేకరాజకుమారులచే సేవింపఁ బడిననేను వేఱొకని సేవింపఁ గలనే? నాకేమి? మగవాఁడ. ఎవనిం గొలిచి యయినఁ బొట్టకు డన్నముఁ దెచ్చికొని పొట్టఁబోసికొని కాలము గడుపుకొనఁ గలను. విదర్భరాజపుత్త్రియు లావణ్యవతియు మానవతియు నగునీపరమసాధ్వి నిల్లాలి నెట్లు కనుపువాఁడ? సంప్రాప్తయౌవన యై వివాహయోగ్యయైనయనుంగుఁగూఁతు నెట్లు పెంపుదానువాఁడ? సుకు మారుఁ డగుకుమారునిమాట యేమి? విదర్భపురంబు జొచ్చి మామబిడ్డ లతో నత్తవారియింట నుందునా? ఛీ అంతవాని కడుపునఁ బుట్టి యింతబ్రదుకు బ్రదికి తుట్టతుదకు గతిలేక మామగారిపంచకుఁ జేరుట నావంటి మహాభిమానికిఁ దగినపని కాదు. ఆపన్నసమయమున ధైర్యముఁ జిక్కఁబట్టి కాలోచితముగఁ బ్రతిక్రియలు చేయువాఁడే పురుషశబ్ద మున కర్హుఁడు. హేమచంద్రునికోటలో నేనొక్కదినమునుం నిలువ రాదు. నాకులకాంతను బిడ్డలను విదర్భపురమున కంపి నాకష్టములు గట్టెక్కువఱకు నెందేనిఁ బ్రచ్ఛన్నవృత్తిఁ జరియించి పగఁ దీర్చి కొనియెద. ఇంతకంటెఁ గర్తవ్యము కానఁబడదు." అని కృతనిశ్చ యుఁడై శయ్యాతలమునుండి దిగ్గున లేచి పరిచారకు నొక్కనిఁ బిలిచి "ఓరీ! దేవియుం బిడ్డలు నీదినంబున విదర్భకుం బయనమయిపోవల యు. వారికిం బయన మెఱిఁగించి తత్ప్రయత్నము గావింపు" మని

యానతిచ్చె. సేవకు లందఱు భయభక్తులతో యజమానునియాజ్ఞ శిరసావహించి ప్రయాణసన్నాహముఁ జేసిరి. హేమచంద్రుఁడుతమ్ము ఁకూఁతు నెడలేనిమక్కువం బెనుచుటఁ జేసి పాయలేక యామెను దనకడ విడిచి పొమ్మని యువరాజునకు వర్తమాన మంపెను. ఆమాటలు, విని యువరాజు 'పాము విరోధియుఁ బడగ చుట్టము నగునా? నేను బగవాఁడ నయినప్పుడు నాకూఁతురు నీకెట్లు చుట్ట మగును? కావున నిట్టి సందేశంబులు పంప వల' దని రాజునకుఁ బ్రత్యుత్తర మంపి కతిపయపరిచారకులతో నిజకుటుంబమును వెంటఁబెట్టుకొని శ్రీనగరము విడిచెను. చిత్రభానుఁ డనుభవించిన నాఁటివియోగదుఃఖమునాఁటిమనోవేదనము నాఁటిహృదయసంతాపము నెవ్వఁడువర్ణింపఁ గలఁడు. గంభీరభావంబు గలపురుషుం డగుటచే నతఁడు లోలోపలం గుళ్ళుచు వెలవడకపోయినను వానిమొగముకత్తివాటువైచిన నెత్తురు లేక యంతస్తాపమును బ్రతిఫలింపఁ జేయునద్దమువలె నుండెను. ఇందుమఱియుఁ గూఁతును గంటికి నేలకు నేకధారగాఁ గన్నీరు విడుచుచు నందలంబుల నెక్కిరి. తడవులంబట్టి వారలం గొలుచు సేవకులు వా విడిచి యేడ్చిరి. ఆసమయమున యువరాజుం బలుకరించిన రాజునకాగ్రహము వచ్చుననియుఁ బలుకరింపకుండినఁ జిత్రభానునకు నలుక వొడము ననియు భయంపడి యమాత్యులు దండనాథులు మొదలగు నియోగులు పలుకరించియుఁ బలుకరింపకుండునటులఁ జిఱునవ్వులు నవ్వియుఁ జేతులుసాచి సెలవులం గొనియు నూరక నమస్కరించియు నోట మాట రానియ్యక భక్తి నభినయించిరి. హేమచంద్రుఁడు జాలి గుండె కలవాఁ డనిపించుటకుఁ గాఁబోలు నేనుంగులు గుఱ్ఱంబులు నరదంబులు నాయునన్ని కొంపోవు మనియుఁ గావలసిన రొక్కంబు బొక్కసంబుననుండి కైకొ మ్మనియు నానతిచ్చె. కాని మహాభిమాని యగుచిత్రభానుఁడు వానిమెరమెచ్చులయౌదార్యమును నిరాక

రించె. వానిపరివార మంతయు నిరువదిమందికంటెఁ దక్కువగనుండె. చిత్రభానుఁడు నగరంబునుండి వెడలిపోవు ననుమాట నగరమునఁ బొక్కుటంజేసి వానిపయనముం జూడఁగోరినపౌరులువీథులనిరుగెలంకుల బారులుగట్టి నిలిచిరి. చిత్రభానుఁడు గుఱ్ఱంబుల నందలంబుల నెక్కక కాలి నడకం బోయెను. క్రోధమును గ్రక్కువానికన్నులును నిశ్చల చిత్తమును దెల్పు నల్లని కనుబొమలును దుఃఖమున వైవర్ణ్యమును జెందిన మొగంబును జూచి వివేకులగు పౌరులు వానివలనఁ దమ కెన్నడో యెగ్గు కలుగక పోదని యొండొరులతో రహస్యంబునఁ జెప్పుకొనసాగిరి. నగరంబు వెడలినతరువాత వృత్తాంతము నేనిపుడు చెప్పనక్కఱలేదు. చిత్రభానుఁ డాలుబిడ్డల నప్పుడ విదర్భాపురమునకుఁ బంపి తా నొంటిగ నీవనప్రాంతముల సంచరించుచున్నవాఁడు. హేమచంద్రుఁడు తనకు నాఁడు చేసినయుపకారంబు మఱువక కడుపునిండ నక్కసు బెట్టుకొని పగఁ దీర్చికొనుటకై సమయము నెదురుచూచుచున్నాఁడు. మీరు కాశ్మీరనగరమునకుంబోవ నిశ్చయించుకొనుటచే మీసాయము నపేక్షించు చున్నవాఁడు. వినయము గలవాఁడు. విక్రమము గలవాఁడు. మీ యాశీర్వచన మున్న నభివృద్ధికి రాఁదలంచినవాఁడు. సోదరుఁడు తన్ను దేశమునుండి వెడలనడచినందు కతఁడంతగా వగచుటలేదు. మున్ననుభవించుమహైశ్వర్యంబు దొలంగి పేదతనము వచ్చినందుకు విచారించుటయు లేదు. రాజద్రోహము భ్రాతృద్రోహము నతఁడు సేయఁ బూనినవాఁడనియపనిందవానిపైఁ బడినందుకుఁ జిత్రభానుఁడు రేయింబవలు పడియెడు మనస్తాప మింతింతకాదు. యశఃకాములగుసత్పురుషులు నింద నొందుటకన్న మరణ మొంద నిచ్చగింతురు గదా. ఈయపనింద మోపక రాజు వాని నూరక పురినుండి వెడలనడచిన బాగుండును. చిరకాలమునుంచి తమ్ముని నెట కేనియుఁ బాఱఁదోలఁ దలంచి యేయుపాయంబునుదోఁ

చక సందు విచారించి యెట్టకేల కీనెపము బన్ని చేయఁ దలంచినదం
తయు హేమచంద్రుఁడు చేసె. వచ్చినయపనింద రానే వచ్చినది.
కలిగినమనస్పర్ధలు కలుగనే కలిగినవి. చిత్రభానుఁ డెంతసద్వర్తనుఁ
డయినను హేమచంద్రుఁడు వాని నింక మన్నింపఁడు. తానునిర్దోషి
యని తమ్ముఁ డెన్నియొట్లు పెట్టుకొనిన నన్న యవి విశ్వసింపఁడు.
రాచపగ త్రాఁచుపగ వంటిది. ఐశ్వర్యమునఁ జిత్రభానుఁడు హేమ
చంద్రునకుఁ దీసిపోయిన నిరువురు నొకతండ్రిబిడ్డలే యగుటం జేసి పం
తమునఁ బౌరుషమునఁ దీసిపోఁడు. కావున వానిప్రతిజ్ఞ వినుండు! రా
జనక ప్రజలనక శత్రులనక మిత్రులనక బాలురనక వృద్ధులనక
స్త్రీలనక పురుషులనక ఘనులనక నీచులనక పండితులనకపామ
రులనక కాశ్మీరదేశస్థులలోను శ్రీనగరవాసులలోను దనకయి యప
కారంబునఁ దగిలియున్న వారిని రాజున కాలోచనలు చెప్పిన వారిని
కుట్ర విని తనకెఱిఁగింపక యూరకుండినవారిని లోకులుగడగడవడం
కునట్లు స్త్రీలగుండె లవియునట్లు తొల్లి యశ్వత్థామయర్ధరాత్రమున
నుపపాండవులఁ గడతేర్చిన కథలు జ్ఞప్తికి వచ్చునట్లు చాటుగనో
బహిరంగముగనో స్వయముగనో పరసహాయముననో న్యాయము
ననో యన్యాయముననో శస్త్రముననో విషాగ్నులనో హేమచంద్రుని
సకళత్రముగ ససంతానముగ సబాంధవముగ సమిత్రముగ సపరివార
ముగ భూతబలి యిచ్చి రాజ్యలక్ష్మిని జేపట్టి చిత్రభానుఁడు క్రొత్త
నెత్తుటికొండముతో భూదేవి నలంకరించు. ఈప్రయత్నమ్మున నెఱవేఱఁ
జాలక యొకవేళ తాను జచ్చినం జచ్చు. సంపూర్ణముగఁ బ్రతికినఁ
గొనసాగింపఁ జాలకున్నను గొంతవఱకైన నతఁడు నిర్వహించు. నిర్వ
హింపఁజాల కున్నను బ్రయత్నించు. ఆచిత్రభానుఁడు నాకుంబరమా
ప్తుఁడు. వానికి నాకుం బ్రాణ మొక్కటియ. వానికి మీరు గావిం
చిన మేలు నాకుఁ గావించుట. వానిని సంతోషింపఁ జేయుట నన్ను

సంతోషింపఁజేయుట. వేయేల? నన్నే వానిగా భావించి యన్ని పనులం జేయుఁడు. అతనికోరిక పండిన మీయదృష్టము పండును. అతఁడు రాజైన మీరు మంత్రులగుదురు. మీకుఁ బరమశత్రుఁడగు మాళవరాజు సుదర్శనుఁడు హేమచంద్రునకుఁ బ్రాణమిత్రుఁడు. వారిరువురు బాల్యకాలమునఁ గాశీకానగరమున శారదానందస్వామియొద్ద శాస్త్రాధ్యయనము జేయుటంజేసి సహపాఠులు. మీపగతున కతఁడు చెలికాఁడగు ననిమైన నాయందలి వాత్సల్యమున నైన మీరీపనిఁ జేయఁబూనవలయును. అచటనుండి నేను జిత్రభానున కేమి చేయఁగలవాఁడ నని మీరడుగవచ్చును. వాని సేవకులలో నమ్మఁదగినవారిరువురు మీవెంట వత్తురు. వారి నిరువుర రెండుకన్నులుగాఁ జేసికొని యెల్లవిషయములం జూచుచు వారిరువురఁ జేతులుగాఁ జేసికొని యెల్లపనులం జేయుచు మీరు శ్రీనగరమున నేవేళ నెయ్యది జరుగు నదియెల్ల వానికిం దెలియునట్లు వేగు నడుపవలయును. మీరుకాశ్మీరంబునకుఁ బోవునప్పు డచ్చటిప్రజలు హేమచంద్రుఁడు సుగుణనిధి యనియు ధర్మరాజనియు వానిరాజ్యంబు రామరాజ్య మనియువేనోళ్ళం బొగడు చుందురు. మీరది నమ్మి చిత్రభానునిమఱచిపోయెదరు సుఁడీ. హేమచంద్రుఁడు ప్రసన్నముఖుఁడు. ఆకారణంబున మీరొక్కసారి వానితో మాటలాడిన మీ రాతనిపక్ష మగుదురు. వాని హృదయము బెబ్బులి. నోరు రామచిలుక. మనస్సు విషపుంజము. నోరు తేనెకుండ. కావున వాని వలలోనం బడకుండఁ గడుజాగరూకతతో మీరు మెలంగవలయు. నాచెప్పవలసినకథ ముగిసినది. ఇంక మీయనుగ్రహంబునకై ప్రతీక్షించు చున్నవాఁడ. దుష్టవార్తలను బీరెండలు సోఁకుటచే శోషిల్లి యున్న నావీనులపై నీవెన్నెలల కన్నఁ జల్లనై కృపారసగర్భితములై సుఖప్రదము లగుమీవాక్యామృతవర్షంబులు గురియింపరే" యని సుమిత్రుఁడు దుపభట్టు నడుగులఁ

పై (బడి నమస్కరించె. రుద్రభట్టు చిత్రభాను నెన్నండును గని యెఱుఁగకున్నను సుమిత్రుఁడు వానిపక్షమును బూని పలుకుటను విశేషించి యతఁడు తన కాపత్కాలమున సాయముఁ జేసినమిత్రుం డగుటను వానిమాటలు ద్రోసిపుచ్చ లేక తనపై మోపినది మహా భార మని యపాయసంభృత మని యెఱింగియు దాని కియ్యకొనఁ దలంచి కృతనిశ్చయుఁడై యడుగుల పైఁ బడిన సుమిత్రు లేవనెత్తి కూర్చుండఁబెట్టి యిట్లనియె. "నాయనా! నీవు నాకుం బరిత్రాతవు. నీమాట నాకు రాజశాసనంబు. చిత్రభానుఁడు నీకాప్తుఁ డగుటం జేసి నాకాప్తుఁడు నామిత్రునిమిత్రులు నాకు మిత్రులు. శత్రునిశత్రులు నాకు మిత్రులు. మిత్రునిశత్రులు నాకు శత్రులు. శత్రునిమిత్రులు నాకు శత్రులు. కావున హేమచంద్రుఁడు నాకు శత్రుఁడు. చిత్రభానుఁడు మిత్రుఁడు. చిత్రభానుఁ డింక కాశ్మీరదేశాధిపతి యయ్యెనని నమ్ముము. అదిగో! తమ్ములకపకార మొనర్చినరాజువెలవెలఁబోవుచుఁ బడమటికొండలలో నేకాకియై యస్తమించు చున్నవాఁడు. వాని మరణంబునకై విలపించునాప్తుల వచనంబులుఁబోలె పులుఁగులు మొఱయిడుచున్నవి. వానిసంపద లెగిరిపోయినట్లు వెన్నెల లెక్కడి వక్కడ యంతరించు చున్నవి. వాని బంధులసంఖ్య సన్నగిలునట్లు చుక్కలగుమి యంతకంతకు క్షీణించు చున్నది. హేమచంద్రునియధి కారము పోయి చిత్రభానునియధికారంబు దేశంబున నెలకొనును నని తెలుపుటకో యనఁ జంద్రాస్తమయ మగు చున్నది. ఒక్కగడియ లోన భానుఁ డుదయింపఁ గలఁడు." ఆపలుకులు విని సుమిత్రుఁడు ప్రహృష్టహృదయుఁ డయ్యె. అంతలో భళ్లున తెల్లవాఱె.

ఆఱవప్రకరణము.

కృష్ణపక్షపాడ్యమిదినమునఁ బ్రాతఃకాలమునఁ బడమట నస్తమింపఁబోవు చంద్రమండలమును, దూర్పునఁ బొడుపుగొండపై నుదయించుసూర్యమండలమును గగన మను నింద్రనీలమాణిక్యపుటరుఁగుపై నతికినవజ్రపుంబిళ్ళయుఁ గెంపుబిళ్ళయు ననఁ దేజరిల్లుచుఁ జూపరకు నీశ్వరమహిమాతిశయములు జాటు చుండును. ఉదయమున నా రెండుబింబములు గనుఁగొనువారికి జీవయాత్ర ముగింపఁబోవుచు నవసానదశలోనున్న వృద్ధునియు, జన్మమంది మహాభివృద్ధిని గాంచఁబోవు బాలునియు నవస్థలు మనసునకుం దట్టు. రాత్రి యొండొరులచిత్రచరిత్రములు జెప్పుకొనుచు జాగరముచేసి సుమిత్ర రుద్రభట్టులు తెల్లవాఱినపిదపఁ గాల్యకృత్యములం దీర్చుకొనఁబోయిరి. గాయము తగులుటమొదలు రుద్రభట్టు నదివఱకు నడవ లేక పల్లియలోనిచెఱువులో స్నానము చేయు చుండెను. ఇల్లువెడలినదిమొదలు తన కబ్రాహ్మణసంపర్కము విశేషముగా సంభవించుటచేతను గాయముకతమునఁ గొన్ని దినములు స్నానము మాని యపరిశుద్ధుఁడయి భోజనము చేయవలసివచ్చుటచేతను బ్రాహ్మణోత్తములు చేయవలసిననిత్యకృత్యములు ననుష్ఠానములు సరిగాఁ దానప్పుడు నిర్వర్తించకపోవుటచేతను బ్రాహ్మణుఁడు పవిత్రమయిన సింధునదీస్నానము సకలదోషాపహారమనియుఁ దన గావించిన తప్పునకుఁ బ్రాయశ్చిత్తమనియు నిశ్చయించి యద్యేఁటికిఁ బోయెను. పోయియచ్చట యఘమర్షణస్నానము జేసిభాస్కరునకు యథావిధిగ నర్ఘ్యప్రదానముఁ జేసి యనంతరమిసుకతో లింగము జేసిపార్థివమును జేసికొని మరలనింటికివచ్చుచుఁ ద్రోవలో సుమిత్రుని కోరికయుఁ దానుగావించిన వాగ్దానమును దనతలఁ బెట్టఁబడినకార్యభార

మును దలంచుకొని తనలోఁదా నిట్లని విచారింపఁ జొచ్చె. “ఈసుమిత్రుఁడు నావృత్తాంతము నంతయు మెల్లమెల్లఁగ నావలన విని తన వృత్తాంతము జెప్పుమని నే నడిగినప్పుడు దానిం జెప్పక వేఱొక రాజకుమారునిచరిత్రము నాకెఱిఁగించె. ఆరాజనందనుఁడు నాకగపడఁడు. వానిం జూపు మని వేఁడిన నితఁడు సూపఁడు. ప్రపంచమున నట్టిరాజకుమారుఁడు కలఁడా యని యొకమాఱును నిజముగానుండెనేని సుమిత్రుఁడే యతఁడై యుండునా యని యొకమాఱును నామనంబునకు సందియంబులు బొడముచున్నయవి. సుమిత్రుఁడే యారాజకుమారుఁడయినచో నతఁడారహస్యము నెఱిఁగింపక యేలదాఁచు? కానియెడల నావలన మహోపకారమును గోరుచున్న రాజకుమారుని నాకుం జూపక దాఁచ నేల? నొక్కి యడుగుదమన్న నతఁడేమియనుకొనునో యనుభయముకలదు. అడుగకున్న సందేహము మనస్సును బాధించుచున్నయది. అది యటుండగ నవస్థాభేదముచే నేనిప్పుడు రాజకార్యములలోఁ బ్రవేశింపవలసి వచ్చె. సుమిత్రుఁడు నాతలపై మహాభారము మోపినాఁడు. అతఁడు నాకుపకారి యగుట వానిమంచితనము దలఁచి యేదియుం జెప్పఁజాలక మూగమోటమిచేవానిచెప్పిన తెఱఁగున నడచువాఁడ నని వాగ్దానముఁ జేసితిని. స్వర్గమునకుఁ బోయినను విడియాకులు దప్ప వన్నట్టు రాజద్రోహమునకై దేశమునుండి బహిష్కరింపఁబడిననేను మరల రాజద్రోహులకే సాయము జేయవలసి వచ్చె. కాశ్మీరమునకు నేనుబోయి ప్రజారంజకుఁడైన హేమచంద్రుని పైఁ గుట్రలు పన్నినచో నాగుట్టుమట్టు వెల్లడికి వచ్చెనేని నాకు సేమమగునే? సుదర్శనమహారాజువలె హేమచంద్రుఁడు నన్నుఁ బ్రాణంబులతో నిలువనిచ్చునే? ఇదివఱకే యాలుబిడ్డల నెడబాసి యేకాకినై కష్టములు గుడుచుచున్న నాకు గోరుచుట్టుపై రోఁకటిపో టన్నట్టు మునుపటికంటె నెక్కువ వెతలు సంభవింపకుండునే? ఏఁబదిసంవత్సర

ములు సెల్లుటచే జీవయాత్రలో సగము గడపి యవసాన కాలమును సమీపింపఁబోవుచున్న నేను గామక్రోధాదుల జయించి యే నదీతీరమున నైన నేయగ్రహారమున నైన నొక కుటీరంబు గావించికొని కృష్ణా రామా యనుకొనుచు శిష్యులకుఁ బాఠములు చెప్పుకొనుచుఁ దనివి గలిగి సుఖముగ నాలుబిడ్డలం గలిసి కాలక్షేపము జేయక తలకు మీఱిన పను లగురాజ్యవ్యవహారంబులం బ్రవేశించుట యుచితమా యనుచితమా యని యాలోచింపవలసి యున్నది. సుదర్శనుఁ డెగ్గు చేసె నని రాజసేవను నిందించిన నేను వెండియు రాజసేవఁ గైకొనుట యేటి తెలివి! చిన్ననాఁటనుండియుఁ బరిచయముగల సుదర్శనుఁడె యంత సేయ నెన్నఁడు మొగమయినఁ జూచి యెఱుంగని చిత్రభానుఁడు నన్నుఁ బువ్వులం బూజించునే? ఒకరాజును విడిచి మఱియొకరాజు నాశ్రయించుట తోఁడేలుబాఱినుండి తప్పించుకొని పులిచేఁ జచ్చుట కాదే? న న్నెన్నఁడు నెఱుంగనివానికి నాకపకార మెప్పుడుఁ జేయనివానికి హేమచంద్రునకు బుద్ధిపూర్వకముగా నెగ్గు జేయఁదలంచుట కొఱవి చేఁగొని తల గోఁకికొనుట కాదే? మహావైభవముతో నవని నేలుచున్న హేమచంద్రు నాశ్రయింపక యేలుటకు బెత్తెడు నేల యైన లేక కార్యసాధనమునకుఁ గావలసిన ధనమును లేక తినుట కన్నము, నుండ నిల్లు లేక సేవించు పరివారము లేక, నాకన్న హీనుఁ డై దీనుఁ డై సంచరించు చిత్రభానునిఁ గొల్చి దేహయాత్ర నడపఁ దలఁచుకొనుట శిలప్లవముఁ జేసికొని యీఁద నేటఁ బడుట గాదే? ఇవి యన్నియు సమయానుకూలంబుగ నాకుం బొడమతగినసంశయంబులే. ఐనను బౌర్వాపర్యంబులు చక్కఁగ విచారించి విషయమును బాగుగఁ దఱచి చూడ నా కిప్పుడు చిత్రభానుని సేవించుటయే కర్తవ్య మని తోఁచు చున్నయది. ఏమన నాకుం బరమశత్రు వయినసుదర్శనుని సాధించుటయే నా పురుషార్థము గదా? సుదర్శనునకు మిత్రుఁ డగుటచే హేమచం

దుఁడు నాకుం బగతుఁడే కదా. ఆ కారణంబున హేమచంద్రునికి సోద
రుఁడు బగతుఁడు సుచిత్రభానుఁడు నాకవశ్యము మిత్రుఁడే కదా.
అందుచేఁ జిత్రభానునిసేవ నంగీకరించి వానిపక్షమును బూని పనిచేసి
వానిసుఖదుఃఖముల నేననుభవించెద. అట్లు వానిని సాధించి కృతా
ర్థుఁడ నైనపిదప శౌర్యమును విడిచి బ్రాహ్మణోచిత మగుశాంతము
నవలంబించి ముక్కు మూసికొని తపస్సు చేయుచు శేషించినకాలము
గడపెదను. ఇరువదియొక్క మాఱు రాజకులంబు లనువృత్తంబులఁ దన
గండ్రగొడ్డలితో నఱికి కూకటివేళ్ళతోఁ బెల్లగించి తద్రక్తమునఁ
బితృదేవతలకుఁ దర్పణముఁ జేసి యనంతరము తపోనిష్ఠ స్వీకరించిన
పరశురాముఁడట్లు నేనును బౌద్ధరాజకులమును నిర్మూలించి చరితార్థుఁ
డ నయ్యెద. నను నెన్ని యంతరాయములు వచ్చినను దలపెట్టిన
కార్యంబు కొనసాగించుట యుత్తమపురుషలక్షణం బని పెద్దలు చెప్పఁ
గా విందు. కావున నే నింకఁ గాశ్మీరంబునకుఁ బోయి సుమిత్రుఁడు
చెప్పినచొప్పున నడచుట ముమ్మాటికి నిశ్చయంబు." ఈ వితర్కము
సమాప్త మగునప్పటికి రుద్రభట్టు తనవాసస్థానమునకు వచ్చి తడిబట్ట
లారఁగట్టి వంటఁ జేసికొని భుజించెను. సుమిత్రుఁడును భోజనానంతర
మున రుద్రభట్టుం గనుంగొని "దేవా! మీరు పయన మయి పోవు
టకు ముహూర్తము నిర్ణయింపుఁడు. మీరు జ్యోతిశ్శాస్త్రమున జాతక
సిద్ధాంతభాగము లందే గాక ముహూర్తభాగమునందును గడుకృషి
చేసినవా రగుటచే మీరు పెట్టెడుముహూర్త మమోఘముగ శుభ
ప్రదాయక మయి యుండవలయు. పోవునప్పుడు కరటకునిం బింగళకుని
మీవెంటఁ గొనిపొండు. వారు మీచెప్పినచొప్పున వర్తించువారు.
వారెప్పుడు మీకుఁ గుడియెడమచేతులట్లు సంచరింతురు. అందుఁ
గరటకుండు నక్కకంటె జిత్తులు పన్ని ప్రజలం బేలుపుచ్చ నేర్చు.
పింగళకుఁడు పొంచియుండి మంచిసమయమునఁ బగతునిపైఁ బడి చెఱుప

నేర్పు. అవసర మగునప్పుడు లేడియట్లు నేల నడుగు లంట కుండఁ బఱుగెత్త నేర్పు. పోతుటీఁగకుం జొఱరాని రహస్యంపుఁదావులకుఁ బోయి తనజాడ నొరు లెఱుంగకుండ నెంతటి రహస్యము లయిన నెఱిఁగిరా నేర్పు. పింగళకుఁడును వాని సాటివాఁడు. వారల ప్రజ్ఞాదికములు ముందుముందు మీర యెఱుంగుదురు. మీ రింక పయనమై సత్వరమునఁ బోవలయు. కాలహరణంబు శత్రువులకు లాభకరమును, మనకు నష్టకరమును జుఁడీ." అని పలుక రుద్రభట్టు కొంచెము విచారించి "నాయనా! రేఁ పుదయమునఁ బ్రయాణమునకుఁ దగిన శుభముహూర్త మున్నది. కావున నే నీప్రదేశము రేపు విడిచెదను. నీవు చెప్పిన చొప్పున నడచువాఁడ. నీవు చెప్పిన దంతయు నామనంబున జ్ఞాపక మున్నయది." అని పలికి సుమిత్రునిమనంబునకు సంతోషముఁ గూర్చెను.

ఏడవ ప్రకరణము.

భరతఖండమునఁ బుణ్యదాయకము లగు నగరములలో నుజ్జయిని యొకటి. శివుఁడు మహాకాళేశ్వరుఁ డనుపేరు దాల్చి యప్పీట వసియించుచుఁ దన్ను సేవించుభక్తజనంబులకు ముక్తిఁ గరతలామలకముగఁ జేయుచుండునని యార్యులు వక్కాణింతురు. ఆదేవునకు జరుగు నిరుపమాన వైభవంబులను నిత్యకల్యాణంబులను గనుఁగొనువారు శంకరుఁడు చిరకాల మిల్లులేక వల్లకాటఁ జరియించి కట్టగుడ్డలేక కొంతకాలము దిగంబరుఁడై యెట్టకేలకు పులితోలుదాల్చి భిక్షాటనమున జీవించుచుఁ జేత నొకముంత యైన లేక మానిసిపుఱ్ఱె పాత్రగఁ జేసికొని చిరకాల మిబ్బందులుపడిపడి తనదురవస్థ భరియింపనోపక జన్మ

మధ్యమున నొకసారి యైనఁ గడుపునిండఁ గూఁడు తిని యొడలినిండ బట్టగట్టుకొని చల్లని తావునఁ దలదాఁచుకొననిశ్చయించితనయాలితోఁ గూడి విదేశములపాలై పోయి తుదకు సర్వవిధముల యోగ్య మయి సుభిక్ష మయి వెలయు నుజ్జయినిం జేరెనో యని తలంపవలసియుండును. ఈనగరము పూర్వకాలమునుండియుఁ బురాణములయందును దేశచరిత్రాదులయందును బ్రసిద్ధిని గాంచి నాగరకతకును విద్యలకును సంపదలకును నిలయమై యెన్నికె వహించెను. ఏరాజు పేరు భరతఖండమునఁ బ్రతిభాగమునఁ బ్రతిగ్రామమునఁ బ్రతిగృహమునఁ బ్రతిమనుష్యుని చేత స్మరియింపఁబడు చుండెనో యేరాజు మనదేశముపై దండెత్తిన మ్లేచ్ఛుల నోడించి పాఱఁదోలి వైదికధర్మంబులఁ బ్రతిష్ఠించి భరతఖండము నేకఛత్రముగఁ బరిపాలించుటంజేసి వానికీర్తి యాచంద్రతారార్కముగ నవనిలో నుండునటులు వారిపేర శకము ప్రారంభింపఁబడియెనో, యేరాజుచిత్రకథల వినినఁ జదువుకొనిన నెవ్వాగ లన్నియు నడంగ మనుజు లానందాబ్ధి నోలలాడుదురో యాసాహసవిక్రమార్క భూపాలుండు పాలించిన దీయుజ్జయినీ నగరమే. ఈపురమున కధిపతియైన ప్రద్యోతమహారాజే తొల్లి తనకుఁ బగతుఁడును బాండవవంశజుండును గౌశాంబీపురాధిపతియు వత్సరాజు నగునుదయనమహారాజును మాయోపాయమునం బట్టి తెచ్చి తనకోటలో బంధించె. ఈ ప్రద్యోత మహారాజుకూఁతు రగువాసవదత్తా దేవినే కోటలో బంధింపఁబడినవత్సరాజు వలచి యంతఃపుర పరిచారికలచేత రాయబారము నడపి యామెకు దనపై వలపు గలిగించి యెట్టకేలకుఁ దండ్రి కన్నులు గప్పి యామెను వెంటఁబెట్టుకొని యావలకుం బోయి వివాహంబు జేసికొనియె. సకల కవికులగురుఁ డనివిఖ్యాతిఁ గాంచి నాటకరాజమని యెల్లరచే వినుతి గాంచినయభిజ్ఞానశాకుంతలమును రచియించినకాళిదాసమహాకవియుఁ బాణినివ్యాకరణమునందును బతంజలిమహాభాష్యమునందును గలకొఱ

తలఁ బూరించి గీర్వాణవ్యాకరణములకు వార్తికముల వ్రాసిన వరరుచియు జ్యోతిశ్శాస్త్రపారమును జూచి బృహజ్జాతకాదిమహాగ్రంథముల నిర్మించినవరాహమిహిరుఁడును నిఘంటువులలో నెల్ల శ్రేష్ఠమై సంస్కృతపదపారిజాత మని చెప్పఁదగిన నామలింగానుశాసనమునురచియించిమృతజీవుఁ డయినయమరసింహుఁడునుదక్షుకునికోఅలవిషంబుచే భస్మపటల మయినవృక్షమును గ్రమ్మరబ్రదికించి వైద్యశాస్త్రమును భూలోకమున కవతరింపఁ జేసినధన్వంతరియు సుభాషితరత్నావళి యనుపేర నీతిశృంగార వైరాగ్యములఁ గూర్చి మూఁడు శతకంబులం జెప్పిజగజ్జనులకు మహోపకారంబు గావించి కీర్తిశేషుఁడయినభర్తృహరియు నీపట్టణమునందే వసియించి రని పూర్వకథాకోవిదు లగుపెద్దలు వలుకు చుందురు. కాళిదాసునిచేత మేఘసందేశమునందు మిగుల హృదయంగమంబుగ వర్ణింపఁబడిన దీ పురతిలకమే. జ్యోతిష్కులచే గణితములనిమిత్తముమధ్యస్థానముగ నంగీకరింపఁబడినదీనగరరాజమే. అవంతి యనియు విశాల యనియు నామాంతరములు గలిగి వ్యవహరింపఁబడిన దీపుటభేదనమే.

ఈకథ జరగినకాలమున నుజ్జయినీనగరము సుదర్శనుఁ డను రాజశేఖరునిచేఁ బరిపాలింపఁబడు చుండెను. ఆసుదర్శనుఁడు సార్థకనామధేయుఁ డని చెప్పుటయతిశయోక్తి గాదు. వానిచక్కఁదనముముందు మన్మథునిమేనియందము కనంబడ దని పలుకుట పొగడ్త గాదు. విలువిద్దియయందు నేరిమింగనినయర్జునుఁడు తెల్లఁబోవవలసివచ్చు ననుట వర్ణనము గాదు. అతనియైశ్వర్యము నెదుట నష్టైశ్వర్యములు గల మహేశ్వరుఁడు దరిద్రుఁడై తోఁచు ననుట కవిసమయము గాదు. మేఘుఁ డొకానొకప్పుడు వృష్టులం గురియక వట్టిగర్జనంబుఁ జేసి పోవచ్చును గాని యాఘనుఁ డాశ్రితజనంబులకుఁ గావలసి వచ్చినప్పుడు భూరివృష్టుల నొసంగక పోఁడు. ఆరాజు బౌద్ధమతావలంబకుఁడు. అ

ట్లయ్యు బౌద్ధులయెడఁ బక్షపాతమును బ్రాహ్మణులయెడల నిరసనమును లేక సర్వసమానుఁడయి లోకరంజకముగఁ బ్రజాపాలనము జేయు చుండు. అతఁడు దుర్జనులకు భయంకరుఁడు. సజ్జనుల కభిగమ్యుఁడు. దీనులకు మందారము. పండితులపాలిఁటి పారిజాతము. దయాసాగరుఁడు. నోరెఱుఁగనిజంతువులగొంతులు పరపరఁ గోసి మనుష్యులకడుపు నిండించుకొనుట మహాపాతకమని తలఁచి యానరనాథుఁడు మాంసభక్షణము మానెను. మనుజులకుఁ గీడుచేసినవారలెత్తెఱంగున దండనలకుం బాత్రులగుదురో జంతువుల కు హాని జేసిన వారు నత్తెఱంగున శిక్షార్హులె యని యతఁడు శాసించె. అతని మనసెంత మెత్తనిదియో కాని పాము తేలు మొదలగువిషక్రిములనైనఁ దనయెదుటఁ జంపు చుండ నాతఁడు జూచి సహింపఁజాలఁడు. ప్రజాక్షేమమునిమిత్తము తనశాసనముం దప్పి నడిచినతులువల గండించు చుండును. కాని శిక్షలు తప్పుచేసిన వారలనడతల దిద్దుటకై యేర్పడినవని యెఱింగినవాఁడు కావున దండనలు క్రౌర్యరహితము లగునట్లును సాధ్య మగునంతవఱకుఁ గృపామిళితము లగునట్లును జేయు చుండును. వేయేల! ఆమహారాజు సద్గుణంబులసారంపుముద్ద యని ప్రకృతిజనంబులెల్ల వానిం గొనియాడుచుందురు. ఆభూకాంతునికులకాంత యానాఁడు గలకాంతలలో నెల్ల లావణ్యవతి. కోసలేంద్రుఁ డగుశుకధ్వజుని యనుంగుఁగూఁతురు. ఆమెపేరు చంద్రప్రభ. గొనములదొంతి యగు నాయింతి యానాఁటికాంతల కెల్ల మేలుబంతియై యామహారాజునకెల్లవిధంబులఁ దగియుండె. ఆదంపతుల పరస్పరానురాగపు మొదటి పంటయో యన్నట్లు వివాహమైనయచిరకాలమునకే కువలయానందవర్ధనుఁ డగునందనుఁ డొకఁ డుదయించె. రమాకుమారునికన్న సుకుమారుఁడగునాకుమారునకు సుదర్శనుఁడు తండ్రిపైఁ దనకుంగలయనురాగమును గౌరవమును జూపుటకై మకరందుఁ డని పేరు పెట్టెను.

ఈగ్రంథమున వర్ణితమగుకథ జరుగునాఁటికి మకరందుఁడు పదునెనిమిదేండ్ల ప్రాయమువాఁడు.

వెనుకటి ప్రకరణములయందుఁ బేర్కొనఁబడిన రుద్రభట్టుజ్జయినీ నగరమునుండి వెడలిపోయిన కొన్ని దినములకు నొక్కనాఁడు ప్రాతఃకాలమునఁ దనయంతిపురమున నొకగదిలో సుదర్శననరేంద్రుఁడు తత్సమయంబున నుదయించు ప్రభాకరునిచందంబున సుదర్శనుండై యెద్దియో యాలోచింపుచు నొకపీఠమునఁ గూర్చుండె. అప్పుడు ప్రతీహారి మార్గంబు జూపఁ బ్రధానమంత్రి యగు రత్నసేనుఁడు మెల్లమెల్ల రాజసన్నిధి కరుదెంచి వినయంబున జోహారొనరించి యిట్లనియె. "దేవా! కేసరి దేవరపాదసందర్శనార్థమయి క్రమ్మర వచ్చి యున్నవాఁడు. ముదల యయ్యెనేని వానిం దోడి తెచ్చెద. అనవుడు సుదర్శనుఁడు సచివుని గనుంగొని "రత్నసేనుఁడా! వానినేల నీవెంటఁ గొని రావైతివి. సత్వరంబె చని తోడ్కొని ర"మ్మని సెలవిచ్చి వాని నావలకుం బనిచె. రత్నసేనుఁ డవ్వలకుం జని యొక్కముహూర్తంబునఁ గేసరిని వెంటఁ బెట్టుకొని రాజసమ్ముఖమ్మున కేగుదెంచె. కుఱంగటకు వచ్చిన కేసరీరత్నసేనులఁ గనుఁగొని రాజు వారినిరువుర నుచితాసనంబులఁ గూర్చుండుఁ డని యానతిచ్చె. రాజానుమతంబున రత్నసేనుఁ డుచితాసనంబున నాసీనుఁ డయ్యె. కేసరి కూర్చుండక మహారాజు నడుగులపయిం బడి బాష్పాకులితనయనుఁడై కన్నీట సుదర్శనుని పాదముల నభిషేకించుచు గద్గదస్వరంబున నిట్లనియె. "ఓ దయామయా! నేను మహాపాతకుఁడను రాజద్రోహిని, దేశద్రోహిని, దేవరసన్నిధిని బీఠముపైఁ గూర్చుండుట కర్హుఁడఁగాను. చిన్ననాటనుండియు మీయడుగులఁ గొలిచి మీమన్ననలఁ బడసి మీయన్నముఁ దిని మీబట్టగట్టి మిత్రులకుఁ గనుల పండువుగను శత్రువులకుఁ గన్నెఱ్ఱగను జుట్టంబులకు మనఃప్రమోదకరముగ నుండునట్లు మహైశ్వర్యంబుల ననుభవించుచు మీయంత

వాఁడనై యుండియుఁ దుదకు మీపాదసేవఁ జేయుచుఁ గుడిచికూర్చుండ లేక యొడలు క్రొవ్వి లంచగొండి నయి కృతఘ్నుఁడ నయి చెనఁటి యగురుద్రభట్టు పలుకులు విని మీకును వైదర్భులకును బొడమిన వివాదంబున న్యాయమగుపక్షము విడిచి యన్యాయంబుగ మీగ్రామంబులఁ గొన్నిఁటిఁ బరులకు విక్రయించి యాపాపపుధనంబు సంగ్రహించితిని. స్వామిద్రోహముఁ జేసిన నీచునిఁ గొఱతవేయించక ప్రాణప్రదానంబు గావించిన మహానుభావుల రగు మీదయారసంబు నే మని కొనియాడుదు? దేవా! మీగ్రామంబుల వైదర్భులకు విక్రయించిన నాఁడె చిరసంపాదిత మగునాప్రతిష్ఠ విక్రయించితిని. ధనముకన్న నుత్కృష్ట మగుగౌరవంబును విక్రయించితిని. పూర్వసంచిత మగు పుణ్యము విక్రయించితిని. పాపమున కొడిగట్టి యెట్టెటో మూటగట్టు కొన్న యాధనంబును దుదకు నాకుఁ దక్కకదయ్యె. నరు లెంతెంత చాటు చాటునఁ జేసిన దోసంబులును బయలువడక పోవు; కావున నాయొనర్చిన పాపంబును బ్రద్దలై వెల్లడియయ్యె. నాకావించిన యకార్యంబునకు నే నిప్పుడ నరకము ననుభవించుచున్నాఁడను. ఎట్లన, దేవరకు నాయెడఁ గలయాదరం బడుగంటె. ప్రజలకుం గలగౌరవము గంగఁ గలిసె. నెయ్యురకుఁ గలమక్కువ నేలపాలయ్యె. గంపెడుబలగముండి నే నిప్పుడే కాకినైతి. ఎట్టెటో పొట్టబోసికొనితినుచుండియు దుర్బలుఁడ నైతిని. పూర్వపరిచితుల కండఱకు దొంగ నైతిని. వేయేల! గౌరవహీన మయిన యీబ్రదుకు బ్రదికించుటకంటె నాఁడు మీరు శిరచ్ఛేదముఁ జేయించిన నాకెక్కు డుపకారంబై యుండు. తుచ్ఛప్రాణంబులపైఁ గలతీపిచే బలిమిని నాయంతట నేను జావలేకయుండి యీ మొండిదేహంబు నింతకాలంబు నిలుపఁగలిగితిని. నిర్ధనుఁడనై నిర్యశుఁడనై నిర్బంధుఁడనై నిష్పుణ్యుఁడనై చుట్టములకు నెయ్యురకు నాలుబిడ్డలకు లోకులకు భూమికి బరువుగ నున్న నేనీపనికిమాలిన బ్రదు

కింక బ్రిదుకఁజాల. ముందువెనుక లరయక దొరకెఁగదా సం దని సంతోషంబున నాఁడులంచముగ్రహించిననామనసు పశ్చాత్తాపమున నేఁడు మఱుఁగు చున్నయది. శిరచ్ఛేదంబు చేయక నన్ను విడుచుట యే నాకు శిక్ష విధించుట. ఇంక నే నీమనోవ్యథ భరింపఁ జాల. మీ చిత్తంబువచ్చిన ప్రాయశ్చిత్తంబు విధియించిన న్ననుగ్రహింపుఁడు. కృపాతరంగితంబు లగుమీయపాంగావలోకనంబుల నాపైఁ బఱపినం గాని నాతాపం బుపశమింపదు. నన్ను మకరందునిగా భావింపుఁడు కటకటా! కష్టచరితుఁడ నగునేను సుగుణరత్నాకరుఁడగుమకరందుని వంటివాఁడనని పలుకుట యనుచితముగదా! మకరందునియందుఁబలె నాయందును బుత్రవాత్సల్యముఁ జూపి నన్నురక్షింపుఁడు. ఇంతకన్న నెక్కుఁడు విన్నవింపఁజాల" నని మనుజేంద్రుని పాదయుగళంబుగట్టిగఁ బట్టుకొని యనివార్య మయి వచ్చునెవ్వగ నాపలేక బాలకునిచందం బున బిగ్గరగ నేడ్చెను. సహజముగ మృదువయి కృపానిలయమయిన సుదర్శనునిమనస్సు దీనము లగు కేసరివచనములకు మఱింత మెత్తనై వానియెడఁ బ్రసన్న మయ్యె. నేరస్థుఁడయి పాదాక్రాంతుఁ డైన సేవకుని కన్గనుండి యెట్లుబాష్పంబులు తొరఁగెనో దయామయుం డగుయజమానుని నేత్రములనుండియు నట్లేబాష్పములు గాఁజొచ్చె నట్లు కేసరిదైన్యంబును వినుటవలనం గలిగినబాష్పబిందువులు మెల్ల మెల్ల నుత్తరీయాంచలంబునఁ దుడుచుకొని సుదర్శనుఁడు కేసరిని దన యడుగులపై నుండి లేవనెత్తి ప్రక్క నొకపీఠముపైఁ గూర్చుండఁ జేసి కనికరంబు మెఱయ నిట్లనియె. "కేసరీ! నీ విందు సిగ్గుపడి వగ వం బని లేదు. మానవజన్మ మెత్తినవారిలోఁ దప్పు చేయనివాఁ డెవ్వఁడు? గొప్పవారు గొప్పతప్పులు చేయుఁ గొలఁదివారు కొలఁది తప్పులు గావించు చుందురు. నరుఁ డొకవేళ మనోదౌర్బల్యమున నొకానొకసమయమున దోసంబు జేసినను గాటం బగుపశ్చాత్తాపం

బున వానియాత్మ నిర్మలమై పరిశుద్ధం బగును. నీవు మామకరందుని వంటివాఁడవు. నీ కేభయంబును లేదు. నీవు గావించినతప్పు లన్నియు క్షమించితిని. నీవెప్పటియట్ల దారపుత్రాదులతో సజ్జయినిం గాఁపుర ముండి నాకిష్టసచివుండ వయి మెలంగుము. రుద్రభట్టు మహాపరాధంబు గావించినందుకుసిగ్గుపడి యొదిగియుండుటకుమాఱు తాను నిరపరాధియనివాదించి పంతగాఁడై ప్రతినలు బలికెఁ గాని నీవలె నేరంబు నొప్పుకొని కావుమనిన వానిని క్షమింప కుందునా? ప్రజాక్షేమమునిమిత్తము దేశసంరక్షణార్థము దండ్యులను శిక్షించుచుందును గాని వారుమ్రి నాకుఁ బగతురుగారు. నీవు వ్రాసి యంపిన లేఖ నాకందినది. అజాఁబు చేరిననాఁడె నే నిన్ను క్షమియించి నిన్నటకు రావింపుమని రత్నసేనునితోఁ జెప్పితిని. నీవింక విషాదంబు దక్కిపొమ్ము." అని భూపాలుఁ డానతిచ్చుటయుఁ గేసరిమహానందభరితుఁడై తేనియ్యమగులకుఁ బునఃప్రణామంబుగావించి తనపై నాతనికిం గలిగిన యపారకృపారసంబునకుఁగడుఁగృతజ్ఞుఁడయియవ్వలకుఁజనియె

అతఁడు చన్న వెనుక సుదర్శనుఁడు రత్నసేనునిం గనుంగొని "పాపము కేసరి కడుచిన్నవోయి యున్నవాఁడు. వానికి గాఢపశ్చాత్తాపము గలిగె నని తోఁచుచున్నయది. ఇఁక నైన నతఁడు సత్ప్రవర్తనము గలిగి మనయెడఁ గృతజ్ఞుఁడయి వర్తించునని తోఁచెడిసి. నీయభిప్రాయమే" మని యడిగెను. రత్నసేనుఁ డాపలుకులు విని వెంటనే ప్రత్యుత్తర మొసఁగక యనుమానించుచు మెలమెల్లఁగ "దేవా! కార్యంబులంబట్టి మనుష్యులకృతజ్ఞత నెఱుఁగ వలయుఁ గాని మాటలంబట్టి కాదు. కుటిలచిత్తులాపత్కాలమున నొదిగియుండి వినయంబు జూపుదురు గదా" యని పలికెను. మంత్రిమాటలకుఁ జిఱునవ్వు నవ్వి "యెన్నఁడో యొకసారి పొరబాటున నతఁడు తప్పు చేసె గదా యని కలకాల మతఁ డట్టివాఁడే యని నిశ్చయించుట

పాడియగునా? తన యకార్యంబున కింత వగచినవాఁడు వెండియుఁ గృతఘ్నుఁ డగు నని నేఁ దలఁపను. కావున నీమనంబున సందియపడ నక్కఱ లేదు సుమీ" యని పలికెను. మంత్రి కేసరివిషయమునఁ దనయభిప్రాయమును మార్చికొన లేదు గాని ఱేనిమాటల కెదురాడ లేక యూరకుండవలసి వచ్చె. అనంతరము రాజును మంత్రియును మఱికొన్ని రాజకీయవ్యవహారములఁగూర్చి ప్రసంగించుచుండ మంత్రి యిట్లనియె. "విదర్భరాజునకుఁ గలవివాదమున మనచే నంపఁబడిన కేసరియు రుద్రభట్టును వివేకహీనులయి ప్రవర్తించిరిగావున మనము మఱల నెవ్వరి నయినఁ వైదర్భులయొద్ద కంపి వ్యవహారముఁ బరిష్కరించికొనుట కర్తవ్య మని నాకుఁ దోఁచుచున్నయది. రాజవాహనుని యొద్దకుఁ బోయి "మీరు రాయబారులకు లంచ మిచ్చి మాగ్రామంబుల నన్యాయముగ నాక్రమించి రని యెట్లు మనము నొక్కి పలుకఁ గల" మని మీ రందురేమో! అట్లు మీరు శంకింపనక్కఱ లేదు. ఈసందేశము నడపుటకు నన్నును మకరందకుమారుని బనుపుఁడు. విదర్భేశ్వరునిమనసు నొవ్వకుండ నన్నృతంబులు బలుకకుండ గార్యంబు సెడకుండ నెట్లు పలుకవలయు నట్లు పలికి మనయూళ్ళు మఱల మనకు వచ్చునట్లు చేసెద." అనుటయు రాజంచుక విచారించి సకలకళాపరిపూర్ణుఁ డగుమకరందుఁడును, లోకజ్ఞుఁడు రాజనీతి విశారదుండు నగురత్నసేనుఁడును, జనినకార్యంబు సేకుఱు నని నిశ్చయించి వారిపోక కనుమతించె.

ఎనిమిదవ ప్రకరణము.

'పుత్రా దిచ్ఛే త్పరాజయ' మ్మను నార్యవచన మొకటి కలదు. తండ్రి కొడుకువలనఁ బరాజయము నొందుట కిచ్ఛగించు నని

దాని యర్థము. సుగుణములలోఁ గుమారుఁడు తన్ను మించవలయు నని తండ్రి నిరంతరమును గోరుచుండు నని దానిభావము. జనకుఁడు గుణహీనుఁడై దుష్టుఁడైనను దనతనయుండు సుగుణవంతుఁడు సన్మార్గుఁడు గావలయు నని కోరుటయుఁ దాను సుగుణవంతుఁడే యయ్యెనేని తనకొడు కంతకన్న సద్గుణాఢ్యుఁడు గావలయు నని కోరుటయు లోకానుభవసిద్ధ మని మన మెఱుంగుదుము. ఆన్యాయము తక్కినవారి యందుకంటె సుదర్శనమకరందులయందునెక్కుఁడుగ సార్థకంబయ్యె.

తెల్లనిపాలవెల్లిలోఁ జల్లనిచంద్రుఁ డుదయించిన చందంబున దయాసముద్రుఁ డగుసుదర్శనునికడుపున సర్వకళాపరిపూర్ణుఁ డగుమకరందుఁ డుదయించుటచే మాళవదేశస్థులు తమభాగ్యములు పండినవని మహానందభరితులైరి. మకరందునియం దొకశుభలక్షణ ముండి యొకశుభలక్షణము లేక పోలేదు. ఒకసద్గుణ ముండి యొకసద్గుణ ముండక పోలేదు. ఒక్క చక్కఁదనంబునకే వాని మెచ్చవచ్చు. ఒక్కభూతదయకే ప్రశంసింపవచ్చు. ఒక్కవిద్యకే కొనియాడవచ్చు. ఒక్కపరాక్రమమునకే పొగడవచ్చు. ఇన్నిగుణము లొక్కనియందె గుమిగూడి కానఁబడినప్పుడు ప్రజ లారాజకుమారు నెట్లుగారవింతురో యిచ్చట వర్ణింపవలయునా? పలుమాట లేల? ఆరాజనందనుఁడు పదియెనిమిదేండ్లప్రాయము వచ్చునప్పటికి గుణములగనియై. చదువుల సరస్వతియై బుద్ధికి బృహస్పతియై మదవతీమన్మథుఁడై శ్రితజనచింతామణియై పండితజనపారిజాతమై పరాక్రమసింహమై జన్మకారణమగువంశమునకుఁగడుపారఁగన్నతల్లిదండ్రులకుఁ బాలింపఁబడు ప్రకృతిజనులకుఁ గ్రమంబున గౌరవంబు యశంబు నానందంబు నొడఁగూర్చుచు నతని కతండె సాటి యన విలసిల్లె. మకరందుఁడు నిండు జవ్వనమును బ్రాపించినందునఁ దల్లిదండ్రులు వానికిం దగినకన్నియను దెచ్చి వివాహంబు జేయవలయు నని రాజపుత్రికలకై వెదకఁ

జొచ్చిరి. కన్నియమెచ్చుప్రాయమును దల్లి మెచ్చుసంపదయుఁ దండ్రి మెచ్చుమగఁటిమియుఁ జుట్టములు మెచ్చుకులగౌరవమును మకరందుని పట్ల నుండుటచే నప్పటిరాజు లనేకులు తమతమకన్నియలఁ గానుకలతోఁగూడ మకరందునికాళ్ళపైఁ బడవేయుటకు సిద్ధముగ నుండిరి. చక్కఁదన మున్న కన్నియకు విద్దియ యుండదయ్యె. చక్కఁదనమును విద్యయుఁ గలపడంతికి సత్కులప్రసూనత గలుగదయ్యె. చక్కఁదనము విద్యయు సత్కులప్రసూనతయుఁ గలయెలనాఁగకు నైశ్వర్యము లేదయ్యె. చక్కఁదనము విద్య సత్కులప్రసూనము నైశ్వర్యము గలమగువ బౌద్ధమతద్వేషి యగుక్షత్రియునికన్యక యగుచు వచ్చె. క్షత్రియకన్యను దనకుమారున కిచ్చి పెండ్లిసేయుటకుఁ జంద్రప్రభాదేవికిని సుదర్శనునకు నిష్టమే; కాని యారాజులు తమతమకూఁతుల నెటిఁగియెఱిఁగి బౌద్ధరాజనందనునకిచ్చుట మంచిదగునా కాదా యని శంకింపఁ జొచ్చిరి. అదియునుం గాక మకరందుఁడు విద్యావ్యాసంగము గలిగి తనకాల మంతయుఁ బండితగోష్ఠియందును గ్రంథపఠనమందును గడపుచుఁ దన పెండ్లిమాటఁ దలపెట్టక తల పెట్టినవారి కుత్తర మీయక రాజకన్నియలచిత్తరువులఁజూచి మెచ్చక మెచ్చునట్లొరులకుఁ జెప్పక చదువు పై విసువు దోఁచినపుడు సాములం జేయుచు సాముల పై విసువు దోఁచినపుడు చదువుచుఁ దనహృదయ మెవ్వరికిం దెలియకుండ వర్తించు చుండెను. అందుచేతఁ దల్లిదండ్రులు కుమారుని వివాహవిషయమునఁ గర్తవ్యము నిశ్చయింపఁజాలరైరి.

ఇట్లుండ మకరందుఁడు ముఖ్యమంత్రి యగురత్నసేనునింగూడి రాజకార్యములమీఁద విదర్భకుం బోవలసి వచ్చె. చంద్రప్రభాదేవికి మకరందునివెనుక నిరువురుబిడ్డలు పుట్టి బాల్యమునందె మృతినొందుటం జేసి యామె గారాబుకొడుకు నెడబాసి యుండలేనిదయ్యు భర్తృప్రేరణమున నియ్యకొనవలసె. సుదర్శనుఁడును దనయనుంగుఁగుమారు

నదివఱ కెన్నఁడును విడిచి యుండకపోవుటచే వదల లేక వదల లేక బిగ్గఁ గౌఁగిలించి ముద్దాడి మంత్రిచేతిలోఁ జేయి వైచి యప్పగించి సమరముల ముక్కాకలఁ దేఱిన మెఱియలవంటిబంట్ల నూరుగురను గుఱ్ఱపుతౌతుల నేఁబదుగురను మదపుటేనుంగులఁ బదింటిని వెంటఁ దోడ్కొని పొమ్మని కళ్యాణవిధి యనుభద్రజాతిగజము పై గొడుకును మంత్రి నెక్కించి యాశీర్వదించి పనిచెను.

తొమ్మిదవప్రకరణము.

మానవులకు జ్ఞానాభివృద్ధి కేవలగ్రంథపఠనంబువలనమాత్రమే కాక ప్రయాణమువలననయిత మగును. శాస్త్రజ్ఞానవాసన లేని మూర్ఖుని కైన దేశాటనము మిక్కిలిలోకానుభవమును గలిగించు నన శాస్త్రజ్ఞానముఁ గలపండితుల కదిచేయుమే లింతింత యని వర్ణింప వశమా కూపస్థ మండూకమువలెనున్నచోటు విడువక తా మున్నచోటె సర్వప్రపంచ మనియుఁ దా మెఱిఁగినదే సర్వజ్ఞాన మనియు విఱ్ఱవీగు కించిజ్ఞులొక్కసారి దేశాటనముం జేసిన వారియభిప్రాయములన్నియు వింతగ మారక పోవు. ఈశ్వరునియౌన్నత్యముఁ దెలుపుకొండలను, పరమేశ్వరునిమహిమమువలెనే దట్టములై దుర్గమము లగుమహారణ్యములను, సర్వేశ్వరునిదయారసమునలె ప్రవహించునదులను, గ్రమంబున నెక్కి కడచి దాఁటి పయనములు సేయువారిమనోవికాస మెంత విస్తారముగ నుండునో యది పయనములు జేయనివా రెఱుంగుట కష్టము. నరుఁడు విదేశంబులకుఁ బోయి యచ్చటి జనుల యాచారంబులు వేషంబులు భాషలు మతములు నచటిరాజులపరిపాలనాపద్ధతులు శాసనంబులు గ్రహించి తమదేశంబున నున్న వానితోడం

బోల్చి చూచికొనిన యెడలఁ దన వారలయందలి దోసంబులు కొండ వవానియందలి గుణంబులు నద్దమునందువలె మనంబునకు విస్పష్టముగఁ బొడకట్టు. అందుచే దేశాటన మవశ్యకర్తవ్యము.

మకరందుఁడు తండ్రిని వీడ్కొని యుజ్జయినీనగరంబు వెడలి పరివార సమేతుఁ డయి విదర్భకుం బోవుచు మార్గమధ్యమున సృష్టివైచిత్ర్యములఁ గని యచ్చెరువడుచు నాటవికుల యమాయకత్వమునకుఁ బల్లియలనుండుజనంబుల వెంగలితనంబునకుఁ జింతిల్లుచు నెడనెడఁ జెట్లనీడల విడిది సేయుచు నచ్చటిసెలయేళ్ల తియ్యనినీళ్లం ద్రావి నిష్కలుషము లయిన వాయువులం బీల్చి చెట్లం దమయంత పండినపండ్లఁ దిని సుఖించి మహానగరములలో నంతఃపురములలో వసియించు జనంబులకన్న జనపదంబులఁ గుటీరంబుల నుండుజనంబులె యెక్కుడుసుఖము ననుభవింతురని మనంబునం దలంచుచుఁ బయనముం జేసి పదునైదు దినంబులలో విదర్భాపురంబుం జేరె. చేరి తాఁ రాక రాజవాహనునకెఱింగించి పుచ్చుటయు నతఁడు వారి గౌరవింపఁ దన జ్యేష్ఠకుమారుఁడగు మేఘవాహనునిం బనిచె. మేఘవాహనుఁడును సముచితపరివారముతో మకరందు నెదుర్కొని గౌరవించి యొక్కరమ్యసౌధంబు విడిదిగా నేర్పఱచి వారియుపచారార్థము తగుసేవకుల నియమించి చనియె. మాళవకులు పయనపుంబడలికలఁ దీర్చికొనుచు మూఁడుదినంబులు గడపిరి. నాలవనాఁడు రాజవాహనునిమంత్రులలో నొక్కఁడు జయంతుఁ డనువాఁడు మకరంద రత్నసేనులం గనవచ్చి యిట్లనియె. "రాజవాహన మహారాజుగారు మీ రాకకుం గత మెయ్యదియో యెఱింగి రమ్మని నన్నుం బుత్తెంచిరి. అది నాకు వినుపింపఁబోలు నేని వినుపింప వేఁడెద. అంతిపురమున రాజుగారికిఁ గడుం గూర్చు బాలిక యొక్కరిత జ్వరపీడిత యయి యున్నది. ఆకారణంబున నృపాలుఁడును బందుగులును మనస్తిమితము లేక యున్నవారు. అందుచేఁ బ్రస్తుతము

రాజుగారు మీసందేశార్థముల విని తగినయుత్తరంబుల నొసంగఁజాలమని మీతో మనవిచేయుమనిరి. ఆబాలికకు దేహారోగ్యము గలుగునంతవఱకు మీరు మాయిచ్చుసత్కారంబుల గ్రహించి యిం దుండవలయునని ప్రార్థించు చున్నారము." అనవుడు రత్నసేనుఁడు జయంతునితో నిట్లనియె. "అయ్యయో! మీమహారాజుగారికి మనస్స్వస్థత లేనిసమయమున వచ్చి మేమపరాధంబు గావించితిమి. సిద్ధార్థుని యనుగ్రహముచే రాజపుత్రిక సుచిరకాలంబున స్వస్థచిత్త యగుఁగాక. మావచ్చినపని మీ కెఱిఁగింపరానిది కాదు. ఎల్లలంగూర్చి మాకును మీకునుం గలవివాదమును దొలఁగించుటయట్లు కాక మరలఁ బరిష్కరించుటకై వచ్చితిమి. ఇది యసమయ మగుటచే సమయ మగువఱకు మే మిచ్చటనే యుందుము. ఈనడుమ మారాజకుమారుఁడు విదర్భాపురంబునం గలవైచిత్ర్యంబులఁ గనుంగొనుచుఁ బ్రొద్దులంబుచ్చుచుండు. వ్యవహారముం గూర్చి ప్రసంసించుటకుఁ గాక యూరక మీమహారాజుగారిని సందర్శించుటకు మేము మూఁడు దినములలో వత్తుమని మనవిచేయుము." అని పలుక జయంతుఁడు "సరే మంచిదట్లే సేయుఁ"డని రాజకుమారునియొద్దను రత్నసేనునియొద్దను సెలవు గైకొని చనియె.

మఱునాఁడు మకరందుఁడు నగరంబుఁ జూడవలయునని రత్నసేనునిం గూడి యొక్కయరదంబు నెక్కి బయలుదేఱి విదర్భరాజసేవకులు దారి జూపఁ బలుతావులకుఁ జని యాపురవైచిత్ర్యంబులం గని సంతసించి సేవకులతో "భీమరాజు తొల్లి పాలించిననగర మిదియేకదా! ఆనాఁటిచిత్రంబు లేవైన నిప్పుడున్నయెడల వానిం జూపఁ గలరా!" అని పలికెను. అట్లే చేయుఁగలమని యాసేవకులు వారిఁ గొంతదవ్వు దోడ్కొనిపోయి యొకయుద్యానవనముఁ జూపి వేలెపెట్టి "దేవా! యిది యే విదర్భరాజపుత్రి యగుదమయంతి విహరించిన యుద్యానవనము.

ఇచ్చటనే నిషధరాజుపాలినుండివచ్చిన రాయంచతనచుట్టుపుటంచులతోఁ గలిసి వ్రాలిన దఁట. ముద్దులు మూటగట్టు నాయంచపలుకులు విని నలుని పై గాటంపువలపు నిలిపి దమయంతి పువ్వులుకానిహాళాహాళికి వెఱచి యీపువ్వుటీరముననే చిగురుసెజ్జలపైఁ బన్నుండి వెన్నెలరేలు నిదుర లేక గడపినదఁట. చెలికత్తియలం గూడి యాదమయంతి జలకేళిసలిపినకొల నిది యఁట." యని యాయాతావులఁ జూపి వారికి మనఃప్రమోదంబు గలిగించిరి. ఆనెలవులం జూచి మకరందుఁడు భారతంబునఁ దాను జదువుకొనిన నలదమయంతుల చరిత్రంబుల జ్ఞప్తికిఁ దెచ్చికొని సమ్మోదితుఁడై విడిదికిం జనియె.

రత్నసేనుఁడు మఱునాఁడు మకరంద సమేతుఁడై రాజవాహన మహారాజును జూడ నరిగి ద్వారికులచేఁ దమరాక తెలిసి కెఱిఁగింప జయంతుఁడు వచ్చి వారిని గౌరవించి "బాలిక దేహస్థితి సరిగ లేదు. మహారాజుగారు చింతాక్రాంతులై యచట గూర్చున్నవారు. రండి చూతురుగాక" యని లోనికిం గొంపోయి యిరువుర పేర్లు రాజునకుం దెలిపెను. రాజును మెల్లఁగఁ బీఠమునుండి లేచి వారి నెదుర్కొని నేనుం బడిగి యుచితపీఠములపైఁ గూర్చుండ నియమించెను. అచటనున్నవా రంద ఱొండొరులతోఁ బలుకక యూరకుండిరి. రాజు దీనాననుఁడై యెద్దియో చింతించుచుండె. ఆయవస్థం జూచి రత్నసేనుఁడు మకరందునితో రహస్యముగ "కుమారా! నీవు వైద్యశాస్త్రపారంగతుఁడ వని ప్రసిద్ధిగలదు. ఈబాలిక కేదేని దగుచికిత్స నీవు చేయఁజాలవా?" యన మకరందుఁడును "వారు నాకామెం జూపిన పక్షమున నా యోచిన చికిత్స యొనర్చెద" నని పలికెను. అప్పుడు రత్నసేనుఁడు రాజవాహనున కభిముఖుఁడై యి ట్లనియె. "దేవా! యీబాలకుఁడు గట్టివైద్యుఁడు. ఈతనికి రానివిద్దియ లేదు. ఆయుర్వేద మితనికభిమానవిద్య. 'పరోపకారార్థ మిదం శరీరం'. మ్మను న్యాయమును బట్టి తాను

రాజనందనుఁ డయ్యు గరువంబు లేక తెగులుగొంటు లగునిఱుపేదల యిండ్లకుఁ బోయి వారల కుచితంబుగ మందు లిచ్చి పథ్యపానంబుల కై వారలకు ధనముసయితమిచ్చి వారిరోగంబుల మాన్పుచుండును. ఈబాలిక నీతనికిఁ జూపిన నీతఁ డోపినసాయంబు జేయఁగలఁడు. ఎంతలెంతలు జాడ్యంబుల నైన నీతఁడు చేతితోఁ దీసివేసినట్లు కుదుర్చు ప్రజ్ఞగలవాఁడు". అనుటయు రాజుంబరివేష్ఠించి యున్నసభ్యులందఱు నాటిలేసిచక్కఁదనంబును జక్కఁదనంబునకుం దగినప్రజ్ఞయుఁ బ్రజ్ఞకుం దగినపరోపకారచింతయుఁ గలయాపురుషసింహునివంకకుఁ దమకనులంద్రిప్పి చూచి యచ్చెరు వందసాగిరి. రత్నసేనునిపలుకులు రాజవాహనునిచెవులకు నమృతధార లట్లుపచరించి యెంతోయాస గొలుపుటం జేసి వానిమొగము వికాసవంత మయ్యె. మన స్సుత్సాహసమేతమయ్యె. దేహంబు మరల దార్ఢ్యవంత మయ్యె. జయంతుఁడు మొదలగువారు బాలికను మకరందునకుఁ జూపుమని త్వరపెట్టిరి. అప్పుడు రాజవాహనుఁడు పీఠమునుండి లేచి మకరందునిచేతులు పట్టికొని "నాయనా! వయసున నాకన్న నెన్నియోయేండ్లు చిన్న వయ్యు బుద్ధిం బెద్దవు. అందుచే నిన్ను వేఁడుకొన్నం దప్పు లేదు. నాబిడ్డకుం బ్రాణదానంబు చేసి మమ్మొకడరి జేర్చు" మని వేఁడుకొనియె. మకరందుఁడును వానిప్రార్థనమున మనస్సుకరఁగ లేచి వినయమున "దేవా! నేను కించిజ్జ్ఞుఁడను నన్నింత వేఁడికొన వలదు. నాయోపినయుపకారంబు చేయుదు. జాడ్యంబు తెఱఁగెఱుంగఁ జేసి నాకా బాలికను జూపుఁ డని పలికె. అనవుడు రాజవాహనుఁడు "జ్వరమే దానిని బీడించుచున్న రోగము. దానిమేనిమీఁద వడ్లగింజ వేసిన పేలగింజ యగుచున్నది. దాహంబునకు మితియు మేరయు లేదు. మాపులు కంటికిఁ గునుకన్న మాట లేదు. రెండుదినములనుండి సన్నిపాతము ప్రవేశించినది. ఒక్కమాఱు చూచితివేని యన్నియు నీవ యెఱుంగఁగలవు. రా రమ్ము

పోద మని యాతనిని రత్నసేనుని దనమంత్రి యగుజయంతుని వెం టఁబెట్టుకొని లోనికిం జనియె.

పదియవప్రకరణము.

"అమ్మా! నీనిమిత్తము క్రొత్తవైద్యులు వచ్చియున్నారు. కన్నులు విప్పి యొకసారి యిటుచూడు తల్లీ" యని రాజవాహనుఁడు బాలికమంచమునొద్దకుఁ బోయి పిలిచి చేతితో లేపెను. "నాకు రోగము లేదు వైద్యు లెందుకు? నేను నాయూరికిఁ బోవలయును. నన్నుం బోనిండు. నేనిఁక నిచ్చట నుండ నని పలికి యబ్బాలిక సన్నిపాతవశమున నొడ లెఱుంగక లేవంబోయెను. అప్పు డిరువురు చెలికత్తెలు మెల్లగ నామె నూరడించి పండుకొనఁబెట్టిరి. పోతబోసిన బంగారుబొమ్మవలె నున్నయాసొగసులాడిచక్కఁదనంబునుగనుంగొని మకరందుఁడు తనలో "నిది మనుష్యాంగన యగునా! ఈజగన్మోహనాకార కెంతపాడురోగము వచ్చినది. కటకటా! యీమె బ్రదుక దేని జగ మరణ్య మగును. మధ్యమలోక మలంకారశూన్య మగును. ఇది నిజముగ బంగరుబొమ్మయే యన వచ్చు. ఏలయన నీయుష్ణముచేత మేను చిక్కినను వన్నె యించుకయుఁ దఱుఁగ దయ్యె" నని తలంచి యామెస్థితిఁ గనిపెట్టుట కెడమచేయి పట్టుకొని నాడింబరీక్షించి నాలుకయుం గన్నులు శోధించి రాజవాహనుని వెండియుం గొన్నిప్రశ్నము లడిగి స్థితిం జక్కఁగఁ గనిపెట్టి యౌషధము నంపెద నని చెప్పివిడిదికిం జని జామున కొక్కమాత్ర వేయు మని కొన్నిమాత్ర లంపె. ఆమాత్రలయం దెంత పటుత్వమున్నదో కాని యవి ప్రయోగింపఁబడినది మొదలు బాలికమేను తేలికగ నుండెను. ఆమందు వేసినమొదటినాఁటిరాత్రి నిదుర పోవ కున్నను బాలిక తనలోఁ దాను గొణఁగుకొనుట

మాని యూరక పండుకొనియె. రెండవనాఁటిరేయి నించుక నిదురించె. మూఁడవనాఁడు తెలివిగలిగి యడిగినమాటల కుత్తరములిచ్చె. నాలవ నాఁటిరాత్రి నలుజాము లొడలు మఱచి నిదురించె. అయిదవనాఁ డాఁకలి యాఁకలి యని యాహారం బడిగె. ప్రతిదిన ముదయమందును సాయంకాలమునందును మకరందుఁడు వచ్చి యాబాలికఁ గనుంగొని యనుపానభేదంబులతో నాయౌషధంబునే నడుపుచుండె. ఆఁకలి మిక్కుటముగ నగుటచే నాఱవనాఁడు వైద్యుఁ డామెకుఁ బథ్యము పెట్టించెను. అనంతరము క్రమక్రమంబున నాబాలిక యన్నహితము గలిగి యారోగ్యస్థితి నొందఁజొచ్చెను. వైద్యుఁ డుదయముపూఁట వచ్చుటమాని సాయంకాలమునందె రానారంభించెను. ప్రాతఃకాలమునందు వైద్యుఁడు రా నందున కామె యించుక మనఃఖేదమునందుచు సాయంకాలమం దాయన వచ్చినప్పుడు తనదేహస్థితినిగూర్చి చెప్పిన మాటయే మరలఁ జెప్పుచు నడిగినప్రశ్నయే మరల నడుగుచు వాని నెంతసేపో నిలుపుచు వచ్చెను.

ఒకనాఁడు సాయంకాలము మకరందుఁడు బాలికను జూచుటకు వచ్చునప్పటికి రాజవాహనమహారాజు మంత్రులతో నేవిషయముననో కార్యాలోచనము చేయుచు నాతని వెంటలోనికి రాఁడయ్యె. అప్పుడు బాలికయొద్ద నలువురు చెలికత్తెలుమాత్ర ముండిరి. ఇరువురు పురుషసేవకులు మకరందుని లోనికిం దోడ్కొని పోయిరి. అతఁడాపూఁట చాల తడ వచ్చుటనుండి యొకమాఱు కుడిచేయియు నొకమా ఱెడమచేయియుఁ బట్టికొని నాడిఁ బరీక్షించి పథ్యపానములంగూర్చియు నిద్రాదివిషయములంగూర్చియు వినువానికి విసువు గలుగునట్లు ప్రశ్నలడుగఁ జొచ్చెను. బాలిక వాని కన్నిఁటికి విసువుగొనక యొక్కింత సిగ్గుపడుచుఁ బ్రత్యుత్తరము లిచ్చెను. సూర్యాస్తమయమయి చీఁకటులు గాఢముగఁ గ్రమ్ముటచే మకరందుఁడు తనవిడిదికిం బోవలయు నని పయ

నపుడు కా నాముద్దుగుమ్మ చెలికత్తెలలో నొకదానిం బిలిచి "కృసీ! కల్పలతా! ఇంకను గొంచెముసే పిచ్చట నుండి నా దేహస్థితిని సమగ్రముగఁ బరీక్షింపు మనుము. ఇట్లు విడిదికింబోవ వేగిరపడుటకుఁ బ్రియజన మెవ్వరు లేరుగదా" యని చెప్ప నప్పలుకులు విని మకరందుఁడు సంతసించి "మాకు మీకన్నఁ బ్రియజన మెచ్చటను లేదు. ఎంతసే పున్నను మీసన్నిధి నుండనే మనసగుచున్నది. ప్రొద్దుపోవుచున్నది గావున నే నింక చనక తప్పదు. రత్నసేనుఁడు నారాక కెదురుచూచు చుండును. కాని యీమెకు దేహారోగ్యముసంపూర్ణముగఁ గలుగుటచే నేను తేవటినుండి యిక్కడకు రా నక్కఱ లేదు. కావలసియున్నపుడు వచ్చెద" నని లేచి యావలకుఁ బోయి పురుషసేవకులు మార్గముం జూప విడిదికిం జనియె.

ఆపలుకులు వినినతోడనే బాలిక మొగంబున వైవర్ణ్యముతోఁచెను. చెలికత్తెలు మందుదెచ్చి పుచ్చుకొమ్మని ప్రార్థింప నామె పుచ్చుకొనక యెవ్వరితోడం బలుకక పండుకొని కొంతసే పిటటు పాన్పుపై దొర్లి యెట్టకేలకు నిదురవోయెను. నిదురలో రెండుసార్లు మకరందుఁడా! మకరందుఁడా! పోకుపోకుమని పలవరించెను. మఱునాఁడుదయమున రాజపుత్రికని దుర మేల్కని చెలికత్తెలతో నెప్పటియట్ల పలుకక విచారాక్రాంతయయి యుండె. తల్లియు రాజవాహనుఁడు నాదినమున నామెం జూచి యట్లుండుటకుఁ గారణ మే మని నొక్కి యడిగిరి. ఏమియు లే దని బాలిక యుత్తర మిచ్చె. సఖీజనంబుల నడుగ వారు తమ కేదియుం దెలియదని బదులు చెప్పిరి. బిడ్డ మఱునాఁడు నత్తెఱంగుననే యుండుటచే వెండియు మకరందుని బిలువనంపి యామెస్థితిం జూడుమని ప్రార్థించె. మకరందముఁ గనుంగొని తద్దయు సంతసించు తుమ్మెదవలె మకరందుని గనుంగొని యాయిందువదన మహానందము నొందె. ఎక్కడిరోగ మక్కడ నంతరించె. మొగము

వికాసవంత మయ్యె. అదిమొదలు మకరందుఁ డచ్చటనున్నన్నినాళ్లు రెండుపూఁటలు నామెంజూచుచుండెఁ. ఎందుచేతనోయెంత కాలమున్నను మకరందున కాయూరు విడిచిపోవుట కిష్టము కలుగ దయ్యె. కాని రత్న సేనుఁ డుజ్జయినికిం బోవలయు నని నిశ్చయించుకొని తమవచ్చిన వ్యవహారంబు బరిష్కరింపు మని రాజవాహనునిం ద్వరపెట్టెను. రాజవాహనుఁడును సుదర్శనునిబలపరాక్రమాదులకు వెఱచియో మకరందుఁడు చేసినయుపకారముఁ దలఁచియో యదిన్యాయ మనినమ్మియో వివాదకారణము లగుగ్రామముల సుదర్శనున కిచ్చుట కొడంబడిరత్నసేనమకరందులం బిలిచి యెంతయు గారవించి వారికిఁ బలుపసదనము లిచ్చి యిట్లనియె. "నాయనా! మకరందుఁడా! నీవు మాబాలికను మృత్యుముఖమునుండి తెచ్చి మాకప్పగించితివి. నీమేలు మేముమరువజాలము. నాకృతజ్ఞతను మీతండ్రికి విన్నవించి గ్రామము లిచ్చితి నసుము. మనరాజ్యములు రెండు నప్పచెలియండ్రవలెఁ కలహములేక వర్ధిల్లుగాక!" యని యతఁడు వారల వీడ్కొన మకరందుఁడు బాలిక యొద్దకుం బోయి తన పయనంబు నెఱిఁగించి యామెను మరలదుఃఖ సముద్రమున ముంచెను. అతఁడును వదలలేక వదలలేక యామెను విడిచి మఱునాఁడు రత్నసేనునిం గూడి సపరివారముగ నుజ్జయినికిం బోయెను.

పదియొకండవప్రకరణము.

"కర్పూరమంజరీ! కర్పూరమంజరి! ఏమమ్మా యెన్ని పిలిచి నను బలుకవు? నీస్థితి యేమియు బాగులేదు! అన్నము తిననే తినవు. తినిన నాలుగుమెదుకులు మునుపంటఁ గొఱికెదవు. జేలు కన్ను

మూయనే మూయవు. మూసినఁ బలు తెఱంగులఁ బలువరించెదవు. అడిగినదాని కుత్తరం బొసంగవు. ఒసఁగిన నవ్యవస్థితముగాఁ బలికెదవు. ఏసుఖంబును గోరవు. ఏముచ్చటం దలంపవు. నీ కిదురంతసంతాపము గలుగుటకుఁ గారణమేమి? ఇది దయ్యమో భూతమో పిచ్చియో దేహపీడయో మనోవ్యాధియో మే మెఱుఁగఁజాలకున్నారము. శరీర సంబంధమగు పీడ యయ్యెనేని దానికిఁ దగు చికిత్సలఁ జేయవచ్చు. మనోవ్యాధికి మందులేదందురు. కాని మనసిచ్చి చెలికత్తెలంగోఁ జెప్పుకొన్న మనోవ్యాధులు నయిత్తము మానును. కావున నీ మనస్తాపము మా కెఱుంగఁ జేయుము. అమ్మా! వడగాల్పులఁ గెందిపోవు తీఁగవలె నీవెంతకాల మీతాపముచే నీరీతిని శోషిల్లెదవు? వెన్నెలకు వడదగులు నీమేనేమి యిట్టివిధంబున నిద్రాహారములు లేక కృశియించుటయేమి?

అని యనుంగుఁ జెలికత్తియ లిరువు రొకనాఁడు కర్పూరమంజరిఁ జేరి యడుగఁ జొచ్చిరి. కర్పూరమంజరి యాపలుకుల వినియు విననట్టె యూరకుండెను. ప్రియసఖులిరువురు నామె హృదయశల్యమగు నాయంశ మేదియో విస్పష్టముగా వినఁగోరి తమకో నామె యావృత్తాంతముఁ జెప్పెడుదాఁక విడువఁగూడదని నిశ్చయించుకొని మరలమరల తఱచి తఱచి యామె నడిగి యెంతకుం జెప్పకున్న నెట్టకేలకు విసువున నిట్లనిరి

"ప్రియసఖీ! మేము నీకుం గడుదరివారమయినను సీవది యేమోకాని మమ్ముం బెరవారిగఁ జూచుచుంటివి. నిన్నుం గనుటయే మీతలిదండ్రులవంత యయ్యెనుగాని పెంచుట మాతల్లులవంతయయ్యెను. నీవు పుడమిపైఁ బడినదిమొదలు నిప్పటిదనుక నిన్ను మే మొకనాఁడు నెడఁబాసి యెఱుఁగము. ఆఁట లాఁడుకొనుట నేర్చిననాఁటుగోలె మన మొండొరులకు సుఖదుఃఖములఁ జెప్పుకొనుచున్నారము. మాకన్న నెక్కుడగునాప్తులు నీకుండరని నాయభిప్రాయము. తల్లిదండ్రు లెఱుఁగకుండ మఱుఁగు చేయవలసిన చాటుమాటలు రాజకన్యకలు చెలిమి

కర్త్రింతోఁ జెప్పుకొందు రని విను చుందుము. ఒకవేళ నీమనోగతరహస్యంబుల నీవు మాకెఱింగించినచో నవి బట్టబయలు చేయుదు మేమో యని నీమనంబున ననమ్మిక యుండవచ్చును. పసితనంబుననుండి మా స్వభావమును జక్కఁగ నెఱింగిననీతో స్వవిషయమున మే మేమియుఁ జెప్పుకొన నక్కఱలేదు అయిన నవస్థాంతరము నొంది నీవిప్పుడు విమనస్కవై యుండుట నించుక చెప్పవలయును. మేమునోటనువుగింజ దాఁగనివారము కాము. ఎక్కడిమాట లక్కడ మఱచువారము. మా చెవిలోఁ బడినమాట పెట్టెలోఁ బెట్టినమాట. ఇంకను నమ్మిక చాల దేని నీగుట్టుమట్టులు వెలిబుచ్చుమని చేతిలోఁ జెయివైచి బాసలు చేసెదము." అని చెలికత్తియలగు మల్లికయుఁ జంద్రికయు నొక్కొక్క యడుగ నాచక్కెరబోఁడి ప్రత్యుత్తరం బొసఁగక యూరకుండుటయను చిత మని మెల్లన నిట్లనియె.

"ఓసీ మల్లికా! చంద్రిక మొదటినుండియు వెఱ్ఱిబాగులదియని నీవెఱుంగుదువు. దానికి వెఱ్ఱియెత్తిన నీకు వెఱ్ఱియెత్తినదా? మీపయి నాకపనమ్మిక యెన్నఁడు లేదు. ప్రపంచమున నాకు మనసుగలసిన సంగడికత్తియలు మీరు దక్క వేఱొకరులేరు. ఈమాటమీ రెఱుంగుదురు. అడవిలోఁ బుట్టి యడవిలోఁ బెరిఁగి యడవిలోనే జీర్ణమగు పువ్వులతెఱంగున నాకోరికలు నామనంబునఁ బుట్టి యచటనే పెరిఁగి యచటనే జీర్ణము కావలసినవి కాని యొరులకుం దెలియఁజేయఁ దగినవి కావు. ఏమందు నేని నాకుం దండ్రి దగ్గఱలేఁడు. తల్లి యస్వతంత్రురాలు. నాకు నారాపుఁజెలిమికత్తెలగుటచే నామనోరథంబుల నొడఁగూర్చవలయు నని మీరు యత్నించెదరు; కాని యది మీకు సాధ్యముగాదు. ఈఁగ బ్రాణకంఠ మీరు సంరక్షణ చేయఁగలరు. నా కిట్టివేళ తెగులు వచ్చినప్పుడు ఔషధంబువల్ల నివురయుం గూఁడును మానుకొని యుపచారంబులు చేయు మన్నఁ జేసెదరు. నాకై వగవ

మన్న వగచెదరు. కావలసినపదార్థంబులఁ దెమ్మన్నఁ దెచ్చెదరు. వేయేల? ప్రాణము లిమ్మన్న నిచ్చెదరు. అంతియ కాని దుస్సహంబు లగునాపదల నెట్లు సహింపఁగలరు? దుర్గమంబు లగుతావుల కెట్లు పోఁగలరు? దుర్లభంబు లగువస్తువుల నెట్లు తేఁగలరు? నాయులమట మీకుం దెలుపుట మిమ్మును జింతాపరవశలుగఁ జేయుటయే కావున నన్ను మీరడుగవలదు. ఇట్లంటి నని నాపై మీ రలుకఁబూని మొగంబులు ముడువవలదు."

అనవుడు మల్లిక యామె దేహావల్లిక పైఁ జేయి వైచి "సఖీ! మేము నీకు సుఖదుఃఖసమాన మయినజనముగదా. మాకన్న మీ కార్చువారును దీర్చువారు నుండరు. చెప్పకున్న మాతోఁడే సని" యని యొట్టు పెట్టుకొనియె. చంద్రికయుఁ జెప్పుదువా చెప్పవా యని పలుమా ఆర్తియడుగఁ జొచ్చె. తనగుట్టును దా నెంత దాఁచఁదలంచినఁ జెలిమికత్తియలు దాఁచనీయ రనియుఁ దనకుఁ జెప్పక తప్పదనియుఁ దెలిసికొని కర్పూరమంజరి ప్రాణసమాన లగుచంద్రికామల్లికలతోఁ దనవృత్తాంతముఁ జెప్ప నిశ్చయించియు నొకమాఱు సందేహించి యొకమాఱు సిగ్గుపడి యొకమాఱు నన్నేంటికు పీడించెదరే యని సఖులం గసిరి యొకమాఱు తనకథ చెప్పఁబూని నాలుక చిపరవఱకు మాట రానిచ్చి పైకి వెడలనీయక యాఁచుకొని యెట్టకేలకు నెచ్చెలుల వేఁడికోలు మిక్కుటం బగుడు నిట్లనియె.

"అమ్మయ్యా! నా దారిని నన్నుండనీయక పీడించుటకు నాకు మీ రెక్కడ దాపురించిరే. నే నేమని చెప్పుదును? మీరు లోకజ్ఞాన మెఱిఁగినజాణలు కదా! నే నేమో యనుకొంటి మీ తెలి వింతేనా? ఇంత కాలమునుండి చూచుచు మీరు నా యులమటకుం గారణ మూహింప రైతిరా? ఎలజవ్వనంబున నివ్వటిల్లు పువ్వుబోండ్లకు మన స్సంతాప హేతువు లెవ్వియో యెఱుఁగ రెఱింగినవే. నెచ్చెలులారా!

చల్లకే, వచ్చి ముంత దాఁచుటయేల? చెప్పఁదలంచియు సిగ్గుపడఁ దగదు. మాళవరాజనందనుం డగుమకరందుఁడు నా దేహరోగంబునకుఁ బలె మనోరోగంబునకును దగుచికిత్సలం జేయఁగలాఁడు. మీచేత నగు నేని నాకె తెఱంగున నైన నాసుదర్శనకుమారునిదర్శనము చేయింపుఁడు. ఆ రాజహంసముం గనుంగొనిన నామానససరోవరము శోభావంత మగు. అతనిముఖచంద్రబింబముం జూచిన నానెమ్మనంబునఁ గ్రమ్మినదుఃఖాంధకారంబు నశియించు. ఆఘనునికృపావృష్టుల నీమేని పరితాప మడఁగు. సఖులారా! వేయేల? నాకతనితోడిదియే లోకము. నా మనోవ్యథ సమగ్రముగ మీ కఱిఁగించితిఁ గావున మీకుఁ బోలిన తెఱంగున నావగఁ బాపఁ బ్రయత్నింపుఁడు.

అని కర్పూరమంజరి సందియంబు విడిచి తనమనోవైకల్యకారణమును మఱుఁగు లేక యనుంగుఁజెలులకు నెఱుంగఁ జేయుటయు నప్పుడాసఖులిరువురుఁ గడుసంతసించి యామెకుం దమయందుఁ గలవిశ్వాసమునకు మెచ్చి తమసఖికి మకరందునిపొందెవ్విధంబున సమకూరునని యాలోచింపఁ దొడంగిరి. అట్లు నాలుగైదు నిముసంబులు వారు చింతించిన పిదపఁ గర్పూరమంజరికి వినంబడునట్లు చంద్రిక మల్లికతో నల్లన నిట్లనియె. "ఓసీ మల్లికా! ఈమె మనోరథము దుర్లభము గాదు. ఏమంటేని యామకరందుఁ డెంతటిచక్కనయ్య యయినను వాసి కట్టి పెక్కులాడి యెక్కడ లభించును? మన చెలిని మనము మెచ్చఁగూడదు; కాని యింతటి యందకత్తియ యీనాఁటి రాచకన్నియలలో నెందున్నదే! ఒకవేళ చక్కనిపడంతు లున్నా రనుకొనుము. వారి కీవిద్దియ జాణతనంబు లెక్కడివి? కావున మన నెచ్చెలిమనోరథంబు మకరందుఁ డెఱింగినచోఁ గన్నులఁ గప్పుకొని మహాప్రసాద మని యామెను బరిగ్రహించు. ఈమెం గాంచినదిమొదలు మనసులో నతఁ డెంత నుఱుఁగుచున్నవాఁడో యెవ్వఁ డెఱుఁగు? కావున

దీనికిం దగినప్రయత్నముఁ జేసిన మనము కార్యసిద్ధిఁ గాంచఁగలము. అనవుడు మల్లిక చంద్రికతో నిట్లనియె. "ఓసీ!నీవు చెప్పిన దంతయు నిజమే. కాని నామనంబున నొక్కసందియంబు బాధించుచున్న యది. కర్పూరమంజరి సుక్షత్రియ కన్య; మకరందుఁడు బౌద్ధుఁడు. వధూవరులు భిన్నమతస్థు లగునపుడు వారి కలయికకుఁ దలిదండ్రు లనుమతింతురో లేదో" యని శంకించు చున్నాను.

ఇట్లు నెచ్చెలు లిరువురుఁ దమతమ యభిప్రాయంబులు దెలుపఁ గర్పూరమంజరి మల్లికాచంద్రికల నూరకుండుఁ డని యిట్లనియె. "మల్లికా! నీవు చెప్పినది నిక్కువంబు.తలిదండ్రులుమాసమాగమమున కనుమతింపరు. ఒకవేళ యెట్లయిన మెడలు విఱిచి కాళ్లవ్రేళ్లం బడి బ్రతిమాలి వారి నొప్పింతుమనుకొనుము. మకరందుఁడుమనకునులభుఁ డెట్లగును? మీ రేమనుకొంటిరో కాని యతఁడు సామాన్యుఁడు కాఁడు. ముక్కంటికంటిమంటల బ్రుగ్గనిమన్మథుఁడు. మచ్చ లేనియచ్చఁపుఁ జందమామ. ఆతనితలిదండ్రు లనుమతించినమాత్రమున రాజాధిరాజులు వెల లేనికానుక లిచ్చి తమకూఁతుల వానిపాదారవిందములపైఁ బడవేయరే!అతఁ డొడంబడినమాత్రమున నీనాఁటిరాజకన్యక లందఱు పరుగుపరుగునవచ్చివానిపాణిగ్రహణంబు చేయరే ? అతని బిగియారు కౌఁగిటం బెనఁగెడు భాగ్య మెన్నినోములు నోచినదానికి లభించు. అతనికి రాణియై పూఁబోఁడియెంత యదృష్టవంతురాలు కావలయు అతనియడుగులకు నూడిగంబు జేయుటకైన నేను దగను. నేనెక్కడ యతఁ డెక్కడ ? నక్కయెక్కడ, దేవలోక మెక్కడ ? నాయాసలు వట్టివె. అయిన మీరు నావలపులమాట మాపెద్దలకింతలోఁ దెలియఁ జేయ వలదు." అని మఱియు నేదియో పలుకఁబోవు చుండ నచ్చటి కంతఃపురపరిచారికలలో నొకర్తు వచ్చి తల్లి రమ్మనుచున్న దని కర్పూరమంజరిం బిలచెను. అప్పు డాముగ్గురుఁ దమవిస్రంభసంభాషణమును గట్టిపెట్టి లోనికిం జనిరి.

పండ్రెండవ ప్రకరణము.

"అది యొక మోహషోడశకళాపరిపూర్ణమగుచంద్రమండలమో తెలిసికొనుట ప్రయత్నసాధ్యమయ్యెఁ గదా. అదియంగనయో జాళువాపసిండిబొమ్మయో నిర్ణయించుట సులభసాధ్యముగాదు. అవికన్నులో కృపారసమకరందమ్మును జిమ్ము నెత్తమ్మిఱేకులో నిర్ధారణచేయుట యెంతకష్టము. అది చిఱునగవో నిండువెన్నెలయో నిశ్చయముగా నెఱుంగ నలవియగునే? అహాహా ఆపడఁతుకను గడుపారఁ గాంచినతల్లిదండ్రు లేమిపుణ్యము చేసిరో? అది మనుష్యాంగన యగునో కాదో యని నాకిప్పటికిని సందియంబు గలుగుచున్నయది. అది నిక్కముగ మానవాంగన యయ్యెనేని మానవజాతియుమధ్యమలోకమునుధన్యత నొందినవి. ఈవఱకు నేనెందఱినో సుందరాంగులను సందర్శించితిఁ గాని యీమందయానఁబోలు నిందువదన నెందునుఁ గనుంగొనియెఱుంగ. అది యేమో కాని కాంతలకును భోగములకును పరాఙ్ముఖుండనైననామనసాపడంతిని గనుఁగొనినది మొదలు దానియొద్దనేయుండును గానియెంత త్రిమ్మరించిన వెనుకకు మరలదు. చదువులు సాములుం దక్క తక్కిన గొడవలకుం బోనినేను నిద్రాహారంబులు విడిచి తెగులులేని బాధలం బడుటఁజూడ నాలో నాకె సిగ్గగుచున్నది. గ్రంథపఠనముపై మనసు పోదు. పొత్తముం దెఱచి యొకపంక్తియైనం జదువఁజాల. మోహపరవశుండ నగుటచే నాకిప్పుడు ప్రపంచమంతయుఁ గర్పూరమంజరీమయమై తోఁచుచున్నది. సువర్ణమయ మగునామెనామమే కాని యొండు పేరు నానోటికిరాదు. మెఱుపుఁదీఁగఁబోలునామెవిగ్రహమే కానిమఱి యేపదార్థమునామనంబునకుఁబొడకట్టదు. మధురములై మనోజ్ఞములై మార్దవంబునకుతావులై వెలయునామానినిమాటలుముద్దులమూటలై యిప్పటికిని వినంబడుచున్నవి. నీస్థితి యిట్టు లున్నదేమని వేమాఱు

తలచితలచియనుగుబంధుమిత్రులప్రశ్నంబుల కుత్తరంబులొసంగ లేక కడు విసికిపోవుచున్న వాఁడ. ఇది లోలోపల నెంతదాఁచినను దాఁగునది కాదు. నేనిప్పుడేమిచేయుదు? మనసునిలువదు. మన్మథుఁడూరకుండఁడు మానిని కడుదవ్వున నున్నది. దవ్వుననున్న దననేల? దాపుననున్న మాత్రమున నా కాయిందువదన సులభ యగునే? మతభేదముచేతనే మాయిరువురసమాగమము దుర్లభము అది యట్లుండ నవనిలో నవతారమందినచక్కఁదనంపుముద్ద యగునాముద్దియ యెక్కడ? నేనెక్కడ నావంటివానిపై నామెవలపు నిలుపునే. ఆరాజవదన యేరాజనందనుననుగ్రహించి యానందవార్ధినోలలాడింపఁదలఁచి యున్నదో ఆమెను చెట్టబట్టుభాగ్యము గలుగువానికిఁ ద్రిలోకసామ్రాజ్యాధిపత్యమేల? అతనికి నరలోకంబె నాకమగు. నట్టడవి నందనంబగు వేయేల. ఆమెయే నాప్రాణము. ఆమె తల్లిదండ్రు లనుమతింపకున్నను సరే నాజననీజనకులు వారించినను సరే యామె నన్ననుగ్రహించునేని నే నామె కేలు బట్టక మాన. నావెఱ్ఱియే గాని నన్నా బాలిక యనుగ్రహించునే? ఏల యనుగ్రహింపకపోవు? ఆమెకును నాకును జరిగినకలయికల తెఱంగు చక్కఁగా నరసి చూచిన నాపై నామె వలపు నిలిపినదనియే తోఁచుచున్నది. నేనెంతసేపామెసన్నిధిని గూర్చున్నను నన్నింకం గూర్చుండుమని యామె వేఁడుకొనుట, పథ్యపానంబు లడుగునెపంబున నెడ తెగక నాతో మాటలాడుట. నేను సమక్షమున నున్న కాలమున వికసితముఖారవిందయై సుఖంబుగ నుండుట, నేను నాడీపరీక్ష జేయుటకై కరస్పర్శనంబు చేసినపుడు కన్నులుమూసికొని స్పర్శసుఖ మనుభవించుట, నేను రెండు దినంబు లంతిపురమునకుఁ బోవుటమానినపుడామె యెవ్వరితోడం బలుకక యస్వస్థయై యుండుట మొదలగులక్షణంబులన్నియుం బరికింప నాయందామె బద్ధానురాగయైయున్నట్లు సిద్ధాంతముచేయవలసియున్నది. అయ్యయో! మోహపరవశులగుపురుషులు

తమకామించినకాంత లేపని జేసిన తమనిమిత్తమే చేసిరని తలంచుట లోకప్రసిద్ధమే కదా? మం దిచ్చుటకు చికిత్సకుఁడు వచ్చినప్పుడు రోగి మాటలాడుట యరుదా? దౌర్బల్యముచేత రోగులు కన్ను మూసికోనరా? పథ్యపానంబులఁ బలుమాఱడిగినమాత్రమున నేయన్యథా తలంపవచ్చునా? అఁడువాండ్రమనోగతంబులఁ దెలియ నెవ్వరివశము? ఒక కారణంబున నామె చేసినచేష్టలు పలికినపలుకులు మఱియొక కారణంబున నయ్యె నని నేను సరిపెట్టుకొను టుచితముకాదు. అందుచేత నా సిద్ధాంతము నిప్పుడు పూర్వపక్షము చేసికొనవలసియున్నది. ఇంత యేల? అంతంతచను విచ్చి నాతోడ నాబాలిక పలికినప్పుడునామనోరథంబు నెత్తెఱంగుననైన విన్నవింపక యూరకుండుట నాతప్పు. ఆమె చెలికత్తెలలో నెవ్వతెనైనం జేరి నామనోరథంబు జెప్పనైతి. నాఁటి రాత్రి నన్నింకఁ గొంతసేపుండు మని యామె యడిగినప్పుడు వల్లె యని యచ్చట నుండనైతి. ఉండిన నేమిచెప్పనోకదా? ఆమె రాజవాహనున కెట్టిచుట్టమో యడిగి తెలిసికొననైతి. ముగమోటగలవానికి మోక్షమెట్లులభించు? లేనిపోని రాచగోటులకుంబోయి యప్పుడూరకుండి యదను దప్పినవెనుక నిట్లు విచారించిన నేమిఫలము? నా సిగ్గునకుం దోడు నా కేపనియుం దోఁచకుండునట్లు రత్న నేఁడుపురికిం బోవుద మని నన్ను ద్వరపెట్టె."

అని యొకనాఁడు సాయంకాలమున మకరందుఁడు తనలోనం జింతించుచు మేడపై నొక్కఁడుఁ గూరుచుండె. అప్పుడప్పుడే యుదయించిన చందమామతెనచల్లనికిరణములగవాక్షమునుండిమకరందునిపైఁ బ్రసరింపఁజేసి మదనతాపసంతప్తమైనయాతని దేహమునకు శైత్యోపచారము చేయఁబూనుకొన్నట్టు కానఁబడెను. సిప్రానదీజలకణంబులతోడంగలసినమందమారుతములువానిమేనుసోఁకియొక్కమాఱు హాయిహాయి యనిపించెను. ఆసమయంబుననతఁడు కన్నులుమూసికొని

దేవి నుపాసించు పరమయోగివిధంబునఁ గర్పూరమంజరీదేవీసుందర
విగ్రహంబును మనంబున ధ్యానించుచు నామెసంభాషణంబులందలం
చుచు భోగసమాధిలో నుండె. అప్పుడు కాషాయవస్త్రములు గట్టు
కొన్న యొకబ్రాహ్మణకుమారుఁడు మేడపై కెక్కి యడుగులచప్పుడు
గాకుండ మెల్లమెల్ల నడచివచ్చి మకరందునిప్రక్క నిలువంబడియె.
ఆవిప్రకుమారుఁడు వచ్చినజాడనైన నెఱుంగక మకరందుఁడుసమాధి
లోనే యుండుటం జేసి యాతఁడు తనచేతితో నల్లన మకరందునివీఁపు
పైఁ దట్టెను. తట్టుటయు నారాజకుమారుఁడు ద్రుళ్ళిపడి లేచి యెవ
రువా రని పలుకరించి కన్నులు దెఱచి చూచి "యోహో! చంద్ర
చూడుఁడా! మిత్రుఁడా! యిట గూరుచుండు" మని చెప్పిమరలంగన్ను
దోయి మూసికొనియె. మున్ను దా నెన్నఁడు వచ్చినను బవ లనక
రేయి యనక సమయ మనక నసమయ మనక తన్నెంతయు గౌర
వించి తనమాటల కత్యంతము సంతసించుమకరందుఁడు తనరాక కల
రకఁ గన్నులు మూసికొనుటయు వానినెమ్మొగంబు నిట్టూర్పుసెగల
చేఁ గలుష మగుటయు మేను కృశత్వంబు నొందుటయు నవలోకించి
చంద్రచూడుఁడు తనమనంబున నిట్లు విచారించె.

"విదర్భనుండి వచ్చినవెనుక వీనివైఖరి యింతమార్పు జెందు
టకుం గారణమేమి? చక్కఁగాఁ బోలిచిచూడ నీతనికి మన్మథగ్రహము
సోఁకినట్లు తోఁచెడును. చంద్రప్రభాదేవియు సుదర్శనమహారాజును
వీనియునికికిం గారణ మరయలేక కళవళముపడు చున్నవారు. కావున
వీని నడిగి తత్కారణము దెలిసికొని సమయోచిత మగుకార్యముజర
పించెదను" అని విచారించి యతఁడు మరల మకరందునిపైఁ జేయి
వైచి "చెలికాఁడా! నీ విట్లుండుటకుఁ గత మేమి? తొల్లిటియట్లు
మన సిచ్చి నాతోడం బలుక వేమి? చదువులపొంతఁ బోవేమి?
సాములవంక జూడవేమి! పండితులతోఁ బ్రసంగింప వేమి? అచటి

విశేషంబు లేను వినఁదగనా?" యని చిఱునగవు నవ్వుచు నడిగెను. మకరందుఁడు వాని పలుకులు విని "మిత్రుఁడా! విదర్భాపురమందుఁ జెప్పఁదగినవిశేషంబు లెవ్వియు లేవు. ఎవ్వియేని యున్న కాలక్రమంబున నీకుం దెలియకపోవుగదా" యని బదులు చెప్పి యూరకుండె.

తనచెలికాఁడు మనోగతవృత్తాంతమును దనకుఁదెలియఁజేయుటకు సందియము నొందుచున్నవాఁడని గ్రహించి చంద్రచూడుఁడు తనవచోనైపుణ్యము తేటపడ నిట్లనియె. "మిత్రుఁడా! విదర్భలో విశేషములు లేవని చెప్పినంతమాత్రమున నమ్ముటకు నేనంత వెంగలినా? పసివానినట్లు నన్నుఁ గన్నుఁ బ్రామఁ దలంచెద వేమి? విదర్భానగరము సంగతి నేనెఱుంగుదును. కాని నిన్నమొన్న కన్నులుదెఱచిన పిన్నవాఁడవు నీవే మెఱుంగుదువు? నేను నీకన్న వయోజ్యేష్ఠుఁడనగుటచేతఁ గొంతవఱ కెఱుంగుదును. ఆనగరంబున స్త్రీలు నిలిచియున్న మనుష్యులు నిలిచి యుండఁగనే నగమగునట్లు చేయఁగలరు. తలలు మార్చి తలలు పెట్టఁగలరు. వారిమాయ లెట్టివియో యెఱుంగము గాని శరీరములోఁ బదిలముగ నున్న హృదయము నైన నపహరింపఁగలరు. అంతటి నెఱజాణ లెందును లేరు సుమీ. స్త్రీలే యింతటిసాహసములు చేయ నింక నచ్చటిపురుషు లెంతసాహసులోఁ జెప్ప వలయునా?" అనుటయు మకరందుఁడు మందహాసము చేసి తనగుట్టుజాడ నెఱింగి చంద్రచూడుఁడు నర్మగర్భముగా నట్లు పలికి యుండఁబోలు ననుకొని "మిత్రుఁడా! నీమాటలయాథార్థ్యము దృష్టాంతములు చెప్పి ఋజువు చేయవలయుఁగదా!" యని పలికెను. అనవుడు చంద్రచూడుఁడు దృష్టాంతముల కేమి కొదువ. నాకు నీవే తార్కాణమువు. నీమేను మునుపటియట్లు లేదు. నీవు చిక్కి సగమై నీశరీరార్ధమును విదర్భలో విడిచి వచ్చితివి. నీతల మునుపటితల గాదు. అది క్రొత్త తలఁపులతో నిండియున్నది. విదర్భనుండి వచ్చినవెనుక నీహృదయము నీయొద్దనే

లేదు. నీవు ప్రకాశముగా నీసంగతులు చెప్పకొనకపోయినను నాపలుకులు నిక్కువములో యనృతములో నీమన స్సే యెఱుంగు. నీగుట్టు నీవెంత దాఁచినను నీమోహమువై వర్ణ్యము నీమేని కార్శ్యము నీవిమనస్కత చెప్పుచున్నయది. నీవు బహిఃప్రాణము నగు నా కారహస్యంబు తెలుపుదు వేని నేను నీకుం దోడ్పడియెద" నని యుత్తరము చెప్పె.

అప్పుడు మకరందుఁడు సంతోషముతోఁ దనపీఠమునుండి లేచి చంద్రచూడుని కౌఁగిలించుకొని "చెలువుఁడా! నీపలుకులు నిక్కువములు. విదర్భదేశస్త్రీలు నెఱజాణలె. అందొక్కతె నాహృదయము నపహరించినమాట సత్యము. సిగ్గుపెంపున నిన్నినాళ్ళు నాగుట్టు నీకు వెలిఁబుచ్చనైతి. అంతియ కాని నీవు పెఱవాఁడ వని కాదు. నీవు నాకు సాయమై నా మనోరథసిద్ధి గావింప వలయు" నని తానువిదర్భ కరిగినది మొదలు వెండియు నుజ్జయినికి వచ్చువఱకు వర్తిల్లిన యావద్వృత్తాంతము నెఱింగించి కర్పూరమంజరీసమాగమముగానిపక్షమున తన మేనం బ్రాణము లుండవని దృఢముగాఁ బలికెను. చంద్రచూడుఁడు ప్రియవయస్యుని పలుకులు విని వానిచిత్త మూఱడిల్లునట్లు సమయోచితముగఁ బలికి వారిరువురిసమాగమమునకై యుపాయమును వెదకుచుండె.

చంద్రచూడుఁ డెవ్వ రని చదువరులకు సందియముం దోఁచవచ్చును. అతఁడు మకరందునకు వేసకచెలికాఁడు. వానిపూర్వులు నాలుగుతరములనుండి యుజ్జయినీమహారాజులయాస్థానము నందువిదూషకులుగ నుండిరి. చంద్రచూడునితండ్రియగుగంగాచూడుఁడు హాస్యరసముయొక్కయవతారమని యానాఁటిప్రజలు చెప్పకొనుచువచ్చిరి. గంగాచూడుఁ డప్పటికి మూఁడేండ్లక్రిందట పరలోకగతుఁ డగుటచే సుదర్శనుఁడు వానికొడుకగుచంద్రచూడుని దనకొడుకునకు వేడుక

చెలికానిగా నొనర్చి కుటుంబమును బోషించుచుండె. మకరందుఁడును వాని చమత్కారవచనంబులకుఁ బలుమాఱు మాయురే యనిమెచ్చుచు విద్యావ్యాసంగములమీఁద విసువు దోఁచినప్పు డెడనెడఁ జంద్రచూడునిం బిలిచి మనంబునకుఁ బండువు చేసికొనుచుండును.

పదిమూఁడవప్రకరణము

శ్రీనగరము హిమాలయపర్వతమునకుఁ గడదాపున నుండుటచే నది యుదయకాలమున మంచుచేతం గప్పఁబడి దవ్వులనుండి చూచువారికన్నులకుఁ దెల్లనిమేలిముసుంగుచాటున డాఁగియున్న రాజకన్యకయట్లు భాసిల్లుచుండు. రాత్రి కురిసినమంచుకతంబున నేలయుఁ జెట్లు గొండలు తడిసి తమకుఁ గలిగినదోషసంపర్కంబుఁ బాపుటకై ప్రభాతసమయంబున సంపూర్ణస్నానము చేసి నిలిచెనో యన్నట్లొప్పె. సిగ్గుపెంపున ముసుంగు మఱుఁగున నడఁగి యున్నపడంతి ముఖారవిందమునుఁజూచు తమకంబున నాయకుఁడువచ్చి తనకరంబున గవిసెనఁ దొలఁగఁద్రోసినట్లు పద్మినీనాయకుఁడగు భాస్కరుఁడు పొడుపుఁగొండపైఁ దోఁచి తనసహస్రకిరణంబులతోఁ బురలక్ష్మినిమఱుఁగు చేసినమంచుగవిసెనను గ్రమక్రమంబునఁ దొలఁగించుచుండు మంచుముసుంగు జాఱినతోడనే లేయెండయలముటయుఁబురలక్ష్మి కుసుంభవస్త్రముఁగట్టుకొని నిలువంబడినచెలువంబునఁ గానంబడియె. సూర్యోదయానంతరమున నగరమును దత్ప్రాంతభూమియు నిర్జీవస్థితిలోనుండి జీవస్థితికి వచ్చినట్లు లుండె. అట్టివేళ నొక్కనాఁడు కాశ్మీరరాజకులతిలక మగు హేమచంద్రుఁడు కాల్యకృత్యముల నిర్వర్తించి యెప్పటియట్లు సముచితవస్త్రాలంకారములు ధరింపక కొలువుకూటంబునకుం

జనక తనయంతిపురమున నొక్కగదిలోఁ జింతాక్రాంతుఁడై యొక్కపీఠమునఁ గూర్చుండెను. విషాద మెట్టిదియో యెఱుంగకయెల్లప్పుడుకలకల నవ్వుచుండు హేమచంద్రుని మొగంబువిలాసంబు దప్పియుండుట జూచి యంతిపురంబునఁగలపరిజనులు కారణము తమలోఁదారూహించియుఁ దెలియఁజాలక రాజును డాసి యడుగుటకు సాహసింపక వెలవెలఁబోవుచుండిరి. నరపాలుఁడు తొంటియట్లు యుక్తయకాలమునఁ గొలువుకూటమున కరుదెంచి తమ్మలరించు నని నమ్మి ప్రధానులు దండనాయకులు సామంతులు చుట్టములు రాయబారులు సహజీవులు లోనగు నియోగిజనంబులు వాని రాకం బ్రతీక్షించుచుండిరి. రాజెంతసేపటికి రాకపోవుటయు వానికడనుండి వర్తమానమేమియుఁ దెలియకపోవుటయు సభాసదు లందఱుఁ గారణ మరయలేక కలవలపడుటయుఁ జూచి ముఖ్యమంత్రి యగుమణివర్మ రెండవమంత్రి యగుమాధవసేనుని వెంటఁబెట్టుకొని కారణమరయుటకై యంతిపురికిం జనియె.

వారిరువురుం జనునప్పటికి రాజుపక్కఁ బురోహితుఁడగునిగమశర్మ గూర్చుండి వాని నూరడించుచుండెను. వానిముఖవైఖరి నవలోకించి మంత్రు లిరువురు నతఁడు గాఢసంతాపమునం దప్తుఁడై యున్నవాఁడని గ్రహించి దురాత్ముఁడైనచిత్రభానునికుట్రలవలన వాని కేదేనపాయము వాటిల్లి యుండదు గదా యనితలపోసి వానిని సమీపించి నమస్కరించి యెట్టయెదుట నిలిచిరి. హేమచంద్రుఁడు వారిని జూచి కూరుచుండుమని చేసన్నఁ జేయ నమాత్యు లిరువురుం గూరుచుండిరి. అనంతరము నాలుగునిమిషము లూరకుండి మణివర్మ నిగమశర్మనుద్దేశించి మెల్లఁగ "ఆర్యా! మహారాజుగారివిషాదకారణమేమి?" అని యడిగెను. నిగమశర్మయుఁ దనపీఠము మణివర్మ యాసనంబునకుం దగ్గరగా జరపుకొని మెల్లగ నిట్లనియె.

"ఆర్యా! మహారాజుగారి సోదరుఁడు చిత్రభానుఁడు కాల

ధర్మము నొందెనని తెలిసినది. ఏదోకృతంబున నీనడుమఁ గొనిస్పర్థలు గలిగినను మహారాజుగారికి భ్రాతృస్నేహ మతిశయముగ నుండు టచే వారిప్పుడు మిక్కుటముగఁ గుందుచున్నారు." అనవుడు మణి వర్మ యక్కలియక్కజంబున రిచ్చవడియె. మాధవసేనుఁడునోటమా టలేక తెల్లఁబోయె. మహారాజుకన్నుదమ్ములనుండి బాష్పములువిడిచి నిట్టూర్పుపుచ్చె. అప్పుడు మాధవసేనుఁడు తనమనంబున "నహహా! సోదరుఁడననీమహారాజే సోదరుఁడు. తనప్రాణంబులు తీయఁదలంచిన తమ్ముఁడు మృతినొందినప్పుడు మహోపకారమైనదని సంతసించుటకు మాఱుగ నతఁడిట్లు విచారించుచున్నాఁడు. ఇతఁడుధర్మముయొక్క యవతారమనవచ్చును గాని కేవలమనుష్యుం డనవచ్చునే" యని తలపోసి నిగమశర్మవంక మొగముద్రిప్పి "అయ్యా! ఇది యథార్థ మగునో కాదో మీరు చక్కగ నరసినారా! కుడిచి కూర్చుండి ప్రొద్దుపోవక యేదిపై నేని చెడువార్తలు వేయుదురాత్మ లనేకు లుందురు. ఇదియు నట్టివారిపన్నుగడ కాదుగదా" యని పలికెను. "వృత్తాంతమును దెచ్చినమనుష్యుఁ డెవ్వఁడో యెఱింగింతు రేని మనము దాని యాథార్థ్యము నిర్ణయింపవచ్చు" నని మణివర్మ నుడివెను.

ఆపలుకులు విని నిగమశర్మ యిట్లనియె. "అమాత్యులారా! యెఱుంగుదురుకదా మననగరమున కుత్తరదిక్కు. సింహగిరి యను పేరంబరఁగుకొండయుండుట. ఆకొండలోఁ బడమటివైపుననొకగుహ కలదు. ఆగుహాయందు ప్రస్తుతము హరిశర్మ యను బ్రాహ్మణోత్తముఁ డొకఁడు శిష్యసమేతుఁడై తపంబు చేసికొనుచున్నాఁడు. పాండిత్య మేమని పొగడ. తనయిల్లాలివాదోడు లేనిచతుర్ముఖుఁడు. ఎంతశాంతము. ఎంతదాంతము. ఎంతదమము. ఎంతశమము. అతనిమొగంబుఁ జూచిన సకలకలుషంబు లడంగు. ఆతఁడు రెండుమాసములక్రిందట వచ్చి యాగుహాలో విడిసియున్నాఁడు. పాలు పండ్లు భక్షించును

గాని యన్నము తినఁడు. అవిప్రైన నెవ్వరేని సమర్పించి యారగింపుఁ డని బతిమాలినం గాని మెసవఁడు. జ్యోతిశ్శాస్త్రమున రెండవబృహస్పతి. జాతకసిద్ధాంతముహూర్తభాగంబులయం దతని కతండెసాటి. బ్రహ్మవ్రాఁతకైనం దప్పుచున్నది కాని వానిపెట్టినముహూర్తంబునకుఁదిరుగులేదు. మంత్రశాస్త్రమున మహాపాదుకాంతసిద్ధిఁ బడసినవాఁడు. వరమిచ్చి చేపట్టినా సన్యాసిని సార్వభౌమునిం జేయఁగలఁడు. బిట్టలిగి తిట్టినా బిడరాజుని బిచ్చగానిం జేయఁగలఁడు. అతనివాక్సిద్ధి యెట్టిదియో కాని వైద్యులకు ధనమిచ్చి చికిత్సలు చేయించుకొనఁ జాలనివారు పేదలు వేనవేలు మననగరంబు నుండియు నీచుట్టుపక్కల నుండు పల్లియలనుండియు వచ్చి ప్రతిదినము వానియడుగుల సేవించి తమ రోగంబులం గుదుర్పుమని ప్రార్థింప లోకానుగ్రహార్థమై యతఁడించుకసేపు తపముచాలించి రోగులమొఱలువిని మంత్రతీర్థమిచ్చుచుక యిచ్చి మోహాజాడ్యంబు నిశ్శేషంబుగా హరియింపఁబడుఁగాక యని వారిం బంపుచుండు. ఆనాటితోనే వారి పీడ యంతయు నశియించు. అతనిమాట యమోఘమైయుండును. నాపార్శ్వవాసిశిష్యులలో నొకఁడు చెప్పె. ఇది నిజము. దీని విషయమున మీరు సందేహింపఁ బని లేదు." అని పలుకుటయు మాధవశర్మ "ఆఁ దేవప్రసంగవశమున మీ కిదారుణవృత్తాంతంబు నెఱిఁగించె" నని యడుగ నిగమశర్మ తత్సందర్భము నిట్లెఱిఁగించె.

"హరిశర్మయొక్క మహామహిమలు కర్ణాకర్ణి వినినయమ్మహాత్ముని సందర్శించి జన్మంబు చరితార్థంబు కావించికొనవలయునని తత్సన్నిధికరిగి రాజపురోహితుండనని నన్నెఱిఁగించికొన్న పిదప నన్నమ్మహాత్ముఁడు మీ రా జెవ్వరని యడిగె. రామచంద్రసహోదరుఁ డగు హేమచంద్రుఁడు మా రాజచంద్రుఁ డని నేను విన్నవించితిని. అప్పు డాయనశిష్యులలో నొక్కఁడు నావంకఁ జూచి, పాపమునుండభాగ్యుఁ

డగుచిత్రభానునిసోదరుఁ డితఁడే కాఁడా" యని నన్నడిగెను. నాఁడు హరిద్వారమందు గంగాతీరమున మారేడుచెట్టుక్రింద మృతినొందిన రాచకుఱ్ఱవానిసోదరుఁడేనా యితఁడని హరిశర్మ యాశ్చర్యముతోఁ బలికెను. ఆమాటలు విని మేను గడగడవడంక నేను హరిశర్మను స్వామీ! యిది నిక్కమేనా యనియడుగ నతఁడొక్కనిమేషమూరకుండి యయ్యా నిక్కమే ప్రపంచసంబంధములైనగొడవలెల్లవిడిచి జనులరొదలతో నిండియుండు పట్టణంబులఁ బల్లియలఁ గాఁపురముండుటమాని యంతరంగంబునం బరమేశుం బ్రతిష్ఠించిపర్వతగుహలలో గాలక్షేపముచేయుచున్న మేము ప్రజల కిట్టిదారుణవార్తల నెఱిఁగించి దుఃఖమును గలిగింపరాదు. మీరాజునకుఁ గాలక్రమంబున నీ వార్త దానంతటదియే తెలియఁగలదు. నీవు మామాటలుగ మహా రాజుతో విన్నవింపవలదని నొక్కి వక్కాణించెను. కాని దేవరవారి యందు నాకుం గలపరమభక్తిచే మనసుండఁబట్టక నే నది నివేదించి తిని. అది నిజ మనియే నాకు నమ్మకము."

అని నిగమశర్మ యెఱిఁగింప నందబద్ధమేదియునుండదని మంత్రు లిరువురు విశ్వసించిరి. హేమచంద్రుఁడు కన్నదోయినుండి యశ్రుజలంబులు జొటఁజొటఁగార వెచ్చనియూర్పులం బుచ్చుచు "నమాత్యులారా! నేను భ్రాతృద్రోహిని నాచేసినదుర్ణయంబునం గాదె యాగర్భశ్రీమంతుఁడై విక్రమసేనునిగారాపుఁగొడుకై సౌఖ్యంబు లవ్వారిగా ననుభవించినయువరాజు కానిదేశంబుల దిక్కుమాలినపక్షియై యస్తమించె. ఎంతలెంతలో నేరములను క్షమించిననేను నాతుచ్ఛప్రాణముపైఁ గలయభిమానముచే వాని నిల్లు వెడలనడచితిని. అదివఱ కున్న శాంత మంతయు దిగమ్రింగినట్టియామాయకోపము నాకెటనుండి వచ్చెనోకదా? వేనవేలు సేవకులకు నియామకుఁడైన యతఁడు తన యవసానసమయంబున నెంత చింతించెనో! నన్నేమనిదూఱెనో! విధి

పరిపాకంబున కెంతవగచెనో యాపరమేశ్వరుఁడే యెఱుంగు! ఆదారుణ వచనంబులు వినినప్పుడు పరమపతివ్రత యగునిందుమతి నన్ను శపియింపకుండునే? బాలిక యగుకర్పూరమంజరి పితృవియోగంబున గుందునెడ ముద్దులు మూటగట్టునామెనెమ్మొగ మెంతచిన్నవోయెనో. మహారాజకుమారుఁడై విక్రమసేనునిమనుమఁడై భూచక్రంబుఁ బాలింపఁగలశుభలక్షణంబులంగూడుకొనిన విజయసేనుఁడు తండ్రిలేనిబిడ్డఁడయ్యెనే. అచిన్నపాపలకుఁ దండ్రిలేనివెలితి యెట్లుతీఱుఁ. మహీమండలాధిపత్యంబు సమర్పింపనీ, మేరుపర్వతంబు పెఱికి తెచ్చి ముందుబెట్టనీ, వారితండ్రిని మరలఁ దేఁగలమే? అది వట్టిమాట. నాయెదుటనుండి లేచిపోయిన యేదేశంబుననైన సుఖంబుగ బ్రదికి యుండునని తలంచితిఁగాని యింతలోఁ దమ్మగుట్ట యిట్లగునని కలలోనైనఁ దలంపనైతి. మహానుభావుఁడగుహరిశర్మయొద్దకు నన్నుఁ దోడ్కొనిపొండు. నాయనుజునిచరమావస్థం జూర్చి నేను స్వయముగా నడిగి తెలిసికొందు" నని యూరక వాపిడిచి పగవఁజొచ్చె.

పదినాలుగవప్రకరణము.

సింహాగిరి శ్రీనగరమున కుత్తరముననుండెను. తొల్లి నారాయణుఁడు నరసింహావతారమెత్తి లోకకంటకుఁడగు హిరణ్యకశిపునిఁ దెగటార్చి ముజ్జగముల కభయప్రదాన మొసంగియు దుష్టదానవుని మరణానంతరమునఁ గూడఁ గోపావేశ ముపశమింపకపోవుటచే లోకములనెల్ల భస్మపటలము గావింప నుంకించెననియు బ్రహ్మాదిదేవతలు భయకంపితులై వానిపాదరాజీవములకు మ్రొక్కి యవతార ముపసంహరింపుమని ప్రార్థింప నాతఁడు కృపాళుఁడై యాగిరియొద్దనే తనయవతా

రమునుజాలించె ననియు స్థలమహత్త్వమునెఱింగినకోవిదులాకాలమునఁ జెప్పుచు వచ్చిరి. అందుచేత నాగిరికి సింహగిరి యనుపేరు గలిగె.

శ్రీనగరప్రాంతమున నిప్పుడు సింహగిరి యనుపేరం బరఁగు కొండయులేదు. చుట్టుప్రక్కలఁ గలకొండల కట్టిమహిమలు గలవని చెప్పుకొనువారును లేరు. ఆగిరిలో నొకగుహ కలదు. అది యెక్కువ నిడివియుఁ దక్కువ వెడల్పుగలదై కారుచీఁకటులకు నెలవై భయంకరమై యుండును. ఆసొరంగమునఁజొచ్చినజంతువు లన్నియు మృతినొందెనని జనులు చెప్పుకొనుటయే కాని బ్రదికివచ్చెనని యెన్నఁడు జెప్పుకొని యెఱుఁగరు. ఆబిలముమాపులునక్కకూఁతలతో ప్రతిధ్వనులిచ్చుచుండును: గాని పగలు నిశ్శబ్దమై యుండును. జనసంపర్కము రోసి యూరుబైటనే వసియింప నిచ్ఛగించుదిగంబరయోగులు క్షపణకులు మొదలగుమహాత్ము లప్పుడప్పుడు దానియందు విడియుటయు రెండుమూఁడుదినములందుండి చెక్కుచెదరక యవ్వలకుఁ బోవుటయు గలదు. మృత్యుముఖముఁ బోలునాబిలముఁ జొచ్చువా రెట్లు బ్రదికి బైటఁ బడిగని కొండఱుపౌరులకు సందియ మప్పుడప్పుడుతోఁచుచు వచ్చెను. కాని యందుఁ బ్రవేశించినవారిమహిమయే వారిం గాపాడుచు వచ్చెనని పెద్దలుతెలియఁజెప్పి యట్టివారిసందియములఁ బాపుచు వచ్చిరి.

అట్లు హేమచంద్రుఁడు సోదరవియోగమునుగూర్చికొండొక తడవు విలపించి తమ్మునినిజవృత్తాంతము స్వయముగ వినఁగోరిమంత్రి పురోహితసమేతుఁడై హరిశర్మకడకుఁ బోవఁ బయన మయ్యెను. అగుటయు నప్పుడు మణివర్మ పరిచారకు నొక్కనింబిలిచి "యోగీ మహారాజుగారు సింహగిరికిఁ బోవుదురు. అరదము నాయత్తముచేయుమని సూతునకుఁ జెప్పు" మని పనిచె. ఆమాటలు విని నరపాలుఁడు మణివర్మనుజూచి "ఆర్యా! పోవలసినతావు మహాపురుషసమక్షము.

మనల నచ్చటికిం గొనిపోవుపని భ్రాతృమరణము. కావున నిది యరదంబులు నందలంబులు నెక్కి యూరేగఁదగినసమయముగాదు" అని పాదచారియై మణివర్మయు, మాధవసేనుఁడు, నిగమశర్మయువెంటరా నిరువురుపరిచారకులు ముందు నడచి మార్గమునుండి జనులం దొలంగింప సింహగిరికిం జనియె. కాలినడకను జనుచున్న మహారాజునుగనుంగొని పౌరు లచ్చెరువడి యందలంబు డిగియెఱుంగనియాగర్భశ్రీమంతుని నడపించుచున్న మహాకార్య మేమైయుండు నని విచారించి కారణ మెఱుంగఁజాలక నిలువంబడి చూచుచుండిరి. అవ్విధంబునఁ గొంతసేపు నడచినడచి రాజు పరివారసమేతుఁడై సింహగిరిసమీపమునకుబోయి గుహాద్వారసమీపమునమూఁగియున్న వందలకొలఁదిజనుల జూచెను. ఆజనసమూహములో నొకఁడు మహాప్రభూ! నాకుఁ గుష్ఠవ్యాధి యనియు మఱియొకఁడు నన్ను రాజయక్ష్మము పిన్ననాఁట నుండియుఁ బీడించుచున్న దనియు వేఱొకఁడు నాకుఁ గన్నులు లేవు దృష్టిదయచేయు మనియుఁ బ్రార్థించు చుండిరి. ఆకేకలు విని రాజు మంత్రులతో "ఈమూఁగినజనంబునుంజూడ లోకములోనున్నరోగులందఱు నిచ్చటికె వచ్చినట్లుకనఁబడుచున్నారు. ఈకేకలా మహాత్ముని జపతపంబులకు నిశ్చయముగ విఘ్నముఁ గలిగించును. ఇతఁడు వీరితో నెట్లు వేఁగుచున్నాడో కదా" యని పలికి యామందలోఁ జొరఁబడి లోనికిం జనఁజాలక యచట నిలిచె.

ఇంతలో సేవకులు రోగుల నొత్తిగించిదారిచేయుటయు నిగమశర్మ మునుముందునడచి తెరువుజూప రాజు భృత్యామాత్యసమేతుఁడై గుహాద్వారముకడకుఁ జనియె. చని కృష్ణాజినముపై బద్ధపద్మాసనము వైచికొని కూర్చున్నవాని, రవంతయే నెడము లేకుండ మేనెల్ల విభూతి పూసికొన్నవాని, శతరుద్రాక్షమాలికలు వ్రేలుచున్న మెడ గలవాని, నగమునెఱసిన వెండ్రుకలు గలగడ్డమువాని, భక్తిమై

'ఓంహర ఓంహర' యని శివనామస్మరణము జేయువాని, శాంతరసమున కునికిపట్టగువాని హరిశర్మ యనువానిఁ జూచి వెల్లివిరిసినభక్తిరసము పెంపున హేమచంద్రుఁడు బ్రాహ్మణునకు సాగిలఁబడి మ్రొక్కెను. అమాత్యులు పురోహితుఁడునుంగూడ నమస్కరించియథారాజాతథాప్రజా యనువాక్యము సార్థకముచేసిరి. హరిశర్మకన్నులు మూసి మహేశ్వరధ్యానమునం దుండుటచేత రాజు నమస్కరించుటయు మంత్రులు మ్రొక్కుటయు నెఱుంగనే యెఱుంగఁడు. నిగమశర్మ హరిశర్మశిష్యులంజూచి "మహారాజుగారిరాక నెఱిఁగింపవచ్చునేని మీగురువుల కెఱిఁగింపుఁ" డని కోరెను. ఆ బాలకులు విని వలదువలదు. తపోనిష్ఠులగువారి నియమములకు విఘ్నములుగలిగించుటనుచిత మని వారించెను. అనంతరము కొంతవడికి హరిశర్మ తపస్సు చాలించి కన్నులు తెఱచి గుహ నలుదెసలు పరికించి కట్టెదుట నిలిచియున్న యపూర్వపురుషులం జూచి వీరెవ్వరని పూర్వపరిచితుఁ డగు నిగమశర్మ నడిగెను. అతఁడును "స్వామీ! వీరు కాశ్మీరదేశాధీశ్వరులగు హేమచంద్రమహారాజుగారు. మిమ్ము దర్శింపఁగోరి యిచ్చటకు విచ్చేసియున్నవా" రని ప్రత్యుత్తర మిచ్చెను. అదివిని హరిశర్మ "ఓహోహో! ఇతఁడేనా శ్రితజనచింతామణి. పండితజనకమలాకరప్రభాకరుఁడు. సత్పురుషసందర్శన మగుటచే నీదినము కడుసుదినము సుఁడీ" యని కొండొక ప్రశంసించి వారికందఱకు వ్యాఘ్రచర్మములు వేయించి కూర్చుండఁ బనిచి వెండియు నిట్లనియె. "మీరు రాక రాక వచ్చి మాకతిథులైరి. మీకు మే మేమిసపర్యలు చేయఁగలము? రత్నకంబళములపై నాసీనులగువారికిఁ బులితోళ్లు మౌక్తికహారంబులు ధరించువారికి రుద్రాక్షమాలికలు, మంచిగంధము బచ్చకప్పురముఁ బూసికొను వారికిఁ బూడిదయు, మరువము దవనముఁ దాల్చువారికి మారేడుదళములు సమర్పించుట మీవంటివారి నగౌర

వించుటయే. కావున మాయనాదరణమునకు మమ్ము మీరు మన్నింతురు గాక!"

అనవుడు హేమచంద్రుఁడు విప్రునకుం దనయెడఁగలగౌరవమునకు సంతసించి వినయంబును భక్తియు మనంబున నందడింప నాతనితో నిట్లనియె. "సరిసరి మీవల్లనా మేము సపర్య నపేక్షించుట. మీపాదరజంబు మాకిరీటంబులనంటనిచ్చుటయే మమ్ము గౌరవించుట. మీయడుగుఁదామరల సేవింపనిచ్చుటయే మమ్మాదరించుట. మీవలన నమోఘంబు లగునాశీస్సుల నపేక్షింతుము గాని రత్నకంబళములు మౌక్తికహారంబులు హరిచందనంబులు నపేక్షింపము. మీబూదిపిండి కట్లు మోక్షమార్గంబున కెక్కెడిసోపానంబులు. మీరుద్రాక్షమాలికలు ముక్తికాంత వలచి వైచినదామకములు. మామౌక్తికహారములు స్వయముగాఁ గంఠమునకుఁ దగిలించుకొనినయురులు. ఉదయము మొదలు సాయంకాలమువఱకు రాజనీతిపేర జగద్వంచనము చేయు రాజులు సంసారపుసంకెళ్ళు పిడఁగొట్టుకొని జపాసక్తులైన మీవంటి మునిరాజుల యెదుట నిలువనైన నర్హులె? మీదర్శనముచేత నేనును నాపితృదేవతలు పదితరంబులవారును నావంశస్థులును బవిత్రుల మైతిమి. మీరాకచేత గాశ్మీరదేశమే యనుగ్రహింపఁబడినది." అని రాజు ప్రశంస చేయ నిగమశర్మయు రాజుపలికిన దంతయు సత్యమని చెప్పి తనకుం దోఁచినట్లు తానును బ్రాహ్మణునికొంతసేపుకొనియాఁడి తనయేలిక వచ్చినపని విప్రునకు విన్నవింపఁదలఁచి వినయముతో "మహారాజుగారిసోదరుఁడు చిత్రభానుఁడు హరిద్వారముకడ కాలధర్మము నొందెనని విని యది నిక్కువమో లోకప్రవాదమో తెలియఁగోరి యాయన యిట వచ్చె" నని పలికెను.

ఆపలుకు చెవినిబడినతోడనే హరిశర్మ మొగము చిట్లించి కన్నులు మూసికొని "హరహరా! ఆమందభాగ్యునిదురవస్థ మరల

జ్ఞప్తికి దెచ్చుకొనుచుసివచ్చెనా?" యని రెండుకన్నులనుండి రెండు బాష్పబిందువులు విడిచి యొక్కనిముస మూరకుండి హేమచంద్రు నుద్దేశించి "రాజా! శివోదరవృత్తాంతము స్వయముగ నాముఖంబున వినవలెనని యిచ్ఛయున్నదిగావున నిదిగో చెప్పెద వినుము. సహజకోమలము లగుమానసములు చాలకాలముక్రిందట జరిగినవృత్తాంతములుజ్ఞప్తికి వచ్చినను శ్రోత్రగోచరమైనను కన్నులయెదుట జరిగినట్లు భావించుకొని దుఃఖసంతప్తము లగును. సీయనుజునిచరిత్రము మిక్కిలి దయనీయ మగుటచే దానిఁ దలఁచినంతనే దుఃఖము పుట్టినదనే నాకన్నుల నీరు వచ్చినది." అని పలికి వెండియువృత్తాంతమును మరల జ్ఞప్తికిఁ దెచ్చుకొనుటకుఁ గాఁబోలు నాలుగైదు నిముసము లూరకుండి పైకిచూచి యిట్లని చెప్పఁదొడఁగె. "నేను పరమశైవుఁడను. అందుచేత శివునిసాక్షాత్క రింపఁజేసికొనుటకై బాల్యకాలమున నాకు నాగురు వుపదేశించినపంచా క్షరీమంత్రమును బదిలక్షలసార్లు పునశ్చరణ చేసి యెంతకు మహేశ్వరుని బ్రత్యక్షము జేసికొనలేక తుదకొకనాఁడు మెడకుగండ కత్తెర బట్టుకొని మహేశ్వరా! నీవు ప్రసన్నుఁడవుగా వేని యిదే ప్రాణములు విడిచెద నని ప్రతినఁజేసి భోజనము మాని కూర్చుంటి. నాఁటి యర్ధరాత్రమున భక్తవత్సలుఁడగు మహేశ్వరుఁడు చిచ్చ కన్నుతోడను, చిలువపేరులతోడను, పులితోలుతోడను, బూఁచులబల గముతోడను, పూపచందురునితోడను,బూదిరేకలతోడను, తెల్లమేని తోడను, నల్లమెడతోడను నాకు సాక్షాత్కరించి నన్ను బుజ్జగించి కావలసినవరము వేడుకొనుమనియె. ఐహికములగుధనధాన్యాదిసంపదలు గోరక కైలాసంబుఁ జూడఁగోరుచున్నాఁడ. నన్నటకుఁ గొంపొమ్మని ప్రార్థించితి. అప్పుడు వల్లెయని నన్ననుగ్రహించి రెండుపసిఁడిపాదుక లిచ్చి కైలాసముఁ జూడఁ గోరిక పుట్టినప్పుడు వీని నధిష్ఠింపుము. అవియే నిన్నటకుం దెచ్చునని చెప్పి యంతర్హితుం డయ్యె. అనేకది

వ్యసంవత్సరములు తపంబులు చేసి చరితార్థులైనమహాయోగులకు దుర్లభుఁ డగుమహేశ్వరుఁడు నాకుం బ్రసన్నుఁ డగుటకు నాయందలి మహిమలు గాని వేఱు కావు. శ్రితజనపారిజాత మగునమ్మహాదేవునకు నాపైఁ బొడమిన నిర్హేతుకజాయమానకృపయే కారణము."

ఆమఱునాఁ డుదయమున నేను గాల్యకృత్యములు నిర్వర్తించికొని పరమేశ్వరుఁ డిచ్చినపాదుకలు దొడుగుకొని కైలాసంబునకుఁ బోవలయు నని మనంబున సంకల్పించి కన్నులుమూసికొంటి. ఆసంకల్పించుటయే యెఱుంగుదును గాని యవ్వల నేమైనదో యొక్కముహూర్తమువఱకు నెఱుంగ. ఒక్కనిముసములో నేను కైలాసంబున నుంటి. అచ్చటివైభవం బేమని వర్ణింప? అందఱు మూఁడుకన్నులు గలవారె. అందఱు శీతచందురుని దాల్చినవారె. అందఱుపులితోలు గట్టినవారె. అందఱు పాముకడియంబులం బెట్టినవారె. పసిఁడిపావలు దొడిగి టక్కుటిక్కు మని నడచుచు నేను మహేశ్వర సన్నిధికరుగుచుండ నమ్మహాదేవుఁడు నన్నల్లంతదవ్వులఁ గని సభామండపంబుగఁ దోడ్కొని రమ్మని నందీశ్వరుం బుత్తెంచె. మర్త్యములోకంబునుండి వచ్చిన మనుష్యమాత్రుని మహేశ్వరునంతవాఁ డంతగౌరవించుటం జేసి నాయం దేదోగొప్పమహిమ మున్నదని శంకించి బరివేష్టించిన వేలుపులందఱుఁ దలంచిరి. నందీశ్వరుఁడు నన్నెదుర్కొని కౌఁగిలించికొని చేయిపట్టుకొని దేవదేవునిసన్నిధికిఁ దోడ్కొనిపోయెను. శంకరుండును కృపారసపూరితంబు లగుచూపులతో నన్నుం గనుఁగొనినేను మరపి దేవసేనాపతియుఁ దనకు గారాపుకుమారుఁడు నగుకుమారస్వామిని బీఠమునుండి లెమ్మనియానతిచ్చి యాపీఠమున నన్నుం గూర్చుండఁ బనిచె.

అది ప్రాతఃకాల మగుటచే శంభుని సేవింప నచ్చటికి వచ్చిన మహేంద్రాదిదిక్పాలకులు దక్కినవేలుపులు బ్రమథగణంబులును

నన్నె చూడనారంభించిరి. అనంతరము భర్గుఁడు, కైలాస మంతయుఁ జూచిరమ్మని యానతిచ్చి నందీశ్వరుని దోడిచ్చి పంపెను. నేను నందుఁగల వైచిత్ర్యంబులనెల్ల మనసారఁగనుంగొని మరలివచ్చి భవునకు మ్రొక్కి నిలువ నతఁడు వత్సా! నీ కేమి కావలయునది కోరుమని యానతిచ్చె. అప్పుడు నేను భయసంభ్రమంబులతో దేవా! మరల నరలోకంబున కరుగ కుండ నిచ్చటనే యుండవలఁతు నంటి. అనవుఁడు చంద్రశేఖరుఁడు కుమారా! నరలోకంబు పాపభూయిష్ఠమై యున్నయది. నీవింకం గొంతకాల మందుండి పాపాత్ములఁ బవిత్రులుగఁ జేయవలయు. అట్లు చేసి జీవన్ముక్తి నొంది యిచట నుందువు గాక యని సాదరంబునఁ బలికి వెండియు నన్ను నరలోకంబునకుఁ బొమ్మని యానతిచ్చె.

పదియైదవప్రకరణము.

"అయ్యా! ఈప్రసంగమునుబట్టి నన్ను నేఁ గొనియాడుకొనుచున్నవాఁడ నని మీరు తలంప వలదు. హరిద్వారముకడకు నేను రావలసినకారణంబును మీకెఱుంగఁ జేయక తప్పదు. కావున దాని నానుపూర్విగ నెఱిఁగించితిని." అనిహరిశర్మవలుకుచుండ వానిమాటకడ్డమువచ్చి నిగమశర్మ "మేలుమేలు! మిమ్మును మీరుపొగడుకొనుచున్నవారని యెట్టిచెనఁటియైన ననఁజాలునే. జగంబులు మీమహిమంబుల వేనోళ్ళం బొగడుచుండ మీరే కొండాడుకొన వలయునా? మేమట్లుతలంచుకొనువారముగాము సుఁడీ!" యనివాక్రుచ్చి చిత్రభానువృత్తాంతము నెఱిఁగింపుమని వానిం గోరెను. హరిశర్మచేసినయాత్మప్రశంసవిని మణివర్మ "ఏమిది? ఇతఁడప్రస్తుతము లయినయంశములను మిక్కిలి పెంచి చెప్పుచున్నాఁడు. చిత్రభానునివృత్తాంతము

చెప్పుటకన్న తనమహిమలు చెప్పుకొనుటయే యీతనికిఁ బ్రస్తుతమని తోఁచెఁ గాఁబోలు" నని తనలో విచారించుకొని యూరకుండెను. హరిశర్మ నిగమశర్మప్రభృతుల నాలకించి తనయందు వారికి భక్తితాత్పర్యంబులు మందగింపక యెప్పటియట్లున్న వని తెలిసికొని చిత్రభానుని వృత్తాంతము నిట్లని చెప్పఁదొడంగె.

అట్లు భగవానుఁ డగునిందుశేఖరునిచేత నాజ్ఞాపితుఁడ నై వెండియుఁ బసిఁడి పావలఁ దొడిగికొని బ్రహ్మకపాలంబునొద్దభూలోకముఁ బ్రవేశించితిని. ఆ తావు చేరినపిదప మహేశ్వరుఁ డిచ్చినపాదుకలకుఁ దొంటియద్భుతశక్తి పోయినది. అందుచేత నేను పాదచారి నై మార్గమధ్యమున నాశిష్యు లగుభైరవునిఁ గాలకంఠునిఁ గలిసికొని యెడనెడ జుట్టుప్రక్కలనున్న పుణ్యక్షేత్రంబుల సేవించుచు దివ్యతీర్థములఁ దోఁగుచు హరిద్వారము చేరితిని. నే నెక్కడికిఁ బోయినను గ్రామమధ్యమున వసించుట కిష్టము లేనివాఁడ నగుటచే హరిద్వారమునఁ గూడ నూరు వెలుపల నొక పెనుమఱ్ఱిక్రింద విడిసితిని. అది భాగీరథీతీరమున నే యుండుటం జేసియు చాలనేల నావరించుటం జేసియు బాటసారులకు నత్యంతోపయుక్తముగ నుండును. ఆమఱ్ఱిక్రింద విడిసి యచ్చట నొక శిష్యునుండుమని రెండవశిష్యుఁడును నేనును గంగాస్నానమున కరిగితిమి. అప్పుడు త్రోవలో నొకమారేడుచెట్టుక్రింద మూలుగుచుపట్టి నేలం బొరలుచు బాధపడుచున్న యొకమనుష్యుని గాంచితిమి. కౌపీనం బొక్కటి దక్క వానిమేనిమీఁద వస్త్రము లెవ్వియు లేవు. మంటిముంత యొండు దక్క పాత్రములు లేవు. అతఁ డెప్పుడు మృతినొందునా యెప్పుడు పొడుచుకొని తినఁగలుగుదుమా యని కనిపెట్టుకొనియున్న కాకులు గ్రద్దలు తప్ప వేరుచుట్టములు లేవు. వాని ముఖలక్షణముల నవలోకింప నతఁడు సత్కులీనుఁ డనియు మిక్కిలి గారాబమునం బెరిఁగి యుండఁబోలు ననియు మహారాజకుమారుఁ డైన నై యుండవచ్చు

ననియు నాకును నావెంట నున్న కాలకంఠునకును దోఁచినది. ఆపన్నుల సంరక్షణమునందును భగవత్కైంకర్యమునందును శరీరమువినియోగింప దీక్షఁ బూనినవాఁడ నగుటచే నే నప్పుడ శిష్యసమేతుఁడనై యయ్యనద పజ్జకుం బోయి కూరుచుండి నీ కేమి కావలయు నని బిగ్గఱగ నడిగితిని. అతఁ డప్పుడు కన్నులు దెఱచి నావంకఁ దేరిపాఱ జూచి నోటమాట లేమిం దనకోరిక చెప్పలేక నోరు తెఱచెను. అతనికి దాహము గావలయుఁ గాఁబోలు ననుకొని నేనప్పుడ కాలకంఠుని బంచి గంగాజల మించుక తెప్పించి మెల్లమెల్ల వానినోటం బోసితిని. ఆజలబిందువులు ద్రావి యతఁడించుక సేద దేఱినపిదప "నాయనా! నీవెవ్వరివాఁడవు నీ కింతగతి ప్రాపించుటకుఁ గారణ మేమి? నీకిప్పుడు గలబాధ యెద్ది" యని యడిగి వాని దేహతాపము నుపశమింపఁ జేయుటకై యుత్తరీయపుకొంగుతో నించుక విసరు మని కాలకంఠుని నియోగించితి. అతఁడు నటు సేయ నారోగి మఱింత సేద దేఱి మిక్కిలిహీనస్వరముతో సంగ్రహముగాఁ దనవృత్తాంతము నిట్లని చెప్పె. "స్వామీ! మీ రెవ్వరో నే నెఱుఁగను గాని నాపాలిదైవంబవని భావించుచున్నాఁడ. నేనింక బ్రతుకుట యబద్ధము. అయినను నిన్నటినుండి నోరాఱుకొని పోవుచున్నది. కాళ్లలోఁ బటుత్వము లేమి గంగకుఁ బోయి జలంబు దెచ్చికొనఁజాలనైతి. దారిం బోవువారిఁ బిలుచుటకైన నోపిక లేఁదయ్యె. మీయనుగ్రహమున నిప్పుడు ప్రాణ మించుక చల్లఁబడినది. నాకథ సంగ్రహముగాఁ జెప్పెద వినుఁడు. "నేను గాశ్మీరమహీపాలుఁడగు హేమచంద్రునితమ్ముఁడను. చిత్రభానుఁడనువాఁడను. నేను దనకు ద్రోహము తలపెట్టితి నని మాయన్న నన్ను దేశంబునుండి వెడల నడిచె. అదిమొదలు దారపుత్రుల విదర్భ కంపి యేకాకినై యనేక దేశంబులఁ గ్రుమ్మరి కుడిచినచోటఁ బండుకొనక పండుకొన్నచోటఁ గుడువక వ్యాధిగ్రస్తుఁడనై తుద కీగతికి వచ్చితిని. దైవవశమున

మాయన్నను మీరు కనుఁగొందు రేని తనయెడ నెన్నఁడు నేను ద్రోహము చేసియెఱుంగ ననుఁడు. తాను జేసినజోగ్గినై యాలుబిడ్డల నెడఁబాసి యొకచెట్టుక్రింద దిక్కులేక మృతినొందుచుంటి ననుఁడు. మందభాగ్యు లగు నాబిడ్డలఁ గరుణింపుమనుఁడు. నాపైఁ గోపమున వారి నిరాకరింపవల దనుఁడు. ఒకవేళ నే నేయపరాధంబునైనఁ దన యెడఁ జేసితినేని క్షమింపు మనుఁడు. తనపాదపద్మములకుఁ గడసారి మ్రొక్కితి ననుఁడు. తనకొడుకుల నిరువురముద్ధాడితి ననుఁడు." అని చెప్పి యొక్కనిముస మూరకుండి "స్వామీ నాకాయాసము వచ్చు చున్నది. నేనింక మాటలాడఁ జాల' నని యూరకుండి కన్నులనుండి సంతతధారగా బాష్పములు విడువఁజొచ్చె. అనంతర మొకదినమతఁడు జీవించెను; కాని మరలమాటాడలేదు. మఱునాఁడు మధ్యాహ్నమతఁడు పరలోకగతుఁడు కా ననాథప్రేతసంస్కారము మిక్కిలి పుణ్యప్రద మనునార్యోక్తియందు నమ్మికఁగలవాఁడ నగుటచే నేను నాశిష్యులం బురికొల్పి వానికగ్నిసంస్కారంబు గావించితిని. మరణకాలమునందు నా కతఁడు చెప్పినపలుకులు విన్నవించి కృతకృత్యుఁడ నైతిని. కాని మీ కధికమనస్సంతాపము గలిగించితిఁ గదా యని చాల వగచు చున్నాఁడ. ఏకారణమున నైన మనుష్యుల దుఃఖింపఁజేయుట మా యాశ్రమంబున కనుచితము. అదియునుఁగాక బంధుమరణముచేత దుఃఖపడుచున్న వారిసమీపమున నేనుండఁజాల" నని హరిశర్మ వెం డియు నేదో చెప్పఁబోవుచుండ హేమచంద్రుఁడు దుఃఖావేశపర వశుఁడై గోడకుఁ జేరఁబడి మొగంబున నుత్తరీయాంచలము వైచి కొని తమ్మునికూర్చి బిట్టువగచెను.

మణివర్మయు మాధవసేనుఁడును రాజును బట్టుకొని దుఃఖోప శమనవాక్యంబులు బలికిరి. ధైర్యమువిడిచి యుంగలాడుచు రాజుదుఃఖము నుపశమింపఁ జేయఁ దలఁచి హరిశర్మయు నిట్లనియె. "రాజా యీ

శరీరములు వినశ్వరములని యెఱింగియు నీవింతవిచారింపనగునె. వినశ్వరంబులగుపదార్థములఁగూర్చి విచారించుట వివేకులకు ధర్మముకాదని భగవంతుండగు శ్రీకృష్ణుం డర్జునున కుపదేశింపలేదె. భగవద్గీతలు పిచ్చికూఁతలని మహావాదములు చేయుబౌద్ధులు భగవంతునిమాటలపై విశ్వాస ముంచరుగాని యాస్తికులమగు మనము విశ్వాసముంచి జ్ఞానవంతులము కావలదె. ఆత్మ నిత్యము దేహమనిత్యము. ఇదియెఱిఁగి నడచుకొన్నవాఁడే వివేకి. అందుచేత నీవు విచారింపఁజెల్లదు." అని పలుకుటయు హేమచంద్రుఁడు కన్నీరుదుడుచుకొని "స్వామీ నా తమ్ముని మరణకాలంపుఁబలుకులు ములుకులై నన్నుంబీడించుచున్నవి. వానిచరమావస్థం దలఁచుకొన్న నాకడుపు చుమ్మలుచుట్టు చున్నది. "రాజ్యాంతే నరకం ధ్రువ" మ్మను మాట సత్యము. కటకటా! నిరపరాధుఁడగుసోదరుని నేలపాలు జేసికొంటిఁగదా. విమర్శించి కార్యంబులఁ జేయనివారికి భ్రమించుగతులిట్టివియే కదా. ఈభ్రాతృద్రోహి మీవంటి మహాత్ములపవిత్రచరణంబులను ముట్టఁదగఁడు. నాచేసిన దోసంబునకు శాపంబే దేని నిచ్చి నన్ను దునుముట్టించి నాయులమట దీర్పఁగదవే" యని ప్రార్థించి వాని యడుగులపయింబడె;

అడుగుల వ్రాలిన నేలఱేని గ్రుచ్చియెత్తి నేలవేల్పు "చాలు చాలు రాజా! చాలు నీబేలతనము. నీగురువులు నీకు రాజనీతి నుపదేశించుటయే కాని బ్రహ్మవిద్యోపదేశంబు జేయరని తోఁచెడిని. నీమనోవైకల్య మడఁగువఱకు నీకు మేము తత్త్వోపదేశంబు జేయఁదలఁచుకొన్నారము. ఇదనీకు సమ్మతంబ యగునేని మాకడ కప్పుడప్పుడు వచ్చుచుండునది" అని మందలించి మంత్రిపురోహితులం జూచి "యమాత్యా! ఈతనివైఖరి జూడ నాత్మహత్య జేసికొనువాఁడపోలెఁ గనఁబడుచున్నాఁడు. తొల్లి యొక్క నరపాలుఁడు తద్దయు సొగసులాఁడి యగుతన రెండవయిల్లాలు చెప్పినకొండెములు విని పట్టపుమహిషివలనఁ

దనకుఁ గలిగిన జ్యేష్ఠకుమారుని నిరపరాధుని నిష్కారణముగ వధియిం చి పిమ్మట కొంతకాలమున కతఁడు నిర్దోషియని విని యాదుఃఖము పట్టఁజాలక తన్నుదాఁ బొడుచుకొని ప్రాణములువిడిచె. కావున నీతని దెస మీరపరిమత్తులై యుండునది" అని హితోపదేశంబు జేసి తమకను ష్ఠానకాలము మీఱుచుండుటచే వారి నవ్వలకుం జను మని వేఁడు కొనియె. హేమచంద్రుఁడు హరిశర్మకుం బ్రణామంబు జేసి సెలవు గైకొని సపరివారముగ మరలఁ బాదచారియై మందిరంబునకుం జని సోదరవియోగమునుగూర్చి పరిపరివిధంబుల విలపింపఁజొచ్చె.

రాజునకు మాధవసేనునకు నిగమశర్మకు హరిశర్మపై నింతింత యనరానిభక్తి కుదిరెనుగాని మణివర్మకు మాత్ర మాతనిసంభాషణం బులు వినినదిమొదలు కొన్ని యనుమానంబులు పొడకట్టె; సందర్భము పొసఁగియుండకపోయినను హరిశర్మ తనప్రశంస మెండుగఁ జేసికొను టయు దుఃఖముచేత మనోవైకల్యము నొందినమహారాజునకు నుదాహ రణపూర్వకముగా నితిహాసంబను పేరుపెట్టి యొకదుష్కథ జెప్పుటయు మణివర్మకు వానిపైఁగల గౌరవంబును గొంత తగ్గించెను; తన మనం బునకుం బొడకట్టినయనుమానంబులు రాజునకు విన్నవింపఁదలఁచియుఁ దగినయదను వచ్చినప్పు డట్లు చేయనగునని యతఁ డూరకుండెను.

హేమచంద్రుని కరవిందాదేవియుఁ బెక్కుర యంతఃపురపరిచా రకులు నెట్టెటో దుఃఖోపశమనంబు జేసిరి. వారి యుపచారవాక్యముల వలన రాజునకు బాహ్యదుఃఖము కొంతయడంగిన నంతస్తాపము మాన దాయె. అందుచేత నతఁడు దినమున కొక్కసారియైన హరిశర్మ యున్ననెలవునకుంబోయి వారివలన వేదాంతవిద్య నుపదేశము నొందు చువచ్చె. తఱుచుగ నతఁ డొంటిగఁ బోవుచుండుటఁ జూచి మణివర్మ బ్రాహ్మణుఁ డెంతయోగ్యుఁడైనను వానికడ కేకతంబుగఁ బోవుట రాజునకుచితంబు కాఁదని మందలించుచువచ్చె. హరిశర్మభాగవతుఁడై

యని మనంబునఁ దృఢవిశ్వాసము నెలకొని యుండుటచే రాజు వాని మాటలు పెడచెవిని బెట్టెను; హరిశర్మయు రాజును మిక్కిలి గౌరవించుచు వాని మేన నీఁగనైన వాలనీయక చీఁకటిపడువఱకు హానిం దనకడ నుండనీక యొకవేళ నట్లుండెనా భైరవకాలకంఠులను సాయ మిచ్చి పంపుచు కన్నబిడ్డనట్లు కాపాడుచుండె.

పదియాఱవప్రకరణము.

హేమచంద్రుని కరవిందాదేవివలన నిరువురుకుమారు లుద్భవించిరని యీవఱకు చెప్పఁబడినది. అందు జ్యేష్ఠునకు హేమచంద్రుఁడు తనతండ్రిమీఁదిభక్తిపెంపున విక్రమసేనుఁ డనునామమిడియె. రెండవకొమరునకు హర్షవర్ధనుఁ డనుపేరం బరఁగుచుండె. ఆయిరువురుబిడ్డల యందుఁ దలిదండ్రులయిరువురలావణ్యంబును నిరువురసౌజన్యతయు నిరువురమనీషావిశేషంబును సంక్రమించె నని ప్రకృతిజనంబులు ప్రమోదభరితులు కా విక్రమసేనహర్షవర్ధను లల్లారు ముద్దుగఁ బెరుఁగుచుండిరి. విక్రమసేనునియాకృతి తండ్రివిగ్రహమునుబట్టి యచ్చుగుద్దినట్లు వెలయుచుండు. హర్షవర్ధనుఁ డచ్చముగఁ దల్లిపోలిక నుదయించె. అందుచే విక్రమసేనుఁడు దృఢమనస్కుఁడై గంభీరుఁడై తన యీఁడునకుఁ దగనిపరాక్రమంబుల నప్పుడప్పుడు చూపి సార్థకనామధేయుఁ డయ్యె. హర్షవర్ధనుని మనస్సును వానిశరీరంబునట్ల కడుమెత్తనై యుండుటం జేసి యతఁడు సాహసంబునకుఁ బరాక్రమంబునకుఁ జేపడక సంగీతాదివిద్యలకును భూతదయకుం జేరువడియె. తమ్ముని యందు భూతదయ సంగీతప్రౌఢిమ గలవనుటచే నన్నయం దాగొనములు కొరవడియె నని చదువరులు తలంపవలదు. విక్రమసేనుఁడు

భూతదయావిషయమునఁ గాని వేఁటాడుప్రజ్ఞయందుఁగాని తమ్మునకుం దీసిపోవఁడు. అయినను జను లాతనిసాహసంబులఁ బలుమాఱు గాంచి వానికి సాహసవిక్రమసేనుఁ డనియుఁ దమ్మునకు సుకుమార హర్షవర్ధనుఁ డనియుఁ బేళ్ళు పెట్టిరి.

ఇప్పటికి విక్రమసేనుఁడు పండ్రెండేండ్లప్రాయము గలవాఁడు. హర్షవర్ధనునకుఁ బదియవయేఁడు. క్షత్రియునకుఁ బదునొకండవయేట నుపనయనము చేయవలసిన దని ధర్మశాస్త్రములయందు విధింపఁబడుటచే హేమచంద్రుఁడు పెద్దకొడుకు నొకసంవత్సరము క్రిందట వడుగు చేసి వేదాభ్యాసము చేయించుచుండెను. ఆయన్నదమ్ముల మైత్రి యిట్టిదనివర్ణింప నలవిగాదు. ఒకనివిడిచి యొకఁడు నిముసమైన నిలువఁ జాలరు. ఇరువు రొక్కచోటనే కూర్చుందురు. ఒకమాటే భుజియింతురు. ఒక్కపాన్పుననే పవ్వళింతురు. ఇరువురు తలిదండ్రుల యెడ భక్తులు. గురుజనంబుల యెడ విధేయులు. భృత్యజనంబుల యెడ దయాళువు. ప్రకృతిజనంబుల యెడ సంరక్షకులు. సుగుణాలోభులు. దుర్జన విముఖులు. అయ్యిరువురుబిడ్డలు సరవిందా హేమచంద్రునకుఁ బున్నెములప్రోవులై నోములపంటలై పుట్టి, కన్నులవంకమామలై ముద్దులమూటలై పెరుగుచుండిరి. చదువులనేకాక యీఁతకొట్టుట, గజాశ్వంబుల నధిరోహించుట, మున్నగుపౌరుషక్రీడలను గడుమెలఁకువతో నేర్చి బాలురు కాలక్రమంబున సమర్థులైరి. ఆకుమారసింహములలో సాహసుండని బిరుదు నందినవిక్రమసేనుని పరాక్రమంబుల నొకటి రెంటిఁ బేర్కొని యతఁ డాబిరుదమునకుం దగినవాఁ డని చూపవలసియున్నది.

ఒకనాఁడు హేమచంద్రుఁడు సేనాపతియగు దండపాణిని బాలుఁ డగువిక్రమసేనుని గొంతపరిజనంబును వెంటఁబెట్టుకొని యడవికి వేఁటకుఁ జనియె. హేమచంద్రుఁ డొకమూల సింగపువేఁట సాగించుచుండె.

దండపాణి యింకొక నెలవున పులివేట సలుపనెంచి మృగయాక్రీడ లలోఁ దాను నెఱజోదయగుటచేఁ దనకెట్టి యపాయంబును లేదని మాటున నిర్భయముగ నొకమఱ్ఱినీడను నిలిచి పులిరాక కెదురుచూచు చుండెను. విక్రమసేనుఁడు వాని వెనుకఁ గొంతదవ్వున నొకమెట్టపై నిలుచుండి యీవినోదంబుఁజూడ నుత్సుకుఁడై యుండెను. అంతట వేఁటకాండ్రు తప్పెటలం జఱచుచు బెబ్బులిం దఱుముటయు నమ్మెక ము తనపొదవిడిచి సహజముగఁ జింతనిప్పులచొప్పున మెఱయుకన్నులు మఱింత యారుణ్యముసఁబూని చూపఱకుఁ వెఱపుగలిగింప దండపాణి యున్నవలనునకుఁ బఱతెంచె. సేనాపతియుఁ బ్రత్యాలీఢపాదుఁడై వింట నమ్ముఁదొడిగి గుఱిచూచి బెబ్బులి నేసె. దైవవశమున వాని యేటు చాలమెకంబునకుం దగులక చెవిపొంతనుండి దూసికొనిపో యెను. పోవుటయు నా శార్దూలము తొలుతకంటె నినుమడించినయలుక తోడను ముమ్మడించినవేగముతోడను బాణము వచ్చినదారింబట్టి రి వ్వనదండపాణిమీఁద నెగసిపడుటకు నేలయదుగునట్లు పఱువెత్తి రాఁ జొచ్చెను. మృత్యుదేవతఁబోలు దానియుగ్రరూపమును జూచి దంట లగుబంటులు ప్రాణభీతిని యథాయథలై పఱతెంచిరి. వేఱొక్కయ మ్మునుదొడిగి యేయుటకు దండపాణికి నవకాశము లేకపోయెను. ఆయ పాయమ్మును దవ్వుననుండిచూచి విక్రమసేనుఁడు సత్వరంబ తనవిల్లుఁ బూని విసముబూసినవాలుటమ్ముఁదొడిగి యెక్కియున్నమెట్టదిగి వలదు వలదని సేవకులు మొఱలిడుచున్నను వినక దండపాణివెనుకకు వచ్చి బరిమీఁదఁ బఱతెంచువ్యాఘ్రంబును గాటంబుగ నాటనేసె. అయ్యేటు దిని యాక్రోలుపులి దండపాణికి రెండుబారల దూరంబునఁ జుట్టు ప్రక్కల కొండలు ప్రతిధ్వనులీయ వేఁటకాండ్రగుండె లవియ నొక్క యఱపఱచి నెత్తురుకంగలుదొరఁగ నేలంగూలె. విక్రమసేనుఁడు పిఱికి బంటులమాట విని యొక్కనిముస మూరకుండినయెడఁ దనబాణాగ్ని

యను కాఱుచిచ్చున శత్రుసైన్యమహారణ్యంబులం గాల్చు దుర్జయ బాహుశాలి దండపాణి, బెబ్బులినోటి కొక్కెకబళమై యమపురిని బ్రాంతకాపై యుండియుండును. దండపాణియు మృత్యుముఖమునుండి వెలువడి బాలునకుం గడుకృతజ్ఞుఁడై వానిం గౌఁగిలించికొని వాని కావించినమేలు మఱువ ననియు వానిఋణ మెన్నఁడును దీర్చికొనుటకుఁ దనకలవి కాదనియుఁ జెప్పి యనేకవిధంబుల నుగ్గడించె. హేమచంద్రుఁడు పుత్రునిసమయజ్ఞత చాకచక్యము విలువిద్యయందలి నేర్పు విని తనకుమారుఁడు వంశప్రదీపకుఁ డగునని సంతసించె. అరవిందాదేవియుఁ దన చిన్నిపాపని మిన్నచెయువులు విన్నయప్పుడు కన్నుదమ్ముల నశ్రుజలంబులు కాఱఁ గన్నబిడ్డ నెత్తికొని ముద్దాడి జనులదృష్టిదోషము దగులకుండ వానికిదృష్టిపరిహారములు చేయించెను.

మఱియొకసారి విక్రమసేనుఁడు హర్షవర్ధనుఁడు వైశాఖమాసమున నొకసాయంకాలమున నుద్యానవనమున నొకకొలనియొద్దనవిహరించుచుఁ జల్లగాలిననుభవించుచుండ దండపాణికొడుకు హర్షవర్ధను యీడువాఁడు తోడిబుట్టియులఁగూడుకొని యాకొలంకున జలక్రీడలు చేయుచు నాటలసందడి నపాయ మెఱుంగక నోలయోలయని కేకలు వేయుచు లోఁతునీళ్ళకుఁబోయె. ఆబాలకుఁడు సరిగ నీఁత నేరనివాఁడగుటచే మునుముందుఁ బోవుటయే కాని లోఁతునీళ్ళనుండి మొరక నేలకు రానేరక యలసి నీటనొకటిరెండు మునకలువైచె. అదిగట్టుననుండి చూచి విష్ణుదత్తుఁడు మునిఁగె మునిఁగె నని హర్షవర్ధనుఁ డన్నతోఁ జెప్పెను. అప్పలుకులు వినినతోడనే విక్రమసేనుండు జాలినొంది తలమీఁది రతనాలకుళ్ళాయి నేలం బాఱవైచి విలువదువ్వలువలు తడిసి చెడిపోవు నని వగవక తనచేత నప్పని యగునా కాదా యని విచారింపక తనసాయంబున కెవ్వరిఁ జీరక గుభాలున నీటం దుమికి వడివడి విష్ణుదత్తునియొద్దకుఁ గీఁదుకొనిపోయి యామందభాగ్యుని జుట్టు

పట్టుకొని యావలకు లాఁగికొనివచ్చి బ్రదికించెను. తననందనునకు వాటిల్లిన యపాయంబును రాజనందనుఁడు గాపించిన సాయమును విని దండపాణి సత్వరంబ యచ్చోటునకుఁబోయి కుమారునకుఁ గాలోచితము లగు నుపచారములు చేయించి యతఁడు తెలివొందినపిదప రాజకుమారుని బిగ్గఁ గౌఁగిలించుకొని. "వత్సా! నాకును నాకుమారునకును నీవ ప్రాణప్రదాత వైతివి. మేమిరువురమును మాశరీరచర్మములుగోసి నీకుఁ బాదరక్షలుగఁ గుట్టించి యిచ్చినను మీఋణంబు తీరదుసుమీ" యని కొనియాఁడి తనపట్టిని వెంటఁబెట్టుకొని యింటికిఁబోయెను. అసమానమగు రూపంబునకుఁ దగినవిక్రమంబును విక్రమంబునకు వన్నె వెట్టు సుగుణసంపదయుఁగల విక్రమసేనునిజూచి రాజబంధువులు ప్రకృతిజనంబులు మహానందమగ్నులయిరి. ఈవ్రికరణంబునం బేర్కొనఁబడినవ్రిధమసాహసకార్యము హరిశర్మ యప్పటికి వచ్చుటకు నాలుగు మాసములక్రిందటను రెండవది నెలక్రిందటను జరగెను. పండ్రెండేండ్లప్రాయమునాఁడె యింతమగంటిమిఁ జూపినయాబాలకుండు యుక్తవయస్కుఁడై రాజ్యమును వహించుపిదప వానిపేరు శత్రుమహీపాలురకు హృదయశల్యంబు గాక యుండునా యని తలంచి మణివర్మ మాధవసేనుఁడు మొదలగుమంత్రులు సంతసించి కాశ్మీరమున కంతకంతకు మంచిదినములు వచ్చుచున్నవని సంతృప్తహృదయులైరి.

హేమచంద్రుఁడు చిత్రభానుని దుర్మరణంబును విని దురపిల్లినప్పుడు విక్రమసేనుఁడును బిన్నతండ్రిచావునకు బిట్టువగచెను. కాని బాలుఁడగుటచే వానిదుఃఖము తండ్రివగపుంబలెదీర్ఘకాల ముండక మఱునాఁడె యుపశమిల్లె. ఆదినము మొదలు హేమచంద్రుఁడనుదినము సాయంకాలమున రాజకార్యంబులు ముగించిహరిశర్మయొద్దకుంబోయి వేదాంతగోష్ఠి నడుపుచుండుటచే విక్రమసేనహర్షవర్ధనులు, మహామహిమములకుఁ జేరువడి యున్న హరిశర్మ నొక్కసారి చూడఁగోరియొక

నాఁడు సంజకడఁ దండ్రికడకుఁ బోయి నీ వడుగుము నీ వడుగు మని యిరువురు వంతులు వోయిరి. బిడ్డలుతన్నెదియో కోరదలఁచి భయంబు పెంపున నడుగ సాహసింపఁజాల కున్నవా రని హేమచంద్రుఁడు గ్రహించి వారిఁ జేరఁజీరి మేనులు దువ్వి "వత్సలార! మీ కేమికా వలయును. భయము లేదు చెప్పుఁ" డని హెచ్చరించెను. అప్పటికిని విక్రమసేనుఁడు తనకోరిక బయలుపుచ్చక యూరకుండె. తండ్రి బుజ్జగింపుచే భయము విడిచి హర్షవర్ధనుఁడు మెల్లన నిట్లనియె. "మీవంటి యుత్తము లనుదినంబును బోయి కొలువందగినమహిమలు గలహరిశర్మనొక్కసారి చూడ నభిలాష పడుచున్నవారము. మాకోరిక కోరరానిది కాదేని మమ్ము మీవెంట రా ననుగ్రహింపుఁడు" అన వుడు చిఱునగవు నవ్వి వత్సలారా! ఈపని కింత వేడఁవలయునే. మీ కొకసారి యమ్మహాత్ముని జూపవలయునని నేనుం దలంచుచున్నవాఁడ. ఇప్పుడ నేనచ్చటికిం బోవుచుంటి. నావెంటరండు.మునింజూచివత్తురుగాని" యని పలికి తన కొడుకులు వెంబడింప గుహాకుఁ జనుమృగరాజు చందంబునఁ గాశ్మీరరాజు కుమారసింహములు వెంట రామునియున్న గుహాకుఁ జనియె. మునియు రాజును సూర్యచంద్రులంబోలె వెలయు నక్కుమారులను గారవించి వారు నమస్కరింప నాశీర్వదించివ్యాఘ్రచర్మముల పైఁ గూర్చుండఁజేసి తనయొద్ద నున్నబూడిద సంచుకవారి నొసటులఁ బ్రామి తేని నుద్దేశించి "హేమచంద్రా! నీ వదృష్టవంతుఁడవు. నీకడుపునం బొడమిన యీరత్నంబు లమూల్యంబులు. దైవము రక్షించిన నింక నైదారేండ్లలోన పెద్దబిడ్డఁడు రాజ్యభారమును వహించి నీకు విశ్రాంతి నొసంగఁ గలఁడు." అని బహూకరించెను. రాజు వాని బహూకరణమునకు లోనఁ గడునలరి "దైవానుగ్రహంబును మీ యాశీర్వచనంబును జల్లఁగ నుండునేని మీరన్నయట్లు కాఁగలదు. దానిమాట యటుండ నిండు. నాచిత్తంబు తమ్ముని దెసనుండి

మరలింపఁ జాలకున్నవాఁడ. కుమారుఁడు యుక్తవయస్కుఁడు కాక మున్న మహీరాజ్యమునకు వాని నభిషిక్తుని చేసి మీయనుజ్ఞయగు నేని నేను విరాగినై కాలము బుచ్చువాఁడ" నని చిత్తంబునఁ గల యుత్తలంబు సంగ్రహంబుగఁ దెలిపె.

తండ్రిపలుకులు చెవులఁ బడినతోడనె బాలకులిరువురు తెల్లబోయి యొండొరుల ముగంబులఁ జూచుకొనసాగిరి. దానికిం దోడుగ హరిశర్మ రాజు నుద్దేశించి యిట్లనియె. "నీకంతవైరాగ్యంబు జూన నిచ్చ గల దేని యడవుల నుండ నక్కఱ లేకయె రాజ్య మేలుకొనుచు సకలోపభోగంబుల ననుభవించుచు నిఖిలలౌకికవ్యాపారంబుల మెలంగుచు జనకచక్రవర్తియట్లు శరీరసన్యాసంబు గాక యాత్మసన్యాసంబు స్వీకరించి యింటిలో నుండియు నున్ననంటనికమ్మరిపురుగు తెరంగున సంసారంబునందుండియు లేనట్లు వర్తింపవచ్చును. నీవు తరియించుటకు సాధకం బగుమంత్ర మొకటి నీ కుపదేశించెద. అది పుణ్యదినమున నర్ధరాత్రమున నుపదేశము కావలయును. దానిపురశ్చరణము మఱుసటి. మంత్రోపదేశమును పురశ్చరణమును మాపులు మాగుహయందచేయం దగు. దీన నీయమంగళ యఖిలం బుపశమిల్లు. భవరోగంబులకు మహామంత్రంబులు దివ్యౌషధంబులు గదా"! అని హరిశర్మ పలుకుటయు బాలుర నెమ్మొగంబులు మఱింత తెలిపిదప్పి నెలవెలఁబోయెను. హేమచంద్రుఁడు హరిశర్మపలుకులకుఁ దద్దయు నలరి వానిచరణంబులకు సాష్టాంగనమస్కార మొనర్చి "స్వామీ! మీకు నాపై నింతమాత్ర మనుగ్రహ మెన్నఁడయినఁ గలుగునా యని మేలుసమయంబునకు, స్వాతివానకు ముత్తెపుచిప్పయట్లు, నామనంబు ప్రతీక్షించుచున్నయది. పుణ్యదినంబును సుముహూర్తంబును మీరె యేర్పఱుపుఁడు. అర్ధరాత్రి మందా మంత్రరాజంబు నుపదేశమొంది మాపు లిచ్చటనే పురశ్చరణము చేసెద. సిరిరా మోకాలొడ్డువా రెవ్వరు!" అని నుడివి వాని

యొద్ద సెలవుం గైకొని కుమారద్వయసమేతుఁ డయి యంతిపురికిం జనియె. అంతిపురిం జొచ్చినతోడనే బాలకు లిరువురు పరుగుపరుగునఁ దల్లికడకుం బోయి తండ్రికోరికలు, ముని యిచ్చినవరంబులు పూసగ్రుచ్చి నట్లామెకుం జెప్పిరి. అరవిందాదేవియుఁ దద్వచనముల నాలకించి మహారాజు విరాగి యై, యేయడవులకుం జనునో, యెప్పుడు సన్న్యసించునో యేమిసాహసంబు గావించునోయని భయపడి యడుగుటకు నడుగకపోవుటకుఁ గూడ వీలు లేనియవస్థ వచ్చినది కదా యని యెద్దియుం దోఁచక విచారించుచుండె.

పదియేడవ ప్రకరణము.

"కాలకంఠా! భైరవు నిక్కడ నుండు మని నీవు పోయెదవో నీ విక్కడనుండి భైరవు నంపెదవో యెట్లయిన సరియె. అనుకొన్న పని చాలవఱకు నెఱవేఱిన దని నమ్మకమీఱఁబలికి దేవశర్మను సత్వరంబ నాకడకుం గొని తేవలయును. ఇక్కడకు వచ్చి మనతోఁ గలసి యుండుట కతఁ డొల్లకపోయిన నీప్రాంతములయందె మన కొక్కపూఁట పయనములో నుండునది యని నొక్కి వక్కాణింపుము. మును ముందు నన్నుం గలిసి మాటలాడి పొమ్మనుము" అని హరిశర్మ రాజు తన్ను వీడ్కొని పోయినవెంటనే ప్రియశిష్యుఁ డగు కాలకంఠు నడిగెను. వాఁడును వినయంబునఁ జేతులు గట్టుకొని విప్రునియెట్టయెదుట నిలిచి "స్వామీ! ఈపని మన భైరవునివలన గాదు. దేవశర్మచీమలు దూఱని చిట్టడవులలోను, కాకులుదూఱనికాఱడవులలోను నున్నవాఁడు. వానిజాడలు నేను తీసినట్లు వాఁడు తీయఁ జాలఁడు. కావున నేను బోయెద" నని యాఱేయి యచ్చటినుండి జాము రాత్రివేళ లేచి యొంటిని జనియె.

కాలకంఠుఁడు గుహ విడిచినపిదప భైరవుని బిలిచి హరిశర్మ దాపునఁ గూర్చుండ నియమించి "భైరవా నీతో నొక్కరహస్యమును జెప్పవలయు నాచెప్పినచొప్పున నీవు మెలంగుదువయేని మనకార్యం బతిశీఘ్రంబ యగు. ఇప్పటినుండి నీవు యత్నంబు సలుపకున్న నప్పని యగుట యరిది" అని నుడువ భైరవుఁడు భయభక్తులు మెఱయ స్వామీ! దేవర యాజ్ఞ శిరసావహించి యప్పని నెఱవేర్చెద. నాప్రజ్ఞ మా కెఱుంగదా? మహాప్రభువు నన్ను మీ కప్పగించినపుడు మీతోడ నెన్నియుత్తరములు జెప్పె నన్నియుత్తరములు నేను జరపువాఁడ" నని ప్రత్యుత్తర మిచ్చెను. పిదప హరిశర్మ వానిని మిక్కిలి దాపునకుఁ బిలిచి చెవిలోఁ గొంతసేపతడను గుసగుసలాడెను. ఆవిస్రంభసంభాషణము ముగిసినతోడనే భైరవుఁడు తనపనిమీఁదికిం బోయె. అంతలోఁ దెల్లవాఱుటయు హరిశర్మ ప్రాతఃకాలకృత్యములం దీర్చి భక్తిమై తన్నుం గొలువవచ్చువారికి దర్శనము నిచ్చుటకు సిద్ధముగ నుండెను. అంతం గొంతసేపటికి వాని యెట్టయెదుట నేడడుగులు పొడవు, పొడవునకుం దగినలావు, లావున కనుగుణమగుబలము గలయొకపురుషుఁడు వచ్చి నిలిచి 'స్వామీ! నమస్కార' మని ప్రణమిల్లెను. హరిశర్మ యప్పురుషు నెన్నఁడుం గనియుండకపోవుటచే ముందుగ వాని నేమని పలుకరింపవలయునో యెఱుఁగక యాశీర్వదించి కూర్చుండు మని యూరకుండెను. అప్పురుషుఁడు దాపున నున్న వ్యాఘ్రచర్మముపై నాసీనుఁడై హరిశర్మచేఁ దన్నెఱిఁగించుకొనుతలంపున వినయమున నిట్లనియె. "దేవా! ఈనాఁటికి నేనెన్నఁడు మీదర్శనము జేసి ధన్యుఁడఁ గా, లేదు. జగద్విశ్రాంతకీర్తులగు మిమ్మొకసారి గాంచి నాశరీరము పావనముఁ జేసికొనవలయు నని వచ్చితిని. కాశ్మీర రాజసైన్యమునకు నేను సేనాపతిని. నన్ను దండపాణి యందురు." అని విన్నవించుకొనుటయు హరిశర్మ "నాయనా! నీయాకారమే నీయుద్యోగమును మును

ముందు దెల్పుచున్న యది. పగతురమూఁకలకు కాలుఁడవై యుందువు గావున దండిపాణి యను నీపేరు సార్థకమైనది. నిన్ను నాకడకుం దెచ్చి నపని యేదియో నాకెఱింగింపు" మని వాక్రుచ్చుటయు దండపాణి యిట్లని చెప్పఁదొడంగె. "దేవా! దేవరవారు దీనులపాలిటికి గాలు సేతులు గలకల్పవృక్షమనియు మాటలు నేర్చినమందారమనియు సంచరింపఁ గలసంతానమనియు జీవముగల చింతామణి యనియు కోవిదులు చెప్పుకొనుచున్నారు. కోవిదులకైన సమగ్రముగ లోఁతు తెలియరాని మీమహిమాసముద్రము నెఱుంగుట మాకు వశమా. మహాత్మా! మిమ్ము నేనొక్కచిన్నకోరికఁ గోరవచ్చితిని. అది యెఱింగింతు మన్నించి సావధానులరై విందురుగాక! హేమచంద్రమహారాజుగారి జనకులగు విక్రమసేనమహారాజుగారు నాతండ్రిని గడు నల్పస్థితిలో నుండియున్నత స్థితికిం దెచ్చి నన్ను దనపుత్రు లగుచిత్రభానుహేమచంద్రులతో సమముగఁ బెనిచిరి. చిత్రభానునకు నాకు మేనులు రెండుగాని ప్రాణ మొక్కటియే యని చెప్పఁదగినంత మైత్రి కలదు. హేమచంద్రుఁడు నాయం దిప్పటికిని భ్రాతృవాత్సల్యము నిలిపి యున్నవాఁడు. చిన్నయుద్యోగములో నుండి క్రమక్రమంబున నన్నింతటిమహాపదవిం దెచ్చెను. నాకు మణిమాలిక యను పుత్రిక యొకర్తు కలదు. నే నన గూడదు గాని మీయాశీర్వచనమున నబ్బాలిక కడుఁ జక్కనిదనియు రాజాంతఃపురములనుండఁదగిన దనియు మిముబోటిమహాత్ములు సెలవిచ్చిరి. తత్కారణమున నాముద్దుకూఁతును తన జ్యేష్ఠకుమారుఁడగు సాహసవిక్రమసేనునకుఁ బెండిలిజేసికొ మ్మని కన్నియ పుట్టినదిమొదలు హేమచంద్రుని వేఁడుకొనుచుంటి. మూర్ధాభిషిక్తు లగునరపాలురు నుపాయనరత్నాలకుప్పలు ధనసంచయములు దేశంబులు కానుకలు బెట్టి నాకూఁతుల విక్రమసేనున కిచ్చెద మని బాలకుఁడు జన్మించినది మొదలు హేమచంద్రునకు రాయబారములఁ బంపుచున్నవారు. అందుచేత

నావంటి యల్పునితో వియ్యమందుటకిష్టము లేక గాఁబోలు నతఁ డీసం
బంధంబు నొల్లక యెప్పటికప్పు డేదియో వంక చెప్పుచున్నాఁడు.
బాలకుఁడు యుక్తవయస్కుండు గాకమున్న వివాహము చేయ నని
యొక్కమాఱు, నరవిందాదేవి కిష్టము లేదని యొక్కమాఱు, మేనరిక
మున్న దని మఱియొకమాఱు చెప్పుటచే నేను విసికి కొంతకాలము
క్రిందట నాకుం బ్రాణమిత్రుం డగుచిత్రభానునియొద్దకుఁబోయి యాత
నికొడుకగువిజయసేనునకు నాబిడ్డను జేసికొమ్మని ప్రార్థించితి. అతఁ
డందుకు సమ్మతించె. ఇంతలో నాభాగ్యదోషమున నతఁడు బంధుమి
త్రులకు దూరుఁడై కన్నుల కఱవై పోయె. ఏదేశాంతరముల నైన
జీవించి యుండక యతఁ డస్తమించెననికూడ తెలిసినది. నామిత్రుఁడు
చిత్రభానుఁడు జీవించియుండిన నామనోరథంబు సఫలం బగును గాని
యిప్పుడు విజయసేనునకు నాబిడ్డ నిచ్చుట యసాధ్యము కదా. కావున
మీరు నన్ననుగ్రహించి నాకూఁతును విక్రమసేనునకుం జేసికొమ్మని
హేమచంద్రునకు నొక్కి చెప్పవలయును. అతనికి మీనోటిమాట వేద
వాక్యము. మీయాన వానికి శిరోభూషణము. నాబిడ్డకిప్పుడు పదవ
యేఁడు. చాండ్రికిరుపురకు నీడుజోడు తగియున్నది. కట్నములు కాను
కలు కోరిన ట్లిచ్చెద. వియ్యపుం దగవులు సరిగ నడపెద. ముద్దుము
చ్చటలు దీర్చెద. రాజుగౌరవంబునకుం దగినరీతి నేనా శ్యంపెద.
సంకల్పసిద్ధుల రగుమీరు దీని జేయఁదలంతు రేని యిది నెఱవేరుట
నిశ్చయము." అని ప్రార్థించుటయు హరిశర్మ వాని వేఁడికోలు విని
యెద్దియుం బలుకక కొండొకసే పూరకుండి మనంబున నెద్దియో. త
లంచిచిఱునవ్వు నవ్వుచు! దండపాణితో నిట్లనియె.

"అహాహా! లోకులయజ్ఞానమునకు మేర లేదు గదా! ధగధగ
వెలుఁగుదీపము దివ్యసుందరపదార్థమని భ్రమసి దానిపై వ్రాలి నశి
యించుపురుగులకును జ్ఞానసంపన్నులగుమనుష్యులకును భేదముగానఁ

బడకున్నది. క్షణములో ముక్కముక్కలగుగాజురాలును సుస్థిరము లగుమాణిక్యంబులయట్లు తళతళ మెఱయుచుండుటంజేసి లోకులు ప్రమాదవశంబున మణులు గ్రహింపఁబోయి వట్టిఱాళ్లు గ్రహించుట యుఁ గలదు. ఎంతో ప్రాజ్ఞుఁడ వనుకొంటిఁ గాని నీవింతపామరుఁడవని మొదటఁ దలంప నైతి” అని హరిశర్మ వలుక నాపలుకులు దండపాణిపీనులకుఁ గఠోరములై మనస్సున కస్తుతములై శోకమయొక్క నిముసమువఱకు వానిం బిచ్చివానినట్లు చేసెను. దండపాణి తెల్లతెల్ల బోవుటయు నెద్దియుం బలుకఁజాలకుండుటయుఁజూచిహరిశర్మ వానికిఁ దనమాటలయర్థము చెప్పఁదలఁచి యిట్లనియె. “నీవు తెల్లబోవు చుంటివేమి? నామాటలయర్థము నీవెఱుఁగవా? మీరు రాజునకత్యంతప్రియసేవకులు. మీవంటివారు ముందు రాఁగలయరిష్టంబులం జెప్పరాదు. చెప్పితివో నీసందేహంబు లన్నియు నడంగు” నన దండపాణిసంభ్రమము విడిచి తెలివి దెచ్చికొని “స్వామీ! మీరాన తియ్యఁదలంచిన దానటియ్య నచ్చు. మీనోట వెడలినను డువులు తేనికిఁ గాని మఱియెవ్వరికిఁ గాని యెఱిఁగింప నని మీరు నేయు మన్న ఘోరప్రమాణంబు జేయువాఁడ” నని చేతులు జోడించి మనవిచేసెను. ఆతనివినునవి చిత్తగించి హరిశర్మ వానిచే గొప్పయొట్టు బెట్టించుకొని చెప్పఁబోయి మరల చెప్పఁ సందేహించి యెట్టకేల కిట్లనియె.

“దండపాణీ! గతానుగతికోలోకః నలోకః పారమార్థికః' యనునట్లు లోకులొకరని జూచి యొకరు నడచుటయే కాని పరమార్థ మెఱుఁగరు. నిన్న హేమచంద్రునితోఁగూడ వానికొడుకు లిరువురు నాకడకు వచ్చిరి. ఆబాలకులఁ జూచినది మొదలు రాగవిహీనమయ్యె మామనస్సెంతయుఁ జింతాకులమై యున్నది. అంతచక్కఁదన మున్నందుకు నట్టి తెలివి తేటలున్నందుకు సంతటివంశమునఁ బుట్టినందుకు నాబాలకుల కిరువురకు దీర్ఘాయుఃప్రమాణమున్న పక్షమునవెంత

బాగుండును! బ్రహ్మ యెంతచూపోపనివాఁడో కానియీముద్దుకొడుకుల నిద్దఱ నర్ధాయుష్కులం జేసెఁగదా! మా దివ్యదృష్టిచేత మే మెంత చక్కఁగఁ బరికించి చూచినను విక్రమసేనహర్షవర్ధనులు కొలఁదికాలములోనే తీఱిపోదు రని తోఁచుచున్నది. వానితలిదండ్రులభాగ్యమే మో కాని విజయసేనుఁడు దీర్ఘాయుష్మంతుఁ డని నాదివ్యదృష్టికిఁ బొడకట్టు చున్నది. ప్రస్తుతమువాఁడు పితృవిహీనుఁడై నిఱుపేదయై దిక్కుమాలినవాఁడై యున్నను గాలక్రమంబునఁ గాశ్మీరరాజ్యంబున కేలిక కాకమానఁడు కావున నాసేయుహితోపదేశంబు విని నీకూఁతును విజయసేనునకిచ్చి పెండ్లి సేయఁ దలంచుకొనుము. విక్రమసేనుని మాట మఱచిపొమ్ము. మొదట విజయసేనునకె యీమెనుగూర్పఁ దలంచితివి గావున నీప్రథమసంకల్పమే నెఱవేర్చుకొనుము. నీయల్లుఁడు మూర్ధాభిషిక్తుఁడై చిరకాలమవనినేలును. నీకూఁతురు కాశ్మీరదేశపు రాణియగును. లోకతంత్రసంబంధములు లేనిమాకు విజయసేనుఁడు విక్రమసేనుఁడు నొక్కచందంబ. ఉన్న దున్నట్టు లెఱింగింపవలసి వచ్చెఁ గావున మే మప్రియము జెప్పవలసినవార మైతిమి.

భావికాలగతుల నుద్దేశించి దివ్యదృష్టి పరిభావమున హరిశర్మ నోట వెడలినయానుడువులు దండపాణికి వేదవాక్యములట్లు దృఢవిశ్వాసమును గలిగింప నతఁడు భక్తితత్పరుఁడై లేచి నడుమున కుత్తరీయంబు జుట్టుకొని 'స్వామీ! మీరు నన్ను బ్రదికించిరి. మీ రీహితోపదేశంబు జేయకుండు రేని నే నెట్లో మొదలు విఱిచి రాజు నొప్పించి నిష్కారణముగ నాకూఁతుగొంతు కోసికొన్నవాఁడనగుదు నాకు మీరు నేఁ డొనర్చినమేలు మఱువఁజాల' నని చాగిలంబడి మొక్కి మఱల నిట్లనియె: "స్వామీ! విజయసేనుఁ డిప్పు డెందున్న వాఁడో నే నెఱుంగను. ఇది సమకూరు నెట్లు? ఇప్పుడు చిత్రభానుఁడు లేకపోయెఁ గదా! హా మిత్రమా! చిత్రభానుఁడా! నీవు జీవించి

యుండఁగ నీతోడ నేను వియ్యమందలేక పోయితిఁగదా! ప్రియదర్శనుఁడ వగునీవు నీమనోహరాకారము నొక్కసారి నాకన్నులు చల్లఁబడ జేయరాదె" అని పలుకుచుండఁగనే యిరుకన్నులనుండి ముత్తెముల వంటిబాష్పములువచ్చుటయు నటమీఁద మాటలాడఁజాలక యతఁడు గోడం జేరఁబడి మొగమున నుత్తరీయాంచలమును వైచికొని కూర్చుండెను. ఆతనిసమాశ్వాసింపఁ దలఁచి హరిశర్మ మొగమునుండి చేలాంచలమును దొలఁగించి "యోయి పామరుఁడువోలె నీవిటు చేయఁదగునా? సజ్జనులు పుత్రవియోగమైన సహింతురుగాని మిత్రవియోగము సహింపరు. మిత్రుఁడు దుష్టుఁడైనను సజ్జనుఁడు వాని పక్షమునె పూనును. నీమిత్రుఁడు రాజద్రోహము చేసినందులకు దేశమునుండి వెడలఁగొట్టఁబడి జననింద్యుఁడయ్యును నీకు వానిదెసనను రాగంబు చెడకపోవుట నీయోగ్యతను ప్రకటించుచున్నది. ప్రపంచమునం గలజనులందఱు చిత్రభానునియెడ ద్వేషము పూనినను నీవుమాత్రము వానియెడ నెయ్యమును విడువకుము. ఆతనిమాత్మదీని కెంతయు సంతసించును. చిత్రభానుని నీవు నిజముగఁ జూడఁదలఁతు వేని వాని మూర్తి నీకన్నుల కొకసారి యగపడునట్లు నేఁజేయఁగలను. ఇది పరమరహస్యము సుమీ!" యని పలికెను.

"చిత్రభానునిమూర్తి కన్నులకగపడునట్లు చేయఁగల" నని బ్రాహ్మణుఁడు పలికినపలుకులు మిక్కిలి యద్భుతావహములై దండపాణిమనస్సునకు నాటెను. "మృతినొందిన పురుషుఁ డేమి నాకన్నులకుఁ గన్నులఁ గానఁబడుట యేమి? చచ్చినవారి నితఁడు చూపఁగలఁడా? ఏమో! వీనియొద్ద నెట్టిమహిమ లున్నవో! ఒకవేళ చిత్రభానుఁడుబ్రదికియే యున్నాఁడో" యని దండపాణిమనంబున నప్పుడు వెంటవెంటనే కొన్నిసంశయము లుత్పన్నములయ్యె. అడిగి తన సంశయము దీర్చికొనుట మంచిదని యతఁడు బ్రాహ్మణునితో

స్వామీ! చచ్చినవారు మఱలఁ గానఁ బడుట సృష్ట్యాదినుండి యీ వఱకు నెన్నఁడు వినలేదు. అద్భుతమైనచో మీప్రభావమువలనఁ గావలయు' నని పలుక హరిశర్మ తనమాటల నతఁడు విశ్వసించుట లేదని తెలిసికొని తనయం దతనికి దృఢభక్తి నెలకొనునట్లు చేయఁదలఁచి యిట్లనియె. "ఓయువివేకి! యిటువినుము. చిరకాలము భూలోకసుఖంబుల ననుభవించి వార్ధకముచేత నవయవపటుత్వముదప్పఁ బెట్టుల ముగ్గినపండునేల రాలునట్లు కాలము తీఱి మృతినొందునతఁడు ముక్తుఁడయి భూలోకవాంఛలు విడుచును. నిండుప్రాయమున గంపెడాసలులోనఁబెట్టుకొని యొకదానియందును మనోరథసిద్ధి పొందక యకాలమున మృతినొందునతని యాత్మ ముక్తినొందక సంప్రపంచమును విడువఁజాలక యిందే విహరించుచుండును. శరీరము కాలిపోవునుగాని యాత్మ కాలదు గదా. దేహంబునకుఁ జావున్నదిగాని యాత్మకుఁజావులేదు కదా. ఇఁకను నామాటలు నీవు విశ్వసింప వేని సోమవారమునాఁడు రాత్రి రెండుజాములప్పుడు నీ వొక్కఁడవు మాగుహకు రమ్ము. చిత్రభానునియాత్మ నీతోడమాటలాడఁ గలదు. మృతినొందినవారియాత్మలను మాటలాడింపఁగలప్రభావము నాకుబరమేశ్వరునియనుగ్రహము వలనఁ గలిగినది. అట్లు చేసినాఁడె నీకు నామహత్వంబు దేటపడఁ గలదు." అని ప్రతిజ్ఞాపూర్వకముగ హరిశర్మనుడువుటయు దండపాణి మహాశ్చర్యరసనిమగ్నుఁడై యదివఱ కెన్నఁడు నెవ్వరుఁ గని విని యెఱుఁగనియీవింత జూచుభాగ్యము దనకు లభింపనందులకు మహానందభరితుఁడై బ్రాహ్మణునియొద్ద సెలవుపుచ్చుకొని సోమవార మెప్పుడు వచ్చునాయని యుత్కంఠతో నూరకుచుఁ గాలముగడుపుచుండెను.

ఇది జరిగిన మూఁడవనాఁటి రాత్రి బ్రాహ్మణుఁడు భైరవునితోఁ గూడి గుహలోఁ గూర్చుండి యనేకవిషయములం గూర్చి ప్రసంగించుచుండ నంతలో వెనుకప్రక్కల నడచినయలికిడి వారికి వినవచ్చెను.

అతనిమనస్సు నిత్యము శంకాసంకలితమై యుండుటం జేసి యతఁడు భైరవునిం బిలిచి "వత్సా! ఆయలుకుడు మనుష్యులదేమో కనుఁగొని మనుజులదే యైనయెడ వారెవ్వరో, యెందునిమిత్త మిచ్చటి కరుదెంచి నారో కనుఁగొని ర" మ్మని పంపెను. భైరవుఁడు గండ్రగొడ్డలి చేతఁబూని యావలకుంబోయి మెల్లగ నెవరువారని యడుగ నేను గాలకంఠుఁడను తక్కినవారిమాట నడుగకుమని ప్రత్యుత్తరము వినఁబడెను. భైరవుఁడు కాలకంఠుని వాని ననుసరించివచ్చుచుంటియొక మనుష్యునిదోడుకొని బ్రాహ్మణునియొద్దకుఁబోయి "స్వామీ! కాలకంఠుఁడు దేవశర్మను దోడ్కొనివచ్చెను. ఆయలుకుడు మనవాండ్రదే. క్రొత్తవాండ్రెవ్వరును లే" రని విన్నవించెను. అమ్మాటలువిని కడు నలరి హరిశర్మ 'యోరీ! హోమగుండమును విసరి చక్కగ మంటచేయుము. దేవశర్మనుజూచి చాలకాల మయినది. మనసార వానిమొగ మొకసారి వెలుఁగునం జూడవలయు' నన భైరవుఁడు కొన్ని యెండు చిదుగులు హోమగుండమున వైచి విసరి జ్వాలచేయ నారంభించెను. ఇంతలో హరిశర్మ కాలకంఠునిబిలిచి కుమారా! నీవేగమువాయువేగ మనోవేగముల మించెను. నీశరీర మినుముతోఁ జేయఁబడినదని తోఁచుచున్నది. నీవి లేడికాళ్ళు. అందుచేతనే చెక్కుచెదరక నడవరానినట్టడవులఁ జొచ్చి సత్వరంబ దేవశర్మను దోడ్కొనివచ్చితివని బహూకరించి యింతలో భైరవుఁడు చేసిన మంటవెలుఁగున దేవశర్మమొగమును బరీక్షించిచూచి "మిత్రుఁడా! నీముఖదర్శనముచేత నేనిప్పుడు మిక్కిలి సుఖవంతుడనైనాను. ఆహాహా! ఏమి నీ వచ్చముగ ఋషివలె నున్నాఁడవు! నిన్నానవాలు పట్టుటే దుర్ఘటముగ నున్నది. నీతలను మొలిచినవిగాకున్న నీ కెంజెడలు నరిగ మొలచినట్లేయున్నవి. నీవు తొల్లి నాకగపడినప్పటికంటె చిక్కియున్నాఁడవు. కాని నీకష్టములు గట్టెక్కుకాలము వచ్చినది. నీతోడ మాటలాడి చేయఁదగు

కార్యముల నేకము లున్నయవి. నీవీదినము మొదలిచ్చట నేయుండుము; పగలు నీవు ప్రజలకంటఁ బడకుండఁ దగునేర్పాటులు గావించెద; నీకి చ్చట నుండుట యరిష్టము కాదు గదా" యని యడిగెను. అప్పలుకులు విని దేవశర్మ మిక్కిలి సన్నికంఠముతో "స్వామీ! మీయండ నుండుట నాకు మహేంద్రపీఠము నెక్కుట; మీపలుకులకును బ్రాజఁ దువులకును భేదము లేదు. మీరు రమ్మనిన నత్తు. పొమ్మనినఁ బోవు దు. వీఁడునిత్యము మీదాసుఁడు సుడీ" యని బదులుచెప్పి నాకుఁ జే యవలసిన హితోపదేశ మేమో చేయుమని వానిని వేఁడెను.

వేఁడుటయు హరిశర్మ దేవశర్మను భైరవకాలకంఠులసమీపము ననుండి గుహాగర్భమునకుఁ దోడ్కొనిపోయి చాలసేపు వానితో రహ స్యములు మాటలాడెను. ఆసంభాషణము ముగిసినపిదప భైరవుఁడు హరిశర్మతో 'నేను మీసెలవుచొప్పున నంతయు సిద్ధము చేసితిని. మొన్న నన్ను జేయుమన్నపని యెప్పుడు గావలయు నప్పుడచేసెద. మీయాజ్ఞ కెదురు చూచు చున్నవాఁడ' నని విజ్ఞాపన మొనర్చు కొనెను.

'అ య్యదను నీకు నే నెఱిఁగించెద వేగిరపడకుము. పచ్చికా యలు గోయుట మంచిది కాదు గదా! ఇంక మీరు నిద్రింపుఁడు. చాలప్రొద్దు వోయినది.' అని చెప్పి తక్కినవారి నిద్రపుచ్చి తానును నిదురించెను.

పదియొనిమిదవప్రకరణము.

మనుష్యునకు మనసున నున్నయుబలాటము దీరువఱకు నేపని యుం దోఁచదు. అందసంభవము లగువింతలఁ జూచునాస మనంబున నెలకొనియున్నప్పుడు నరునిమనంబున నభిలాష మెట్లుండునో యనుభ

వించినవారికే తెలియవలయుఁ గాని తదితరుల కెత్తెఱంగున నెఱుఁగ నగు. హరిశర్మ చిత్రభానునియాత్మ జూపుదు నని చెప్పినది మొదలతఁడు ప్రగల్భములు వలికెనో నిక్కువంబు వక్కాణించెనో తెలియఁగోరి దండపాణి యాదివారమునాఁడు తేఁకు తిన్న గానిదూరపోవక నాలుగుజాములకు నాలుగుమాఱులులేచి తెల్లవాఱినదేమోయని చూచి యెంతకుం దెల్లవాఱదని విసిగికొని మెట్టకేలకుఁ గాకులుకూయుసమయమున లేచి కాల్యంబులఁ దీర్చికొని తెల్లవాఱినదిమొదలు మఱునాఁడు సాయంకాల మెప్పుడగునని కనిపెట్టుకొని యుండి సంధ్యా సమయమున గుహకుఁ బోయి బ్రాహ్మణునింజూచి నేఁటి తేయి రెండుజాములవేళ వత్తునా యని యడిగెను. తప్పకరమ్మని హరిశర్మ యానతిచ్చుటయు దండపాణివడివడి గృహంబునకుఁబోయి భోజనము చేసిపోవలసినత్రోవ నిర్జనప్రదేశమగుటచేతను సేవింపఁ బోవుచున్న మనుష్యుఁడుఁ గ్రొత్తవాఁ డగుటచేతను సమయ మర్ధరాత్రి యగుట చేతను గొప్పపదవిలో నున్న పురుషులు దారపుత్రుల నైననమ్మి నిర్భయముగ విహరింపఁగూడ దనునమ్మికయతని కుండుటచేతను నక్కడకుఁ బోయిన వెనుకఁ దన స్థితి యెటుపోయి యెటువచ్చునోయనిస్వసంరక్షణము కర్తవ్యమని తల నినుపబొమిడికంబు వెట్టి మేన శస్త్రదుర్భేద్యం బగుకవచంబు దొడిగి యనేకరణరంగముల నప్రతిహతముగ సంహారక్రీడ గావించి యెన్నండు మొక్కవోనితనకఱకుకత్తి నొరలో వైచి పాదరక్షలు దొడిగికొని సంకేతస్థలమునకుబయలువెడలెను; ఆ స్థానమునకుఁ దానుబోవుట యొరులెఱుంగకుండ వలయునని యతఁడు మొదటనె పట్టణము మాటుమణఁగిన వెనుక బయలుదేఱి రాజవీథిని బోయినపక్షమున నిశాసమయంబుల సంచరించువారు తన్నానవాలు పట్టవచ్చు నని శంకించి సందుగొందులదారులబట్టి నూరుబైటికివచ్చి మెల్లమెల్లన నడుగులు లెక్కబెట్టుకొనుచు గుహకడకు వచ్చె. అప్ప

టికి హరిశర్మ సామగానముచేయుచు వ్యాఘ్రచర్మముపైఁ గూర్చుండె.
భైరవకాలకంఠులు గుహాద్వారముకడ జేరియొకగోడకుం జేరబడికును
కుపాట్లు పడుచుండిరి. దండపాణిపోయి ద్వారముకడ నిలిచినతోడనే
హరిశర్మచూచి 'దండపాణీ!'యని పలుకరించి యతఁడు పలికినతోడ
నె రమ్మని సమ్మానించి కూర్చుండఁబెట్టి కూర్చుండియే నిదురించు
చున్న సేవకు లిరువుర లేపి ద్వారముకడ జాగరూకతతో నుండుమని
యానతిచ్చెను. అనంతరము హరిశర్మయు దండపాణియు గాశ్మీర
రాజువిషయికము లగుప్రసంగంబులు కొంతతడవు నెఱపినపిదప దండ
పాణి "స్వామీ! అప్రతిహత మగు మీప్రభావమున నామిత్రునియా
త్మను జూచుటకు నామనంబు తత్తరపడు చున్నది. ఈమైదాఱుదినం
బులు నాయభిలాషను నే నెట్టులాపుకొనఁజాలితినో నే నెఱుంగను.
కావున నిపు డైననించుకయు జాగు సేయక నా వచ్చినపని నిర్వర్తింప
వేఁడెద” నని యెంతయు నాత్రమున విన్నవించె. హరిశర్మయు వాని
యుబలాటమునుజూచి వానితోఁ దాను జెప్పవలసినమాటలు చెప్పుట
కదియ లెస్సయగునద నని వానికిట్లనియె. 'చిత్రభానుఁడు మృతి
నొందుటచే వానిశరీరము దగ్ధమైనదని నీ వెఱుంగుదువు. ఆత్మ
నిరాకారమగుటచే నది నీకుఁ గానఁబడదు. ఇప్పుడు నేను జేయుగలఁ
దే మనిన వానియాత్మ నీతో మాటలాడునట్లు చేసెద. నీ పరమ
మిత్రుని యాత్మనిన్ను గాంచినతోడనె యెట్టికోరికలు కోరునో మన
మెఱుంగము గదా! చిరమిత్రుఁడ వగునీవు వానికోరికలను ద్రోసి
పుచ్చ రాదు సుమీ!' అనవుఁడు దండపాణి నాబహిఃప్రాణ మగు
సంగడికాఁడు నావీనులకు విందగునట్లు పలుకుటయె చాలు. వానికోరి
కలు నేను నిరాకరింతునే యని ప్రత్యుత్తరము చెప్ప హరిశర్మ వాని
యుత్తరంబులకు సంతసించిలేచి చేతులు పైకెత్తి కొన్నిమంత్రములఁ
బఠించి 'శ్రీపరమేశ్వరుండు నాకిష్టదైవత మగునేని భగవతి మహిషా

సురమర్దనికి నే నభిమానపుత్రుఁడనేని సత్యసంధుఁడనేని చిత్రభానుని యాత్మ దండపాణితోఁ బలుకుగాక" ! యని తనయావాహనము ముగించెను. ముగించినతోడనే "హా! అన్యాయము: అన్యాయము అన్యాయ" మని మూఁడుమాటలు వినఁబడియె. అప్పుడు నిచ్చముగ జిత్రభానునినోటనుండి వెడలినపలుకులట్ల యుండుటం జేసి దండపాణి యద్భుతసంభ్రమంబులు పెనఁగొనఁ జెవులు రిక్కఁబెట్టి నలుఁగు నా ధ్వనినిమిత్తము నిరీక్షించుచుండెను. అంతలోఁ 'హేమచంద్రునినిడువుము. నాకు నీకుఁ గలమైత్రి నాటింపుము. విజయసేనునకు నీకూఁతు నిచ్చి పెండ్లిసేయుము. నీయల్లుఁడు రాజుకాఁగలఁడు. అనునాలుగు మాటలు తూర్పునుండి యొకటియు, దక్షిణమునుండి యొకటియు, పడమటినుండి యొకటియు, ఉత్తరమునుండ యొకటియు వినఁబడెను. అనంతరము మఱికొన్నిమాటలు దండపాణి వినఁగోర నొక్కపలుకును వినఁబడదయ్యె. అతఁడు మాటలాడుట చాలించెనాఁ డని హరిశర్మ దండపాణితోఁ జెప్పెను. దండపాణి 'స్వామీ! మొట్టమొదట నన్యాయమన్యాయ మని నాకు వినఁబడినమాటల కర్థ మేమి యని విప్రు నడిగెను. బ్రాహ్మణుఁడు మంచిమాటకొ నీ వడిగితివి. తన్ను దేశమునుండి వెడలనడచుట యన్యాయ మని యతఁడు మువ్మాటికి నొక్కిపలికె. నీవు విజయసేనునిపక్షమున నర్థప్రాణములు ధారవోయుదుననని నీ మిత్రునికోరిక. అట్లుచేయుదునని యగ్నిసాక్షిగ నీవీహోమగుండము నొద్ద ప్రమాణము చేయుము. చేసినబాసలు నిలిపికొనుము. నీతికి నిలువంబడుమని పురికొల్పు దండపాణి భయాద్భుతములచేత నావేశింపఁబడి విజయసేనునిపక్షమున నుందునని విప్రుఁడు చేయించినప్రమాణములన్నియుఁ జేసి పెట్టుకొమ్మన్నయొట్టు లన్నియుఁ బెట్టుకొనియె. ఆశపథంబులు ముగిసినపిదప నాతఁడు యచ్చటజరిగినవింతమాటల మఱునాఁడెక్కడ నెత్తనని దండపాణిచేత హరిశర్మ వేఁడియుంగొన్ని

బాసలు చేయించెను. అనంతరము దండపాణి "ఇపుడు రెండు జాముల కంటె నెక్కువయైనది. నేనింటికిఁబోయెదను. మీపునర్దర్శన మెల్లుండి చేయువాఁడ. ప్రస్తుతము నాకు సెలవొసంగుఁ" డనుచు లేచినిలువ హరిశర్మయు మంచిదని భైరవకాలకంఠులను వానివెంటఁ గొంతదవ్వు పంపి వారు మరలివచ్చినపిదప సుఖముగ నిద్రించెను.

దండపాణి గుహ విడిచి స్వగృహాభిముఖుఁడై నదిమొదలు బ్రాహ్మణప్రభావమును గూర్చియుఁ దన కాతేయి వినంబడిన మాటలఁగూర్చియు దనలోఁ దానిట్లని వితర్కించుకొనఁ జొచ్చె. "ఈబ్రాహ్మణునిచేతలు మాయలా యింద్రజాలములా లేక నిక్కువములా? ఘట్టిబుద్ధియైతేఁగి యిట్టివింత లెన్నఁడును గనివిని యెఱుంగ. చిత్రభానుండు నిజముగ మృతినొందియుండునా? లేక యెందేనిఁ బ్రదికియుండునా? బ్రదికియుండినచో మృతినొందెననియీవిప్రుఁడు రాజుతో నేలచెప్పవలయు. కావున తప్పక మృతినొందియే యుండును. అట్లయినచో మృతినొందినవారు మరల మాటాడుట యెట్లు? ఇతఁడే పురుషునిచేతనైన మాటలాడించి నన్నువంచించి యుండఁడు కద! అట్లయిన సరిగఁజిత్రభానునికంఠముతో మాటలాడఁ గలపురుషుఁ డెవ్వఁడు దొరకును. మనుష్యుని బోలినమనుష్యుఁ డుండవచ్చును గాని యచ్చు గ్రుద్దిన ట్లంతసరిగా నుండు టరిది. కావున నిది తప్పక బ్రాహ్మణునిప్రభావమే యై యుండవలయు. ఒకవేళ చిత్రభానుఁడు జీవించియే యుండి యిటవచ్చి నాతోడం బలికినాఁ డని మాటవరుస కనుగొందము. అటులైన నాకూఁతు నతనికుమారున కిచ్చి పెండ్లి సేయ నిశ్చయించుకొంటిఁ గావున హేమచంద్రుని విడిచి చిత్రభానుని జేరవలయు. విక్రమసేనహర్షవర్ధనులు నిశ్చయముగ నల్పాయుష్కు లని యితఁడు చెప్పెఁ గదా; అందుచేత నెప్పటికైన విజయసేనుఁడు రాజు గాక తప్పఁడు. నాపేరుఁ దీసి వానిమెడ వేయఁదలంచుకొన్నపుడు

వాని సుఖదుఃఖములు నావియు నాసుఖదుఃఖములు వానివియు నై యుండుట ధర్మము." ఈవితర్కముచేతఁ బరాయత్తచిత్తుఁడై యతఁడు తనయిల్లు దాఁటి కొంతదూరము పోయి మరల వెనుకకు వచ్చి యిల్లు చేరి పండుకొని గుహలో జరిగినవింతలు స్వప్నమునం గాంచుచుఁ గలతనిద్దుర వోయెను.

పందొమ్మిదవప్రకరణము.

ప్రాణనాథునితోడిదే లోక మని నమ్మి మగనియడుగుఁదామరలు దన కేడుగడయుగ నెంచుకొని జీవయాత్రగడపుపరమపతివ్రత హృదయేశ్వరుఁడు ఖిన్నుఁడై విమనస్కుఁడై యున్నప్పుడు తా నట్లే ఖిన్నయై విమనస్కయై యుండుటయు సహజము గావే. కల నయిన వియోగము దలఁపోయక పరిహాసమునకైనఁ బ్రణయకలహ మాడక మితిలేనిచనువులు మేరలేనిమమతలుగలిగి రెండు మేనులొక్క మే నగునట్లు కలసిమెలసి పూవుందావియుఁ బోలియున్న దంపతులలో మగఁడు వేఁడుకలకు వెలియై యున్మాలికమున కునికిపట్టయి యుండు తఱి కులకాంత మనస్థితి యెట్లుండునో యిచట వర్ణింపనక్కఱ లేదు. కుమారులిరువురు తండ్రివెంట గుహకుఁ జని యచట జరిగినప్రసంగ ములు తల్లికిం దెలిపినదిమొదలు మనసు మనసులో లేక యరవిందా దేవి మొగము నైవర్ణ్య మొందనేపనిం జేయక యేసౌఖ్యముం గోరక చింతాక్రాంతచిత్తయై యుండె. దానికిం దోడుగ హేమచంద్రుఁడు రాజకార్యములు చాలవఱకు మంత్రుల కప్పగించుటయు నెచ్చెలుల తోడఁ దొల్లిటియట్లు కలయక పోవుటయు రాయబారుల కతికష్టమునఁ గాని దర్శన మీయకపోవుటయు నంతఃపుర సేవకులపరిచర్యలమునుపటి యట్లు లంతగా నపేక్షింపకపోవుటయుఁ బలుకరించిన సందర్భమున్నని

తే కున్నను వేదాంతప్రసంగములు నెఱపుటయు మున్నగుమార్గములు రాణిచింతాజ్వరమునకు మఱింతదోహదము చేసెను.

అట్లరవిందాదేవి కొన్నినాళ్లు వగచి హిమవంతునివంటి ధైర్యసారము గలమహేంద్రదేవునికూఁతు రగుటచే ధైర్యము దెచ్చుకొని రాఁ దలంచినయపాయములను దగునుపాయములచే నివర్తింపఁజేయుట యుత్తమజనలక్షణ మగును గాని విచారించుట పామరలక్షణ మని తెలిసికొంది యొకనాఁడు సాయంకాలము మేడమీఁద నొక్కర్తె కూర్చుండి తన చెలికత్తెయుఁ, బుట్టినింటినుండి తనకు బ్రాణపదముగ నుండు నని యెఱిఁగిన యొప్పులకుప్పయు, [illegible] నేర్పుగలబాలయు నగుసరసికను బిలిచి "ఓసీ! సరసికా! మాయయ్యగా రున్న తెఱంగు జూచుచుంటివా?" యని యడిగెను. "ఎఱుఁగ కేమి గుహాలో నున్న బాపనయ్యయును జూచినది మొదలు వారిచిత్తము చెడిపోయిన" దని యామె బదులు చెప్పెను. "అట్లయిన నెఱిఁగియుండియు నీ విన్నాళ్లయుపేక్ష చేసితివే?" యని రాణి కొంచె మలుక నడుగ "అమ్మా! నేనే ముందుగ మహారాజుగారిమాట నెత్తుట మంచిది కాదేమో యని యూరకుంటి" నని వెంటనే యామె ప్రత్యుత్తర మిచ్చెను. "అట్లయిన నావిషయమున నీ వించుక శ్రమపడవలయు. అది రెండవకంటివారి కెఱుగకుండ నిర్వర్తింపఁదగినది. అట్లు చేయఁగలవా" యని దేవి యడుగుటయు "అమ్మా! నాకు మీరు పని చెప్పుట నాయం దనుగ్రహము జూపుట కదా!" యని యది బదులు చెప్పెను.

అంతట నరవింద యమ్మదిని దాపునం గూర్చుండఁ బెట్టుకొని "సఖీ! మహారాజుగా రెందుచేతనో మనలో లేరు. చిత్తముగుహాలోను శరీరము గృహములో నున్నట్లు తోఁచుచున్నయది. ఎంతచెప్పినను మహారాజుగారు సముద్రమువలె గుణరత్నాకరు లయ్యు గంభీరు లగుటచే వారి నడుగుటకు నామన సొప్పకున్నది. అఖిలభోగ్య

షులు విడిచి వైరాగ్యమును బూనవలయు ననియు రాజహంసమునకు దలఁపు గలిగినది. ఆయనయిచ్ఛానుసారముగ నింట రాజయోగి యై యుండవచ్చుఁగాని యర్ధరాత్రముల, నపవేళలఁ గానిచోటుల నెన్నఁడును ముక్కుమొగ మెఱుంగని విదేశీయులయొద్దకుఁ బోయియుండ దగునా? మహామంత్రము లఁట, పునశ్చరణము లఁట నిశలఁ జేయవలయు నఁట. బాలకుల మొగంబుల నిది విన్నదిమొదలు నామనసు మనసున లేదు. నీవంతయుఁ జూచుచునే యున్నావు; నీకుఁ జెప్పవలసినది లేదు; కాని కన్నులు మూఁతఁబడవు. అన్నము విష మయినది. అభముశుభ మెఱుఁగని బాలకులే తద్దయు బెంగఁ గొని యున్నారు. ఇంక నామాట చెప్ప నేల? జీవితేశ్వరునిచిత్తము నీయపూర్వవైరాగ్యమునుండి తొలఁగించుటకు నాకొక్కయుపాయము పొడకట్టినది. అది విని నాచెప్పినచొప్పున నీ వాచరింపుము. కాశ్మీరరాజ్య మను మందిరమునకు దృఢస్తంభములు రెండు గలవు; మణివర్మయు మాధవసేనుఁడు ననుమంత్రులే యా స్తంభములు. వారిరువురు నాకుం బితృసమానులు; మహారాజుగారును వారి నట్లే భావింతురు. న న్నిక్కడకుఁ బంపునాఁడు మాయయ్య నాసేమము నిరంతరము కనుఁగొనుమని మణివర్మతో మఱిమఱి చెప్పె; కావున నీవు ముందుగా మణివర్మయొద్దకుఁ బోయి నాప్రణామంబు లెఱిఁగించి నాపడుచున్నయులమట వానికిం దెలిపి పరాయత్త మయినప్రభుచిత్తము మఱల నెప్పటిచోట నిలుపు మని చెప్పుము. సంశయస్థితికి వచ్చిననాయదృష్టమును జక్కఁజేయు మనుము. మాయయ్యతొల్లి తనతోఁ జెప్పినపలుకులు జ్ఞప్తికిం దెచ్చి కొమ్మనుము. తానుదక్క నొరు లీపనికి సమర్థులు కారనుము. ఇంతియె కాక నీకుం దోఁచిన తెఱంగున సమయోచితముగఁ బలికి కార్యసాఫల్యముఁ జేసికొని రమ్ము పొమ్ము" అని వీడుకొలుపనర్మద యట్లుచేసెద నని యామెను వీడ్కొని యప్పుడ యేరికిం జెప్పక మణి

వర్మ మందిరమునకుం జని వానిని సందర్శించి దేవిసన్నిధినుండివచ్చిన ట్లువానికిఁ దెల్పి సమ్మానితుఁడై వచ్చినపని దెల్పు మని యాతఁడు కోర నిట్లనియె.

"స్వామీ ! మహారాజుగారివైఖరి మాఱిపోవుట మీరును నెఱుఁగుదురు. ఊరుబైట ముక్కుమూసికొని బకధ్యానము చేయు దొంగలగురువు కపటము కల్ల నెఱుంగనివెఱ్ఱివానిం జేసి మహారాజు చిత్తము నపహరించినాఁడు. ఇఁకమీఁద విత్తము హరించి సంకల్ప సిద్ధుఁ డగును. రాజుగారు నడిరేయి నొంటిగ గుహకుఁ బోయి యా టక్కరిబాపనయ్యవలన నేవియోమంత్రములు నేర్చుకొను నఁట. అక్కడకుఁ బోయిన నపాయము వాటిల్లునని దేవి శంకించి భీతచిత్త యై యున్నది. సాధ్వీచిత్తమునకు స్వస్థతఁ దెచ్చుభారము మీపై నున్న దన్నది. ఈకార్యమును నిర్వహించుటకుమీకన్న సమర్థులెవ్వరు లేరన్నది. మీరేతల్లియుఁ దండ్రియు నన్నది. వేయేల? అనవలసిన వన్నియు నన్నది. ఆబాల గుండె బెదరియున్నది. కావున మీరామె ననుగ్రహించి మహారాజుగారిమనస్సు నాయుద్యమమునుండిమఱలింప వలయు." అనవుడు మణివర్మ తుళ్ళిపడి యిట్లనియె. "ఏమీ! అను దినము సాయంకాలము హరిశర్మదర్శనార్థమై పోవు చున్నా రని యెఱుంగుదును. కాని యీమంత్రోపదేశవృత్తాంతము వినలేదు. ఇది యొకక్రొత్తయూహ యని తోఁచెడు. ఏదోయపాయము కలుగ వచ్చునని నేను శంకించు చున్నాఁడ. ఈవఱకే తఱచుగ గుహకుం బోవల దని రాజుగారితోఁ బలుమాఱు చెప్పితిని. ఎంతచెప్పిననామాట వారు పాటింపరైరి. అయిన మఱలం జెప్పి చూచెద. పట్టి చెప్పు టయె కాదు. ఆ యుద్యమము మాను మని గట్టిపట్టు పట్టెద. అర వింద దేవి నన్నింతవేఁడవలయునా ? నేనామెకు సేవకుఁడను. పితృ సమానుఁడను. కావున శక్తివంచన లేక యీవిషయమునఁ బాటు

పడుదునని మనవి చేయుము." అనవుడు నర్మద "స్వామీ నామీఁద మీకుఁ గోపము వచ్చినను సరే కాని రాజుగారిబుద్ధి యీపనినుండి మరల్చుటయే కాదు. ఈయూరినుండి యీబ్రాహ్మణపిశాచమును వెడలఁ గొట్టింప వలయు" నని పలికి వాని వీడ్కొని రాణిసదనమునకుఁ బోయి యమాత్యునిసముఖమున జరిగినవృత్తాంత మంతయుఁ జెప్పి భయము లే దని యామె నూరడించెను.

ఆమఱునాఁ డుదయమున దూరదేశమునుండి కొందరువేగులవాండ్రు వచ్చి కొన్నివార్తలు విన్నవింపరా,జదర్శనమునుగోరహేమచంద్రుఁడు మంత్రిసమేతుఁడై యావార్తలు వినఁదలఁచి మణివర్మను బిలిపించి సగౌరవంబుగఁ గూర్చుండఁ బనిచి వేగులవాండ్రను లోనికి రావించి వారు చెప్పఁ దలఁచుకొన్న దంతయుఁ జెప్పు మని యానతిచ్చె. అంతట నాచారులలో నొకఁడు విహంగకుఁ డనువాఁ డిట్లు విన్నవించె. "దేవా చెప్పుటకు నాకునోరు రా కున్నది. దేవరవారి సోదరుఁడు యువరాజు చిత్రభానుఁడు హరిద్వారముకడ" నని మీఁద చెప్ప లేక కన్నులనీరు పెట్టుకొన మంత్రి వానియభిప్రాయ మెఱిఁగి యావృత్తాంతము నీవు చెప్పనక్కఱ లేదు. అది యిదివఱకే రాజుగారికి విదితము. తక్కినది చెప్పు మని యానతిచ్చుటయు, వాఁడిట్లు చెప్పెను. "విజయసేనకు మారునకునర్ధరాజ్యము రావలయునఁట. అది యిచ్చెదరా లేదా యని విదర్భమాళవరాజులు తద్బాలకునిపక్షమున మనపై దండెత్తి వచ్చెద రని లోకులు చెప్పుకొను చున్నారు. మీఁద దేవర చిత్తము" అని వాఁడూరకుండ "దీనినిజస్థితి దెలియువఱకు మన మేమియు ననరా" దని హేమచంద్రుఁడును "వచ్చిన రానిండు. అంతమాత్రముచేత భయపడువా రెవ" రని మణివర్మయు పలికి వాని నావలకుఁబంపి తక్కిన చారులవలన నెన్నియో వృత్తాంతములు విని వారికందఱకు సెలవిచ్చిరి.

ఇరువదియవపరిచ్ఛేదము



పిమ్మట మణివర్మ హేమచంద్రున కభిముఖుఁడై "దేవా! సేవకుఁ డొక్కమనవి చేసికొనఁదలఁచి యున్నాఁడు. ఆగ్రహింపక యవధరింప వలయు. అన్యదేశస్థులు తమదేశమున నేరములు చేసి దండనార్హులై యాదండన తప్పించుకొనుటకో యప్పు లెఁగబెట్టుటకో తమకు లేనిగౌరవమును సంపాదించుకొనుటకో స్వదేశమువిడిచిమారు వేసములు వైచికొని యోగులమని జోగులమని మంత్రవేత్తల మని బ్రాహ్మణులమని వేదవిదులమని తమ్ముఁదారెపొగడుకొనుచులోకుల వంచింతురు. అట్టివారిని చిరకాలము శోధించినపిదపఁ గాని జనులు విశ్వసింపరాదు. అన్నదమ్ము లైనఁ దలిదండ్రు లైన రాజులు పూర్ణముగనమ్మి వర్తింపఁగూడఁదని రాజనీతి శాసించుచుండ నెన్నఁ డెఱుఁగనియొక్కవిదేశీయుని నమ్మి మీరిట్లు మెలఁగుట లోకవిరుద్ధముగ నున్నయది. హరిశర్మ దుష్టుఁడని నే ననఁజాలను. దుష్టుఁడై కాని శిష్టుఁడై కాని యెఱుంగనివారివిశ్వసింపఁ జనదు. పరరాజులచేత బంపఁబడుచారులు కూడ నొక్కప్పుడు మన యానుపానులు లోటుపాటులు నెఱుంగుటకు బిక్షుకవేషంబులు మునివేషంబులు వేయుట కలదు. జాలిచేత బిచ్చగాండ్రను భక్తిచేత మునిజనంబులను జనులు గౌరవింతురుగావున నట్టివేసములు పొసఁగియుండు. లోకము మూర్ఖబహుళ మగుటచే గడ్డములు కావిగుడ్డలు బోడితలలు బూదిపిండికట్లు తులసిపూసలు మున్నగునవి నరునకు గౌరవముం దెచ్చిపెట్టు. గడ్డము పెంచినవాఁ డెల్ల యోగి కాఁడు. జందెపుఁబోగులుదెంచినవాఁ డెల్ల సన్యాసి కాఁడు. అట్టివారిని మనము చిరకాలము దేశమున నిలుపనీయరాదు. నిలువచ్చిన మెలఁకువతో నుండవలయు. పగలు హరి

శర్మయొద్దకుఁబోవుటయే నాకసంగతముగనుండ మాఘులుగూడ మీరు మంత్రోపదేశమునకై వానికడకుం బోవుదురని కర్ణాకర్ణిగ వింటిని ఈపని శ్రేయఃకాములగు మీకుఁ దగదు. ఆ యుద్యమము మాని మాభయంబు దీర్పవలయునని వేఁడుకొనుచున్నాఁడ. ప్రాజ్ఞులగు మీకు మాదృశులు చెప్పనక్కఱలేదు; కాని 'ప్రమాదో ధీమతామపి' యను లోకోక్తినిబట్టి నేను మీకుపదేశించితిని. పురజనులు నంతఃపురజనులు, నేను, నిగమశర్మ, మాధవసేనుఁడు మొదలగు మీ బాగుఁగోరుజనంబులు మీచిత్తము నాయుద్యమమునుండి నివర్తింపఁ జేయుఁ దలఁచుచున్నాము. వారుభయంబున మీయెదుటకురాజంకుచున్నారు. నేనుమీకడ నెక్కుడుచనవులు గలవాఁడ నగుటను మీరు మాతప్పులసైరింపు కృపాసముద్రులగుటను వచ్చితిమి. నానోట వెడలిన మాటలు వారియందఱిపలుకులుగ గ్రహింపవలయు నేకాని నాయొక్కనివిగ గ్రహింప వలదు."

అని మంత్రిహితోపదేశము చేసి యూరకుండ నప్పలుకులు సావధానముగఁ జిత్తగించి హేమచంద్రుఁడు మణిశర్మచేయిబట్టుకొని "యమాత్యా! నీవు నాకుఁ బితృసముఁడవు. నీవు హితోపదేశము జేయ నేనిందు క్షమింపవలసిన దేమున్నది? నీవు నాకడ నింతకన్న నెక్కుడుచనవులు గైకొన వచ్చును. నీయాలోచనలు మాకు వజ్రకవచంబులు. నీమంత్రములు పరసైన్యంబుల భంజించుమంత్రములు. ఎల్లవిధముల నీబుద్ధి మెచ్చఁదగినదియైనను 'ప్రమాదోధీమతామపి' యని నీవన్నట్లు నీబుద్ధికే ప్రమాదము గలిగినది. నాచెప్పెడిపలుకులు వినుము. ఈప్రపంచము వినశ్వరము గాని శాశ్వతము కాదు. యుగయుగంబులనుండి నిలిచియున్న హిమాలయమువంటిపర్వతములకును నట్టిపర్వతముల ధరించువసుంధరకును,నట్టివసుంధరలనుధరించుబ్రహ్మాండములకును నాశము గలుగుచుండ నొక్కయాయువుతోనైనఁ బోలని

ఈ చర్మభస్త్రి శాశ్వత మయి యుండునా? కలకాలము రాజ్యతంత్ర ములయందె తగిలి యుండవలయునా? ఏనాఁటి కయిన భోగపరాఙ్ముఖుండను గావలదా? రాజ్యతంత్రములం దగిలి యీవఱకు చేసినదోసంబులు చాలవా? నేను మీకు రాజునై సేవ్యుఁడనైతిని. నాకు సేవ్యుఁడును రాజులకు రాజును జక్రవర్తులకుఁ జక్రవర్తియు, నింద్రుల కింద్రుడును, నగ్ని కగ్నియు నగు పరమేశ్వరుఁ డొకఁడు లేఁడా? మాచేయు కలుషంబులకు మీ రుత్తరవాదు లగుదురా? నీవు గాని యరవిందాదేవి గాని తక్కినమంత్రులు గాని నావెంట వత్తురా? ఈపువుదోఁట లీకోట లీసిరులు నన్ను రక్షించునా? నేఁ డింట రేపు మంట నుండువారము కామా? చిత్రభానుని గతి చూడ లేదే? ఎట్టివంగసంబునఁ బుట్టి, నెట్టివారిబిడ్డఁడయ్యు, నెంతగా కామునం బెరిగె. తుద కెట్టులయ్యె? ముక్తికాంత ముండట నరవిందాదేవి యేల? పరిణయపీఠము లుండ గద్దె లేల? ఉపనిషద్వీథుల విహరించువారికి రాజవీథు లేల? పరమపదమున కేగఁదలఁచువారికి పట్టణము లేల? అశాశ్వతపదంబు విడిచి శాశ్వతపదవికిఁ బోవఁ దలంచుచున్నవాఁడఁ గాని యధమ గతికిం బోవుటలేదు. కావున నావిషయమున మీరు విచారింపవలదు. లౌకికవ్యాపారముల విడిచితినని నన్నుగూర్చి మీరు విచారింప జ్ఞాననేత్రంబుఁ దెఱవలేక లోకతంత్రంబులం దగుల్కొని యగచాట్లుపడుచున్నవారలని మిమ్ముగూర్చి నేవిచారించెద. అవి యటుండనిండు. మహానుభావుఁడు హరిశర్మ దుష్టుఁడని లోకులు చెప్పుకొనుట పాపము మూటగట్టుకొనుట. లోకపరివాదముల మన మెన్నఁడు నమ్మరాదు. ఒక్కయుదాహరణము చూపుదము. మాళవేంద్రుఁ డగుసుదర్శనుఁడు నాకు [illegible] నతఁడు నాపై నెత్తివచ్చునని లోకమునం బ్రవాదము గలిగె. [illegible] లుండునా? గగనంబు విరిగిపడనీ సూర్యుఁడు పడమట నుదయింపనీ నాకును సుదర్శనునకుం బగలుజని

యుంపవు. సుదర్శనునిగూర్చి పుట్టినట్లు హరిశర్మనుగూర్చి కల్లవాడుకలు పుట్టినవి. ప్రాజ్ఞుఁడ వగునీ వట్టివి నమ్మఁ జనదు.

అని రాజు కేవలపారమార్థికచింతతోఁ బలుకుటయు హరిశర్మ మీఁదిభక్తి వాని కించుకేనియు మందగింప లేదనియుఁ దనకువృథా శ్రమయేకాని తనచెప్పిన బుద్ధులవలన నొందవలసినలాభము హేమచంద్రుఁడు పొందలేదనియుగ్రహించి మణిశర్మ వెంటనే యొండొకసేపు విచారించి రాజునుద్దేశించి యిట్లుపలికెను. "దేవా! మీకు హరిశర్మయొద్ద మంత్రోపదేశముబడయఁ దలంతురేని పడయవచ్చునుగాని వానిగుహకుఁ బోవక మనకోటకు వానింబిలిపించి యుపదేశముగొనుఁడు. మీకెంతచాటుచోటు కావలయునన్న నంతచాటుచోటు జూపెద. కావలయు నన్న నచిరకాలమున నిందునిమిత్తము క్రొత్తమందిర మొండు నిర్మింపఁ జేసెద. ఎట్టులయిన మాంత్రికదీక్ష మమ్మనుగ్రహింపవలయు." అని మంత్రి మనవియొప్ప హేమచంద్రుఁడు వాని కిట్లనియె. "నీకు నాయెడఁ గలప్రేమ మహాత్ములయెడ నుండవలసిన గౌరవమును దగ్గించుచున్నయది. మహానుభావుఁ డగుహరిశర్మ యెక్కడ, కించిజ్ఞుఁడనై వాని పాదరేణువునైన శిరమునఁ దాల్పఁ దగని యపవిత్రుఁడ నేనెక్కడ? మీకంటెను నేను రాజునై యుంటి గాని యాయతిరాజునకు నేను సేవకుండనె. నాగృహంబునకు రమ్మని నేను వాని నడుగఁజాల." అనుటయు మణివర్మ యూరకుండుటకు సందియంపడుదురేని మీవెంట వచ్చి వినయంబును భక్తియుఁ గదుర వానిని నేన యడిగెదను. అతఁడు మనకోటకు వచ్చుట కంగీకరించునేని మీరాయనపలుకుల కడ్డము చెప్పవలదు." అని వేఁడుకొనెను. హేమచంద్రుఁడును వాని పలుకులు విని కొంతసేపు విచారించి "సరే! ఈసాయంకాలము హరిశర్మ దర్శనార్థము నేను బోవుచున్నాను నీవు నావెంట వచ్చి యామహాత్ముఁడు ప్రశాంతుఁడయియున్నప్పుడు వాని

కలుక వాడవమునుండునట్లు భక్తితాత్పర్యంబులు మెఱయ వాని సహు
ఘము. అతఁడొకవేళ యలుకఁ బూనినను రానని విస్పష్టముగఁ జెప్పె
నను జిన్నబుద్ధికొరకు నా ప్రయత్నమునకు వెండియు విఘ్నములు
సేయఁదలఁపక యూరకుండవలయు." అని పలికి మణివర్మ రాక కను
మతించి వాని నంపె మందిరంబునకుం జనియె.

మహారాజు మందిరమునకు వచ్చినతోడనే యనంగదాదేవి నర్మ
దం బిలిచి మగనికి మంత్రికిఁ బ్రవర్తిల్లిన సంభాషణఫలితము దెలిసికొని
రమ్మని పంపెను. అదియు మణివర్మయొద్దకుఁ బోయి యడుగ నతఁడు
జరిగినవృత్తాంత మంతయుం దెలిపి యించుక ధైర్యము చెప్ప నర్మదయు
మరల నంతిపురికిం జని దేవి కావృత్తాంత మెఱింగించెను. అది విని
దేవి మంత్రిమాటలు పనిచేసినవని ధైర్యము దెచ్చుకొని సాయంకాల
మేమగునో యని భయపడుచుండెను.

సాయంకాలము మణివర్మ రాజమందిరమునకువచ్చి తన రాక
తెలిసి కెఱింగింప మహారాజు సంధ్యాకృత్యములఁ దీర్చుకొని మంత్రి
సమేతుఁడయి హరిశర్మయొద్దకుఁ బోయె. బ్రాహ్మణుఁడు వారిరువురను
గౌరవించి కూర్చుండఁజేసి యేదో సందర్భము తెచ్చి వివాహమును
మానుకొని రాజ్యమును విడిచిన భీష్ముని చరితంబును రాజ్యంబు తమ్ముని
కిచ్చి తపోవనంబున కరిగిన దేవాపిచరిత్రంబును విన సొంపుగ నుండు
నట్లు వర్ణించి వారిని శ్లాఘించి రాజుమనంబున కానందముగలిగించెను.
ఆకథ లతఁ డేలచెప్పెనో రాజు గ్రహింపలేదుగాని మణివర్మయొక్క
నిముసములో గ్రహించెను. హరిశర్మ చేయవలసిన హితోపదేశ
మంతయు ముగిసినపిదప మణివర్మ చేతులు జోడించి విప్రునితో
నిట్లనియె. "మీతో నేనొక్కమనవి చేయవచ్చితిని. తప్పు లున్న
మన్నింపవలయు. మహారాజుగారు మీయొద్ద మంత్రముల నుపదేశ
ముకొనఁదలంచుచున్నవారు. మీయుపదేశము లుభయలోకతారకము

లగుటచే రాజుగారు మేముఁ గడునదృష్టవంతులము; కాని రాజుగారు మీగృహాకు వచ్చుటకంటె మీరుమాకోటకు దయచేసి యుపదేశము చేయుట చాల మేలని నాకు...అని మఱియు నింక నేదో చెప్పఁబోవుచుండ వానివాక్యము సమాప్తము గాకమునుపే కఱ్ఱదెబ్బదినినకోఁడె త్రాఁచువలెఁ జువ్వున కెరలి హరిశర్మ కన్నులు మొగము నెఱ్ఱఁజేసి బిట్టలుకచే నొడలువడఁక నిట్లనియె. "ఏమేమి! మేము మీగృహమునకు రావలయునుగా. నాకంతయవసరము లేదు. మీమహారాజును బలవంతముగ నింటనుండి తీసికొనివచ్చి నాపొట్ట గడుపుకొనుటకై మంత్రోపదేశము చేయుటలేదు. అతఁడువచ్చి నాపాదముల పైఁబడి పరిపరివిధంబులఁ బ్రార్థించుటంజేసి నాజపతపంబులు మానుకొని యీయననిమిత్తమై కొంతకాలము వ్యర్థము చేయుచున్నాఁడను.

ఊరుబైటనేకాని గ్రామములో జనులయింట వసియింపఁగూడదని మాప్రతిజ్ఞ. అది నీవెఱుఁగవు గాఁబోలు! మేము రాజులమొగములు నంతిపురముల మొగములు నెఱుఁగ మనుకొంటివి గాఁబోలు. నానోటనుండి మాట వెడలినమాత్రమున కోటానకోటులురూకలు కుప్పలు వోయఁగల రాజాధిరాజులు మాకు దాసానుదాసులై యున్నవారు. నీవేమో మహామంత్రి నని రాజనీతివిశారదుఁడ నని మాకడ గడుసుపోకడలం బోవఁజొచ్చితివి. ఇవినీకు నమలశక్యముగానియినుపగుగ్గిళ్ళుగాని మినుపగుగ్గిళ్ళు కావు. నీయాటలిక్కడ సాగి రావు నీతలఁదన్నినట్టిమంత్రు లనేకుల నేనిదివఱకుఁజూచినాఁడను. నీకుటుంబమునకు నీరాజకుటుంబమునకు క్షేమము గోరుదువేని మాకలుకఁ దెప్పింపకుము. మేము తలఁచుకొనముగాని తలఁచుకొంటిమా పట్టణంబులు భస్మపటలంబులు చేయఁగలము. రాజుల జోళ్ళఁ జేయఁగలము. మాశాపంబులకు మీచాపంబులు చాలవు. మేము మీమందిరమునకు రాము" అని రాజువంకఁదిరిగి "రాజా! నీవింక నీమంత్రియాలోచన

చొప్పున నడువుము. మాకడ కింక నీవు రానక్కఱలేదు. ప్రసన్నులై మాకుపదేశము చేయుఁడి చేయుఁడి చేయుఁడి మహాప్రభూ యని ప్రార్థించినవారి కనేకులకుపదేశముచేయక యేపంపితిమి. ఎందుచేతనో నీమీఁద మాకనుగ్రహము కలుగుటచే నిన్ను తరింపఁ జేయఁదలఁచితిమి. కాని నీమంత్రి నీపాలిఁటిశనియై దానిని జెడఁగొట్టె. ప్రస్తుతము మీరు మాయెదుటనుండి పొండు. మీయునికి మాకోపాగ్నిం బ్రజ్వలింపఁ జేయు"నని పలికి గుహయొక్క లోపలిభాగమునకుం బోయె.

ఇరువదియొకటవ ప్రకరణము.

అట్లు హరిశర్మ కోపావేశంబున మంత్రిని దూలనాడి రాజుం దిరస్కరించి యవ్వలకుఁ బోవుటయు మణివర్మ బ్రాహ్మణునిమీఁద మొట్టమొదటినుండియు గౌరవము లేనివాఁడగుటచే వానిపొగరుంబోకడలకుఁ దగినప్రత్యుత్తరములిచ్చి బుద్ధి చెప్పవలయునని యొక్కనిముసము తలంచెను; కాని రాజు మొగముజూచియూరకుండవలసినవాఁడై యావిప్రుఁ డన్నకఠినోక్తులకుఁజిన్నబోయెను. హేమచంద్రుఁడు హరిశర్మలేచి వెళ్ళినవెంటనే మణివర్మసమేతుఁడై లేచి నోరువిప్పి యేమనిన నేమి మూఁడునో యని భయమున నెద్దియుఁ బలుకక గుహ విడిచి యవ్వలకు వచ్చి మంత్రింజూచి "నీవు మిక్కిలి యపరాధము చేసితివి. ఇందుచేతనే కదా నేను వాని నడుగనని తొలుదొల్తనే చెప్పితిని. నీవింటి కరుగుచుండుము. నేను బోయి వాని బతిమాలి ప్రసన్నుని జేసికొని వచ్చెద" నని పలుక మణివర్మ "నామూలమున బ్రాహ్మణునకు దేవరవారిమీఁదకూడ నలుక వొడమినది. నాదుర్వినయమును దేవరవారు మన్నింపవలయు" నని ప్రార్థించెను. హేమ

చంద్రుఁడు మంత్రివినయంబునకు సంతసించి "మణివర్మ! ఇందు నీ నేరము లేదు. అది యొకానొక వేళావిశేషము. ఆచీవాట్లు నన్ను బెట్టినవి గాని నిన్ను బెట్టలే దనుకొనుము. నీవిందుకుఁ జిన్నబుచ్చుకొనవద్దు, నీ పరుగుచుండుము. నీవెంటనే వచ్చెద" నని యూరడించి వగ పుడిపి వాని నింటి కంపి తాను క్రమ్మర యోగికడకుఁ బోయి యతనిపాదములపయిం బడి క్షమింపుమని పలు తెరంగులఁ బ్రార్థించి మఱియెన్నఁడు తనవెంట మంత్రిని దీసికొని రానని ప్రమాణముచేసి వాని యనుగ్రహంబునకుం బాత్రుఁడై తన మంత్రోపదేశమునకు ముహూర్తముం బెట్టుమని వేఁడెను. రాజు వినయంబునకు భక్తికి హరిశర్మ యంతరంగమున మెచ్చి వాని తప్పు సైరించి మంత్రోపదేశంబునకు నొక్కపుణ్యదివసంబు నేర్పఱచి సగౌరవంబుగ రాజునింటికిఁ బనిచె.

హేమచంద్రుఁ డింటికిఁ బోవునప్పటికి మాధవసేనుఁడు రాజు రాక కెదురుచూచుచు మందిరద్వారముకడఁ గూర్చుండి యతఁడు వచ్చినతోడనే లేచి నమస్కరించి "స్వామీ! మాళవరాజుదగ్గరనుండి యొకదూత వచ్చియున్నాఁడు. అతఁ డిప్పు డూరుబైట గుడారములలో బసచేసి తనరాక మనకుఁ దెలియఁ బంపె. మీఁద దేవరచిత్త" మని మనవి చేసికొనెను.

అప్పలుకులు విని హేమచంద్రుఁడు వేగులవాండ్రు చెప్పిన దంతయు నిక్కంబగునా యేమి! అయిననేమి నీవును వజ్రపాణియు జేపుదయమునఁ బోయి వానిని సబహుమానముగఁ దోడ్కొనిరండు అని చెప్పి వానిం బుచ్చి యంతిపురికిం జనియె. అతఁ డంతిపురిఁ జేరినతోడనె నర్మద రాణియానతిం బూని మణివర్మకడకుఁ బోయి హరిశర్మకడ జరిగినయావద్వృత్తాంతము విని తనదేవికి విన్నవించె. ఆయుదంతము వినినపిదప దేవి నిశ్చేష్టయై పాన్పుపైఁజతికిలంబడి యే

దో యపాయము రాజకుటుంబమునకు రానున్నదని విచారింపఁ జొచ్చెను.

మఱునాఁడు రేపకడ మాధవసేనుఁడు వజ్రపాణిం దోడుకొని కొందఱు పరిజనులు వెంటరా నగరమునకు దక్షిణభాగమునందువిడిసి యున్నమాళవదూతసన్నిధికిం బోయి తనరాక నెఱిఁగించె. మాళవదూత యగువిశారదుఁడు కాశ్మీరరాజప్రతినిధుల కెదురుగావచ్చి గౌరవించి తన గుడారమునకుం దీసికొనిపోయి కూర్చుండఁబెట్టి తన పేరు విశారదుఁ డని చెప్పి వచ్చినవారినామధేయము లడిగెను. అంతట మాధవసేనుఁడు నన్ను మాధవసేనుఁడందురు; నే నిక్కడి మంత్రులలో నొకఁడను. ఈతనిపేరు వజ్రపాణి విని యుందురుగదా మీరు దండపాణి యనుచండశాసనుఁడొకఁడు కాశ్మీరసైన్యమున కధిపతియై యున్నవాఁ డని. అతనితమ్ముఁడే యితఁడు. హేమచంద్రమహారాజు గారు మిమ్ము సబహుమానముగఁ దోడుకొనిరమ్మనియానతిచ్చినారు. కావున మీరు దయచేయవలయునని చెప్పెను. విశారదుఁ డందుకు సమ్మతించి తన పరిజనులను బయనము గమ్మని సెల విచ్చి తానొక గుఱ్ఱ మెక్కి వజ్రపాణిమాధవసేనులతో వెడలెను. పట్టణంబునకు వచ్చినపిదప మాధవసేనుఁడు వారి నొకవిశాలమందిరమున విడియించి కావలసినసరకుల నంపి వలయుసేవకుల నప్పగించి యింటికిఁజనియె.

ఆయతిథులక్షేమము విచారింపఁదలఁచి వజ్రపాణి కొండొకసేపచ్చట నిలిచి వారువచ్చినపని యేమనియడిగి విజయసేనునిపక్షమున వచ్చినట్లు సేవకులలో నొకనివలన విని వారితో మెల్లన నిట్లనియె. "ఓయీ! కర్పూరమంజరి యెచ్చట నున్నది? ఆమెకు వివాహ మైనదా? మీరు విజయసేనునిపక్షమున వచ్చినవారగుటచే నామెసంగతి మీకుఁ దెలియక పోదని తలంచెద" నని పలికెను. ఆసేవకుఁడువజ్రపాణిమాటలు విని కళవళముపడి యామెసంగతిదెలియనివాఁడువోలె

దేశ్లంబోయి పెండ్లియింకను గాలేదు. కాదుకాదు; ఈనడుమనయిన దని విన్నానని యుత్తరము చెప్పెను. వాఁ డిచ్చినప్రత్యుత్తరము విని వజ్రపాణి మిగుల కలఁత నొంది వానిని మఱింత తఱచి యడుగ నారంభింప నడిగినకొలఁది వాఁడు మిక్కిలి తడబడి యసందర్భములగు నుత్తరముల నీయఁజొచ్చెను. అంతలో ప్రధానమంత్రియగు మణివర్మ మాళవదూతం జూడవచ్చి మునుముందు వానిపరిజనులను గుఱ్ఱములను జూచి యవ్వల విశారదునితో మాటలాడుటకుఁ బోయెను. వజ్రపాణియు వారింజూచి సేవకునితో సంభాషణముమాని వికలచిత్తముతో నింటికిఁ జనియెను.

మణివర్మయు దనరాక విశారదునకుఁ దెలిపి వానిచేత సమ్మానితుఁడై కూర్చున్నపిదప విశారదుఁడు తన వచ్చినపనిసంగ్రహముగఁ దెలిపి రాజదర్శనము చేయింపుమని వేఁడెను. అట్లే చేయింతు నని ప్రత్యుత్తరము చెప్పి మణివర్మ విదర్భమాళవరాజులఁ దేశములఁగూర్చి యుఁ బరిపాలనములఁ గూర్చియు ననేకాంశములడిగి విశారదుఁ డిచ్చిన ప్రత్యుత్తరములకు సంతృప్తినొందక వానియొద్ద సెలవుగైకొని యింటికిఁ బోవుచు దారిలోఁ దనలో నిట్లువితర్కించెను. "ఏమిది. ఈతని మాటలు, రూపమును జూడ గొప్పవానివలెఁ గానఁబడఁడు. పరిజనులు బిచ్చగాండ్రపగిది నున్నారు. గుఱ్ఱములు మహారాజులాయములోని వట్లు కనఁబడవు. అయినను వేసబాసలఁబట్టి యెవనిగూర్చియు దురభిప్రాయమును దెలుపరాదు." అట్లు లనుకొని గృహంబునకుఁ బోయి భోజనాదికములఁ దీర్చి జాముప్రొద్దున్నప్పుడు మణివర్మ మహారాజు కడకుఁబోయి మాళవదూతకు దర్శన మిచ్చి సందేశము విన వలయు నని కోరెను. మంత్రిపలుకులువిని హేమచంద్రుఁడు మున్ను చారులు చెప్పినట్లు విజయసేనునిపక్షము బూనియే సుదర్శనుఁడీరాయబారము మన కంపెనా! యని యడిగెను. "విశారదుఁడు తనపని నాకు నవి స

రాజనీతివిరుద్ధము లై కేవలవైరాగ్యప్రతిపాదకములై యుండుటం జేసియాపలుకులు విశారదున కెఱిఁగింపనిష్టము లేనివాఁడయ్యుప్రభుశాసనము నిర్వర్తింప వలయునని నిశ్చయించిప్రభువురాయబారమును దీర్చవలసిన పైత్తనము దనతలపై నిడుటచే నది యెట్లయినం జెఁడగొట్టుట కేర్పఱచుకొని మాధవసేనుని వెంటఁబెట్టుకొని విశారదుని విడిదికిం జనియె.

రాజదర్శనలాలసుఁడగువిశారదుఁడు మణివర్మనుజూచి మహారాజుగారు నన్నెప్పుడు రమ్మని శెలవిచ్చిరని యడిగెను. "మహారాజుగారిప్పుడస్వస్థచిత్తులై యున్నారు. కావున రాయబారము మీవలన విని దానికిం దగిన ప్రత్యుత్తరములఁ జెప్పుమని నన్నే నియోగించినారు. మీసందేశార్థములాయన యెఱుఁగుదురు. దానికిం దగినప్రత్యుత్తరములఁ గొన్ని చెప్పుమని నన్నునియోగించిరి. కావున మీరు శ్రమపడి రానక్కఱలేదు. మీసందేశార్థములు నాకు విన్నవింపుఁ డనిమణివర్మ వానికి బదులు చెప్పెను. "రాజుగారు మాసందేశము వినినను మీరు వినినను మాకొక్కటియ. నాకు మీమహారాజుగారు దర్శన మీయకపోవుట మాళవరాజు నగౌరవించుట యేమో యని నేను దలఁచెదను. అయినను వారు వీరుచిరమిత్రులు. సమాన బలవంతులు. వారిచిత్తము ఇదే నాసందేశము వినుఁడు. మాళవేంద్రుఁడు హేమచంద్రున కిట్లు విన్నవించుచున్నాఁడు "చిత్రభాను పుత్రుఁడు విజయసేనుఁడు కడుదీనుఁడై విదర్భ నున్నాఁడు. అతని కర్ధరాజ్యము పంచి యిచ్చుటన్యాయము. పసివానియెడ వాడి దప్పుట పాపహేతువు. రాజ్యము పంచఁగూడ దని మీరందు రేని విజయసేనుఁడు నీకొడుకలకన్న వయసునఁ బెద్దయగుటచేవానినియువ రాజుం జేయుఁడు. ఈయుపద్ధతులకు మీరుసమ్మతింప రేనిమాళవ సైన్యంబులే విజయసేనునిగద్దెనెక్కింపఁగలవు." ధర్మమునకుదూరము

రముగఁ జెప్పలేదు; కాని సంగ్రహముగఁ జెప్పెను. పని యదియే" యని మంత్రి విన్నవించెను. ఆమాటలు విని హేమచంద్రుఁడు నిట్టూర్పువిడిచి మనోవైకల్యము నెమ్మనమ్మునఁ దోఁప నమాత్యుని తో నిట్లనియె.

"అయ్యో! రాజ్యములు దుఃఖహేతువులుగదా! భానుఁడు పడమటఁ బొడిచినఁ బొడమవచ్చు. మిన్నువిఱిగిపడినఁ బడ వచ్చు, గాని నాకును సుదర్శనునకును బగలు జనింపవని మున్ను నీతోనంటిఁ గదా! రాజ్యంబుకతంబునం గాదె కలనైన నాయందు ద్వేషబుద్ధిని వహింపనిసుదర్శనునకు నేను క్రోధహేతువునైతిని. మాళవరాజువంటి సత్పురుషుఁడు మహీమండలమునఁ గలఁడే. అట్టియోగ్యునకు నలుక దెప్పించిననాబ్రదుకేల? విజయసేనున కర్ధరాజ్యమిమ్మని కదా వారు సందేశ మంపిరి. వానితండ్రికి నే నొర్చినయపకారమే చాలును. తండ్రి లేనియాబిడ్డకు వెండియు నేను గీడుసలుపుదునా? అతఁడు నాబిడ్డలలో నొకఁడు. నాకుముచ్వురు కుమారులనుకొని రాజ్యము మూఁడుభాగములు చేసి పంచెద. మాళవరాజునకు బెదరి నే నిచ్చుట లేదు. విజయసేనునిమీఁద నాకుఁ గలకూరిమిఁబట్టియే యిచ్చెద. ఈయకున్న విదర్భమాళవరాజులు మనపై దండువిడియుదురు. ఒకవేళ యుద్ధములో మనము గెలిచినను జేరవచ్చుట్టములను జిరమిత్రులను జంపుకొని నెత్తుటికూఁడు దినుట యెట్టిపాడి? కావున వారు కోరినట్లు రాజ్యము నిచ్చెద నని నీవు దూతతోఁ జెప్పుము. అడిగినట్లు నీవుఁ దలంచుకొంటిఁ గాన సందేశము నేను వినవక్కఱలేదు. నీవుపోయి విశారదునిసందేశము విని నాపలుకులు వానితోఁ జెప్పి మాళవరాజు తో మనకుఁ గలమైత్రి చెడకుండఁజేయుము." అందుకు వాఁడొడఁబడ రేని వారిచిత్తమువచ్చినట్లు చేయుమనుము. అని చెప్పి నత్వరము మణివర్మను బొమ్మని తొందరపెట్టెను. మణివర్మయు రాజుపలుకులు

లై లోకాచారమునకు విరుద్ధములై మోటుతనముతో నిండిన యీమాటలు కులు చెవిని బడినతోడనే మణివర్మమనస్సు మహాకోపపరవశమయ్యె. గంభీరుఁడగుటచే నయ్యలుక నెట్టెటో దాచి దూతతో నిట్లనియె.

విజయసేనుఁడు విక్రమసేనహర్షవర్ధనులవంటికుమారుఁడే యని భావించి వానికి మూఁడవవంతు రాజ్యము నీయఁదలఁచినారు. విజయసేనుని యువరాజుం జేయుట యసంభవము. ఇది సమ్మతము గాదేని మాళవసైన్యంబులే వానిని గద్దె నెక్కింపుఁగాక!" అనవుఁడు విశారదుఁడు మహాకోపముతోఁ బెద్దకేకలు వేయుచు 'మాకు మూఁడవవంతు గీడవవంతు నక్కఱలేదు. మా కర్ధరాజ్యమె కావలయు. అది మీరియ్యనొల్లరుగావున మేము పోవుచున్నార'మని కూర్చున్నచోటునుండి లేచెను. మణివర్మయు మాధవసేనుఁడును గూడ పీఠములనుండి లేచి వారివలన సెలవుఁ బుచ్చుకొని గృహంబులకుఁ జనిరి. అమ్మఱునాఁడు విశారదుఁడు సపరివారముగ శ్రీనగరము విడిచిపోయెను. మణివర్మయు నాఁడు జరిగిన రాయబారమంతయు రాజునకు సవిస్తరముగ విన్నవించెను. హేమచంద్రుఁడు తప్పక మాళవరాజౌనే యని తలంచి [illegible] తలంచినది కాకమానదు. మనుష్యప్రయత్నము వ్యర్థమని కర్మసిద్ధాంతమును నమ్మియుండెను.

ఇరువది రెండవ ప్రకరణము.

హేమచంద్రుఁడు నాఁటఁ బ్రదేశంబు బగుటఁ జంబు సమీపించిన కొలఁదియవరాండ్ర చేఁపయొక్కయు మాళవప్రముఖులగునమాత్యుల యొక్కయు గుంపులు తత్క్షణప్రవృత్తికి వచ్చినట్లెల్లెడలఁ గొట్టుకొనఁజొచ్చెను. అతనికి మంచితరుణోపాయము దొరకిన దనుసంతస

మునరాజు మొగము వికాసవంత మగుచుండదనకు మరణోపాయము సమీపించుచున్నదని యరవిందాదేవి మొగమువిన్నఁదనమునుదాల్పఁ జొచ్చెను. హరిశర్మతనకుఁ బరమమిత్రుఁ డని రాజు తలంపఁ బరమ శత్రుఁడని లోకులు తలంచిరి. హరిశర్మవలనఁ గాశ్మీర దేశమునకు నీ కిదిరెండునష్టములలో నేదే నొక్కటి సంభవింపవచ్చునని ప్రజలు, సేవకులు, రాజబంధువులు భయపడిరి. హేమచంద్రుఁడు హరిశర్మ దురుపదేశముల విని విరాగియై సంపదలను బాసి సౌఖ్యముల రోసి యాలుబిడ్డల కెడమై యడవులకేఁగఁ జన వచ్చు. కాకయున్నఁ గపట బ్రాహ్మణుఁడు పన్నినయురులం దగుల్కొని ప్రాణములనైన విడువ వచ్చు. ఈభయంబు శ్రీనగరమున నున్న ప్రతిమనుజుని హృదయమున నెలకొనియున్న నొక్కఁడేని తేని దాని నోరు దెఱచి చెప్పఁజాలఁ డయ్యె. ఈమహారాజుబుద్ధి యెంతలోఁ జెడిపోయిన దనువారు. మన మందఱము తొల్లి చేసినదోసమె యీబ్రాహ్మణరూపంబున నవత రించి యిక్కడకరుదెంచెననువారు, నెన్నఁడు ద్రోసివేయమనిమణివర్మ మాటలు గూడ పెడచెవిని బెట్టుటచే నేదియో మూఁడక తప్పదను వారు, మనశక్తియేమగు ననువారును, దైవనియోగ మెట్లో యట్లు జరుగు ననువారు నై ప్రజలు కలవళముపడఁ జొచ్చిరి. అంతలో మం త్రోపదేశమునకు హరిశర్మ యేర్పఱచినపుణ్యదినమువచ్చెను. ఆదిన మున హేమచంద్రుఁడు రేపకడనిద్ర మేల్కాంచికాల్యకరణీయములం దీర్చికొని స్నాతుఁడై పగలెల్ల నుపవాసముండి సాయంకాలమున గుహాకుం బ్రయాణమయ్యెను. పరమనిష్ఠాగరిష్ఠుఁడై రాజతంత్రముల విడిచి కేవలపరమార్థచింతచేఁ దన మేలు గోరువారు పెట్టినమొఱలు వినక యుపాయస్థలమునకుఁ బోఁ దలఁచిన హేమచంద్రునిఁ జూచి చంద్రుని జూచినయరవిందమట్లులరవిందాదేవి మొగము శోభావిహీన మయ్యె. మణివర్మ తత్సమయమున రాజుకడకుఁ బోయి విషణ్ణహృద

యుఁడై తనవైకల్యము మొగమునందుఁ గానంబడ "దేవా! మీరు గుహాలో నుపదేశ మగుచుండ మేమందఱు మీవలనుండి మీసేవ మర్థయు చుండెదము. ఇందుకైన మీరుసమ్మతింపవలయును." అని వేఁడుకొన రాజు "మణివర్మా! పరిశాంతమగుబ్రాహ్మణసమక్షమున నీవపాయమును శంకింప వలదు. నాకే భయమును లేదు. మీరుశ్రమ పడి నానిమిత్తముండనక్కఱలే" దని ప్రత్యుత్తరముజెప్పెను. ఆ వేల మాటలు విని మణివర్మయుఁ దక్కినయాప్తులుఁ విన్నబోయి యూర కుండిరి. అంతట హేమచంద్రుఁడొక్కఁడు గుహకుఁ బోయి తనరాక కెదురుచూచు చుండినహరిశర్మంగాంచి యతివినయముగ నమస్క రించి "అఖండసచ్చిదానందప్రాప్తిర" స్తని యతనిచే దీవనఁ బడసి కూర్చుండెను. హేమచంద్రుఁడు వెలలేనిజలతారు పట్టుపంచె గట్టి యమూల్యమగు సేలువ నొందు గప్పుకొని యుండెను. హరిశర్మ ముందుగ రాజుంబిలిచి "రాజేంద్రా! నీయమూల్యవస్త్రములవిడిచి యీనారచీరలఁ గట్టుకొనుము. పిదప యీహోమగుండమునందలి బూడిద మొగమున, నుదరమునఁ జేతులఁ బూసికొను"మని యాన తిచ్చెను. ఆతనినోట మాట వెడలుటయె తడవుగ మహారాజుతనవెల లేని వలువల విడిచి నిజముగ వెలలేనినారగుడ్డలఁ గట్టుకొని బూడిద మేనం బూసికొని కూర్చుండెను. అప్పుడుహరిశర్మవాని మొగమువంక తేఱిచూచి సంతుష్టహృదయుఁడై "రాజా! ఇప్పుడునీవేసము యోగా భ్యాసమునకనుకూలముగ నున్నది. రాజయోగి యనుశబ్దమునీయందు సార్థకమయ్యె' నని యించుక హెచ్చరించియొకప్రాఁతయాకుమీఁద నదివఱకె తాను వ్రాసియుంచినయొకశ్లోకమును రాజునకుఁ జూపి చదువు మని వానిచేతి కిచ్చెను. అప్పుడు మహేంద్రుఁ డీక్రిందిశ్లోక మును జదివెను.

శ్లో॥ నివాసః కైలాసః పరమసుహృదాఢ్యో ధనపతిః।
నిషంగో రత్నానాంనిధి రమరభూభృ ద్ధను రపి।

జనానాం వైరాగ్యం ప్రథయితు మజస్రం పురహరో
వ్యభూద్భిక్షుర్యస్త్వం పరమపురుషః పాతు భువనం॥

శ్లోకము జదువుట ముగిసినతోడనే హరిశర్మ "రాజా! దీని యర్థము జెప్పెద విను" మని యిట్లుచెప్పెను. "మహేశ్వరునకు వెండికొండనివాసస్థానము. కుబేరుఁడు ప్రాణమిత్రుఁడు అమ్మ్మలపొదిరత్నాకరము. విల్లు మేరుపర్వతము. ఇట్లు మహైశ్వర్యవంతుఁ డయ్యు జనులకు వైరాగ్యము నేర్పుటకొఱకే యెల్లప్పుడుభిక్షుకుఁడై యెవఁడు కాలము బుచ్చుచున్నాఁడో యాపరమపురుషుఁ డగుపురహరుఁడు లోకమును రక్షించుఁ గాక! రాజా! నీవును శంకరునివంటివాఁడవే. అతఁడు మహేశ్వరుఁడు. నీవుమహీశ్వరుఁడవు. మహైశ్వర్యములు వానికి నీకు సమముగఁగలవు. అతఁడు కుమారసమేతుఁడునీవుకుమారసమేతుఁడవు. అతఁడు వెండికొండపై నుండు నీవు వెండికొండలవంటి తెల్లనిమేడల నుందువు. అతనిది ధవళమూర్తినీది ధవళకీర్తి. అతఁడు మహోదుర్గాభిరాముఁడు. నీవునుమహోదుర్గాభిరాముఁడవు. ఎన్నిసంపదలున్నను శంభునిచందమున నీవును సంపదల విడిచి ప్రజలకు వైరాగ్యము నేర్పుటకు విరాగివై యుండుట యుచితము. "యథా దేవస్తథాభక్త", దేవుఁ డెట్లుండునో భక్తుఁడట్లేయుండ వలయు గదా! నీవుమహేశ్వరభక్తుఁడవగుటంజేసి మహేశ్వరమార్గము ననుసరించుట యుచితము. కావున నపార మగుసంసారముమీఁదకాంక్ష విడిచి భవరోగ చికిత్సకుఁడగునభవుని నాశ్రయింపుము. నేనుకొన్ని నాళ్ళకిందట మహేశ్వరపంచక మని పేరువెట్టియైదుశ్లోకములురచించితి. అవి వినినమహాపండితు లందఱు వానిపాకము ద్రాక్షాపాకమనియు శైలి మనోహర మనియు భావము సుబోధకమనియునన్నుఁ గొనియాడి వ్రాసికొని పఠించిరి. మహాదేవుఁడు నేను రచించినశ్లోకములకు సంతసించియే కాబోలు నేఁడు వానిని నూఱునూఱులు చది

వినతోడనే నాకు సాక్షాత్కరించె. ఆశ్లోకంబులు నీకుం జెప్పెద.నీవు వానిని జక్కఁగ వల్లించి యనుదినంబుఁ బంపు చుండుము. దాననీకు గడు లగ్గు. ఆశ్లోకము లివి.

శ్లో॥ గజేంద్ర కృత్తిః కమనీయ శాటీ।
కపాలమాలా ఘనహారవల్లీ।
శ్మశానభూమి ర్వసతిశ్చయస్య।
తం దేవదేవం సతతం భజేహం॥

శ్లో॥ మురాంతకప్రాణసఖం పురాంతకం।
స్మరాంతకం పావనమంతకాంతకం।
గజాంతకం దుష్టదితిప్రజాంతకం।
అఘాంతకం దక్షముఖాంతకం భజే॥

శ్లో॥ చతుర్వేదఘోటం శరచ్చంద్రజూటం।
త్రిలోకైకపాలం దిశాచక్రచేలం।
జ్వలత్ఫాలనేత్రం జగద్వ్యాప్తగాత్రం।
సురారాతి భంగం శుభాంగం భజేహం॥

శ్లో॥ త్రివేదసారం త్రిజగత్ప్రవర్తకం।
త్రిమార్గగా మండిత మూర్ధమండలం।
త్రిశూలపాణిం త్రిదివేంద్రవందితం।
త్రిలోచనం తం త్రిగుణాత్మకం భజే॥

శ్లో॥ రజతభూధరకూటనివాసినం।
కనకభూమిధ్రేంద్రధనుర్ధరం।
నిరుమాష్టవిభూతివిరాజితం।
నిరతమాదిమభిక్షుముపాస్మహే॥

హరిశర్మ మొదట జదువుమని యిచ్చినశ్లోకమును వెనుక ఁదివినయైదుశ్లోకములును విని చదువుకొని యర్ధమరసి మహానంద

భరితుఁడయి హేమచంద్రుఁడు గురువునుద్దేశించి "స్వామీ! మీకవ
నంబులు మనస్తాపశమనంబులు, మీమాటలు తేనియతేటలు. అనం
టిపండొలిచి చేతికిచ్చినచందంబున శ్లోకములఁజదివినతోడనే భావ
ములు తేటపడుచున్నవి. మాటలమారవంబు, నల్లికబిగి, యర్థ
గాంభీర్యము నింతింత యని చెప్పవలనుకాదు. ఈవఱకెన్నఁడేకవనం
బులో విని యుంటిని గాని యవి గానుగాడినం జెఱకుఁగఱ్ఱలట్లుండక
చొప్పదంట్లయట్లు చప్పగనున్నవి. ఇట్టిశ్లోకములం జదివి యాహ్వా
నంబుఁ జేసిన పరమేశ్వరుఁడు ప్రత్యక్షము గాక యేమగును? ఇట్టి
మధురగంభీరభాషణములతో నివఱకుశంకరు నెవరు ప్రార్థించిరి!" అని
కొనియాడి శ్లోకము లొకతాటియాకున వ్రాసి పలుమాఱు చదువు
కొని మురియుచు నుండెను.

అటులుండ హరిశర్మ హేమచంద్రునిం బిలిచి "నీకు నేను మం
త్రోపదేశము చేయవలసిన సమయము వచ్చినది. కావున నీ విప్పుడు
నీసామ్రాజ్యముమీఁద, పురముమీఁద, యంతిపురముమీఁద, నాలు
బిడ్డలమీఁద, నాప్తమిత్రులమీఁద ననురాగముఁ ద్రోసి చిత్తంబు
పరమేశ్వరాయత్తముఁ జేసి నిస్పృహుఁడవై, నిశ్చలుఁడవై, నిర్మ
లుఁడవై, సావధానుఁడవై యుండుము. సాయుజ్యమోక్షము సామ్రా
జ్యము కాఁగ, కైలాసపురము గాపురము కాఁగ, ప్రమథగణంబు
లాప్తమిత్రులు కాఁగ ముముక్షువులలోఁ జక్రవర్తివై యుండెదవు.
పరమపావనము, ముక్తిప్రదాయకము నగుమహామంత్రము నే నీకుప
దేశించెదను. అది పరమగోప్యముగ నుంచవలయును. నాయాజ్ఞ లేక
నెన్నఁడు నెవ్వరికి నీ వది యుపదేశింపరాదు. అక్షరలక్ష యగునట్లు
దానిని పునశ్చరణముఁ జేయవలయును. అట్లు పునశ్చరణముఁ జేయు
చున్నప్పుడు భక్తవత్సలుఁడగుపరమేశ్వరుఁడు నీభక్తిం బరీక్షించుటకు
పెక్కువేసములతో నటకు వచ్చును. ఒకప్పుడు మనుష్యుఁడు నడిచిన

ట్లులుకు డగును. వేఱొకయప్పుడు ఖడ్గపాణి యై యెవ్వరో చుట్టు ప్రక్కల నున్నట్లు కానఁబడును. ఒండొకయప్పుడు మృతినొందిన నీ చుట్టములు నీముంగల నడచినట్లు తోఁచు. ఒకప్పుడు భయమున మేను ముచ్చెమటలు పోయును. ఎంత పిఱికిదనము తోఁచిన నెంత యధైర్యము కలిగిన నీమనస్సుఁ జలింపఁ గూడదు జంక కూడదు వెనుకకుం దిరిగి చూడఁగూడదు కూర్చున్న తావునుండి లేవఁగూడదు. ఎవ్వరిని బిలువఁగూడదు. ఇంగే నిబంధన మతిక్రమించినను మంత్రసిద్ధి గాకపోవుటయె కాక వెనుక జేసినపునశ్చరణఫల మంతయు జెడును. పునశ్చరణ మిరువదియొక్క రాత్రు లీగుహాలో నెజరగవలయు. ఆదినములములయందుఁ బగలు భుజింపరాదు. ఇట్లు చేయుదువేని నీకు కైవల్యము కరతలామలకము. ఇందుశేఖరుఁడు నీయింటి బంటు. ప్రమథగణంబులు నీకుఁ బాలేరుతనము జేయువారు. ఇఁక దగ్గఱకు రమ్ము. ఇదిగో మంత్రము చెప్పుచున్నాను. నే నన్నమాట మరల నీవనుము. అని యొకమహామంత్రము జెప్పి మూఁడుమాఱులు రాజుచే దాని ననిపించెను.



ఇరువదిమూఁడవప్రకరణము.



మనుష్యునకు మనోవైకల్యమును దెచ్చుటలో మతావేశము వంటిది వేఱొకటిలేదు. బాలుఁడు డయిన విశ్వసింపఁ జాలనియసంభవములను మతావేశపరవశుఁ డగునపుడు మహావిద్వాంసుఁడు సైతము నమ్మును. మున్ను దాను గౌరవించు పెద్దలయెడల గౌరవము చెడును. హేతువిచారణము చేసి యన్యమతములలోనుండు మంచి గ్రహింపవలయు నన్నయాసక్తి నశించును. మానవుఁడు మతమునిమిత్తము

స్వసౌఖ్యమును విడుచును. ఈపై నుదాహరించిన వాక్యములకు హేమ చంద్రుఁడే తార్కాణము. చిన్ననాఁటఁగోలె తనమేలు గోరిపనిచేయు మణివర్మప్రముఖు లగుమంత్రులమాటలు దల కెక్కవయ్యె. అగ్ని సాక్షిగఁ దన్ను బరిణయమై సుఖదుఃఖములఁ దనతో సమానముగ ననుభవింపవచ్చిన యరవిందమొఱలు నిరర్థకము లయ్యె. అవి య టుండ హంసతూలికాతల్పములపై శయనించునాసుకుమారుఁ డురాత్రి చేయవలసినన్నిసార్లు మంత్రపునశ్చరణము చేసి యది ముగిసినపిదప నిద్రకు లోనై యుత్తరీయము కటిచేలం బఱచుకొని భుజాదండము తలగడగఁ జేసికొని పండుకొనియె. వేళకు భోజన మమరకపోయినా యొక్కనిముసమైనఁ దాళఁజాలక దడదడలాడునాసుకుమారుఁడు దిన మెల్ల నిరాహారుఁడై యుండె. ఇటు లుండుటకెల్ల మతాభిమానమె కారణము కదా!

హేమచంద్రుఁ డీరీతిని గుహాయందుఁగొంతసేపుజాగరముచేసి యథావిధిగ మంత్రపునశ్చరణము సేయుచుండ నట గృహమందున నరవిందాదేవియుఁ బతినామస్మరణము సేయుచు నొక్కనిముస మాయిన నిదురవోవక తెఱచినకన్ను తెఱచినట్లయుంచి యేగడియ కేమివార్త తెలియునో యని యడలుచు స్వల్పధ్వనికైన నులికిపడుచుఁ దనలో దానిట్లని విచారించె. "దైవమా! ఏమిపాటులు నీవు మా కేర్పఱచి యుంటివో యెఱుఁగకున్నను కారణ ముండియో లేకయో భయము మాత్రము పడుచున్నాము. నీనిర్ణయము జరుగుచున్నది. నీనిర్ణయ ముచేతనే కదా మెత్తని పాన్పుల శయనించుమహారాజు నేలఁ బండు కొనుటయు నాఁకలి కోర్వలేనిసుకుమారుఁడు ఉపవసించుటయు మొద లగునద్భుతములు పొడము చున్నవి. ఆమే నెంతకందినదో కదా! జాగరముచేత నేత్రము లెంతయెఱ్ఱబడినవోకదా! ఆప్రాణమూఁకలిచే నెంత తహతహపడు చున్నదోకదా! ఓకాత్యాయని! కాళీ! మహారా

జీగండము గడచి బయలుపడు నని సీతాం మహాలయమును గట్టింతు. పుట్టెడుకుంకుమ పూజ చేయింతు. సద్బ్రాహ్మణులకు వేయిగోవులను దాన మిప్పింతు. అని యనేక విధంబుల విచారించుచు నిష్టదేవతను బ్రార్థించుచు నెప్పుడు తెల్లవారు నెప్పుడు తనప్రాణవిభుఁడు కంటఁ బడు నని ప్రభాతమును నిరీక్షించుచుండ సంతలో నాలవజాము కోఁడి కూఁత వినం బడియె. మణివర్మయు మాధవసేనుఁడును నిద్రలేచి రాజగృహంబునకుఁ బోయి రాజునిమిత్త మెదురుచూచుచు ద్వారముల యొద్ద నిలిచియుండిరి. హేమచంద్రుఁడు సింహలక్ష్మీ మేలుకాంచి హరిశర్మయొద్ద సెలవుగైకొని గుహావిడిచి నిజగృహంబునకుఁ బయన మయి వచ్చె. వచ్చుచుండు మహారాజును మార్గమధ్యమున బౌరు లనేకులు చూచి మహానందభరితులై “యదిగో మహారాజు నిరపాయముగ గృహమునకుఁ బోవుచున్నాఁడు. హరిశర్మయేదో మహాపకారమును జేయునని భయంపడి మన మందఱము వానిని నిష్కారణముగ నిందించి పాపము మూటఁగట్టుకొంటిమి. చెక్కు చెదరక మన ప్రభువు మనకు దక్కినాఁడు. మహాతపస్వులు నగు బ్రాహ్మణోత్తములు నిర్నిమిత్తముగ నిటువంటి రాజునకు నపకారము నేల చేయుదు రని యొకరితో నొకరు చెప్పుకొనిరి. మేలుజలతారు వలువలు, బంగరు నగలు, రత్నహారములు దాల్చక పట్టునారచీరలు గట్టుకొని యామహాభోగి జోగిచందమున నిల్లు సేర మణివర్మయు మాధవసేనుఁడు మొదలగునాప్తులందఱును దొల్లి తల్లిపంపున నిల్లువిడిచి వల్కలములుగట్టుకొని కాఱడవులఁ గాపురము సేయఁ బోని శ్రీరామచంద్రుని, విరటుని కొలువు కాటమునకుఁ గంకభట్టువేషమునఁ బోయిన ధర్మరాజును బ్రత్యక్షముగఁ జూచినట్లు భావించి ఖిన్నమనస్కులైరి. హేమచంద్రుఁడు ద్వారముకడఁ దననిమిత్తము కనిపెట్టుకొనియున్న మంత్రులను బలుకరించి యంతఃపురికిం జనియె.

అతఁడు లోనికిం జనినపిదప మాధవసేనుఁడు మణివర్మతో మెల్లగ "మిత్రమా! మహారాజుగారు కుశలముగ నిల్లు సేరుటం జేసి మనము భయము విడిచిపెట్టవచ్చునని తోఁచుచున్నయది" యని పలుక మణివర్మ మనోవిచారమును సూచించు మందస్వరముతో "నిల్లలుకఁగానేపండుగ కాదుగదా. ఈకుశలముకుశలమా? ఇరువదియొక్క దినములు నిరపాయముగఁ గడపవలయు. బ్రాహ్మణుఁ డీయూరు విడిచిపోవలయు నప్పుడు రాజుగారు సురక్షితు లని మనము నమ్మవలయు. అంతవఱకు నాకుధైర్యము లే" దని చెప్పి మాధవసేనుని తోఁ గలసి కార్యాంతరములమీఁదఁ బోయెను.

అరవిందాదేవియుఁ గుమారులు హేమచంద్రుని గనుంగొని యింతింత యన రానిమహానందముఁ బొందిరి. దారాపుత్రులముగములు దీనములై యుండుటఁ గనుంగొని హేమచంద్రుఁడు వారిని దగ్గఱకుఁ బిలిచి లాలించి తన కపాయము లేదనియు విచారింపవల దనియు నెన్నియోభంగులం జెప్పి నిరువదియొక్క దినంబులునిరువదియొక్క గడియలట్లు వెళ్ళఁబుచ్చి వత్తునని దృఢంబుగఁ బలికి మరల నెప్పటియట్లు రాత్రి గుహకుఁ బోయి మంత్రము పునశ్చరణము జేసి మఱునాఁ డుదయమున నింటికి వచ్చెను. అట్లిరువదిదినములు గడచె. ఇరువదియొకటవనాఁ డుదయమున నరవిందాదేవి మగని వ్రతసమాప్తి దాదాపుగనైనదని యెంతయు సంతసించి యామొక్క రాత్రియుఁగూడ నెట్టెటో కడచినతోడనే తనమ్రొక్కులు దీర్పవలయునని నిశ్చయించి మంచిగోవులు వేయి తెప్పించి సిద్ధముగ నుంచుమనియుఁ గుంకుమ మేలైనది దెప్పింపుమనియు మంత్రికి నర్మదచే వర్తమాన మంపి తద్విషయప్రయత్నమున నుండెను.

ఇరువదినాలుగవప్రకరణము.

ఇరువదియొకటవనాఁడు హేమచంద్రుఁ డెప్పటియట్లుసాయం కాలము నియతుఁడై యేకాంతంబ గుహాకుంజనియె. ఇరువదిదినముల నుండి సరిగా భోజనము చేయక పోవుటచేతను మాపులు తిన్నగ నిదుర వోకపోవుటచేతను వానిశరీరము కృశించి మొగము వెలవెలఁ బాఱి చూపఱకు విచారము గలిగించుచుండెను. గుహాకుఁ జనినపిదప హరిశర్మ వాని నెప్పటియట్లు సమ్మానించి యిట్లనియె. "రాజా! ఈ యిరువదిదినంబులు దైవభక్తిచే నీవు గడు శ్రమనొందితివి. ఈతేయి యు నీవు జాగరూకతతోఁ గడపుదువేని నీకష్టము గట్టెక్కు; కాని యన్నిదినములలో నిదియే గడ్డుదినము. నీ కుపదేశింపఁబడినమంత్ర ప్రభావముచేత మహేశ్వరుఁ డనేకరూపములఁదాల్చి నీమనోనిశ్చలత శోధించును. అప్పుడు నీవు జంకుదు వేని మిగులనపాయము వాటిల్ల గలదు. ఈమాటలు నీ కిదివఱకే చెప్పియుంటిని. నీయందుఁ గలప్రే మాతిశయమున మరలఁ జ్ఞప్తికిఁ దెచ్చితిని." అని హరిశర్మ పలుకు టయు హేమచంద్రుఁడు "స్వామీ! అపాయము వాటిల్లినను నాకుఁ విచారములేదు. ఈశ్వరసేవాసక్తుఁడనై యుండి మేను విడతు నేని నాకంతకన్న భాగ్యము గలదే. శోధించుటకైననుసరే బాధించుట కైనను సరే యీశ్వరుఁడు నాకుఁ బత్యక్షమైనచో నాకదియే చాలు" నని నిశ్చింతతోఁ బలికి గురువునకుమతిఁ బడసి బద్ధపద్మాస నస్థుఁడై వ్యాఘ్రసనాసీనుఁడై జపమాలఁ జేతఁ బుచ్చుకొని పున శ్చరణ మారంభించెను. అతఁడు పునశ్చరణ మారంభించినతోడనె హరిశర్మ యచ్చోటు విడిచి యొండుకడకుఁ బోయెను. భైరవకాలకం తులు రాజున కాపూఁటఁ గానఁబడనే లేదు. ప్రపంచ మంతయుఁ గాఱుచీఁకటులు గ్రమ్ముకొని యుండుటచే భగవంతుఁ డిచ్చినకన్నులు

నిరర్థకము లయ్యెను. చుట్టుపక్కల కొండలలో నుండి నక్కలుతోఁ డేళ్ళు మొదలగు జంతువులకూఁతలెకాని మనుష్యులధ్వని యెక్కడ నాఁడు వినఁబడదయ్యె. ఎందుచేతనో హరిశర్మహోమగుండ మందలి యగ్నిని గూడ నాఁటిఱేయి యార్పివేసెను. నాఁటిఱేయి తెల్లవాఱు వఱకు పునశ్చరణముచేయవలెనని సంకల్పించుకొని హేమచంద్రుఁడు పరమనిష్ఠుఁడై కూర్చుండెను.

రెండుజాముల రాత్రియైనపిదప నొకమనుష్యుఁడు తనయడుగుల చప్పు డెవరికైన వినఁబడు నేమో యనుభయమున నలుకుడు గాకుండ నడచుచు మెల్లమెల్లగ గుహను జేరెను. దారి చూచుటకు రెండుకన్నులనుదప్ప తక్కినశరీర మంతయు నతఁడు కంబళముతోఁ గప్పుకొనెను. గుహచేరినతోడనె వానిచంక నున్నవస్తు వేదో రాతిగోడకు దగిలి టక్కుమని చప్పు డయ్యెను. ఆధ్వని హేమచంద్రునిచెవులం బడియెఁ గాని తపోవిఘ్న మగు ననుభయముచేతను వెనుకకుఁ దిరిగి చూడఁగూడ దని గురు వానతిచ్చుటచేతను దనవ్యాపారము నతఁడు విడువక నిశ్చలుఁడై యుండెను. అంతలో మనుజుఁ డిట్టటు నడచిన యలుకుడు వానికి శ్రవణగోచర మయ్యెను. అప్పు డించుకభయమున వాని మే నంతయు నొక్కసారి వడఁకె వెంటనే ధైర్యము దెచ్చికొని భగవానుఁ డగుశంకరుఁడు తన్ను శోధింప వచ్చియుండఁబోలు నని మదినిబెదురు లేక మఱింతగాటముగఁ బునశ్చరణము సేయనారంభించెను. అంతలో నెవఁడో యొకఁడు సన్ననిదీపము బట్టుకొనిగుహకు దూరమున నొక్క నిముసము నిలిచి వెంటనే యవ్వలకుం జనెను. క్రొత్తగా గుహం జొచ్చినవానిని హేమచంద్రుఁడు చూచుటకువీలు లేకపోయెను గాని యాదివ్వెవెలుఁగున నాక్రొత్తవాఁడు హేమచంద్రునకు వెనుకపక్కనుండి వానియునికి నంతయు సరిగఁగనిపెట్టుటకు వీలుగలిగె. అప్పు డానూతనపురుషుఁడు చంకక్రిందనున్నఖడ్గమునుదీసి

తపోనిష్ఠుఁ డగు హేమచంద్రునిశిరస్సు నొక్కయేటునం దెగనేసె. పునశ్చరణసంఖ్య లెక్కించుటకు ముడిచిన వ్రేళ్ళు ముడిచినట్లె యుండ పద్మాసనము వేసిన కాళ్ళు వేసినట్లె యుండ శిరస్సు బంతివడువున నెగిరి రెండుగజములదూరమునఁ బడియె. చిమ్మిలిగొట్టములనుండివసంతము వచ్చు తెఱఁగునఁ గంఠనాళములనుండి క్రొన్నెత్తురు ప్రవాహములుగఁ బైకి వచ్చి యాస్థల మంతయుఁ దడిపె. ఆక్రొత్త మనుష్యుఁ డీదారుణ కృత్యమును నిర్వర్తించి తత్క్షణమె యచ్చోటువాసి యెందేనిజనియె. హరిశర్మగాని భైరవకాలకుంతులుగాని యచ్చటఁ గనంబడరైరి.

ఇరువదియైదవప్రకరణము.

"హృదయేశ్వరా! హృదయేశ్వరా! మీవాలక మింతపాడు వారిన దేమి? ఎందుపోయెద రెందుపోయెదరు. నిలుఁడు నిలుఁడు" అని యరవిందాదేవి పలవరించుచు నిద్రలో నించుక యేడ్చెను. అది విని నర్మద నిద్రాసక్తయగు దేవిని మేలుకొలుపఁదనపండుకొన్న తావు విడిచి పోవుచుండునంతలో నరవింద బాష్పాకులితముల గన్నులతోఁ గళవళముపడు మనసుతో మేల్కాంచి "నర్మదా! నర్మదా! సత్వరము వచ్చి నన్ను గౌఁగిలించుకొనవే. అబ్బబ్బా యెంతపాడుకల గంటినే! అదేమో నాయొడలు వడఁకు చున్నదే" యని డగ్గుత్తికతోఁ బలికెను.

అమ్మాటలు ముగియునప్పటికినర్మదయునద్దేవిసమీపమునకుఁ బోయి "అమ్మా! భయము లేదు. ఇదిగో నే వచ్చినదాన" నని యామె మీఁదఁ జేయివైచి యించుక తట్టి యప్పటికిని మేనువడంకు దీరమి సందిటం బట్టి కౌఁగిలించికొని కాలోచితము లగుకొన్నిపలు

కులు బలికి యామె నూరడించి కొంతతడ వైనపిదప "నమ్మా! మీ కింతభయము గలిగించిన యాస్వప్న మెట్టిదో నాకెఱిఁగింపఁగలరే" యని యడిగెను. "నర్మదా! ఒక్కనిమిసము తాళి చెప్పఁగలను. ఇంకను నామనసు మనసులో లేదు. గుండె చెదరియున్న"దనికొండొకసే పూరకుండి యించుకభీతిఁ దొలఁగి లేచి కూర్చుండి యమ్మగువ నర్మదతో నిట్లనియె. "నర్మదా! పుట్టి బుద్ధియెఱిఁగి యింతటిపాడుకల నేనెన్నఁడు గనలేదే. అది వెండియుం దలఁపునబాఱిన నాశరీము కంపించు నని తోఁచు. అందుచే నది సంగ్రహముగా నీకుఁ దెలిపెద కన్నుమూసి కునికినచో నేదుస్వప్నము వచ్చునో యనుభయమున నిదురవోవక యె నలుగెలంకులు జూచుచు మేలుకొంటి. మహారాజుగారు గుహకుఁ బోవుట ప్రారంభించినదిమొదలు నేఁటివఱక నిద్రాహారములు సరిగ లేమి బడలికచే నెటనుండియో నాయనిద్ర వచ్చి మైకము గ్రమ్మినట్లు కన్నులు మూసివైచె. తిన్నగాఁగన్నులుమూసితినో లేదో వెంటనే చిన్నకునుకుపట్టె. నరిగాఁ బట్టెనదో లేదో వెంటనే యీపాడుకలగాంచితిని. మహారాజుగారుశరీరమునిండనూనె పూసికొని నల్లనివస్త్రములు గట్టుకొని కోట విడిచి యెక్కడికోపోవుచున్నట్లు కలగంటిని. అబ్బా! మరల నామేను వడంకుచున్న దే"యని నర్మదమెడఁ గౌఁగిలించుకొని మరల నిట్లని చెప్పఁదొడంగె.

"అప్పుడిది యేమివాలక మని పలికి నేనాయనపయనమును వారింపఁ దలఁచితిని. నామాటల కాయన ప్రత్యుత్తరమునె యొసంగక జాలి నించుచూపుల నావంకఁ జూచుచు యథేచ్ఛం జనియెనఁట." అని తనకథ తుదముట్టఁ జెప్పకమునుపే రెండవకొడు కగు హర్షవర్ధనుఁడు 'నాన్నగారు! గుహకుఁబోవల' దని కలవరించె. ఆబాలకునికలవరింతవిని యాకాంత మఱింత చింతాభరముచేఁ గుంది నర్మద నుద్దేశించి వెండియు నిత్తెఱంగున భాషించె. చూచితే నర్మదాబాల

కుఁడుసయితఁ మెట్లుకలవరించు చున్నాఁడో. ఈకలవరింతకు నీస్వప్న ములకు నేదో యనర్థకఫలమున్నదని నేను భయపడుచున్నదానను, చెడ్డకలలు మూడఁదలచినకీడులచాయ లని స్వప్నవేదులు వచింతురు. ఆకల గన్నదిమొదలు నాకడుపు చేయివెట్టి కలఁచినట్లున్నది. మనసు నిప్పులం బొరలినచందమున నున్నది. ఉపద్రవం బనుమహాసముద్రము కన్నులకుఁ గట్టినట్లగుపడుచున్నది. ఈకల యన్నికలలవంటిది కాదు. ఎన్నిసారులు స్వప్నమును గాంచ లేదు. ఎన్నఁడైన చిత్తమింత యుత్తలపాటు నొందెనే' యని కుమారు లిరువురిమీఁదఁ జేయివైచి రెండుకన్నులనుండి రెండుబాష్పబిందువులు రాల గద్గదకంఠముతో నాచిన్నియన్నలయదృష్టము లెట్లున్నవో యని యవ్వలఁ బలుకలేక యూరకుండెను.

ఆస్వప్నవృత్తాంతము విని యామెత్తరపాటు జూచి నర్మద సహజముగ గంభీరస్వభావ యయ్యు హృదయదౌర్బల్యము గలిగి యాదేవి యుత్తలపాటును శాంతిపరచుటకు లేనిధైర్యముందెచ్చికొని యల్లన నిట్లనియె. "అమ్మా! కలలు నిక్కంబు లగునా? ఒకప్పుడు స్వప్నములో నెంతటియసందర్భముల నయినఁ జూచుచుందుముకదా! ఒకనరుఁడు తాను మృతినొందినట్లు తనశవమును నరులు మోసికొని పోవుచుండ వారితోఁ దాను మాటాడినట్లు కలగాంచు. అదియసం భవము కాదా! కలలో వచ్చినయాపద లాపదలా! సంపదలు సంప దలా? పగలెల్ల మన స్సేపదార్థముమీఁదఁ దగిలియుండు నాపదార్థము గూర్చియే స్వప్నములు వచ్చుచుండు. మహారాజుగారిం గూర్చి మీరు కడుభయపడుచుండిరి గావున మీభయమున కనురూపము లగుస్వప్నములే వచ్చుచున్నవి. కలలోనైన హేమచంద్రమహా రాజుగారి కాపద రాదు."

అనవుడు నామాట తనమనంబునకుఁ బరమానందకరంబుగాఁ గాఁ

మగుటచే నయ్యరవింద నర్మదా! యింతమాట బుట్టినీనోటివాక్యమున రాజుగారు చెక్కుచెదరక నాకన్నులకుఁ గానఁబడుదురేనినీనోటినిండ గలకండంబులు బెట్టెదను. నీమేను బంగారముతో నింపెదను. అంత భాగ్యము నా కబ్బునా? నర్మదా! ఏ మయినను సరే నాబొంది యిచ్చట నున్నది గాని యాత్మ యిట లేదు. ఇపుడెంతరాత్రి యైనదో చూచి నాకును రాజ్యలక్ష్మికిని బితృప్రాయుఁ డగు మణివర్మ కడకు నీవుపోయి నాకన్నకలయును నాయున్నయునికియు నన్నుబాధ వినవెరపుతెఱంగు నాతనికిఁ దెలిపి కతిపయపరివారములఁ దోడ్కొని గుహాకడకుఁ బోయి మహారాజుగారిస్థితి నరసి కుశలవార్త నాకుబంపు మని చెప్పవలయు. ఎన్నివిధముల నివారించుకొన్నను మనసుకీడునే శంకించు చున్నది గాని శుభమును శంకించుట లేదు. తనసాయమే రాజకుటుంబమునకు వజ్రకవచ మనుము. రాత్రి యని బద్ధకింపవల దనుము. ఈరాత్రిగడపితి మేని యాపద గడపితి మనుము. ఈక్షణమె చను మనుము. త్వరపెట్టుము.

నర్మదయు నట్లకా యని యాక్షణమె లేచి యొకదివ్వె చేతఁ బూని దంటతనము గలయిరువురుబంట్లను దనకు సాయము జేసికొని మందిరము వెడలి ప్రతికవాటమునొద్ద నున్నయారెకులు నడిరేయిం దనపోకకుఁ గారణంబు ననేకప్రశ్నంబులు వేసి యడుగ వారి కంద అకుఁ దగుప్రత్యుత్తరంబుల నిచ్చుచుఁ గోట దాఁటి రాజవీథింగొంత దవ్వుపోయి మంత్రియగు మణివర్మ గృహంబునకుఁ జని ద్వారముకడ నిలిచి తానెఱింగినసేవకు నొకనిని నెలుఁగెత్తి పిలిచెను. పిలుపుటయు సేవకుఁడు బండనిద్దురలోనుండి మేల్కని తలుపుఁ దీయకపోవుటచే మేడమీఁద నున్న మణివర్మయే యామెపిలుపునకుఁ బలికి సేవకుని లేపి తలుపుఁ దీయించి యంతటి యర్ధరాత్రమున నంతఃపురపరిచారిక తన యింటికి వచ్చుటకు నుత్కృష్ట మయినకారణ ముండ వలయు నని

యది తెలిసికొనుటకు, వేగిరపడి మేడమెట్లు దిగి వచ్చి "నర్మదా! రాజుగారికిఁ గుశలమా! అంతఃపురమున నద్భుతము లెవ్వియు లేవు గదా! ఇట్టిసమయమున నీవు నాకడకు రాఁగత మేమి?" యని గుక్క తిరుగకుండ నొకమాట వెంట నొకమాట వచ్చునట్లడిగెను. నర్మద యా నుడువులు విని "దేవా! అంతఃపురమున నద్భుతములు లేవు. దేవిగారు దుస్స్వప్న మొకటిగాంచి మహారాజుగారి సేమమును గూర్చి సందియము నందుచున్నారు. కలలు నిక్కువంబులు గావని నే నెంత ధైర్యము చెప్పిన నామె నిలుచుట లేదు. ఆయుధహస్తులగు కొందఱు పరిజనుల వెంటఁబెట్టుకొని సింహగిరికడకు మిమ్ము బొమ్మని వేఁడుకొనుటకు నన్నుఁ బంపిరి. ఆమె యిప్పుడు మతిలేక యున్నది. ఆమె ప్రార్థనమున కనుగుణంబుగ మీరు వర్తింతురేని నే సత్వరంబ యామె సమక్షమునకుఁ జనియెద. ఈసమయమున నేను దాపున లేకున్న నామెచింత యినుమడించు. మీఁద దేవరచిత్త" మని చేతులు జోడించి వానియెదుట నిలిచెను.

మణివర్మ తచ్చరిత్రము విని తలయెత్తి యాకసమువంక చూచుచు, నొక్కనిముస మాలోచించి "నర్మదా! దేవివారి యానతి చొప్పున నిప్పుడే కొంతపరివారము దీసికొని యానెలవునకుఁ బోయి రాజుగారి కుశలవార్త తనకుఁ దెలియపఱచెదనని చెప్పుము. నామనస్సును సందేహవశ మగుటచేత నేను నిదురవోవక నీవు వచ్చునప్పటికి మేల్కని యిట్టటు దిరుగుచుంటిని. ఈవిషయమున దేవిగా రెంతభయపడుచున్నారో నేను నంత భయపడుచున్నవాఁడను. ఇదిగో నే నిప్పుడే దండపాణిమాధవసేన ప్రముఖులను దోడ్కొని యచటికిఁ బోయెద. నీవంతిపురి కరుగు" మని యానతిచ్చి యొక సేవకునిం బిలిచి "ఓరీ! సిగిమశర్మను, మాధవసేనుని, దండపాణిని శీఘ్రముగ నాకడకుం దోడ్కొనిరం" మ్మని పంపెను.

అనంతరము నర్మదయు మణివర్మయొద్ద సెలవు గైకొనిమరల నంతిపురి కరిగి మంత్రివచనంబులు రాజపత్నికిం జెప్పె. అన్నెలంతచన్న కొన్ని గడియలలో మంత్రియానవాళిఁ దాల్చిమాధవసేనప్రముఖులు వచ్చి తమ్ము రావించినకారణ మడిగి తెలిసికొనిమహారాజుగారికిమఱి యొకభయ మేదియు లేక పోయినను దేవిగారిహృదయసంతాపము బాపుటకై సింహగిరికిఁ బోవలసినదే యని నిశ్చయించి మెఱియల వంటిబంట్లు ముప్పదుగురు పిచ్చుకత్తులు దాల్చి తమవెంట నంటి వచ్చున ట్లానతిచ్చి మణివర్మతోఁ గూడ బయలు దేఱిరి. అందఱి మనస్సులు భయశంకాకలితము లగుటచేత నడచునప్పుడు వారొకరి తోనొకరు తఱచుగ మాటలాడికొన లేదు. దండపాణిమాత్రమునడుమ నడుమ పరమేశ్వరా మహారాజు దీర్ఘాయుష్మంతుఁ డగునట్లు చేయు మని వేఁడఁజొచ్చె. అందఱుఁ జేరి సింహగిరికిఁ బయన మగునప్పటికి సరిగ జాము రాత్రియైన లేదయ్యెను. మంత్రి గృహమునుండి సింహ గిరిసమీపమునకుఁ బోవునప్పటికి మూఁడుగడియలరాత్రి యుండె. కాఁపువాండ్రు భుజములపై నాగళ్ళు వేసికొని పొలములకుఁ బోవు చుండిరి. పట్టపగలు పరపురుషుల మొగంబులు చూడనొల్లని పేదపడం తులు దిగుడుబావులకు నూతులకుఁ జెఱువులకుఁ బోయి చీఁకటిచాటునఁ బానీయజలంబులు తెచ్చుకొను చుండిరి. జననిందలకు వెఱచినవిటజనం బులు తెల్లవాఱకుండ మేలుకాంచి వదలలేక వదలలేక ప్రియజనంబును వదలిపోయి నిదురలేమి కూరుకొనిపోవుకన్నులతోఁ దడబడుపాదములతో దూలియాడుమేనులతో నొరులు తమ్ము గుర్తింపకుండ ముసుంగులు వైచికొని గృహాభిముఖు లగుచుండిరి. దూరప్రయాణములారంభించి రాత్రి యూపీట విడిసినపాంథులు ముందుపల్లె యెండ యెక్కకుండఁ జేర వలయు నని పెందలకడ మేలుకాంచి యిష్టగోష్ఠులు చెప్పుకొనుచు పయనము వెడలిరి. రాత్రి జరిగినహృదయదారుణ వృత్తాంతమునకు

నెంతయు విలపించుచున్నవో యన పులుంగులెలుంగు లెత్తికూయఁ దొడంగె. రేయి యెందేని యథేచ్ఛంబుగఁ జరియించి చేయరాని దౌర్జన్యములఁ జేసి పగలు గృహంబులలో డాఁగి యెవ్వరికిం గానఁబడకుండఁ గోరుదుర్జనుల చందంబున బాములు మొదలగుదుష్టజంతువులు పుట్టలలోఁ దూఱఁజొచ్చె. నక్షత్రంబులు మందమందకాంతులు గలవై క్రమక్రమంబున నంతరింపఁ జొచ్చె.

ఇరువదియాఱవ ప్రకరణము.

మణివర్మ మాధవసేనప్రముఖులతో గుహాసమీపమునకుం బోయి తనయనుచరులం జూచి "మనమందరము కట్టగట్టుకొని యొక్కసారి యక్కడకుఁ బోవ రాదు. మహారాజుగారు నిష్ఠలో నుందురు. మన సందడిచే వారికి మనశ్చాంచల్యము కలుగ వచ్చు. కావున మీ రీచెట్టుక్రింద నిలువుఁడు. నేను బంటునొక్కని వెంటఁగొని స్థితి నరసి వచ్చెద"నని వారి నచ్చట నిలిపి కాగడా తెచ్చినమనుష్యుని, బంటు నొక్కని వెంటఁగొని యడుగులచప్పుడు గా కుండఁ నడిచి గుహాద్వారముకడకుం జని బంటుం బిలిచి "యోరీ! లోపల మహారాజుగారున్నారేమో కాగడావెలుఁగునం దొంగిచూడు" మని యానతిచ్చెను. బంటు చిత్తమని మెడ లోనికిం బెట్టిచూచి "స్వామీ! నేల యంతయు నెత్తురుతోఁ దడిసినట్లు కనఁబడుచున్న" దని భయమున గద్గదకంఠుఁడై పలికెను. "ఏమీ! నేల నెత్తురుతోఁ దడసెనా?" యని మణివర్మ, మాధవసేనప్రముఖులం దోడ్కొనిరమ్మని బంటు నంపి ధైర్యహీనతచేత దేహబలము సడల నిలువసత్తువ లేక యొకఱాతిపైఁ గూర్చుండె.

అంతలోఁ దక్కినపరివారము వచ్చుటయు మణివర్మ దండపాణిమాధవసేననిగమశర్మలఁ బిలిచి "నాకుఁ గాళ్ళాడకున్నవి. నన్ను లోపలికిఁ గొనిపొం" డని యామువ్వుర సహాయమున గుహం జొచ్చె.

చొచ్చి చూచునప్పటికిఁ గాఁగడావెలుఁగున నేల యంతయు వసంతము జల్లినట్లలుముకొనిననెత్తురిలో శిరోహీనమై పడియున్న హేమచంద్ర మహారాజు మొండెము, మొండెమునకు బారెడుదూరమునఁబడియున్న శిరస్సు వారికన్నులకుం గానఁబడియె. కానంబడుటయు మణివర్మ మ్రానుపడియె. నిగమశర్మ నిశ్చేష్టుఁ డయ్యె. మాధవసేనుఁడు మతి లేక వెంగలిచూపులఁ జూచె. దండపాణి దడదడ వడంకె. వారిస్థితి చూచి తక్కినపరిజనంబు కళవళము నొందె. అట్టు లొక్కనిమేషము మ్రానుపడియుండి క్రొన్నెత్తురులు చూచుటచేఁ జెదరి చీఁకటులు గ్రమ్మినకన్నులు దెఱచి "యిఁకేమున్నది. మనమహారాజునేలపా లయ్యె. హా! మహారాజా" యని మూర్ఛిల్లెను. సేవకు లందఱు హాహాకారములఁ జేయ గుహ ప్రతిధ్వను లెసఁగెను. మణివర్మనూర డించుటకు దండపాణిప్రముఖులు నెత్తురులోనం జదికిలఁబడిరి. మాధవ సేనునకుఁ గన్నులనీరు కాల్వలై పాఱఁ జొచ్చె. నిగమశర్మ మేను ముచ్చెమటలం బోసె. పరిజనము లొక్కరొక్కరుగ లోనికి వచ్చి తేనిం గాంచి నెత్తినోరు గొట్టుకొనువారు రొమ్ముమోఁదుకొనువారు తల బాళ్ళం గొట్టుకొనువారు నిలువ లేక యున్నరని చదికిలఁబడు వారు హరిశర్మం దిట్టువారునై యుండిరి. అప్పుడు నిగమశర్మ మిక్కిలి గడుసుదనము చేనిఛాందసుఁ డగుటచే యాఁడుదానివలె వెక్కివెక్కియేడ్చుచు నిట్లనియె. "అయ్యయ్యో! యీయుపద్రవం బునకంతకుఁ గారణము నేనే. హరిశర్మ మేఁకవన్నెపులి" యని యెఱుంగ! వానిమహిమలు వెయినోళ్ళం బొగడి మహారాజుగారి ప్రాణము తీయించితిని. దురాత్మా! హరిశర్మా! ఎంతపని జేసితివిరా? బ్రాహ్మణుఁడ వనుకొంటిని గాని కటికవాఁడ వనుకొన లేదు. ఓ బ్రహ్మదేవుఁడా! నీ వెంత యవివేకివి. సృష్టి మొదలుకొని నేఁటివఱకు నీవింతటిమహారాజు నెప్పుడు సృజంప లేదు. నీతలగొట్ట. నీచేతులో ని

పనికావున నిర్నిమిత్తంబుగా నొక్కనిముసమందు నిరుపమానగుణ రత్నాకరునినేలపాలుజేసితివి. మరలనిట్టిరాజును నీజన్మమధ్యమందు నీవు సృజింపఁగలవా? ఇంతకు బూర్వజన్మకృత మగుపాపమిట్లున్నది. ఎవ్వరేమి చేయఁ గలరు." అని వగచుచుండ మాధవసేనుఁడు మహారాజుమొండెమువంక దిరిగి "హా మహారాజా! నీవు లేకపోవుటచే శ్రీనగరంబు నిరాధార మయ్యె. సరస్వతి నిరాలంబ యయ్యె. పండితపరికరము నిరాశ్రయ మయ్యె. భృత్యజనము నిర్గతిక మయ్యె. వసుంధర నిరాభరణయయ్యె. రాజకులము నిర్సార మయ్యె. దారాపుత్రులు నిర్భాగ్యులు ప్రజలు నిర్భాగ్యులు మంత్రులు నిర్భాగ్యులునై యుండ వారికి నీవెట్లు "దక్కుదు"వని పరిపరివిధంబుల విలపించుచుండ నంతలో మణివర్మ మూర్ఛనుండిలేచి "మాధవసేనా! హేమచంద్రాస్తమాన మయ్యె. విబుధుల కింక గడుపునిండ నన్నమైనను దొరకదు. ఇంక చిత్రభానుం డుదయించి యగ్నిశిఖలం బోలు తనకరములచేతఁ బ్రజలను మంగలములోఁ బెట్టి వేచినట్టు వేచు. ఈ పని చిత్రభానుఁడు చేయించి యుండు. వాఁడు చచ్చినమాట వట్టిది. 'పాపీ చిరాయు' వనుమాట నిజము. ఇంతదుష్కార్యము సంకల్పించి యుండ వాఁడేల చచ్చు. పయోముఖ విషకుంభ మగునీహరిశర్మ యాదురాత్మునిచేఁ బ్రేరితుండై వచ్చి తలపెట్టినకార్యంబు చేసి పోయె.

ఆదురాత్మునిమొగంబు చూచినదిమొదలు వాఁడు విశ్వాసనీయుండు గాఁడనియు నాతనివలన నపాయంబు తప్పక నగు ననియుఁ బలుతెఱంగుల నే మొరలు పెట్టుకొన్ననునామాట లీయనఘునిచెవుల కెక్కినవి కావు. ఇంతకుఁ గాలంబు తీరికొని వచ్చు చుండ నావలుకు లెవ్వగిదిని పథ్యంబు లగును. అతిదారుణ మగునీవార్త నరవింద కెత్తెఱంగునఁ దెల్పుదు. నేను భర్తృకుశలవార్త దన కెఱింగింతు

నని పుట్టెడాసతో నున్న యమ్మహాదేవి యీయప్రియంబు విని జీవిం
చునే. తల్లి మఱియొకభంగి యైనచో నో రెఱుంగని యీబాలకులు బ్ర
తుకుదురే? ఏమి మూఁడ నున్నదో యెవ్వఁ డెఱుంగు అయ్యయ్యో!
మధ్యమలోక మందారవృక్షము వంటి పాలయ్యె ఇంక కపిసమూహం
బులయాశలడుగంటె. అధిక తేజోరాశి యైనసూర్యబింబ మస్తమించె.
కాశ్మీరమంధకారబంధురం బగు దురాచారులగు నిశాచరులు విచ్చల
విడింజరియింపవచ్చు. శత్రుమదగజంబులగుండె లవియఁజేయు రాజసిం
హంబు కడతేఱె. క్రూరసత్త్వవృద్ధి గాన నయ్యెడు కాఁబోలు!" అని
విలపించుచుండ దండపాణి కన్నులు వస్త్రాంచలమునం దుడుచుకొని
"హా రాజసింహమా! నీవు లేకునికి జనమానసంబు శోభావిహీన మై
యుండు. మీరు లేనిశ్రీనగరంబు సింగము లేనియడవి. శీతాంశుఁడు
లేనియాకసము. దైవోపహతుల మగుమాకు నీవంటి పుత్రుఁడు దక్కు
నే" యని వగచి యనంతదుఃఖము నాఁడ చల్లించి తక్కినవారితో
సమానుఁడయ్యె. మణివర్మయుం గొండొక సేపు బిట్టు వగచివగచి కొం
తవడికిం చుక యూరడిల్లి మాధవసేనునిచేయి పట్టుకొని "మిత్రమా!
మొదటనుండియుఁ గార్యములు మనతలపై నుంచుచే నేదివచ్చునను
మనకేరువురకుం దప్పదు. నీవంత ధైర్యమున సప్పరమ యెరిగి మనరా
కకై నిలుపరాని మాత్రమునఁ నిరీక్షించుచుండుసరవిందాదేవికఘో
రవార్త విన్నవింప వలయు. నను బట్టుం గలుపరిజనంబు లిట నుం
డుదు" మని పలుకుటయు మాధవసేనుండు వెంట ను దుఃఖావేశపర
వశుండై యమాత్యా! రాజశాసనంబునందు తాననయు నాకుమ
న్నింపఁ దగినదే కాని మిగులయంత బాధ్యతా యుపవించుకంటె
నెక్కువ సుకుమారి యనసూయకు కన్నులంతు. కంటికి నేనగ
పడిన తోడనే యాదేవి నాకేమనక వచ్చె మహారాజు కుశలియే
యని యడిగిన నే నేమని చెప్పుదు. ఈకథ చెప్పుటకు నాకు నో రెట్టు

లాఁడు. మంగళవార్త తెలియఁగింపవలసినచోట మరణవార్తలు దెలుపవలసి వచ్చెనే! ఈకార్యంబు నేఁ జేయ నొల్ల. మీరు రండు. మీ వెంట నేను వచ్చెద" నని వినయముతో విన్నవించెను.

మాధవసేనుని మనస్సు మిక్కిలి మెత్తని దనియు నతఁ డట్టికఠిన వార్తలు దెలుపఁ జాలఁ డనియు మణివర్మ యెఱిఁగి యుండుటచేఁ దానే యమ్మాధవసేనుని వెంటఁబెట్టుకొని పోవఁ దలంచి దండపాణిని నిగమశర్మను గుహాలో రాజకళేబరసంరక్షణనిమిత్తము నిలిపి వారికి సాయముగఁ దక్కిన పరివారము నుంచి యిరువురబంట్ల వెంటఁగొని బయలుదేఱి గుహవిడిచి రాఁ గాళ్ళాడక యొకసారి నిలిచి బ్రాహ్మణుఁడా! యెంతపని చేసితివిరా? యని యొకమాటును హా! రాజరాజ నీవంటి యుత్తమోత్తమున కెంతటిగతి ప్రాప్తించె నని వేఱొక మాటును, నయ్యయ్యో! ఆబిడ్డల మొగ మెట్లుచూతు నని యింకొక మాటును మనసుపోయిన తెఱంగున మఱఁగుచు నోటికి వచ్చినవిధమున నుడువుచు రెండడుగులు నడిచి మరల వెనుకకు వచ్చుచుఁ గొంతసేపు పిచ్చివానివిధమునఁ జరియించి యెట్టకేలకు సాగిపోయెను.

అట మణివర్మ సముఖమునుండి నర్మద మరల నంతఃపురికిఁ బోయి పడకగదిద్వారముననే నిలిచి తనరాకం బ్రతీక్షించుచున్న దేవిం గనుంగొని యమాత్యుఁడు గుహవద్దకుఁ బోవసమకట్టెనని యామె కెఱిఁగించి యించుక తడ వామెచిత్తమును శాంతింపఁజేసెను. కాని యంతతడవు వేచియున్నను మగనివార్తలు తెలియకుండుటచే నిమిష మొక్కజామైనట్లు కనఁబడి కాల మామెకు మిక్కిలిభారమాయెను. ఒక్కసారి కూర్చుండు. వేఱొకసారి కూర్చుండలేక పన్నుండు. ఇంకొకసారి యెద్దియుం దోఁచక ద్వారముకడకుఁబోయి నిలుచు; మఱి యొకసారి మణివర్మ వచ్చుచున్నవాఁ డేమో చూడవే యని నర్మదను గొన్నియడుగులదూరమంపు. ఎప్పటికి నయ్యమాత్యునిదర్శన

ము కాకపోవుటచే విసికి యొకతూరి యాదేవి నర్మదతో బాష్పాకులి
తయై "యోసీ! ప్రాణనాథున కపాయ మేదైన జరగియుండదుకదా?
లేనిచో నింతతడవేలనే? ఏమో కాని నామనసు నామనసునే నమ్మ
కున్నదే? ఈక్షణము మహారాజుగారువచ్చి నాకన్నులయెదుట నిలిచి
నాయలమట దీర్చిన నెంతబాగుండును. వారు రా నక్కఱ లేదు.
కుశలవార్త కాకిచేతఁ జెప్పిపంపినను నాకుం జాలును." అనుచు
మనోగత మైనదుఃఖమునకు వచోరూపక మైనయాకారము నొసంగు
చుండ నంతలో రెండవకొడుకగు హర్షవర్ధనుఁడు మేలుకాంచికన్నులు
నులిమికొనుచు లేచి కూర్చుండి యొడలువిరుచుకొని కన్నులు దెఱచి
చెక్కునఁ జేయి వెట్టుకొని యొకచోఁ జేష్టలు దక్కి బంగరుబొమ్మవలెఁ
గూర్చున్న తనతల్లిని జూచిదిగ్గునపాన్పుడిగ్గి యొడిలోఁ గూర్చుండి
"యేమమ్మా! నీవిప్పుడు మేలుకొని యుండుటకుఁ గారణ మేమి?
నీవు విచారించుచున్నట్లు కనఁబడు చున్నదాన వేమి? నాన్నగారివార్త
యేమయినఁ దెలిసినదా! అమ్మా! అయ్యో పండుకో వేమే!
నీ విన్నాళ్లవలె లేవేమే! అదియేమో నాకుఁ జెప్పవే! నాతో
చెప్పుట కేమే? నర్మదా? ఏమే మాయమ్మ యిట్లున్నది కారణము
నీవైనం జెప్పవే!" అని పరిపరివిధంబుల నడిగి వారిరువురుఁ దనమాటల
కుత్తరం బొసంగకపోవుటయుఁ దల్లికన్నులనుండితనప్రశ్నంబులకు త్త
రంబులువోలె బాష్పంబులు రాల్చుటయు వీక్షించి యతఁడుం జిన్న
వోయి లేచి నిద్రించుచున్నవిక్రమసేనునికడకుంబోయి 'అన్నయ్యా
అన్నయ్యా! ఒకసారి లె' మ్మని మీఁదఁ జెయివైచి తట్టెను. అను
జునికరస్పర్శ మగుటతోడనే విక్రమసేనుఁడు మేలుకాంచి యంతటం
జూచి యేమేమి! మీరంత మేలుకొని యున్నా రేమి? తమ్ముఁడా!
అమ్మ యిట్లున్న దేమి? నర్మదా! నీవు నట్లుంటి వేమే యని వేర్వేఱ
నందఱ నడుగ నాతనికి నర్మద యిట్లనియె.

"అమ్మగారు మీనాయనగారిమీఁద నొకపాడుకలగని విచారించుచున్నారు. ఆయనకుశలవార్త నరయుటకు సింహగిరియొద్దకు మణివర్మప్రముఖు లరిగి యున్నారు. వారింకను రాకపోవుటచే నీమె యాందోళము మఱింత హెచ్చినది. ఇదియే విచారకారణము". అని యెఱింగించుటయు హర్షవర్ధనుఁడు "ఇదియా కారణము. నేనెంతయడిగిన నాకెవరుం జెప్పరైరేమే? అన్నయ్యా! మనమిద్దఱము సింహగిరికిప్పుడే పోయి నాయనగారివార్త స్వయముగా నరసి వత్తము రమ్మని పిలువ నొనర్చు పరిపక్వ యౌవనుఁ విక్రమసేనుఁడు పాన్పు డిగ్గె. అయ్యిరువురయుత్సాహముం జూచి సహజముగ వారు సాహసులౌట యెఱిఁగినదగుటచే కనకాంగాదేవి చివాలున లేచి యిరువురం జేరియొక చేతంబట్టుకొని "నాకులదీపములారా! చాలు మీ సాహసములు. నాదినములు మంచివి కావు. గడపదాఁటి మీ రావలకుఁ జన వద్దు. సింహకిశోరములవంటి మీమీఁద మీతండ్రిగారికి భయమేమియుండు. ఇంతలో మణివర్మయింటికి వచ్చియుండు" నని పలికి యాకుఱ్ఱల యుత్సాహంబు నివారించి కూర్చుండఁ బెట్టె. అంతలో మనుష్యులు నడచినచప్పుడు శ్రవణగోచరం బగుటయు నందఱు ద్వారముకడకుం జనిరి.

ఇరువదియేడవ ప్రకరణము.



అప్పుడు తెల్లవారు చుండె. కాకులు కావుకావు మనికూయఁ జొచ్చెను. పోవుచున్న చీఁకటులు మెల్లమెల్ల వ్యాపించు చున్న వెలుఁగుల, నడుమనడుమ మనుష్యుల మొగములు స్వల్పప్రయత్నముతో గుర్తించుటకు వీలుగ నుండెను. కోటసమీపమునకు వచ్చినతోడనే

యీ యమాత్యులకిరువురకు మనోధైర్యంబులు జాఱిపోయె. ముఖంబులు వెలవెలంబోయె. నడచుటకుఁ గాళ్ళాడవయ్యె. ఊపిరులు నిడుదలయ్యె. అచ్చట నేదిచూచిన వారికి మహారాజే జ్ఞప్తికి వచ్చె. రాజభటులు వారివాలకములంజూచి భయపడి యేదియో మూడినదని యొండొరులతోఁ జెప్పుకొనసాగిరి. ఆమంత్రు లిరువు రెట్టకో కోటఁజొచ్చి యనేక కక్ష్యాంతరంబులు గడచిగడచి వంచినతలలతో బాష్పాకులితములై మార్గమును జూడరానికనులతో మందమందములగునడకలతో నెంతయడఁచిన నడఁగక సముద్రతరంగములవలె నుబికి యుబికి వచ్చుదుఃఖముతో 'నంతఃపురసమీపమునకు వచ్చుచుండ ద్వారముకడ నదివఱకే చేరియున్న విక్రమసేనుఁ డదిగో మాధవసేనుఁ' డని వ్రేలితోఁజూపెను. అదిగో మణివర్మయని నర్మద పలికెను. ఆపలుకులు వినినతోడనే యరవిందాదేవి తెప్పవాల్పక వారివంక తెప్పక చూచి, చేష్టలు దక్కి తలలువంచి కట్టుబొమ్మలవలెగదలు వారివాలకములు తనకుం దృప్తికరములుగ నుండకపోవుటచే రాజకుటుంబోజ్జీవకమగుశుభవార్త వినంబడునో పిడుగుతునకవంటిదు శుభవార్త వినంబడునో యనిసందిగ్ధమునకు భయంబునకు లోనై జయ మనుగొప్ప బరువుతో నిండినతనదేహము ననఁటికంబమువంటికాళ్ళు భరింపఁజాలమి నిలువలేక గోడకుం జేరఁబడి కూర్చుండెను. బాల్యచాపలంబునకు భయంబు తోడుసూప హర్షవర్ధనుఁడు తనయంతరంగంబున నెలకొన్నయాత్రము నిలుప లేక విసవిస నడచి వచ్చుచున్నమంత్రులకెదురుగాఁ బోయి మణివర్మచేయి బట్టుకొని "మానాన్నగారు కుశలముగ నున్నారా? ఏమి చేయుచున్నారని" యడిగెను.

అడుగుటయు జాలిగొలుపు బాలకునిపలుకులు ములుకులై నాట దుఃఖజలముతో నిండిన మణివర్మ మనస్సను కడవ చిల్లివడియెనో యన్నట్లు రెండుకన్నులకొలఁకులనుండియు వేఁడికన్నీళ్ళు దొరఁగిశాల

కునిమస్థకమున కభిషేకము చేయఁజొచ్చెను. వేఁడికన్నీళ్లు తలఁదడుపుటయు వేఁడినిట్టూర్పులు మొగమునకు సోఁకుటయు నిట్టూర్పులకతమునకడుపు మాటిమాటికినుబుకుటయుఁ దనయడిగినప్రశ్నమునకుత్తరము లేకపోవుటయుఁజూచి బాలుఁడు హర్షవర్ధనుఁడు తెల్లబోయి నిలిచెను. అంతలో విక్రమసేనుఁడు పరుగెత్తుకొనిమంత్రికడకుఁబోయి "అయ్యా! తండ్రిగారిం దోడ్కొనిరాక మీరొంటిగ వచ్చితి రేల?" అని మఱియు నేదో పలుకఁబోవుచుండ మణివర్మ దుఃఖపరవశుఁడై "హా మహారాజ" యని నేలపయిం బడి మూర్ఛిల్లె. "నాయనా మీతండ్రిగారికుశలవార్త నెఱింగించునట్టిపుణ్యము మేముచేసికొనమైతి" మని బాష్పరోధముచేత మఱేమియు మాటలాడనోపక మాధవసేనుఁడు నేలం జతికిలఁబడియె.

అమాత్యులదారుణవచనము లనెడు మేఘగర్జనములు వినఁబడినతోడనే మందిరమున దుఃఖవర్షము గురిసెను. అరవిందాదేవి హా హృదయేశ్వరా! యని యొక్క కేక వైచి మూర్ఛిల్లెను. నర్మద దేవిపాదములయొద్దబడి యేడ్వసాగెను. తండ్రివార్తయుఁ దండ్రియవస్థయు నెఱింగి బాలకులిరువురు వెక్కివెక్కి యేడ్చుచు లోనికిం జని స్మృతి యెఱుంగక పడియున్న తల్లికడకుఁబోయి రెండుప్రక్కలఁ జేరియొకరు గూర్చుండిరి. పిదపనంతఃపురమందలి సేవకులందఱు హా! హేమచంద్ర మహారాజా యని యాక్రందనము చేసిరి. వారలరోదనంబులు విని యానెకులు మొదలగు కోటకాపరులు వినువారిగుండె లవియునట్లు మిన్ను ముట్టునట్లెలుఁగెత్తి విలపించిరి. కోటలోనికళవళమునుబట్టి మహారాజుమరణవార్త యానోటనుండి యానోటంబడి నగర మెల్ల నిముషములో వ్యాపించెను. వ్యాపించుటయుఁ బ్రజలు హాహాకారములు జేయువారు హరిశర్మం దిట్టువారు, పానుపులపైనుండి దిగ్గున లేచువారుఁ బరుండినవారి కీవార్త జెప్పుచు లేపువారు తోఁచక యిం

దండు దిరుగువారు తొట్రుపాటున పనులు మఱచువారు తమ్మడుగ వచ్చినవారి కావార్తఁ జెప్పువారు చెప్పవచ్చినవారి గ్రుచ్చిగ్రుచ్చి ప్రశ్నలడుగువారునై పలుతెఱంగుల నుత్తలపాటు పడఁజొచ్చిరి. అంగనలు ప్రాతఃకాలగృహకృత్యములు మానిగుంపులుగూడి కన్నుల నీరు వెట్టుకొనుచు నొండొరుల నమ్మా యక్కాయని పిలుచుకొనుచు నింక నరవిందాదేవి బ్రతుకదని కొందఱు, కళారాశియైన యామెమొగమునకు బ్రహ్మ వైధవ్య మెక్కడవ్రాసెనోయని కొందఱు, దైవము కంటికి వేలగింజయుం బెద్దయయ్యెనని కొందఱు దేవి నోఁచిన నోము లన్నియు నేమయ్యెనే యని కొందఱు, మంచివారికి దినములు కావని కొందఱు, దైవనియతి యిట్లున్నది, యొకరిననేల యని కొందఱుఁ దోఁచినపోలికం బలుకఁజొచ్చిరి. పురుషులనేకులు ప్రభాతకృత్యములు నెఱవేర్పకయే రాజకళేబరముం గనుంగొనుటకు సింహగిరివంకకుం జనిరి. కొందఱు సత్వరంబున కాల్యంబులందీర్చి యాప్రదేశమునకుం జనిరి.

అట మణివర్మయు మూర్ఛనుండి తెలివి దెచ్చికొని సంతత ధారగఁ గన్నీరు కారుచుండఁ బ్రక్కను గూర్చున్నమాధవసేనుని జూచి గద్గదకంఠముతో "మిత్రమా! రాజపుత్రులేరి? దేవియవస్థ యెత్తెఱంగున నున్నది? ఎత్తెఱంగుననున్న దని యడుగ నేల! మగపులుఁగు నెడబాసినయాఁడుపులుఁగుతెఱఁగున నల్లుకొన్న ప్రాపుఁ బాసిన తీఁగలాగున నిరాధారమైయున్నదికాఁబోలు. నన్నొకసారి దేవిసన్నిధానమునకుంగొంపోవుదే. పూర్వపుమహారాజుగారికాలపువాఁడనైన నేను ముందుగాకడతేఱక యీఘోరవార్త వినుటకు దేవికి వినిపించుటకుఁ గాఁబోలు నిరుడుపుట్టెడురోగమువచ్చి బ్రతికితిని. హేమచంద్రుని నాచేతులతో నెత్తియాడించితిని. ఇప్పటికి సరిగ ముప్పదిమూఁడేండ్లయినఁ జెల్లలేదు. పచ్చెడు దశమికి ముప్పదిమూఁడవయేఁడు నిండును. ఇంతలోనే యామహాత్మునకు నూఱేండ్లు నిండినవి. తండ్రి

యగువిక్రమసేనుఁడు మరణకాలమున నన్నుఁ బాన్పుకడకుఁ జేరంబిలిచి తనచేత నాచేయిపట్టుకొని "హేమచంద్రుఁడు నీవాఁడు కాని నా వాఁడు కాఁడు. రాజ్యము గొప్పది; వయసు చిన్నది. పగతురనేకులు. బుద్ధిసంపన్నుఁడ వగు నీవె యాతనికి సప్తాంగములట్లు పనిచేసి నే నున్నప్పటియట్లు వానిచే రాజ్యంబు జేయింపవలయు"నని నాచేతిలోఁ జేయి వైచి వాని నప్పగించె. అప్పగించినందుకు నే నిప్పు డామహా రాజును జేతులార మృత్యుదేవత కప్పగించితి. ఈవిషయమునఁ దక్క నన్యవిషయముల నెఁడు నాగీచిన గీటు దాఁటి యెఱుంగఁడు. ఏమైన నేమి తుద కిట్లయ్యెఁ గదా. నన్నాయమ్మకడకుం దోడ్కొని పొ"మ్మని వేఁడుకొనియెను. మాధవసేనుఁడు డగ్గుత్తికతో "నయ్యో దేవి యవస్థ యతిదీనముగ నున్నది. నీవు మూర్ఛిలినతోడనే దేవియు హా! ప్రాణేశ్వరా! యని మూర్ఛిల్లి చైతన్యములేక పసిఁడిబొమ్మ తెఱంగున లోనం బడియున్నది. తండ్రిచావు నిప్పుడిప్పుడే విని గుండెలు చెదర బెంగటిల్లి యున్న బాలకు లిద్దఱుఁ దల్లి యేమగునో యని యామె కిరుప్రక్కలఁ జేరి తల్లిని కన్నీటితో స్నానము చేయించుచున్నారు. ఆతల్లిబిడ్డలదురవస్థం జూడ నాకడుపు చుమ్మలుచుట్టుచున్నది. నీవదిచూచి సహింపఁగలవే. ఐన నటు పోఁదలఁతువేని పోవుదము ర మ్మని పలికెను.

అనవుడు మణివర్మ "మాధవసేనుఁడా! యెంతవెఱ్ఱివాఁడవు. అంతటిమహారాజుశరీరమును తుండుతునుకలైనయవస్థలోఁ జూచి యింకను బ్రదికియుండిన తాఁటిగుండెవారము మనము తల్లిబిడ్డలయవస్థఁ జూచి సహింపఁజాలము. ఏదపద నన్నటకుం గొనిపొ"మ్మని పలికెను. పలుకులయు మాధవసేనుఁడు వానిని లేవనెత్తి మెల్లమెల్లగ దేవి యున్న నెలవునకుం గొనిపోయెను. అట్లిరువురు నరవింద యున్నగదికిఁ బోయి యొకచోటఁ జకిలఁబడిచేష్టలు దక్కిపడియున్న రాజపత్నిని, రెండు

పరిక్కాలఁ జేరి విలపించుకుమారులను, పాదపద్మములను దనయశ్రుజల
ములతోఁ దడుపుచున్న నర్మదను జూచి యనగతధైర్యు లయి
యాఁడువాండ్రం బోలె ‘బావు’ మనియేడ్చిరి. ఆయిరువురవిలాపంబు
వినినతోడనే బాలకులు నర్మదయు వావిడిచి విలపించిరి. మణివర్మ
కొండొకసేపున కించుక శాంతించి “హా! అరవిందామహాదేవి! అర
విందవాసినియగు నాఁడిలక్ష్మికయిన నెంచఁదలఁచితిమేని వంకలుగలవు
గాని నీకు లేవు. నాఁడు స్వయంవరకాలమున సకలమంగళాలంకార
ములతో నిండియుండి మాపిన్నరాజనకుఁ బట్టపుదేవివయి మాకెల్ల
రాణివై మెఱుఁగుదీఁగయట్లు చూడ్కులకు మిఱుమిట్లుగొలుపునిన్నుఁ
జూచినకన్నులతోడనే నేఁడు నీదురవస్థం జూడవలసివచ్చె. నాచిన్న
యన్నలారా! రాజపుత్రులారా! మీకెంతదశ వచ్చె” నని విలపించు
చుండ నంతలో నరవిందాదేవి కించుక స్మృతి తెలిసెను. అది యె
ఱుంగక నర్మద పలవరించుచున్న మణివర్మ నుద్దేశించి స్వామీ!
మహారాజుగారి నిశ్చితవార్త యేమియని డగ్గుత్తికతో నడిగెను. ఆమె
ప్రశ్నము విని మణివర్మ “నర్మదా! ఏమి చెప్పుదు. హరిశర్మయో
వానిప్రేరణంబున నేదురాత్ముఁడో ఖడ్గముతో మహారాజుగారిని వధ
యించి” యనివాక్యము సమాప్తము చేయకమునుపే యప్పుడే మెలఁ
కువ దెచ్చికొన్నదేవి ‘హా హృదయేశ్వరా’ యని యొక్క కేకవైచి
వెండియు మూర్ఛ నొందెను. నర్మద చేతులతోఁ దలయు గొమ్మ
మోఁదుకొని రోదనము చేసెను. బాలకు లిరువురు దుఃఖావేశము
చేతను భయముచేతను గడగడ వడంకుచుండుటచే మణివర్మ యొక
నిని మాధవసేనుఁ డొకనిని జేరఁదీసి యొడిలోఁ గూర్చుండఁబెట్టుకొని
బిగ్గఁ గౌఁగిలించికొనిరి. తక్కిన దాసీజనంబు మూర్ఛిల్లినదేవికూడ
స్మృతినొందు ననుభయంబున శీతలజలంబులు పన్నీరుఁ దెచ్చి తెలివి
దెప్పించుట కామెపైఁ జల్ల నారంభించిరి. అట్లు కొంతతడవు శైత్యో

పచారములు నెరపినపిదప నరవిందాదేవి చైతన్యము గలదయి తెలి
విం దెచ్చికొని యుత్తైలంగున విలపింపఁదొడఁగె. "అయ్యో! చెలు
లారా! ఏల యీశైత్యోపచారములఁ జేసి నాకుం దెలివి తెప్పించె
దరు. నాకు మరల స్మృతి రాకుండ ప్రయత్నములుచేసి యెన్నఁడు
న న్నెడబాయని మహారాజుగారి సన్నిధికి నన్నుఁగూడఁ బంపుఁడు.
విడిపోయిన యంతనే గలుగుటయే కదా పారలౌకిక క్రియలు చేయ
వలసినపని. ఇంతకాలంబు మీరు నాకు నిక్కిలి యుపకరించిరి భర్త్ర
సన్నిధికిం బంపవలయు. నేఁడు నాపై యెప్పటిస్నేహం ముంచి యట్లు
సేయుఁడు. నర్మదా! నీవయిన నామాట వినవే. ఆజగదేకవీరు
నాప్రసన్నవదను నాగుణరత్నాకరుఁ బాసి నిమేషమైన నే నుండ
గలనే! హా హృదయేశ్వరా! నావంటి పాపాత్మురాలికి మీవంటి
సర్వగుణసంపన్నులు దక్కుదురే? నాపై మీకుఁ గల యనుగ్రహం బేల
కలిగె ప్రణయంబునకైన మీపై నలిగి యుంటిఁగా. పరిహాసంబున
కయినను నొప్పించి యుంటిఁగా. ఎన్నఁడైన మీపాదసేవ మానియుంటిఁగా.
ఇట్టి నన్యశరణ్య యగు నన్ను నేల యిట్లు విడిచిపోవుట పాడి
గాదు. ఈమాయావాసనన్ను మీకెట్లు దాపురించె. శుద్ధస్ఫటికము
వంటి మీమనస్సును కలుషితముఁ జేసి నాబ్రాహ్మణుఁడు కల్పించివైచి
యింత తెచ్చె. నే నేమిచేసితినో యెన్నివిధంబులనో చెప్పించినను
వానిమాటలనే మనసునందు నమ్మించుకొని మీరీవలఁ బరదేశుల
రయిరి. ఆకుశాగ్రబుద్ధి యెందరినో! ఆశాస్త్రజ్ఞాన మేమయ్యెనో!
ఆధర్మసూక్ష్మవేదిత్వ మెటుసముగంటెనో! ఆబ్రాహ్మణుఁడుచేతిలో
వైకుంఠము చూపుటచే వానిమాయలఁ జిక్కి త్రాఁచుపాముపూల
దండవలెనమ్మి శరీరంబు బాసితిరి. కుమారులారా! నేను మంద
భాగ్యురాలనైనను మీయొద్ద రక్షావిలాసములంబట్టి మీ రదృష్ట
వంతులఁ గోరుచుంటి. మీపూర్వజన్మపుణ్యమయిన దండ్రిగండము

గాంచు ననుకొంటి. అయ్యో! తండ్రీ లేనిబిడ్డ లయితిరే. బ్రదికియుఁ బ్రయోజనము లేనిదానను. నేనుబోయి బంధుజనపారిజాతము, మానినీమన్మథావతారము, విద్వజ్జనవిబుధమణియగు నామహారాజు బ్రదుకరాదే. ఇంతకు నానోఁచినోములపంట యిటులున్నది. దైవోపహతులకు శుభంబులు గలుగునే. ఏనాఁడు మహారాజు మంత్రోపదేశంబు కాఁ నిశ్చయించుకొనెనో యానాఁడె నాకు నాప్రభువునకుఁ దీరె నని నిశ్చయించుకొంటి. ఆబ్రాహ్మణుని మాయమాటలలో నేమి మహత్త్వమున్నదో కాని వానితో మాటలాడినపిదప నాహృదయేశ్వరుఁడు నాతో నొకనాఁడయినఁ జిన్నగా నవ్వుచు మాటాడ లేదు. కనువిచ్చి చూడ లేదు. హాయిగా నిదురింప లేదు. సుఖముగా భుజియింప లేదు. పితృసమానుఁడగు నాయనమనోనుమ్మతాలు నయిన విన లేదు." అని చివాలున లేచి బావురుమనుచు నేడ్చుచు మదనవర్మకడకుం జని యతనిపాదములపయిం బడి "శ్రీ మహాప్రభూ! మామామగారు నీకుం జేతిలోఁ జేయివైచి యప్పగించినప్పటిరాజ్యముతోఁగూడ నీరాజును బ్రాహ్మణునకప్పగించి వచ్చితివే! నన్నుఁ బితృపాత్రముగఁ జూచు మీమహారాజేఁడీ? నానోములపంట యేఁడీ? ప్రియరాజకుమారుఁ డేఁడి? నాముద్దులచంద్రహాసుఁడేఁడీ? నాకింకమూర్తిని కనుచూపఁదలఁచుకొన లేదే. తండ్రీ! ఒకసారి నాప్రాణేశ్వరుని చూపింపుము. ఆయనను మున్ను వసియించుచుండిన యింటికిఁ గానాఁ రప్పింపుము. ఇదియే నేను మహోపకారముగాఁ దలంచెద" నని యంగలార్చుచుఁ బలికిన దయనీయవాక్యంబులను నాలుకమంబు వినిన మదనవర్మ మూర్ఛ వచ్చిన ట్లఱచి దుఃఖించుచుఁ గన్నులనీరు గ్రమ్మ యమ్మహాదేవి చేతులఁ బట్టుకొని "తల్లీ! నేను అపరాధినగుచు బ్రదికియుంటి. ఏమనదనుఁడయిన నీప్రాణనాథుని జేతులార బ్రాహ్మణున కప్పగించి చంపించిన మహాపాతకుఁడను. నేను నీకేమిసాయంబు జేయఁగలవాఁడను. నేఁటి

కాలమునకు నీకు మగనిశవమునుజూపుటయే మహోపకారము జేయు టగ నెంచికొనవలసిన యవస్థ వచ్చినది. నాతల్లీ ! దారుణమరణము చెందిన భర్తృకళేబరమును జూచి నీవు సహింపఁజాలవు. కావున నావిజ్ఞాపన మాలించి యీవిషయమున గట్టిపట్టు పట్టకు" మని వేఁడుకొనియె.

రాణి యాపలుకుల నంగీకరింపక "అయ్యా! ఈవార్త విని బ్రతికినదానను భర్తృదేహమును జూచి బ్రతుకఁజాలనే? బంగరుబరిణలో వజ్రమును దాఁచినట్లు బ్రహ్మ నామెత్తనిదేహమున వజ్రపుగుండె చేసిపెట్టినాఁడు. కావున నమ్మహాత్మునిటకుఁ దెచ్చినను సరియే లేక నన్నటకుం గొంపోయినను సరియే" యని యాతని యొడిలో నున్న హర్షవర్ధనునిమాధవసేనునియొడిలో నున్న విక్రమసేనునిజెరియొక చేతఁ జేరఁ దీసి కౌఁగిలించికొని "బిడ్డలారా మీ కెంతగతి వచ్చెరా!" యని దుఃఖావేశంబున వెండియు మూర్ఛిల్లె. అంత మణివర్మ ప్రక్క నున్న మాధవసేనునిజూచి "మిత్రమా! ఈదేవి మహారాజు మొగము కడసారి చూడక మానదు. చూడనీయకపోవుట మనపట్టంగూడ దుర్నయ మగును. కావున తెఱచుగా మహారాజుగా రెక్కు బంగరు పల్లకి మోయించుకొని సింహగిరికిఁబోయి దానిలో శరీరముంబెట్టించి కొని" యని యర్థోక్తిగఁ జెప్పి కడమపలుకులు పలుకలేక "హా హేమచంద్రమహారాజా! నిన్నుగురించి నేనెంతటిదారుణవచనములు పలుకవలసివచ్చె" నని కొలఁకులనుండి కారుబాష్పములు తన నెరసిన మీసములపైఁబడ ఱడుప రోదనముచేసెను. మాధవసేనుఁడును గన్నీరు త్తరీయాంచలమునఁ దుడుచుకొని సరేయని భటులఁబిలిపించి పల్లకి మోయించుకొని సింహగిరికిఁ జనియె. అప్పు డంతఃపురపరిచారకులు మునుపటియట్ల మూర్ఛిల్లిన దేవికి శైత్యోపచారములు చేసిరి. చేయఁ జేయఁ గొండొకవడి కాదేవి తెలివిం దెచ్చికొని మగనిసుగుణంబులఁ

దలఁచియుఁ దన దైన్యంబు తలపోసియు బిడ్డల దిక్కుమాలినతనంబు నూహించియు దైవనిర్ణయమును జింతించియుఁ బరిపరివిధంబులఁ బల వించుచు నయ్యో! ప్రాణనాథునిమృతకళేబరముచూచి సైరింపగలనే యని యొకమాఱును బల్లకి వచ్చుట కింతయాలస్య మేల కావలయు సత్వరము తోడి తెండని యొకమాఱును మతిలేనిదియుం బోలె నుడు వుచు నుండె. కొప్పువీడుటచేఁ జెరఁగు పడిన పెన్నెఱులు చిక్కువడిన హారములు కన్నీటం గరఁగినకాటుకలు వడఁకుచున్న యవయవములు గలిగి వివర్ణమై మనోజ్ఞతకు బాసిన యామె దేహమును జూచి పరిచారి కలు చెలికత్తియలు దేవి యింక జీవింప దని తమలోఁ దారు చెప్పు కొనిరి. అంతలో మాధవసేనుఁడు నిగమశర్మసమేతుఁడయి యంతిపు రికివచ్చి పల్లకివచ్చినదని మణివర్మతోఁజెప్పి దానివెంట వచ్చినవందల కొలంది పురజనులు కోటగుమ్మమునకడ నిలిపి రాణీయవద్దని దండ పాణి నచ్చటనుండ నియమించి మెల్లగఁ బల్లకి లోనికిం దెప్పించె.

పల్లకిఁ జూచినతోడనే నర్మద దేవి యేమిసాహసము చేసి కొనునో యని భయపడి యామె యంతికంబున నుండె. పల్లకి దింపి బోయ లవ్వలకుఁ జనుటయు నర్మద తలుపులు రెండు తీసి రెండుతుని యలయిన రాజదేహముం గనుంగొని హా! యని గుండె మోఁదుకొని "దేవీ! ఇదిగో మహారాజుగారు. చంపినదురాత్ముఁడు తలద్రెవ్వనేసి నాఁడు. కాడయూడినతామరపువ్వట్లు నేలఁగూలిన చంద్రబింబమట్లు తల వేరయి యిందున్నయది" యని యామెంగౌఁగిలించుకొని హేమ చంద్రుని కళేబరముంజూపెను. చూపుటయు నయ్యరవింద రక్తసిక్త మయి ధూళిధూసరిత మయి భయంకర మయి యున్న మగనిమొగ మునుజూచి మేనం జేతులువైచి హా! హృదయేశ్వరా! యని వాని వక్షస్థలముపై మూర్ఛిల్లెను. మాధవసేనుఁడు రెండవప్రక్క పల్లకి తలుపులం దెఱచి బాలకుల నావంకకుం గొనిపోయి తండ్రింజూపెను.

విక్రమసేనుఁడు జనకునిం జూచుచు మాధవసేననియొడిలో నుండెను గాని హర్షవర్ధనుఁడు తన్ను నిగమశర్మ ప్రముఖు లెంత పట్టుకొన్న నిలువక తండ్రిమీఁదనే పడి యేడ్వఁజొచ్చె. అంతలో నరవింద నెండియుం దెలివి దెచ్చికొని యుత్తలఁగున విలపింపఁ జొచ్చె.

"హా! హృదయేశ్వరా! హా! జగదేకవీర! హా! రసికాగ్రగణ్యా! హా కాశ్మీరరాజవంశజలధిచంద్రమా! హా నాభాగ్యరాశి! నేనరవిందను. మీపరిచర్యనిమిత్తమై వచ్చితి. ప్రాణేశ్వరా కనువిచ్చి చూడవేమి. వీఁడె హర్షవర్ధనుఁడు మీగారవపుగొడుకు. మీనిమిత్తమై వాపిడిచి యేడ్చుచున్నవాఁడు. వాని నెప్పటియట్ల నెత్తుకొని బిగ్గఁగౌఁగిలింప వేమి? ఏడువవలదని వానిని నివారింపవేమి? వాఁడు విక్రమసేనుఁడు నీతోలి చూలుపట్టి. వాని నైనం దేరిచూడవేమి? అల్లవారె మంత్రులు వారితో రాజకార్యంబులనాలోచింపవేమి? ఇది ప్రాతఃకాలము. మంగళ తూర్యధ్వనులు వైతాళికుల పాటలు వినఁదగినసమయము. మారోదనంబులు మీకు మంగళనాదంబులయ్యెనే. మీకులగురువగు నిగమశర్మ దీవింపవచ్చె. లేచి నమస్కరింపకుండుట ధర్మమా? ఓసీ నర్మదా! మూసికొనియున్న యీకన్నులుచూడ నీయన యెప్పటియట్ల నిద్రించుచున్నట్లు తోఁచెడిని. మొగముమీఁద మృతినొందిన జాడ తోఁచుట లేదు. మున్ను జరాసంధుని రెండుభాగములు గలియఁజేర్చినట్లు పుణ్యాత్ములెవ్వరైనఁ దమప్రభావముచేత నీశిరస్సు నీదేహముతోఁ జేర్చి బ్రదికింపరాదే. ఓ వేల్పులారా! నేలవేల్పులారా! ఈమహారాజు వేద వేదాంగవిదుఁడు. నిత్యసత్యనిరతుఁడు. ధర్మపరాయణుఁడు. మీకవశ్యము రక్షణీయుఁడు. మీమహిమంబులంజూపి యీతనిం గావరాదే. దేవతలు మందభాగ్యుల కుపకారము సేయుదురే?"

అని యిట్లు లాయమె విలపించుచుండ మణివర్మ కొంతతడవు తానును బిట్టువగచి పిదప మాధవసేను నవ్వలకుం బిలిచి "మహా

రాజున కగ్నిసంస్కారంబు సేయవలయు. ఇప్పటికి దాదాపుగ జాము ప్రొద్దెక్కినది. కాఁబట్టి చండి యేను సేనఁగుపై నంబారి వేసి సమయోచితాలంకారములు చేయింపుము. మహారాజునకు దానముచేయఁ గలిగినకడపటియుపచారము గౌరవమునిదియేకదా" యని చెప్పి వాని నావలకుఁ బంపి లోనికింజని హర్షవర్ధనుని తండ్రి మేడమీఁదినుండి యావలకుఁ దిగిచి దేవి కభిముఖుఁడై "అమ్మా! చిరకాలప్రవర్ధితమైనమీాస్నేహలత తెగినది. ఎంతవగచినను పోవున కంత ముందరను. మీారించుక యూరడిల్లి మహారాజుగారికి మేలు చేయఁగల కడపటి సపర్య చేయుటకు మాకనుజ్ఞ నీయవలయు" నని గద్గదకంఠముతో విన్నవించెను. విన్నవించుటయు నవవిధవ మణిపర్ణనుద్దేశించి "తండ్రీ! దైవంబుచేసినదిగాక నీచేతులార నీవు నన్ను మగని కెడబాపుదే? ఐనను నన్నెవ్వ రెడఁబాపగలరు! చంద్రునిఁ బిడిచి వెన్నెలయుండదు. మేఘమును విడిచి మెఱుపుండదు. సూర్యుని విడిచి ఛాయయుండదు. అట్లె నేనును భర్తనువిడువఁజాల. అదిగోయే నన్న హృదయేశ్వరుని కడకుఁగొంపోవు విమానముగను. అగ్నిదేవుఁడు సంధానకర్తయగును. సహగమనము పతివ్రతాలక్షణము. సహగమనము మాకులాచారము. సహగమనము చేయక చిన్నవోయి యీమేడలు మిద్దెలు నంతఃపురములు తల్పములు చూచి నేను సహింపఁగలనే? మహారాజు తిరిగిన చోట్లు మరువఁగలనే! ఏది చూచిన హృదయేశ్వరుఁడు జ్ఞప్తికివచ్చు. సహగమనంబునకు నాకు ననుజ్ఞ నొసంగుఁడు." అని యొట్టి పలుకుటయుఁ దండ్రి లేని వెలితికిఁ దోడు తల్లిలేని వెలితికూడ సంభవించు నని భయపడి హర్షవర్ధనుఁడు తల్లి యున్నకడకుంజని యామెకంఠము కౌఁగిలించికొని "యమ్మా నీవును మమ్మువిడిచిపోవుదే" యని రోదనము చేసెను. అదివిని జాలినొంది నర్మద మణిపర్ణ మాధవసేనుఁడు నిగమశర్మ తక్కినపరిచారకులు చుట్టుంజేరి బిడ్డలమొగము చూచి

ౖమైన నట్టిమహాసాహసము చేయవలదని దేవిని వేడుకొనిరి. అతి ప్రియత్నమున నెట్టకేలకామె తనసాహసకృత్యమును మానుకొనియె. మణివర్మ రాజకళేబరము నటనుండి తోడ్కొనిపోవ యత్నించుచుండ నది యెఱింగి దేవి చివాలునలేచి భర్తయున్నపల్లకికి మూఁడుసారులు ప్రదక్షిణముచేసి పాదముల స్పృశియించి కన్నులనద్దుకొని "సర్వేశ్వరా! కోటిజన్మములకయిన నాకు హేమచంద్రుని భర్తగాఁజేయుము." అనిచేతులెత్తినమస్కరించి యేనుఁగు సిద్ధముగ నున్నదని మాధవసేనుఁడు మణివర్మతో మెల్లగఁ జెప్పుచుండ విని యోమహారాజా యని నేల మూర్ఛిల్లెను.

ఇరువదియెనిమిదవ ప్రకరణము.

"ఇదియే మంచిసమయము. ఈదేవి మూర్ఛనుండి లేచెనేని మహారాజుకళేబరము నిటనుండి యావలకుఁ గొనిపోవుట మిక్కిలి కష్టము. కావున నీమెకుఁ దెలివి రాకమున్నె పల్లకి, నవ్వలకుం గొంపోయి కళేబరము నేనుఁగుమీఁదం బెట్టించు టొప్పుదే" యని మణివర్మ మాధవసేనునితోఁ బలికెను. "అదియే యుచిత మని నేనును దలంచు చుంటి" నని మాధవసేనుఁడు ప్రత్యుత్తర మిచ్చి యేనుఁగు సిద్ధముగ నున్నదో లేదో చూచుట కైస్వయముగఁ బోయి చూచి వచ్చి మణివర్మ కది విన్నవించి పల్లకి నేనుఁగుకడకుం గొనిపొమ్మని సేవకుల కాజ్ఞాపించెను. పల్లకి నెత్తుటకు బోయలు వచ్చినతోడనే మణివర్మ విక్రమసేనహర్షవర్ధనులను నర్మదకడకుం గొంపోయి "నర్మదా! తల్లికిఁ దెలివివచ్చువఱకుఁ బాలకుల జాగరూకతతోఁ జూడుము. తెలివి వచ్చినపిదప నీవిలాపములచే వెండియు దేవిని మూర్ఛిల్లఁజేయక ధై

ర్యము చెప్పి సాహసములపొంత బోవనీయక కాపాడు" మని చెప్పి వారి కప్పగించెను. అంతలో బోయలు పల్లకి నెత్తుటయు బాలకులు రోదనము చేయుచు నర్మదం గౌఁగిలించుకొని "యోసీ! బోయలు పల్లకి నెత్తుకొనిపోవు చున్నారు. మమ్ముఁగూడ నేనుఁగువద్దకుఁ దీసికొని పోయి యింకొకసారి నాన్నగారిని జూపవే" యని దయనీయంబులగుపలుకుల వేఁడుకొనిరి. ఈనడుమ పల్లకి యావలకుం బోయె.

అంతట మణివర్మ మాధవసేనుని నిగమశర్మను దనకడకుం బిలిచి "మనము మహారాజుగారి కర్మక్రియలు చేయునపుడుగదా జ్యేష్ఠకుమారున కుపనయనమైనది. ఆతనిచేత నుత్తరక్రియలుమనము చేయింపఁ దగునా లేదా యని శంకించు చున్నాను. బాలుఁ డగుటచే నింతశంకింప వలసె. ఇందుమీయభిప్రాయమే" మని యడుగుటయు నిగమశర్మ మంత్రి కిట్లనియె. ఉపనీతుండైన జ్యేష్ఠపుత్త్రుఁడుండ నితరు లుత్తరక్రియలు సలుప రాదు. బాలుఁడైనను దప్పదు. ఉపనయన మైనతోడ నేకర్మాధికారము వానియందుసంక్రమించినది. అనవుడు మాధవసేనుఁడు వానిపలుకులు యుక్తియుక్తము లనియె. మణివర్మయు వానిపలుకుల నాదరించి లోకాచారము నతిక్రమించుట పాడి గాదని నర్మదయొద్ద నున్నవిక్రమసేనునిచేయిపట్టుకొని "వత్సా! తండ్రిఋణము దీర్పవలసినసమయము వచ్చినది. లెమ్మనిశోకగద్గదుఁడైపలికి వానిని లేవఁదీసి వెంటఁబెట్టుకొని యేనుఁగుకడకుఁ బోయెను. హర్షవర్ధనుఁడు తనయన్నను మణివర్మ గొంపోవుటఁ జూచి తన్నుఁగూడ నవ్వలకుం దోడ్కొని పొమ్మని కొంతసేపు నర్మదను వేఁడుకొనెను. దేవి నెంతమాత్రము విడువవలదని మణివర్మనియోగించుటచేత నర్మద వాని నవ్వలకుం గొంపోవ దయ్యె.

అంతలో నరవిందాదేవి మూర్ఛనుండి మేలుకాంచి కన్నులు దెఱచి చూచి పల్లకి యచ్చటలేమి మరల దుఃఖవివశయై "నర్మదా!

ఎంతపని జేసితివే. నేను మేనెఱుంగక పడియున్నప్పుడు నా ప్రాణనాథు నొరులు నాకన్న ప్రామి తీసికొనిపోవుచుండ నిన్ను గానట్టులూరకుంటి వంటే. ఇంతద్రోహము చేయుటకు నీకు నేనేమివిసము పెట్టితిని. నాకును మహారాజునకును మీరు శాశ్వతవియోగము కలిగించితిరి కదా. వికచారవిందంబులను మించిన మెచ్చని యాదివ్యసుందరవదనంబు జూచుభాగ్యము నాకీజన్మమునను లేదు గదా? హృదయరంజకమై మనోవ్యథల నివ్వగఁ జేయు ద్రాక్షామధురములగు వచనములు విను నదృష్టము నా జీవితమున లేదు గదా? ప్రాణప్రతిష్ఠ గలిగిన బంగారు బొమ్మవంటి యాశరీరము గనుంగొను భాగ్యమింక నాకు నెన్నఁడు లేదు గదా? ఆహాహా! యెన్నఁడు స్వయంవరము జరగెనో, యెన్నఁ డాయన చెట్టఁబట్టితినో, యెన్నఁడు కాఁపురము చేసితినో, యెన్నఁడు సుఖపడితినో, యంతయు స్వప్నవార్తలాయెను. అయ్యో! ఆయనను జూచినకొలఁది మోహము నైనట్లున్నదే! ఎంతచక్కని మొగమే! ఎంత విశాలవక్షమే, ఎంత వెడఁదకన్నులే! ఎంతమృదుదేహమే! ఆశరీరమగ్ని పాలుజేయుదు రఁటే! ఆరూపము మంటఁగలుపుదు రఁటే! అట్టిజగ న్మోహనమూర్తి నిప్పులపాలగుచుండ చెంగటకుం బోరరాని నా పాడు మేనిమీఁద మీకెట్టి దురభిమానమున్నదే. మహారాజు సుఖముల ననుభవించునపుడు వానితోఁ గలిసి యవ్వారిగా సౌఖ్యంబులందేలు టకే కాని వానికష్టంబుల ననుభవించుటకు నేనునోఁచుకొననైతిని. హంసతూలికాతల్పముల మీఁద నాతనిసరసమునను గులుకుచుఁ బండు కొంటిని. నేఁడు చితిమీఁద వానిసరసను బండుకొనుటకు నేఁ బోవ నైతి. ఆమహాభాగ్యశాలిభుజముమీఁద నాభుజము వైచికొని యుద్యాన వనముల విహరించితిని గాని నేఁడు శ్మశానమునకుఁ బోవుచున్న యాతని ననుసరింపనొల్లకుంటిని. నేనెంతకృతఘ్నురాలనో చూచితివే! ప్రాణము లెంతతియ్యనివో కదే! నాయనా హర్షవర్ధనా! నీయున్న యేఁడీ! హా

తెలిసినది తెలిసినది. జనకునకుఁబరలోకక్రియలు నిర్వర్తించుటకు నా చిన్నియన్న యరిగెం గాబోలు. హా మహారాజా! నీకెంతలోఁదిలోదకంబుల పైభ్రాంతి వోడమె. కడుపారఁ గని పెంచినకొడుకువలన నపేక్షించునుపకార మగ్నిసంస్కారమే కదా? నావిక్రమసేనునకు బండ్రెండుసంవత్సరములు దాఁటకమునుపే యిన్నిపాట్లు సంభవించె" నని వెచ్చనూర్చుచుఁ బలుతెఱంగుల విలపించుచు నెడనెడ మిన్నకుండి నర్మదతో భర్తృగుణంబుల నుగ్గడించుచు హర్షవర్ధుని జేరఁదీసికౌఁగిలించికొనుచు నలసినప్పుడు వగచుచు దుఃఖపరవశయై యుండెను.

అంతట నక్కడ సుశర్మ విక్రమసేనుని దోడ్కొని కోట సింహద్వారముకడకుం బోయి నగమశర్మ క[illegible] నప్పగించెను. అంతయు సిద్ధపఱుపఁబడు నగమశర్మ రాజపుత్రుని వేఱొకచోఁ గూర్చుండఁ బెట్టి దుఃఖోపశమనంబు చేయుచుండెను. సేవకులు చండి యనునేనుఁగును ద్వారమునొద్ద నిలువఁబెట్టి యేయలంకారము సేయక మీఁద నీలిగుడ్డలు కప్పి యామీఁద శవదహనము నిమిత్తమేర్పడిన పాత్రయంబారిం బెట్టిరి అప్పటికి పురవాసులు వేనవేలువచ్చుటఁ జేరి యుండిరి. అంబారియమర్చినపిదప మావటీఁడు కూర్చుండు మని సన్న చేయ నేనుఁగు వాని చెప్పినట్లు చేసెను. అప్పుడుపల్లకి నేనుఁగుసమీపమునకుఁ దెప్పించి మావటీఁడు రాజకళేబరము బాగసూకెత్తి నంబారిలోఁ గూర్చుండఁబెట్టించి వెంటనే పట్టుసేలువ మీఁదఁ గప్పించెను. ఆవిధముగా నున్న హేమచంద్రునికళేబరము జూచి యచ్చటఁ జేరినజను లందఱు "హా! మహారాజ హా! మహారాజ" యనిగుండెలు మోదుకొని బాష్పాకులితలోచనులై బొబ్బలిడిరి.

చిరకాలమునుండి యాదివాణమునఁ గట్టుకొనియున్న సేవకులు వృద్ధులు, బాలురు, పురుషులు, స్త్రీలు, పెట్టున రోదనము చేసిరి. పట్టణమునం దున్నమగవారందఱు నష్టాదశవర్ణములవారు

నాఁటిదిన మచ్చటనే యుండిరి. అంతయు సిద్ధమైన వెనుక నిగమ శర్మవిక్రమసేనుని స్నానము చేయించి పవిత్రవస్త్రములు గట్టించి యగ్నిహోత్రము చేతికిచ్చి యేనుఁగు ముందట నిలువం బెట్టెను. మున్నఖిలపౌరజనులకు నయనాభిరామమై యుండునట్టి యాతనిసుందర మూర్తి పితృకర్మకుచిత మగువేషమును ధరించి యుండఁ జూచి పౌరులలో ధైర్యసారము గలవారు నయితము శోకవిహ్వలులై వలవల యేడ్చిరి. అంతయు నాయత్తమైన వెనుక నేనుఁగును నడుపు మని చెప్పుటకు నోటమాటరామి మణివర్మమావటీనికి సన్న చేసెను. మాధవసేనుఁడు మణివర్మ దండపాణి వజ్రపాణి బాలుఁడగువిక్రమసేనునకు నలుప్రక్కలనుండి మెల్ల మెల్లగ నడువసాగిరి. శోకభారమున నడువ లేక యున్న విక్రమసేనుని నిగమశర్మ పట్టుకొని నడిపింపఁ జొచ్చెను. ఏనుఁగు వెనుక వందలకొలఁది బ్రాహ్మణులు చేరి స్వస్తి జెప్పుచు వెంటఁ బోయిరి. తక్కిన పౌరు లేనుఁగునకు ముందును వెనుకను నిరుప్రక్కలను హాహాకారములు సేయుచు విధిని దూఱుచు హరిశర్మం దిట్టుచు తమదురదృష్టము నెన్నుకొనుచు శవమున ననుసరించిరి. పౌరాంగనలు నాఁడు పొయ్యిలో నిప్పైన వేసికొనక ద్వారములయొద్దను గవాక్షములయొద్దను మేడప్రక్కలను మేడలమీఁదను మిద్దెలున్నవారు మిద్దెమీఁదను నిలిచి కడసారి తమయేలికదర్శనము చేసికొని యొండొరులు "అమ్మక్కా! మున్ను మహారాజు పగవారి నోడించి జయ ముంది భూమి మీఁద బట్టపుటేనుఁగు నెక్కియూరేగుచుండఁ జూచిన మనకన్నులు ఆయనశవము నూరేగుచుండఁ జూడవలసివచ్చె. ఈమహారాజెంత ప్రజాపరిరంజకుఁడో యిసుకచల్లిన రాలకుండునట్లు దట్టముగ నున్న యీజనబాహుళ్యమే చెప్పుచున్నయది. పురమందున్న స్త్రీ పురుషులయొక్క నేత్రము లన్నియు నీమహారాజు తనయంబారిలో వేసికొని శ్మశానమునకుఁ జోవునట్లు తోఁచుచున్న యది. ఈజనముం

జూడఁ బుర మంతయు నీయనతో బోవున ట్లున్నది. పాప మీమణి వర్మకు దినములు గడచినవి కావుగద. అయ్యయో ! విక్రమసేనుని జూడవే పున్నమచందురుని వంటిచక్కనయ్యకు నెంతపాడువేసము వేయవలసి వచ్చిన దే" యని బహువిధంబులఁ దమలోఁదాము భాషింపఁ జొచ్చిరి. అంతట నమ్మహాజనము శ్మశానమును డాయుటయు నిగమశర్మ మంచిగంధముతోడఁ జితిపేర్పించి రాజశరీరము నేనుఁగు మీఁదనుండి దింపించి యచ్చితి పైఁ బెట్టించెను. అప్పుడు ప్రకృతి జను లందఱుఁ గడసారి తమరేనిం జూచి చేతులు మోడ్చి నమస్కరించిరి. భూనభోంతరము మారుమ్రోయున ట్లెలుఁగెత్తి యేడ్చిరి. విధ్యుక్తముగ నచ్చట నిర్వర్తింపవలసినకర్మ లన్నియు నిర్వర్తించిన వెనుక నిగమశర్మ రాజదేహంబుపై నారతికప్పూరంపుటచ్చులు పఱపించి నేతిలోఁ జితియంతయుఁ దడిపించి పిమ్మట విక్రమసేనునిచేత నగ్నిసంస్కారంబు చేయించెను. అంతటిపవిత్ర మైనదేహము సాధారణముగాఁ దనకు లభింపదని కాఁబోలు నగ్నిహోత్రుఁడు దరికొల్పుటయే తడవుగ వాని దేహము నాహుతిజేసికొని క్షణములో భస్మావశేషము చేసెను. దహనానంతరము మణివర్మప్రభృతులు విక్రమసేనుని వెంటఁ బెట్టుకొని పౌరులు వెంటననుసరించి రా నగరాభిముఖు లైరి. క్రమక్రమంబునఁ బౌరులు తమతమ యిండ్లకుం జనిరి. విక్రమసేనుండును మణివర్మ ప్రభృతులతో నంతిపురి కరిగి మనోదహనముచేత మిక్కిలి గాసిపడు చున్నతల్లిం గాంచి యామెం గౌఁగిలించుకొని కొండొకసేపు వగచి యమాత్యులయూరడింపులకతమున నూరడిల్లియుండె. ఆసాయంకాలము మణివర్మమాధవసేనుఁడు మొదలగు మంత్రులను దండపాణి మొదలగుసేనాపతులను నిగమశర్మమొదలగు వైదికులను రావించి వారలతో "దేశ మరాజకముగ నుండఁగూడదు కదా? కావున హేమచంద్రునిస్థానమున జ్యేష్ఠతనయుఁ డగువిక్రమసేనునిం బ్రతి

షించి యతఁడు యుక్తవయస్కుఁ డగువఱకు మనలో నెవ్వఁ డయిన నొకఁడు సంరక్షకుఁడుగ నుండ వలయు" నని పలికెను. అనవుఁడు నందఱు విక్రమసేనుఁడే కాశ్మీరదేశాధిపతి యనియు మణివర్మయే వానికి సంరక్షకుఁడుగ నుండవలయు ననియు నైకకంఠ్యముగఁ బలికిరి. ద్వాదశరాత్రంబు లంగడపి సముచితంబుగ నుత్తరక్రియలు జరపి విక్రమసేనుఁడు పైతృకఋణమునుండి విముక్తుఁ డయినపిదప మంత్రులు వానికిం బట్టాభిషేకము చేసి విక్రమసేనుఁడు కాశ్మీరదేశాధిపతి యని యెల్లవోలుఁ జాటింబంచిరి. హేమచంద్రుఁడు తాల్చినకిరీటంబు మాత్రమే ధరియింపక విక్రమసేనుఁడు వానిరూపమును సద్గుణంబులను ధరియించుటచే బ్రకృతిజనులు హేమచంద్రుఁడే బాలుఁడై తమ్ము బరిపాలింపవచ్చె నని తలంచిరి; కాని క్రొత్తతేఁడుగ నెంచక యతఁడైన దీర్ఘాయుష్మంతుఁడై యుండు గాక యని దీవించు చుండిరి.

ఇరువదితొమ్మిదవ ప్రకరణము.

హేమచంద్రునిమరణవార్తలు కారుచిచ్చుచందంబున దేశమంతట వ్యాపించెను. ఆమహీపాలునకుఁ బగవారు లేనే లేరు. లౌకికవ్యవహారధర్మములచేత వానికింగిట్టనివా రెవ్వట్టున నుండినవారునయి తము గుణగ్రహణపారీణులై హేమచంద్రునియకాలమృతిచే మధ్యమలోకమునకుఁ దిరిఁగివెలితి ప్రాప్తించెనని పలికివగవ, వానియేలుబడికి లోఁబడి వానిపాలనం బనుచల్లనివెన్నెలలోఁ గొన్నినాళ్ళు సుఖించి వానిపుణ్యచరిత్రం బనునమృతంబు చెవు లనియెడిదోయిళ్ళతో జుఱ్ఱి కన్నులకలిమి సఫలముగ వానిచక్కఁదనంబును వేమాఱుగాంచి యానందించినప్రకృతిజనంబులుపిడుగుంబోలిన రాజమరణవార్త విని తొలు

దొల్త నమ్మక యొండొరుల నడిగికొని తగినదృష్టాంతములమీఁదనా
కఠోరవార్త విశ్వసించి తమతమపనులుమట్టుక యున్నను గినక నీరు
దాగివక నిదురవోవక దురపిల్లిరని చెప్పినఁ నందతిశయోక్తి యొక్కింత
యు నుండదు. కొందఱు ప్రకృతిజనంబులు జేనిమరణవార్త నమ్మక
దానియాథార్థ్యముంగనుఁగొనఁదలఁచిబత్తెములు కట్టుకొని శ్రీనగరం
బునకుంబోయి నిజస్థితి నెఱింగి రనుట కవిచాతుర్యము కాదు. ప్రతి
పల్లెయందుఁ బ్రతిపట్టణమందు జనులు జేనిదుర్మరణము విని శోకించి
దశరాత్రింబులు మైలపట్టి విక్రమసేనుఁడు చేసినట్లెఱుంగునఁ, దమ
యోపినకొలఁదియు త్తరక్రియలు చేసి రనుట సత్యమునకు దవ్వుగాదు.
కొందఱు తండ్రిపోయినబాలురకరణిఁ వగచిరి. కొందఱు తల్లి లేనిపిల్లల
తెఱఁగునఁదల్లడిల్లిరి. కొందఱు కాశ్మీరదేశము వాసయోగ్యము కా
దని పరదేశములకుం బోయిరి. వేయేల దేశమంతట శోకదేవత విహ
రించిన ట్లుండెను. సిరియు సౌఖ్యము హేమచంద్రునితోడనే పోయి
నట్లుకానఁబడెను. మగనిమరణానంతరమురవిందాదేవి నవవైధవ్యదుఃఖ
భారముచేఁగ్రుంగి మానసంబునఁ బతిచరణారవిందములె నిలిపి ధ్యా
నించుచుఁ జెలిమికత్తెలతో నైన నరిగ ముచ్చటింపక మణివర్మతో
నైన మాటాడక మందిర మరణ్యముగ నాహారము విసంబుగ దినం
బులు గడపఁ జొచ్చెను. విక్రమసేనుఁడు బాలుఁ డయ్యుఁ మణివర్మ
యు మాధవసేనుఁడు చూపినత్రోవను బోవుచు బంధుజనంబునకును
బ్రకృతిజనంబునకును నిష్టుఁడై మెలంగు చుండెను.

అట మాళవేంద్రుఁ డగుసుదర్శనుఁ డొకనాఁడు మంత్రులు
సామంతులు మిత్రులు బరిజనంబులు పరివేష్టింప నిండుకొలువు దీర్చి
యుండ నొకబ్రాహ్మణుఁడు సింధునదీతీరవాసుఁడు పుణ్యక్షేత్రములు
సేవింప దక్షిణాపథంబునకుఁ బోవుచు మార్గమధ్యమున నుజ్జయినిలో
నున్న మహాకాళేశ్వరుని సేవింపవచ్చి యద్దేవు నారాధించి యనేక

మహాపండితులచే నలంకృతమైనరాజసభ యెటు లుండునో చూడ నభిలషించి కొంతకాలమున కరుదెంచెను. సుదర్శనుఁడా బ్రాహ్మణుని జూచి సగౌరవంబుగ రావించి యుచితాసనంబునఁ గూర్చుండఁబెట్టి వానినామము స్వదేశనామము రాకకుం గారణము నడిగి తెలిసికొని యుత్తరదేశమందలి విశేషంబులు చెప్పుమనియడిగెను. ఆభూసురుఁడు "వేగులవాండ్రనియెడు విశాలనేత్రములతో నెల్లదేశములయందలివృత్తాంతములఁ జూచుమీకు నేనుగ్రొత్తవార్తలు విన్నవింపఁ గలనే? ఐనను మీకు నేనొక్కవార్తనెఱింగించెద. అది మీరువినినదై యుండవచ్చును. మీ రెఱుంగని క్రొత్తదై యుండవచ్చును. నామట్టు కది మిక్కిలిక్రొత్తదై మనస్సును దహించుచున్నది. ఆవార్త యిది. కాశ్మీరదేశాధీశ్వరుండగు హేమచంద్రమహారాజు రమారమి రెండు మాసములక్రిందట దారుణమరణము నొందెను. అతని తమ్ముఁడు చిత్రభానుఁడు వానికిఁ దొలుతొల్త కొండొకద్రోహము గావించి సోదరునిచే నింటనుండి వెడలనడువఁబడి యీయక్కసు మనసులోఁ బెట్టుకొని సోదరుం గడతేర్చినాఁడని లోకులు చెప్పుకొనుచున్నారు. ఇంతకన్నఁ జెప్పవలసినవార్తలెవ్వియు లేవని పలికెను. బ్రాహ్మణునినోటనుండి వెడలిన యీయక్షరములు సభాసదులవీనులకుఁ జురుకు చురుకున నాఁటెను. "హా మిత్రమా!" యని సుదర్శనుఁడు గద్దెకుం జేరఁబడి కన్నీరు విడిచెను. దేవసింహుఁడు మొదలగు పండితులు కట కటా! యని చెవులు మూసికొనిరి. మంత్రులు సీ! వాఁడు దనుజుఁడు గాని మనుజుఁడు కాఁడనిరి. తక్కినసభాసదులు విస్మితులై "హా! యెంతపనిపుట్టె"నని విచారింపఁదొడఁగిరి. వృద్ధులగుబంధుజనంబులు సుదర్శనమహారాజును మెల్లగ నూరడింపఁ జొచ్చిరి. అట్లు కొండొక తడవు విచారించి సుదర్శనుఁడు తన యుత్తరీయపుకొంగునఁ గన్నీరు తుడుచుకొని సభాసదుల నుద్దేశించి యిట్లనియె.

"సభాసదులారా! నామిత్రుఁడు జగద్రంగమునఁ దనవంతు నాటకమాడి నిష్క్రమించినాఁడు. అతనిచరిత్రలోఁ గడపటియంకము ముగిసినది. సహనటుఁడను సహకారుఁడను సహపాఠుఁడ నైన నేను వెనుకం బడియున్నవాఁడ. కాశీకానగరమున నేనును హేమచంద్రుఁడును విద్యాభ్యాసము చేసితిమి. నామిత్రుని నేఁ గొనియాడఁగూడదు కాని యతనిపాండిత్యమునఁ జూడఁబడినాల్గువిద్యలు రక్తమాంసములతో గూడినశరీరమును దాల్చి భూలోకమునకు వచ్చెనేమో యని తోఁచును. సముద్రమునకైన మేరయుండవచ్చునుగాని వానిమంచితనమునకు మేర లేదు. మధ్యమలోకమున నేకపత్నీవ్రతస్థుఁ డెవ్వఁ డన్న హేమచంద్రునే చెప్పవలయును. రాజకులమునసత్యవ్రతుండెవ్వఁడన్న హేమచంద్రునే యెన్నవలయు. విలువిద్యయందుఁ బరశురాముని ద్రోణాచార్యుని దలపించునేర్పరి యెవ్వఁ డన్న హేమచంద్రునే పేర్కొనవలెయు. పలుమాట లేల? సద్గుణంబులకుముద్ద యెవ్వఁ డనిన హేమచంద్రుని పేరెత్తవలయు. ఆహాహా! యెంతవాఁడు మృతినొందెను. ఓమృత్యువా! నీకు మంచిచెడ్డలు లేవుగదే. ఎంతెంతవాని నైన నీ వొక్క నిమేషంబునఁ గబళింతువుకదా? అవును. మనుష్యుఁడు చెడిపోయినపదార్థములను భక్షింపక మంచివస్తువులనే తినునట్లు నీవును దురాత్ములపొంతఁబోక మంచివారినే మ్రింగుచుందువు. ఓప్రపంచమా! అంతవాఁ డస్తమించినను నీ వెప్పటియట్లుంటివిగదా! ఓమిత్రమా! హేమచంద్రా! ప్రియమిత్రుఁడగునను బాసిపోవ నీమనసెట్లొప్పెనయ్యా! మనయిరువుర నెయ్యమును స్థిరముగానిలుపుటకునీతో వియ్యమందవలయు నని యున్నది. కాని మామకరందునకిచ్చి పెండ్లిసేయుటకు నీకాఁడుపిల్లలు లేరుగదా యని పలుమాఱు విచారించితిని. ఆ యనురాగం బెందుపోయె! అక్కచెల్లెండ్రుగఁ గాశ్మీరమాళవదేశంబులుండు నని భావించితి. అక్కకు వైధవ్యము ప్రాపింపఁ జెలియ లేమి

యుత్సాహంబు గలిగి పెంపొందఁగలదు. మిత్రరత్నమా నీవు పోవ నాకుం గుడిభుజంబు పడిపోయె. ఈశరీరంబుతో నేనింక నిన్నుఁజూడ జాలను కదా!" యని కర్పూర బాష్పపూరితలోచనుఁడై వగవఁ జొచ్చెను.

క్షాత్రబ్రాహ్మణుఁడు, సత్యమిహిరుఁడు మొదలగునాస్థానపండితులు, రాజుం బెక్కువిధముల సమాశ్వాసించి మరణంబు ప్రకృతి యనియు శరీరంబు లస్థిరంబులనియుఁ జెప్పి పూర్వగ్రంథములనుండి యనేకోదాహరణంబులఁ జూపిరి. నృపునకు దుఃఖ, ముపశమిల్లిన పిదప క్షాత్రబ్రాహ్మణుఁడు సెలవుగైకొని చనియెను. రాజును మనస్థిమితము లేక నాఁటికిఁగొలువు చాలించి యంతఃపురికరిగెను. కుసుమకోమలి యగుకర్పూరమంజరి హేమచంద్రునిమరణవార్త విని యెట్టి సాహసము చేసికొని యేమగునో యని చిత్తంబునఁ దద్దయుభయం బడుచు మకరందుఁడు, తండ్రిచెలికానిచావునకు మిక్కిలి వగచెను.

అట విద్యానగరంబున నొక్కనాఁడుసాయంకాలము రాజవాహనమహారాజు తనపూఁదోఁటలో విహారము చేసిచేసి యలసియొక తిన్నెపైఁ గూర్చుండెను. నలుప్రక్కల నలువురుసేవకులు చేతులు జోడించుకొని రాజాజ్ఞలఁ బ్రతీక్షించుచు నిలిచియుండిరి. అప్పుడె సూర్యాస్తమయ మగుటచేఁ బూఁదోఁటయెల్లఁగనుచీఁకటిగనుండెను. రాజవాహనుఁడు తిన్నెమీఁద వెనుకకుఁ జేరఁబడి కూర్చుండి గారాపుకూఁతు రగునిందుమణియు, ముద్దులమనుమఁడగువిజయసేనుఁడు మనుమరాలగుకర్పూరమంజరి యనదలై తనయింట నుండుటయు నల్లునివార్తయించుకేనియుఁ దెలియకపోవుటయుఁ దలంచి వారలు సుఖించుచున్నారు లేద యని విచారించుచుండెను. అంతలో నొక భటుఁడు కడువేగంబున నాపూఁదోటకు వచ్చి సేవకు నొక్కని బిలిచి "యల్లునికడనుండి భటుఁడు వచ్చినాఁడని మహారాజుగారితో విన్న

వింపు" మని చెప్పెను. వల్లె యని యాసేవకుఁడు వాని రాక వినయమున రాజవాహనున కెఱిఁగించె. అల్లునితావునుండి భటుఁడు వచ్చెనని వినినతోడనే విదర్భరాజు చివాలున లేచి కూర్చుండి యేఁడిభటుడేఁడి యని భటునివంకఁ జూచి "ఓరీ! మాచిత్రభానుఁడు కుశలియైయున్నాఁడా?" యని మిక్కిలియాత్రముతో నడిగెను.

"స్వామీ! మీయల్లునకుఁ గుశలమే. ఆయన మూఁడుదినములలో విదర్భకు రానైయున్నారు. ప్రస్తుతము గొప్పదుఃఖములో నుండుటచే మనస్స్థిమితము లేక పరితపించుచున్నవా" రని యాబంటు ప్రత్యుత్తర మిచ్చెను. రాజవాహనుఁ డావచనము లాలకించి యదరిపడి సచింతయాత్రముతో "గొప్పదుఃఖములో నున్నాఁడా! ఏమి దుఃఖము? అతఁ డిప్పు డెచ్చోటనున్నవాఁ డెచ్చోటనున్నవాఁ" డని యడిగినమాట యడుగుచు నడిగెను. అప్పుడాభటుఁడు విదర్భరాజున కిట్లనియె: "దేవరవారిప్రశ్నములన్నిటికి నుత్తరములు మీయల్లు డంపిన యీజాబునందుఁ గలవు. కావున దానిం జిత్తగింప నవధరింపు" డనియొకచీటి వాని కిచ్చెను. అంత సేవకుఁ డొకఁడు పోయి దీపము గొనితేర దానివెలుఁగున రాజవాహనుఁ డాజాబిట్లని చదివెను.

స్వస్తిశ్రీ రాజవాహనమహారాజుగారికి మీయల్లుఁడు చిత్రభానుఁడు నమస్కరించి వ్రాయునది. నాయనా! కుటుంబమును మీకడ నిలిపి విదర్భ విడిచి తీర్థయాత్రకుఁ బోయినవాఁడనై బహుపుణ్యనదుల స్నానముచేసి యనేకతీర్థములను సేవించి హరిచరణధ్యానము చేసికొనుచుఁ గాలము బుచ్చుచుంటిని. ఇట్లు తిరుగుచుఁ బదిదినములక్రిందట నేను కురుక్షేత్రమునకు వచ్చితిని. అచ్చటనుండ మాయన్నగారు హేమచంద్రమహారాజుగారు దారుణముగ మృతినొందిరని ఘోరవార్త వింటిని. అదిమొదలు నాకుం జిత్తస్థిమితము లేదు. మీదర్శనముచేసి నంగాని యపారమైనయీమనఃపరితాపము శాంతి నొందదు. కావున

మూఁడునాలుగుదినములలో మీపాదసందర్శనము చేయువాఁడను. ఇందుమణికి విజయసేనునకు ముఖ్యముగఁ గర్పూరమంజరికి మాయన్న వార్తలు మెల్లమెల్లఁగ నెఱిఁగింపవలయు. ఈలేఖ తెచ్చినవాఁడు నా ప్రియసేవకుఁడు పింగళుఁడు. నేవచ్చువఱకు విదర్భాపురమున నుండువాఁడు.

ఇట్లు విన్నవించు మీ విధేయుఁడు,
చిత్రభానుఁడు.

ఆలేఖం జదువుకొని విదర్భరాజు తద్దయు జాలినొంది "హరి హరీ! పాపము హేమచంద్రుఁడు దారుణముగ మృతినొందెనా! కట కటా! రాజులకు దినదినము గండమే కదా! పురాకృతకర్మఫల మనుభవింపక యెవరికి తప్పును? ఓయీ పింగళుఁడ చిత్రభానుఁడు వచ్చువఱకు నీవిటనే యుండుము" అని రాజవాహనుఁడు పూఁదోఁట విడిచి యభ్యంతరమందిరంబునకుఁ జని పుత్రికయగు నిందుమణిని బిలిచి యాలేఖ యామెకుఁ జదివి వినిపించి కర్పూరమంజరి కావార్త గడునేర్పుతోఁ నెఱిఁగింపవలయు నని చెప్పెను. ఇందుమణి కర్ణకఠోర మగు నావార్తవిని వికలచిత్తయై నిలుచుటకు శక్తి లేక కూర్చుండి హేమచంద్రునిగూర్చి తద్దయు వగచి కర్పూరమంజరి కావార్త యారాత్రి యెఱిఁగింపవల దని పరిచారకులతోఁ జెప్పెను. చిత్రభానునిపుత్రుఁడగు విజయసేనుఁడు రాజవాహనుఁడు జాబు చదువుకొనుచుండ దాపున నుండి వినిన సేవకులలో నొకనివలనఁ బెదతండ్రి మరణవార్తవినిఖిన్నుఁడై చిన్నవోయి యుద్యానవనములో మల్లికాచంద్రికలతోఁ గలిసి కూర్చుండినకర్పూరమంజరియొద్దకుఁబరుగుపరుగునఁబోయి "అక్కయ్యా పెదనాయనగారి నెవ్వరో చంపినారఁట! విన్నావా" యని యడిగెను. అడుగుటయుఁ గర్పూరమంజరి "ఏమీ ఏమీ! పెదనాయనగారు మృతి నొందినారా! అయ్యో అయ్యో" యని కనుగందినపూలదండచందం

బున విలాసము తప్పి మల్లికయొడిలోఁ బడి మూర్ఛిల్లెను. అది చూచి చంద్రిక తత్తరపడి దాపుననున్న దిగుడుబావియొద్దకుఁ బఱుగెత్తి దోసెడు చన్నీళ్లు దెచ్చి బాలిక మొగమునం గొట్టి "యమ్మా! యూరడిల్లు మూరడిల్లు" మని యొక యరఁటియాకుతో విసర నారంభించెను. అంతలో విజయసేనుఁ డామెయవస్థఁ జూచి భయము ద్విగుణము కాఁగా విసవిసం బఱుగెత్తి తల్లికడకుఁ బోయి కన్నీళ్లతో సోదరీవృత్తాంతము దెలిపెను. ఆదేవియుఁ దనకుమార్తెకుఁ బెంపుడుతండ్రిపైఁ గల ప్రేమాతిశయ మెఱిఁగినది గావున బిడ్డ యేమగునో యని దిగులుపడి యచ్చోటు తనకుఁ జూపు మని విజయసేనుని వెంటఁ బెట్టుకొని బయలు దేఱెను.

అంతలోఁ దెలివి వచ్చుటయుఁ గంధర్వమంజరి దుఃఖపరవశయై చెలికత్తెలతో నీతెఱంగునఁ జెప్పి విలపించెను. "సఖులారా! ఎంతటిరా జస్తమించెనే! నామీఁద పంచప్రాణములు నిలుపువాఁడు కద; నన్నునేల నడుపనియ్య లేదు కదా? కనుటయే మాయయ్యవంతయ్యెఁ గాని నన్ను పెంచిన దాయనయే కదా! మేము శ్రీనగరము బాసి వచ్చునప్పుడు నన్ను తనయొద్దనుంచుమని యతఁడు మాయయ్య నెంతబ్రతిమలాడెనే; కాని మాయయ్య పరాభవము నొందినవాఁడు గావున దాని కియ్యకొనఁడయ్యె. ఎన్నఁ దలఁచిన రఘురామునకైన వంకలు గలవు. హరిశ్చంద్రునకయినఁ గొఱఁతలు కలవు. ధర్మరాజునకైనఁ దప్పులు కలవు. కాని మా పెదతండ్రి కేవంక లేకొఱఁత లే తప్పులు లేవు. చందమామకుఁ జల్లతనంబు నైజగుణం బైనట్లు మంచితనంబు నా పెదతండ్రికి నైజగుణంబు, పుష్పంబులకుఁ గోమలత్వంబు నైజగుణం బైనట్లు దయామయత్వంబు నాపెదతండ్రికి నైజలక్షణంబు, కారుమబ్బుల కయాచితముగ జలదానంబు సేయుట యెట్లు స్వభావంబో నాపెదతండ్రికిఁగూడ దానగుణం బట్లె స్వభావంబు ఆలోకైక పూజ్యుని వధించుట కెవనికిఁ జేతులాడెనో! ఏదురాత్ముఁడు

మహాపాతకంబునకు నొడిగట్టి శాశ్వతనరకకూపమునం బడ సాహసించె నో! అతనిం గాసి బ్రదుకుటకన్న వానికడ కేగు టొప్పదే. బ్రదికి యున్నాళ్ళు రాజకులమున కెంతవన్నె దెచ్చెనే. బంధుమిత్రుల నెట్లు కాపాడెనే. ప్రజల నెట్లు పాలించెనే. మాయదృష్టమున మాయయ్యకు నతనికి నెవరవలు వాడమెను గాని లోకులకెల్ల నతఁడు మంచివాఁడే. ఈదుఃఖమునకుం దోడు నామనంబునం దొకభయము పుట్టుచున్నది. ప్రాఁతపగలచేత నీయకార్యమును మాతండ్రియే చేసినాఁడని లోకు లెక్కడందురో యని నామనంబు శంకించుచున్నది. అట్టినింద మా జనకునకు రాకపోవుఁ గాక! నన్ను జేరదీసి యెత్తుకొనిననాతండ్రిహస్తములు సోదరరక్తమున మలినములు గావని నే దలంచెద." అని మఱి యేమో యనబోవుచుండ నిందుమణివిజయసేనునితో నచ్చోటికిఁబోయి కొన్నియడుగులదూరమున నుండియే "చంద్రికా! బిడ్డకుఁ దెలివి వచ్చినదా" యని యడిగెను. వచ్చిన దని ప్రత్యుత్తర మిచ్చునంతలోనె యాదేవి కూఁతురుకడకుఁ బోయి కూర్చుండి బిడ్డా! స్మృతి వచ్చినదా యని యడిగి చేయి పట్టుకొనెను. బాలిక బదులు పలుకలేక కన్నీరు సోనలై ప్రవహింప వెక్కివెక్కి యేడ్చె. ఇందుమణియు విజయసేనుఁడుఁ గర్పూరమంజరితోఁ గలిసి హేమచంద్రునిగూర్చి కన్నీళ్ళు విడిచిరి. ఆనడుమ రాజవాహనుఁడు మనుమరాలు మూర్ఛితయైన దనియుఁ దనకూఁతురు కూఁతుం జూడ నుద్యానవనమున కరిగిన దనియుఁ విని యాతావునకుఁ దాను స్వయముగఁ బోయి విలపించుచున్న యాపడంతులను విజయసేనుని మృదువచనంబుల నూరడించి యంతిపురమునకుం గొనిపోయెను.

ముప్పదియవ ప్రకరణము.

వెనుకటివృత్తాంతము జరిగిననాలవనాఁ డుదయమునఁ గరటకుఁడు విదర్భాపురమునకుఁ బోయి మునుముందుఁ బింగళుని గాంచి యనంతరము రాజవాహనుని సందర్శించి నాఁటిసాయంకాలము చిత్రభానుఁడు పురప్రవేశము జేయునని విన్నవించెను. విన్నవించుటయు విదర్భరాజు దుఃఖితుఁడై యల్లు నెదుర్కొని తోడితెచ్చుటకుఁ దన కుమారుని మంత్రులలో నొకనిని నియోగించి వారితోఁ గొంతపరివారము నడుపం బనిచి యావార్త నిందుమణికి విజయసేనునకుఁ గర్పూరమంజరికి వీనులవిందుగ ముందుగఁ దెలియఁజేసి జామాతరాక కెదురుచూచు చుండెను. పంపఁబడినపరివారము దారి జూపుటకుఁ గరటకపింగళుల ముందిడుకొని రెండుక్రోసులమేర చని యచ్చట విడిసి మధ్యాహ్నము చిత్రభానునిం గాంచి మామగారిపంపున వచ్చినట్లు తెలిపెను. చిత్రభానుఁడు మఱఁదితోఁ జాలసేపు ముచ్చటింపక మంత్రితోఁ బలుమాట లాడక పరిజనంబును బలుకరింపక చిన్నవోయి ధూళిధూసరమైన మేనితో బంధువులు తెచ్చినపల్లకి నెక్కెను. ఆసమయమున నాతనితో నొకబ్రాహ్మణుఁడు పదునుగురు సేవకులుఁ గూడ నుండిరి. విదర్భరాజుకుమారుఁడు మంత్రియు బ్రాహ్మణుని గుర్తుపట్టి పలుకరించి యొకయందలము నెక్కించిరి. ఆపరివారము సాయంకాలమగునప్పటికిఁ బట్టణము జేరెను. రాజవాహనుఁడు మేడ దిగి వచ్చి యల్లుని సమ్మానించుటకు సోపానములమీఁద నిలిచియుండెను. చిత్రభానుఁడు పల్లకిదిగి మామకడకుఁ బోవ నావృద్ధరాజు వానిం గౌఁగిటఁ జేర్చి "వత్సా! నీసోదరమరణంబు నాసోదరమరణంబువలె నున్నది. చుట్టములు కానివారి కైన మనోదాహము సేయువానిమరణము కేవలము సోదరుఁడ వగునిన్ను బరితపింపఁ జేయుట యాశ్చర్యకరంబుగా

నీశ్వరాజ్ఞ దాఁట నలవికాదు గదా" యని యాశ్వాసించెను. చిత్ర భానుఁడు దుఃఖముచేత మాటలాడ నోపక తల వంచి కన్నీరు విడుచుచు నిలువఁబడెను. మామ యల్లునికన్నీరు తన యుత్తరీయపు టంచునఁ దుడిచి యిందుమణి మొదలగు వారిని జూడవానిని మేడ మీఁదికిఁ గొనిపోయెను.

అక్కడ కుమారుఁడుఁ గుమార్తెయు నిరుపక్కలనుండ నిందుమణి యొకచో నిలిచియుంటిపట్టుఁగక చాలకాలము పరదేశములఁ దిరిగి వేళ కన్నపానాదు లరసి యిడువారు లేక కడు డస్సి యానలఁతకుందోఁడగు భ్రాతృమరణముచేతఁ గడుఁజిక్కి శల్యమైయున్న మగనిం జూచి బాష్పోద్గమముచేత మితిలేని తనమనస్తాపము నెఱింగించెను. కర్పూరమంజరియు విజయసేనుఁడును దండ్రినాలింగనము జేసికొని విలపించిరి. చిత్రభానుఁడు వారికన్నీరు దుడిచి యాఁబిడ్డలతో నిట్లనియె. "శోకరవియోగమున నే నిపుడు దుఃఖపరవశుడ నై యున్నాఁడను, మీరు గూడ నిక్కలియడల దొరకొనినచో నేను బ్రతుకఁజాలను. మీకు బెంగగొందు రనుభయమున నేనుదుఃఖ మంతయు దిగమ్రింగి ధైర్యముదిక్కబట్టి పైకి గంభీరభావము దాల్చి నాలో నే నె గిగఁగుళ్లు చున్నాఁడను. ఇంక మీరు హేమచంద్రుని గూర్చి నాదుట విలపింపవలదు." అని వారి నంతిపురికి వీడుకొలిపి తన్ను పరామర్శింప వచ్చిన బంధుజనులను బలుకరించి తనతో వచ్చిన బ్రాహ్మణుని తోడితెమ్మని సేవకుల కానతిచ్చెను. "చిత్త" మని వారరిగి యావిప్రుందోడి తెచ్చిరి. చిత్రభానుఁడు వానిని సగౌరవముగఁ బిలిచి తనపక్కం గూర్చుండఁబెట్టుకొనివిదర్భరాజువంక దిరిగి "మామా! మీకీవిప్రపుంగవుం జూచిన జ్ఞాపకమున్నదా? ఈయన పేరు రుద్రభట్టు. మాళవేంద్రునిమంత్రియగు కేశరితో నీమహాత్ముఁడు మున్నొకసారి యిటకు వచ్చి మీచేతసత్కారములం బడసి మీకుప

కారము జేసినాఁడనునెపమున సుదర్శనునిచే నవమానితుఁడై సర్వస్వము గోల్పోయి యిపుడు దారపుత్త్రుల నెడబాసి యిడుమలఁబడుచున్నవాఁడు. నాయదృష్టవశమున నాకీమహాత్మునిసందర్శనము దొరకినది. చూచుకొన్నది మొదలు మాకొండొరులపై ననురాగ మతిశయిల్లినది. మహాదుఃఖసాగరమును నేనీమహాపురుషుఁడను తెప్పచే నీఁదితిని. ఈయనసాంగత్యము లేనిచో నేనెంతకాలము క్రిందటనో మృతినొంది యుందును. అనవుడు రాజవాహనుఁడు తేరిచూచి "ఔనౌను. నేనీయనను జూచినట్లు జ్ఞప్తికివచ్చినది. సజ్జనుఁడగుటచే నీకకారణబంధు వయ్యె' నని బదులుచెప్పెను. ప్రియమిత్త్రుఁడు తన్నుఁ బలుతెఱంగులఁ గొనియాడుచు విదర్భరాజున కెఱింగింపఁ దానూరకుండుట భావ్యము కాదని రుద్రభట్టు రాజవాహనునితో నిట్లనియె.

"మహారాజా! మీదర్శనము నాఁటికి నేఁడు క్రమ్మఱ లభించె. మిమ్ము వీడ్కొనిపోయినపిదప నా యవస్థయంతయు మాఱినది. కీడులో మే లన్నట్లు మాళవరాజు మైత్రి పోయినను హిమవంతుని యల్లుని బోలుమీయల్లునిమైత్రి నాకు లభించినది. మీయల్లుఁడు లోకముతోడిపాటిమనుష్యుఁడుగాఁడు. ఆయన నెట్టయెదుట నుంచుకొని నేను గొనియాడరాదు గాని యాతనిం బోలుగుణవంతుఁ డుండుటరిది. మీయదృష్టమున మీయింటియల్లుఁడయ్యె. ఆతనిసుగుణసంపద నెన్నుటకొక్కయుదాహరణము చాలును. వేయుమాటలక్కఱలేదు. అన్నయతిక్రూరుఁడై కొండెములు విని నెనరొకింతయు లేక దారపుత్త్రసమేతముగఁ దన్నింటనుండి వెడలనడచినను వానిదుర్మరణమును విని యాతడు పడిన పరితాప మింతింతగాదు. మనస్సులో దీర్ఘక్రోధము పెట్టుకొని సోదర మరణమునకు మహానందము నొందవలసిన యవస్థలో నుండియు నింతగా దురపిల్లునతఁ డితఁ డొక్కఁడే కానఁబడుచున్నవాఁడు. నామాటలు మీరు నమ్మెదురో నమ్మరో కాని మీయల్లుఁ

డొకనాఁటిరేయి సోదరమరణదుఃఖముచేతఁ బరవశుఁడై నేఁబండు కొనగాఁ జూచి యాత్మహత్య జేసికొనఁ బోయెను. ఈతని సాహసము నేనెఱిఁగినివాఁడనే కావున నేవేళకేమి తెగువచేయునో యని పండు కొనియు మేలుకొనియుండి సమయముగుర్తెఱిఁగి యాదారుణకర్మను మాన్పితిని. అని తెలుప రాజవాహనుఁడు మిక్కిలి సంతోషముజెంది రుద్రభట్టుహస్తములం బట్టుకొని దేవా! మీరు నాపుత్రికకుఁ బతి భిక్షముపెట్టిరి. మీఋణమును దీర్పఁజాల నని కృతజ్ఞతను దెలుపు వాక్యములఁ బలుకుచుండఁ జిత్రభానుఁడు వారిమాటల కడ్డముపోయి అయ్యా! వెనకటివృత్తాంతమును దలపెట్టకుఁడు. ప్రస్తుతము కర్తవ్య మేమో నాకుపదేశింపుఁడు. శ్రీనగరమునకుఁ బోయి తండ్రి లేక దురపిల్లు నాయన్నబిడ్డల నొకసారి కన్నులారఁ జూచి వారి నొక సారి బిగియారఁ గౌఁగిలించుకొని యేడ్చినంగాని నాయుమ్ములుకుట తీరదు. అన్న నా కనిష్ఠుఁడయ్యెఁగాని పసికూనలగు చిన్నబిడ్డ లేమిచేసిరి. అదియునుం గాక మావిక్రమసేనుఁడు క్రొత్తవాఁడు బాలుఁడు రాజ్యము గొప్పది. మంత్రులు దుర్మార్గులు. బాలరాజును బొమ్మవగిదినాడించి వారు రాజ్యమును దుశవస్థకుఁ దెచ్చి బిడ్డప్రాణమున కపాయము గావింతురని భయపడుచున్నాను. నేఁబోయి వారికిష్టమగు నేని సంరక్షకుఁడనై యుక్తవయసు వచ్చినపిదప వారి రాజ్యము వారి కప్పగించి మరలవత్తు. ఇష్టము లేదేని చూచి యూరకవత్తు. ఎంత పగయున్నను దండ్రిపోయినప్పుడు వారిని జూడకుండుట భావ్యము కాదు. ప్రేగుసంబంధ మగుటచే నాకనురాగముపోవకున్నది. ఇందుకు మీ రేమి చెప్పెద" రని యడుగ రాజవాహనుఁడును దక్కినవారును వానిబుద్ధినే మెచ్చి యటుచేయుమని యుపదేశించిరి. బంధుజనంబు తనయభీష్టమున కనుగుణముగా నుపదేశము చేయుటయుఁ జిత్రభానుఁడు సంతసించి మూఁడుదినంబులు విదర్భపురంబుననుండి బ్రాఁతనెచ్చె

ములఁ జుట్టములఁగూడి సుఖంబునఁ బ్రొద్దులు పుచ్చి నాలవనాఁడు కాశ్మీరమునకుఁ బయనమయ్యెను. అల్లుఁడుతగుపరివారముతోఁ బోవకున్న నపాయము వాటిల్లునని రాజవాహనుఁడు తనబలములో మెఱియలవంటి మున్నూరుగురు బంట్లనేరి యుగ్రసేనుఁ డనుసార్థకనామధేయుఁడగు సేనాపతిని వారికి నాయకునిగ నేర్పఱచి జామాతవెంటఁ బొమ్మని యానతిచ్చెను. రుద్రభట్టు, కరటకుఁడు పింగళుఁడు ధీరుఁడగునుగ్రసేనుఁడు వెంటరాఁ జిత్రభానుఁడు విదర్భానగరము విడిచి శ్రీనగరమునకుఁ బయనమైపోయెను.

ముప్పదియొకటవ ప్రకరణము.

అది గ్రీష్మకాలము. సమయము ప్రాతఃకాలము. అస్తమించి నాఁడస్తమించినాఁడని లోకులంకఱుఁ జెప్పుకొన్నట్లు తేజోవిహీనుఁడై నిరాశుండై దుఃఖమహాసముద్రమున మునిఁగి యేకొండలనడు మనో తిరిగితిరిగి భానుఁ డెల్లవారు వీరి వసిత్రము చిత్రమయినది. ఇతఁడు నిశ్చయముగఁ జిత్రభానుఁడను తలంపఁ డెల్ల తెర జిమ్ముకొని వచ్చునటుఁడువోలె మంచు జవనిక దనుల్చుకొని యుదయించె. ఉదయించినతోడనే వాని తేజము నలుదెసల వ్యాప్తమయ్యె. వ్యాప్తమగుటయు నతఁడు క్రమక్రమంబున నధికుఁడై చుట్టుప్రక్కల దేశమంతయు నాక్రమించి పర్వతములకు వృక్షములకుఁ జిత్రవర్ణముగలిగించి చిత్రభానుశబ్దము సార్థకముచేసుకొనియె. ఆతనికాప్తులై పరమభక్తులైన జనులు శరీరములనుండ రక్తచందనములు పూసికొని విధివిధానముగఁ బూజలు నమస్కారములు చేసి మంత్రములచేతను బద్యగద్యములచేతను స్తుతియించి తమ మనోరథసిద్ధి జేయు మని

ప్రార్థించిరి. దుర్నిరీక్ష్యమై దుస్సహమైనవాని తేజమున కోర్చి కన్నెత్తి వానిం జూడలేక సుకుమారులగు స్త్రీపురుషులు మందిరంబుల నడంగియు లతాగృహంబులం డాఁగియు స్వశరీరసంరక్షణము జేసికొని "కటకటా! బంగారమువంటి చందురుఁ డస్తమించుటయు నస్తమించినాఁ డనుకొన్న యీచండశాసనుఁడు మరలఁ దలసూపుటయు మనదోసంబు గాని వేఱొకటి కాదు. ఇంతకుం గాలవశమున వచ్చునాపదలకు మనమేమి చేయఁగల"మని ఖేదపడఁ జొచ్చిరి. వేదపురాణకథలలోఁ జెప్పబడిన సూర్యవర్ణనము నెఱింగిన విద్వాంసులు వానికి యథావిధిగ నర్ఘ్యప్రదాన మొసఁగి క్షణక్షణము చిత్రమై కానుపించువాని బింబమును తెప్పవాల్పక చూచి "ఆహాహా! ఈచిత్రభానుని మహిమ నేమని కొనియాడఁగలము. ఈతనిరథమునకుఁ జక్రమొకటియే కదా! ఆయరదము నిడ్చునవి పలురంగులు గలగుఱ్ఱములు లేవు. ఆయశ్వములం గట్టుపగ్గములు త్రాచుబాములు. పోవునట్టిదారి చూతమన్న నిరాధారమైన యాకాశము. ఆరథముం దోలువాఁడు తొడలు లేనివాఁడు. పోవలసిన దూర మపారము. ఉపకరణములఁ బట్టి చూడ వానిసాయమున నీమహోత్కృష్టుఁడు ప్రతిదినము గగనమండల మతిక్రమించుటకు వీలు లేదు. కావున నితనియందుఁ గల యద్భుత తేజమే యీతఁడు చేయుపనికి సాధనమయ్యెను. నిరాధారులైనవారు సయితము సహజముగఁ దేజోవంతులైనపక్షమునఁ బేరునకు మాత్రము కొన్ని యుపకరణముల స్వీకరించి విజయము నొందుదురు కదా" యని భావమునం దలపోయఁ జొచ్చిరి.

అట్టిసమయమున మణిపర్ణ యుదయకాలకృత్యములం దీర్చికొని తనమేడమీఁద నొకపీఠముపైఁ గూర్చుండి యేదో యాలోచించుచుండ గవాక్షపుసందులనుండి చిత్రవర్ణములు గలభానుకిరణములు మొగమునకుం గన్నులకుం దాకి యించుక వేదన గలిగించె. కిటికీతలుపులు మూయుమని సేవకుని బిలిచి యానతిచ్చెను. ఆపరి

చారకుఁడు తలుపులు మూసి యజమానుని యెదుట నిలిచి "దేవా! వై రుగ్రసేనుఁడఁట! కాపురము విదర్భాపుర మఁట! వచ్చినది మీదర్శనార్థ మఁట! సెల వగు నేని వానిం దోడి తెచ్చెద" నని వినయముతో విన్నవించెను. "ఏమీ! కాఁపురము విదర్భాపురమా! వై రుగ్రసేనుఁడా! నామిత్త్రము వచ్చెనా సరె తోడ్కొనిర" మ్మని యాతఁ డానతిచ్చెను. చిత్త మని సేవకుఁడు బోయి యాక్షాత్త్రపురుషునిం దోడ్కొని తెచ్చె. నల్లనై పొడవై ధృఢమై యున్న యాపురుషునిశరిరము దీర్ఘబాహువులును పద్దశాలమును వెడఁదరొమ్మును జూచినతోడనే మణివర్మ యెదురువోయి వానిం దోడితెచ్చి యొకపీఠమునం గూర్చుండబెట్టి గౌరవించి కొండొకతడవూరకుండి మెల్లగ నిట్లనియె. "విదర్భనాథుఁ డగురాజవాహనమహారాజుగారికొలువరు లగుమీకు స్వాగతము. నాకడకు మీరు వచ్చినకారణ మేమి? ఆనృపాలుఁడు పంపెనో మీరు స్వయముగ వచ్చితిరో తెలియఁగోరుచున్నాఁడ" నని యడిగెను. అడుగుటయు నుగ్రసేనుఁడు వాని కిట్లనియె. "మంత్రిశిఖామణి! విదర్భరాజు నన్ను దూతగాఁ బంప లేదు. రాజవాహనమహారాజుగారియల్లుఁడు చిత్రభానుఁడు సోదరవియోగమునకుఁ జాల ఖిన్నుఁడై యున్నబిడ్డలను మిమ్మును జూచిపోవ వచ్చినాఁడు. ఆయనతోఁగూడ విదర్భరాజు నన్ను బంపినాఁడు. చిత్రభానుఁ డీనగరము వెలి గుడారములలో సపరివారముగ నున్నవాఁడు. పురము బ్రవేశించి సోదరపుత్రులం జూడ నభిలషించుచున్నవాఁడు. అప్పటికిని మీయనుజ్ఞ వేఁడు మని నన్నుం బంపినాఁడు. ఇదే నావచ్చినపని."

అనవుడు మణివర్మ "ఏమీ! చిత్రభానుఁడు జీవించియున్నాఁడా? హరిద్వారముకడ నతఁడు మృతినొందె నని హేమచంద్రమహారాజుగారు జీవించియున్నపుడె మేమందఱ మొకవార్త వింటి" మని యాశ్చర్యముతో నడిగెను. అప్పలుకులు విని యుగ్రసేనుఁడు వచ్చి

యు రానిచిఱునవ్వు మొగమునఁ దోఁప "సమితలోకానుభవము గల మీకు నేనుజెప్పవలయునా? అన్నదమ్ములకురవరవలు పొడముటచేన దేసందుగఁ జేసికొని రాజున కామాటలు మనఃప్రీతికరము లనుకొని కిట్టనివారట్లుచెప్పి యుందురు. అంతేకాని చిత్రభానుఁడు మృతినొంద లేదు. మృతినొందినసోదరునిమిత్త మతఁడొందుచింత యింతింతయని చెప్ప నలవికాదు. అన్నకుమారులను వదినెను దక్కినచుట్టములను జూచి పోవ నతఁడు వచ్చినాఁడు. అన్నదమ్ములకుఁగలప్రాఁతపగలు మీరు తలంపవద్దు. ఉత్తములకు విరోధము స్థిరముగా నుండదు అది యును గాక చిత్రభానునిమాటయె కఠోరము గాని మనసు మృదువు. కావున వానిరాకకు మీరు సమ్మతింప వలయు నని వేఁడుచున్నాఁడ" నని పలికి యతఁడేమియుత్తరము చెప్పునో వినుటకు వానివంకఁ గన్నులు నిగిడ్చి చూడఁదొడఁగెను. మణివర్మ యప్పలుకులు సమగ్రముగ నాలకించి తల యూఁచి కొంతతడ వాలోచనచేసి యిట్లని వచియించె. "ఉగ్రసేనుఁడా! మారాజకుటుంబమునకుఁ జిత్రభానునకు గలపరస్పరసంబంధ మెట్టిదియో నీవెఱుఁగుదువు. చిత్రభానునిరాకయు వానికోరికయుఁ దక్కినమంత్రులకు సేనాపతులకుఁ జిన్నరాజునకు రాజమాతకుఁదెలిపి మేమందఱము గలిసివిచారించి పిదప రేపుదయమున మీకుత్తరము బంపువాఁడ. నేనొక్కఁడనే మాటచెప్పుటకు వలను పడదు. రేపటివఱకు నగరమువెలుపలనే చిత్రభాను నుండుమనుము." అనవుడు వల్లె యని యుగ్రసేనుఁడు లేచి వానికడ సెలవుగైకొని తననివాసమునకుఁ బోయెను.

ఉగ్రసేనుఁడు గుమ్మము దాఁటిపోయినదిమొదలు మణివర్మ మనసు మనసులో నుండ దయ్యె. ఒకపరియాయము పీఠముమీఁద నుండి చివాలున లేచి నిలుచును. నిలిచి నిలిచి యిట్టట్టు దిరుగును. తిరిగితిరిగి మరల పీఠమునఁ గూర్చుండును. కూర్చుండి పలుతెఱంగుల

నాలోచింపు చుండును. ఈదురాత్ముని మరల నగరములో నడుగు పెట్టనీయ వచ్చునా యని యొకసారితలంచును. "రానీయనిచో నతఁడు దండువిడిసి మనకెగ్గు సేయఁడా!" యని యొకమాఱూహించును. ఎన్నివిధముల విచారించినను వానికేయుపాయంబును బాలుపోవక యావిషయమే తరచితరచి మరలమరలఁ జింతించి యెట్టకేలకీక్రిందివిధమునఁ గృతనిశ్చయుఁడయ్యె. "ఏమయినం గానిమ్ము చిత్రభానుఁడు నిశ్చయముగ హేమచంద్రునిం జంపిన మహాపాతకుఁడు. కావున నా మాట చెల్లునేని వాఁడు శ్రీనగరము మఱల బ్రవేశింపకపోవునట్లు చేసెద" అట్లు కృతనిశ్చయుఁడై నపినప స్నానముజేసిభోజనముగావించి యానాఁడు పెందలకడ రాచనగరునకుం బోవసమకట్టి యరదమెక్కి సత్వరమయచ్చోటికిం బోయెను. పోయి ప్రధానపురుషు లగుచండపాణి వజ్రపాణి మాధవసేనప్రముఖులను నిగమశర్మను దక్కినరాజబంధువులను బిలించి వారింగలియగట్టుకొని బాలరాజగు విక్రమసేనునిసన్నిధికి జనియెను. విక్రమసేనుఁడు వారలనందఱ సగౌరవముగనాదరించియుచితాసనములఁ గూర్చుండ నియమించి యందఱి నొకసారి రావించిన మహాత్కార్యమేమని యడిగెను. అందఱు మణివర్మవంకఁ జూచిరి. రాజకుమారుని దృష్టియుఁ బ్రత్యుత్తరము నిమిత్తము మణివర్మమీఁదనే పడెను. అంతట మణివర్మ తనపీఠము నించుకముందఱకు జరుపుకొని వారల నందఱ నుద్దేశించి యిత్తెఱంగునఁ బలుకఁ దొడంగెను. "రాజా! మిక్కిలి యవసరమగునొకవిషయమును జర్చింపదలఁచి వీరలనందఱ మీసమ్ముఖమునకు రావించితి. మిత్రులారా! ఈవిషయము పరమగోప్యమైనది. అందఱముఁ గుమారరాజుగారి మేలు గోరువారమె కావున నిచ్చట జరగెడుచర్చ లీమందిరము దాఁటి యావల వ్యాపింపఁగూడదు. నాచెప్పఁ బోవునంశము మీరు చక్కఁగ విచారించి మీమీయభిప్రాయముల మర్మము లేక వెల్లడి చేయుఁడు. చిత్రభా

నుఁడు మృతినొందెనని మున్ను మనము వింటిమి కదా. అతఁడు జీవించియున్నాఁడఁట! సోదరమరణమునకు మిక్కిలిపొక్కుచున్నవాఁడట! అన్నబిడ్డలను వదినెను జుట్టములను దానొకసారి చూచి పో వలయునని వచ్చినాఁడఁట! ఊరుబైట గుడారములో నున్నాఁడఁట! పురప్రవేశమునకు మనయనుమతిని వేఁడు చున్నవాఁ డట ! వానితో వచ్చినవిదర్భరాజుసేనాపతి యగునుగ్రసేనుఁ డనువాఁడు వానిపంపున వచ్చి వానిమనోరథము నాకెఱిఁగించె. కావున వానిపూర్వచరిత్రము జ్ఞప్తికిఁ దెచ్చికొని మనప్రస్తుతస్థితి నెంచికొని మీకుం దోఁచినపోలి హితముపదేశింపుఁడు.

చిత్రభానుఁడు సజీవుఁడై యున్నవాఁడని వినినతోడనే దండపాణిమొగము తెలివొందెను. వజ్రపాణిమనస్సు హెచ్చరికతోనుండెను. ఈయుభయులముఖమనోవికాసములను మణివర్మతక్క తక్కినవారు గ్రహింపలేరైరి. "అయ్యో! మరల వచ్చినాఁడా" యని నిగమశర్మగుండె కొట్టుకొనెను. అతఁడు మనలం జూచి పోయినంతమాత్రమున మన కేమి నష్ట ముండు" నని విక్రమసేనుఁడు మణివర్మతో ననియె. "చూడవలసిన దేమో యిదివఱకే చూచినాఁడు. అన్నగారి మరణము చూడ లేదా? ఇంకను జూచుట కే మున్నది?" అని మాధవసేనుఁడు పలికెను. అప్పుడు నిగమశర్మ మరలనేదియో యనఁబోవుచుండ నంతలో దండపాణి యందుకొని "అనుమానబలముచే దోషారోపణము చేయుటయె కాని చిత్రభానునిదౌష్ట్యముఁ బ్రత్యక్షముగఁ జూచినవారులేరు. సోదరవియోగమున మిక్కిలి పొగిలిపొగిలి ప్రేమాతిశయమున సోదరపుత్రులఁ జూడఁ దలఁచినచిత్రభానుని రానీయక పోవుట మనకు న్యాయముకాదు. సోదరవియోగమునకు వానిమనసెంత కుందుచున్నదో యతనిహృదయ మెంత దుఃఖాగ్నిని మండుచున్నదో యెవ్వరెఱుంగుదురు. కావున వానిని రానియ్యవచ్చు నని

నాయభిప్రాయ మని పలికెను. వజ్రపాణియుఁ దన యన్న యగు దండ పాణిమార్గము ననుసరించిచిత్రభానుని రాక కనుమతించెను. నిగమశర్మ "మీకందఱకు నేది యిష్టమో నాకునదియే యిష్ట" మని చెప్పెను. యెవ్వ రేమనుకొన్నను సరే చిత్రభానుఁడు మున్ను దాఁటిపోయిన కోటగుమ్మము మరలదాఁటి లోనికి రాఁ గూడదు. ఇదియే నాయభి ప్రాయ" మని మాధవసేనుఁడు పలికెను. మాయమ్మగారిమన సెటులం గున నుండెనో తెలిసికొనుట యుచిత" మని విక్రమసేనుఁడు పలికెను. అంతట మణివర్మ యుత్సాహావశమున బీరమునుండి లేచి తనముసలి మేను గంపింపఁ గోపముతో నిట్లనియెను. "దండపాణీ! చిత్రభానుని దౌష్ట్యముఁ బ్రత్యక్షముగఁ జూచినవారు లేరంటివి కదా! అతని నిటకు రావించితిమా దుండగములు ప్రత్యక్షముగఁ జూడఁగలము. మీ రేమనుకొన్నను సరే హేమచంద్రుని గడతేర్చినమహాపాతకుఁడతఁ డే యని నాయభిప్రాయము. సోదరునింగూర్చి యతఁడు పొక్కు- చున్నవాఁడా! కటికివానికి జాలియుండు నేని, వజ్రమునకు మెత్తఁదన ముండు నేని, వేమునకుం దియ్యఁదన ముండు నేని వానియొద్ద సుగుణ ముండును. వానిని గృహప్రవేశము చేయించుట మమ్ము స్వర్గపుర ప్రవేశము చేయించుటయే, వానిని రానిచ్చుట మృత్యుదేవతను రాని చ్చుట, వానిని నమ్ముట పెద్దపులినోటఁ దల నిడుట, వానిని మనకడ బెట్టుకొనుట, పామును మెడఁజుట్టుకొనుట. దుష్టునకు దూరముగ నుండ వలయు ననుమాట నిజము చేసి మనము వానినిబరిత్యజింపవలయును. నరకివేయఁబడినకొమ్మను మరలఁ జెట్టున కెన్నఁడయిన నదుకవచ్చునా? అట్లే కుటుంబమునుండివిడిపోయినవానిని మరలఁ గలుపుకొనుటయసం భవము కావున జాలి నొందక మోమోటపడక భీతి జెందక చిత్ర భానునిరాక నిరాకరింపుఁడు.

మహారాజుగారు సెలవిచ్చినట్లు తల్లిగారిమతము తెలిసికొనుట

కర్తవ్యము కావున నోనిగమశర్మ! పురోహితు లగు మీరు రాజమాత సన్నిధికిం జని యద్దేవికి నాపలుకులుం జండపాణిప్రముఖుల వచనములు సరిగ విన్నవించి యామె యిష్టము ననుసరించి కార్యనిశ్చయముఁ జేయుఁడు. ఆమె మఱుఁది రాక కనుమతించినచో మీరుపోయి చెప్పుద యయినఁ జిత్రభానుని దోడ్కొనిరండు అనుమతింప దేని మే మందఱ మనుమతింపలేమని వానితోఁ జెప్పుఁడు. ఇదియే నాచేయవలసిన హితోపదేశమని పలికి కూర్చుండెను. అంతట సాయంకాలమయ్యెను. విక్రమసేనుఁడు సంధ్యాకాలకృత్యములఁ దీర్చుట కభ్యంతరమందిరము నకుం బోవఁ దలఁచి పీఠమునుండి లేచి "మీరాడఁదగిన పలుకులు వేరు వేరుగ మాయమ్మగా విన్నవించి యామె యిష్టముం బట్టి కార్యనిశ్చ యముం జేసెదను. మీరింక గృహముల కేగుఁడు" డని సెల విచ్చి యంతిపురికిం జనియె.

ముప్పదిరెండవ ప్రకరణము.

మరునాఁడు చిత్రభానుఁడు రేపకడ మేలుకాంచి భానుండు పొడుపుగొండమీఁద నుదయింపకముందె ప్రాతఃకాలకృత్యంబులు నిర్వర్తించుకొని గుడారంబునం గూర్చుండి తనరాకం బ్రార్థించి మణివర్మప్రముఖు లెట్లు నిర్ణయించిరో తెలియుటకై యనేకవిధంబుల మనంబునఁ దలఁపోయుచుండ నంతలో నుగ్రసేనుఁడును గాలకృత్యంబులఁ దీర్చుకొని యాతనికడకుం బోయెను. పోవుటయుఁ జిత్రభానుఁడు వానింజూచి "యుగ్రసేనుఁడా! మన కీమాటయుం దెలియకపోవుటకుఁ గారణ మేమి? మణివర్మ యేమనియెను? ముఖలక్షణంబులం బట్టిచూడ నతండు మనకార్యంబు దెసఁ బ్రసన్నుఁడై యుండినట్లు నీకుం దోఁచెనా!

మనయెడ ద్వేషము బూనినట్లు కాఁబడెనా? మణివర్మ బుద్ధికుశలత యసాధారణము. ఆవులించినవారి ప్రేవులు లెక్కపెట్టును. ఇంతకు మన తలంచినపని యేమగునని నీబుద్ధికిఁ దోఁచుచున్నది. ఇందునెరవేరి తిమా" అని వాక్యము సమాప్తము చేయకముందె యుగ్రసేనుఁ డందుకొని "దేవా! మణివర్మ పక్షవైఖరి మనకు భాగ్యసూచకము కాదు. దండపాణి మొదలగువారు మహాత్ములు మనకనుకూలురగు దురా? ఎట్లయిన మనకార్యము కష్టసాధ్యము కాని సులభసాధ్యము కా" దని యుత్తరమిచ్చెను. "ప్రియమా! దండపాణి నాకుఁ జిన్న నాఁటిమిత్రుఁడు కాని [illegible]. నే నొక్క రహస్యము జెప్పెద. అని నీకుఁ జెప్పినదే యుండవలెను. నిన్నరేయి మీ రందఱు నిద్రించినపిదప నిదుర రాకపోవుటచే నేను సింహద్వారమున నిట్టటుఁదిరుగుచుంటి. అప్పుడు గుడారమునకు గాపరియున్న పింగళకుఁడు నాకడ కొకక్రొత్తమనుష్యుని దోడ్కొనివచ్చి "దేవా! దండపాణి మీకడ కతనిం బంపె దేవరవారితో నితఁ డొకమాట మనవిచేయ సెలవు వేఁడుచున్నాఁ" డని వానిని నాయెదుటఁ బెట్టెను. నేనును సంభ్రమసంతోషంబులు మనంబునఁ బెనఁగొన నమ్మనుష్యునిజూచి దండ పాణి నేమనుడిగి వచ్చినవని యడుగుచుంటి. అప్పుడు మనుష్యుఁడు నలువంకలు జూచి "క్రొత్తవా రెవ్వరును లేరుగదా, ఈమనుష్యుఁడు మన వాఁడే కద," యని యడిగి క్రొత్తవా రెవ్వరును లేరనియుఁ బింగళకుఁడు నాపరిజనుఁడే యనియు నే బదులుచెప్పినపిదప నిట్లనియె. "దేవా! కాశ్మీరరాజసేనాపతి దండపాణి మీదర్శనము చేయఁ జాల గుతూహలపడుచున్నవాఁడు. రేపు రాతిరి రెండుజాములవేళ నిక్కడకువచ్చి మిమ్ము దర్శింపఁగోరుచున్నాఁడు. మీ దేవర చిత్త" మని యూరకుండెను. అప్పలుకులు విని నేను మిగుల సంతుష్టుఁడనై "వానిఁ జూడ నేను మిక్కిలియుబలాటపడుచున్నవాఁడ తప్పక

రేపటికేయి రమ్మనుము. వానిరాక నేనెదురు చూచుచుండెద నని చెప్పి వాని పంపితిని. వారిరాక నేను బింగళకుఁడు పూత్రి మెఱుఁగుదుము. దీనింబట్టి చండపాణి నాకనిష్టుఁడుగ నుండెఁ డనియూహించెదను. వజ్రివాణి నేనిక్కడనున్నపుడె మాకర్పూరమంజరిపై మనసు నిలిపి యుండెనువాఁడు. కావున వానికి నాయెడ నధికానురాగము గలదు." అని పలికి వెండియుం గొంత పలుకఁబోవుచుండఁ బింగళకుఁడు వారని సమీపించి "దేవా! రాజపురోహితుఁడు నిగమశర్మ మీదర్శనార్థము వచ్చియున్నవాఁ" డని విన్నవించెను. "వాని సత్వరమే ప్రవేశపెట్టుము" మని చిత్రభానుఁడు సెలవొసంగుటయుఁ బింగళకుఁడు పోయి నిగమశర్మం బ్రవేశపెట్టి తాను గ్రమ్మఱ ద్వారము కడకుం జనియెను.

ఆబ్రాహ్మణుఁడు గుడారమునం దడుగు పెట్టినతోడనే చిత్రభానుఁడు పీఠమునుండి లేచి యెదురుగాఁజని వానిపాదములకు సాష్టాంగ దండప్రణామము గావించెను. నిగమశర్మ వానిభక్తికిఁ దద్దయు మెచ్చి "దీర్ఘాయురస్తు కల్యాణమస్తు" అని దీవించి వంగి చేతులతో వానిని లేవనెత్తెను. అంతఁ జిత్రభానుఁడు వానిం దోడ్కొని యొకపీఠమునం గూర్చుండఁబెట్టి సువర్ణపాత్రముతో నిర్మలజలంబు దెప్పించి వెండి పళ్ళెమున నాబ్రాహ్మణుని యడుగు లుంచి కడిగి యయ్యుదకంబు శిరంబునం జల్లుకొని ధన్యోస్మి ధన్యోస్మి యని యిట్లు పలికెను. "మహాత్మా! మీయడుగులనీరు చల్లుకొనటం జేసి తాపంబుదీఱె. రాఘవులకు వసిష్ఠుఁడట్లు పాండవులకు ధౌమ్యుఁడట్లు, మీరు మాకుఁబురోహితులరు. మిమ్ముఁ జూచుట మాయన్నం జూచినట్లున్నది. అరవిందాదేవికిని పుత్రము సేనహర్షవర్ధనులకుం గుశలమే కదా! హేమచంద్రా! నీవంతలో మాకు దూరగుఁడ వయితివి" అనుచుండఁగనే రెండుకన్నుల నుండి బాష్పములు దొరఁగుటయుఁ దల వంచికొని మాటలాడలేక

యతఁ డూరకుండెను. హేమచంద్రునిదలంచి చిత్రభానుఁడు కన్నీరు పెట్టుకొనినతోడనే నిగమశర్మమనస్సును గరుఁగ నయనములు బాష్పాకులితములయ్యెను. ఉగ్రసేనుఁడె వారినిరువురను సమయోచితవచనముల నూరడించె. అప్పుడు చిత్రభానుఁ డుగ్రసేనునిపలుకులం దేరి వెండియు నిగమశర్మనుద్దేశించి "స్వామీ! మీరాకకుం గత మెద్ది. మీమంత్రిగారు నావిన్నపము నేమిచేసిరి. అహాహా! కాలమహాత్మ్యము నాయన్నబిడ్డలను నేను జూచుటకు నాస్వనగరము నేను బ్రవేశించుటకు మణివర్మసెలవు గావలసి వచ్చెఁ గదా" యని నొచ్చుకొనుచుండ నిగమశర్మ చిత్రభానున కిట్లనియె. "కుమారా! దేవియుం బాలకులుఁ గుశలముగ నున్నారు. అరవిందాదేవియు విక్రమసేనుఁడును నీరాకయు నీవచ్చినపనియు విని ఱేపుదయమున నిన్నంతిపురికిఁ బిలువుమని నన్ను బుత్తెంచిరి. చూచి పోవుటవలన నష్టమేమి యని విక్రమసేనుఁడు పలికె. వైరములు శాశ్వతముగఁ గాఁపురముండునా; అన్నబిడ్డలం జూడవలయు నని యాతనిమన స్సెంత తత్తరపడుచున్నదో పాపము రానిండని యరవిందాదేవి వచించె" అతఁడు పలుకఁదలఁచిన పలుకులు సమాప్తము గాకమునుపే చిత్రభానుఁడు నడుమ నడ్డము వచ్చి మీమంత్రు లేమనిరని యడిగెను. అనవుఁడు నిగమశర్మ "యెవ్వ రేమనిన నేమి. నీవు ఱేపుదయమునఁ బురప్రవేశము గావింపుము. నీకిది సమ్మతమని నే నచ్చటివారితో విన్నవింప వచ్చునా" యని పలికెను.

తనరాకకు నరవిందావిక్రమసేనులు సమ్మతించిరని వినినతోడనే చిత్రభానునిమనస్సు వర్ణనాతీతమైన యానందము నొందెను. అతఁడాయుబ్బు పైకిఁ దోఁపకుండ మిక్కిలి యడంచుకొని "యట్లే విన్నవింపవచ్చును. కుమారవిక్రమసేనుఁడు దల్లియును నాకుఁ జాల నుపకారము చేసిరి. నన్ను మాయన్నబిడ్డలం జూడనిచ్చుట కాశ్మీర

రాజ్యమున కభిషిక్తుని జేయుట. ఆఁడుది యైనను మావదినె దూర మాలోచించినది. విక్రమసేనుఁడు బాలుఁ డయ్యు బుద్ధికిం బెద్ద యయ్యె. రేపు ప్రాతఃకాలమునఁ దప్పక నే నటకు వచ్చెద. మీరింక వేంచేయుఁ" డని ప్రణామముచేసెను. నిగమశర్మయుఁ జిత్రభానుని యొద్ద నుగ్రసేనునియొద్ద సెలవుఁ గైకొని పురమునకుం జనియె.

నిగమశర్మ తనసన్నిధిం బాసినదిమొదలు చిత్రభానుఁడు "సూర్యాస్తమ మెప్పుడగును? ఎప్పటికి రెండుజాములరాత్రి యగును? ఎప్పుడు దండపాణి నన్ను గలిసికొని మాటలాడు" నని తత్తరపడుచు నన్యచింత విడిచి తదేకాసక్తుఁడై గడియగడియకుం బ్రొద్దు చూచుచు నిముస మొక్కయేఁడుగాఁ గడుపఁజొచ్చెను. అట్లుండ నెట్టకేలకు సాయంకాల మయ్యె. భానుఁడు మరుఁగునకుం బోయి విశ్రమించుచుండినను జిత్రభానుఁడు విశ్రమింపక యెంతో వేగముతో భోజనముచేసి సమస్త పరిజనంబులను నియమించి కరటకపింగళులఁ గుడారపు ద్వారమున నిలిపి రుద్రభట్టసమేతుఁడై దండపాణినిమిత్త మెదురు చూచుచు నొకపీఠమునం గూరుచుండె. అపుడు రెండుజాముల రాత్రి యయ్యె. చిత్రభానుఁడు మాటిమాటికిఁ బీఠమునుండి లేచి గుడారమువెలుపలికిఁ బోయి "కరటకా! యతనిజాడ కనఁబడుట లేదా? పింగళకా! పది యడుగులు పోయి చూచిరమ్ము, రాఁడా యేమి?" యని పలుతెఱంగుల భాషించుచు సేవకుల నడుగుచుఁ జిత్తస్థిమితములేక తిరుగులాడుచుండెను. ఒకసారి రుద్రభట్టుం బిలిచి "స్వామీ! ప్రశ్న చూడుఁడు. మనతావున కతఁడు వచ్చునో రాఁడో చెప్పుఁ" డని యడిగెను. అతఁడును గ్రహచారము చూచి వ్రేళ్లు మడచి నక్షత్రములు చూచి లెక్కవెట్టి కార్య మగునని చెప్పెను. అంతలో నొక మనుష్యుఁడు తలనిండ ముసుఁగుబెట్టుకొని చేత దుడ్డుకఱ్ఱఁ బూని గుడారముసమీపమునకు వచ్చెను. ఆసందడి కనిపెట్టి పింగళకుఁడు క్రొత్తపురుషుని

డాసి "స్వామీ మీరెవ్వరు? లోనికి రాఁగోరుదురా" యని యడిగెను. నే నెవ్వఁడ నైన నీకెందుకు ? నీశక్య మగునేని నన్నుఁ జిత్రభానునికడకుం గొనిపొ" మ్మని యప్పురుషుఁడు బదులుచెప్పెను. ఆయిరువురసంభాషణము దూరమునుండివిని చిత్రభానుఁడు సత్వరముబయటికివచ్చి యప్పురుషుని సమీపించి "దండపాణీ" యని మెల్లఁగఁ బిలిచి "నేనే" యని యతఁ డుత్తరము చెప్పినతోడనే వాని నచ్చటనె బిగ్గఁ గవుంగిలించికొని చేయిపట్టుకొని లోనికిం దీసికొని పోయెను.

గుడారములో దీపపువెలుతురున రమారమి రెండుసంవత్సరములక్రిందట నెడబాసినయామిత్రు లిరువురు నొండొరుల మొగంబులఁ బరిశీలించి చూచి యానవాలుపట్టి తనివిదీర నింకొకసారి కౌఁగిలించుకొనిరి. అనంతరము చిత్రభానుఁడు దండపాణిని బీఠముపైఁ గూర్చుండబెట్టి "మిత్రమా! నీదేహస్పర్శచేత చిరకాలవియోగతాపము కూడ కొంతవఱకు దీఱినది. ఇది కడు సుదినము. మిత్రమా! నాఁడు నిన్ను నేఁబాసినది మొదలు నేఁటివఱకు నేఁదిరుగనియడవులు, దూఱనిగుహలు పడనికష్టములులేవు. ఇఁక నాకష్టములు,గట్టెక్కెననిధైర్యముగలిగినది. నిన్నుజూచుకొని నేను సోదరవియోగము మఱచుచున్నాఁడ" నని ప్రీతిపూర్వకసంభాషణంబులాడెను. దండపాణియు మిత్రునకుఁదీసిపోవక యిట్లనియె. "చెలికాఁడా! నీవులేని యీ రెండేండ్లు రెండుయుగములుగఁ గడపితిని. నాబొంది శ్రీనగరమునను నాయాత్మనీకడను నిలిపి కాలము గడపితి. నీవుకుశలివై మరల నీవిధంబున మాకనులకువిందు సేయుదువని కలనైనఁ దలంపలేదు. మిత్రుఁడా నిన్ను రెండుమూఁడు మాట లడుగవలయు నని యభిలాష గలదు. వీఁ డిట్లు సాహసించి యడుగునే యని నామీఁదఁగినుక బూనక ప్రత్యుత్తరములు చెప్పవలయు. నీవు హరిద్వారమున మృతినొందితివని హరిశర్మ యనునొక బ్రాహ్మణుఁడు హేమచంద్రునితో విన్నవించె. ఆమహారాజు నీనిమిత్త

మశ్రుజలంబులు విడుచుచునే పరలోకంబునకుంబోయెను. నీపై నసత్య మరణవార్త లెట్లుపుట్టె. మహారాజుమరణమునకు నీవె కారణుఁడ వనియు హరిశర్మప్రేరణంబున నీవో నీపనిచినహంతకులో మహారాజుం గడతేర్చి రనియు లోకులు చెప్పుకొను చున్నారు. ఇందేమైన నసత్య ముకలదా? మిత్రుఁడను నాకడ నెద్దియు దాఁచక హృదయపేటిక దెఱచియున్న దున్నట్లు పలుకుము. నేను నీవాఁడనె కాని యన్యుఁడ గాను. మిత్రులహృదయములు రహస్యరత్నములు దాఁచందగిన యినుపపెట్టెలు కదా!"

అనవుఁడు చిత్రభానుఁడు వచ్చియురాని నవ్వొకింత నవ్వి "ప్రియసఖా! అడిగితివి గానఁ జెప్పెద వినుము. నేను హరిద్వారము వద్ద మృతినొందితి నని ప్రవాదము పుట్టించినవాఁడు మణివర్మ. మా యన్నగారి మనస్సు గలఁచి యా ధర్మస్వరూపుని జంపించిన వాఁడు మణివర్మ మాయన్నతోఁ జెప్పరాని కొండెములు చెప్పి న న్నీపీటి నుండి వెడల నడచిన వాఁడు మణివర్మ. మా కులవృక్ష నిర్మూలనము జేయుపురుగు మణివర్మ. మాకుఁ బ్రక్కలోఁ బాము మణివర్మ. వానిని నమ్మి మాయన్న మరణము దెచ్చుకొనియె. మానదినెయే నాసోదరునితో నామీఁద బలుకొండెములు చెప్పి నాకింతపాటు గలి గించిన దని నే నిన్నినాళ్లుఁ దలంచు చుంటిఁ గాని యరసిచూడ మణివర్మయే దీనికిం బ్రధానకారణ మని యిప్పుడెఱింగితిని."

"నిన్ను దేశమునుండి వెడలనడచి మహారాజును జంపించిన మణివర్మ కేమిలాభ"మని దండపాణి వానిసంభాషణమునడుమ నాపి యడిగెను. అడుగుటయుఁ జిత్రభానుఁడు "దండపాణీ! లోకవ్యవహార విదుఁడ వగు నీ కిది తెలియకపోయెనా? రాజుం జంపించినచో రాజ కుమారులు బాలురు గావున వారిపేరుపెట్టి తానే కాశ్మీరరాజ్య మంతయు నేలవచ్చు. నే నిక్కడనే యుండిన పక్షమున రాజుం జంపించి

నను వానికి లాభముండదుకదా! విక్రమసేనుఁడు పెద్దవాఁడయి రాజ్య
భారము వూనిన వానిం దనచేతికీలుబొమ్మవలె నాడింపవచ్చు. మం
త్రులు రాజులయెడలఁ జేయుచుండఁగను లెన్నియో కలవు. రాజకుటుంబ
మును నాశనము చేసి కాశ్మీరసింహాసన మెక్కవలయు నని మణివర్మ
మనసారఁ దలపోయుచున్నట్లు నేనిచట నున్నపుడే వినియుంటి. పలు
మాఱులు నేనీమాట మాయన్న కెఱిఁగింపఁ దలఁచితి గాని మాకిరువురకు
మనస్పర్థలుండుటచే నది నాపన్నుగడగా నెంచునే కాని యతఁడు సత్య
ముగా గ్రహింపఁడని యూరకుంటి. మణివర్మయు హరిశర్మయుఁ దొడ్డ
దొంగలు. ఆశర్మవర్మలిరువురుం గలిసి యీదుష్కార్య మొనర్చిరి" అను
చుండ దండపాణి మరల వానిమాట కడ్డమువచ్చి "మిత్త్రుఁడా! హరి
శర్మ మణివర్మప్రేరణంబుననె యీఘోరకృత్యము చేసియుండునేని హ
రిశర్మకు నీయం దిష్టముండదు కదా! అతఁడు నిన్నుఁ గూర్చి యెంత
యువిచారించె. నీయందు పక్షముపూని నీకు సాయము చేయు మని
నన్నుం బురికొల్పె. నీయాత్మచేత నతఁడు మాటలాడించె. మణివర్మ
కాప్తుఁడైనవాఁడు నీయెడ నిట్లు మైత్రి జూపుటకుఁ గారణమేమి" యని
యడిగెను. అతనిహృదయమున గాటముగ నాటినయీసందేహముం
దీర్పఁ జిత్రభానుఁ డిట్లనియె. "ఓయి వెఱ్ఱివాఁడా నేను బ్రదికియుం
డగాఁ జచ్చితినని బొంకి నాయాత్మచేత మాటలాడించెనని డంబ
ములుకొట్టినవాఁడు దొంగగాక మునియగునే. మాయోపాయములు
పన్ని నిన్నత్తెఱంగున మోసపుచ్చె. వాఁడు నాదెసనను రాగము జూ
పుటయు మణివర్మపన్నిన పన్నుగడయే. నీవును నేనును బాల్యస్నేహి
తుల మగుటచే నామీఁద నీకెంతయనురాగమున్నదో పరీక్షించుటకు
మణివర్మ హరిశర్మచేత నట్టిపలుకులు పలికించి యుండవచ్చు. వాని
పలుకులకు మోసపోయి నీవు నాపైఁగలయనురాగము బ్రకటించి
తివి కాఁబోలు. మీమంత్రి నీమీఁద నొకకన్ను వేసెనే -ము ను.

అద్భుత మగునావృత్తాంతము నాకర్ణించి దండపాణి మొట్ట మొదట నది నమ్మజాలక వెనుక తనయెదుటం జరిగినవిషయముల జ్ఞప్తికిం దెచ్చుకొని చిత్రభానునిమాటలను వానితోం బోల్చి చూచుకొని యొట్టకేలకు దనమిత్రునిమాటలే తన కెక్కుడువిశ్వాసము గలిగింపం గొండొకసేపటికిట్లనియె. "చెలికాండా! ఇంతకాలము నేను హేమచంద్రుని నీవ కడతేర్చితివని దురభిప్రాయము పడియుంటి. ఇప్పుడది నామనంబుననుండి తొలంగె. నీవు చెప్పినది నిజము మణివర్మ నన్ను సరిగా నమ్ముటలేదు. నామీంద వాని కేదో యనుమాన మున్నది. నేను నీవాండనె. నిన్నటిసభలో రాజునెదుట మణివర్మ నిన్ను చేసిన నింద లిన్ని యన్ని యని చెప్పంజాలము. అధికారగర్వముచేత వాండు మిక్కిలివిఱ్ఱవీంగు చున్నాండు. మనమిరువురముం గలిసి వాని గర్వ మడంప వలయును. నేను నీవిచ్చట నుండునట్లు జాగ్రత్త పెట్టెద" నని యూరకుండుటయు నంతవఱ కేమియుం బలుకక మౌనముద్ర వహించినరుద్రభట్టు లేచి "మీస్నేహబంధ మంతకంతకు దృఢ మగుగాక! మీయిరువురమనోరథములు సఫలముగుంగాక! భక్తవత్సలుండు పరమేశ్వరుండు మీకుం దోడ్పడుంగాక" యని యాయిద్దఱకుడిచేతులం బట్టుకొని యొకరిచేతిలో నొకరిచేయి వేయించి రహస్యములు వెలిపుచ్చకుండున ట్లొండొరులనిమిత్తము ప్రాణము లయిన విడుచునట్లు వారిచేం బ్రమాణములు చేయించెను.

అట్లిరువురును శపథములు గైకొన్న పిదప దండపాణి చిత్రభానునివంకం జూచి "సఖుండా! నేను వచ్చినప్పటినుండి ని న్నడుగం దలంచు చున్నాండను. శరీరము దాల్చిన బ్రహ్మతేజ మట్లున్న యీ మహాత్ముం డెవ్వండు. పోలిచిచూడ హరిశర్మ మొగము నీయన మొగము నొక్కలాగుననున్నది. మనుష్యులం బోలిన మనుష్యు లుండకపోదురా ఈతం డతండు గాండని తలంచెద. ఈయన యెవ్వరో నాకెఱింగింప

వలయు నని యడిగెను. చిత్రభానుఁడు "మిత్రుఁడా! ఈతఁడు మనకుఁ బరమాప్తుఁడు బ్రాహ్మణుఁ"డని వానికి బదులు చెప్పె. అంతలో రుద్రభట్టు దండపాణినిజూచి "నాయనా! నేను హరిశర్మను గాను కాని నాకును హరిశర్మకును ముఖలక్షణంబుల నేల పోలిక కలదో కాలాంతరంబున మీకు నే నెఱింగించెద"నని పలికి విరమించెను. అంతట జాముకోడి కూయుటచే దండపాణి సత్వరముఁ బో వలయు నని చిత్రభానుని వీడ్కొని యెప్పటియట్లు ముసుఁగు బెట్టుకొని స్వగృహమునకుఁ జనియె.



ముప్పదిమూఁడవ ప్రకరణము.

చిత్రభానుఁడు మరునాఁ డంతిపురమునకువచ్చునని యరవిందాదేవి నిగమశర్మవలన విని వాని నెదుర్కొని సంభావించుటకుఁ బ్రవేశము నడపుటకు మణివర్మను రమ్మని యాహ్వాన మంపెను. ఆ యాహ్వానమువిని మణివర్మ తనరాణి కీక్రిందిసందేశ మంపెను. "అమ్మా మీరు నిప్పులం జొరఁబడు మన్నఁ జొచ్చెద. ఏట దిగు మన్న దిగెద. విసము ద్రావుమన్నఁ ద్రావెద. కాని చిత్రభాను నెదుర్కొని సంభావింపఁజాల. నేను జీవించి యుండగాఁ జిత్రభానుఁడు మరల బురప్రవేశము జేసినాఁ డన్న యపకీర్తియే నాకుఁజాలు. కావున నన్ను క్షమియించి యీకార్యమునకు నొరుల నియోగింపవలయు."

ఆసందేశమువిని యరవిందాదేవి సందిగ్ధమనస్కయై సత్వరము మాధవసేనుని రప్పించి మణివర్మ పంపినసందేశ మెఱిఁగించి వెండియు నిట్లనియె. "ఆర్యా! చిత్రభానునిరాకకు నే ననుమతించుట మొగమోటముచేతఁగాని ప్రేమచేతఁగాదు. అది నీవు నెఱుంగుదువు. మణివర్మకీ కార్యం బెంత యనిష్టముగా నుండు నని నే ననుకొనలేదు. ఇప్పుడు కర్తవ్య మేమి? రావలదని చిత్రభానునకు వర్తమాన మంపుదునా? మొదట రమ్మని పిదప వద్దనుట వెనుకటి క్రోధాగ్నిని నేయి వోసి మంటచేయుట. పండుకొన్న త్రాఁచును లేవఁగొట్టుట. కావున జేయఁదగు దానినుపదేశింపుము." అనవుఁడు మాధవసేనుఁ డించుకవిచారించి "తల్లీ! మొదట వానిరాక కనుమతి నియ్యనే కూడదు. ఇచ్చినపిదప వెనుదీయఁగూడదు. ప్రవేశంబు నేనడిపెద. కానున్నదికాక మానదు కదా" యనిపలికి యామెచేత ననుజ్ఞాతుఁడై వాని ప్రవేశంబునకుఁ గావలసినయత్నంబుచేసి గృహమునకుఁజనియె.

అట్లు దండపాణి గుడారము విడిచి చనునప్పటికి జాము రాత్రి మాత్రమే యుండుటచేఁ జిత్రభానుఁడట మీఁద నిద్రపోక మిగిలిన కాలము రుద్రభట్టుతోఁ బ్రసంగించుచుఁ గడపెను. అంతలోఁ దెల్ల వాఱుటయు నా రాజకుమారుఁడు సమయకృత్యముల నిర్వర్తించి స్నానముజేసి సంధ్యావందనము గావించి పార్థివలింగపూజ యొనర్చి రుద్రభట్టుపాదములకు నమస్కరించి దీవనలు వడసి పయనమయ్యెను. అంతలో నిగమశర్మకోటనుండి యొక్క రథము దోలించుకొని చిత్రభానుని నెలవునకుం జని యయ్యరదమధిష్ఠించి రాజమందిరమునకు రా నోపునని యా రాజకుమారుని బ్రార్థించెను. చిత్రభానుఁడు వల్లెయని తేరునెక్కి నిగమశర్మ సమేతుఁడై పురముఁ బ్రవేశించెను. ప్రవేశించుటయుఁ బురజనంబులు వానిం జూచి విస్మితులై వాని రాక యశుభ సూచకమని భావించిరి. పురాంగనలు కొందరు రథము మీఁదఁ బోవు వారి నామధేయములు పురుషుల నడిగి తెలిసికొని యసంతుష్టులై "యమ్మక్కా! యిదియేమమ్మా రాజకుటుంబము నిప్పులోడిలోఁ గట్టుకొన్నట్టు మరల నీయువరాజహాతకునిఁ దెచ్చిపెట్టుకొనియె. వాని మొగములో నున్న గూరభావమును వెలిపుచ్చుచున్నట్లు భయంకరముగ నున్నది. వాని కన్బొమలు వాని మనోమాలిన్యమును దేటపఱచునట్లున్నయవి. కటకటా! రాజకుమారులేమి కానున్నవారో కదా యని తమలోఁ దారు చెప్పుకొనసాగిరి. అంతఁ గొంతసేపటికి రథము కోట సమీపమునకుఁ బోవుటయు నిగమశర్మయుఁ జిత్రభానుఁడు గ్రిందికిం దిగి సింహద్వారము వైపు నడచిరి. రథావతరణంబు జేసిన యా రాజకుమారుని గని యదివఱకే వాని నిమిత్త మక్కడ నరవిందాదేవి శాసనంబున వేచియున్న మాధవసేనుఁడు దండపాణి వజ్రపాణి వాని కెదురు గాబోయి సమ్మానించిరి. చిత్రభానునకు స్వాగతమని మాధవసేనుఁడు పలికెను. 'యువరాజున కనంతాభ్యుదయములు గలుగుఁ గాక

యని దండపాణి వచియించె. మీరాయాగమనము శుభారంభమగుగాక యని దండపాణి నుడివెను. అనవుడు "లోకైకపూజ్యయగుమావదినె పలుతలంపులచేత నాకుమరల మిమ్ముందఱ సందర్శించుమహాభాగ్య మబ్బె" నని చిత్రభానుఁడు పలికి వారు ముందునడువ సింహద్వారము దాఁటి లోనికిం జనిరి. చని కొన్నియడుగులునడచి తన నడచుదారి కిరుగెలంకులఁ బారఁజూచి పూర్వస్మృతి గలిగి మాధవసేనుని జూచి జాలిగదురనిట్లనియె అయ్యో! ఈకోటం జొరకమునుపు నేనెప్పుడు కోటలో తెక్కలు గట్టుకొని వాలిలుదునాయనియువ్విళులూరుచుంటి గాని ప్రవేశించినదిమొదలు నాకద్దుగైనసాగుటలేదు. ఏమిచెప్పుదు నాయవస్థ. కోటగుమ్మము దాటినతోడనే నామనస్సునకు మాయన్న హేమచంద్రమహారాజుమాట జ్ఞప్తికి వచ్చెను. ఈమొగసాలలు నీలా యములు నీయేనుంగుసాలలు నీసైనికనివేశములు నీపసులకొట్టములు మొదలగు సమస్తప్రదేశములు మాయన్ననే తలపునకు దెచ్చు చున్నవి. చెంపలం గొలువసగిన వెడఁదకన్నులతోడను నిరంతరమగు చిఱునవ్వుతోడను విశాలమగు ఫాలముతోడను నేనుఁగుదంతపుంబలక లవంటి చెక్కులతోడను త్రిలోకసుందరమగు నాతనిముఖమండలము పోతబోసిన బంగారు విగ్రహమువంటి వాని యాకారము నాకిప్పుడు కన్నుల గట్టినట్లగపడు చున్నది. ఇవిచూచినప్పుడె నామనస్సెంత దుఃఖానలంబున మరుగుచుండ నాయన్నబిడ్డలనువదినెను జూచినప్పుడు దుఃఖమును నేనెట్లుభరింపజాలుదునో తెలియకున్నాఁడ.

అని రెండునేత్రములనుండి జారిన బాష్పబిందువులనుదనయుత్త రీయాంచలమునఁదుడుచుకొనిమాధవసేనునిమీఁద జేయివైచి మెల్లగ నడచుచుండె. మాధవసేనుఁడు వాని దుఃఖమునుజూచి యది నిజ మయినమనఃపరితాపమని నమ్మక తనలో నీవెంతకయిన సాహసుఁ డవురా, చేతులార నతిఘోరములు చేయుటకుఁగల్లబొల్లియేడ్పులేడ్చు

టకు నీవే తగుదు వని యనుకొని ప్రకాశముగా మృతినొందినవాని
కొఱకు విచారించుట పగిలిపోయినకుండకొఱకు వగచుట కావున
నూరకుండు మని సమాశ్వాసించెను. సోదరస్నేహ మెంతకుఁజాల
దని దండపాణి పలికెను. దుఃఖితుని మనస్సు దుఃఖముఁ జేయుచుండును.
కాని పైవారి కెఱుంగనలవికాదుగదా యని వజ్రపాణి యూరడిం
చెను. అట్లుసంభాషించుచు మెల్లమెల్లనడచి యనేకకవాటంబులు
దాఁటి వారు కొలువుకూటముం జేరిరి. నిగమశర్మకథను వినినతోడనే
చిత్రభానుని బాసి యంతఃపురమునకరిగి మఱఁది వచ్చినవార్త నామె
కెరింగించి విక్రమసేనహర్షవర్ధనులను వెంటబెట్టుకొని యదివరకే
కొలువుకూటమునకు వచ్చియుండెను.

కొలువుకూటంబుజూచినతోడనే చిత్రభానుని దుఃఖవార్థి మరి
యాద నతిక్రమించి పొంగిపొరల సతము మాధవసేనునితో నిట్టులం
గునఁ జెప్పుకొని విలపించె. అయ్యో! నేనెంతో మందభాగ్యుఁడను.
మున్ను మాయన్న విదేశమునుండి వచ్చినరాయభారులు బ్రహ్మసన
మానులగు వేదవేత్తలు శేషుని ధిక్కరింపఁజాలినట్టి తనయాస్థాన
కవీంద్రులు మంత్రులు సామంతులుమిత్రులుబంధుజనులు పరివేష్టిం
చియుండఁ బేరోలగంబుండగాఁజూచినయాకన్నులతోడనేయీశూన్య
సభాభవనంబు జూడవలసె. ఈకొలువుకూటంబు కాదె శారదాదేవికి
రంగస్థలంబు. ఈ సభామండపము కాదె చతుష్షష్టి విద్యారత్నము
లకు గని. ఈ సభాభవనంబె కాదె కవిజనంబులమనోరథములు ప
టపండు శాలిక్షేత్రము. అయ్యో! యిదియెంతచిన్నవోయె. ఎంత
శోభావిహీనమయ్యెనని దుఃఖాతిశయముచే సడలనజాలక యొక్కచో
చదికిలంబడి యొక స్తంభమునకు జేరఁబడి కూర్చుండి విలపింపజొచ్చె
దండపాణియు వజ్రపాణియు వారికిరుగెలంకులఁ గూర్చుండియుతఁడు
నేలఁ బడకుండ సంరక్షింపజొచ్చిరి. మాధవసేనుఁడు వానిని విశేష

ముగా నూరడింపక "విషాదము గతజలసేతుబంధనముగదా" యని యొక్కటిరెండుసారు లనియె. అంతలో నిగమశర్మ రాజకుమారుల నిరువురం దోడ్కొని వచ్చి "యయ్యా! వీరె నీయన్నకుమారులు విక్రమసేనహర్షవర్ధనులనువారిం జూపించెను. నిగమశర్మ యట్లనిన తోడనేబాలకులిరువురు పినతండ్రిపాదములకు నమస్కరించి నిలువం బడిరి. చిత్రభానుఁడు వారిప్రణామములకు బ్రత్యుత్తరములుగ దీవనలేమియు నొసగకయే నాతండ్రులారా రండురండని తన రెండు చేతులతో వారిఁ జెరియొక హస్తమును బట్టుకొని చెరియొక తొడపై గూర్చుండబెట్టుకొని దుఃఖపూరితమనస్కుఁడై యేమియుం బలుక నోపక మొగమున గుడ్డవేసుకొని కొండొకసేపు బిట్టుగ దుఃఖించెను. అదివరకు తండ్రిమాట క్రమక్రమంబుగ మరచుచుండిన యాబాలకులు పినతండ్రిదుఃఖముచేత బితృవియోగముజ్ఞప్తికి దెచ్చుకొని వలవల యేడ్చిరి. అంతటమాధవసేనుఁడు నిగమశర్మ వారిం డాసి యిద్దరుఁ జెరియొకరిమీఁదఁ జేతులువేసి వగవవలదని కొన్ని మాటలఁజెప్పి యూరడించిరి. చిత్రభానుడంతలో దండపాణి వజ్రపాణులసమాశ్వాసవచనములం దేది యంచుకధైర్యము దెచ్చుకొని బిడ్డలంకౌగిలించుకొని యిట్లు విచారించెను నాచిన్నయన్నలారా మీరెంతమందభాగ్యులరో నేనునంతియమందభాగ్యుఁడను. తండ్రిలేక మీరు, తండ్రివంటి యగ్రసోదరుఁడు లేక నేను, యావజ్జీవము విలపించునట్లు బ్రహ్మ యనలలాటముల వ్రాసి యుండె. అంతటి సోదరుండు నావంటిమందభాగ్యునకు దక్కునా? నాదుఃఖము పరమాత్మునెఱుఁగునుఁ నేనెఱుంగుదును. నన్నాతండు ప్రమాదవశమున మనపురము వెడలనడచినను నాకు విషాదము లేదు. ఏలయన నేనెక్కడ నున్నను నాకు గొడుగులాగున మాయన్న యుండెఁ గదాయని ధైర్యముతోఁ బ్రతుకు చుంటి. ఇంకనాకు దిక్కెవ్వరు? నన్ను మాయన్న

యువ్వాలకుం దోలె నని నాకుఁ గోపము లేదు. తండ్రివెనుక తండ్రి యంతవాఁడు. నన్ను దండించుటకు గారవించుటకు నతనికి స్వాతంత్ర్యము గలదు. బిడ్డలారా! మీవంటికుమార రత్నములఁ జూచి యానందించుభాగ్య మాతనికి లేదు. నాకు సోదరుడనియే కాదు నే విచారించు చుండుట. లోకములో నంతటిగుణవంతుఁడు లేఁడు. అంతటిదయావంతుఁడు లేఁడు. అంతటిసత్యవంతుఁడు లేఁడు. మాయన్నను దారుణమరణంబు నొందించినదురాత్ము లెవ్వరో నేనెఱుంగను. వా రలందఱు తత్ఫల మొక్కరకాలములోనే యనుభవింతురు గాక! ఇట్టిబాలకులం దండ్రిలేని బిడ్డలుగఁ జేసినయాదురాత్ముల కేమి దుర్గతు లున్నవో కదా! ఎంతవిచారించిన నేమి ఫలము? మాయన్న నాకుఁ గానబడఁడు గదా! ఈబాలకులకుం దండ్రి దొరకఁడు కదా! అయ్యా నిగమశర్మ! పూజ్యురా లైనమావదినెసన్నిధికి నన్ను దోడ్కొని పొమ్ము. ఒక్కనమస్కారమామెకుం జేసి వచ్చెద. ఈయవస్థతో నున్నయాదేవిని నేఁ జూడఁజాలకున్నను దప్పునా! ఆమె నన్నుం జూడ ననుగ్రహించు నేని నే నటకు వచ్చెద" అనవుడు నిగమశర్మ మారువలుకక లేచి సత్వరము లోనికింబోయి యొక్కనిమేషమున మరలి వచ్చి దేవిం జూడవచ్చునని చిత్రభానునకుం జెప్పెను. చిత్రభానుఁడును మెల్లగ లేచి నిగమశర్మమీఁదఁ జేయి వైచి నడవ లేక నడచుచు, "అయ్యా! నేనామెవదన మెట్లు చూతును. నీలోత్పలముల వంటి యావిశాలనేత్రములు బాష్పపూరితములై యుండునుగాఁబోలు. పరమపవిత్రచరిత యగునీదేవికింతదురవస్థ కలుగుట కేమికారణమో. ఇది పూర్వజన్మకృతమై యుండ వలయు" నని విచారించుచునరవిందాదేవి యున్నగదిఁ బ్రవేశించెను. బ్రవేశించినతోడనే భర్తృవియోగ దుఃఖభారవినమ్రమై కళావిహీన మైనమొగముతోను జిక్కనగమై నగలు లేనిశరీరముతోడను బాష్పధారాపూరితములైనకన్నులతోడను

దల వంచుకొని కూర్చుండిన యాదేవి వానికిం గనఁబడియె. కనంబడు టయుఁ జిత్రభానుఁడు ముందుకు సాగి నడువఁజాలక యచటనే చదికిలంబడి "హాతల్లీ కాశ్మీరరాజ్యలక్ష్మీ! హా పరమపవిత్రచరిత్ర! హా లోకైకపూజ్య! నీ కెంతదురవస్థ ప్రాప్తించె. నాకన్న లెంతపాపము జేసికొనిరొ. ఓమాలదైవమా! నీవు దయాశూన్యుఁడ వనుమాటనేఁడు స్పష్టమైన" దని కొంత వగచి యొకనిమేష మూరకుండి మరల నిట్లనియె. "తల్లీ! మాయన్ననిమిత్తము నీ వెంత కుందుచుంటివో నేనును నంతియె కుందుచుంటి. నన్నుఁ గూర్చి కిట్లని వాండ్రు చెప్పినపలుకులు నీవు పాటింపవలదు. నీకు మువ్వురు కొమారు లున్నవా రనుకొనుము. అందు జ్యేష్ఠుఁడు చిత్రభానుఁడు. తక్కిన వారువిక్రమసేనహర్షవర్ధనులు. నేను నీతో డికోడ లిందుమణియు నీగారాబుకూఁతురు కర్పూరమంజరియు నాకొడుకు విజయసేనుఁడు ని మ్మొంటిఁ జూచి పోవలయు నని సంకల్పించుకొంటిమి. మగవాఁడ నగుటచేనే నించుకధైర్యముఁబూనియుంటిఁ గాని నీచెలియలుం గూఁతురు పట్టశక్యముగాక యున్నవారు. ఎప్పుడు వచ్చి యిక్కడ వ్రాలగలుగుదుమా యని వారు మిక్కిలి తత్తరపడు చున్నవారు. వారి నిక్కడికి రప్పించుటయు వారు వచ్చు వఱకు నేనిందుండుటయు మీ కిష్టమగు నేని యట్లు చేసెద. కాదేని యీక్షణంబ పోవువాఁడ నన్నుగురించి మీరును లోకము నె ట్లను కొన్నను నాయన్న బిడ్డలవిషయమున నాకుం గలప్రేమ దైవమెఱుంగును. ప్రేగుసంబంధము పోవున్నన్నఁ బోవునా సోదరునిమరణవార్త వినినది మొదలు బాలకు లిద్దఱే మైరో యని నాపడిన పరితాప మింతింత కాదు. నన్నుఁగూర్చి నేఁజెప్పుకొనుట భావ్యము గాదు. ఇప్పు డిక్కడ నాయునికిచేత మీకు నావేదన మతిశయమగునట్లుతోఁచుచున్నది ప్రస్తుతము నేను సెలవు గైకొని మరల దర్శనము చేయువాఁడ" నని లేచి దూరమునుండియే చేతులు జోడించి యామెకు నమస్కరించి గది విడిచి యావలకుఁ బోయెను.

అరవిందాదేవి చిత్రభానుఁడు వచ్చినదిమొదలు గది విడుచువఱకు వంచినతల యెత్తక మొగమునఁ జేయిపెట్టుకొని ప్రవాహములై పాఱుకన్నీళ్ళు తుడుచుకొనక మఱిదిమాటలకు బ్రత్యుత్తరము చెప్పక యొక్కమచ్చుననే విలపించెను. చిత్రభానుఁ డీవలకు వచ్చి యన్నకుమారులను మరలఁ గౌఁగిలించుకొని ముద్దుపెట్టుకొని మాధవసేనప్రముఖులను వీడ్కొని మున్నెక్కినయరదము నెక్కి తనబిడారమునకుఁ బోయెను.



ముప్పదినాలుగవప్రకరణము.

చిత్రభానుఁడు కోటవిడిచి పోయినతోడనే మాధవసేనుఁడు ప్రధానమంత్రి యగుమణివర్మకు యువరాజసందర్శనమునుగూర్చి తెలియఁజేయుటకుఁ వానిగృహమునకుఁ బోయెను. మణివర్మవానిని సత్కరించి యువరాజు రథముడిగి కోటలోఁ బ్రవేశించినది మొదలు కోట విడుచువఱకుఁ జరిగినవృత్తాంత మంతయుఁ బూసగుచ్చినట్లు చెప్పుమని మాధవసేను నడిగెను. మాధవసేనుఁడు తూచ తప్పకుండ నావృత్తాంతము సవిస్తరముగా నెఱింగించి పిదప నిట్లనియె. ఇందుముఖ్యముగా మనమాలోచింపవలసినయంశములు మూఁడునాల్గున్నవి. తన యన్న నెవ్వరో చంపి రఁట. ఆదురాత్ములు తత్ఫల మచిరకాలమున ననుభవింతురఁట. తనయాలుబిడ్డలు దేవిఁజూడవత్తురఁట. వారు వచ్చునఱకు దానిక్కడ నుండు నఁట. అన్నబిడ్డలమీఁద తనకుం బ్రేమ హెచ్చున్నం గోదఁట. సోదరమరణవార్త చెవి సోఁకటాదిగాబాలకు లెట్లుబ్రతుకుదురో యని తనకు మిక్కుటం బగుమనఃపరితాపము గలిగెనఁట. పూర్వోత్తరసందర్భలములంబట్టి యీమాట లరసిచూడ నీతని కేదో దుస్సంకల్ప మున్నట్లు తోఁచు చున్నది. మిత్రమా నీవు చూడ లేదు కాని వానికల్లబొల్లిదుఃఖములు వానిదుర్వినయములు వాని తియ్యమాటలు విన్నవారు వాఁడు నిర్దోషి యని తలంపకపోరు. నాట[illegible]దు వేషగాఁడు తనపాత్రమును జక్కఁగాఁ బ్రయోగించుట కభ్యసించినట్లు యీకటిలుఁడుగూడ నెంతోనటన చేసెను. దీనికిన్ను [illegible] ప్రతిక్రియ యేమి? యని పలుకుటయు మణివర్మ యాతనిమాట ల[illegible] "దేవ యాతని మాటల కేమిప్రత్యుత్తరమిచ్చిన" దని [illegible]. "[illegible] దేవి కన్నీరు విడిచెనే కాని మఱి [illegible] లేదు. వానిపలుకులకు బదులుచెప్ప లేదు.వాని నంటు

మన లేదు. వెళ్లు మన లేదు. ఉండఁగలిగినంతసే పచ్చట నతఁడుండి మరలివచ్చునట్లు చెప్పిపోయె" నని మాధవసేనుఁడు ప్రత్యుత్తర మిచ్చెను.

అది విని మణివర్మ తలయెత్తి మీఁదికిం జూచి యించుక యాలోచించి,మిత్రుఁడామనగనిఁజంపిమొగసాలకుఁబోయి మొరలెత్తిన దన్నమాట నేఁటికినిజమగును. భ్రాతృద్రోహియైనయీదురాత్ముఁడు తనయన్నమరణ మితరుల కెవ్వరికో యారోపింపఁ దలఁచు చున్నాఁ డని నే నూహించెద. ఆలుబిడ్డల నిప్పటికిఁ బిలిపింపఁ దలంచుట నీయూర నతఁడు నివాసము చేయఁదలఁచుటయే.ఇది యాతనిభవిష్యచ్చరిత్రమునకుపోద్ఘాతము. బిడ్డలయెడ ననురాగము జూపుటయువారి సేమము గోరిన ట్లభినయించుటయు మనపై నాతఁడు స్వకపోలకల్పితముగారచియింపఁబూనినసింహానాటకమునకుఁ బ్రస్తావన. మన మేమయినను నాకు విచారము లేదు కాని వీఁడు తనకుటిలోపాయము లను వలలోఁ జగిలించి దేవిని రాజపుత్రిలను నేమి సేయునో యని విచారించు చున్నవాఁడ. రాజు యుక్తవయస్కుఁడు కాని బాలుఁ డగుట చేతను సంరక్షణ చేయునది కౌటిల్య మెఱుఁగనిశుద్ధస్ఫటికమువంటి యాఁడు దగుటచేతను బ్రతిక్రియ తగినట్లు చేయ వీలు లేదు. ఇది యిట్టి దని చెప్పుటకు వీలు లేదు. చెప్పకపోవుటకు వీలులేదు. చెప్పుట తప్పు; చెప్పకుండుట ముప్పు. ఏమైనంగానిమ్ము. కార్యభారముమనతల పైనున్నది. కావున మనము హితోపదేశము జేయకపోవుట తప్పు. ఈవఱకే చెప్పవలసిన దంతయుమనమామెతోఁ జెప్పినారము. చర్విత చర్వణ మైనను సరే నీవు పోయి దేవింగాంచి మఱఁదిని శ్రీనగరము నుండి సాగందోలుటకు మన కనుమతినిమ్మని వేఁడుము. చిత్రభానుఁడు ప్రకటశత్రుఁడై చేయఁదలఁచిన ఘాతలు సంపూర్ణముగఁ జేయ లేక

మిత్రవేషమున వచ్చినాఁడని చెప్పుము. భయమునఁ బాలు త్రాగిం
పఁజాలము కాని వేఁడుకొని విసముద్రావింపవచ్చుననుసామెత సార్థక
మగు ననుము. తనయాజ్ఞ యగు నేని కార్యము మించకుండ వానిని
సాగఁదోలఁ గలమనుము. దూర మాలోచింపు మనుము. పై మెఱుం
గులచేత మోసపోవల దనుము. కుమారుల సేమము జూచుకొమ్మనుము
మిత్రు లెవ్వరో శత్రు లెవ్వరో చక్కగా నరయుటకు సమయ మిదే
యనుము. సత్వరంబ చను" మని పలికి పీఠమునుండి తానులేచి తత్క్ష
ణము మాధవసేనని రాజమందిరమునకుఁ బంపెను. అట్లు మాధవసే
నునిం బంపి యెప్పటికిని మనస్స్థిమితములేక మణివర్మ తనమాటలకు
దేవి యేమనునో యనియుఁ గార్యసరణి కత్తియంచు మీఁదనడకవలె
నుండుటచే నెటు పోయిన నెటువచ్చునో యనియుఁ జింతించుచు నిట్టటు
దిరుగుచు వేగముగ నడచు చున్నాఁడో లేదో యని మాధవసేనుని
పోయినదారిం జూచుచు మిక్కిలి కళవళము పడఁజొచ్చెను.

చిత్రభానుఁడు కోట విడిచి యరద మెక్కి తన నెలవునకుంజని
వికసించిన ముఖపద్మముతో సంతుష్టమైనహృదయముతో గుడారముఁ
బ్రవేశించెను. రుద్రభట్టు వానియాగమనము నిరీక్షించుచు నతనిం
జూచినతోడనే "మిత్రుఁడా! ప్రథమదర్శనము మంగళముగాఁబరిణ
మించెనా! విశేషము లెవ్వియును లేవుగదా! విలాసవంత మైననీము
ఖవైఖరియే కార్యపద్ధతికి వ్యాఖ్యానమై యున్నది సుమీ!" యని
యెదురుగా వచ్చి బహూకరించెను. హితాభిలాషి యైనయాబ్రాహ్మ
ణునిపలుకులు విని చిత్రభానుఁడు "దేవా! మీయాశీర్వచనమునఁ
బ్రథమసందర్శనము శుభోదర్కముగా నున్నది. మనతలపెట్టినకార్య
మింక నిర్విఘ్నముగ సాగునని శుభసూచనలు కానఁగట్టుచున్నవి" యని
పలికి తాను గుడారమువిడిచి మరల జొచ్చువఱకు జరిగినయావద్వృ
త్తాంతము వాని కెఱిఁగించెను. ఆవృత్తాంతము విని రుద్రభట్టు మిక్కి

లినంతసించి చిత్రభానునిబహూకరించి "మిత్రమా! మనముతిరుచుగా దండపాణిం గలిసికొను చుండవలయును. కలిగినఁగార్యసిద్ధి వానివలన నే కలుగవలయు" నని యుపదేశింప "నిజము నిజము. మీరు చెప్ప గాఁ బలికినారు. అతఁడు తలంచిన సంతసకరమైన నగు" నని చిత్రభానుఁడుచెప్పి పిదప భోజనప్రయత్నము చేసెను.

మణివర్మ మితిమీఱిన యుత్తలపాటుతోఁ దన మేడమీఁదఁ బిచ్చివాఁడువోలె తిరుగుచు మాటిమాటికిమాధవసేనుఁడు వచ్చుచుండె నేమోయని వీథివంకఁజూచుచుఁ గొంతసేపుగడపునప్పటికి మాధవసేనుఁడు రెండుమూడుసారు లిట్టటుం దిరుగుటచేతఁ గడు డస్సినమేనితో నస్సురస్సు రని యూరూసపడుచు వచ్చి మేడయెక్కి మణివర్మను సమీపించెను. మణివర్మ మిక్కిలియాత్రముతో "దేవి యేమన్నది దేవియేమన్న" దని యడిగెను. మాధవసేనుఁడు బిక్కమొగముపెట్టి "మిత్రమా! నిరర్థకము లగుసంభాషణలు చెప్పక సారాంశములఁ జెప్పెద వినుము. దేవి దోఁడికోడలిని గర్పూరమంజరిని జూచునుబలాటము పడుచున్నది. అంతవఱకు మఱి యిచ్చటనే యుండునాఁడఁట. అనంతరము వానిని వెడలగొట్టుటకు మనకు సర్వస్వాతంత్ర్యమిచ్చునఁట. ఇదియే జరిగిన కార్యనిశ్చయ" మని యెఱిఁగించెను. అప్పలుకలు విని మణివర్మ కార్యసరణి చక్కఁజేయు నశించి యసఫలుగంటిన వని దేవి మూఢత్వమునకు వగచి మూఁడుఁదలఁచినయాపదలు దలంచి భయపడి యిట్లనియె. "వినాశకాలే విపరీతబుద్ధి" యనువాక్యము 'స్త్రీబుద్ధిః ప్రళయాంతకః' అను లోకోక్తినేఁడు సార్థకములైనవి. మనము దైవముమీఁద భారమువైచి యూరకుండవలసినదే.

సమాప్తము.



కర్పూరమంజరి

ద్వితీయ భాగము

శ్రీరస్తు.

కర్పూరమంజరి—ద్వితీయభాగము

మొదటి ప్రకరణము.

"సఖీ! కర్పూరమంజరీ! మహారణ్య మతిక్రమించి బయలుగా నున్నభూమికి మనము వచ్చుటచే సంధ్యాసౌందర్యముం జూడఁగలిగితిమి. చూడు! చూడు! దాని రమణీయకము వర్ణనాతీతమై యున్నది. తన ప్రభావముచేఁ బగలు గలిగించి యసాధారణతేజంబున జగమెల్ల నాక్రమించి భువనంబులు సంతాపింపఁజేసి యెట్టకేలకుఁ గాలవశమున నిజతేజముం గోల్పడి పగతులచేఁ బరాజితుఁడై కాయమునుండి క్రొన్నెత్తురులు దొఱఁగ నస్తమించుమహావీరుఁడుంబోలె భాస్కరుఁడు పడమటికొండలోఁ గుంకుచున్నాఁడు. ఎంతలెంతలకైన నీయవస్థ తప్పదుకదా". అని మల్లిక పలుకుటయుఁ గర్పూరమంజరి యిట్లనియె. "మల్లికా! ఈసూర్యాస్తమయసమయము నాకు మఱియొకలాగుఁ దోచుచున్నది. చూడు! పరమేశ్వరనిర్మితమైనజగన్నాటకమున కీ సంధ్యాసమయము ప్రస్తావనవలెఁ గనఁబడుచున్నది. కాలపురుషుం డను సూత్రధారుఁడు బిలువ రాగమనియెడుకుసుంభారుణచేలముఁ గట్టి కట్టెఱ్ఱనైనభానుబింబమను కాశ్మీరతిలకంబు వెట్టి సంధ్య యను నటి ప్రవేశించి రాఁగలనిశానాటకమును సూచించుచున్నది. పులుఁగుల యెలుంగు నటిసేయుగానమువలె వినఁబడుచున్నది. అదే ప్రభాకరుఁ డస్తమించినాఁడు. ఇఁక నిశానాటకప్రథమరంగమును మనము దర్శింపఁగలము. అల్లదే! కథానాయకుఁడైనరాజు చంద్రుఁ డుదయించుచున్నాఁడు. చూడు! ఆకాశం బను నింద్రనీలమణిమయం బయినగద్దియ నాతఁ డెక్కినాఁడు. నిగనిగలాడు నాగద్దియపైఁ జెక్కినవజ్రంబులట్లు

లెక్కకుమీఱినచుక్కలు మెఱయుచున్నవి. ఈతఁడు చల్లనిరాజయ్యు మహాతేజశ్శాలి యై సహజశత్రు వైనయంధకారమును బటాపంచలుగఁ దోలియున్నాఁడు" అని కర్పూరమంజరి ప్రత్యుత్తర మీయ మల్లిక "సఖీ! నీయూహ సరసముగా నున్నది. కాని యిది విను. ఈనిశాసౌందర్యము నాకు మఱియొకలాగు కనఁబడుచున్నది. గగనలక్ష్మిషోడశకళాపరిపూర్ణ మైనచంద్రమండలము నెమ్మొగముగా నందలికళంకము కస్తూరితిలకంబుగా నీలనీలం బగునాకసంబు కొప్పుగాఁ జుక్కలు కొప్పునం దుఱిమినమల్లెపూవులుగా నలుగడల నలముకొను తేటవెన్నెలలు నవ్వులుగాఁ హాయలు గులుక జగన్మోహనంబగు నాకృతిఁ దాల్చి యీసమయమున విశ్వమెట్లున్నదో చూచుటకు బయలుదేరినది. చెలీ! యీనభోలక్ష్మి యెల్లతెఱఁగుల నిన్ను బోలియున్నయది" యని పలికెను.

"సఖీ! నీవు నాపైఁ గలప్రేమచే నన్ను గగనలక్ష్మితోఁ బోల్చుచుంటివి గాని ప్రకృతి సౌందర్యమునకు నావంటిదానిపోయగ మీ దగునే? దాని కదె సాటి. చిత్రకారుఁడు బుద్ధికుశలతచేతను, హస్తనైపుణిచేతను వృక్షమునో పూవునో పండునో యొకఫలకముమీఁదఁ జిత్రించుఁ గాక! ఆయాచోటుల కనువుగా రంగులు పులుముఁగాక! ఎన్నియందములఁ దేవలయునో యన్నియందములఁ దెచ్చుఁగాక! ఎట్లయిన దేవదేవనిర్మిత మయినవృక్షమట్లు ఫలమట్లు, పువ్వట్లు చిత్తరు వుండునా?"

అని వారిరువురు ప్రకృతిసౌందర్యమును జూచి మెచ్చి యానందము నొందుచుండ నంతలోఁ జంద్రిక వచ్చి "అమ్మా! గడియరాత్రి యైనది. అమ్మగారు గుడారములోనికి రమ్మనుచున్నారు. రండు. పోదము" అని పిలిచెను. పిలుచుటయు వారిరువురు "నిదే వచ్చుచున్నార"మని గుడారములవంక కరిగిరి.

జయంతుఁడు వెంటవచ్చినపరివారమునకు బసలనిమిత్తము భోజనములనిమిత్తము దగినయేర్పాటులఁ గావించెను. చెట్లక్రింద గుడ్డములం గట్టిరి. రాజకుటుంబము దట్టమైనగుడారములలో విశ్రమించెను. ఇందుమణియుఁ, గర్పూరమంజరియు, విజయసేనుఁడును బెందలకడ భోజనము చేసిరి. అనంతరము జయంతుఁడు మొదలగు ప్రధానపురుషు లారగించిరి. పగలెల్లఁ బయనముసేయుటచే బడలికల పెంపున గుడ్డపురౌతులుఁ బదాతులు భోజనములు సత్వరము ముగించి చెట్లనీడలఁ జాఁపలు, కంబళ్ళుఁ బఱచుకొని నిమేషమాత్రముననే కనులు మూసికొని నిద్రించిరి. ప్రయాణములలో నైతము రాజకుటుంబములకు సకలసౌకర్యములు జరుగవలసి యుండెను గనుక మంచములు, పానుపులు, పల్లకులు, దీపస్తంబములు, రత్నకంబళములు, బహువిధఫలములు, నానావిధభోజనపదార్థములు వారివెంట నుండునట్లు రాజవాహనుఁ డేర్పాటు చేసెను. పరిచారికలు పానుపులు పఱువ నిందుమణియు విజయసేనుఁడును బవ్వళించి నిద్రించిరి.

పండువెన్నెలలు గాయుచుండెను. మలయమారుతతరంగములు యథేచ్ఛముగ శరీరముల సోఁకి హాయి యనిపించెను. కొన్ని పులుఁగుల మెలుఁగులు వీనులకు విందగుగానమునలె మనమున కానందముఁ గూర్చెను. నేలయంతయుఁ దెల్లదుప్పటిపఱచినట్లు గానబడెను. వెండిపూత పూసినట్లు, కప్పురపుంబొడి చల్లినట్లు, పాలగచ్చుచేసినట్లు గానఁబడెను. ఆసమయమునఁ గర్పూరమంజరి నాఁడు మకరందుఁడు తనరుగ్మతలోఁ దనకుఁ గావించిన భేషజరూపకమహోపకారముం దలఁచి యాతనియాకారమును స్మరించి యాతని మృదుమధురసంభాషణలను మందహాసములను సుందరవిలాసములను జ్ఞప్తికిం దెచ్చికొని వెండియు నతనితోడికూటమి సంప్రాప్తించుపుణ్యకాలము గలుగునా యని తలపోయుచు నిద్రపోవక యుండెను. మల్లికయు

రెండుమూఁడుసారు లామెను బలుకరించి ప్రత్యుత్తరము గానక "ఏమమ్మా ! నామాటలు వినఁబడుట లేదా ? నీమనంబు మకరందరసము నాస్వాదించిన తుమ్మెదవలె మత్తిల్లి యున్నది గాఁబోలు ! నీచెవిలో మకరందబిందువు లడ్డుపడెనేమో? కానిచో నాపిలుపు లేల వినఁబడవు ? " అని చిఱునవ్వు మొలకెత్తిన మోముతో నర్మగర్భముగాఁ బలికెను. ఆపలుకులు విని "మూర్ఖురాలా ! చమత్కారముగా మాటాడఁగలనని గర్వించి నీయిచ్చవచ్చినట్లు నన్ను దెప్పుచున్నావు. చాలు చాలు ! నోరు మూసికొనియుండుము." అని కర్పూరమంజరి సంకలించునంతలో "సందెకబళమమ్మా ! సందెకబళము. పట్టెడన్నము పెట్టుఁ డమ్మా పెట్టుఁడు" అని యొకకేక వినఁబడెను. గుడారము చుట్టుఁ గావలిగాచుచున్న సైనికులు కేక వైచిన యామెను లోపలికిఁ బోనీయక నిరోధించిరి. అది యొక్కపెట్టున మొఱవెట్టఁజొచ్చెను. కర్పూరమంజరి దాని కుయ్యాలించి మల్లికం బిలిచి "దానిమొఱ యేమో తెలిసికొని తనకడకుఁ దోడుకొనిరా" యని పంపెను. మల్లికయు గుడారము దాఁటి యావలకుఁ బోయి కావలివాండ్రకుఁ గర్పూరమంజరియాన దెలిపి యామెనం తను లోపలికిం దోడ్కొనివచ్చెను. మెడనిండ గురివెందపూసలసరములు, చేతుల గవ్వలగుత్తులకంకణములు, గలిగి కడుమాసినపాఁతబట్టగట్టి, చేత నొకకుండ దాల్చి కన్నెదుట నిల్చెను. ఆయంగనంజూచి కర్పూరమంజరి "నీ కేమి కావలయు? నీ వెవ్వతవు?" అని యడిగెను. అప్పడంతుక రాజపుత్రికం జూచి కుండ క్రిందఁబెట్టి దండముఁబెట్టి "తల్లీ ! నే నెఱుకలదానను. ఈసమీపముననే మాపల్లియ కలదు. మా కన్నవస్త్రములు లేవు. మిక్కిలి పేదవాండ్రము. ఈదారిని బోవుబాటసారులం జేరి కూఁడుగుడ్డ నడుగుకొని తెచ్చుకొనుచుందుము. ఇంటికడ నాబిడ్డ లన్నము లేక మాడుచున్నారు. గొప్పదొరలు

గుడారములువైచికొని దిగినారుగదా పట్టెడన్నము దొరుకకపోవునా యని యాసపడి వచ్చితిని. నే నెఱుక జెప్పఁగలను. కావలయునేని మీకుఁగూడఁ జెప్పఁగలను" అని విన్నవించెను. దానిదీనాలాపముల నాలించి కర్పూరమంజరి జాలి వొంది దాని కేమైన నాహార మిడుమని మల్లికతోఁ జెప్పెను. "అమ్మా! అట్లె చేసెద" నని చెప్పి మల్లిక చెంచెతం జూచి నవ్వుచు "నోసి! యెఱుక జెప్పఁగలనంటివి. మా రాజపుత్రికకు నీ వెఱుక జెప్పు" మని హెచ్చరించెను. వలదు వలదని కర్పూరమంజరి పలుకుచున్నను నయ్యెఱుకలసాని యూరకుండక చేత నొకపుల్ల బట్టుకొని క్రింద నేల రెండుమూఁడుగీట్లు గీచి యాకసమువంకఁ జూచి చేయి చాఁపుమని కర్పూరమంజరిని వేఁడి హస్తపరీక్షఁ జేసి యిట్లనియె.

భాగ్యశాలివే తల్లి! అదృష్టం గలదానవే తల్లి! చుట్టాలసుఖివే తల్లి! కొడుకులకోట నవుదువే తల్లి. నీమనసులో నున్న రాచబిడ్డఁడే నిన్నుఁ బెండ్లాడఁగలఁడె తల్లి! దాపున నున్నాఁడె తల్లి! దగ్గఱ నున్నాఁడె తల్లి! నీపంట పండునే తల్లి! సిరి నీకన్నుల గాఁపురమున్నదే తల్లి! వరాలబొజ్జవే తల్లి! నీదొరను గలసినప్పుడు నన్ను మఱచిపోకు తల్లి! ఒక పాఁతచీర యియ్యవే తల్లి!" అని యెఱుక చెప్పుటయుఁ గర్పూరమంజరి ముసిముసినవ్వులు నవ్వి "దానినోటికి వచ్చినట్లు ప్రేలినది. ఈచెంచుపడఁతు లందఱకు నీవిధముగానే చెప్పుదురు. ఇందువిశేష మేమియు లేదు." అనిపలికి దానికిం బిల్లలకు సరిపడిన యాహారముం బెట్టించి గట్టిచీరలు రెండిచ్చి పంపెను.

మల్లికయు దానిని సాగనంపి "సఖీ! దాఁపుననే యున్నది దగ్గఱనే యున్నది" యని చెప్పినది. అచిరకాలములోనే నీవు నీప్రియునిఁ గలిసికొందువు గాఁబోలు" నని పరిహసించెను. "చాలు చాలు. నీయెగతాళి కట్టిపెట్టు. నాకు నిద్రవచ్చుచున్నది. నా పండు

కొండ" మని రాజపుత్రిక మేను సెజ్జం జేర్చెను. మల్లికయు నామె దగ్గఱనే తనపానుపుమీఁదఁ బండుకొనెను. అందఱు గుఱ్ఱుగొట్టి నిద్రించిరి. యామికులు మాత్రము మేలుకొని కావలిగాఁచుచుండిరి. ఎడనెడ బెబ్బులులయఱపులు సింగపుఁబొబ్బలు నక్కకూఁతలు భయంకరములై వినఁబడుచు రాజపుత్రికనిద్రకుఁ గొంతభంగము గలిగింప "మకరందుఁడా! మకరందుఁడా! రక్షింపుము. రక్షింపుము" అని యొకటిరెండుసారు లామె పలువరించెను.



రెండవ ప్రకరణము.



"చంద్రచూడుఁడా! నాయనగారి యాజ్ఞాప్రకారము మనము మాళవదేశమంతయుఁ దిరిగితిమి గదా. రాజధానియగు నుజ్జయిని యతిదూరమున నుండుటచేఁ బ్రజ లంతదవ్వు నడచిపోయి తాము చేసికొనవలసినమనవిసనవులఁ బ్రభువుతోఁ సరిగాఁ జేసికొనుటకవకాశము గలిగియుండదని పాలితు లగు జనుల సుఖదుఃఖముల నారయుమని మహారాజుగారు మనలఁ బనిచినందుకుఁ బ్రజలు మిక్కిలిసంతోషభరితు లైరి. వారు నాకుఁదెలిపినయిబ్బంది లన్నియు మహారాజుగారికి విన్నవించి యచిరకాలమున వానిందొలఁగించుటకుఁ దగినప్రయత్నముఁ జేసెద. రాజాజ్ఞ సరిగా నెఱవేర్చుటచే నాతలపై భారమిప్పుడు దిగినట్లున్నది. నాహృదయమిప్పుడుచులకనైనది. కార్యవ్యగ్రతయడఁగినందున నీవెన్నెలసుఖ మనుభవించుటకు మన స్సుత్సహించుచున్నది. కాలపురుషుఁడు బ్రహ్మాండభవనమునకు వైచినవెల్లతెఱఁగునఁ గర్పూరపరాగము చల్లినభాతిని నెల్లయెడల వసుంధర తెల్లనై యొప్పె. పైతృకంబగురాజ్యంబు రెండుభాగములుచేసి సమానముగఁ బంచుకొను నన్న

దమ్ములట్లు దివాకరనిశాకరులు క్రమముగాఁ నహర్నిశలఁ బంచుకొని నైజతేజములచేఁ జగమున కుపకారము సేయుచున్నారు. ఈచల్లదనము నీవుఁగూడ ననుభవింపుము." అని మాళవేంద్రనందనుఁ డగుమకరందుఁడు వేఁడుకచెలికాఁ డగుచంద్రచూడునిఁ జూచి పలికెను. చంద్రచూడుఁడు వాని మనోభావ మెఱిఁగి మెల్లగ నిట్లనియె. "మిత్రుఁడా! నీవంటిమహారాజకుమారుఁడు సౌందర్యసుధాధవళము లగుమేడలనుండువాఁడు వనాంతరములకు వచ్చుటంజేసి వనలక్ష్మి గౌరవపురస్సరముగా నీకు స్వాగతమియ్యఁదలఁచి వెన్నెలపరిచి సున్నము బ్రహ్మాండమంతయుఁ బూయించినది. కర్పూరపరాగము జల్లినట్లు విశ్వము తెల్లనై యుండుట నిజమే! అంతేకాదు. చెట్లనున్నపూలగుత్తులు పండ్లగుత్తులు వెన్నెలకతమునఁ దెల్లనై కర్పూరమంజరులట్లు వెలయుచున్నవి." అని నర్మగర్భముగఁ బలికినఁ జంద్రచూడునిం గని మకరందుఁడు "మిత్రుఁడా! నీమాటనిజము. పుష్పఫలగుచ్ఛము లన్నియుఁ గర్పూరమంజరులట్లే, వెలయుచున్నవి. ఈగగనలక్ష్మియుఁ గర్పూరమంజరివలెనే యున్నది. ఏది చూచిన నా కాపద్మాక్షియే జ్ఞప్తికి వచ్చుచున్నది. అది లావణ్యరాశి. అంగనాకృతిఁ దాల్చిన శృంగారరసాధిదేవత; నడకలు మాటలు నేర్చినజాళువా పసిఁడిబొమ్మ. పూఁబోఁడి యనుశబ్ద మన్యకాంతలయందు నిరర్థకమే గానికర్పూరమంజరియం దది సార్థకము. పలుకుపలుకున నది యమృతమొలుకుచుండును. ఆమెనోట వెడలునవి మాటలు గావు, చెవులతుప్పాల డుల్లఁజేయుపాటలుగాని. ఆమెలోచనము పద్మగర్వనిర్మోచనము. ఎవఁడైన నొకసారి యామెంజూచిన నేత్రములు చరితార్థము లగును. పలుకులువిన్న వీనులుచేసికొన్నపాపంబు దొలంగును. మిత్రుఁడా! ఆమెం జూచి యెంతకాలమైనది! నాఁడు విదర్భాపురము బాసినదాదిగా నామనసు మనసులో లేదు. ఆత్మ నిరంతరము విదర్భలో నుండు

టచే నా దేహము జీవములేనిగాజుకుప్పివలె నుజ్జయినిలో నున్నది. మరలఁ గన్నులకఱవుదీఱ నావన్నెలదీవినిఁ జూడఁగల్గుదునే? ఆమె యే రాజనందనుని జెట్టఁబట్టనున్నదో? ఆమె కరస్పర్శనంబున నేరాజుహస్తము ధన్యతనొందునో. ఓహో! నామాటలు పిచ్చివానిపలుకులట్లు నీవు గ్రహించుచున్నావు కాఁబోలు! ఆసుందరీప్రసంగ మిప్పు డప్రస్తుతమై నీకు విసుగుగలిగింపవచ్చును. కావున విరమించెదనులే" అని పలికి నిట్టూర్పు విడిచి యూరకుండెను.

అప్పుడు చంద్రవాహుఁడు "మిత్రుఁడా! నాకనురెప్పలమీఁద నిద్రాదేవి యెంతకాలమైనది నిలిచియున్నట్లవి యెంతో బరువుగా నున్నవి. అతిప్రయత్నమునఁ గాని రెప్పలు లేచుట లేదు. నేనునీమాటలు వినుచుండియే నిద్రపోవుచున్నాను. నేను కలగనుచున్నానో నీతో మాటాడుచున్నానో సరిగాఁ జెప్పఁజాలను. ప్రపంచమంతయు నీకు కర్పూరమంజరీమయమై యున్నది. కొంతతడవు నన్నుఁగూడ నీవు కర్పూరమంజరిఁగా భావించి చెక్కిలి గాయమగునట్లు గట్టిగాముద్దు పెట్టుకొందువేమోయని భయముగా నున్నది. ప్రేమ వెఱ్ఱి యెత్తిన వారు కేవలము పిచ్చివాండ్రు, సమానులు" అని చంద్రవాహుఁ డింక నేమో చెప్పఁబోవుచుండ సంతలో నొకమూలనుండి "పొడువుఁడు. తఱుముఁడు. పట్టుఁడు. పట్టుఁడు. అయ్యో! రక్షింపుఁడు. రక్షింపుఁడు" అనునార్తనాదము వినఁబడెను. అందులో నొకటిరెండు స్త్రీకంఠములు వినఁబడెను. చంద్రవాహుఁ డులికిపడి లేచి నిలిచెను. మకరందుఁడు పీఠము నుండి గ్రక్కున లేచి "మిత్రుఁడా! ఏదో యార్తధ్వని వినఁబడుచున్నది. అందులో స్త్రీస్వనముగూడ వినఁబడుచున్నది ఏదీ ఖడ్గము. ఖడ్గము! నేనిప్పుడే పోయి యక్కడ నుఱికెదను. ఓరీ! ఎవఁడురా యక్కడ! ఖడ్గము దెమ్ము" అని గుడారముబైటి కరిగెను.

చంద్రవాహుఁడు భయముగడగడవడఁకి "మిత్రుఁడా! నా

ప్రాణము ప్రాణములో లేదు. నన్నెవరి కప్పగించి పోయెదవు? అయ్యో! పడవాఁడను. బ్రాహ్మణుఁడను. మాఱుపడ్డి గొల్లఁడనే కుమారుఁడను. నా ప్రాణము రక్షింపుము" అని యతనిని బిగ్గరగాఁ గౌగిలించుకొనెను. మకరందుఁడు వానివిడిపించుకొని "వయస్యా! భయములేదు. నీప్రాణమునకు నా ప్రాణ మడ్డము వైచెదను. నీ వీగుడారములో నుండుము. నిన్ను కాపు సేవకుల నప్పగించెదను. వారు నిన్ను గట్టిగాఁబట్టుకొందురు." అని చెప్పి ఖడ్గము ధరించి మెఱుము వంటి పోటుబంటులుఁ బదుగురుఁ దన వెంట రమ్మని యార్తధ్వని వచ్చినవైపునకు విసవిస నడచిపోయెను. పిండ్రు సమ్మెలు బల్లెములు మొదలగు సాధనంబుల ధరించి దంటలగు బంటులు పదుగురేగాక పెక్కండ్రు రాజకుమారుని వెంటఁ దిరిగిరి.

"వెలువకుఁడు వెలువకుఁడు! ఇదే నేవచ్చుచున్నాఁడ" నని యుచ్చైస్స్వనముతో దెసలు మాఱుమ్రోఁగునట్లు కేకలు వేయుచు మకరందుఁడు మిక్కిలి వేగముతోఁ బరుగెత్తి గుడారములకడ కరిగెను. వీరభటులు యజమాను ననుసరించి గమ్యస్థానముఁ జేరిరి. అప్పుడేమి చెప్పను! మొగమున జేగురుబొట్లు తలలపై నెమలిపింఛియములు గుచ్చినతీఁగచుట్లు, చేత విండ్లు, నమ్ములు, భుజముల నీఁతాకులతో నల్లినయమ్ములపొదులు, మెడలలో గవ్వలసరములు, గురివెంద పేరులు, ముంజేతుల దండల నెముకల కంకణములు, నన్నఁడు కత్తిరింపబడని బారుమీసములు గడ్డములు వ్రేలుచున్న కెంజడలు పుట్టగోచులు, వెడఁదయఱొమ్ములు, చిత్తసిబ్బెలట్టు పెఱయు కన్నులుఁ గల భిల్లులు దిక్కులు చిల్లులువడునట్లు బొబ్బలిడుచుఁ గుహ్వారము సేయుచు ముందు మణి యున్నగుడారములోఁ బ్రవేశించి కొల్లవెట్టఁ జొచ్చిరి. వాండ్రు కోతులవలె నుగ్రమూర్తులై యెవ్వరును ముందుఁ గానక వారందఱ గడ తేర్చి సిద్ధముగనున్నవారు నిద్రించుచుండఁగనే కుత్తుకలు త్రె

రించి బరిమార్చి యాకస్మికముగా లేచి చేతికి దొరకినయాయుధంబు లంబట్టి, తమ్మెదిర్చిన జోదులగాయపఱచి కొందఱినిఁ జెట్లకు బంధించి యథేచ్ఛముగఁ బ్రవర్తించుచుండిరి.

జయంతుఁడు వారిచే బంధింపఁబడెను. బాలుండైన విజయసేనుఁడు గాయము దగిలి నేలఁ బడెను. కల్పలతయుఁ జంద్రికయు మల్లికయు "రక్షింపుఁడు. రక్షింపుఁ" డని యఱువఁజొచ్చిరి. ఇందుమతి దొంగలంజూచి తనమేలినగలు కర్పూరమంజరి యొడలియలంకారములు దీసి యిచ్చి తమ కేవిధమునకీడు సేయకుండ గావలసినదంతయు దోచుకొనిపొమ్మని యమూల్యాభరణంబులు చీనిచీనాంబరములు విలువగల దువ్వాలువలు సేలువలుఁ గలపెట్టెలం జూపెను. కర్పూరమంజరి మూర్ఛిల్లెను. భిల్లులు కొల్లలుగొట్టుటకుఁ జక్కనియవకాశము దొరకెనని సంతసించి యాఁడువాండ్రజోలికిం బోక తమవచ్చినపని చేయఁజొచ్చిరి.

అంతలో మకరందుఁడు సపరివారముగా నచ్చటికరుదెంచి భిల్లులం దాఁకెను. రాజవాహనునిభటు లెవ్వరో దొంగ లెవ్వరో తెలిసికొనుట యటవికులవేసములంబట్టి యతనికి సులభమయ్యెను. నిశాచరులట్లు భయంకరకాయులై నిర్భయవిహారము సేయుచున్న నిర్దయాత్ములఁ గఱకుఁటెఱుకులఁ గఱకుకత్తులతో మకరందుఁడును సమరకుశలు రగునాతనియనుచరులును నఱకుటకొందల నఱికినట్లు నేటునకు రెండు తునియలుగా నఱుకఁజొచ్చిరి. దోఁపుడుగొడవలోనున్న భిల్లులు మింటనుండి పిడుగులుపడినట్లు హఠాత్తుగా మహాశూరులువచ్చి తమ్ము దాఁకుదురని యూహింపలేక చెట్లుకూలినట్లు గూలిరి. కొందఱు మకరందునికవికవిరువిహారముఁ నెదురనిలువలేక చేతనున్నపెట్టెలు మొదలగునవి జాఱవిడిచి పాఱిపోయిరి. రాజవాహనునిభటుల కళేబరముల తోను, భిల్లులపీనుంగులతోను నచ్చోటు భయంకరమై యుండెను. ఒ

క్కముహూర్తములో దొంగలలో ననేకులు హతులైరి. తక్కినవారు పలాయితులైరి.

మూఁడవప్రకరణము.

ఆపద్బాంధవు లయినమహనీయు లెవరో తమ కుయ్యాలించి వచ్చి సాయముచేసి ముష్కులపీచమడఁచి తమ్ముఁ గాపాడిరని యిందుమణియు మల్లికాచంద్రికలు జరిగినచిన్నికయ్యంబువలన గ్రహించిరి గాని వచ్చినవా రెవ్వరో వా రెఱుఁగరు. దొంగలదాడివలనఁ గలిగినభయము రవంత శమించుచుండ గాదిలికూఁతురగు కస్తూరమంజరిమూర్ఛవలన నిందుమణికిని, మల్లికాచంద్రికలకును వెండియు మునుపటికన్న నధికమైనమనోవేదన కలిగెను. యోధులగంభీరభాషణంబులవలనఁ గాని, మృతినొందువారియార్తనాదమువలనఁ గాని కస్తూరమంజరికిఁ దెలివిరాలేదు. మల్లికాచంద్రికలు శైత్యోపచారములు చేయుచుండిరి. ఇందుమణి ప్రక్కనఁ గూర్చుండి మీఁదఁ జేయివైచి "బిడ్డా! తాతయుఁ దండ్రియు దగ్గఱలేనితఱి మహారణ్యమధ్యమున దిక్కుమాలి నీ వీలీల నాకు దక్కుదువని నెన్నఁడుఁ దలంపనైతినమ్మా. అక్కటా! నీదేహస్థితి యెట్లున్నదో తెలియఁజేయుటకై వైద్యులయిన లేరుగదా. దంట లగుసూరులు హతులైరి గదా. తల్లీ! తెల్లదామరవంటి మొగము నల్లఁబడినది. ఇఁక నేటిబ్రతుకు? ఏటి యాస? మల్లికా! నీప్రాణసఖి చైతన్యముదక్కి యున్నది. చంద్రికా! ఇంక నీ వెవ్వరితో నర్మోక్తు లాడుదువే?" యని పలువితముల వగచుచు నొక్కమచ్చున నోడికగట్టుచున్నకన్నీటి సోనలచే నవిరియత్నముగ దుఃఖవర్షము పుత్రికపైఁ గురిపించుచుండెను.

మకరందుఁడు భిల్లులుపలాయితులైనవెనుక వాండ్రు తీసికొనిపోక విడచిన పెట్టెలను నగలను వెదకి తెప్పించి తనభటులఁ గానతిచ్చి పట్టునకు బంపి పడఁబడినజయంతుని విడిపించి భుజాదండముమీఁదఁ గాయముతగిలుటం జేసి కదలలేక జొబజొటఁ గారుచున్న నెత్తురు నాఁపుటకై ప్రయత్నించియు స్వస్థు సేయలేక సొక్కుచున్న విజయసేనునిఁ గని లేవఁదీసి మాతృముఖముగనుఁ జూచి యాశ్చర్యపడి జయంతుని నానవాలుబట్టి "ఎవరో యనుకొంటిని మీరా? ఆఁడువాండ్రతోఁ గూడ వచ్చిరా" యనియడిగి నాతఁడు "మేము స్త్రీలతోఁగూడ వచ్చితిమి. వారు గుడారములలోనున్నారు. అటకుఁ బోదము రండు" అని యుత్తరమీయ వారలందోడ్కొని పటకుటీరములకడకరిగెను. అరిగి లోనఁ బ్రవేశించి చూచునప్పటికి మోహపరాయణయై కనుగవమూసికొని వివశయై పండుకొనఁబెట్టఁబంగారుబొమ్మవలె నున్నకర్పూరమంజరి ప్రియుని నేత్రములకగపడెను. ఇందుమతియు మల్లికాచంద్రికలును వానింజూచి తెల్లఁబోయిరి. సుదర్శనుఁ డగుసుదర్శననందనునిఁ జూచినతోడనే వారికందఱకుఁ బ్రాణములు లేచివచ్చెను. నూఱుమంది యాప్తబంధువులను జూచినట్లు వారికి ధైర్యముగలిగెను. కాని కర్పూరమంజరియవస్థ వారియుత్సాహమున కంతరాయము గలిగించెను. కుమారునకు గాయముతగిలినదని యిందుమతి యెఱుంగదు. నెత్తుటం దడిసినవస్త్రములతో నున్న కొడుకుం జూడ నిందుమతి వగపు నుముడించెను. ఆవిధముగా నున్న కుమారికం గనుఁగొని యీవిధముగా నున్న కుమారునిం గనుఁగొని యిందుమతి ధైర్యము చిక్కఁబట్టజాలక కొడుకుం గౌఁగిలించుకొని "కుమారా! మీయిరువుర కేకకాలముందే నాపద సంభవించెఁగా" యని వాపోయెను. మకరందుఁడు జయంతునిఁ జూచి "విజయసేనునిగాయము మిక్కిలి గొప్పదిగాదు. వెంటనే వ్రణపట్టికలు వైచి చికిత్సఁ జేయుఁడు. అచిరకాలంబున గా

యము మాను" నని చెప్పి బాలిక యిట్లుండుట కేమికత మని యడి
గెను.

మల్లిక నేత్రములనుండి బాష్పము లురుల "దేవా! దొంగ
లం జూచి యీమె మూర్ఛిల్లి పరవశయైనది. ఇంకం దెలివి రాలేదు.
కొనయూపిరి మాత్రము మున్నది. నాఁడు మాచెలి విజయనగరమున
దారుణజ్వరపీడిత యైనప్పుడు మీరె మాదేవికిఁ బ్రాణభిక్షము బె
ట్టిరి. నేఁడును మరల మీరే వచ్చిరి. మీరు వచ్చుట యీమెకుఁ
బ్రాణము వచ్చుట మాకు శుభము వచ్చుట" యని పలికెను. "కు
మారా! ఈమె మేనఁ బ్రాణము లున్నవో లేవో సత్వరముగ జెప్పు"
మని యిందుమతి మకరందుని నడిగెను. మకరందుఁడు "అమ్మా! భ
యపడకుము. ఇది మూర్ఛ గాని మరణము గాదు. దురాత్ములైన
భిల్లులదుండగములచేత భయంపడి యీతీగబోఁడి మూర్ఛిల్లినది."
అని చేయి జూచి "నాడి స్ఫుటముగా నడచుచున్నది. ఉచ్ఛ్వాసనిశ్వాస
ములు సరిగా నున్నవి. శబ్దముఁ జేయక మీరు దూరముగా నుండుఁడు
క్రమక్రమముగ నామెకుఁ జైతన్యము వచ్చు" నని పలికి వారికి
ధైర్యముఁ గొలిపి తా నామెప్రక్కను గూర్చుండెను.

మోహావస్థ క్రమక్రమముగాఁ దొలఁగుచుండెనో మకరందుని
హస్తస్పర్శసుఖముచేతనో బాలిక కాలుసేపునకుఁ గొంచెక సేపటి
కిఁ గనులు విచ్చిచూచి యెట్టయెదుట సాక్షాత్కరించిన మన్మథునట్లు
గూర్చున్న మకరందునిఁ గనుగొని సిగ్గుచేఁ బ్రసన్నమొగముఁ గనులుమూసి
మరలఁ గన్నులుదెఱచి యాలావణ్యరసమునఁ దననేత్రమీనముల నో
లలాడించెను. అట్లొండొరులుదర్శన స్పర్శన సుఖముల ననుభవించు
చు వారిరువురుఁ గొండొకసేపు పరమానందసముద్రమునఁ దేలి యా
డుచుండ నంతలో మల్లికా చంద్రికలు వేఱొకప్రాన్పు నమర్చి మూర్ఛి
తయైనప్పుడు నేలఁబడియున్న కతమున ధూళిధూసరితమైన బాలిక

మేను దులిపి లేవఁదీసి యాశయ్యం బండుకొనఁబెట్టిరి. ఈయంతరాయము వారి కిరువుర కనిష్టమైనను సహింపక తప్పినదిగాదు.

జయంతుఁడు విజయసేనుని గాయమునకుఁ దగిన చికిత్సలఁ జేసి రక్తస్రావముఁ గట్టించియతనినిఁ గూడఁ బవ్వళింపఁ జేసి నిహతులయిన పరిజనులకు నగ్నిసంస్కారవిధానము దుస్సాధ్యమని హతశేషుల చేతవారికిఁ దగినట్లు ఖననక్రియలు జేయించెను. పరిజనులలో గాయములు దగిలినవారికిసైతము చికిత్సలు చేయఁబడెను. ఫూరిఫుల్లయైన దొంగలపాలు గాకుండ స్త్రీల కవమానము గలుగకుండఁ దమ్ముఁ గాపాడిన మకరందుని జయంతుఁడును దక్కినపరిజనులును బలుతెఱంగులఁగొనియాడిరి. తనకుఁ బుత్త్రపుత్రికాభిక్షము నాఁడు మకరందుఁడు ప్రసాదించె నని యిందుమణి పలుతెఱంగుల నాతని నుతియించె.

ఆనడిరేయి యానట్టడవిలో వారుండుటకుఁ గారణమేమని మకరందుఁడు ప్రశ్నించెను. అప్పుడు జయంతుఁ డిట్లనియె. "కుమారా యెఱుఁగుదువుగదా హేమచంద్రుని యనుజుఁడును విదర్భరాజగు రాజవాహనునకల్లుఁడు నగుచిత్రభానుఁడు గలఁడని. కర్పూరమంజరి యాతని గారాబుకూఁతురు. చిత్రభానుఁడు శ్రీనగరమందున్నాఁడు. ఇందుమణీదేవియుఁ గర్పూరమంజరియు హేమచంద్రుని రాణియగు నరవిందాదేవిని, వాని గారాబుకొడుకు లగు విక్రమసేన హర్షవర్ధనులను జూచి పరామర్శించుట బంధుధర్మముగదా! అక్కారణంబున వీరు చిత్రభానుప్రేరితులై రాజవాహనుని యనుమతంబున నచ్చటికిఁ బోవుచున్నారు. విదర్భేశ్వరుఁడు తగుపరిజనంబు నిచ్చి యశ్వములిచ్చి యందలములిచ్చి యఖిల ప్రయాణసాధనంబులనిచ్చి పెద్దవాఁడను లోకానుభవముగలవాఁడను గనుక నన్నుఁ దోడిచ్చి కాశ్మీరమునకు వీరిని బయనముచేసి పంపెను. మందభాగ్యుఁడనైన నేను వీరికీయవస్థఁ దెచ్చితిని. సమరమున ముక్కాకలు దేరిన వీరులు నిష్కా

రణముగా మ్రుచ్చులచేతఁజిక్కి చచ్చిరిగాని హతాశుఁడ నైన నేను కడతేఱిన బాగుండునుగదా. నీవు సమయమునకు రాకున్న క్రూరులు నీతిదూరులు నగుచోరులు మమ్మేమి చేసియుందురో! ఆర్తత్రాణపరాయణుఁడ వైన నీచరిత్రము శ్లాఘాపాత్రము" అనవుఁడు మకరందుఁడు జయంతు నుద్దేశించి "అయ్యా! ఇందు మీతప్పు లేదు. కాలవశమున నెటువంటి తేజమైన నొకప్పుడు మందగించును. అంతమాత్రమున మీ యట్టివారు మందప్రజ్ఞులుగారు. నేను మానవధర్మమును జేసితినిగాని శ్లాఘింపవలసినంత ఘనకార్యమేమియుఁ జేయలేదు. హేమచంద్ర మహారాజుమాట మీ రిప్పుడు తలపెట్టుటం జేసి వారి దుర్మరణము నాకు జ్ఞప్తికివచ్చి నామనంబు గాసిల్లజేయుచున్నది. పుంభావము దాల్చిన ధర్మదేవతగదా యతఁడు! హేమచంద్రాస్తమయమునఁ గాశ్మీరదేశము-కాశ్మీరమన నేల? ప్రపంచము, చంద్రాస్తమయమైన నిశవలె నున్నది. నాతండ్రికి నతనికి నొక్కటే ప్రాణమని చెప్పవచ్చును. కాలగతి మరలించువా రెవ్వరు లేరు."

అనిపలుకుచుండఁ గర్పూరమంజరియుఁ బెదతండ్రిం దలంచి కన్నుల నీరు నించెను. ఇతరవిషయములం గూర్చి కొంత ప్రసంగమైన వెనుక జయంతుఁడు తమప్రయాణముమాట యెత్తి "మేము మరల విదర్భాపురమునకుం బోవలయునా, హతశేషపరివారముతోఁ గాశ్మీరమునకుఁ బోవలయునా యని నామనంబు సందేహడోలికలోఁ బడి యూఁగుచున్నది. బాలుఁడ వైనను నీవు జ్ఞానమున వృద్ధుఁడవు. ఇందు నీ యాలోచన మేమో చెప్పుము" అని యడిగెను.

అంతలో నిందుమణి యందుకొని "పరిజనములో సగము కడతేరినది. ఈయల్పపరివారముతో మనము పయనము సేయఁజాలము. పైఁగా విజయసేనునకు గాయము తగిలినది. బాలిక మిక్కిలి భయవిహ్వలయైనది. కావున విదర్భకరిగి తగినంత పరివారము వెంటబెట్టు

కొని పోవుట మంచి" దని పలికెను. "అయ్యో! ఇంతలోనే వియోగముగలిగెనా" యని కర్పూరమంజరి తనలో ననుకొని నిట్టూర్పు విడిచెను. మల్లికా చంద్రిక లిందుమణితో నేకీభవించిరి.

అప్పుడు మకరందుఁడు వారితో నేకీభవింపక వారందఱు వినునట్లు జయంతున కిట్లనియె. అయ్యా! మీరిప్పుడు మాళవదేశపు సరిహద్దులలోనున్నారు. నాకడఁ దగినపరివారమున్నది. మీరు నావెంట నుజ్జయినికిరండు. అచ్చటనుండి మీకుఁ గావలసినపరిజనంబును బరికరములను నిచ్చి మాజనకుఁడు మిమ్ము సురక్షితముగాఁ గాశ్మీరదేశము జేర్పఁగలఁడు. అది కర్తవ్యము గాని వెనుకకుఁబోవుట సముచితము గాదు. ఈ రేయి మీరందఱు నాలోచించుకొనుఁడు. ఇంక నేను నా శిబిరంబున కరిగెద." అదివిని కర్పూరమంజరి మల్లికం జేరఁబిలిచి చెవిలో "ఓసీ! తెక్కలికాండ్రు మరల వత్తురేమో? ఆయన నిందే యుండుమని చెప్పవే" యని మెల్లగఁ బలికెను. "అట్లకాక" యని మల్లిక మకరందు నచ్చటనుండుమని ప్రార్థించెను. ఆవేఁడికోలు కర్పూరమంజరీముఖంబుననే వచ్చినదిగా భావించి మకరందుఁ డియ్యకొనియె. నిద్రించుటకు వారు ప్రయత్నించిరిగాని, వారికందఱకుఁ ముఖ్యముగాఁ గర్పూరమంజరికిఁ గనులుమూసినతోడనే వెఱపుఁగొలుపుకఱకుటెఱుకల మోటరూపములు గనబడుటంజేసి యామె పలుమాఱు త్రుళ్ళిపడి లేచుచువచ్చెను. మల్లికాచంద్రికలు గుఱ్ఱుపట్టి నిద్రించిరి. తెలతెల వేగుళ్లప్పుడు మకరందుఁడు తన సైనికులలోఁ గొందఱ నచ్చట నునిచి తక్కినవారితోఁ గలిసి తన నెలవున కరిగెను.

అతఁడు చనినపిదప నిందుమణియు జయంతుఁడు మున్నగు వారందఱుఁ గలిసికొని తమప్రయాణ విషయమును జర్చించి మకరందునిమాటలు సహేతువులుగా నున్నవని తలంచి యాతనివెంట నుజ్జయినికిఁ బోయి యటనుండి శ్రీనగరమునకరుగుట సముచితమని

నిశ్చయించి యావార్తనతని కెఱిఁగించిరి. ఈనిశ్చయము చెవినిబడినతోడనే కహ్లారమంజరీ మకరందుల యానందము మిన్నుముట్టెను. కొంతకాలమైన మరల నన్యోన్యావలోకన సుఖము సంప్రాప్తమగుటచే వారిహృదయములు ప్రశాంతములయ్యెను. ఆమఱునాఁడు కహ్లారమంజరీ ప్రముఖస్త్రీజనమును, విజయసేనుని, జయంతాదులను దోడుకొని మకరందుఁడు తనపరివార మంగరక్షకముగా నచ్చోటు గదలి యుజ్జయినికిఁ బయనమయ్యెను.

మకరందుఁడు మార్గమధ్యమున వనవాసులు పుక్కిలిపినయంబునఁ గొని తెచ్చియిచ్చు, నెమలిపింఛములు, పులికళాసములు, జింకకొమ్ములు, తేనెపెఱలు మొదలగు నూడిదల నాదరపూర్వకంబుగ నందుకొనుచు వారు గావించువిన్నపములు సావధానుఁడై యాలకించుచుఁ జెంచులుగావించు విపరీతనృత్యములఁ గనుంగొని యానందించుచు నాకులు, చిగురులు, పండ్లు గాయలు దిని దిగంబరులై వృక్షశాఖలు నిలయంబులుగ మహాతపశ్శాలుల విధంబున నుండెడునానా విహంగముల సందర్శించి యక్కజంపడుచు బయనముచేసెను. కహ్లారమంజరియు నమాయిక వేషభాషలుగల చెంచుకన్నియలంజూచి యచ్చెరువడుచు నవ్యక్తమధురములైన పలుఁగుల గానములకు మెచ్చుచు నల్లజింకకొమ్ముకొనయందుఁ దనకన్నుఁ జేర్చి దురదవోవ ఱాచుకొను నాఁడుజింకంగని కన్నులు చరితార్థములైనవని తలంచుచు సింహవ్యాఘ్రాది క్రూరసత్వంబుల బొబ్బలువిని యుత్కళపడుచుఁ బ్రకృతిసౌందర్యమంతయుఁ గన్నులం జుఱ్ఱుచు మకరందుని వెంటనరిగెను. ఎడనెడ విడిసినతావుల సూఁపులు వీణఁబూని యామెల నాఁగ దాని నాదములోఁ దన కంఠస్వరముఁగలిపి యేదికంఠమో యేది వీణానాదమో తెలియనట్లు వినువారల మేనులు గగుర్పొడుచునట్లు వారు తన్మయత్వము నొందునట్లు పాడి పరిజనంబులకును, చెలి

మిత్త్రులకును ముఖ్యముగా మకరందునకును మార్గశ్రమ మపనయించుచుండును. మకరందసాహచర్యంబునఁ గర్పూరమంజరికిని, గర్పూరమంజరీ సహవాసంబున మకరందునకును మార్గాయాసమున్నది కనఁబడలేదు. ఉజ్జయిని సమీపించినకొలఁది సంతోషము కలుగుటకు మాఱుగాఁ బరస్పరవియోగము గలుగునేమో యని భయముపొడమ జొచ్చెను. గమ్యస్థానము నానాఁటికి దవ్వయిన బాగుండునని వారికిఁ దోఁచెను. బౌద్ధుఁడైన మకరందుఁడు జీవహింసావిముఖుఁడుగావున నొక్క జీవజంతువునైనఁ జంపక శాకాహారముతోడనే కాలము గడపెను. భూతదయాపరుఁడైన యాతని నియమంబులు బాగున్నవని కర్పూరమంజరియు మాంసాహారము వర్జించెను. వ్యసనంబులలో నొక్కటియై పాపహేతువైన వేఁట నారాజనందనుఁడు చిన్ననాఁటంగోలె వర్జించెను. మనుష్యులకు హానిసేయు క్రూరమృగంబులం దక్క నాహారమునిమిత్త మతఁడెన్నఁడు నేజంతువును జంపి యెఱుంగఁడు.

ఈవిధంబున బయనంబు చేసి కతిపయదివసంబులకు వారు తమ కన్నిదినము లాతిథ్యమిచ్చి చెక్కుచెదరక తమయింటికిఁ జేర్చిన వనలక్ష్మియొద్ద సెలవుగైకొని యుజ్జయినీ పురలక్ష్మిం జేరిరి. కుమారుని రాకకు సుదర్శనుఁడు సంతసించి వానిం గౌఁగిటఁ జేర్చె కర్పూరమంజరీప్రముఖస్త్రీజనంబుల రాక విని యానందమొంది వారల సగౌరవంబుగా సాదరంబుగా సస్నేహంబుగాఁ దోడ్కొనిరమ్మని చంద్రప్రభాదేవినిఁ బంపెను. ఆమెయు శుద్ధాంతకాంతాజనోచితమైన గౌరవాదరంబులు నెఱపి వారలనంతఃపురము ప్రవేశింపఁజేసెను. ఇందుమణి రెండుమూఁడుదినములైనతరువాతఁ దమ్ముఁ గాశ్మీరమంపుమని చంద్రప్రభాదేవిముఖంబున సుదర్శనునకు విన్నవించెను. అటనుండి పోవుటకుఁ గర్పూరమంజరి కిష్టములేదు. పంపుటకుఁ మకరందుని కిష్టము

లేదు. అటమీఁదఁ జతుర్భాను పుత్రికకు దేహపీడయుఁ మనఃపీడయుఁ గలుగఁజొచ్చెను. పయనమనకొన్నప్పుడెల్ల నామెకొకనాఁడు తలమేఱు, మఱియొకనాఁడు బద్ధకము వేఱొకనాఁడు నిద్రాభావము లన్యదినంబున మనోవికారము మొదలగు విపరీతచేష్టలు పొడమెను. మకరందుఁడు వైద్యుఁడగుటచేఁ బ్రతిదినమామె చేయిజూచి రోగముచిన్నదైనను బ్రశ్నలధికముగ నడిగి పేరునకేదో మందిచ్చి చికిత్సచేయుచుండును. అతఁడు సన్నిధి నున్నంతసేపు, చేయి చూచునంతసేపు, మాటలాడునంతసేపు ప్రేమరసము జాల్కుచూపులు చూచునంతసేపు నామె కేవిధమైన బాధయుఁ గనఁబడదు. అతఁ డావల కేగినంతోడనే మరల నెప్పటి నొప్పులు తలయెత్తఁ జొచ్చెను. మల్లికాచంద్రికలు మాత్రము రోగకారణ మెఱుఁగుదురు. ఇందుమతి యది తెలియక తామేదో దుర్ముహూర్తమున విదర్భాపురము వెడలినట్లొకమాఱు దలంచును. ఎఱుకలసాని యేదో క్షుద్రదేవతను బ్రయోగించియుండునని యొకమాఱూహించును. అడవిలో నేదోపిశాచ మావహించియుండునని యొకసారి తలపోయును. ఉజ్జయినీ జలమామెకు సరిపడలేదని యింకొకసారి భావించును. ఎట్లయిన శ్రీనగరమును ద్వరగఁ జేరుట మంచిదని యామె నిశ్చయించి సత్వరముతమ్ముఁ బంపుమని యామె సుదర్శనునకు వర్తమాన మంపెను. కొన్ని యేనుఁగులు గుఱ్ఱములు రథములు నందలములు సిద్ధముచేయించి చోరులు మఱి యేక్రూరులు దుండగములు చేయుటకవకాశము లేనంతబలము నిచ్చి సుదర్శనుఁడు వారిం బంపుమని మకరందున కానతిచ్చెను. మకరందుఁ డట్లుచేసెను.

కర్పూరమంజరి మనస్సు నుజ్జయినిలో మకరందుని కడఁగుదువబెట్టి శరీరముమాత్ర మందలములోఁ జేర్చెను. మకరందుఁడు తన మనస్సు నామెకు సాయమంపి నిర్మనస్కుఁడై నిర్విణ్ణుఁడై చాల

దూరము వారిని సాగనంపి జయంతునికడ సెలవుపుచ్చుకొని విజయ సేనుని బలుమాఱుపలుకరించి క్షేమవార్త నంపుచుండుమని చెప్పి స్వగృహాభిముఖుఁ డయ్యెను. నదీప్రవాహమున కెదురువోవు నావవలె నతనిమేను బహుప్రయత్నమునఁ గాని ముందుకు సాఁగిపోవదయ్యె.

నాల్గవప్రకరణము.

ఆశ మనుష్యునకు మైకము గల్గించి వివశునిఁజేయుటలో మద్యమును మించి యుండును. ఆశామద్యపాయి యొడలుమఱచి తిరుగును. తనతలలో వేయిపన్నుగడలు పన్నును. ఆకసంబున నందలము లెక్కును. సముద్రములో సౌధములఁ గల్పించును. మహావాయుపథమున మనస్సునుసంచరింపఁ జేయును. అదియే వానికి జీవగఱ్ఱ. ఆశ యను గుఱ్ఱమునెక్కిన వాఁడు మహావేగముగఁ బదునాల్గులోకములు సంచరించి యది మెట్టకేలకు నడువలేక కూలి తన్నుఁగూల్చినపుడు భగ్నమనోరథుఁడై కూలి మరల వెనుకకుఁబోవుట కవకాశములేని యపుడు గాఢపశ్చాత్తాపమునొంది నాశనము నొందును. తాఁ జెడుటయేగాక తన సంబంధముగలవారి నందఱను జెఱుపును. ఆశ విషముకన్న దహనముకన్న దారుణమైనది. ఇదివీరికి వారికనక యెల్లవారికి వారివారియవస్థలకుం దగినట్లు లాశ్రయమై దుస్తరమగు జంబాలపటలమున దింపును.

హేమచంద్రుని మరణమునకుఁ బూర్వము దండపాణి రాజకుటుంబమునకు మిక్కిలి కూర్చువాఁడు. తనకుమారికయైన మణిమాలికను హేమచంద్రుని జ్యేష్ఠనందనుఁడగు విక్రమసేనునకిచ్చి వివాహము చేయవలెనని ప్రయత్నించుచుండెను. కాని నాఁడుగుహలో

హరిశర్మ విక్రమసేనుఁడు మందభాగ్యుఁడనియుఁ జిత్రభానుపుత్త్రకుఁ
డగు విజయసేనుఁడు మిక్కిలి యదృష్టవంతుఁడనియుఁ జెప్పి మణి
మాలికను విజయసేనునికే యిమ్మని హితోపదేశము చేసినదాదిగా
దండపాణి మనస్సు నావమీఁదిసూచీయంత్ర ముత్తర దిక్కువైపు
దిరిగియుండునట్లు నిరంతరముఁ జిత్రభానునివైపు దిరిగియుండెను.
చిత్రభానుఁడు కాశ్మీరదేశాధీశ్వరుఁడు గావలెననియు, వానిసూనుఁడు
విజయసేనుఁడు యువరాజు గావలెననియుఁ దనకూఁతురు మణిమా
లిక మొదటయువరాజపత్నియై, పిమ్మటఁ గాశ్మీరరాజ పట్టమహి
షిగావలెననియుఁ గోరి యామనోరథసిద్ధికి నేకార్యము లవశ్యములో
వానిం జేయుటకును నేదారిం బోయిన గమ్యస్థానముఁ జేరవచ్చునో
యాదారిం బోవుటకును నిశ్చయించుకొనెను. కాశ్మీరరాజ్యసైన్యము
లు వానియధీనమం దుండుటచే సేనాచక్రమునకెల్ల నియామకుఁ
డయిన తనగీచినగీటు దళములు దాఁటవను దృఢవిశ్వాసమున నెల్లయె
డలఁ దాను చిత్రభానునకుఁ బాసటయైయుండ నిశ్చయించుకొనెను.
దండపాణితమ్ముఁడగు వజ్రపాణి చిన్నసేనాపతియై మొదటినుండియు
హేమచంద్రునిఁ గొలిచియుండియుఁ జిన్ననాఁటంగోలెఁ గర్పూర
మంజరిపైఁ గన్నువైచి తన్నిమిత్తము చిత్రభానునియెడఁ బక్షపా
తము గలిగి యుండెను. అహల్యాసంగమాభిలాషియై తొల్లి వజ్ర
పాణి కోడియై మునిగృహముఁ జొచ్చినట్లు, కర్పూరమంజరీసమాగమ
ముఁ గాంక్షించి యీవజ్రపాణి చిత్రభానునియింటికుక్కయై తిరుగు
చుండెను. ఆపరమమూర్ఖుఁడు కర్పూరమంజరి తనపై వలపునిలుపుచు
న్నదో లేదో తెలిసికొనఁజాలక చిత్రభానునిపాదసేవ యనునోవి
నిచ్చినఁ గన్య యన్యవశము గాక తనచేఁజిక్కు నని యూటలూరు
చుండెను. స్వసుఖాభిలాషియై తమ్ముఁడును, స్వపుత్త్రికాసుఖాభిలాషి
యై యన్నయును జిత్రభానునికనుసన్న మెలంగుచుండిరి. ఆయన్న

దమ్ములిరువురు బ్రతిదినము రాత్రులు చిత్రభానుని నెలవున కరిగి యతనితోఁ గాశ్మీరరాజ్యసంబంధములైన ప్రసంగములు సేయుచుండురు. రంధ్రాన్వేషి యైనచిత్రభానుఁడు కాశ్మీరరాజ్యమందలి లోటుపాటులు దౌర్బల్యములు వారివలనఁ దెలిసికొనుచుండును. రాజకుటుంబముపై నిర్హేతుకముగా వారు పూనినద్వేషాగ్ని రుద్రభట్టు తనవాక్సమిధలచేతఁ బ్రజ్వలింపఁ జేయుచుండును. ఈయిరువురఁ దనవశవర్తులుగాఁ జేసికొనుటతోఁ దనివినొందక చిత్రభానుఁడు శ్రీనగరవాసులలో ముఖ్యపురుషులఁ దనకడకు రావించియు వారియిండ్లకు స్వయముగాఁ బోయియుఁ, బూర్వముతన్న హేమచంద్రుఁడు నగరమునుండి వెడలనడఁచి నప్పుడుగాని, తరువాతగాని దనయెడ నెంతమాత్రము దోసములేదనియు దురాత్ములెవ్వరో మహర్షితుల్యుఁడైన తనయన్నను సంహరించిరనియు భ్రాతృహననదోషము తనకారోపించిన దురాత్ములు తత్కార్యముచేసిన వారిదుర్గతులకే పోవుదురనియు నొక్కివక్కాణించి యొట్టుపెట్టుకొని ప్రమాణములుచేసి వారిలోఁ గొందఱిమనస్సులు తాననిర్దోషి యని నమ్మునట్లు జేసెను. కొందఱతని మాటలు నమ్మినను మఱికొందఱు వాని బలుకులకుం దలయూఁచి యట్లె కావచ్చునని పలికి మనసులెప్పటియట్లు నుంచుకొనిరి.

చిత్రభానుని నంతఃపురికి రానిచ్చినందునను, నదిచాలక నగరమున నుండనిచ్చి నందునను వాని యాలు బిడ్డలువచ్చితన్ను సందర్శించుటకు సమ్మతించినందునను నరవిందాదేవిమీఁద మణివర్మకుఁ బట్టరాని కినుక పొడమెను. కొన్నిదినములతఁడు రాజ్యవ్యాపారములం జూడనేలేదు. అంతిపురి కరుగనేలేదు. ఇల్లు కదలనేలేదు. వైదేశికులగు రాయబారులకుఁ గొన్ని ముఖ్యాంశములపైఁ దగినయుత్తరములీయలేదు. అరవిందాదేవి రాచనగరునకు రమ్మని యంతఃపురపరిచారకుల చేతను, నిగమశర్మచేతను మాధవసేనునిచేతను నెన్నోసారులు వర్త

మౌనముంపినను మణివర్మ "యిదేవచ్చెద నదేవచ్చెద శరీరమస్వస్థము గానున్నది. పెద్దవాఁడనగుటచే మునుపటివలె రాజ్యవ్యాపారముల యందు బుద్ధి ప్రసరించుటలేదు. అని యెన్నో వంకలు చెప్పి తప్పించు కొనుచుండును. కాని యాతని మనంబుననాశ్రయించిన తిక్క తిరుగ దయ్యెను. అరవిందాదేవి యెట్టకేలకు మణివర్మ తనపై బిట్టలుక బూనినాఁడని యూహించి యొకనాఁడు విక్రమసేనహర్షవర్ధనులను బి లిచి "మీరిరువురు రథారూఢులై మణివర్మయొద్దకుఁ బోయి యతని యలుకఁదీర్చి మనవలమునకుఁ గొని రాగలరా నాయనలారా!" యని యడిగెను. "తప్పక దీసికొనివచ్చెద" మని వా రుత్తరమిచ్చి మఱు నాఁడుదయమున సముచితవస్త్రాలంకారములు ధరించి, తల్లికి వందన మొనర్చి స్యందనమెక్కి వంశను లిరువురు తగుపరివారము వెంటఁ గొని కాశ్మీరరాజ్యవజ్రవర్మయగు మణివర్మగృహమున కరిగిరి. వారి రాకవిని మణివర్మ విస్మయమునొంది "అయ్యో! నామౌర్ఖ్యమువలన నతిసుకుమారులగు రాజకుమారు లిల్లువెడలి రావలసివచ్చెఁ గాదా యని నొచ్చుకొని విసవిస మేడదిగి యెదురుపోయి యిరువుర బిగికౌఁ గిటఁ జేర్చిముద్దులాడి చేతితోఁ దలమీఁద వీపుమీఁదనిమిరి "నాయనా! మిమ్ము నేను నకారణముగా మిక్కిలి శ్రమపెట్టితిని. ఈ మందభాగ్యుని కతమున మీరంతఃపురము వెడలవలసివచ్చెఁగదా! ఛీ! నాబతుకు కాల్పనా" యని మనంబున హేమచంద్రునిం దలఁచి బిగ్గరగా వాపో యినవారు శోకింతురని శంకించి సమ్మెలిక నెమ్మనమున నడంచు కొని వారి నుచితాసనంబులఁ గూర్చుండఁబెట్టి సేమమడిగి గారవించి వచ్చినపని యేమనియడిగెను.

అడుగుటయు విక్రమసేనుఁడు మెల్లగ నిట్లనియె. "తాతగారు! నేను రాజును మీరు మంత్రియను సంబంధముచేత నిచ్చటికి రాలేదు. మాతండ్రిగారికి మీరు పితృప్రాయులై యుండిరి. మాకు మీరేపితా

మహులు మీరె మాతామహులు మాకు నిజమైన పితామహుఁడు లేనే లేఁడు. మాతామహుఁడు మహేంద్రదేవుఁడు మాయమ్మను మమ్మును మాతండ్రిగారి మరణానంతరమునఁ బరామర్శ చేసి తన రాజ్యమున కరిగెను. అపత్యముద్రమును జెలియలికట్టయై నిరోధించి శుభపరంపరలనొడఁగూర్చుటకై మిమ్ముం జూపి మాజనకుఁడు స్వర్గస్థుఁడయ్యెను. రాజ్యమునకు రాజులేని వెలితి, మాకుఁ దండ్రిలేని వెలితి నీవలనం దీఱునని మేము పుట్టెఁడాస పెట్టుకొని యుంటిమి. అట్టియాసలెల్లఁ జెడిపోయినవి. నవవైధవ్యదుఃఖభారమున నడఁగిపోయిన మాయమ్మకు మీ దర్శనాభావ మంటిసినప్పుడున నుప్పుపెట్టినట్లయినది. ఇంతలోనే మీరు మాపై నింత యనుగ్రహము గప్పియుందురని మేమెన్నఁడుఁ దలంపలేదు. మాధవసేనుఁ డొక్కఁడే మంత్రాలోచనము చేసి కార్యభారము నిర్వహింపఁజాలఁడు కావున నెప్పటియట్లు మీరు రాజకార్యంబుల నిర్వహింపవలయునని నేను వేఁడుచున్నాను. మాయమ్మ మిమ్ము రమ్మని వేఁడుచున్నది." అనుచుండ నంతలో హర్షవర్ధనుఁడందుకొని "తాతగారూ! మీరు రాకపోవుటచేత మాకోట చిన్నవోయినది. మీరిచ్చటికి రానియెడల మేమే మీయింటిదగ్గఱనుందుము. మమ్ము గెంటివేసి నిక్కడనుండి వెళ్ళము" అని ముద్దులొలుకఁ బలికెను. అంతకుముందు విక్రమసేనుని పలుకులకే సగము కరఁగిన యయ్యమాత్యుని హృదయము సహజమధురములై జాలిగొలుపు హర్షవర్ధనుని పలుకులకు నీరుగాపోవ మణినర్మలేచి యిద్దఱిబిడ్డల మరల గౌఁగిలించుకొని "నాచిన్నియన్నలారా! ముద్దులమూటలగు మీమాటలు విననవాఁడు మీ చెప్పినచొప్పునఁ జేయకయుండఁగలఁడే? మీ నుపవ్రులకుఁ గరుఁగని డెంకము ఱాయిగాని డెందము కాదు. నేనిప్పటికి మీ వాఁడనేగాని యన్యుఁడను గాను. శిథిలగృహమునకా నున్న యీమునవిమేనుస నెంతకాలము నిల్చునుకో యంతకాలము

నేను మీ క్షేమమే కోరుచుందును. ఎందుకట్టవలెనన్న యీదేహ
మక్కఱకువచ్చినంతకాలము మీనిమిత్తమె పనిచేసి మీనిమిత్తమె
వినియోగింపఁబడును. ఈదేహమే మీకవసరమైన పక్షమున నిర్విచా
రముగా నేను దీనిని మీకు సమర్పింతును. కాని నాఁడు నాచేసినయు
పదేశము సరకుగొనక మీతండ్రి స్వబుద్ధిచే మరణంబు దెచ్చుకొనియె.
నేఁడు మీతల్లి నాపలుకులు ద్రోసిపుచ్చి చిత్రభానునిఁ జేర్చినది.
మీరు పసికూనలు కార్యాకార్యము తెలియఁగరు. మీపినతండ్రి
దురాత్ములలో నగ్రగణ్యుఁడు. కొలువుదారుల నితఁడు వైదర్భులం
గొందఱఁ జేర్చి కుట్రపన్ని మీతాతగారిం గడతేర్పఁ జూచెను. అయ్యది
నేనును మాధవసేనుఁడును మహాప్రయత్నంబునఁ గనిపెట్టి లిఖితమూ
లకమగు సాక్ష్యముతోఁగూడ మీతండ్రి కెఱిఁగించితిమి. దానంజేసి
మీయయ్య చిత్రభానుని దేశమునుండి వెడలనడఁచెను. అనంతరము
హరిశర్మయను దురాత్మునిఁ బంచి యితఁడే మీజనకుని వంచించి
చంపించెను. చంపించెననననేల! స్వహస్తములతో నితఁడే చంపె నని
నానమ్మిక. నేను కన్నులారఁ జూడలేదుగాని, మీపినతండ్రి స్వభావ
మునుబట్టి యితఁడే స్వయముగాఁ జేసినాఁడని యనుచుంటిని. రాజ
భక్తిపూరితమైన మనస్సుతో నేనిట్లనుచున్నాఁడను గాన నాయాలా
పములలోఁ బాపమున్నయెడల సకలపాపపరిహర్తయగు సమాభర్త
నన్ను క్షమియించుగాక! మీపినతండ్రి తేనెబూసినకత్తి. వానిమాట
లనియెడి నురులలో నెట్టివారు దగుల్కొనుచుందురు. మేఁక వన్నె
పులి. మాటలలోఁ దేనియలుట్టిపడుచుండును. హృదయము విషకుం
భము. అట్టివానిని జేరనిచ్చుటం జేసి నామాట చెల్లదు గదా యని
నాచేసిన హితోపదేశములు నిరర్థకములని నేనలవచ్చుటలేదు. అంతి
యేగాని మీ మీఁదఁగాని మీ యమ్మమీఁదఁగాని నాకు రవంతయు
నలుకలేదు. స్వపుత్రికకు నరవిందాదేవికి నెట్టిభేదము లేదు. ఇదె యామె

దర్శనము జేయ మీతోడ వచ్చుచున్నాఁడ" నని మేడమీఁదికిఁ బోయి తలపాగయు నిలువుటంగియుఁ దాల్చి బిడ్డలతోఁ గలిసి రథమెక్కి రాజాంతఃపురమునకుఁ బోయి యరవిందాదేవిని సందర్శించెను. ఆదేవియు నతనికి నమస్కరించి తనవలనఁ దప్పులున్న క్షమియింపుమని ప్రార్థించి యెప్పటియట్ల రాజకార్యంబులఁ జూడుమని కోరెను. మణివర్మ విక్రమసేనునితోఁ జెప్పినట్ల యామెతోఁ గూఁడ జెప్ప కడపట నిట్లనియె. "తల్లీ! నాకన్న నీవు జిన్నదానవు. నీబిడ్డలు పసిపాపలు. చిత్రభానుఁడు బెబ్బులులకన్న సింగములకన్నఁ గోడెత్రాచులకన్నఁ గ్రూరుఁడు. నిజముగా నతఁడు దానవుఁడుగాని మానవుఁడుగాఁడు. అతఁడు నీకు నీబిడ్డలకు హాని సేయఁజూచు. దండపాణియు వజ్రపాణియుఁ బ్రతినిశియు వానికడకుఁబోయి యిక్కడివృత్తాంతమంతయు వాని కెఱిఁగించుచున్నారనియు వారే వానికి వేగులవాండ్రుగ నున్నారనియు నాగూఢచారులవలన నే వినియుంటిని. సైన్యమంతయు వారియధీనములో నున్నది. అందుచేత మనము జాగ్రత్తగా నుండవలయును." అనవుడు నరవింద "తండ్రీ! నాచేసిన పొరపాటు క్షమింపుము. నాతోడికోడలు, కర్పూరమంజరియు రేపో నేఁడో వత్తురు. వారువచ్చి నన్నుఁ జూచినతరువాతఁ గార్యపద్ధతియంతయు నీచెప్పినచొప్పున జరుగుఁగాక! ఇఁక మీఁద నీగీచినగీటు దాఁటుదానను గాను. నేను నీబిడ్డను. నాబిడ్డలు నీమనుమలు నన్నును నాయనుంగునిసువులను నీకప్పగించి కాదె మహారాజుగారు స్వర్గస్థులైరి. అని యనివార్యమై వచ్చు కన్నీటిసోనల నాపలేక వలవల నేడ్చెను. మణివర్మయు దుఃఖము నాఁపలేక వేఁడికన్నీళ్ళు విడిచి "అమ్మా! నాశక్తి వంచన లేక నేను పాటుపడియెద. అవసరమైన మీనిమిత్తము నాప్రాణము లైన నర్పించెద" నని యభయప్రదానమిచ్చి కొన్ని యితర విషముల మాటలాడి సెలవు గైకొని యింటికిఁ బోయెను.

అయిదవప్రకరణము.

ప్రియజనవిరహము దుస్సహము. అది జీవితమును దుఃఖభాజనముఁ జేయును. ప్రియజనవియోగమైనకాలమున భానుఁడు సహస్రమయూఖములతో నైజతేజమున వెలుగుచున్నను జగమంధకారమై తోఁచును. చలువలు వెదఁజల్లుచు మింటఁ జందమామ వెలయుచున్నను జంతువు దుర్భర సంతాపము నొందుచుండును. సౌఖ్యప్రదములగు వస్తువులన్నియు దుఃఖప్రదములుగ్గట్లు కనఁబడును. ఉజ్జయినినుండి బైలుదేరిననాటఁగోలెఁ గర్పూరమంజరి సరిగా నన్నము ముట్టక, నీరు ద్రావక, నిదుర వోవక, మునుపటియట్లఁ గలకలలాడు నెమ్మొగముతో సఖీజనమును బలుకరింపక విధిలేక పయనము సేయుచుండెను. ఆమెయందలమందున్నను సెజ్జమీఁదనున్నను మకరంద నామస్మరణమే సేయుచుండును. పరమయోగిని కన్నులుమూసి పరమేశ్వరుని ధ్యానించునట్లు మకరందుని సుందరమూర్తిని ధ్యానించుచుండును. కన్నులు మూసిమూసి తన్మయత్వముజెంది మైమఱచి తనమనోనాథుఁడెట్టయెదుటనున్నట్లు భావించుకొని చేతులుచాఁచి బయలు గౌఁగిలించుకొనును. అత్తఱి నెవ్వరయిన దాఁపుననున్నయెడల వారింజూచి సిగ్గుపడును. తానొక్కతెయున్న హాయని నిట్టూర్పు విడుచును. ఇత్తెఱంగున నత్తలిరుఁబోఁడి మకరందుని వియోగమునకుఁ జిత్తమున నుత్తలపడుచు నెట్టెటో తల్లితోడను నెచ్చెలులతోడనుఁ గలసి పయనముచేసి తనువు శ్రీనగరముఁ జేర్చెను.

జయంతుఁడు తమరాక ముందుగాఁ జత్రభానునకుఁ దెలియఁ జేసియున్నకతమున నాతఁడు దారపుత్త్రుల నూరుబయట నెదుర్కొని సంభావించెను. జయంతుఁడు వనములో దొంగలుకొట్టుట మగంటిమిగల జంట్లుకూలుట, విజయసేనుఁడు గాయపడుట, కర్పూరమంజరి

మూర్ఛిల్లుట, మాలవ రాజనందనుఁడు సాయపడి వారినపాయము నుండి యుద్ధరించుట, పిమ్మట నుజ్జయినిలోఁ గొంతకాల ముండుట, సుదర్శనుండాదరించి తగుపరిజనమునిచ్చి పంపుట మున్నగువృత్తాంత మంతయుఁ జిత్రభానునకు విన్నవించెను. అదివిని యతఁడు విస్మయం బును విషాదంబునుబొంది మకరందుని తోడ్పాటునకును, సుదర్శనుని యాదరంబునకును బద్ధయుసంతసించి వారినందఱఁ దన గుడారంబుల యందు యారేయినిలిపి వారి రాక మఱునాఁ డరవిందాదేవికిఁ దెలియ బఱచెను.

ఆ దేవి వారి రాకకనుమతించుటయు నాఁటియపరాహ్ణమున నిం దుమణి కర్పూరమంజరిని విజయసేనునిఁ బరిచారికాజనమును వెంటఁ బెట్టుకొని రాచనగరునకుం జనియెను. కర్పూరమంజరి కంటికి మొగసా లలు, కొలువుకూటములు కళాహీనములై కానఁబడ నామె మొగము గాఢవిషాదమును దెలుపుచుండెను. దేవింజూచి యందఱు దుఃఖా క్రాంతచిత్తులైరి. కర్పూరమంజరి చిన్ననాఁటనుండియు హేమచం ద్రునిఁ దండ్రిగ నరవిందను దల్లిగ భావించి వారు కన్నబిడ్డయట్లె పె రుఁగుటం జేసి హేమచంద్రుని మృతికిఁ దన పెదతల్లిదురవస్థకు నామె యెంతేని యుమ్మలికముఁ జెందెను. అరవిందాదేవి తనదుఃఖమును మాటలచేతఁగాక బొటబొటదొరఁగు బాష్పములచేతనే వెలిబుచ్చెను. విజయసేనుఁడు విక్రమసేన హర్షవర్ధనుల నోదార్చెను. ఇందుమణి సమయోచితవచనములఁ దోడికోడలిని సమాశ్వాసించెను. పరామర్శ ముగిసినపిదప నందఱు మరల గుడారములకుఁబోవఁ బయనమగుచుం డ నరవింద కర్పూరమంజరిం బిలిచి "బిడ్డా! నీవిచ్చట నిలువుము. మీయమ్మయుఁ దక్కినవారుఁ బోయివత్తురుగాక!" యని పలికెను. ఇందుమణియుఁ గర్పూరమంజరి యచ్చటనుండుటకు సమ్మతింప నా మె పెదతల్లికడ నిలిచి పోయెను. తక్కినవారందఱు గుడారములకుం

జనిరి. ఆబాలిక యంతిపురినుండుట విక్రమసేన హర్షవర్ధనులకును సంతోషకరముగా నుండెను. అరవిందాదేవి నిరంతరము భర్తృమరణదుఃఖమునఁ గడుంగడు గుందుచుండుటం జేసి యామెదుఃఖాపనోదార్థము కర్పూరమంజరి పురాణములనుండియుఁ బూర్వరాజుల చరిత్రములనుండియు మనోహరములైన కథలనేర్చి పెదతల్లికిఁ జెప్పుచుండును. విక్రమసేన హర్షవర్ధనులుగూడ మిక్కిలితమకముతో వానినాలకించుచువచ్చిరి. ఒకసారి తనప్రయాణమునుగుఱించి ముచ్చటించి త్రోవలోఁ జెందుపడఁతిచెప్పిన యెఱుక తెలిపి యామె వారినినవ్వించెను. వెంటనే యానడిరేయి జరిగినభిల్లుల బందెపోటుచెప్పి వారందఱికి భయముగొలుపును. ఒకతూఱి విదర్భాపుర వృత్తాంతములు, మఱియొకసారి యుజ్జయినీ విశేషములు దెలిపి వారినానందింపఁ జేయును. ఒకసారి మకరందుని సాహసౌదార్యగుణములు వర్ణించి వారి వీనులకువిందు సేయును. మఱియొకతూఱి హేమచంద్రుని మరణవృత్తాంతము సవిస్తరముగా నర్మదనడిగి తెలిసికొని పెదతండ్రికంత దుర్మరణము సంభవించినందుకు బిట్టువిచారించుచుండును. విద్యావతి యగుటచే నాబాలిక శోకవిహ్వలయగు నరవిందకు నప్పుడప్పుడు వేదాంతవాక్యములుచెప్పి యామెయలమట నుడిగింపఁ జేయును. ఈ విధముగాఁ దనకుశక్యమైనంతవఱకుఁ బెదతల్లిమనస్సునుండి శోకాంధకారమును వెడలద్రోలుటకు సర్వప్రయత్నములఁ జేయుచుండును. అందుచే నరవిందాదేవి కర్పూరమంజరినివిడిచిపెట్ట నిచ్చగింపదయ్యె.

విదర్భాపురమునుండి తనకుటుంబము వచ్చినవెనుకఁ జత్రభానుఁడు రమారమి యొకవారముదనుక గుడారములయందు బసచేసి పిమ్మట దండపాణిప్రముఖులు తననిమిత్తము మరసి సమకూర్చిన భవనమునఁ గాపురముండ వెళ్ళెను. ఆగృహము విశాలమైన యావరణము గలిగి వెనుకప్రక్క చిన్నయుద్యానము గలిగి ముందు విశాలమైన వాకిలి

గలిగి రమణీయములగు మేడలుమిద్దెలు గలిగి రాజబంధువులు సపరివారముగా వసియించుట కనువుగానుండెను. అందువిడిసిన రెండుమూఁడు దినములకుఁ గర్పూరమంజరి తండ్రి పిలువనంప నాభవనమును దల్లిదండ్రులను జూడఁబోయెను. మాతాపితలు బాలికను రెండుమూఁడుదినములాఁపిరి. ఆలో నరవింద కర్పూరమంజరినిరమ్మని నర్మదచేత వర్తమానమంపెను. కర్పూరమంజరిమీఁద నరవిందకు గాఢానురాగము గలుగుట చిత్రభానున కొకవిధముచేత సంతోషకరముగాను, వేఱొకవిధముచేత సంతాపకరముగాను నుండెను. తనపుత్రికచేత మణివర్మప్రముఖులమీఁదఁ గొన్ని కానిమాటలు రాణితోఁ జెప్పింపవచ్చునని వారికలయిక నతఁడిచ్చగించెను. కాని చిరసహావాసదోషమునఁ దనపుత్రికకు నరవిందమీఁదను నామెబిడ్డలమీఁదను విప్పరాని కూర్మిజనించి భవిష్యత్కాలమున బాధకరమగునేమోయని భయముగలుగఁ జొచ్చెను. అయినను నతఁడామె రాచనగరమునకుఁ బోవుట కాటంకముఁ గలిగింపలేదు. రెండవనాఁటి రేయి చిత్రభానుఁడు భోజనానంతరమందుఁ గూఁతురుం జేరఁబిలిచి "బిడ్డా! నీవు నీపద తల్లితోఁ గలసిమెలసి కొన్నినాళ్లనుండి యుంటివిగదా! భర్తృమరణమునుగూర్చి యామె నీతో నేదేనిచెప్పినదా! యనియడిగెను. "నర్మద నడిగి నేను పెదనాయనగారి దుర్మరణవృత్తాంతముఁ దెలిసికొంటిని. అదియున్నదున్నట్లు జెప్పెనుగాని యెవరిమీఁదను నిందారోపణముఁ జేయలేదు. నర్మద చెప్పినంతసేఁపు నాపెదతల్లినోటమాట రాలేదు. కంటినుండి ముత్యాలచేరులు నేలకు వ్రేలఁగట్టినట్లు బాష్పధారలు దొరఁగెను. ఇదియే జరిగినవృత్తాంతము అని కూఁతురు తండ్రికుత్తరముచెప్పెను. "అంతేనా! ఎవ్వరిమీఁద ననుమానమున్నట్లు చెప్పలేదా? సరే! వాండ్రకునిజము తెలియకపోవచ్చును. నిజమునిలుకడమీఁదఁ దెలియకపోఁదు.

అనిపలికి కొంతసేపూరకుండి యేదో యాలోచించుచున్నట్లు పైకిఁజూచి వెండియుఁ జిత్రభానుఁ డిట్లనియె. "బిడ్డా! అరవిందాదేవికడ నీవు తఱచుగా నుండువుగనుక నామె కొక్కరహస్యము జెప్పవలయునని కోరుచున్నాఁడను. అది యేమందువేని సావధానవై వినుము. మాయన్న నట్టి దారుణమరణముపాలుచేసినవాఁడు పయోముఖవిషకుంభమని చెప్పఁదగిన మణివర్మ. వాఁ డమాత్యరూపముననున్న ఘోరరాక్షసుఁడు; మిత్రరూపముననున్న కాలభుజంగము. అమృతాకృతితోనున్న కాలకూటవిషము. బిడ్డా! యీపలుకులువిని నీవు తెల్లతెల్లఁబోయెదవేమి? వాఁడంతపనిఁ జేయలేఁడనియా నీయభిప్రాయము. నీవక్కజఁ పడనక్కఱలేదు. అమాత్యులహృదయములు విషపాత్రములు. అమాత్యులు చేయనిపాపములు లోకములో లేవు. నరులప్రాణములఁదీయుట నల్లులఁజంపుటగానైన నుండదు. పేనుకుక్కినమాత్రమైన వారికుండదు. స్వలాభపరాయణులై వారు కావించు దుండగములఁ దన దివ్యహస్తముతో- దివ్యలేఖినితో- దివ్యపత్రములమీఁద- నాచిత్రగుప్తుఁడే వ్రాయవలయుఁగాని మఱియెవ్వరు లిఖింపఁజాలరు. క్రూరచిత్తుఁడైన యీయమాత్యుఁడు తనకు నమ్మిన భృత్యుఁడుగా మిత్రుఁడుగా మనసారనమ్మి మాయన్న తనయంతముం దెచ్చుకొనెను. ఇట్టిదురాత్ముని నమ్ముట పక్కలోఁ బాముపెట్టుకొని పవ్వళించుటయని యతఁ డెఱుఁగఁడు. బిడ్డా! ఆతఁడు నన్ను దేశమునుండి వెడలనడఁచుట మహాపాతకుఁడైన యీసచివాధముని మాటల నమ్మియే. లేకున్న మాయన్న నన్నట్లుసేయునే?", యని బాష్పరోధమునఁ దనకంఠము గద్గదస్వరయుక్తముగా మాటలాడలేక కన్నీరువిడిచెను.

కర్పూరమంజరియు దుఃఖపూరితయై కన్నీరుదుడిచికొని "తండ్రీ! విచారింపకు, నీసౌభ్రాత్రము నిరుపమానమైనదె. కాలవశమున మనస్సులలో రవరవలు పొడముటయు దానికిందగినట్లు హేమచంద్రునిఁ

జంపుటకుఁ గొన్నికుట్రలు బైలువెడలుటయు నప్పుడు సంభవించెను. ఎందుచేతనో నీపై నప్పు డనుమానముగలుగ నతఁ డట్లుచేసెను. ఆయనమరణమునకు విచారించినఁ గార్యమేమి? నీయభిమతమేమో చెప్పుము. శక్యమైనపక్షమునఁ జేసెద' నని హెచ్చరించుటయుఁ జిత్రభానుఁడు మరల నిట్లు చెప్పఁదొడఁగెను. "అమ్మా! మణివర్మ హేమచంద్రునిఁ జంపించినట్లు నీవరవిందాదేవి మనసునకు నచ్చునట్టు గట్టిగఁ జెప్పవలయును. మణివర్మయన్న మాయన్నయట్ల నామెయుఁ బడి చచ్చును. అతఁడే తన తండ్రిగా గురువుగా క్షేమంకరుఁడుగా నమ్మి తనప్రాణము కొడుకుల ప్రాణములు వానిచేతం బెట్టినది. అందుచేత నామె కతనిపై ద్వేషముగలుగునట్లు నీవు నొక్కి పలుకవలెను. మాయన్న యున్నప్పుడే మణివర్మ కాశ్మీరరాజ్యచక్రమును నిచ్చవచ్చినట్లు ద్రిప్పినాఁడు. ఇప్పుడతఁడే రాజు. వానిమాట నిరంకుశమై చెల్లుచున్నది. మాయన్న పేరుమీఁదుగా నాయిద్దరిబిడ్డలనైన వాఁడు బ్రతుకనిచ్చునని నాకు నమ్మకలేదు. ఆపసికూనలఁగూడ వాఁడెప్పుడో తనపొట్టంబెట్టుకొనును. కాఁబట్టి మణివర్మపై వ్రాలియున్న యామె మనస్సును నీవు యథాస్థితికి మరలింపవలెను. నీవు విద్యావతివి. మాటలయందును జాణవు. వాక్పటుత్వము గలదు. హేతుకల్పన చక్కఁగాఁ జేయఁగలవు. పూర్వోత్తరవిరోధము గలుగకుండ సందర్భశుద్ధి చెడకుండ నెట్లుచెప్పవలెనో యట్లుచెప్పి కాశ్మీరరాజ్యమును రాజకుటుంబమును రక్షించునట్టి మార్గము చూడుము. అట్లయిన నీవు కష్టపరంపరలను వేఁడిగాడ్పులచే శోషిల్లుచున్న మన వంశవృక్షమునకు నీరుపోసి రక్షించినదానవగుదువు. నేనేమో చెప్పితినని చక్కఁగా నాలోచించి కర్తవ్యముచేయుము. నాయన్నకుమారులు నాయన్నరాజ్యము చక్కఁగానుండుటయే నాకోరిక."

అప్పలుకులు విని కర్పూరమంజరి విస్మయమునొంది క్షణమా లోచించి తండ్రి కిట్లనియె. "నాయనా! కాశ్మీరరాజ్యమునకు మన విక్రమసేనహర్షవర్ధనులకు క్షేమముగలుగుట నాకుఁ బరమసంతోషము. కాని యెవరుచెప్పినను మణివర్మ మిక్కిలి యోగ్యుఁడనియు, రాజకుటుంబమునకు హితకారియనియు నాత్మలాభపరాయణుఁడు గాఁడనియుఁ జెప్పుచున్నారు. నీమాటలుచూడ నతనివంటి మలిన వర్తనుఁడు లేఁడని స్పష్టమగుచున్నది. పెదనాయనకు మణివర్మ యపకారముసేయుచుండ నేఁ జూడలేదు. ఇంతవఱకు వినలేదు. అట్టి సజ్జనునిపై రాజద్రోహము, రాజహత్య మొదలగు మహాదోషముల నారోపించి నేనేవిధముగా నరవిందాదేవితోఁ జెప్పఁగలను? ఈపని చేయుటకు నాయంతరాత్మ యొప్పుకొనుటలేదు. ఒకసద్గుణవంతుని జెఱచుట మహాపాతకహేతువు. కావున నన్ను నీ వీవిషయమున క్షమింపవలయు. మణివర్మయే హేమచంద్రహంతకుఁడని నీవుచెప్పితివి కాని ప్రపంచమున నెట్టి దుర్వాడుకయున్నదో యెఱుఁగుదువా! మాళవరాజాంతఃపురముననే నున్నకాలమున నే నిద్దఱు ముగ్గురివలన నీవే నీయన్నను జంపితివని—చంపించితివనివింటిని. అప్పలుకులు నేను నమ్మెదనా? కర్పూరమంజరిని గన్నతండ్రిచేతులు భ్రాతృరక్తము తోడ నరుణంబులగునే! నీపై నపవాదము నెట్లు విశ్వసింపనో మణి వర్మపై నారోపణలుగూడ నట్లె విశ్వసింపను. కావున నీపని నాతల పైఁ బెట్టకుము. అది నాచేతఁగానిపని." అని బాలకయూరకుండఁ జిత్రభానుఁడు "పోనీ! బిడ్డా! నీవాపని జేయలేకున్నను నాపైలోకులు మోఁపిన యపవాదము నీవు నమ్మలేదు. అదయే నాకుఁబరమసంతోషము. అదియే పదివేలు. ఇంకఁ బండుకొనుము" అని యామెంబంపి తానును శయనాగారమునకుఁ బోయెను.

ఆఱవ ప్రకరణము.

మణివర్మ యరవిందాదేవి యాజ్ఞ శిరసావహించి యెప్పటి యట్ల రాజ్యవ్యాపారములఁ జూచుచుండెను గాని యాతనిమనస్సు యథాస్థితిని బ్రాపింపలేదు. చిత్రభానుఁడు శ్రీనగరమునకు వచ్చుటే యాతని కిష్టములేదు. వచ్చినను నతఁ డచ్చట నిలువఁజేసియుండుట కిట్టదు. అతని కుటుంబము వచ్చు టంతకన్న నతనికి సరిపడలేదు. కుటుంబము వచ్చి రాజపత్నిని బరామర్శచేసినపిదప సకుటుంబముగాఁ దా నూరువిడిచిపోవునట్లు దేవియెదుట వాగ్దానముఁ జేసి చేసినట్లు వీడు విడిచిపోకపోవుటగాక, మీఁదుమిక్కిలి యచ్చట స్థిరవాసము చేయఁ దలంచి యొకవిశాలభవనము నాక్రమించుకొనుట వానికి మిక్కిలి కష్టముగా నుండెను. అన్నిటికంటె నెక్కువగఁ జిత్రభాను పుత్రిక యైన కర్పూరమంజరి నిరంతరము దేవికి సన్నిధానవర్తినియైయుండుట లోకజ్ఞుఁడైన యాతని కనుమానము హెచ్చించుచుండెను. అందుచేత నతఁ డేమిచేయుటకుఁ దోఁచక మూఢునియట్లు, కార్యపద్ధతి నిర్ణయింపలేకయుండెను. ఒకసారి కాశ్మీరరాజ్యముతో సంబంధమువదలుకొనుట యుక్తమని యాతఁడు తలంచును; వెంటనే మృతుఁడైన హేమచంద్రునిఁ దలఁచియు లేబ్రాయమునను న్న రాజకుమారులం దలఁచియు బిడ్డవలెఁ దన్నునమ్మిన యరవిందం దలఁచియు నాయాలోచన మంతమునొందించును. ఒకతూరి చిత్రభానుని నూరు విడిచి తక్షణమె పొమ్మని స్వదేశ మంపవలయునని తలపోయును. రాణియానలేక యట్లు చేసిన నామె యెట్లుగాఁదలంచునో యని శంకించును. తన వేగులవాండ్రెంత తెలివిగలవారైనను లోలోపల నేమి జరుగుచున్నదో వారు తెలియఁ జేయఁజాలరుగదా! ఏమి జరుగుచున్నదో? ఏమిపన్నుగడలు చిత్రభానుఁడు పన్నుచున్నాఁడో యని భ

యపడుచుండును. ఈవిధముగాఁ గొన్నిదినము లతఁడు తలపోసి తలపోసి యరవిందాదేవికడకుఁ బోయి యామెతో నీవిషయమై ముచ్చటింపఁదలఁచి విక్రమసేనునిం బిలిచి "కర్పూరమంజరి లేనిసమయమున మీయమ్మతోడను నీతోడను నే నించుక ప్రసంగింపవలతు. ఇట్లు మీయమ్మతోఁ జెప్పుము" అని పలుక నక్కుమారుఁడు వల్లెయని తల్లి కడకరిగి యమ్మాట చెప్పెను. ఆమెయు మఱునాఁ డేకాంతమునఁ బ్రసంగించుటకుఁ దగినసమయము స్థలము నిర్దేశించి యమాత్యుని రావించెను. మణివర్మ ముడుతలుపడిన మొగము ముగ్గుబుట్టవలె నెఱసినతల, మాంసహీనములై వ్రేలుచర్మములు, మనోభారమునకుఁ దోడు స్వయముగాఁ బైన వైచుకొనిన కార్యభారముచేతఁ గొంచెము వంగిన నడుము, దేవికిఁ గుమారునకు జాలిగొలుప నారిని సమీపించి సన్మానితుఁడై పీఠముపైఁ గూర్చుండి మెల్లగ నిట్లనెను. "అమ్మా! చిరకాలజీవనము కష్టపరంపరాదర్శనముకొఱకే. కానిచో నట్టి నరపాలచంద్రుని హేమచంద్రుని చేతులమీఁదుగా నేనుబోక జీవచ్ఛవమునైయుందునా! చిత్రభానుని రాకనుగూర్చి నేను మీతో నివఱకే మనవిచేసికొనియుంటి. అతఁడు వచ్చుటే ముప్పు. రానిచ్చుట తప్పు. చేసినతప్పు దిద్దుకొనుట యొప్పు. తనకుటుంబము మిమ్ముఁ బరామర్శ చేసినతరువాతఁ దానీయూరు విడిచిపోవునట్లు మాటయిచ్చెను గదా! ఇప్పుడు చేసినపని చూడుఁడు. ఇచ్చట శాశ్వతనివాసము చేయఁదలంచి కాఁబోలు విశాలభవనము నాక్రమించుకొనియె. పశువలెవచ్చి మేకువలె బిగుసుకొనెనన్న సామెత నిజమైనది. మీమనసులో మీకెట్లున్నదోగాని యతఁ డిక్కడనుండుటచే నేను ముండ్లమీఁద నున్నట్లున్నాను. నామనస్సు నిప్పుల బొరలుచున్నది. జ్వరములేకయే నేను తాపపడుచున్నాను. రోగములేకయే నాకాహారద్వేషము గలిగినది. తెగులులేకయే నిద్రాశూన్యములైన రాత్రులు గడపుచున్నాను.

చిత్రభానుఁ డున్నచోట మనముండుట త్రాఁచుబామున్న యింట మెలఁగుట. వాని నుండనిచ్చుట కొంగున నిప్పు మూఁటగట్టుకొనుట. ఈవిషయములన్నియు నేను మున్నె సూచించియుంటి. విశేషించి కర్పూరమంజరి మిమ్ముజన్మము పాయక తోడునీడవలె నున్నది. ఆమెపై మీకెంత మక్కువయున్నను నామె శత్రుని బిడ్డగదా. ఆమెకు మీపై నెంత యనురాగమున్నను మీకుతల్లిదండ్రులతరువాతివారు గదా! మీగుట్టుమట్టు లామెతండ్రి కెఱిఁగింపకుండునా! ఎంతమంచిదైనను బాలిక మీకును వారికి వైరమువచ్చినప్పుడు తండ్రిపక్షము ముండక మీపక్షముండునా? అతఁడేమి దుస్తంత్రములఁ బన్నుచున్నవాఁడో మనమెఱుఁగము. నావేగులవాండ్రు విహంగకుఁడు కైరవుఁడు మున్నగువారు పలుతెఱంగుల వారిజాడలఁ దీయ యత్నించుచున్నారు. కాని వాని పైపైవార్తలేగాని లోపలిగుట్టు తెలియుట లేదు. కావున నోతల్లీ! వాని నిచ్చటినుండి వెడలనడఁచుట మంచిది. ఆదికాలమున మన మహారాజుగారే వానిని దేశభ్రష్టుని జేసిరి. కావున నింద మనమీఁదనుండదు. వెనుకటి మహారాజు చేసిన పనియే మనమిప్పుడు చేయుచున్నాము. బలవత్తరములైనపూర్వకారణములే యిప్పుడున్నవి. అంతేకన్న నెక్కుడు కారణములుంగలవు. కావున వానిని వెడలనడఁచుటకు నాకు సెలవిమ్ము. నీ మువలయయ్యెనేని వానింబంపివేయుటకు యత్నించెద. నగరమువిడిచిపోవునో లేదో నాకును సందియమే. అందుచేత నే యత్నించెదనంటిని. మీఁదమీచిత్తము" అని పురోహితాభిలాషియగు వృద్ధామాత్యుఁడు వచియింప నద్దేవి విక్రమసేనునివంకఁ జూచెను. విక్రమసేనుఁడు తల్లివైపు జూచెను.

అమ్మా! తల్లికొడుకు లొండొరుల మొగములు చూచుకొని తెల్లఁబోవనేల? ఏదో కార్యపద్ధతి సత్వరమనిశ్చయింపుఁడు" అని యమాత్యుఁడు హెచ్చరింప రాజమాత యిట్లనియె. "తండ్రీ! నీపలు

కులు వేదవాక్యంబులుం బోలె సత్యంబులు. మా కెల్ల చుట్టములు నీవ! నీవంటి క్షేమంకరుఁడు మాకు వేయిజన్మములు దపస్సుచేసినను లభింపఁడు. నీయిష్టమెట్లో యట్లె నేను చేసెద. కాని యొక్క విషయమాలోచింపుఁడు. మామఱఁది నిప్పు దూరుపిడిచిపోవున్నాట నిద్రించుచున్న బెబ్బులిని మేల్కొలుపుట యగునేమో! పండుకొన్న త్రాఁచుబామును పడగవిప్పి యాడించుటయగునేమొ? రాజుచున్న నిప్పు మండించుట యగునేమో? ఆఁడుదానను రాజనీతి నెఱుఁగనిదానను. అందుచేత నామాఁటలే పాటిగాఁ గొనక నీవును మాధవసేనుఁడును రాజభక్తియుక్తులగు దక్కినని యోగులతోడను గార్యాలోచనముసలిపి యథోచితముగావర్తింపుము. కర్పూరమంజరి చిత్రభానుని పుత్రికయైనను సుగుణరాశి. ఇక్కడిమాటలక్కడ నక్కడిమాట లిక్కడఁ జెప్పునదిగాదు. ఎక్కడిమాటలక్కడనే జీర్ణము చేసికొను స్వభావము దానిది. అయినను రాజ్యపరిరక్షణార్థము దానింగూడ నేఁ బరిత్యజించెద, అనవుడు మణివర్మ పద్మసేనునిఁ గదిరిగి "కుమారా! సాలగ్రామము చిన్నదైనను పెద్దదైనను బూజ్యమె. రాజు బాలుఁడైనను వృద్ధుడైనను మాననీయుఁడె. కావున నీయభిమతముఁ జెప్పుమని యడిగెను. అడుగుటయు సతఁడు "అయ్యా! కరిటభారమే నేను తలఁదాల్చితినిగాని రాజ్యభారము మోయువాఁడవు నీవు. దండపాణిప్రముఖులతోఁ గూడ నీవాలోచింపుము. మనకు వారిపై ననుమానమున్నట్లు మనవర్తనముచే వారికిఁ దెలియనీయఁ గూడదు. అందఱితోడిపాటు వారిం గూడ గౌరవపురస్సరముగాఁ బిలిచి కార్యనిశ్చయముచేయుట కర్తవ్యము. మీశాస్త్రజ్ఞానము మీలోకానుభవము, మీబుద్ధివిశేషము నాశ్రయించి మీ యిచ్చవచ్చిన తెఱంగున వర్తింపుఁడు. మీకుపదేశము జేయుటకు నేనెవ్వఁడనని వినయమున బదులుచెప్పెను. అప్పలుకులు విని యాసచివాగ్రణి "సరే.

మీయిరువురు నాకుం దోఁచినపోల్కి సేయుమని సెప్పిరిగదా. మాధవసేనుఁడు సర్వకార్యములందును నన్ననుసరించును. దండపాణిని వజ్రపాణినిగూడఁ బిలువనంపి వారిమతము దెలిసికొనియెద. వారు నాతో నేకీభవింపకపోయినను నేను చిత్రభానుని బురమువిడిచిపోవలసినదని చెప్పెద. ఏలయనఁ వారి రాజభక్తినిగూర్చి నాకనుమానము గలదు. వారయినను జాటుచాటున వానికిసాయముచేయవలసినదేగాని సాహసించి బహిరంగముగా మనకు వ్యతిరేకముగా నుండఁజాలరు. అట్లు నేయుటకుఁగూడ వారికిఁ దగిన హేతువులులేవు. ఇప్పటికి నేను సెలవుగైకొని పోయివచ్చెద" నని స్వగృహమునకుఁబోయెను.

ఆరేయి మణిసర్మ దండపాణిని వజ్రపాణినిఁ దన గృహంబునకుఁ బిలువనంపి మొకటినుండియుఁ జిత్రభానునకు హేమచంద్రునకు గలసంబంధ మువన్యసించి యతఁడు భ్రాతృహంతయని లోకమునం గలవాడుకల చెత్తి నగరమున నతనినుంచుట కర్తవ్యమగునా కాదా యనుమాట గట్టిగా విచారింపవలసిన దని వారితోఁ జెప్పెను. అప్పలుకులు వారికి శ్రోత్రపేయములుగా లేవు. మనసులోఁ జిత్రభానుని యెడఁ బ్రేమగలిగియుండుటఁ జేసి వారినవునను నెటుచెప్పుటకు వీలులేక గొంతసేపు మనసులలో వితర్కించుకొనిన పిదప దండపాణి యిట్లనియె. "ఆర్యా! చిత్రభానునిమీఁద నలుకవొడమి హేమచంద్ర మహారాజు వానిని దేశమునుండి వెడలనడఁచిన మాట నిజమె. అది యేపొరపాటని మేము తలంచుచుంటిమి. చిత్రభానుఁడు భ్రాతృహంతయనుమాట మేము నమ్మఁజాలము. మేమే కాదు బుద్ధిమంతులెవ్వరు నమ్మరు. అన్ననిమిత్త మతఁ డెంతో యడలుచున్నాఁడని వినుచున్నాము. అది కపటనాటకముగాక నిక్కమైనదుఃఖమే యని మా తలంపు. అతఁడిక్కడనున్నందువలన మన కేమియపకారము గలుగును? అతనింగదుపుటకందరిఁగలతుట్టంజెదరఁగొట్టుట. శోఁగాములు చక్కఁగ

విచారించి మీయిచ్చవచ్చిన తెఱంగునఁ జేయుఁడు. ఈకార్యము నాకు మాత్ర మిష్టములేదు." అనివిని మణివర్మ "వజ్రపాణీ! నీయభిప్రాయ మేమి?" యని యడుగ వజ్రపాణి "అయ్యా! అన్నదమ్ములకు నేమికారణముచేతనో మనస్పర్థలు కలిగినవి. వెనుకటి మహారాజు, విషయము సరిగ విమర్శించియో విమర్శింపకయో తమ్ముని వెడలఁ గొట్టెను. హేమచంద్రునితో వైరము లంతమొందినవి. చిత్రభానుఁడు వెనుకటివైరము మఱచి మరల స్వదేశమునకు వచ్చినాఁడు. అతని జోలికిఁబోవుట యుక్తముగాదు. అదిగాక యతఁ డేమి చేయఁగలఁడు? ధనమా, రాజ్యమా, యధికారమా, సైన్యమా, యతనిచేత నేమి గలదు? కావున మనమతని నుపేక్షించియుండుట సముచితమని నా మతము.

ఆపలుకులు విని వారిమనస్సులోనున్న భావము సంపూర్ణముగ గ్రహించి యంతకన్న వారితో నెక్కువ ముచ్చటించుట యుపస్థితమని యప్పటికి వారికి సెలవిచ్చిపంపి మణివర్మ తనమనస్సులో నిట్లు వితర్కించెను. "అన్నన్నా! రాజ్యతంత్రనిర్వాహణము కడుం గడుఁ గష్టముగదా! ఇదియనేకాపదలకాస్పదము. ప్రమాదము మానవమాత్రునకు సహజము. అది మంత్రిపట్లవచ్చినా దానిని లోకము సహింపదు; రాజుసహింపఁడు. తలపెట్టినకార్యము శుభముగాఁ బరిణమించెనా యామంత్రి యభినవబృహస్పతియనియుఁ గలియుగ శుక్రుఁడనియు, యుగంధరుఁడనియుఁ బ్రకృతిజనులు వేయితెఱంగుల సన్నుతింతురు. దైవవశమున నకార్యము మంత్రిలోపములేకయే చెడెనా వాఁడు పనికిమాలినవాఁడు, దండనార్హుఁడు ననియానోళ్లతోనె నిందింతురు. ప్రజాభిప్రాయము బహుముఖములు గలరాక్షసి. కార్యధురంధరులపట్ల లోపమువచ్చినా యది వారిం దప్పక మ్రింగివేయును. రాజులచిత్తవృత్తులు నట్టివే. అందు రాజు పిన్నవాఁడైనప్పుడు

మంత్రిపాట్లు చెప్పవలసినదే లేదు. ఇక్కడ రాజు చిన్నవాఁడు. సం రక్షకురాలు తల్లి; యాఁడుది. చేయవలసినకార్య మతికష్టమైనది. చిత్రభానుఁడు పరమదుర్మార్గుఁడు. మిత్రు లెవరో శత్రు లెవరో తెలి యకుండ నున్నది. దైవమా! ఏమి తెలుపు? ఇట్టి సందిగ్ధసమయ మె న్నఁడు రాలేదు. ఏమైన నగుఁగాక! దైవముమీఁద భారమువైచి రాజకుటుంబక్షేమము విచారించి నాబుద్ధికివచ్చినట్లు జేసెద. ప్రయత్న మే మనుష్యునివంతు; కార్యసిద్ధి దైవాయత్తము" అని నిశ్చయించి ద్వితీయమంత్రి యగుమాధవసేనుని మఱునాఁడు బిలువనంపి యాతని తో ననేకరాజకార్యములను ముచ్చటించి చిత్రభానునిప్రసంగముదెచ్చి నగరమునుండి బహిష్కరించుట కర్తవ్యమా యకర్తవ్యమా యని యడిగెను. మాధవసేనుఁడును మణివర్మ యట్ల యఖండరాజభక్తి యుక్తుఁడు. అతనియట్లె చిత్రభానునియెడ విశ్వాసము లేనివాఁడు. అయినను మణివర్మ యట్లు కార్యనిశ్చయము సత్వరముగా నతఁడు చేయఁజాలఁడు. నోటనుండిమాట వెడలకమునుపు దాని నతఁ డెన్ని సారులో తూఁచును. భావమున నెన్నిసారులో దానిని మర్దనచేయు ను. అందుచేత నతఁడు చాలసేపాలోచనముచేసి కొట్టకొన కిట్లనియె. "అన్నివిధములఁ జిత్రభానుఁడు శ్రీనగరమునకు దూరమున నుండవల సినవాఁడె. కాని, మనమింత తొందరపడవలసిన యవసరమేమి? సా హసించినపక్షమున నేమిప్రమాదము సంభవించునో? వానిచర్యలు మఱికొంతకాలము కనిపెట్టి యవి విపరీతములయినపక్షమున మన మ ప్పుడు వానిని బహిష్కరింపఁగూడదా?" అనుచుండ నతనిమాట కడ్డమువోయి మణివర్మ "ఎంతకాలము మనము నిదానించుట? తలు పులు గొళ్ళెముపెట్టి వాఁడు నాలుగుచూరు లంటించినపిదప మన మే మి చేయఁగలము? వాఁడిచ్చట దుస్తంత్రవృక్షమును బెంపఁదలంచి మొక్క నాటినాఁడు. దోహదము సేయుచున్నాఁడని నా నమ్మిక.

అది మ్రానై గొడ్డళ్ళకైనఁ దెగనప్పుడు మన మేమి చేయఁగలము ?
మొలకయయిననాఁడె పెల్లగించుట కర్తవ్యము. కావున నామాట
వినుము. నీవుపోయి చిత్రభానునిం గలసి సకుటుంబముగా నతఁడు
శ్రీనగరము విడిచి వెళ్ళవలసినట్లు రాజశాసనమైనదని చెప్పుము. నేను
చిన్నరాజుతోను రాణితోను మాటలాడితిని. ఎప్పుడో యొకప్పుడు
మన మీకార్యము జేయవలసినవారమె. పెందలకడఁ జేయుట మంచి
ది" అని కఠినస్వరముతోఁ బలికెను. "మీచిత్తము వచ్చినట్లు జేసెద.
ఈసాయంకాలమె పోయి చిత్రభానున కీవార్త నెఱింగించెద. అతని
ప్రత్యుత్తరము మీకు నేఁ జెప్పెద' నని మాధవసేనుఁడు చెప్పి సెల
వు గైకొని పోయెను.

ఏడవ ప్రకరణము.

మణివర్మ సందేశము మాధవసేనుఁ డెఱిఁగింపకముందె దండపాణి
వజ్రపాణులవలనముందుగఁ జిత్రభానుఁ డెఱింగి సందేశముకడకువచ్చినప్పు
డేమిచెప్పనొప్పునాయని విచారించుచుండెను. వార్తాహరు లెవ్వరై
యుందురో యతఁడు ముందుగ నూహింపలేకపోయెను గాని మఱు
నాఁడు మాధవసేనుఁడు వచ్చినతోడనే యతఁ డాసందేశ మెఱిఁగించు
టకె వచ్చియుండునని నిశ్చయించియు యథోచితగౌరవమున నామం
త్రి నెదుర్కొని యర్హాసనమునఁ గూర్చుండఁబెట్టి సేమ మరసి రాజ
కుటుంబముయొక్క క్షేమమడిగి పిమ్మట నిక్కడకు వానిం దోడి తెచ్చి
న పనియేమో తెలియఁజేయుఁడగునని పలికెను. మాధవసేనుఁడు
చేతులు నలుపుకొనుచు మెల్లమెల్లగా నేదో చెప్పఁబూనెను.

"అయ్యా! మీరు నేఁడేదో యుత్కృష్టకార్యము మీఁద వచ్చినట్లు గనఁబడుచున్నారు. నసుకుచు మాటలాడవలసిన పనిలేదు. చెప్పఁదలఁచినమాట లేవో స్పష్టముగా గంభీరముగాఁ బలుకుఁడు. నావల్ల మీకెట్టిభయము లేదు. మనము పాఁతచుట్టాలము గాని మొగమెఱిఁగలేనివారము గాము" అని చిత్రభానుఁడు కంఠమెత్తి పలికెను. "అయ్యా! నసుగుచు నగము చెప్పఁదలఁచుకొని రాలేదు. చెప్పవలసిన దేమో సంపూర్ణముగాఁ జెప్పిపోయెద" నని మాధవసేనుఁడు చెప్పెను. "అదే నాకుకావలసిన" దని చిత్రభానుఁడు మరల నొక్కి పలికెను. అప్పుడు మాధవసేనుఁ డిట్లనియె— "మనము చిరకాల మిత్రులము. అయినను స్వధర్మనిర్వహణము మానవునకు విధిగావున నేనప్రియము చెప్పుటకు వచ్చితిని. ఇందుకు మీరు నన్ను క్షమింతురుగాక! మీ యన్నగారు నిమ్మునఁ గొన్ని కారణములచేత వెడలనడఁచిరి గదా! ఆక్షణమే మీరు దేశము విడిచిపోయిరి. ఇప్పుడు రాజకుటుంబమును బరామర్శచేయుటకై వచ్చిరిగదా! మీరు మీకుటుంబము బంధుమిత్రసహితులై వచ్చుట, విపత్సముద్రమున మునిఁగిన రాజపత్నిని రాజపుత్రులను సమాశ్వాసింపుటకు యుక్తము. మొట్టమొదట మీరు మీకుటుంబమువచ్చి పరామర్శించినపిదప నగరము విడిచి పోవునట్లు మాటనిచ్చిరి. మీమాట మీరు నిలుపుకొనుఁడు. మీరు మహారాజపుత్రులు. మహారాజసోదరులు. చంద్రవంశసంజాతులు. మీపూర్వులందఱు నాడితప్పనివారు. కావున మాటతప్పక సకుటుంబముగా మీరు శ్రీనగరము విడిచి మూఁడుదినములలో వెడలవలయు. ఇది రాజశాసనము. రాజమాతృశాసనము. మీరొకరిని శాసించువారే గాని యొకరిచే శాసింపఁబడువారు కారు. మీభృత్యులమైన మేము మీకుఁజెప్పవలసినవారము గాము. మీయన్నగారున్నప్పుడు మీరు వచ్చివారియనుమతముననో వారిశాసనముఁబ్రతిఘటించియో యిక్కడ

నుండిన నదిశ్లాఘ్యమైయుండును. వారిమరణానంతరమున సమాశ్వాసము పేరుఁబెట్టి వచ్చి భర్తృవియోగముచేత మూలఁబడియున్న రాణిని లోకానుభవము లేనిపిన్నరాజును లోకువచేసి యుచ్చాటనుండుట భావ్యముగాదు. ఇదియేనామనవి. అని సంపూర్ణముగా నతఁడు చెప్పఁదలఁచినదంతయుఁజెప్పి ముగింపకమునుపే చిత్రభానుని మొగము గీచినకంపదుంపవలెనెఱ్ఱవడెను. కనుబొమలు ముడివడెను. కన్గొనలు గురివిందగింజలట్లెఱ్ఱవడెను. పెదవులదరఁజొచ్చెను. మేనుగగుర్పొడిచెను. ఆగ్రహాగ్రహము వానిని సంపూర్ణముగనావేశించి వశపఱచికొనెను. అపుడు వానినోటనుండి యుచ్చైస్స్వరముతో నీక్రిందిమాటలు వెడలెను.

“మాధవసేవకుఁడా! నీవును నీకన్న నీచుఁడైన మణివర్మయు మాయన్నతో నామీఁద గాలి ప్రోఁగుఁజేసి నేరములు కల్పించిచెప్పినకొండెములుచెప్పి మాయిరువురమైత్రిఁజెఱిపి పరస్పరద్వేషములు గలిగించిరి. మాయలమాఁటలకు మీమాటలు వేదవాక్యములుగానమ్మి వెంగలియగుమాయన్న నన్ను దేశమునుండిపొమ్మనెను. ఆతఁడు పెద్దవాఁడగుటచేతను, నేను మంచివాఁడనగుటచేతను, నానిర్ణయ మధర్మగర్భితమైనను వానియందలిగౌరవముచేత వానియాన శిరసావహించి యాలుబిడ్డలవెంటఁగొని నేను దేశాంతరమునకరిగితిని. తండ్రిలేని బిడ్డలను నవవైధవ్యదుఃఖితయైనవదినెను జూడవచ్చుటతప్పా? నన్ను మీరుపొమ్మని నిర్బంధింపకపోయినపక్షమున నాయంతటనేనేవెడలిపోయియుండునుగాని నాపురనిర్గమనమునుగుఱించి మీ రింత పట్టుబట్టుచున్నారు. కావున ముక్కంటి వచ్చినను నే నిక్కడనుండి కదలువాఁడనుఁ గాను. ఎవ్వఁడు వచ్చి నన్నిక్కడనుండికదపునో చూచెదఁగాక! వ్రేలితో నవ్వలఁద్రోసివైచుటకిది గుండు గాని బెండుగాదు. మీబెదరింపులకుఁ బాఱిపోవుటకిదిపిల్లిపిల్లగాదు సింగపుఁగొదమగాని. ఇదినా

తండ్రి రాజ్యము, నా తాత దేశము, నా ముత్తాతల యార్జితము. ఇది నా జన్మభూమి. కావున నే నిక్కడనుండి కదలను. స్వామిద్రోహులైన నీవును మఱియిస్త్రకసు నాఁడుగాని యున్నవాండ్రను గన్న బ్రామిరాజ్యము పంచుకొనుటీనవలెనని చూచుచున్నారు గాబోలు! నేనిటనుండి పోనని మీరున్న రాజుతోను రాజమాతతోను వృద్ధజంబుకమైన మణివర్మతోను గట్టిగఁ జెప్పుము. పొమ్ము. పూర్వమిత్రుఁడవు బ్రాహ్మణుఁడవు నగుటచేఁ గటాక్షించితిని గాని కానిచో నిట్టిసందేశముఁ దెచ్చినందుకుఁ గత్తితో నీ నుత్తుక నుత్తరింపవలసినదే."

అట్లు చిత్రభానుఁడు కటువ్రిముగాఁ బలుక మాధవసేనుఁడును రోషఘూర్ణితమనస్కుఁడై యిట్లనియె—"రాజకుమారా! కుత్తుక నుత్తరింతునని నీవుపలికిన నే జడియువాఁడను గాను. నీ కట్టి సంకల్పము గలదేని నీ సంకల్పము దేర్చుకొనుము. బ్రాహ్మణుఁడ నని నీవు దయ దలఁపనక్కఱ లేదు. మా రాజశాసనము ననుసరించి మేము నీతోఁ జెప్పవలసినమాట జెప్పితిమి. నీకడ మేము సేవ జేసినను నీయాజ్ఞ నెఱవేర్పవలసినవార మెగదా! సేవకులమీఁద నాగ్రహించిన లాభ మేమి? వార్తాహరులను దెగటార్చుట పౌరుషము గాదనియు నీతి గాదనియు రాజపుత్రుఁడ వైన నీవే యెఱుఁగుదువు. ఎఱిఁగియుండియు నిట్టిసంభాషణలు చేయుదువని యెన్నఁడుఁ దలంచియుండలేదు. హేమచంద్రునియనుజుని నోట నిట్టిమాట వెడలుట మిక్కిలి యాశ్చర్యము. సరే! మీ ప్రత్యుత్తరము మా రాజునకు, రాజమాతకు నెఱిఁగించెద. ఇంక మాకు సెలవిమ్ము." అని చివాలున లేచిపోయెను. అతఁడు వెళ్లినపిమ్మటఁ జిత్రభానుఁడును మాధవసేనునివిషయమునఁ దాను గావించిన సంభాషణ కతనమై రాజకుమారోచితముగా లేదనియుఁ దాను తొందరపడెననియు నతఁ డించుక పశ్చాత్తప్తుఁడై విచారించి మరల నెప్పటియట్ల బింకము గలిగి యుండెను.

రుద్రభట్టు చిత్రభానునితోఁగూడ శ్రీనగరమునకు వచ్చినది మొదలు వానికి నఖిలవిషయములయందు నుపదేశము చేయుచునే యుండెను. చిత్రభానుఁడు వానియుపదేశము పరమప్రమాణముగా, వేదవాక్యముగా గ్రహించుచుండెను. కొన్ని కారణములచేత రుద్రభట్టు బహిరంగముగ నెల్లవారికిఁ గనఁబడుట కిష్టపడమి మేడమీఁద నొకమూలఁ గృష్ణాజినము బఱచుకొని శాలువగప్పుకొని సంస్కృత గ్రంథమేదో చూచుకొనుచుండును. చిత్రభానుఁడు సన్నిధానమున కరిగి విషమసమస్యలవంటి సందిగ్ధవిషయములలో నాలోచన యడిగినప్పుడు బూర్వోత్తరపరిస్థితులఁబరికించి యుపదేశము చేయుచుండును. దండపాణియు వజ్రపాణియుఁ దప్ప రాజసేవకులలో నెవ్వరికి నతఁడు కనఁబడలేదు. మాధవసేనుఁడు తన్ను విడిచివెళ్లినతరువాతఁ జిత్రభానుఁడు మేడమీఁదికిఁబోయి రుద్రభట్టునకు నమస్కరించి తనకు నయ్యమాత్యునకు జరిగినసంభాషణ మంతయుఁ జెప్పెను. అతఁడు విని "రావలసినపరిస్థితులు వచ్చుచున్నవి. వీనికెంతమాత్రము నీవు జడియవలదు. నీవు మాధవసేనునకుఁ జెప్పిన ప్రత్యుత్తరము రాజకుమారోచితముగా నున్నది. అంత తీవ్రముగఁ బలికినందుకుఁ బశ్చాత్తాపము నొందితి నంటివి. పశ్చాత్తాపమున కవసరము లేదు. సన్నిపాతజ్వరమునకు మేకు గాల్చి వాత బెట్టుటయే మందు. ఇప్పుడునీవు దండపాణిని వజ్రపాణిని బిలిపించి కార్యాలోచనముఁజేసి తెంపుసేయవలయు. గొప్పసందిగ్ధసమయమువచ్చినది. నీవిప్పుడు సంశయింపక సాహసింపఁదగును. ఆదండనాథులిద్దఱు నేమికోరుదురో యవియెల్ల వారికొడఁగూర్చునట్లు బాసచేసి వారిని నీయధీనము చేసికొనవలెను. సైన్యమంతయు వారిచేతిలోనున్నది. వారు నీకువశవర్తులగుదురా కాశ్మీరరాజ్యలక్ష్మి నీవశవర్తినియగును. ఈ రేయి వారిం బిలిపించి మంతనముండవలయు. అంతయు వారితో

నున్నది, అర్ధరాజ్యమడిగినను నిచ్చునట్లు వాగ్దానముచేయుము." అని
గట్టిగాఁజెప్పెను. అట్లకాక! యని చిత్రభానుఁడు కరటకునిఁబిలిచి దం
డపాణి వజ్రపాణులను రాత్రిబిలుచుకొని రమ్మని యానతిచ్చెను. చీఁ
కటిపడినతోడనే కరటకుఁడు వారియొద్దకుఁబోయి తన స్వామి సం
దేశ మెఱిఁగించెను. జాము రాత్రియైనవెనుక వీథులు నిర్మనుష్యములై
నవెనుక రాజవీథులు పరిత్యజించి వారు సందుగొందులంబడి చిత్రభా
నుగృహముఁ జేరిరి. వారు లోపలఁబ్రవేశించినతోడనే వీధికవాటము
దృఢముగా బంధింపఁబడియెను. చిత్రభానుఁడు వారినెదుర్కొని మే
డమీఁదికిఁ గొనిపోయి రుద్రభట్టుసన్నిధానమున నిలిపెను. ఆముగ
మున వెండిరేకులఁ జెక్కినట్లు బూదిపిండికట్లుమెఱయ మెడలో స్ఫటికా
క్షసూత్రముఁ గదలాడుచుండ బ్రహ్మతేజ ముట్టిపడుచున్నట్లు - జింకతో
లుమీఁదఁ బద్మాసనమువైచికొని యపరశివునివలెఁ గూర్చున్న యా
బ్రాహ్మణునిఁ జూచియన్నదమ్ములు తత్పాదములకునమస్కరించిరి.
అతఁడు "మనోరథసిద్ధిరస్తు" అని దీవించి రత్నకంబళములపైఁ గూర్చుం
డ నియమించిన వారందరు సుఖాసీనులై యుండిరి. చిత్రభానుఁడును
వారిప్రక్కనె కూర్చుండెను. రుద్రభట్టునకుఁ గుడిప్రక్క నొకమూఁ
కుడులో నగ్ని వెలుఁగుచుండెను. అది యారిపోకుండ నడుమనడుమ
నతఁడే రెండుమూఁడు సమిధలువేయుచుండెను. అప్పుడురుద్రభట్టు
ముందుగానిట్లు సంభాషణ మారంభించెను.— "అయ్యా! నేను చి
న్ననాఁటనుండి యాసేతుహిమాచలమగు భరతఖండమంతయుఁ దిరి
గినాఁడను. ఎన్నో దేశములుజూచినాఁడను. ఎందఱో రాజులతో సంభా
షించినాఁడను. బహుజనులస్వభావములను గ్రహించినాఁడను. కాని,
మీవంటిసజ్జనులనెందుఁ జూడలేదు. మైత్రియనఁగా మీదే
మైత్రి. మిత్రుని నిమిత్తము ప్రాణములనయిన ధారవోయునట్టి
సజ్జనులను మిమ్మే చూచితిని. అట్లేకానిమొడల నీయర్ధరాత్రమున

నీ గాఢాంధకారమున కెవ్వరెఱుఁగకుండ నతిరహస్యముగ ముసుఁగు లువైచుకొని యెంతోకష్టపడి మీ రీమిత్రుని గృహంబునకు వత్తురే? ఇంతశ్రమ మీ రేలపడవలె ? మీ రంతటివారు మీరు. విశేషించి కాశ్మీరసైన్యముల కధిపతులు. పిల్చినవాఁడో— రాజ్యములేనివాఁడు. పూజ్యతలేనివాఁడు. ధనములేనివాఁడు పరిజనములేనివాఁడు బలఁగములేనివాఁడు. అట్టివానిమాట తలఁదాల్చి మీరిట్లువచ్చుట మీచరిత్రమునకు వన్నెపెట్టుచున్నది. ఐశ్వర్యమున్నప్పు డందఱుమిత్రులె; ధనవిహీనునకు నాపత్కాలమున మిత్రులైనవారే మిత్రులు. అన్నయుఁ జుట్టములు, దేశీయులుఁ బరిత్యజింప నేకాకినై తిరుగు వీనిని మీరు చేపట్టినందుకు నేను మిక్కిలి సంతసించుచున్నాను. వేల్పులు సంతసింతురు. వెయ్యేల ! పరమేశ్వరుఁడు సంతసించును ? ఎడారిలో నొంటి తిరుగు బాటసారికి మంచినీటిచూయి దొరకినట్లు, పేరాఁకలికి నకనకంబడువానికి నట్టడవిలోఁ బండ్లచెట్లు దొరకినట్లు నిర్భాగ్యుఁడైన వీనికి వీనియదృష్టమున మీరు లభించిరి. ఇతనికి ముంగిట రెండుపెన్నిధానములు దొరికెను. రెండుకల్పవృక్షములు పెరటిలో లభించెను. ఆవృక్షచ్ఛాయ నింకజల్లఁగ మనఁగలఁడు. ఆశాఖలు బట్టుకొని పై కెగఁబాకగలఁడు. అతనిముంచినఁ దేల్చిన మీదేభారము." అనవుడు దండపాణి వినయముతో "స్వామీ! మేమేమిచేయఁగలము? పూర్వమైత్రిచేత మే మీయనను వదలలేక పట్టిపాకులాడుచున్నాము. మాచేతనైన సాయము చేయఁగలము. ఇప్పుడు మమ్ముఁ బిలువనంపిన కార్యమేదో సెలవియ్యవలయు" నని పలికెను. పలుకుటయుఁ జిత్రభానుఁడు వారి చెఱియొకచేయి తన చెఱియొకచేతితోఁ బట్టుకొని మెల్లగా నిట్లులనియె.— మిత్రులారా ! నేను భయపడుచునే యిటకువచ్చితిని. వచ్చినందుకు నే ననుకొన్నంతపని జరిగినది. మాధవసేనుఁడు నిన్నవచ్చి సకుటుంబముగా నన్నీయూరినుండి పో

మ్మని తమ రాజుయొక్కయు రాజమాతయొక్కయు శాసనమైనదని చెప్పెను. అది విని కోపపరవశుఁడనై నే నిక్కడనుండి కదలనని దృఢముగాఁ బలికితిని. ఆపలుకుల కేమి ! నన్నిక్కడ మీరుండుమన్న నుండెద. పొమ్మన్నఁ బోయెద. నాకు నిలువనీడ లేదు. చెట్లమీఁది పక్షికైనను నెలవున్నదిగాని నాకు నెలవులేదు. సువిశాలమైన యీ విశ్వమే నామందిరమైనది. నక్షత్రయుతమైన యాకాశమె మణిరంజిత వితానమైనది. మెత్తని పచ్చిక బయళ్ళు రత్నకంబళములైనవి. వృక్షచ్ఛాయలు పందిళ్లయినవి. అడవులు పూవుఁదోఁట లయినవి. రాజకుమారుఁడనై నందుకు నే నీవిధముగా భోగముల ననుభవించుచున్నాను. విదర్భలో నుండుదు మన్న నత్తవారి యింటబ్రతుకుకన్న హీనమైనది మఱియొకటిలేదు. అదిగాక చంద్రవంశజుఁడనై విక్రమసేనుని గారాబుకొడుకునై యమిత సౌఖ్యంబు లవ్వారిగా ననుభవించిన నేను పరులపంచల నొకరిచేతిక్రింద నొదిగియుండఁగలనె? వెనుక మాయన్నయంకలి గారవముచేతఁ నే నెట్టెటో వీడువిడిచి పోయితిని. ఇప్పుడు నాకిక్కడ నుండవలెనని యున్నది. మీయుత్తాలభుజలీల యూఁతకోలగా నే నిందు నిలువఁబడఁ దలఁచుచున్నాఁడ. మీరు ససైన్యముగా నాకు బాసటయై నిలిచిరేని యీకార్యముతుద నెగ్గును. ఇందుకు మీకు నేను బ్రత్యుపకారము మీయిచ్ఛాప్రకారముఁ జేసెద. నన్నిక్కడ సుప్రతిష్ఠితునిఁ జేసితిరేని మీకష్టైశ్వర్యములొసఁగుదును. చదరంగపుటాటలో నొకగుఱ్ఱమును మఱియొకగుఱ్ఱము గాచినట్లు నన్ను మీరు గాతురేని మిమ్మునేను మహోన్నత దశలో నిలుపుదును. ఇన్నిమాట లెందుకు ! కాశ్మీరరాజ్యమే మీది. మీ మనస్సులో నున్నకోరికయేమో దాఁచక చెప్పుఁడు. సముఖమున రాచుశారము లెందుకు? చల్లకువచ్చి ముంతదాఁచనేల? అని యుపన్యసింప దండపాణి వెంటనే యుత్తరమీయలేక సందేహించెను. అతని

మొగమునఁ జెమటలు తోఁచెను. అతఁడు భయపడినట్లు కనఁబడెను. వజ్రపాణి వెలవెలఁ బోయెను. చిత్రభానుఁడు దండపాణిమీఁదఁ జేయి వైచి "మిత్రుఁడా! ఏమి భయపడుచున్నట్లున్నావు? ఇది సేనాపతికిఁ దగినలక్షణము గాదు. క్షత్రియుఁడవు. మహావీరుఁడవు. జంకన్నది నీవున్నయూరనుండఁ గూడదు అట్టిదానికి నీమనస్సునెలవుగాఁ గూడదు." అని హెచ్చరించుచుండ దండపాణి "రాజద్రోహము. రాజద్రోహము." అని మెల్లఁగాబలికెను. అదివిని చిత్రభానుఁడు "రాజద్రోహమా? నేనుమాత్రము రాజునుగానా? ఈవఱకు నాయెడలఁ జేసిన ద్రోహమునూ ఏమిచెప్పెదవు. మిత్రులయినందుకు నాకుజరిగిన యన్యాయమునకు మీరు ప్రతిక్రియ సేయవలయు. అవి పిచ్చిమాటలు, రాజెవఁడు? మీ రాజు చనిపోయినాఁడు. ఈపసికూన నీకు రాజా? మూలఁగూర్చున్న యీపింతంతువు నీకు శాసకురాలా? ఇంతబ్రదుకు బ్రతికి చివర కాఁడుదాని శాసనములా నీవుశిరసావహింపవలసినది? దుస్తంత్రపేటికయైన యీముసలిరాబందు మణివర్మయా నిన్నుశాసించువాఁడు? ఛీ! ఈ పిఱికితనము విడువుము. వజ్రపాణీ! నీహృదయము వజ్రమువలెనుండవలె. మున్ను నేపాళసైన్యముల నుఱుమాడిన యాధైర్యమొకసారి నీమనమున నెలకొల్పుము. పిఱికికండలను దూరముగఁ దొలఁగింపుము. ధైర్యము చిక్కఁబట్టుము." అని మందలించెను. వజ్రపాణియేదో యుత్తరము చెప్పఁబోవుచుండ రుద్రభట్టందుకొని "రాజద్రోహము భీరువులమాట. మీరెవరిని రాజునుజేసిన వాఁడేరాజు. చిత్రభానుని రాజుం జేయుఁడు. అప్పుడుమీరు రాజభక్తులగుదురు. ఇతఁడు విక్రమసేనునికొడుకు గాఁడా! శూరుఁడుగాఁడా? రాజ్యము సమర్థతతోఁ బాలింపలేఁడా? సైన్యముల నడుపలేఁడా! సమరముల విక్రమవిహారము సలుపలేఁడా? వీనికేమి కొఱఁత? మీ మనంబుల శంకలుబాఱఁద్రోలి యీ

తని రాజుం జేసి ధనము, పలుకుబడి, యధికారము, నన్నియుఁగలిగి మీరు మెలంగుఁడు. అదిగో! లక్ష్మివచ్చుచున్నది. మోఁకా లడ్డు పెట్టకుండ దక్కుచూలిన యీచిత్రభానుని బాగుచేసినప్రతిష్ఠ మీకు దక్కుఁగాక! మీయభిప్రాయముఁ జెప్పుఁడు? అని ప్రబోధింప దండపాణి మహాత్మా! సందియము లేదు. చిన్న రాజును దండపాణి మోసముచేసి శత్రుపక్షముఁ జొచ్చినాఁడని లోకాపవాదము గలుగునని సందియపడుచున్నాను. అని మెల్లగాఁ జెప్పెను. వెంటనేరుద్ర భట్టు "లోకాపవాదమా? లోకుల నందఱు మెప్పింపఁదరమా! మన కిష్టమైనపని మనముచేయవలయునే గాని లోకులిట్లనుకొందు రట్లను కొందురని శంకించిన నొక్కకార్యముఁ జేయఁగలమా? స్వబుద్ధినను సరించిపోవుట శ్రేయము. లోకులు కాకులు ఇష్టమువచ్చినట్లు కూయుదురు. ఆకూఁతలన్నిఁటిని మనము లెక్కసేయరాదు. ప్రతిమనుష్యునిఁ గొందఱునిందింతురు. కొందఱు మెత్తురు. ప్రతికార్యమును గొందఱుశ్లాఘింతురు. కొందఱు దూషింతురు. ఎల్లరు దేనిని మెచ్చరు. ఎల్లరు దేనిని దూషింపరు. "ఆత్మబుద్ధి స్సుఖఁచైవ" యను నార్యోక్తి వినవే? ఎల్లవారికినంతఃకరణ ప్రవృత్తియే ప్రమాణము. కావున నీవిందు సందియంపడక చిత్రభానుని కండవై నిలువుము. ఇదేసమయము. జంకినలాభము లేదు. వెనుదీసినఁ బ్రయోజనము లేదు. అదనుపదనుదప్పిన మరలఁ గూడిరాదు." అని గంభీరభావముతోఁ బలికెను. దండపాణి మారాడలేక వారియుపన్యాసములకు దాసుఁడై "మీయిచ్ఛవచ్చినట్లు జేసెద. ఈశరీరము మీది దీనిని మీయిష్టము వచ్చిన ట్లుపయోగించుకొనుఁడు. నాతమ్ముఁడు నాతోడిపాటివాఁడే. మేము చిత్రభానునికొలఁకుఁ జిచ్చులుకుమన్న నుఱుకుదుము. జలధిఁ బడుమన్నఁ బడుదుము. పంచప్రాణముల విడువుమన్న విడుతుము. కాని మేముగాక యితరసైన్యాధిపతులు కొందఱు గలరు. అందు

ముఖ్యముగ గదాధరుఁడు, శూలపాణిమున్నగు దండనాథులు రాజభక్తికిఁ బేరుపడినవారు. సేనలోఁ బలుకుబడి వారికిఁ గూడ మెండుగాఁ గలదు. వారు మనపక్షము రారు. ఆవిషయమై మనము గట్టిగ విచారింపవలెను. అదియటుండఁగా మాకోరికలు గూడ మీరు వినవలయుఁ జెప్పుమన్న జెప్పెద" నని చిత్రభానుని మొగమువంకఁ జూడ "నిస్సంశయముగాఁ జెప్పవచ్చును" అని యతఁడు పలికెను. "వ్యవహారముపట్ల మొగమోటముగూడ" దని రుద్రభట్టు చెప్పెను. అప్పుడు దండపాణి యిట్లనియె. "నాకూఁతురు మణిమాలికను విజయసేనున కిచ్చి వివాహము సేయవలెనని చిరకాలమునుండి నేనభిలషించుచుంటిని. ఆవిషయమై మీయభిమతమేమో తెలుపవలయు. ఇది నావిషయము. మాతమ్మునిమనోరథముగూడ జెప్పెద నాకర్ణింపుఁడు. సిగ్గుపెంపున వాఁడు చెప్పఁజాలకున్నాఁడు. మీకర్పూరమంజరి చెట్టబట్టవలె నని మావజ్రపాణి తడవులంబట్టి తలపెట్టియున్నాఁడు. మాతమ్మునిమనోరథము మీ రీడేర్పవలయునని కోరుచున్నాను. మాకింతకన్నఁ గోరికలు లేవు. మనమన్యోన్యమనోరథసిద్ధులుచేసిసుఖింపవలెనని నాప్రార్థన" అని విరమింపఁ జిత్రభానుఁడు "మన మిరువురము వియ్యమందుట నాకుఁ బరమానందకరము. విజయసేనుఁడు నీయల్లుఁడు నేఁడే యయ్యెనని నీవు నిశ్చయించుకొనుము. ఇఁకఁ గర్పూరమంజరిని వజ్రపాణి కిచ్చుట విషయమున దానిమనోరథమెట్లుండునో చెప్పఁజాలను. అయినను దానిమనసు విఱిచి తప్పక నీకు వివాహముచేసెద" నని దృఢముగాఁ బలికెను. అతనిపలుకునే దృఢీకరింపఁదలఁచి రుద్రభట్టుగూడ నిట్లనియె—"ఇదియా మీకోర్కెలు! ఇందసాధ్యమైనదియు, ననంభవమైనదియు నేదియులేదు. విజయసేనున కెవ్వతెనో యొకబాలికను దెచ్చి వివాహము సేయవలయునుగదా. ఆకన్య మణిమాలికయే యగుఁగాక! మణిమాలిక గుణమణిమాలికయని విందుము. అబ్బా

లిక విజయసేనుని సహధర్మచారిణియై యర్ధాంగలక్ష్మియై మహాపతివ్రతయై సంతానవతియై భావికాలమున శ్రీకాశ్మీరరాజపట్టమహిషియై వర్ధిల్లుఁగాక యని మేమాశీర్వదించుచున్నాము. కర్పూరమంజరి యీనాఁటిబాలికలవంటిది గాదు. జననీజనకులకు విధేయురాలు. చదువుల సరస్వతి. గానములప్రోవు. చక్కఁదనంపు దీవి. ఆమె తండ్రిమాట విని తప్పక వజ్రపాణి చేయిపట్టును. వజ్రపాణికి శచీదేవియుంబోలె నీవజ్రపాణి కీమె యిల్లాలై పేరుప్రతిష్ఠలఁగాంచి జయంతునిఁబోలు నందనుంగని చిరంజీవినియై వర్ధిల్లుఁగాకయని దీవించుచున్నాఁడ. నా యాశీర్వచన మమోఘమగుఁగాక! దివ్యులు ప్రసన్నులగుదురుగాక! చిత్రభానుఁడా! ఏమి యిది నీకిష్టమేగదా?" అన నతఁడు "సందేహములేదు. అట్లె జరుగుఁగాక" యనెను. "అట్లయిన మీరీయగ్నిసాక్షిగా నాయెదుటఁ బ్రమాణములు సేయుఁడు" అని రుద్రభట్టానతిచ్చి ఋగ్వేదములోని యగ్నిసూక్తమంత్రముఁ బఠించి యగ్నికభిముఖుఁడై యుండెను. చిత్రభానుఁడు లేచి యగ్నికిఁ బ్రదక్షిణముఁ జేసి "ఓ యగ్నిదేవా! నీవు సాక్షిగ మణిమాలికను విజయసేనునకు భార్యగాఁ జేసెద. కర్పూరమంజరిని వజ్రపాణికి వివాహముచేసెద. అని నమస్కరించెను. అనంతరము దండపాణిలేచి వహ్నికిఁ బ్రదక్షిణముచేసి "నేను సుఖదుఃఖములయందు నాప్రాణములకయిన నాసపడక చిత్రభానునిపక్షమున నుండెద. ఓయగ్నిదేవా! నీవిందుకుసాక్షివి" అని ప్రమాణముచేసెను. వజ్రపాణియు నన్న చేసినయట్లే ప్రదక్షిణముఁ ప్రమాణముఁ గావించెను. అనంతరము వారిరువురు రుద్రభట్టునకు నమస్కరించి గృహముల కరిగిరి. "వలలోఁ బెద్దచేఁపలు పడినవి. ఇఁక విజయమున కాటంకము లేదు. ఇఁక నిర్భయముగ నిద్రబోవచ్చు" అని రుద్రభట్టు చిత్రభానుని బహూకరించి పంపెను.

ఎనిమిదవ ప్రకరణము.

అట్లు మాధవసేనుఁడు చిత్రభానునకుఁ దనసందేశ మెఱిఁగించి యాతని వీడ్కొని మణివర్మకడకుఁబోయి తాను రాజసందేశ మెఱిఁగించుటయు నతఁడు తన్నుఁ దూలనాడుటయు రాజశాసనముఁ దిరస్కరించుటయు లోనగువృత్తాంతమంతయు నొకయక్షరమైన విడువకుండఁ జెప్పెను. సందేశఫల మట్లేయుండునని యిదివఱకే మనంబున నూహించుటంజేసి మణివర్మ వానిపలుకులు విని విస్మయము నొందలేదు. కాని యటమీఁది కర్తవ్యమేమియని యతఁడు విచారింపఁ దొడఁగెను. "మాధవసేనుఁడా! దండపాణియొక్కయు వజ్రపాణియొక్కయు బలముజూచుకొని మనయెడ నిట్టి తిరస్కారభావముఁ జూపియుండునా, లేక మాయమైన విదర్భరాజువలన సహాయమును నపేక్షించి యిట్లు తూలనాడియుండునా? ఏమని నీవూహించెదవు?" అని యడిగెను. "ఉభయుల ప్రాపుఁగూడఁ జూచుకొని యతఁ డట్టు పరుషప్రలాపములు నోటవెడలనిచ్చెను. అందుముఖ్యముగ నిక్కడివారి బలముఁ జూచుకొనియె యతఁడు నిశ్చయముగ నున్నాఁడు. అట్టిప్రాపు లేనియెడల రాజశాసనము ధిక్కరించుటకు వాఁ డెంతవాఁడు? పట్టుమని చూచితిమా పదిమంది సైనికులు లేరు. కావలసినవిత్తము లేదు. పలుకుబడి యంతకుముందే సున్న. ఇట్టివానికి ధైర్య మెక్కడినుండి వచ్చెను. ఏదో దృఢమైన మూలకారణ ముండియుండవలయు" నని పెద్దమంత్రికిఁ జిన్నమంత్రి యుత్తరమిచ్చెను. "సరే! ఈవార్త రాజమాతకు మన చిన్నరాజునకు నెఱిఁగించి వారియభిప్రాయ మేమో తెలిసికొని మనము చేయవలసిన యుపదేశముచేసి కర్తవ్య మిదమిత్థమని నిర్ణయింతము. శంఖమునఁ బోసినంగాని తీర్థము గాదుకదా? ఏకార్యమునకైన రాజశాసనము ప్రధానముగదా? పద పద. అక్క

డికి పోవుదము" అని యిరువురు రాచనగరునకుం జని యరవిందా దేవినిఁ గనుంగొనిరి. అప్పుడు మాధవసేనుఁడు తనకుం జిత్రభానునకు జరిగిన సంభాషణమంతయు వరుసగాఁ దెలిపెను. విక్రమసేనుఁడు తెల్లఁ బోయి మంత్రులవైపుఁ జూచెను. అరవిందాదేవి హృదయము చెదరి నట్లు ముఖవైఖరి తెలియఁజేసెను. "అట్లయిన మనకు మరల దుర్దినములు సంభవించినవా" యని యామె హీనస్వరముతోఁ బలికెను. "సైన్యమునుబంపి యాతని నేల వెడలఁగొట్టఁగూడదు?" అని విక్రమసేనుఁడు బలికెను. "అదియే మేమును జేయఁదలఁచుచున్నాము. కాని సేనాపతుల రాజభక్తి స్థిరముగానున్నదో యూఁగులాడుచున్నదో తెలిసికొనుట కష్టముగా నున్నది" యని మణివర్మ పలికెను. "వారింతలో నంతఃకృతఘ్నులగుదురా?" యని యరవింద వచియించెను. "నాకనుమానముగా నున్నది. అది యిప్పుడే నిశ్చయింపవలయును. కావున మనము ముందుగా గధాధరుని, శూలపాణిని బిలిపించి వారిమన స్సెట్లున్నదో కనుఁగొందము" అని మణివర్మ వాక్రుచ్చెను. "అట్లకాక!" యని నమ్మికగల బంటునొక్కనిఁ బిలిచి విక్రమసేనుఁడాదండనాథుల నిరువురఁ బిలుచుకొనిరమ్మని పంచెను. వాఁడు నతిత్వరితముగ నరిగి యాచమూపతులం దోడ్కొనివచ్చె. వారిని సముచితసత్కారములంగారవించి మణివర్మ సుఖాసీనులంజేసి హేమచంద్రుఁడు చిత్రభానునిగుణముల రోసి దేశమునుండి వెడలనడఁచుట మొదలు నాఁటివఱకు జరిగిన యావద్వృత్తాంతము మరలవారికి జ్ఞాపకము చేసి యిట్లనియె—

"మిత్రులారా! రాజ్యమున కావశ్యములైన సప్తాంగములలో సైన్యకోశములు ప్రధానములు. సైన్యమున్నఁగాని రాజ్యలక్ష్మి నిలువఁజాలదు. కోశము సమృద్ధిగానుండినంగాని సైన్యము తనధర్మము తాను చేయదు. కాశ్మీరరాజ్యమునకు పలసినంత కోశసమృద్ధియున్నది. సైన్య

ము మీవంటి సేనాపతులుండుటచే సర్వలక్షణసంపన్నమై సమర్థమై యున్నది. కాని రాజ్యమునకు వెండియుఁ జిత్రభానునివలనఁ గొన్ని కలఁతలు సంభవించునని తోఁచుచున్నది. ఒక్కకడుపునఁబుట్టి యొక్కచోఁ బెరిఁగి యొక్కమంచమునం బవ్వళించి యొకకంచమునం గుడిచిన హేమచంద్రుఁడే యతఁడని నమ్మఁజాలక గాఢమైన యనుమానము మీఁద దేశమునందుండఁదగనివాఁడని వెడలనడచెనుగదా ! హేమచంద్రుని మరణమునుగూర్చి యెట్టి వాడుకలున్నవో మీరే యెఱుఁగుదురు. చిత్రభానునిచరిత్ర మొకనాటకముగా నున్నది. ఎవఁడో హరిశర్మయనువాఁడు వచ్చి ప్రయాగలో చిత్రభానుఁడు మిక్కిలి దీనముగా మరణమొందెనని మాయమాటలుచెప్పి మహారాజుగారి మనస్సు కలఁచెను. ఆమనఃక్షోభముచేతనే యాయన వికలచిత్తుఁడై హరిశర్మచేతిబొమ్మయై యాడి మరణముఁ దెచ్చికొనెను. చిత్రభానుఁడు సజీవుఁడై తాయివలె నున్నాఁడు. చుట్టఱికమువంకబెట్టి తనయన్నబిడ్డలయందలి ప్రేమరసమెల్ల నిక్కడవర్షించుటకు మరలవచ్చెను. వీరింబరామర్శించి వెడలిపోవుమనని చెప్పఁగదా ! పిమ్మట నాలుబిడ్డలందెచ్చె. పురమువిడిచి పోవలసినదని సందేశమంప రాజమాతయొక్కయు, రాజుయొక్కయు శాసనము నిరాకరించి సందేశముం గొనిపోయిన మాధవసేనుని దృణీకరించి తూలనాడెను. ఆతఁడు నగరమునందుండుట రాజకుటుంబమునకు రాజ్యమునకు ననర్థకము. అతని నెట్లయిన వెడలనడువవలయు. కావున మీరందఱు నవసరమైనపక్షమున సైన్యములతో నాతనియిల్లు ముట్టడించి వానిని దేశమునుండి యావలకిఁ బంపవలయు. కఱుకుదనమెక్కుడైన మనము చుఱుకుదనమునెఱపి వానిని బంధింపవలయు. బంధింపవలె ననవేల ? అవసరమగునేని శిరచ్ఛేదముఁ జేయవలయు. ఇంతకఠినముగాఁ బలికితి నని మీరు నొచ్చుకొనవలదు. మంత్రులు వైద్యులవంటివారు. వైద్యుఁ

డు దయాళుఁడయ్యు నిష్కారణముగా వ్రణమునుఛేదించునట్లు మంత్రులు రాజద్రోహులను నిర్దయాత్ములై దండింపవలయు. ఇవియెల్ల నేను మీకు జెప్పవలసినవి కావు. ఇదిగో మీరాజు! అదిగో ఆతని తమ్ముఁడు అదే హేమచంద్రమహారాజపట్టమహిషి. వారినిమువ్వురను మాకు మీకు మీసైన్యమునకు నప్పగించి హేమచంద్రమహారాజు స్వర్గస్థుఁడయ్యెను. మీరు రాజభక్తిఁ జూపవలసిన సమయమిది. మీచిత్తనైర్మల్యముఁ బ్రకటింపవలసిన తరుణమిది. మీయున్నతభావముల వెల్లడింపవలసిన యవసరమిది. రాజ్యలక్ష్మిని గాపాడవలసినయదనిది. కావున మీరుమృతుఁడైన హేమచంద్రునిఁదలంచి రక్షణీయమైన రాజ్యలక్ష్మినిదలంచి, బాలుఁడై యేమియునెఱుంగకయున్న రాజు మొగముజూచి నవవైధవ్యదుఃఖభారవినమ్రయైన దేవిమొగముఁజూచి, భగవంతుని మొగముఁ జూచి, మోమోటవిడిచి చిత్రభానునిమాయలలోఁబడక యాతని వెడలనడఁచుటకు సర్వప్రయత్నములఁ జేయవలయు. దండపాణి వజ్రపాణులవై ఖరి వేఱు తెఱంగుగా నున్నదని యనుమానము గలుగుచున్నది. అయిన నిట్లు నిశ్చయముగాఁ జెప్పఁజాల. ఇదిమీకు సమ్మతమగునో కాదో చెప్పుఁడు. మనసులో నొకటి పెట్టుకొని పై కొకటి చెప్పవలదు.

అప్పలుకులు గదాధరశూలపాణుల హృదయంబులం గదలించుటంజేసి వారుత్సాహాపూరితులై రాజభక్తి ప్రేరితులైరి. గదాధరుఁ డిట్లనియె. "మహాత్మా! సైన్యము రాజ్యలక్ష్మికి సంగరక్షకబలము. అది సమర్థమై యుండ దేని రాజ్యలక్ష్మి యచిరకాలంబునఁ బరహస్తగతయై నశియించు. ఇంతవఱకుఁ గాశ్మీరసైన్యంబులు సమర్థంబులై శత్రుదుర్భేద్యములై పరచక్రభయంకరములై యున్నయవి. దండపాణియు హేమచంద్రునియెడ భక్తితత్పరుఁడై యుండెను. అతని మనస్సు వాని తమ్ముని మనస్సు మాఱుటకుఁ దగినకారణ

ములు నాకగపడవు. అయినను దగినకారణము లుండినంగాని మీరు వారిచరిత్ర మనుమానాస్పదమని పల్కరు. వారెట్లయిన నగుదురు గాక ! నామాట జిత్తగింపుఁడు. ఈలోకమున నెవఁడైన హేమచంద్ర మహారాజునెడఁ గాశ్మీరరాజవంశమునెడ నాజన్మాంతముఁ గృతజ్ఞుఁడై యుండవలయునేని నిశ్చయముగ నట్టివాఁడు గదాధరుఁడే. గదాధరుని జీవనమంతయుఁ గాశ్మీరరాజుల ద్రవ్యమే. రక్తమంతయుఁ గాశ్మీరరాజుల ప్రేమరసమే. అట్టిగదాధరుఁడు కృతఘ్నుఁడగునేని నింకబ్రపంచమునఁ గృతజ్ఞత యనుమాట లేదనవచ్చును. నాపూర్వపు వృత్తాంతము నిమ్మహాదేవియు నీచిన్నిరాజు నెఱుంగకపోవచ్చును గాని సంపూర్ణముగ మీరెఱుంగుదురు. నేనొకరాచబిడ్డఁడను. హిమాలయపర్వతప్రాంతమున నొకకొండపల్లియ మాయునికిపట్టు. మా తండ్రికృషీవలుఁడు. నాజననీజనకులకు నేనొక్కఁడనే పుత్రుఁడను. మందభాగ్యుఁడనైన నేనుదయించిననాఁడే నాతల్లి భూలోకమును బాసి పరమపదమునొందెను. నిఱుపేదయైన నాతండ్రి నాకుందల్లియై పురిటి మంచమెక్కి యుగ్గుపాలుబోసి పెంచి మిక్కిలికష్టపడి నన్నుం బదియేండ్లవానింజేసెను. ఆపదలకదృష్టహీనులు పరమబంధువులు. నాతండ్రి నాపదియవయేట నన్నును దనకు నితరులకుఁగూడ భారముగనున్న తన శరీరమును విడచి పరలోకముననైన సుఖముకలుఁగక పోవునా యని యచ్చటికిఁ జనెను. అప్పుడు చేయునది లేక నేనుకొన్ని దినంబులు చుట్టములయింట నిరుగుపొరుగు వాండ్రయింటఁ గాలక్షేపముఁ జేసి వారిచేఁ దిరస్కృతుఁడనై కట్టగుడ్డలేక నిలువనీడ లేక తినుటకన్నము లేక యాదరించుటకాప్తులు లేక నాది యనిచెప్పఁదగిన పదార్థము లేక పొట్టజరుగుటకుపాయముగానక మాధుకరవృత్తిచేత భిక్షాటనముచేత నొకపూఁటతిన్నట్లు నొకపూఁటతిననట్లు గొన్నిప్రొద్దులుపుచ్చి విసిగి దుండఁగులగు బాలకులఁ గొందఱంగలిసి చిన్నచిన్నదొంగతనము

లారంభించితిని. క్రమక్రమముగా నందారి తేఁటి పదియేనేండ్ల ప్రాయమున బందిపోటుల జట్టులోఁ గలసితిని. హేమచంద్రమహారాజుతండ్రి విక్రమసేననృపాలుఁడు కాశ్మీరమును బాలించుచు దేశక్షేమమరయుటకై మంచుకొండదాఁపున నున్న ప్రాంతముల కొకసారివచ్చెను. ఆ ప్రాంతమున వసియించుజనులు "దురాచారులగు చోరులబాఁటినుండి తెమ్ము రక్షింపు" మని యా నరేంద్రుని వేఁడ నతఁడక్కడఁగొన్ని దినములుండి సైనికులచేత బందిపోటుల వెతకించిపట్టించి వారిలోఁ బెక్కండ్రకుఁ దగినదండనల విధించి నన్నుఁ జూచి యిట్లనియెను. "ఓరీ! నీది లేఁబ్రాయము. ఆకారమునుజూడ సద్వంశజాతుఁడవని తోఁచుచున్నది. మొగము విలాసమును గ్రక్కుచున్నది. నీ తెలివి తేటలు నీసాహసము నీబాహుబలము మంచిదారినుపయోగించిన లోకమునకెంతో మేలగు. నీవు నీవృత్తిమాని వెనుకటి కార్యములకై పశ్చాత్తాపమునొంది సన్మార్గమున సంచరింతువేని నీభవిష్యచ్చరిత్రము శ్లాఘాపాత్రమగును. ఈతలంపుల విడువుము. నావెంటరమ్ము" అని దయార్ద్ర హృదయుఁడై పలికిన యానరపాలుని వాక్యములు నాచెవులలో నిప్పుడును ధ్వనించుచున్నట్లున్నవి. కరుణారసపరిపూర్ణములైన యాయనచల్లని చూడ్కులు నామీఁదనిప్పుడు ప్రసరించుచున్నట్లున్నవి. శాంతరసమొలుకు నామహాత్ముని మూర్తియిప్పుడు నాకన్నులఁ గట్టినట్లున్నవి. ఆయనవాక్యామృతము నాశ్రవణములఁ బడినతోడనే నామనోమాలిన్యమునీటం గడిగిన తెఱంగునఁ దొలఁగిపోయెను. మనస్సు నిష్కలుషమయ్యెను. పశ్చాత్తాపమహాగ్నిచేఁ బాపపటలము భస్మమయ్యెను. ప్రాఁతయాకులూడిపోయిన చెట్టువలెఁ గుబుసమూడ్చిన త్రాఁచువలె నామనసప్పుడు స్వచ్ఛమై యుండెను. వెంటనే నేనామహాత్ముని పాదములపైఁ బడి 'దేవా! నాతప్పులు క్షమింపుఁడు. నేను మహాపరాధిని. దండ్యుఁడను. మీదండనలకన్న మీహితోపదేశమే నాకు

గొప్పశిక్షయై నన్నుశుద్ధునిఁ జేసెను. పశ్చాత్తాపమహాగ్ని నాహృదయముఁ గాల్చుచున్నది. ఇఁక నేసన్మార్గమున సంచరించెద. ఇఁక నన్ననుగ్రహింపుఁడు, అని వలవలనడ్చి యారాజశేఖరుని పాదరాజీవముల నాబాష్పధారలచే నభిషేకించితిని. భూమండలాఖండలుఁడగు నప్పుడమితేఁడు నన్నుస్వయముగా దనచేతులతో నెత్తి వగవకు బాగుపడియెదవని ధైర్యముచెప్పి చేతితోఁ వీపుపైఁదట్టి నన్ను స్నానము చేయింపుమనియు నూతనవస్త్రముల నాచేఁ గట్టింపుమనియు సేవకుల కానతిచ్చెను. వారట్లు గావించిరి. అప్పుడు నేను క్రొత్తమనుష్యుఁడనైతిని. నామనోవృక్షమునఁ గ్రొత్త తలఁపులను జివుళ్లు మొలకలెత్తసాఁగెను. మహారాజుగారితో నేను రాజధానికివచ్చి విద్యాభ్యాసము జేయ నారంభించితిని. నేను మిక్కిలి శ్రద్ధగా జదివి గురువుల యనుగ్రహమునకుఁ బాత్రుఁడనైతిని. ఎప్పటికప్పుడు మహారాజుగారు నావర్తనముఁగూర్చియు నా విద్యాభివృద్ధిని గూర్చియు గురువులనడిగి తెలిసికొనుచు వచ్చిరి. సామాన్యవిద్యతోఁ బాటు ధనుర్విద్యయు నేర్చితిని. అందనేక బహుమానములు వడసితిని. గురువులయు సహకారులయు మెప్పుఁగాంచితిని. అంతలో నమ్మహారాజు పరమపదము నందెను. హేమచంద్రమహారాజు రాజ్యాభిషిక్తుఁ డయ్యెను. పితృభక్తిని హేమచంద్రుఁడు రామచంద్రుఁడు సత్యభాషణమున హేమచంద్రుఁడు హరిశ్చంద్రుఁడు ప్రసన్నభావమున హేమచంద్రుఁడు శరచ్చంద్రుఁడు. ఆతండ్రికిం దగినకొడుకు గావునఁ దండ్రిచే గారామునఁ బెంపఁబడిననన్ను మిక్కిలికనికరంబునం గని యమ్మహారాజు మరణంబువలన దుఃఖితుఁడనైన నన్ను నోదార్చి కొంత సేన కధిపతిం జేసి వివాహము జేసి నన్నొకయింటివానిం జేసెను. ఆమహాత్మునిదయవలన గౌరవమార్జించితిని. ధనమార్జించితిని సంతానవంతుఁడనయితిని గృహారామక్షేత్రములసంపాదించితిని. మిత్ర

లపాగత్తలకుఁజుట్టములు యాదరణకులోకులమన్న నకునాస్వామి యనుగ్రహమునకుఁ బెద్దల దీవనలకు భాజనమైతిని. ఉదయమున లేచి హేమచంద్రుని పేరుఁ దలఁచి విక్రమసేనుని నామముఁదలఁచి, మొక్కలిడుదును. నే వసియించు గృహము వారిది. తినెడియన్నము వారిది. కట్టుబట్ట వారిది. నాచర్మముఁగోసి పాదరక్షలుగఁ గుట్టి యామహాత్ములకిచ్చినను నాఋణముతీరదు. వారు మసిబొగ్గును దెచ్చి మాణికముఁ జేసిరి. నత్తగుల్లను ముత్తెపుఁజిప్పఁ జేసిరి. ఇత్తడిపుత్తడిఁ జేసిరి పశువును మానిసిం జేసిరి. ఇంతకన్న మహోపకార మెవ్వరు చేయఁ గలరు! ఇట్టినేను గాశ్మీరరాజులయెడఁ గృతఘ్నుఁడ నగుదునేని— ఛీ! నాజన్మమేల! జంతువులకయినఁ గృతజ్ఞత కలదు. పరమనీచమైన కుక్క పిడికెడన్నము వైచిన నది యెన్నఁడు మఱువదు. వృక్షములసైఁతము తమకుఁ జిన్ననాఁడు నీరువోసి పెంచిన మనుష్యులకు బ్రతికియున్నంత కాలము నీడనిచ్చును. కాయలిచ్చును. ఆకులిచ్చును. పండ్లనిచ్చును. చచ్చియు వారికనేకవిధములనుపకరించును. క్షుద్రజంతువులు, ప్రాణులునయితిమట్లే కృతజ్ఞత గలిగియుండ నీశ్వరాంశసంభూతుఁడై జ్ఞానేంద్రియవ్యాపారముఁ గర్మేంద్రియవ్యాపారముఁ గలిగి విద్యాసంపన్నుఁడైన మనుష్యుఁడు కృతజ్ఞుఁడగుట యాశ్చర్యమా? అది లేనివాఁడు వానరుఁడుగాని నరుఁడుగాఁడు. కావున నోమహాదేవీ! యోరాజా! యోయమాత్యులారా! ఈగదాధరుఁడు రాజకుటుంబమునకు రాజ్యమునకు క్షేమకరమగునట్లు వర్తించును. రాజా! బాలుఁడవయినను రాజవగుటచే మాకుఁ బూజ్యుఁడవు. అందుచే మీపాదములపై నేను ప్రమాణము చేసెద* అని మహోత్సాహముతోఁ బలికి రాజకుమారునిపాదములు స్పృశియించి ప్రమాణముచేసి రాజభక్తి బ్రకటించెను. అంతకుముందు నిరుత్సాహముచేఁ గ్రుంగియున్న రాజమాతృ విక్రమసేనుల మనస్సులు నూతనోత్సాహ భరితములగుటయు వారిమొగములు వికాసవంతము లయ్యెను.

అంతట మణివర్మ "గదాధరా! నీవృత్తాంతముఁ గొంత నే నెఱుఁగుదును. నీ నడత నీమాటలకు విస్పష్టవ్యాఖ్యానముగా నున్నది. ఉప్పునీరు మంచినీరుగామాఱినట్లు ఎండ కాలవిశేషముచే వెన్నెలయైనట్లు దురాచారుఁడవు పరమసాధువైతివి. నాఁటనుండియు నీచరిత్రము శ్లాఘాపాత్రమై యున్నది. మేము నిన్ను నమ్మియుండెదము. శూలపాణీ! నీయభిమతమేమో చెప్పుము!" అని యడిగెను.

అనవుఁడు శూలపాణియిట్లనియె. "మహాత్మా! చెప్పుట కేమున్నది. కుత్తుకలో విసముఁబెట్టుకొన్నవాఁడునైనను రాజునెదుట విపరీతముగాఁ బలుకునా? తేనెతేటలూడిపడునట్లు పలుకును. నానడతయే నాభావమును వెల్లడింపవలెను. పలు పలుకులేల! నేనుఁ గదాధరుని తోడివాఁడనే. అతనిమనస్సు నామనస్సునొక్కటియె. అవసరమగునేని మేమిరువురము మాప్రాణములను మాచిన్నరాజునిమిత్తము సమర్పించెదము. మాశిరస్సులు రాజ్యలక్ష్మికిఁ గానుకగానిచ్చెదము. ఇంతకన్న వేఱుచెప్పవలసినదిలేదు. దండపాణిని వజ్రపాణిని గూడఁ బిలిపించి వీరిద్దఱియెదుట వారిమనోగతము నరయుఁడు. మాటలంబట్టియు ముఖలక్షణములంబట్టియు వారిభావమెఱుఁగవచ్చును. ఈవజ్రకుమారు వారితోమాటలాడియుండుటవేఱు; రాజునెదుటఁ బలికించుట వేఱు."

"అదితెన్నయైనపని" యని మాధవసేనుఁడు హెచ్చరించెను. "వారురాకుండనే మాకుముందుగా సెలవియ్యదగును." అని గదాధరుఁడు వెండియు నిట్లనియె. "ఈస్థితిగతులలో నామనవియొకటివినుండు! వెంటనే చిత్రభానుని వెడలఁగొట్టుటకు మనము ససైన్యముగా వానియిల్లు ముట్టడించుట కర్జముగాదు. వారిచేష్టలు మనము కనిపెట్టుచుందుము. మీఁదుమిక్కిలివచ్చినవెంటనే మేమువానిం దాకుదుము. రేపుమాపు వచ్చినతొందరలేదు. నాకిపుడు సెలవొసంగుఁ

డు. పోయి వచ్చెదన. అని యండఱవీడ్కొని శూలపాణిసహితుఁడై వెడలెను. మఱియొక పరిచారకుం బిలిచి దేవి దండపాణిని వజ్రపాణిని దోడి తెమ్మని బనిచెను. వాడతివేగమున వారిసదనముల కరిగి రాజశాసనమెఱిఁగించెను. "నీవుముందునడువుము మేము వెనుకవచ్చెదము" అనివారిరువురునొకముహూర్తము తమలోఁ దారురహస్యముగ మాటలాడుకొని సేవకుఁడరిగియొకగడియలో నేరాచనగరుఁ జొచ్చిరి. మనోమాలిన్యము పైకిఁదోఁచనోయన్నట్లు మొగములుతొంటియట్లుండక వికాసశూన్యములై యుండెను. మణివర్మవారినిగూడ సబహుమానముగా గారవించి యుచితాసనంబులం గూర్చుండఁబనిచి మెల్లగ నిట్లనియె.— "ఇదివఱకు నేను మీతోఁ జిత్రభానునివిషయమై ప్రసంగించినను మనరాజుగారుగూడ దద్విషయమున మీయభిప్రాయమునుస్వయముగాఁ దెలిసికొనఁగోరి మాతృశాసనమున మిమ్ము రావించిరి. మీహృదయమకలంకమని నేనెఱుఁగుదును. అదియే రాజుగారు మీనోటవినఁ గోరుచున్నారు. చిత్రభానుఁడు పురమునుండివెడలవలయునా లేదా! తనయంతటఁదాను వెడలకున్న మీరాతని సైన్యసహాయమున దేశమునుండి తోలవలయునని మనరాజుగారియాశయము. దండాధినాథులగుటచే నీకార్యభారము మీపైఁబడియున్నది. ఆవచనంబులు విని దండపాణి మొగము చిట్లించుకొని యిత్తెఱంగునఁ బలుకఁజొచ్చె. "అయ్యా! మున్నొకసారి మీరీవిషయమునన్నడిగిరి. అప్పుడునాకుం బోలిన తెఱంగున మీకుత్తరమిచ్చితిని. చిత్రభానుఁడు పురమువెడలిపోవలయునో లేదో నిర్ణయింపవలసినవారు రాజుగారును మంత్రులైనమీరునుగాని మేముగాము. కార్యనిశ్చయము మీరు చేసినవెనుక మీయాజ్ఞాప్రకారము దళములఁగొని శత్రుమర్దనము చేయుటమాపని. అదియునుఁగాక మాటిమాటికి మమ్ముంబిలిచి మాయభిప్రాయ మడుగుటకు మేము రాజద్రోహులమా! కుట్రలుపన్నుచున్నామా? మాకు

మాత్రము గౌరవము లేదా? ఇట్లవమానించుట మీకుఁ దగునా?" యని కఠినస్వరముతోఁ బలుకుచున్న యాదండపాణి మాటకడ్డము వోయి విక్రమసేనుఁడు "అయ్యా! దండపాణీ! మీరు రాజద్రోహులని యెవరన్నారు? మీరు కుట్రలు పన్నుచున్నారని యెవరు పలికిరి! రాజకార్యవిషయములను సమాలోచించుటకు మిమ్ముఁ బిలువనంపుట మిమ్మవమానించుటా? మణివర్మ యాడినమాటలలో దోషమేమున్నది? మీ కింతరోసమునకుఁ గారణమేమి? రాజ్యక్షేమమును జూడవలసినవారు మంత్రులు దండనాథులు గదా! పెంపుచెట్లకొమ్మలొండొంటితో రాపాడి నిప్పుబుట్టించి వనమెల్లఁ గాల్చునట్లు ప్రధానపురుషులగు మీరు పరస్పరవివాదములు గలిగి రాజకులమున కాపద వాటింపఁ జేయుదురా? ఇది ధర్మమా? శూరకర్మమా?" అని గంభీరముగా నడిగెను. అడుగుటయు దండపాణి మొదటికన్నఁ గొంచెము శాంతించి తనచిన్నప్రభువున కిట్లనియె. "రాజా! మణివర్మ వైఖరిఁ జూడ మాయెడ నవమానము బూనినట్లు దోఁచుచున్నది. మేము నవమానింపవలసిన వారము గాము. ఈవఱకు రెండుసారులు మమ్మతఁ డీవిషయమునఁ బ్రశ్నించుటం జేసి యాత్మగౌరవముఁ గలవారమగుటచే సహింపక కష్టముగానున్నది. అందుచేనట్లనవలసివచ్చె. అంతేగాని దేవరవారియెడ మాకెట్టి దురభిప్రాయమును లేదు. మే మెట్టి ద్రోహముఁ దలఁచుకొనలేదు. మీయాజ్ఞకు బద్ధులము. మీ కనుసన్నల మెలఁగెదము. మీ ముదలయగు నేని యెట్టిపనినైనఁ జేయఁగలవారము. కావున మాయందు సంపూర్ణవిశ్వాసము నిలుపవలయునని ప్రార్థించుచున్నాము." అనవుడు మణివర్మ "నావైఖరిఁ బట్టి మీ కాగ్రహము గలిగినదా! మీ కవమానము గలిగింపవలెనని నేఁ గలనైన దలఁపలేదు. నామాటలలోఁ గాని భావములోఁ గాని నాముఖలక్షణములోఁ గాని మీ కవమానకరములైన చిహ్నములేవియు లేవు. ఒకవేళ మీకట్లు

దోఁచినపక్షమున నేను వయోవృద్ధుఁడను చంచలస్వభావుఁడను గావున నన్ను క్షమియించి రాజకార్యమును జక్కఁజేయుఁడు. మనకు వివాదములున్నపక్షమునఁ బిమ్మటఁ దీర్చికొనవచ్చు నని యనునయ పూర్వకముగాఁ బలికెను. అంతట వారు రాజును మంత్రులను వీడ్కొని స్వగృహముల కరిగిరి.

వారు వెడలినపిదప మాధవసేనుఁడు మణివర్మతోఁ "జిత్తగించితిరా? వాని మాటలవలన. వారినీడలుచూచి వారే భయపడుచు చున్నారు. అంతఃకరణము మలినమైనప్పుడు మానవుని కెదుటివారి మనస్సులుగూడ మలినములైనట్లు గనఁబడును. కామిలరోగికి జగమంతయుఁ బచ్చఁగాఁ గనఁబడునుగదా? చూచితిరా! గదాధరునిమాటలకు వీనిమాటలకు నెంతవ్యత్యాసమున్నదో. అతని రాజభక్తి హృదయమునుండి వెల్లివిరిసినది. వీని భక్తి జిహ్వాగ్రమునుండి వచ్చినది. కావున వీరిని విశ్వసించియుండుట శ్రేయస్కరముగాదు." అని వచియించెను. "నీవుయదార్థము వచించితివి. దోషాత్మునకు లేనిచోట ననుమానముగలుగును." అని మణివర్మ వాని కుత్తరమిచ్చెను. విక్రమసేనుఁడు చిఱునవ్వునవ్వి ఉన్నమాటన్న నులుకెక్కువన్నట్లు దండపాణికి నిర్హేతుకమైన యాగ్రహమువచ్చినది. మనము వీరివిషయమున జాగ్రతగానుండవలె నని పలికెను. "మీరిద్దఱు గదాధరశూలపాణులు నను నాలుగుస్తంభములమీఁద నిప్పుడు కాశ్మీరరాజ్యసౌధము నిలిచియున్నది. దండపాణి రాజభక్తి మలినమైనదో శుద్ధమైనదో సమయమును గీటురాతిమీఁదఁగాని తెలియదు. ఇంకమీరు మీపనులమీఁద నుండుఁడు." యని యరవిందాదేవి పలికి వారికి సెలవిచ్చెను.

తొమ్మిదవప్రకరణము.

రాచనగరమునుండి వెడలి దండపాణియుఁ సోదరుఁడును స్వగృహంబులకుఁజనక యారేయి వెండియుఁ జిత్రభానుని గృహంబున కరిగి రాజగృహంబున నాఁడు జరిగినవృత్తాంతమంతయు దెలిపిరి. చిత్రభానుఁడు తనయెడ వారికిఁ గల యమితానురాగమునకు సంతసించి కొండొకవడి పొగడి యిట్లనియె "మిత్రులారా! అయస్కాంతమునకు సూదికింబలె నాకును మీకును గాఢసంబంధము కుదిరినందుకు నేను మిక్కిలి సంతసించుచున్నాను. మీచెవినిఁ బడిన చిన్న మాటయు దాచక నాకు వెంటనే తెలియఁజేయవలెనని మీరుసంకల్పించుట మనకార్యసిద్ధికి సూచకము. ముందుగా వారే కలహమునకు డీకొనునట్లు మనము చేయవలయునుగాని మనము దిగఁగూడదు. అందుచే నీలోపున సైనికులవిషయమున మీరు వలసినప్రయత్నము చేయుచుండుఁడు" అనుచుండ రుద్రభట్టు "కీలకమంతయు సైన్యములోనే యున్నది. దానింగలఁచుట కనేకప్రయత్నములు గావలయు. కొంతయత్నము మేముగూడఁ జేయుచున్నాము అది యిఁక మీఁద గాలక్రమమున మీకుఁ దెలియఁగలదు" అని పలికెను. అనంతరము గొంతసంభాషణము జరిగినవెనుక దండపాణి యిట్లనియె. "మాకొక్క కోరిక యున్నది. అది మీయిరువుర సన్నిధానమున విన్నవింపఁదలఁచుచున్నాము. కర్పూరమంజరిని మావజ్రపాణికిచ్చి వివాహముచేయుటకు మీరంగీకరించిరి గనుకను మామణిమాలికను విజయసేనునకు బెండ్లిచేసికొనుటకు మీరిష్టపడిరిగావునను నీరెండుకార్యములకుఁ బ్రధానముచేసికొనవలెనని మేముబలాటపడుచున్నాము. మాపద్దు చెల్లించి యీకార్యము చేయవలయు."

అప్పలుకులలో మొదటిభాగము చిత్రభానునకు రుచింపలేదు ఏలయనగుణముల పేటికయైన కర్పూరమంజరి వజ్రపాణినివరించునో

వరింపదో చిత్రభానుఁ డెఱుఁగఁడు. ఇంతకు మున్నామెతో నాప్రసంగ
ముచేయనే లేదు. రెండవభాగమైన మణిమాలికావివాహము చిత్రభా
నున కిష్టమే. ఆవిషయమై ప్రధానముచేసికొమ్మన్నను నతఁడు చేసికొను
టకు సిద్ధముగ నుండెను. ఒకటిచేసి రెండవది మానినపక్షమున వారి కను
మానము కలుఁగవచ్చును. చేసిన రెండును జేయవలయు; మానిన
రెండును మానవలయు. చిత్రభానున కిప్పుడు విషమపరిస్థితులు తట
స్థించెను. తాము తలపెట్టిన కార్యములన్నియు ముగిసినపిదపఁ బ్రధా
ములు చేయవచ్చునని చెప్పినచో వారికి విశ్వాసముండదని భయము.
అందుచే నెద్దియుందోఁచక యతఁడు వెంటనే యుత్తరమీయకమనో
వేదనము బడుచుండ వానిచేష్టలంబట్టి మనోగతభావ మెఱిఁగి రుద్ర
భట్టు "దండపాణి కిట్లనియె. దండపాణీ! నీసంకల్పము మంచిది. 'శుభ
స్య శీఘ్రం' మ్మను నార్యోక్తినిబట్టియు 'నాలస్య మమృతం విష,
మను న్యాయమును బట్టియు నిట్టివి వెంటనే జరుగుట మంచిది. కాని
యవి శ్రోత్రవారివిషయమునఁగాని, మీవంటిపూర్వపరిచితుల విష
యమునఁ గావు. మాటయే ప్రధానముగాని మానవంతులకుఁ బ్రధా
నము ప్రధానముగాదు. పసుపుం గుంకుమ పండ్లు దెచ్చి యొండొరుల
కిచ్చి పుచ్చుకొనుటచేత ననుకొన్నమాటలు స్థిరమగునా? కానిచోఁ
గార్యములు భగ్నమగునా ? అగ్నిసాక్షిగఁ జేసిన ప్రమాణముల
కన్నఁ బ్రధానములు బలవత్తరములా? ఇది యొకముచ్చట.
అదియు నాఁడువారిముచ్చట. మగవాండ్రు దానింగూర్చి యంత
పట్టింపులు బట్టఁగూడదు. కాబట్టి కాలాంతరమున నన్ని
ముచ్చటలు దీర్చుకొనవచ్చును. ఇది విషమసమయము. తాంబూ
లములు పుచ్చుకొనుటకైనఁ బదుగురు పెద్దమనుష్యులు వచ్చుటకు
వీలులేనితరుణముగదా యిది! పదిమంది జేరి వెల్లడిగా జరుగవలసిన
శుభకార్యము చాటున మాటున జేసికొనుట యేటితగవు! కావున
సర్వవిధముల నిది కాలాంతరమునగావచ్చును. మీఁద మీయిష్టము."

అదివఱకేమియుఁ దోఁచక యేమియుత్తరముజెప్పఁదునాయని సందిగ్ధమనస్కుఁడై యున్నచిత్రభానునకు రుద్రభట్టు పలుకులు ధైర్యము గొలిపెను. అప్పలుకు లూఁతగాఁగొని చిత్రభానుఁడు వారినుద్దేశించి "విజయసేనుఁ డెక్కడికేగును? కర్పూరమంజరియెక్కడికరుగును? ప్రధానములు కాకపోవు. వివాహములు, గాకపోవు. వివాహము ప్రధానముగాని, ప్రధానము ప్రధానము గాదు. చంచలచిత్తులకు మాటనిలకడలేనివారికి బ్రధానములుగాని మనకేల? ఈమహాత్ముఁడు సెలవిచ్చినట్లు గాలాంతరమునఁ గావచ్చు" నని పలుక వజ్రపాణి "యిప్పుడు చేసికొనినఁదుదువలనఁ దప్పేమి" యని మెల్లగాఁ బలికెను. "నామాటయెటులున్నను జిన్నవాఁడైన మాతమ్ముని కోర్కె దీర్చుట సర్వోత్తమము" అని దండపాణి వాక్రుచ్చెను. వారుపట్టిన పట్టు వదలకపోవుటచే సమయము దాటించుటకు రుద్రభట్టు "సరే! అట్లె యగుగాఁక! ప్రధానమునకైన మంచిముహూర్తముండవలయు. నేనా సుముహూర్తము బెట్టి మీకుం దెలియబరచెద. అది మీకిష్టమేకద?" యని పలికెను. "అహా! మాకిష్టమే" యని వారిరువురు సంతుష్టులై సెలవుఁగైకొనిపోయిరి. వారు వెడలినపిదప రుద్రభట్టునకును జిత్రభానునకును నీక్రిందవిధమున సంభాషణము జరిగెను.

చిత్రభాను—స్వామీ! నేనిప్పుడు పిశాచమునకు సముద్రమునకు నడుమనున్నాఁడను. ముందరకువచ్చిన దయ్యము మ్రింగును. వెనుకకుఁబోయిన సముద్రతరంగములు ముంచి చంపును.

రుద్రభట్టు—ఏ మట్లనుచున్నాఁడవు?

చిత్ర—వజ్రపాణికోరిక దుర్ఘటముగా నున్నది. కర్పూరమంజరి మనస్సుచందము నేనరయలేను. అది వీనిపై వలపు నిలుపునో లేదో తెలియదు. అది వీనిఁగూర్చి మేలుపడదేని పండఁబాఱిన పాల

మొండబాఱినట్లు గార్యమంతయు భగ్నమగును. వీరు ప్రిధానమిప్పు డే చేయవలెననుచున్నారు.

రుద్రి.—ఇందుకా యింతబెంగ? మానవుఁడు కష్టసమయముల యందే ధీరోదాత్తుఁడై, తన మనశ్శక్తినిఁ జూపవలయును. తొందర పడక బెంగగొనక కలఁతనొందక నరుఁడు నిర్మలమగు తటాకజలము వలెఁ బ్రివిమలమనస్కుఁడై యుండెనా యెంతెంత కష్టసమయము లందును మబ్బులేని యాకసమున సూర్యోదయమైనట్లు చక్కని యుపాయములు తోఁచును.

చిత్ర.—అది స్వతంత్రియులగు మీకు సాధ్యముగాని మావంటిసంసారులకు సాధ్యముకాదు. కష్టసమయము రాఁగానే మనస్సు నివ్వెఁదొ్రిక్కనకోఁతివలెఁజంచలమై యాలోచనకనర్హమై యుండును. కావున నిప్పుడు నాకేమియుఁ దోఁచకున్నది.

రుద్రి.—నీ కూఁతురు మనోరథ మేమో తెలిసికొనకయే నీ వింత కలఁతఁజెందనేల? ఆమె నీకోరిక నిరాకరింపకపోవచ్చును. ఆమె నడిగిరమ్ము. కార్యము సఫలమయ్యెనా సరె! కాదేని నాఁటి కొకయు పాయ మూహింపఁజాలమా?

చిత్రి.—అట్లయిన నే నామెనడిగి వత్తునా?

రుద్రి.—ముందుగా నీవడుగుట యుక్తముగాదు. ఆఁడుబిడ్డల కుఁ జిన్ననాఁటనుండి తల్లిదగ్గరఁ జనవులు మెండు. కావున నామె మనోరథ మేమొ తల్లిచే నడిగింపుము.

చిత్రి.—సిగ్గుపెంపునఁ దల్లికిఁ జెప్పనిపక్షమున?

రుద్రి.—అంతకన్న నెక్కుడు నుచ్చికయుఁ జనవులుగలవారు చెలికత్తియలు. చంద్రికను మల్లికను వేఱువేఱుగఁ బిలిచి రహస్య ముగ నడుగుము. రాజపుత్రికల తలంపులకుఁ జెలికత్తెలు దాపుడు బరిణలు.

చిత్ర—అట్లయిన నేను తద్విషయప్రయత్నమునందెదన్. ఇవియన్నియుఁ దేలినతరువాతనే మనము సుముహూర్తముమాట నాలోచింపవచ్చును.

రుద్ర—నీకూఁతురు రాచనగరములో నున్నదికదా! మీనెయ్యము లంతకంత కెడమగుచున్నప్పుడు మీపుత్రిక శత్రుగృహమున నుండుట నీకును వారికిని శ్రేయముగాదు. వెంటనే బిలువనంపుము. పాముపగయుఁ బడగ చుట్టము నగునా ?

చిత్ర—ఔను! ఆమెనిటకుఁ దోడితెచ్చుట యుభయులకు శ్రేయస్కరము. అట్లచేసెదన్.

అనియాతని వీడ్కొని చిత్రభానుఁడు దీర్ఘాలోచనావశంబున మెల్లమెల్ల నడుగు లిడుకొనుచు నభ్యంతరమందిరమునకుంజని యింద్రుమణిం గాంచి కర్పూరమంజరిని వెంటనే పిలిపింపుమని యానతిచ్చెను. అట్లకాకయని యామెం చంద్రికామల్లికలఁ బిలిచి "రాచనగరమునకరిగి బాలికం దోడితె" మ్మని సెలవిచ్చెను. సెలవిచ్చుటయు తడవుగా వారిరువురు నచ్చోటికిఁజనిరి. ఆలోపున నిందుమణితోఁ జిత్రభానుఁడు గృహకృత్యంబులంగూర్చి కొంతముచ్చటించి కర్పూరమంజరి మాటయెత్తి ప్రసంగవశమున నిట్లనియె. "బాలిక వివాహయోగ్యమగు వయస్సును బ్రాపించినది. ఇంక మనమాలసింపక వరాన్వేషణమునకుఁ గడంగవలయు.

ఇందుమణి—నానోటితో నేననఁగూడదుగాని దానిం జూచినవారందఱు నిది సర్వలక్షణసంపన్నయగుకన్య. దీని కనుకూలుఁడగు వరుఁడు లభించుట కష్టమని పలుమాఱు నాతో ననిరి.

చిత్రభాను—అన్నిలక్షణములు నొక్కచో గుమిగూడియుండునా ? చెఱుకునకుఁ గావలసినంత తీపియున్నదిగాని పండ్లు లేవు. పనసపండు గర్భమున రసవంతములైన తొనలుండును.

మీఁదిభాగము మిక్కిలి మోటగానుండును. విశేషించి పనసకుఁ బూవులు లేవు. మామిడికి జీడియుండును. సీతాఫలమునకు లెక్కలేనన్ని గింజలు. భానునియందు దుస్సహమైన వేఁడియుండును. చంద్రునియం దతిశైత్యముండును. అట్లే పురుషులయందు నొకఁడు సత్కులప్రసూనత గలిగియుండును. ఒకఁడు చక్కదనంబున కిక్కయగును. ఒకఁడు గానమునకు స్థానమగును. ఒకఁడు మాటలలోఁ దేనెతేటలు గురిపించును. ఒకఁడు విద్యానిధియై పుంభావసరస్వతియగును ఒకఁడు వాక్పటిమలో నపరశేషుఁ డనిపించుకొనును. ఒకఁడు మేటినుగంటిమికిఁ బేరువడును. ఒక్కఁడు సౌజన్యమునకు భాజనమగును. ఇన్ని శుభలక్షణములు నొక్కచో నుండునా? అది యసంభవముగాదా? అందుచే నేవోకొన్ని శుభలక్షణములు జూచి వరనిర్ణయము జేసికొనవలయును.

ఇందు—ఆక్షణములు మీకును నాకును నచ్చవచ్చును. బాలిక మెచ్చవలదా?

చిత్ర—మెచ్చు కేమిచేయును? దివ్యౌషధుల నెన్నిటినో గలిపి వైద్యుఁడు మాత్రజేసినట్లు బ్రహ్మదేవుఁడు సమస్తశుభలక్షణములు గల పురుషునిఁ గ్రొత్తగా మనకన్యకకొఱకు సృష్టింపవలెను!

ఇందు—ఇదివఱకే సృష్టింపఁబడియున్నాఁడు. క్రొత్తసృష్టితోఁ బని లేదు.

చిత్ర—అట్లయిన బాలిక యెవనిమీఁద మనసునిలిపినదో చెప్పఁగలవా?

ఇందు—ఇంతవఱకు నే నెఱుఁగను. ఇదివఱకేసృష్టింపఁబడి నాఁడని మాటవరుసకంటిని.

చిత్ర—వజ్రపాణియని యొకసేనాపతి యున్నాఁడు. వాని నెఱుఁదువా?

ఇందు——నేనెన్నఁడుఁ జూడలేదుఁ వినియుంటిని.

చిత్ర——అతఁడు సేనాపతియగు దండపాణితమ్ముఁడు. అతని వంశము మంచిది. స్థితిమంచిది. ప్రాయముననున్నవాఁడు. అతనికిచ్చి వివాహముచేయవలెనని నాకోరిక. అతనిం జేపట్టుమని బాలికతో నీవు నొక్కి చెప్పుము.

ఇందు——చెప్పెదనుగాని నామాటయందు దానికి విశ్వాసము లేదు. మల్లికకు దానికి నత్యంతమైత్రి. దానిచేతఁ జెప్పింపుఁడు. బిడ్డ మాత్రము యుక్తాయుక్త మెఱుఁగదా! మంచిసంబంధమైనచో నది యేల నిరాకరించును ?

చిత్ర——మంచిదనుట నిస్సంశయము. నీవు చెప్పినట్లు మల్లికతోఁగూడ మాటలాడెదను.

అని సంభాషణ ముగించి యావలకు జనెను. సంధ్యాకాల మగునప్పటికి మల్లికాచంద్రికలు కర్పూరమంజరిం దోడుకొని గృహమునం జేరిరి. రేయి భోజనమైనతరువాతఁ గర్పూరమంజరి పెందలకడ బండుకొనెను. ఆమె నిద్రవోవగాఁ జూచి చిత్రభానుఁడు మల్లికను దన పడకగదిలోనికిఁ బిలిచి పీటపైఁ గూర్చుండఁబెట్టి కొంతసేపు దాని సేమమరసి రాజాంతఃపురమందలి వార్త లేమని యడిగి కొంచొకవడికిట్లనియె——"మల్లికా! నీయెదుట నిన్ను బొగడఁగూడదు గాని నీవు నిజముగా గుణపుష్పములతో నిండిన వల్లికవు. ముద్దుల మూటగట్టు నీమొగముఁ జూచినను గ్రమ్మతేనియలొలుకు నీపలుకులు విన్నను హృదయంగమములయిన నీగుణములు జూచినను నాకు బ్రహ్మదేవునిఁ దిట్టబుద్ధి. ఎందుకందువా? మతిలేని యామునలిదయ్యము బహుళగుణసంపదగల నిన్ను నేదో యొకమహారాజ గర్భమునఁ బుట్టింపక సేవకురాలిఁగా జేసినాఁడని. ఆవెఱ్ఱిముండకొడుకు చేసెడి సృష్టిలో నిట్టివి వందలకొలఁది గలవు. నిన్ను స్తోత్రము చేయుటకుఁ

గాదు నే నిట్లనుచుంట. యథార్థము నాకడుపులో దాఁగదు. చెడ్డదైన మంచిదైన కుండ పగులగొట్టినట్లు వెంటనే యనుట నాకలవాటు. కర్పూరమంజరి యొకర్తయే నాకుఁగూఁతురైనదని మఱియొకకూఁతురు లేకపోయెనని చాలాకాలము విచారించితిని. కాని నిన్నుఁ జూచుకొని యావిచారము పోగొట్టుకొంటిని. నీవే నా రెండవ కూఁతురవు. అట్లగుటచేత మీ యక్కవిషయమున నీతో నొక్కమాట ముచ్చటింపవలెనని పిలిచితిని. బిడ్డ సంప్రాప్తయౌవనయైనది, వివాహయోగ్యకాలము ప్రాపించినది. వరాన్వేషణము చేయవలయును. నీ జిహ్వాదాని యభిప్రాయము' ప్రతిఫలించు నద్దము. అందుచే నిన్నడుగుచుంటి. అది యీవఱకెవ్వనిమీఁద నైన మనసు నిలిపినదా? నిజము దాఁచక చెప్పు?" అనవుడు మల్లిక చిఱునవ్వునవ్వి "ఏమోనండి! నాకుఁదెలియదు. ఆమె మనస్సులో నేమున్నదో నాకెట్లు తెలియునండి" యని బదులుచెప్పెను.

అనుటయు నతఁడు రెండియు నిట్లనియె. "ఓసీ! నీవెఱుఁగని రహస్యములు దానికుండవు. దానిమనసులోమాట నీచెవిలో నుండును. చెప్పకపోతివా నన్నుఁ జంపుకొన్నట్లే." యని నిర్బంధించి యడిగెను. "అయ్యో! ఇదేమిపాపమండి. చిన్నపిల్లలము. మాలో మేమేదో పరిహాసమునకో మఱెందుకో యెన్నో మాట లనుకొందుము. వాటివిషయమై నిర్బంధించి యెట్లుదిట్లుప్రయోగించిన మేమెట్లు బ్రతుకఁగలము? నన్ను మీరు నిర్బంధింపవద్దు" అని నిష్ఠురముగా నామె బలికెను. "పోనీ! నన్నుఁ జంపుకొన్నట్లే గాఁబోలును. నీవు నాకూఁతురవని చెప్పితినిగదా! నీవును గర్పూరమంజరియుఁ దండ్రిలేని కూఁతుళ్లగుదురు గాక!" యని కఠినముగఁ బలికెను.

అప్పుడు చేయునదిలేక మల్లిక మెల్లమెల్లగా నిట్లనియె——"నాతో నామె చెప్పలేదుగాని మున్నామెకు జబ్బుచేసినప్పుడు మాళవరా

జకుమారుఁడగు మకరందుఁడువచ్చి వైద్యముచేసెను. అప్పటినుండి యాతనిమీఁద మనసునిలిపిన దేమోయని నాయూహ. అయ్యగారూ! నే నీమాట చెప్పితినని యామెతోఁ జెప్పవద్దు. 'నీనోట నువ్వుగింజదాగదు పనికిమాలినదానా' యని నామీఁద మీబిడ్డయుఁ జంద్రికయుఁ గోపించి దెప్పుదురు."

అనవుడు చిత్రభానుఁడు "బిడ్డా! నీవుచెప్పినట్లు నేనుచెప్పను. కాని, నే నొక్కరహస్యము జెప్పెద. అది నీమనసులో నుంచుకొని పనిచేయుము. అట్లు చేసెదవా?" యని యడిగెను. "నాచేతనైనపక్షమున నదితప్పకచేసెద" నని యామె యుత్తరమిచ్చెను. అంతటఁ జిత్రభానుఁడిట్లనియె. "బిడ్డా! మకరందునిమీఁద నిలిచినయామె మనస్సునునీవు త్రిప్పుటకుఁ బ్రయత్నము సేయవలయు. మకరందుఁడు బౌద్ధుఁడు. నాస్తికుఁడు. వేదశాస్త్రములు విశ్వసింపనివాఁడు. అట్టి వానిఁ జేపట్టఁ గూడదని నీబుద్ధికుశలతకొలఁది హేతువులఁగల్పించి దృఢముగా చెప్పుము. నీవు బుద్ధిమంతురాలవు. ఇటు జెప్పుమటుజెప్పుమని నీకు నేఁ జెప్పవలెనా? ఓసీ! తెలియకడుగుచున్నాను. మకరందుఁ డేలాగుండును?"

"ఏలాగుండునని చెప్పనుస్వామీ! భూలోకమున విహరింప వచ్చిన మన్మథుఁడు. గుణములుచెప్పఁదలఁచితిమా వర్ణింపశక్యమే గాదు. దానికిందగిన పరాక్రమము. అందుకుఁదగిన విద్య. ఇదియదియననేల? అన్ని మంచిగుణములున్నవండి!" యని మల్లికయుత్తరము చెప్పెను. చిత్రభానుఁడదివిని వెండియు నిట్లనియె. "ఎఱ్ఱఁగా బొఱ్ఱఁగా నుండఁగానే సరియా? మేడిపండు మిక్కిలి మెఱయుచుండును. పొట్టవిచ్చితిమా పురుగులగుంపు. ఆకారముఁజూచి యెవ్వరిని వరింపరాదు. గుణములకేమి యెవరిగుణములు వారికుండును. ఎన్నిగుణములున్ననేమి! వాఁడు మనవాఁడు కాఁడు. బౌద్ధుఁడు. పాషండుఁడు.

అట్టివానిం జేపట్టుట పాపముగాదా" అనవుడు మల్లిక "స్వామీ! మకరందునివిడిచి యేరాజకుమారుని వరింపవలసినదని మీయభిప్రాయము." అని యడిగెను. అడుగుటయు నతఁడు మఱియు నిట్లనియె. "ఆఁ ఇపుడు మంచిదారికివచ్చితివి. చెప్పుచున్నాను విను. ఈపట్టణమున దండపాణియను సేనాపతిగలఁడు. అతని తమ్ముఁడు వజ్రపాణి కలఁడు. అతనిని వరింపవలసినదని నాయభిప్రాయము. అతఁడు సద్గుణవంతుఁడు. బాహుశాలి. సత్కులజాతుఁడు. ఎప్పుడైనం జూచితివా!"

అనవుడు మల్లికనవ్వుచు నిట్లనియె. "చూచితినండి! నన్నికల్లుమీఁది కంట్లవలె మొగముమీఁద మశూచకము మచ్చలుగలిగి నల్లగానున్నయతఁడే కాదా! చూచిచూచి యమ్మాయికొఱకుమంచి పెండ్లికొడుకు నేరినారండి! అతనియొడలతఁడే కదుపుకొనలేనంత లావు. అతనిశరీరమునుండి చమటలుగారినప్పుడు కొండమీఁదినుండి సెలయేళ్ళు ప్రవహించిన ట్లుండును. అతనిమీసములు మొగము నొకటే రంగుననుండును. వయస్సుచూచినను నలువదేండ్లకుఁ దక్కువయుండదు. ప్రథమభార్య యున్నది. ఆమెవలన నలుగురో ముగ్గురో బిడ్డలుకలరు. ఈ వన్నె పెండ్లికొడుకును జేపట్టుమని చెప్పుటకు మాకు నోరెట్లాడును? మీ మొకవేళ జెప్పినను నామె యెట్లు సమ్మతించును! అట్టివివాహము లోకులెట్లు మెత్తురు! చెప్పుటకు మాకే సిగ్గగుచున్నది. ఆపెండ్లికొడుకు సరసను మీబిడ్డయెట్లు కూర్చుండునండీ! వారిద్దఱు కాటుకముద్ద పసుపుముద్దవలె నుందురు." అని పరిహాసోక్తులు వలుకుచున్న మల్లికకుఁ బ్రత్యుత్తరముఁ జెప్పఁదలఁచి చిత్రభానుఁడిట్లనియె: "ఓసీ! శరీరమునల్లగా నున్ననేమి యెఱ్ఱగానున్ననేమి? కొఱుకుకొని తిందురా యేమి! వంశము గుణము భాగ్యము చూచుకొనవలెనుగాని రూపమెందుకే! అట్లయినఁ జైతన్యములేని బంగారపు బొమ్మను బెండ్లాడవచ్చునా? నీయుల్లసోక్తులు గట్టిపెట్టి నామాటవిని

నీచెలికత్తెదగ్గఱ వజ్రపాణిని జక్కఁగాఁ బొగడి వర్ణింపుము. అతఁడు సత్కులజాతుఁడనుము. గుణనిధానమనుము. పరాక్రమముఁబున రెండవ కుమారస్వామి యనుము. అతనిం జేపట్టిన వీరపత్నియగుననుము. అనంతరము వీరమాతయగుననుము. కావలసినంత భాగ్యమున్నదనుము. ఒకభార్యయున్నను దానే యగ్రమహిషి కావచ్చుననుము. స్త్రీకింత కన్నఁ గావలసిన దేమున్నదనుము. ఓసీ! ఇన్నిమాటలెందుకు? ఎట్లు చెప్పవలెనో యట్లుచెప్పి కార్యము సఫలముచేసితివా నీకొకరత్నాలహారము వెలలేనిమొకముత్యాలహారము బహుమానమిచ్చెదను. నీమేలు మఱచిపోను."

అతఁడు చెప్పినదంతయు విని మల్లిక "అయ్యా! మీయాజ్ఞ శిరసావహించి నేనామెతోఁ జెప్పుదునుగాని యామె నామాట విశ్వసించునని నాకునమ్మకములేదు." అని యాతనయొద్ద సెలవుగైకొని మల్లిక శయనాగారమున కరిగెను. "ఈపలుకుకుముండదయే శకున పక్షిలాగున విరుద్ధముగాఁ జెప్పెను. ఇఁక నామె నాకనుకూలముగఁ జేయునా" యని తనలో వితర్కించుకొనుచుఁ జిత్రభానుఁడు పండుకొనెను.

పదియవ ప్రకరణము.

కాశ్మీరరాజుసైనికులు వసించుటకు శ్రీనగరమునకుం బడమటఁ బ్రత్యేకముగా నొకపేటకలదు. అందుసైనికులు సేనానాయకులు మాత్రమే వసియింతురు. సైనికుల దేహపరిశ్రమలకు, వ్యాయామములకు, వారిబిడ్డల యాటలకు ధనుర్విద్యయందు నభ్యాసముచేసికొనుటకు మల్లయుద్ధములు నేర్చుకొనుటకు యుద్ధవిశారదులగుటకు శుష్కరణములు గావించుకొనుటకుఁ దగు విశాలభూములక్కడ నేర్పడి

యున్నవి. ఉదయాస్తమయముల యందు సైనికులు నానావిధముల యిన సాధనములతో బహుపరిశ్రమలఁ జేసి నేర్చినవిద్య మఱపురా కుండునట్లు చేసికొనుచుందురు. యోధులు సాధారణముగా విద్యావి హీనులై యుండుటచే గ్రంథపఠనము చేతగాదు కావున బహుపురాణ వేత్తలుధర్మశాస్త్రవిశారదులుచిత్రకథాకథనకుశలురు జ్యోతిశ్శాస్త్ర వేత్తలునగు బ్రాహ్మణులు స్కంధావారముఁజొచ్చి పూర్వరాజులచరి త్రములు మొదలగునవిచదివి వినిపించియు మనోహరములగుకథలుచె ప్పియు వారిమనోరంజనముచేయుటయే గాక వారికిఁబుణ్యముపురుషార్థ ము నెఱిఁగించి యుక్తాయుక్తవివేచన జ్ఞానముఁ గలిగించు చుందురు. అందుచే బ్రాహ్మణులన్నవారికిఁ బరమభక్తి. వారునిజముగా స్వర్గ మునుండి భూమి కవతరించిన దేవతలనినమ్మి జోదులు వారియిల్లాం డ్రు మిక్కిలివినయంబుగదుర వారికినమస్కారములుచేసి సన్మానించి యుచితాసనంబులనునిచి శక్తికొలంది ధనధాన్యాదుల నూత్నవస్త్ర ములనొసంగి సత్కరించుచుందురు. ఆఁడువాండ్రు. పగలు గృహకృత్య ములందగిలియు మగవాండ్రు నానావిధ పరిశ్రమలఁజిక్కియుఁ దీరికలే కయుండుటం జేసి సాధారణముగాఁ బురాణశ్రవణాదు లప్పటిలో రా త్రులే జరుగుచుండును. పౌరాణికుని వసంతఋతు రాత్రులయందు వారు చల్లని లేఁతగాడ్పులువీచు బయళ్లయందుఁ గూర్చుండఁబెట్టి వందలకొలఁది స్త్రీపురుషులు చేరి పురాణ మాలకించి యానందించు చుందురు. వర్షకాలమునను, శీతకాలమునను భజన మందిరములయందే యీసభలు జరుగుచుండును.

అత్తఱి నొక్కనాఁటిరేయి నొకబ్రాహ్మణుఁడు మార్గాయా సమున రోఁజుచు నొకజోదుగృహమునకుఁ బోయి "అయ్యా! వం డుకొనుటకు నాకించుకతావు నొసంగు ధర్మాత్ము లెవ్వరైన నున్నా రా! నేను బాటసారిని. బ్రాహ్మణుఁడను. పగలెల్ల నెండలో మలమల

మాడి నడచియున్న కతమున మిక్కిలి డస్సియున్నాఁడను. అడుగులు పుడపుడబొక్కినవి" యని యడిగెను. ఆగృహ యజమానుఁడగు జోదు "స్వామీ! మాయరుఁగుమీఁద మీరు పండుకొనవచ్చును. దయచేయుఁడు" అని యుత్తరమిచ్చెను. "నాయనా! నీకెంతైనఁ బుణ్యముగలదు. రక్షించితివి" అని యాబ్రాహ్మణుఁడు తనకృష్ణాజినము నాయింటియరుఁగుమీఁదఁ బెట్టి యంగవస్త్రముతో నడ్డికిఁగట్టిన యిత్తడిచెంబుఁ దీసి "నాయనా! పాదప్రక్షాళనమున కుదకము కావలెను. చేరువ నెక్కడైన నూయి కలదా?" యని ప్రశ్నించెను. "స్వామీ! అల్లదె నూయి" యని చూప విప్రుఁడు ముఖహస్తప్రక్షాళనముఁ జేసికొని కడుపునిండ నీరుద్రావి మరల నప్పాటియింటికిఁ జని దర్భాసనముఁ బఱచుకొని యుచ్చైశ్శ్వరముతో మహిమ్నస్తోత్రముఁ జదువ నారంభించెను. అదివిని జోదులనేకు లచ్చటఁ జేరిరి. కొందరాశ్లోకముల యర్థమడిగి తెలిసికొనిరి. అది ముగిసిన వెనుక వారిలో గొందఱు బ్రాహ్మణుని నామధేయము దేశము నామముఁ దెలిసికొనఁగోరి ప్రశ్నలడిగిరి. వారిప్రశ్నలకు బ్రాహ్మణుఁ డిట్లుత్తరముఁ జెప్పెను. "అయ్యా! నాపేరు వేదశర్మ. నాది గాంధారదేశము. అందుఁ దక్షశిలయను గ్రామముగలదు. అది నానివాసస్థలము. ఏమహానుభావుఁడు సంస్కృతభాషయందలి శబ్దజాలమున కెల్లనియమముల నేర్పఱుపఁదలఁచి సర్వబుధజనశ్లాఘ్యమైన వ్యాకరణశాస్త్రమువ్రాసిభాషాప్రపంచము నుద్ధరించెనో సుశబ్ద ప్రయోగము జేసినప్పు డెవ్వని పవిత్రనామము ప్రతిపండితునకు మొట్టమొదట జ్ఞాపకము వచ్చునో యట్టిమహానుభావుఁడు పాణినిజన్మించినట్టి గ్రామమది. ఆమహాత్ముఁడేగాక బహువ్యాకరణవేత్తులు, బహువేదపారంగతులు బహుపురాణసంవిదులు, సకలధర్మశాస్త్రవిశారదులు బ్రహ్మవాదులు, నచ్చటఁ బలువురుగలరు. ఆసేతుహిమాచలమగు భరతఖండమందలి నానాభాగ

ములనుండి విద్యార్థులై బ్రహ్మచారు లప్పురికివచ్చి భిక్షాటనముఁ జేసి జీవించుచు గురుశుశ్రూషాపరాయణులై తమకభిమానశాస్త్రంబుల నేర్చుకొని పోవుచుందురు. అది గొప్పవిద్యాసత్రము. సరస్వతికొలువుకూటము. చదువులకొటారు. కాశ్మీరదేశమున హిరణ్యపురమున నాకుం జుట్టములున్నారు. వారిం జూడఁదలంచి నేను పయనమై పోవుచున్నాఁడ. మార్గపరిశ్రమ మెక్కుడగుటచే నగరమునకుఁబోలేక నిప్పేటలో విడిసినాఁడ. కాని కాశ్మీరదేశమింత యల్పకాలములోనే యింతదుస్థితికి వచ్చునని నేను స్వప్నమందైనఁ దలఁపలేదు. తక్షశిలలోని పండితులందరిందుకై నగుచున్నారు." ఈ చివరవాక్యములు రెండు మెల్లగాననెను. "ఏమి! అట్లనుచున్నా రేల!" యని పలువురు తొందరతో నడిగిరి.

"అయ్యో పొరబాటున నోరుజారి యనఁగూడనిమాటంటినే. అయ్యా! బాటసారిని పేదబాపఁడను. ఈగొడవలు నాకెందుకు నన్ను విడిచిపెట్టుఁడు. ప్రశ్నలవర్షముతో నన్నుఁ దడుపకుఁడు" అని యతఁడు బదులు చెప్పెను.

"స్వామీ! అట్లుగాదు. అదియేమో విన్నదాఁక మామనస్సులు తత్తఱపడుచున్నవి. మీరది చెప్పితీరవలయు. మీరు బ్రాహ్మణోత్తములు. లోకులందఱికి మేలుగోరువారు. అట్టివారు మాదురవస్థయేమో తెలుపవలదా? దానికిం దగినప్రతిక్రియఁ జేసికొనమా? అట్టివారు మీరు నోట పొరబాటుమాటరానియ్యనే గూడదు. మాట వచ్చినదా మూలముట్టఁ జెప్పవలయు" నని వారనిరి.

అప్పుడు బ్రాహ్మణుఁడు బలవంతముమీఁద నిట్లు చెప్పఁదొడఁగెను. "అయ్యా! ఇదిరహస్యము. అయిన మాదేశములో నందఱెఱిఁగిన రహస్యమే. గాంధారదేశపురాజగు భాగ్యవర్ధనుఁడు కొన్ని దినములలో మీదేశముపై దండువిడిసి జయించి తనరాజ్యమునఁ గాశ్మీరమును గలుపుకొనవలయునని ప్రయత్నము జేయుచున్నాఁడు.

చుట్టుప్రక్కల దేశములనుండి సమరమున మొక్కలు దీరినఁజోదు
లను రావించి తనసేనలోఁ జేర్చుకొనుచున్నాఁడు. మహాటవులనుండి
మదపుటేనుఁగులంబట్టి తెప్పించి కదనమున కాయత్తము సేయుచు
న్నాఁడు. వేనవేలు పారసీకహయంబుల బహుధనములిచ్చి కొనుచు
న్నాఁడు. పదివేలయేనుఁగులు, ముప్పదివేలగుఱ్ఱపుదళము ఏఁబదివేల
కాల్బలము, పదివేల రథములు, రణమునకు సిద్ధమైయున్నవి. పదా
తులందఱు నీటజరించుచేఁపల మింటఁబాఱుపక్షులఁగుల్ల సైతము గు
ఱిదప్పక నొక్కయమ్మునఁ గూల్పఁ గల మేటివిలుకాండ్రు. అట్టిసే
నతో జయముఁ గాంచవలయునను పేరాసతో మనంబున వెల్లివిరిసిన
యుత్సాహముతో నమ్మహాసేనకుఁగావలసిన సకలసంభారములతో
నతఁడురాఁగల శరత్కాలమున దండెత్తఁదలఁచుచున్నాఁడు. కట
కటా! చిరకాలమునుండి స్వాతంత్ర్య మనుభవించుచున్న కాశ్మీరదేశ
ము భూలోకస్వర్గఖండమని పేరువడసిన కాశ్మీరదేశము—హేమచం
ద్రమహారాజు పరిపాలించిన కాశ్మీరదేశము—వెల్లసిరులకు నిల్లగు
కాశ్మీరదేశము—దిక్కుమాలినపడంతివలె నన్యవశవర్తిని యగుచు
న్నది. రత్నగర్భవంటి యీదేశము మాసామ్రాజ్యములోఁ జేరునని
నాకెంతో సంతోషముగానున్నను మీకురాఁగలదుర్దశఁ దలంచిన నా
కడుపుచుమ్మలు చుట్టుచున్నది. మారాజునుగుఱించి వేఱుతెఱంగు
నఁజెప్పుట నాకు ధర్మముగాదుకాని భాగ్యవర్ధనుఁడనఁగా నెవఁడో యె
ఱుఁగుదురా? పాండవ ధార్తరాష్ట్రులకు మొదటఁ గలిగినమనస్పా
ర్ధయను చిన్నిమొక్కను తన దురాలోచన లనెడుదోహదములచేత
మహావృక్షముఁజేసి కురుపాండవ వైరమునకుఁ బ్రధానకారణుఁడై
కౌరవకులమును గూఁకటివ్రేళ్లతో నాశనముజేసిన శకునివంశస్థుఁడు
'స్యాలకో గృహనాశాయ' యను సామెత నిజముజేసిన దుష్టచిత్తుఁడ
తఁడు. అతని వంశస్థుఁడైన యీభాగ్యవర్ధనుఁడు వానికన్నఁ బదియా

కుతెక్కువచదువుకొన్నవాఁడు. ప్రజలను మంగలములోఁ బెట్టి వేఁచినట్లు హింసించును. భరింపరాని పన్నులుగట్టును. భాగ్యవంతుల గృహములపైఁబడి దోఁచుకొనును. ఎదురాడినవారి పుత్త్రులఁదీయించి కోటకొమ్మలకుఁ గట్టించును. చక్కనియాఁడువాండ్రిందఱుఁదన ప్రక్కకుఁ జేరవలసినదె. వానికి నీతిలేదు. ధర్మభీతిలేదు. పాపభయములేదు. శాపభయములేదు. అట్టిరాజుపాలనముక్రింద మేమెట్లు వేగుచున్నామందురో? విషక్రిమిన్యాయమున బ్రదుకుచున్నాము. వానిమంత్రులుకుటిలమార్గపరతంత్రులు. దేశము పరాక్రాంతమగుటకన్న జనులకుగొప్పకష్టము లేదుగదా! కాటకముల సహింపవచ్చును. ఈఁతిబాధల నోర్వవచ్చును. అంతఃకలహముల నడఁచుకొనవచ్చును. మహామారిమొదలగు ప్రళయరోగముల భరింపవచ్చును. కాని, పరరాజులపాలన మొక్కదినమైన సైరించుట కష్టము. దేశమందలి ధనధాన్యములనెల్ల నతఁడే తరలించుకొనిపోవును. రత్నగర్భలవంటి భూములు చవుటిపఱ్ఱలు జేయును. గనులన్నిటిని దవ్వుకొనిపోవును. తనదేశస్థుల కన్ని గొప్పయుద్యోగముల నిచ్చును. వెయ్యేల? జయింపఁబడిన దేశస్థులను బానిసలం జేయును. నోరున్నను వారు మాటాడరాదు. చెవులున్నను వినరాదు. చేరెడు కన్నులున్నను జూడరాదు. వారిసాహసము సమసిపోవును. ధైర్యము తఱిగిపోవును. మగంటిమి మంటిపాలగును. ధైర్యమును వెడలఁగొట్టి భీతి వారి మనస్సుల నాక్రమించును. అడుగడుగునకు వారు పరరాజులకుఁ జేతులుజోడించి జోహారులు సేయుదురు. పరులను బట్టులవలెఁ బొగడి స్తోత్రపాఠకు లగుదురు. వెయ్యేల! పరరాజు పాలనములోనున్న జనులు పశువులకన్నఁ బులుఁగులకన్నఁ బురుగులకన్న నికృష్టమైన జీవనముఁ జేయుదురు. నాశత్రువులకైన నే నెన్నఁడట్టికష్టములఁ గోరను. “జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ” యనునార్యో

క్తి మీరు వినలేదా? తల్లియు జన్మభూమియు స్వర్గముకన్న నెక్కుడని దీనిభావము. తల్లినిఁగోల్పోయి బ్రదుకవచ్చును. బిడ్డలు మృతులైన బ్రదుకవచ్చును. కులకాంతగూలిన మనవచ్చును. ధనముపోయిన బ్రతుకవచ్చును. కాని మాతృదేశము పరాక్రాంతమయినచో బ్రతుకఁజాలము. ఆదినమే దేశస్థులకు మరణదినము. ఆదినమే యాత్మగౌరవంబునకుఁ గడపటిదినము. సర్వసుఖముల కంత్యదినము. ఆదుర్దినము మీకు రాకపోవుఁగాక! ఆయాపద మీకుఁ దప్పుఁగాక!"

ఈసంభాషణము మొదట సామాన్యస్వరముతోనే యతఁడారంభించెనుగాని వెళ్ళినకొలఁది క్రమక్రమముగా నుత్సాహపూరితుఁడై యెలుఁగెత్తి చెప్పెను. అదివినుచునప్పు డచ్చట జేరిన సైనికులలోఁ గొందఱు "హాహా" యనియు, "శివశివా" యనియు, "హరిహరీ" యనియు "నెంతకర్మ మెంతికర్మ" మనియు సంతాపార్థకములైన పదముల నుచ్చరించిరి. అతఁడు సంభాషణ ముగించినపిదప నందులో నొకఁడు "గాంధారరాజునకు మనదేశముమీఁద నింతకోపమేల? మన మతని కే మపకారముఁ జేసితిమి?" యని తక్కినవారి నడిగెను. అందుకు వేదశర్మ యిట్లుత్తరముఁ జెప్పెను.

"ఒకరాజు మఱియొకని దేశముపై దండెత్తుటకుఁ గారణమవసరములేదు. అపకారము చేయనక్కఱలేదు. మీదేశము దుర్బలమగుట యొకకారణము. అతఁడు బలవంతుఁడగుట యొకకారణము. అతనికి గొప్పయాశలుండుట యొకకారణము. కారణము లరయనేల? పెనుచేఁప చిఱుచేఁపం దినును. ముంగిస పామును జంపును. సర్పము కప్పను గబళించును. కప్ప పురుగులను మ్రింగును. పులి మేఁకం జంపును. ఇందొకదానికొకటి యేమి యపకృతిఁ గావించెను? బలవంతులు బలహీనులం జెఱుపుట నైజము. అదియునుఁగాక కొన్నిజంతువులకువలెనే కొందఱుమానవులకుఁగూడ దుష్కార్యాచరణము సహజము

నూఱువరహాలువెలగల చీర చిమ్మెట బొత్తిఁగా పొడిచి పాడుసేయును. ప్రశస్తమయిన పుస్తకముల జెదపురుగులు నాశనముఁజేయును. కావున దురాత్ముల కపకారముతోఁ బనిలేదు. అంతియేఁగాక భూపతులాశాపిశాచగ్రస్థులు. నేలనాలుఁగుచెఱంగులేలినను వారియాశదీఱదు. మూఁడులోకములు హస్తగతములైనను వారి నావహించిన యాశాపిశాచమునఁ గొంకలిదీఱదు. భూమండలమంతయు జయించినవాఁడు సైతము భగవంతుఁడు తనవిజయము నిమిత్తము నూతనఖండముల సృజియించిన బాగుండునని తలంచుచుండును. ఇవియన్నియు నటుండనిండు! విభీషణుఁడు త్రేతాయుగమందు రావణాసైన్యమునందె గాక ప్రతియుగమునందుఁ బ్రతిదేశమునందుఁ బ్రతిసైన్యమునందు నున్నాఁడు. తననెత్తురు తనజాడఁ జూపినప్పుడు తననీడతన్నుఁ బగతురకుఁబట్టి యిచ్చినప్పుడు తనయడుగులజాడయె తననెలవుఁ దెలిపినప్పుడు మానవుఁడు పరులచే హింసింపఁబడకఁబోఁడుగదా!"

ఈకడపటిమాటలు కర్ణములం జొఱఁబడి మనస్సునకు సూదులువలె నాటెను. "ఎవఁడావిభీషణుఁడు? ఎవఁడా దేశద్రోహి? ఈ రాజ్యమం దట్టివాఁ డుండఁగలడా?" యని కొందఱఱచిరి. "శాంతింపుఁడు. శాంతింపుఁడు" అని మఱికొందఱు వారిని వారించిరి. వేదశర్మ "క్రమక్రమముగా మీకే తెలియును. నిప్పు లోపలియుటక మీఁదఁబెట్టి యిల్లంటించినను మంటలు పైకి రాకపోవు. ఓపికపట్టి యుండుఁడు" అని బదులుచెప్పెను. అందులోఁ గొందఱు "స్వామీ! మర్మముబెట్టి మాటలాడి మమ్ముం జంపనేల? ఇంతవఱకుఁ జెప్పితిరి గదా. తక్కినదిగూడ స్పష్టముగాఁ జెప్పుఁడు. మేము పరరాజులకు దాసులము కాలేము. జెబ్బులులవలెఁ బరసైనికులువచ్చి దేశమాక్రమించి యూళ్ళు కొల్లఁగొనుచుండఁగా మేము చూడలేము. కాశ్మీరదేశముకొఱకు, రాజకుటుంబముకొఱకు, మేము మానెత్తురు ధారవో

యుదుము. ప్రాణములు బలియిత్తుము. ద్రోహులను శిక్షింతుము. విష యము సమూలకముగాఁ దెలిపి మమ్మనుగ్రహింపుఁడు." అనిపలికిరి.

"అయ్యా! మీరు బలవంతపెట్టుచున్నారు గనుక చెప్పక తప్పదు. మీరాజు చిన్నవాఁడగుటచే మంత్రులు లంచగొండులై దేశము పరుల కప్పగింపఁదలఁచుచున్నారు. మీరాజకుటుంబమునకు వెనుకటి రాజు సహోదరుఁడైన చిత్రభానునకు సరిపడదుగాని, యతఁ డధికారము వహించునేని, నేఁటిమంత్రులు తొలఁగింపఁబడుదురేని రాజభక్తిగల దండనాథులు మీవంటి శౌర్యధైర్యముఁగలబంట్లును రణరంగమునకు నడుపుదురేని యిటువంటిగాంధారరాజులనునూఱుమందిని మీరు జయింపవచ్చును. అన్నిబలములుకన్న నైకమత్యబల మెక్కువది. అదియే జయమును సమకూర్చును." అని సన్నసన్నముగాఁ దన యుపన్యాసము ముగించెను.

ఆమాటలు వానినోట వెడలినతోడనే "మంత్రులే! మంత్రులే! ఓరి రాజద్రోహులారా! ఓరి దేశద్రోహులారా! ఓరి! మీ మొగములుమండ. ఓరీ! లంచగొండిముండకొడుకులారా" యని కొందఱు దూషింపనారంభించిరి.

"లంచగొండులు ధనమునకై దేశమునైన నమ్మివేయుదురు. వారిని నిలువనీయఁగూడ" దని కొందఱు పలికిరి. "చిత్రభానుఁ డధికారము వహించుట దేశక్షేమకర" మని కొందఱు వచించిరి. "చిత్రభానుఁడు భ్రాతృద్రోహి. వానికధికారమిచ్చుట త" ప్పని కొందఱు భాషించిరి.

ఇట్లు పలువురు పలువితంబుల సంభాషించుచు నర్ధరాత్రమగుటచే నిద్రాపీడితులై స్వగృహముల కరిగిరి. వేదశర్మ తెల్లవాఱుజామున సైనికుల మనస్సులలోఁ జిచ్చువెట్టి తనదారింబోయెను.

మఱునాఁ డుదయమున సైనికులు లేచి గుంపులుగూడి వేద

శర్మచెప్పిన వృత్తాంతమంతయు బహువిధములఁ జర్చింపఁదొడఁగిరి. అది నిజమని కొందఱు నీలి వార్తయని కొందఱుఁ దమకుందోఁచిన పోల్కిఁ బలికిరి. "మంత్రుల నమ్మరా" దని కొందఱు "వారివంటి సజ్జనులు లే" రని కొందఱు వాదించిరి. చిత్రభానుఁడు దుర్జనుఁ డని కొందఱు సజ్జనుఁడని కొందఱు వక్కాణించిరి.

పిమ్మట దండపాణి వజ్రపాణియు, గదాధరుఁడు శూలపాణియు నెప్పటియట్ల రాఁగా వారి కావృత్తాంత మెఱిఁగించిరి. గదాధరుఁడు శూలపాణియు "నిదియెల్ల ల్ల. ఇవి శత్రువులకల్పనలు నమ్మరా" దని గట్టిగా జెప్పిరి. దండపాణియు వజ్రపాణియు "నిజమని నమ్మరాదు. కల్లయని త్రోసివేయరాదు. ఏపుట్టలో నేపామున్నదో మన మేమెఱుంగుదుము?" అని చెప్పి చాటుచాటునఁ దమకాప్తులయిన క్రింది యుద్యోగస్థులతో బాలరాజు పరిపాలనము చేయునకు మూలమనియు, సమర్థుఁడెవరైన రాజ్యాధికారమువహించిన మేలగుననియుఁ జెప్పుచు వచ్చిరి.

మఱునాఁడు మధ్యాహ్నమున కీవార్త కాఱుచిచ్చువలె శీఘ్ర నగరమందంతట రేగెను. అత్యుత్సాహముతోఁ బ్రజలందఱు దీనిని గుఱించిమాటలాడు కొనుచుండిరి. ఏమూలఁజూచిన మనుష్యుల గుంపులే ఎక్కడనాలకించిన దండయాత్రా విషయమే. ఎక్కడ జర్చించిన మంత్రుల ప్రవర్తనమే. కొందఱు హేమచంద్రునిఁగూర్చి విచారించిరి. కొందఱు విక్రమసేనుని దురవస్థకుఁ జింతించిరి. కొందఱు మంత్రులను దూషించిరి. ఇన్ని మాటలేల! ఆఁడువాండ్రుమగవాండ్రు బాలురు వృద్ధులు భిక్షుకులు పరిచారకులు సర్వజనులు తద్విషయములనె జర్చించుచుఁ బనిపాటలుమాని యుండిరి. ఊరంతయు నట్టుడికినట్లుండెను. కొందఱు పిచ్చివాండ్రువలె సంచరించిరి. కొందఱు మంత్రుల యింటిమీఁదఁబడి వారిని గఠిన ప్రశ్నములనెడు రాళ్ళతో

ఱువ్వెరి. దండయాత్రాభయమునఁ గొందఱు నగరము విడిచి పల్లెల కుఁబోవఁ దలపెట్టిరి. క్రమక్రమముగా నీవార్త రాచనగరుఁజేరెను. విక్రమసేనుఁడు ఱిచ్చవడియెను హర్షవర్ధనుఁడు తల్లికడకరిగి యవ్వార్త చెప్పి యామె నాశ్చర్యసముద్రములో ముంచెను. కొంతసేఁ పామె విచారించి యదికల్పితకథయని కొడుకులతోఁ జెప్పెను. నర్మదయేదో పనిమీఁద నగరములోనికిఁబోయి ప్రజలలో వ్యక్తమగుచున్నయమ్మహోత్సాహము భయము స్వయముగాఁజూచి వచ్చినదగుటచే నదిచేతులు దిప్పుకొని యభినయముఁ జేయుచు నేత్రవిభ్రమము చేతను ముఖవైలక్షణ్యముచేతను నెంతో చిత్రముగా వర్ణింపఁ దొడఁగెను నగర మెల్లిండెనో నగరునట్లె యుండెను. సేవకులు మిక్కిలి కలవళ ముపడిరి. గాంధారరాజ దండయాత్ర ప్రతివారి పెదవులమీఁద నుండెను.

మణివర్మయు మాధవసేనుఁడును బ్రజల కోలాహలమును దమ యభయప్రదానముచేఁ గొంతవఱకు నివారించి యరవిందా దేవికిని విక్రమసేనునకును దప్పక చిత్తక్షోభము గలిగియుండునని తన్నివారణార్థము రాచనగరునకు దేవి పిలువనంపకయే పోయిరి. అరవిందా దేవి వారి నెప్పటియట్ల గౌరవించి గాంధారరాజదండయాత్రా విషయమున నేదయిన సత్యమున్నదాయని యడిగెను. ఆప్రశ్నకు మణివర్మ యిట్లుత్తర మిచ్చెను.

"అమ్మా! ఇందు లేశమయిన సత్యములేదు. మన వేగులవాండ్రు గాంధారదేశపు సరిహద్దులనుండి యీనడుమనే వచ్చినారు. ఆదేశము యుద్ధసన్నాహములేక నిస్తరంగమగు సముద్రమువలెనున్నదని చెప్పిరి. అదిగాక మనదేశమునుండి వణిజులు కొందరక్కడికి బోయివచ్చిరి. అక్కడనుండి బేహారముసేయుటకిక్కడికిఁగొందఱు వచ్చియుండిరి. వారెవ్వరీమాట చెప్పలేదు. ఇదియెవ్వరో రాజ-

కుటుంబమునకు నగరజనంబునకుఁ జిత్తసంక్షోభము గలిగింపవలెనని పుట్టించినకల్లవార్త. ఇదినమ్మి మీరు, మోసపోకుఁడు మీమనస్సులు ప్రసన్నములుగా నుంచుకొనుఁడు. భయము సర్వావయవములపటుత్వ మునడంచును. ధైర్యముం జెఱుచును. కార్యములనెల్ల విఘాత మొన ర్చును. కావున భయమున కెడమీయవలదు. మేముగూడ మిమ్ము ద్రోహము సేయుచున్నామని లోకములో నపవాదములు బైలుదేఱి నవి. మా విషయమై మేము చెప్పుకొనరాదు. మా పూర్వచరితము మాస్వభావము మాఋజుత్వములనగుఱించి సాక్ష్యమీయవలయును గాని మామాటలుగావు. దీనికి మీయంతఃకరణమే ప్రమాణము"

అనవుడు రాజమాత "ఇవి కట్టుకథ లని విక్రమసేనునితో మొట్టమొదటనే చెప్పితిని. మీపై మా కనుమానము లేదు" అని చెప్పెను. అమాత్యులు సెలవుగైకొని యంతఃపురము విడిచిపోయిరి.

పదునొకండవ ప్రకరణము.

వేదశర్మపలుకులవలనఁ గలిగిన యలజడి సంపూర్ణముగా నడఁ గకమునుపే మఱియొక విషయము రాజకులమునకు మహాందోళన ము గలిగించెను. వెనుకటిగోడవ జరిగిన నాలవనాఁటి రేయి రెండు గడియలుగడిచిన వెనుక రాచనగరు కడకుఁ నొక క్రొత్త పురుషుఁడు పోయి ద్వారరక్షకులంజూచి "అయ్యా! అరవిందాదేవి పుట్టినింటనుండి నేనువచ్చితిని. ఆమెజనకుఁడగు మహేంద్రదేవుఁడు నన్నతిరహస్య ముగా దేవిగారికొక రహస్యసందేశమెఱిఁగించిరమ్మని పనిచె తత్కారణమున నే నిటవచ్చితిని. నేనువచ్చినపని రాజకులమునకు మహోపకారకముగాఁ బరిణమించునుగావున మీరతిశీఘ్రముననారాక

యమ్మహాదేవి కెఱిఁగించి దర్శనము చేయింపుఁడు" అని రహస్యముగఁ జెప్పెను. అప్పలుకులువిని "మీరెవ్వరు? మీపేరేమి? పాంచాలనాయకుఁడైన మహేంద్రదేవుఁడు మిమ్ముఁ బంపెనని మీరన్నమాటకానవాలేమున్నది?" అని యడిగిరి. అంతవాఁడు నవ్వుచు "నాపేరు సోమభట్టు నేను బ్రాహ్మణుఁడను. పాంచాలరాజ పురోహితుఁడగు హరదత్తుని పుత్రుఁడను. దేవిగారు నాకుఁ జిరపరిచితులు. మహేంద్రదేవునకు వివాహకాలమున వారిచ్చిన వజ్రపుటుంగరము నాకాయన సూచకముగా జూపుమని నాచేతికిచ్చెను. ఇదె యా యుంగరము. దీనిం గొనిపోయి మీ దేవికిం జూపుఁడు" అని బదులుచెప్పి యప్పుడు వ్రేలినుండి తీసి వారి కిచ్చెను. రాజభటులు దాని గైకొని యంతఃపురరక్షకునివద్ద కరిగి యావృత్తాంతముఁజెప్పి యది వానికిచ్చిరి. అతండది యెల్ల నర్మద కెఱిఁగించి యుంగరమామెకిచ్చి దేవికడకుఁ బంపెను.

నర్మద దానిం బుచ్చుకొని యవంతిదేవి కడకుఁ బోయి యవ్వార్త నెఱిఁగించెను. ఆదేవి దీపములవెలుఁగున నయ్యంగుళీయకము ముందరిభాగము వెనుక భాగము మిక్కిలి శ్రద్ధతోఁ బరీక్షించి చూచి "ఓసీ! నర్మదా! ఇది మజ్జనకునకు వివాహకాలమున నా మాతామహులిచ్చిన యుంగరమే. కావున నితఁడు తప్పక మహేంద్రదేవునిచేఁ బంపఁబడినవాఁడే యయి యుండును. లోపలికి రానిమ్మని చెప్పుము. పురోహితసంతానుఁడగుటచే నితఁడు పరమవైదికుఁడు గావున నన్నుం జూడఁదగును" అని దానిం బంపెను. అదియు యథాశ్రీమముగా నంతఃపురరక్షకునకును తత్ ద్వారపాలకులకును దెలుప వారా భూసురుని నగరుఁ బ్రవేశపెట్టిరి. ఒక వృద్ధకంచుకి దారి జూప నాతఁడన్నికట్లు బహుద్వారములు గడచి యభ్యంతరమందిరముం జేరి కిశోరద్వయమధ్యమున నున్న యాఁడుసింగముంబోలి కుమారద్వయ

సమేతయైన యరవిందాదేవి యెట్టయెదుట నిలిచెను. ఆమెయుచితాసనంబున నాసీనంగూర్చుండఁబనిచి మహేంద్రదేవునియుఁ దనతల్లియు సోదరులయు బంధువులయు సేమ మరసి యాతని తండ్రిక్షేమ మడిగెను. తనతండ్రి కాలధర్మమునొందెనని యాతఁడు విన్నవించి యిట్లనియె. "అమ్మా! నాతండ్రి స్వర్గస్థుఁడగుటచేతనే మీ తండ్రిగారు మీయొద్దకు నన్నుఁబుత్తెంచిరి. ఆయనయున్న పక్షమున నాయననే పంపియుందురు." అనవుడు దేవి "అయ్యో! మహానుభావులైన మీతండ్రిగారు గతించిరా? నాకునాన్నమాయమునకు నంతరించినదని చెప్పవచ్చును. నావివాహమహోత్సవమునే చేయించిరి." అని వివాహము మాటజ్ఞప్తికి రాఁగానే తన నూతనావస్థను దలంచుకొని కన్నీరు వెట్టుకొనెను. సోమభట్టు దేవిని సమయోచితముగా సమాశ్వాసించి యిట్లనియె.

"అమ్మా! నావచ్చినపని చిత్తగింపుము. మీ జనకుఁడైన మహేంద్రదేవుఁడు భర్తృవిహీనయైన నీయొక్కయుఁ బితృవిహీనులయిన మనుమలయొక్కయు సేమమరసి యొకరహస్యముగ మీకొక మాటచెప్పి రమ్మని నన్నుఁ బుత్తెంచెను. మీరది సావధానముగా నాలకింపుఁడు. సింధుదేశ నాయకుఁడగు పరంతపుఁడు కాశ్మీరదేశముపై దండు విడియవలెనని సంకల్పించి మహోత్సాహముతో మహాప్రయత్నము సేయుచున్నాఁడు. పరంతపశబ్దము నేతిబీరకాయగాదు. అతఁడు పరంతపుఁడే. అతనికి మ్లేచ్ఛులు సమరద్రోహులు చండప్రతాపులనగు పారసీకులు మిత్రులై యుండుటవలన వచ్చి సాయము చేయుచుండుట. వానికిఁ బ్రతిఘటనము చిత్తములు సేయవలసినది లేకుంట. దోఃప్రతాపమున నెదిరింపఁగలవాఁ డెవ్వఁడును లేకయుండుటయు వానికనుకూలింపం జాలుచుండెను. సింధుదేశమునుండి వచ్చు సేన బేసనడిచెఁ గావున నారాజు సేనలో గుఱ్ఱపుదళము మెండుగ నుండును. అవి గుఱ్ఱము

లుగావు లేళ్ళుగాని. అదిగాక కాల్బలము గజబలము రథబలము గావలసినంతయుండును" అంతవఱకుఁ జెప్పినప్పటికి విక్రమసేనుఁ డందుకొని "దండెత్తువాఁడు సింధురాజనుకొన్నారు. గాంధారరాజని చెప్పఁ"డని పలికెను. అనవుడు సోమభట్టు "కాదు. కాదు. సింధు నాయకుఁడే. దానికిం దగిన తార్కాణములున్నవి. లిఖితరూపకము లైన తార్కాణములు దొరకినవి. నాగదో శాస్త్రజ్ఞానము లోకానుభవము సంపూర్ణముగాఁగల సుమేంద్రదేవునివంటి రాజనీతి కోవిదుఁడు తన పురోహితుని శ్రేష్ఠమైన సాక్ష్యంబగు నిదర్శనమునకుఁ బురికొల్పి పంపునా?" యని యుత్తరమిచ్చెను. అప్పుడు నరవిందా దేవి మిక్కిలి విస్మయముఁ బొంది "ఏమీ! లిఖితరూపకములగు తార్కాణములు దొరకినవా? ఎవరు వ్రాసినది? ఎవరికి వ్రాసినది! ఎప్పుడు వ్రాసినది? ఏదేది! చూడనిమ్ము" అని మాటవెంబడి మాట వచ్చునట్లు మిక్కిలి తొందరతో నడిగెను.

అడుగుటయు సోమభట్టు "అమ్మా! ఎవరననేల! మనచేతులు, మనకాళ్ళు, మనకన్నులు, మనచెవులు కూడ మనతోడనె నీడలవలె మనతో నుందురు. ఆనిడలే మనకు శత్రువులు మన గోడలే మనకు శత్రువులుగదా" యని బదులుచెప్పెను.

అయ్యా! వారి నామధేయములు వినువఱకు లిఖితరూపక దృష్టాంతములు చూచువఱకు నాకున్న తత్తఱపాటు చెప్ప నలవి గాకున్నది. కావున నీక్షణమే వాటిం బ్రదర్శించి సానునప్పి భ్రమించుచున్న నామనస్సునకుం గుదురుపాటు గలిగింపుము" అని యరవిందా దేవి వానిం ద్వరపెట్టెను. అప్పుడు సోమభట్టు తనకృష్ణాజినముచుట్ట విప్పి యందుండి యొక సొడపసంచిఁ దీసి యాసంచిలోఁ గట్టకడపటి సొరంగములో నట్టనడుమ సన్నమడ్డ చుట్టఁబడి రెండు మడతలుగానున్న యొక భూర్జపత్రముఁదీసి విక్రమసేనుని చేతికిచ్చి చదువుమనెను. అతఁడు దీపముదగ్గఱకుఁబోయి యిట్లు చదివెను.

శ్రీమన్మహారాజాధిరాజ త్రిభువనమల్ల కిన్నరేంద్ర ఘటాపం చానన పరరాజవేశ్యాభుజంగ సకలసమరాంగణ సార్వభౌమ ప్రముఖ బిరుదాంకితులును సింధుదేశాధీశ్వరులును నగు స్వస్తిశ్రీ పరంతప మహారాజుగారి దివ్యచరణారవిందసన్నిధికి. కాశ్మీరరాజమంత్రియు మీసేవకుఁడును నగు సుశివర్మ వందనశతపురస్సరముగా వ్రాసికొన్న విజ్ఞాపనము-

బౌద్ధభిక్షుకవేషధారియైన, గూఢవేగులవానిచేత దేవరవారు పరమానుగ్రహమున నాకు వ్రాయించి పంపిన లేఖనందుకొంటిని. కన్నులనద్దుకొంటిని. పూవుదండవలె శిరమున ధరించితిని. ఈసేవకుని మీఁద నిర్హేతుకముగా మీ కింత యనుగ్రహము గలిగినందుకు మిక్కిలి సంతసించితిని. నా హృదయానందము దెలియఁజేయుటకుఁ దగిన మాటలు నే నెఱుఁగనివాఁడ. మీరు కాశ్మీరదేశము సంగ్రహింపఁ గుతూహలపడుచున్నట్లు వ్రాసినారు. ఆదేశమే పాటిబలము గలదని యడిగినారు. మీసంకల్పము శ్లాఘాపాత్రము. ఈరాజ్యము పూర్వము బలమైనదేగాని నేఁటికాలమున రాజు చిన్నవాఁడగుటచే రాజ్యము దుర్బలముగానున్నది. మానవశరీరమునం దరిషడ్వర్గమువోలె నీదేశమున నంతశ్శత్రువులు బలాఢ్యులు గలరు. వారిరాయిడిచేత నెలుకలు దొలిచినయిల్లువలె నీదేశము శిథిలమైయున్నది. దేశము సారవంతమై రత్నగర్భలగు భూములు గలదై స్వర్గఖండమువలె నుండుటంజేసి బాహ్యశత్రులనేకులు దీనిపైఁ గన్నువైచియున్నారు. మాకు ముప్పది వేల సేనకంటె నెక్కువలేదు. దేశస్థితియిది. సాయము జేయుమని నన్ను మీరు కోరినారు గావున ప్రత్యుపకారము నేను మీకుఁ దోడుపడియెద. నేను కోరుకొన్నచోట నాకు సారవంతములైన పదియగ్రహారములు, పదిలక్షల రూకలు మీరిచ్చెదనని వ్రాయించిరి. ఇరువది యగ్రహారములు నాకు దయచేయవలెనని కోరుచున్నాను. మీఁద

మీచిత్తము మాచిన్నరాజునుబట్టి మీకప్పగించెను. కోటమీస్వాధీనము జేసెద ధనాగారమంతయుఁ దరతరములనుండి ప్రోగుచేసిన ధనరాసులతో నిండియున్నది. అచ్చట లక్ష్మితాండవమాడుచు మిమ్ముం బిలుచుచున్నది. మీరువచ్చి యాక్రమించుటయే కొఱఁత. ఈదేశము మీస్వాధీనమగునేని స్వర్గము మీచేతిక్రిందికివచ్చినట్లు. మేరుపర్వతము మీయధీనమైనట్లు కైలాసము మీగడపలోనున్నట్లు. ఆలస్యముచేయక వెంటనే బలములఁగూర్చుకొని రంగు దండపాణియు వజ్రపాణియు నేఁ జెప్పినట్లు వినరుగాని గదాధరుఁడు శూలపాణియు నాయింటి కుక్కలు. వారునాపనుపు దప్పక సేయుదురు. వారుతమతమ సైన్యభాగములతో వచ్చి మిమ్ముం జేరుదురు. మానావసేనయుఁగూడ మనలోనివాఁడే ఆపుర్వ్యారకుఁగూడ మీరు మనపని తీరినవెనుక దగిన పారితోషికములిచ్చి సంతోషపెట్టవలయును. మీరు నాకీవ దీనికుత్తరము వ్రాయునప్పుడు దానిలో నాపేరు వ్రాయక యశోకవర్ధనునకని వ్రాయవలయును. పాములవానివేసము వేయించి నావేగులవానిని మీకడకీ యుత్తరమిచ్చి పంపుచున్నాను. ఇదే వందన శతము.

ఇట్లు విన్నవించు మీ విధేయుఁడు,

మణివర్మ.

కుమారుఁడు జాబు చదువుట ముగించినతోడనే యరవిందాదేవి "నాయనా! నీవు మణివర్మ వ్రాఁత నెఱుఁగుదువుకదా! ఇది యతని వ్రాఁతయగునా?" యని యడిగెను. "తల్లీ! మణివర్మలేఖనము నే నెఱుఁగుదును. అక్షరములు గుండ్రములై యాణిముత్తెములట్టులుండును పంక్తులువంకఱలేక ముత్యాలకోవలు పఱచినట్లుండును. అక్షరములు మిక్కిలి దగ్గఱఁగా వ్రాయుట యతనికలవాటు. పెద్దగ్రంథము చిన్న చోటున నతఁడిమిడింపఁ గలడు. ఆనైపుణ్యమిందు స్పష్టముగఁ గనఁ

బడుచున్నది. తలకట్లు పొల్లులు తీర్చుటలో నతని హస్తమున కొంకా నొకవింత కౌశలముగలదు. అదియు నిందుఁ గనంబడుచున్నది. కావున ఈవ్రాఁత యాతనిదే యని నాకుఁ దోఁచుచున్నది. అని యుత్తరము జెప్పెను. అదివిని యా దేవి నిట్టూర్పు విడిచి యీ వ్రాఁత తప్పక మణివర్మదేవైనపక్షమునఁ గాశ్మీరరాజ్యలక్ష్మి ముఖమున బ్రహ్మమిక్కిలి చెడ్డవ్రాఁత వ్రాసెనని నేను దలంచెద. అట్లు కానిచో మేరువువంటి ధైర్యమును సముద్రమువంటి గాంభీర్యమును రాజసామాన్య దుర్లభమయిన సౌజన్యమునుగల మాతండ్రిగారేల దారుణముగా నస్తమింతురు! హా రాజ్యలక్ష్మి నీకును మాకును ఋణము దీఱెనదా? మాపైని నీకు విసుగుదోఁచినదా మమ్ము విడచి పరరాజుల పాలుగాఁదలఁచితివా పరమేశ్వరుని యభిమత మెట్లున్నదో యట్లు కాఁగలదు అని పలికి కుమారులధైర్య పడుదురేమో యని వెంటనే శంక దోఁప నాధోరణి దప్పించి యా దేవి వెండియు సోమభట్టు నుద్దేశించి "అమ్మా! ఇది యెట్లు మాతండ్రిగారికి దొరికినది?" యని యడిగెను. అందుకు సోమభట్టిట్లనియె. "అమ్మా! ఇది చిత్రముగా లభించినది. ఒకపాములవాఁడు కన్యాకుబ్జపట్టణమునఁ దనపాముల నాడించి ధనమార్జించుకొని యిందదుఁ దిరుగుచుండెను. ఒకనాఁడు వాఁడు తానార్జించినవిత్తముం దీసికొని యూరుచివరనున్న కల్లంగడికి బోయి రెండులొట్టియలకల్లు ద్రావి యొడలు మఱచి కొంతసేపుఁ దొరలి కొంతసేపు నేలఁబొరలి తెలివివచ్చినతోడనే మరలఁ గొంతద్రావి ప్రిక్కనున్నవారితో నిర్హేతుకముగాఁ గయ్యమునకుఁ గాలుదువ్వి వారి పైఁబడెను. అప్పుడు జుట్టుజుట్టు పట్టుకొని వాండ్రుపోరాడిరి. ఈ భూర్జపత్రము వాఁడు తన తలపాగలో జాగ్రత్తగా దాచెను. ఈకలహములో తలగుడ్డ వీడిపోవుటం జేసి యిది నేలంబడెను. మహేంద్రదేవమహారాజుగారి వేగులవాండ్రు దేశమందంతట వ్యాపించియుందురుగావు

న నాఁడు కల్లంగడిలోనున్న యొకచారుఁడు మెల్లగా దీనిం దీసికొని మహారాజుగారికిచ్చెను. ఈభూర్జపత్రముయొక్క చరిత్రమిది. ఇందు నమ్మకపోవుటకేమియు లేదు. అంతయు సహజముగానున్నది. అసంభవమేమియుఁ గానంబడదు. కావున మీతండ్రిగారిట్లు మీతోఁ జెప్పుమనిరి. మణివర్మను మాధవసేనుని నమ్మి మీయర్ధప్రాణము లాతని చేతం బెట్టవలదు. అవి పూలదండలుగావు. కుబుసము వీడ్చిన కోడెత్రాచులు. అవి పగడములుగావు, చండ్రనిప్పులు. అవి క్షీరములుగావు, సున్నపునీళ్లు. అవి హంసలుగావు, కొంగలు. అవి గోవులుగావు గోచర్మముఁ దాల్చిన బెబ్బులులు. కావున నమ్మి మోసపోకుఁడు. నీప్రాణములు బాలురప్రాణములు విషాగ్నులవలన శస్త్రసాధనములవలనఁ గాఁపాడుకొననది. ఇది మీనాయనగారి సందేశము. దీనిని రత్నాభరణమువలె మీశిరంబునఁ దాల్పనగు. మహామంత్రమువలె భక్తితో స్మరియింపవలెను. అమ్మా! నావచ్చినపనియైనది. చీఁకటిపడిన తరువాత నగరుసొచ్చి రేయి రెండుజాములు గాకమునుపే యూరువిడిచి పోవలసినదని మీతండ్రిగారు సెలవిచ్చిరి. నేనిచ్చటఁ దెల్లవాఱువరకు నుండరాదు. మీ యమాత్యులు మీసేనాపతులు నన్నుఁ బలుసిలుఁగులఁ బెట్టుదురు. మీతండ్రికి బురోహితుఁడనై మీకు హితమాచరింపవచ్చితిని. మేము ఛాందసులము. అలౌకికులము. మక్కుసూటిగఁ బోవువారము. దారినవెళ్లి దారినవచ్చువారము మీనేమమతనికి వెంటనే యెఱిఁగింపుమనికూడ మీతండ్రిగారు సెలవిచ్చిరి. అందుచే నాకు సెలవొసంగుము." అనిలేచెను.

అరవిందయు విక్రమసేనుఁడు హర్షవర్ధనుఁడును లేచి వానికి నమస్కరించిరి. "అయ్యా! మేమీగడియవఱకు సేమముగా నున్నామని మానాయనగారితోఁ జెప్పుఁడు. ఇక్కడిస్థితిగతులనరసి నేనాయనకుఁ గర్తవ్యమునుగుఱించి జాబువ్రాసి విశ్వాసముగలబంటునంపెదను

అందఱ నడిగితినని జెప్పుఁడు. దైవానుగ్రహమున బ్రతికితిమేని మరల దర్శనము జేయుదుమని జెప్పుము." అని యరవిందాదేవి వాక్రుచ్చి వానినంపెను.

ఆభూర్జపత్రము విక్రమసేనుని చేతినుండి హర్షవర్ధనుఁడు దీసికొని చదువుకొని "అమ్మా! మనము దొంగలగుంపు నడుమనున్నాముసుమీ" యనిపలికెను. "కుమారా! అదియిటు తెమ్ము. నేనుజాగ్రత్తగా దాఁచెద" నని తల్లిపుచ్చుకొని మరలమగల దానింజదువుకొని "వత్సలారా! ప్రొద్దుపోయినది పండుకొనుఁడు భయములేదు" అని వారిం బానుపులఁజేర్చి నిద్రపుచ్చెను.

అరవిందాదేవికిఁ జాలసేపు నిద్రపట్టనేలేదు. తెల్లవారుజామున నొకచిన్న కునుకు పట్టెను. అంతలోనే పగతురుకోటనాక్రమించి విక్రమసేనునింబట్టుకొని బంధించినట్లు దుస్స్వప్నము రాఁగా నామె నిద్రలో నయ్యోయయ్యో యని యఱచివగచి త్రుళ్ళిపడి మేల్కొని లేచి విక్రమసేనుని పాన్పుకడకుఁబోయి కొడుకుఁజూచుకొని యదికలగదాయని ధైర్యముఁదెచ్చుకొని నర్మదను లేపి తనదుస్స్వప్న మంతయు నెఱిఁగించి మరలఁ గన్నుమూసిన నెక్కడపాడుకలవచ్చునోయని శంకించి తెల్లవాఱునఱకు దానితో మాటలాడుచుండెను. తెల్లవాఱిన పిదప సమయోచిత కృత్యములుదీర్చి యాదేవి మణివర్మం బిలుచుకొనిరమ్మని యొక సేవకునిం బనిచెను.

అతఁడును స్నానసంధ్యాద్యనుష్ఠానములు దీర్చికొని సముచిత వేషంబుఁదాల్చి రాచనగరుఁజొచ్చి దేవిని సందర్శించెను. విక్రమసేనుడామెప్రక్కనుండెను. వారిమొగము లెప్పటియట్ల ప్రసన్నములుగాక వేఱుభంగి నుండుటచే నేదో క్లిష్టవిషయము వారిమనస్సులం బీడించుచున్నదని వృద్ధమంత్రియూహించి కారణమడుగఁబోవుచుండ నంతలో నరవిందాదేవి యుచితాసనంబున నతనిం గూర్చుండఁబనిచి కడ

చినరేయి సోమభట్టు తెచ్చిన భూర్జపత్రి మతనిచేతికిచ్చి చదువుకొమ్మనియెను ఆసచివోత్తముండు లేఖ నామూలాగ్రముగఁ జదువుకొని విస్మితుండై యేమనుటకు నోటమాటరాక చదివినదే చదువుచు లేఖ దిరుగవేయుచు వెఱ్ఱివానివలె నుండెను. అప్పుడరవిందాదేవి వానినుద్దేశించి "అయ్యా! లేఖలోనివ్రాత నీయది యగునా?" యని యడిగెను. "అమ్మా! వ్రాతనాయది కాదు. ఈజాబు నెన్నఁడు నేను వ్రాయలేదు. సింధునాయకుఁడగు పరంతపుని నేను వినుటయేకాని వాని నెన్నఁడుఁ జూడలేదు. వానికి నాకు సంబంధము లేదు. కాని యీవ్రాత యచ్చముగ నావ్రాతవలెనే యున్నది. అక్షరములపొందిక తలకట్లయొక్కయు పొల్లులయొక్కయు తీరు నేను వ్రాసినప్పుడెట్లుండునో యట్లే యున్నది. ఇది చూడ నాకు మాయగా నున్నది." అని యతఁడు బదులు చెప్పెను.

"అయ్యా! వ్రాత నీవ్రాతవలెనున్నదా! అక్షరములపొందిక తలకట్లతీరు పొల్లులతీరు నీవ్రాతలోనున్నట్లే యున్నవా! కాని జాబు నీవు వ్రాసినది కాదా? ఇది యెవ్వరైన విశ్వసింతురని నీవు చెప్పుచుంటివా? నీపలుకులు శిశువులు నమ్మవలయు. పశువులవంటి బాలిశులు నమ్మవలయు. మతిలేనివారు నమ్మవలయు. ఇట్టిపలుకులు నమ్ముటకు మేము వెఱ్ఱివాండ్రము కాము. నీవే తంత్రివి; నీవే సోదరుఁడవు, నీవే మా కేలుగడయు, మాతాతగారినాఁటనుండి మమ్ముం గొలిచియున్నవాఁడవు నని నేనెంతో విశ్వాసముంచి మాయర్థప్రాణములు నీకప్పగించినందుకుఁ బదిలక్షల హూకలకు నిలువది యగ్రహారములకు నాసపడి మాగొంతుకోయం దలంచితివా? చిన్నరాజును బట్టి పగతురకప్పగింపఁ దలంచితివిగా! ఇంతకన్న ద్రోహమున్నదా? భర్తృవియోగదుఃఖమున మఱుఁగుచున్న నన్నుఁ జూడవైతివి. తండ్రిలేని పసిపాపని జాలిపడవైతివి. నీవు బెబ్బులులకన్నఁ దోఁడేళ్ళకన్న విషసర్పములకన్న ఘాతుక కృత్యముల సేయఁ దలఁచితివే! నీవు చేయఁదలఁచుచున్న ద్రో

హాయునకు యమధర్మరాజు నీ నిమిత్తమై క్రొత్తనరకముల సృష్టింప వలయుగాని పాతనరకములు పనికిరావు. నీ కగ్రహారములే కావలసినపక్షమున నన్నడిగిన నే నియ్యనా? నూకల నేనియ్యనా? బిరుదుల నేనియ్యనా? దీనికై గడ్డితినవలెనే? చిరకాలము జీవించితివే. ఎందుకు నీజీవనము? జగజ్జనులం బీడించుచు సర్పము వేయిసంవత్సరములు జీవించును. గదాధరుఁడు శూలపాణి మాధవసేనుఁడు మొదలగు నందఱనుగూడఁ జెఱచితివే. ఆహా! తేనెబూసిన కత్తి యని గడ్డి గప్పిన గొయ్యి యని యెఱుఁగక మేము మోసపోయితిమి. చాలు చాలు! చిత్రభానుఁడు పరమదుర్మార్గుఁ డంటివి. అతఁడును హారాజుగారిని వధించెనంటివి. అతనికన్న నీ యాధిక్యమేమి? నీదుశ్చరిత్రమువలన నిఁక నెవ్వరిని నమ్మఁగూడదను నీతి మేమునేర్చుకొంటిమి. బ్రాహ్మణుఁడవు వయోవృద్ధుఁడవు చిరకాలపరిచితుఁడవు కావున మేమూరకుండవలసి వచ్చెఁగాని నీవెట్టిశిక్షకైనఁ బాత్రుఁడవు. నీకంతఃకరణము లేదు. నీకుగుండెలు లేవు. కటికవాఁడైన నీకన్న యోగ్యుఁడు. రాక్షసులైన నీకన్న యోగ్యులు చాలుఁజాలు నిఁక బొమ్ము" అని యాగ్రహావిష్టయై యరవిందాదేవి యాతని గడుంగడుఁ దూలనాడెను. విక్రమసేనుఁడు "తాతగారూ! మాయమ్మ కోపావేశమున మిమ్ముం దూలనాడిన దన్నమాటే కాని యీజాబుమీరు వ్రాయని యెడల నిట్లుండుటకుఁ గారణమేమో చెప్పఁగలరా! ఇది యసంభవముగాదా" యని యడిగెను. మణివర్మమొగము కళాహీనమయ్యెను. చిరకాలమునుండి కడువిశ్వాసముతోఁ దానొనర్చిన సేవయంతయు బూడిదఁబోసిన పన్నీరయ్యెనని యతఁడు మనంబున విచారించెను. అయినను ధైర్యముఁదెచ్చుకొని యిట్లనియె. "కుమారా! రాజపత్నియైనందున నీకుంబలెనె నాకుండల్లి. తల్లి బిడ్డలను లోపమున్నప్పుడు, లోపమున్నదని భావించినప్పుడు, చీవాట్లుపెట్టుటయుక్త

ము. నేను మహాపరాధముఁ జేసితినని నమ్మి యామె బాణములవంటి మాటలతో నన్ను నొప్పించె. అందుకునే విచారింపను. రాజ్యమీస్థితిలో నున్నప్పుడు మిక్కిలి యనుమానాస్పదమైన యిట్టిలేఖ చేయిఁ జిక్కినప్పుడు మీయమ్మయే గాదు— ఎవ్వరైన నిట్లే యందురు. ఈయపరాధమును నేను జేసినపక్షమున నామె యన్నమాటలన్నిఁటికి నే నర్హుఁడనే. నేనీతప్పు చేయలేదని నాయంతరాత్మ యెఱుఁగును; భగవంతుఁ డెఱుఁగును మాధవసేనుఁ డెఱుఁగును. ఇది శత్రువులకల్పనము. బ్రహ్మసృష్టికిఁ బ్రతిసృష్టిఁ జేసిన విశ్వామిత్రుఁడువలె నావ్రాఁత కెవరో మిక్కిలి బుద్ధిమంతుఁడు ప్రతిసృష్టి గావించినాఁడు. లోకములో నెంతెంత నెఱజాణలైనఁ గలరు. పరమేశ్వరుఁడు సృష్టించిన యాకులంబోలిన యాకులు, పండ్లంబోలినపండ్లు మవ్వపుంజిగురులుం బోలిన మవ్వపుంజిగురులుఁ జిత్రింపఁగల చిత్రకారులున్నట్లే రూపంబులం బోలినరూపంబులనిర్మించు శిల్పులున్నట్లే వ్రాతలంబోలిన వ్రాతలసృష్టింపఁగల భూలోకవిశ్వకర్మలు, కలియుగవిశ్వామిత్రులు లోకంబునం గలరు. మీకు నామీఁద నాగ్రహముబుట్టించుటే వారి సంకల్పము. అందువారు సంపూర్ణముగాఁ గృతకృత్యులైరి. నన్ను మీరుతూలనాడినట్లు, నాయెడనమ్మిక గోలుపోయినట్లు నన్నుఁగొలువునుండి తప్పించినట్లు వారువిందురేని వారికార్యము నెఱవేఱినట్లు వా రానందింతురు. ఎట్లయిన శత్రువులు సంకల్పసిద్ధులు. తల్లీ! నీవురోషావేశమున నన్నుం దూలనాడినను నేనాగ్రహింపను. నేను మనోవాక్కాయకర్మముల మీయెడ దోసమాచరింపఁదలఁతునేని కాశీమహాక్షేత్రమున గోసహస్రమును వధించినట్లు. కురుక్షేత్రాదిపుణ్యస్థలములలో బ్రాహ్మణహత్యలు చేసినట్లు. నాతల్లింజంపినట్లు. నాతండ్రింజంపినట్లు. ఇంతకన్న నేనేశపథంబులు చేయుదు? నన్నుగురించి నేఁ జెప్పుకొనుట న్యాయముకాదు. సూర్యచంద్రులు సాక్షులుగా భూ

వ్యాది పంచభూతములు సాక్షులుగా నేను మీయెడఁ గృతజ్ఞుఁడనై యున్నాఁడను. ఏపాపమెఱుఁగను నాచేసిన మేటిసేవ బూడిదఁబోసిన పన్నీరైనదని నాబ్రతుకు హాస్యాస్పదమైనదని నేను విచారించుచున్నాఁడను. ఏలయన మీతో రాజభక్తి గల్గియుండుటచేత నేనావలఁ జిత్రభానునకుఁ బగతుఁడనైతిని. అతని మాయలను నరులలో మీరు చిక్కుటంచేసి మీకును బగతుఁడనైతిని. ఏమైననేమి! మీరు నన్నుఁ గొలువునుండి తప్పించిననుసరే దూషించిననుసరే. రాజకులమునకు నామేనఁ బ్రాణములున్నంతసేపు నేనుపకారమే కాని యపకారము సేయను. నాతలఁదెగనేసి మీరు కోటగొమ్మలకుఁ గట్టించినను నేను విచారింపను. నామరణమువలనఁ గాశ్మీరరాజకుటుంబమునకు మేలగునేని నాజన్మము సార్థకమైనదని నేను సంతోషింతును. నాబుద్ధి, నాశరీరము, నాకాలము, నాపయస్సు మీసేవకై గడపితిని. కాన యూపిరి యున్నంతసేపు నిఁకముందున్నట్టే చేయుదును. ఇట్లు సేయనైతినేని పంచమహాపాతకులు పోవుమార్గములకుం బోవుదును.

ఇట్లు సంపూర్ణమనోవేదనతో సంభాషించి యావృద్ధసచివుఁడు వారికడ సెలవుదీసికొని పోయెను. పోవుటకు సెలవిమ్మని యడిగినప్పుడుఁ గూడ నరవిందాదేవి వానితో మాటలాడలేదు. విక్రమసేనుఁడుమాత్రము "మంచిది. పోయిరం" డని పలికెను. మణివర్మ రాజాంతఃపురమున జరిగిన చిత్రకథయంతయు మాధవసేనునకు గదాధరాదులకుఁ దెలిపి రాజకుటుంబము చిత్రభానుఁడు త్రవ్వినగోతిలోఁ బడి లేవలేక యున్నదని మిక్కిలి విచారించెను. వారును దైవప్రమాదమునఁ దప్పుదారిం ద్రొక్కెనని నొచ్చుకొనిరి.

మంత్రి వెళ్లినవెనుక విక్రమసేనుఁడు తల్లితో మణివర్మ చెప్పిన సమాధానము ప్రశాంతమైన సమయమున వెండియు నాలోచింపఁ దగియున్నదని చెప్పెను. "నాయనా! మిత్రులెవ్వరో శత్రులెవ్వరో

దెలిసికొనుటకు వీలులేనియవస్థలో మనమున్నాము. నామనస్సు చెడిపోయియున్నది. అది చక్కఁబడినవెనుక నట్లజేయుదము" అని యుత్తరము చెప్పెను.

పండ్రెండవ ప్రకరణము.

చిత్రభానుఁడు కర్పూరమంజరికి వజ్రపాణిపై ననురాగము గలుగునట్లు జేయవలసినదని తనభార్యతోడను మల్లికతోడను దన వాక్పటిమమంతయు వినియోగించి చెప్పెనుగదా ! తనయాశలన్నియు దానిమీఁదనే నిలిచియుండుటచే నప్పనియెట్లు పరిణమించునో యని మనసులో నింతింతయనరాని బెంగపెట్టుకొని యుండెను. "బాలికతో మాటలాడితివా ? మాటలాడితివా ?" యని యిందుమణిఁ బ్రత్యహముం దొందరపెట్టుచుండెను. మల్లిక గంటఁబడినప్పుడెల్ల "బిడ్డయేమన్నది ? చెప్పితివా?" యని యడుగుచుండును. మూఁడునాలుగుదినములు గడచినతరువాత నొకనాఁ డిందుమణి బిడ్డం బిలచి భర్తతనతోఁ జెప్పిన విషయమంతయు నామె కెఱిఁగించెను. అదివిని కర్పూరమంజరి యనిష్టమును సూచించు చిఱునవ్వు నవ్వి యూరకుండెను. భావజ్ఞురాలయిన తల్లి యక్కన్యమతల్లి యుల్లము దానివలనఁ దెల్లముగ నెఱిఁగి వల్లభునితో నావృత్తాంతముఁ జెప్పెను. అంతనతఁడు మల్లికను ద్వరపెట్టి వేధించుటచే నామె కర్పూరమంజరితో మాటలాడి యామెభావమును జిత్రభానునికిట్లెఱిఁగించెను. "అయ్యా ! మీబాలిక మీసందేశము నాముఖమునవిని నన్ను మొగముకాచునట్లు జీవాట్లు పెట్టినది. బుద్ధిలేదాయని యడిగినది. ఇట్టిసందేశములు తేవలదని నొక్కిచెప్పినది. కావున దేవరవారె స్వయముగా నామెన డుగుట సమంజసము. మీయెడఁగలభక్తినైన భయమునైన నామె

మీయుపదేశమును మన్నించి మీకోర్కెఁ దీర్పవచ్చును. ఇది మాకుసాధ్యముగాదు. ఆమెకెవ్వరియెడ గౌరవమున్నదో వారిపరిసంగము చేయవలయుగాని మిక్కిలిచనవుగల మాబోంట్లు చేయఁగూడదు. అనవుడు చిత్రభానుఁడు తలయూఁచి "సరే! ఆమె యభిమతము నేనే కనుఁగొనియెద" నని యారేయి భోజనానంతరమున బాలికయున్న గదిలోనికిఁబోయి సముచితాసనమునఁ గూర్చుండి "అమ్మాయి! నీతో నేనొక్కమాట చెప్పఁదలఁచి వచ్చితి. స్థిమితమనస్కవై వినుము" అని చెప్పెను

ఎన్నఁడుఁ దన గదిలోనికిరాని తండ్రి యారేయి తనకడకు వచ్చుటచేత నతఁడు తన వివాహవిషయమునుగూర్చి పరిసంగింపఁదలఁచి యరుదెంచి యుండునని యామె గ్రహించి యతనికిం జెప్పఁదగిన సమాధానము ముందుగానూహించుకొని ధైర్యముతో నెదుటమంచముఁమీఁద గూర్చుండెను. అప్పుడు తండ్రికి బిడ్డకు నీక్రిందివిధమున సంభాషణము జరిగెను.

చిత్రభాను—కుమారీ! నేనును నీతల్లియు మున్ను జేసిన పూజలఫలముగా నోచిననోములపంటగా దేవతా వరప్రసాదమువలె మాయదృష్టవశమున లేక లేక యొక్కకుమారితవు జన్మించితివి. నాకు నీవొకకన్ను. నీతమ్ముఁడు విజయసేనుఁ డొకకన్ను. అందు నీవే నామనోరథంబవు. నాకనుల చందమామవు. నాబహిఃప్రాణంబవు. అట్లగుటచే నేను నిన్నొక్కకోరిక గోరఁదలంచి వచ్చితిని. అది నీవు సఫలముచేసెదవో బహుదుఃఖపరంపరచేత నవసియున్న నామనస్సు చెడిపోవునట్లు నిరాకరించెదవో యెఱుఁగ. ఏమనియెదవు?

కర్పూర—తండ్రీ! అది వినకుండ నేనేమియుత్తరముచెప్పగలను.

చిత్రభా—బిడ్డా! నీవదివిన్నదే. నీతల్లివలన వింటివి. మల్లికవలన వింటివి. అయినను నానోటఁగూడవిని సమాధానముఁజెప్పు. నీకు

వివాహయోగ్యకాలము ప్రాప్తించినది. తగినవరుని నన్వేషింపవలసిన భారము నాపైనున్నది. బిడ్డలకు మాతాపితలకన్న హితార్థులు శ్రేయంకరులు నాప్తులు ప్రపంచమున మఱియొకరు లేరుగదా? అందుచేత మేమెల్లవిధముల నీమేలు నీసుఖముఁగోరి వరనిర్ణయము సేయుదుము. స్వయంవరపద్ధతి రాచకాలముననున్నది గాని దానివలనఁ గొన్ని యరిష్టములుండుటచే నది నాకిష్టములేదు. బాలికలు నవయౌవనప్రేరితలై పౌర్వాపర్యములు విచారింపక భావికాలకష్టములనెన్నలేక "కన్యావరయతేరూప" మ్మనునట్లు కేవలము చక్కఁదనమునే చూచుకొని యే దరిద్రునో గుణహీనునో నాస్తికునో కులభ్రష్టునో విద్యాగంధశూన్యునో వరింతురు. స్వయంవరమునఁ బ్రమాదమున కెన్నో యవకాశము లున్నవి. కావున దానిని నే నంగీకరింప. అందుచే మేముచేసిన, నిర్ణయమునే నీవు తలయొగ్గి యనుసరింపవలయునని కోరుచున్నాను. "మాతృదేవోభవ పితృదేవోభవ" యని వేదముచెప్పుచున్నది. మాతాపితలు బిడ్డల పాలిదైవతములు. వారిమాట యవశ్యము గ్రాహ్యము. అట్లగుటంజేసి నీవునామాట ననుసరింతువని నమ్మియుంటి. విశేషించి నీవు తక్కిన రాజకన్యకలవంటిదానవు కావు. కావ్యనాటకాదులేగాక శాస్త్రములఁ గూడ నభ్యసించిన దానవు. గుణగ్రహణపరాయణవు. సంగీతసాహిత్య ధౌరంధర్యమున నీకు సాటియగుకన్య నేఁటికాలమున లేదు. నాబిడ్డ వగుటచే నేను నిన్నుఁ బొగడఁగూడదు గాని నీవిద్యకు వినయము వన్నె వెట్టుచున్నది. ఈనాఁటికన్యలవలె గర్వము పెంకెతనము నీకడ నున్న పక్షమున నేనట్లు చెప్పుటకు రాకనేపోదును.

కర్పూర—తండ్రీ! స్వయంవరమునఁ బ్రమాదములున్నవనుట నిజమేకాని దమయంతి పొరబడినదా? రుక్మిణి పొరబడినదా? తల్లిదండ్రులకిష్టములేని పెండ్లికొడుకును జేపట్టినను సుభద్ర పొరబడినదా?

విద్యావతులైన కన్యకలు మనసులో నెంతవలపున్నను నెంత మోహా పరవశులైనను స్వయంవర సమయమునఁ దమకులగౌరవంబును వరుని యాభిజాత్యమును గుణసంపదను జూచుకొనకపోరు.

చిత్రిభా—బిడ్డా! అందఱు కన్యకలు దమయంతియట్టివా రగుదురా? అందఱు రుక్మిణివంటివా రగుదురా? ఎల్లరు సుభద్రలగుదురా? అవి పురాణములలోని గాధలు. అదియునుఁగాక కవిచాతుర్య మందు మెండుగా నుండును. కవులు గోరంతలు కొండంతలు జేసి వర్ణింతురు. ఆమాట నీనే యెఱుఁగుదువు. దానికేమిగాని నీ వెవ్వరి కొఱకైన మేలుపడితివేమో చెప్పుము. నీవంపున కే రాజకుమారుఁడైన గుఱియైనచో నది నాకెఱిఁగింపుము. అతఁడు స్వీకరింపఁ దగినవాఁడగునో కాదో చెప్పెద.

కర్పూ—ఆవిషయమున నేనిప్పుడేమియుం జెప్పఁజాల. (అని సిగ్గునఁ దలవంచినది.)

చిత్రి—అమ్మా; మాళవరాజనందనుఁడగు మకరందుఁడు నీకునచ్చినాఁడని కర్ణాకర్ణిగ వింటిని. అయ్యది నిజమగునో కాదో నీవు నాకెఱిఁగింపుము! నాకడసిగ్గుపడకుము. నీమనోభావము స్పష్టముగా దెల్పుము పెఱవాఁడనుగాను. కన్నతండ్రిని. నీభావము దెలుపుదువేని నేనందున్న గుణదోషము లుగ్గడించెద.

కర్పూ—భావమునకేమిగాని యకుమారునియందుఁగల గుణదోషముల నుగ్గడింపుము.

చిత్ర—బిడ్డా! గుణదోషము లుగ్గడింపవలసినదని నన్నడుగుచుంటివా? నీవు విద్యావతివి. గుణగ్రహణశక్తి కలదు. అనఁగూడదుగాని నాకన్న నెక్కువచదువుకొంటివి. నీవు గ్రహింపలేని గుణదోషముల నే నెన్నఁగలనా? అయినం దండ్రినిగటచేతను బెద్దఱికము నామీఁదఁ బెట్టుటచేతను జెప్పెదవినుము—మాళవేంద్రుఁడగు

సుదర్శనుఁడు బౌద్ధుఁడు. మనము క్షత్రియులము. మనము వర్ణాశ్రమధర్మములఁ బాటింతుము. వారికవి లేవు. మనకు యజ్ఞములు మొదలగు క్రతువులు కలవు. శ్రాద్ధములు మొదలగు పితృకర్మలు కలవు. సంధ్యావందనాది నిత్యకర్మలు కలవు. ఇవి వారికి లేవు. వారు వేదమును బ్రమాణముగా గ్రహింపరు. శాస్త్రములు విశ్వసింపరు. పురాణములు కల్పిత కథలందురు. ఆత్మ లేదందురు. ఉత్తరలోకఫలమును నమ్మరు జగన్నిర్మాణ ధురీణుఁడగు చతుర్ముఖుని కన్నను, విశ్వరక్షణకళాప్రవీణుఁడగు నారాయణునికన్నను జగత్ప్రళయకారణుఁడయిన శివునికన్నను, శాక్యకులుఁడైన గౌతమబుద్ధుఁడే సర్వవిధముల నధికుఁడని వారు విశ్వసింతురు. ఇన్నిటికన్న గష్టమైన దింకొకటి కలదు. వారు పరమేశ్వరుఁడు లేఁడందురు. అందుచే నాస్తికులు. ఇట్టి యపవిత్రమగు ధర్మ ముపదేశించి లోకులను ధర్మభ్రష్టులను బరమపతితులను జేసిన యాగౌతమబుద్ధునకుఁ నధమగతులేగాని యుత్తమగతు లుండవుగదా!

కర్పూర—తంత్రీ! బౌద్ధమతసిద్ధాంతములు నీకు సరిపడకపోయినఁ బోవుగాక! నీచెప్పిన దోసములు బౌద్ధమతస్థులకడ నుండిన నుండుఁగాక! కాని, లోకోత్తర చరిత్రుఁడును, బరమపవిత్రుఁడును, సర్వదీనజనమిత్రుఁడును నయిన సిద్ధార్థుని నీవట్లు దూషించుట ధర్మము గాదు. ఆమహాత్మునికన్న నుత్తముఁడు నమ్మహనీయునికన్న माననీయుఁడు—నాదేవునికన్న మహానుభావుఁడు జగంబున మఱియొకఁడు గలఁడా ? ఆసిద్ధాంతములు నీవు చదువలేదు. వైదికధర్మనిరతు లగు పండితులవలన నిజములు కొన్ని యబద్ధములు కొన్ని విని సౌగతధర్మములు నింద్యములని దురభిప్రాయముఁ గలిగియుంటివి. అదివట్టి పొరపాటు. చిత్తగింపుము. అమ్మహాత్ముఁడు పవిత్రరాజవంశమున జన్మించి మహీమండలమేలుట కర్హుఁడై యుండియుఁ దండ్రికోర్కెఁ

డై కొడుకయ్యు- నమితలావణ్యతారుణ్య సమేతయగు భార్యంగూడి యుండియు- సకలైశ్వర్యసమృద్ధిఁ గల్గియుండియు లోకము పాపభూయిష్ఠమై యున్నదని విచారించి దుర్గతిపాలగుచున్న మానవలోకము నుద్ధరింపనమకట్టి యాలుబిడ్డలను, దల్లిదండ్రులను, బంధుమిత్రులను భాగ్యభోగ్యములను విసర్జించి చీనిచీనాంబరములకు మాఱుగాఁ గాషాయవస్త్రములఁ దాల్చి, ముత్యాలహారములకు మాఱుగా రుద్రాక్షమాలలు ధరించి శిరమున రత్నమకుటమునకు మాఱుగా జటాజూటమువహించి, గమగమతావుల నీను కలవంబులకు మాఱు బూదిఁ బూసికొని, యుద్యానవనములురోసి వనముల డాసి, మేడలు విడిచి చెట్లనీడల విడిసి, హిరణ్మయపాత్రముల త్యజించి మృణ్మయపాత్రముల భుజంచి, పరమనిష్ఠాగరిష్ఠుఁడై తపంబునేసి, మేను శుష్కింపఁజేసి యింద్రియంబుల గెల్చి, జీవితముయొక్క పరమార్థముం గని పెట్టెను. ఆమహానీయుఁడు మధ్యమలోకమున కలంకారము. క్షత్రియుఁడగుటచే రాచకొలమాయునవలన వన్నెకెక్కెను. మానవలోక మాయనవలనఁ బవిత్రమైనది. దయాదాక్షిణ్యములే యామహాత్మునిమతమునకు మూలరాళ్ళు. ఆశాక్యసింహుఁడు మూర్తీభవించిన భూతదయయని చెప్పుట యతిశయోక్తిగాదు. భూతదయ యాతనికళేబరముతో నాఁడు దగ్ధమైపోయినదనుట పొగడ్తగాదు. శాంతమామహానీయునితో నాఁడుచితిమీఁద బూడిదయయ్యెనని పలుకుట కవిచాతుర్యముగాదు. ఆయన బోధామృత మాస్వాదించినవారు ధన్యులు. ఆయనం జూచినవారు కృతకృత్యులు. ఆయనమతము స్వీకరించినవారు పవిత్రులు. ఆయనవలన మానవులు పతితులు గాలేదు. పతితులు పావనులయిరి. దుర్జనులు సజ్జనులైరి. అపవిత్రులు పవిత్రులైరి. ఆభగవానుఁడు దేవుఁడున్నాఁడనిగాని లేఁడనిగాని చెప్పలేదు. అంతమాత్రముచేత నతఁడు నాస్తికుఁడుగాఁడు, అతనిమతము నాస్తిక

మతముగాదు. అతఁడాస్తికులలో సగ్రగణ్యుఁ డని చెప్పవచ్చును. ఆస్తికులమని విఱ్ఱవీగు మానవులలో ననేకులు సత్యనాస్తికులు, ధర్మనాస్తికులు, దయానాస్తికులు, భక్తినాస్తికులు కలరు. ఆనాస్తికులలో నెందఱో యాస్తికులుగలరు. భూతదయాజితేంద్రియత్వమునను రెండును దన్మతమునఁ బరమసిద్ధాంతములు. ఆమత మవలంబించినవారు జీవహింసచేయరు. "ఆత్మవత్సర్వభూతాని" యనుధర్మము వారియందు స్థిరమైయున్నది. జీవహింసాభయముననే వారు యజ్ఞములు మానిరి.

చిత్రి—అమ్మాయి!, బౌద్ధమతసిద్ధాంతములు నీతలకెక్కినవే. అవి యెక్కడనేర్చితివి? ఆమతమన్న నీకింతగౌరవము కలుగుటకుఁగారణమేమి? గురివెందగింజలు నిప్పులని, గాజుపూసలు జాతిరత్నములని, యెఱ్ఱని పెంకులు కెంపులని నీవు భ్రమించుచుంటివి.

కరుణా—తండ్రీ! నేను భ్రమించుటలేదు. నేను విదర్భలోనున్నప్పుడు మైత్రేయియను బౌద్ధయోగిని తఱుచు రాజాంతఃపురమునకువచ్చుచు బోవుచు శుద్ధాంతకాంతలకు నప్పుడప్పుడు సుగతస్వాములధర్మముల నుపదేశించుచుండెను. అవి నేను మిక్కిలి శ్రద్ధగవింటిని. పిమ్మట నామె పాళీయనుభాష నాకుపదేశింప నందులోనున్న ధమ్మపదము మొదలగు నుత్కృష్టగ్రంథములఁ జదివితిని. అదికారణముగా నాకు మహనీయుఁడైన బుద్ధదేవునిమీఁదను వాని మతముమీఁదను నమితగౌరవము గలిగినది.

చిత్రి—సహవాసదోషమున సుశీలురు దుశ్శీలురగుట యాశ్చర్యముగాదు. నీళ్ళకు వస్త్రములకు వాయువునకు వస్తుసహవాసములనుబట్టి సుగంధదుర్గంధములు గలుగునట్లే మనుష్యులకుఁ గూడ దుర్జనసజ్జన సహవాసమువల్ల దురభిప్రాయ సదభిప్రాయములు పట్టుపడును. ఒకవేళ బౌద్ధమతములో నుత్కృష్టధర్మములున్నను బౌద్ధులందఱు సుగుణసంపన్నులగుదురా?

కర్పూ—తండ్రీ! అందఱు సుగుణవంతు లుండరు. కాని మాలవేంద్రుఁ డగు సుదర్శనుఁడు లాతివారితోఁ బోల్పఁదగినవాఁడు గాఁడు. ఆయన గుణరత్నాకరుఁడు. అతఁడు తనదేశమున జీవహింస మాన్పించెను. ఆయన నిష్కళంకచరిత్రుఁడు పరమ కృపాళుఁడు ప్రజలం దన బిడ్డలుగాఁ జూచును. ఆత్మసుఖముకంటెఁ బ్రజాసుఖ మెక్కువగఁ జూచును. ఎక్కువ పన్నులుగట్టి ప్రజలబాధింపఁడు. బౌద్ధమతస్థులమీఁదఁ బక్షపాతము, వైదికమతస్థులమీఁద ద్వేషము లేదు. అందఱ సమానముగఁ జూచును. ఆయన కొడుకు మకరందుఁడు పితృమార్గానువర్తి. తలిదండ్రులకు విధేయుఁడు. ప్రజాబాంధవుఁడు. తండ్రివలెనే యతఁడుగూడ రాజ్యమందలి ప్రజలలోఁ దండ్రిలేనివారికిఁ దండ్రి. సోదరులులేనివారికి సోదరుఁడు. మిత్రులులేని వారికి మిత్రుఁడు. బిడ్డలులేనివారికి బిడ్డ. ఈవిధముగా వారు సర్వజన శ్లాఘనీయులై, కృపాసముద్రులై, ధర్మతత్పరులై, రాజ్యపాలనము సేయుచున్నారు.

చిత్రి—ధర్మతత్పరులై పరిపాలించుట నీవెట్లెఱిఁగితివి?

కర్పూ—మాళవదేశమున నేనున్నకాలములో వారి యౌదార్యాదిగుణములు దెలిసికొనుట కనేకావకాశములు గలిగినవి.

చిత్రి—అంతఃపురమునందున్న విదేశాంగనకు నీకు లోకము నందలి వ్యవహారము, రాజుల పరిపాలనాపద్ధతులు దెలిసికొనుట కవకాశము గలిగినదా ? ఎంతోకాలము దేశమందుండి నల్గడలు దిరిగి జనులతోఁగలసి మెలసియున్న వారికే తెలియుట కష్టముగదా నీకవలీలగా దెలిసెనని నీవనినంతమాత్రమున నమ్మవచ్చునా! ఏదో యభిమానమున నిట్లనుచుంటివి.

కర్పూ—తండ్రీ! నాపలికినది సత్యముగాని యభిమానప్రేరితమైనమాటగాదు! శత్రువులయందైనను గుణమున్నచో గ్రహించుట సత్పురుషలక్షణము.

చిత్ర—గుణమున్న గ్రహింపవచ్చును. లేనిచో గ్రహించుటెట్లు ? ప్రస్తుతాంశము విను! మకరందునిమీఁద నీవు వలపునిలిపితివో లేదో నీమాటలచే స్పష్టముగాఁ దేటపడలేదు. కాని, వానియెడనీకుఁ గల యభిమానముంబట్టి నీకాతనిపైఁ గూరిమిగలదని నేను నిశ్చయింపవలసివచ్చినది. మనము వైదికాచారసంపన్నులము. వారు వేదబాహ్యులు కర్మరహితులు, మనకువారికిం గలయిక యపేక్షణీయముగాదు. నీవు దేవాలయమున కరుగుదువు; వారు దేవాలయములను రోయుదురు. మనము శివకేశవులను బరమాత్ములుగా నెంతుము; వారు మనుష్యమాత్రుఁడైన బుద్ధునే యారాధింతురు. నడవడులలో నాచారములలో నభిప్రాయములలో మనకువారికి నమితభేదము గలదు. అట్టివారి మనసులెట్లు కలియును ? పొత్తులెట్లు కలుగును ? సామరస్యమెట్లు కుదురును ?

కర్పూర—తండ్రీ ! అన్నింటికి మనస్సుప్రధానము. మనస్సులో నిష్టమున్నయెడల నన్నిఁట సామరస్యము గుదురును. దంపతులుభిన్నమతస్థులయినను దాంపత్యమున భంగముండదు. భర్తశైవుఁడు, భార్యవైష్ణవియైన దాంపత్యములున్నవి. మతములో నెవరిష్టము వారిది. ఎవరియిచ్చవచ్చినట్లు వారు దేవతల నారాధించుకొనవచ్చును. అంతమాత్రముచేతఁ బరస్పరమైత్రికి భంగముండదు. అరమరలేని కూరుములునిలుపుటకు మతమడ్డము రాదు.

చిత్ర—బిడ్డా ! నీవు వెఱ్ఱిపడుచున్నావు. అట్టిదంపతుల కెన్నడుఁగాపురము సరిగాఁబొసగదు. అయ్యదాసునకుఁబెట్టు నమ్మజంగమునకుఁబెట్టు నన్నసామెత నిజమగును. నీవుజక్కఁదనమొక్కటే మెచ్చి యాతని వరింపఁదలఁచు చుంటివి. వరునియందుఁ జూడఁదగినలక్షణమదియొక్కటియే గాదు. త్రాఁచుబాము తలలో వెలలేని మణియుండును. అదిచూపులకెంతో చక్కఁగానుండును. ఈగుణములంబట్టి

దానినట్టి వెంగలియైన మెడలో హారముగా వైచుకొనునే? దానిం బ్రిక్కలోఁ బెట్టుకొని పండుకొనునే? మెఱయుచున్నదంతయు బంగారమనుకొనవద్దు. కస్తూరీపంకముఁ బూసికొన వచ్చునుగాని బురదఁ బూసికొనఁ గూడదు.

కర్పూ — అయ్యో! చక్కఁదన మొక్కటే మెచ్చి కార్యనిశ్చయము చేసికొనుట లేదు. మెడఁ దాల్చునది కుసుమమాలగాని కోడెత్రాఁచుగాదు. మేనఁ బూసికొనునది మృగనాభిగాని, మెత్తని బురద గాదు.

చిత్రి — బిడ్డా! చదువుకొన్నదానవు గావున వీరుఁడు బాణమునకు బాణము వైచినట్లు మాటకు మాట సమయోచితముగఁ జెప్పఁగలవు. యుక్తులనటుంచి నామాటవినుము. మకరందునిపై మక్కువ మానుము.

కర్పూ — అట్లయిన నెవ్వని పాణిగ్రహణము సేయుమందువు?

చిత్రి — భళి! ఇప్పుడు దారికివచ్చితివి. చెప్పుచున్నాను వినుము — ఈపట్టణమున దండపాణి వజ్రపాణియని యిరువురన్నదమ్ములున్నారు. వారుత్తమక్షత్రియులు; చంద్రవంశజులు. మనము పాండవసంతతి; వారు యాదవసంతతి. మనకు వారికిఁ బూర్వకాలమునుండియు నిచ్చుకోలు పుచ్చుకోలుగలవు. వారిద్దరు సేనాధిపతులు, అసహాయశూరులు, నిర్వక్రపరాక్రములు. అందు వజ్రపాణి భుజాబలమున భీమసేనుఁడు, ధనుర్విద్యయందు సవ్యసాచి. సౌజన్యమునందు సహదేవుఁడు, శాంతమునందు ధర్మరాజే.

కర్పూ — చక్కఁదనమందో?

చిత్రి — పాడుచక్కఁదనము. వరునకుఁ జక్కఁదనమే ప్రధానమా? అది యప్రధానమని నాయభిప్రాయము. అదిగాక యెవరి చక్కఁదనము వారికుండును. కన్ను ముక్కు చెవి నోరు కాలుసేతు

లు వంకరలేక సరిగానుండినా మెట్టినరుఁడైనఁ జక్కఁగానుండును. గుణము ప్రధానముగాని చక్కఁదనమెందుకు ? తురాయిపువ్వు కట్టెట్టగానుండును. అందములేదు. చందములేదు. వాసనలేదు. అతఁడు నల్లగానుండును. నల్లగా నున్నంతమాత్రమున యువతీదూష్యుఁడగునా ? అట్లయిన నల్లనివారికిఁ బెండ్లికాఁ గూడదా? కస్తూరి నల్లనై సువాసనలచేత మాననీయముగాదా ? కోయిలనల్లనై మనోజ్ఞ ధ్వనులచే జగద్వంద్యముగాదా ? ఇంద్రనీలము నిగనిగకాంతులు నీనుచు నవరత్నములలో నొకటికాలేదా ? భగవంతుండగు పరమేశ్వరుఁడు స్ఫటికమువలెఁ దెల్లనిమేను గలవాఁడయ్యు నల్లనిదాసని పార్వతిని బెండ్లియాడలేదా ? శ్రీమహాలక్ష్మి బంగరుబొమ్మవలె నుండియు నీలమేఘశ్యాముఁడైన నారాయణుని వరింపలేదా ? నీలవర్ణము హరిహరులకు భార్యలతోడి కూటములు చెఱిచెనా ? పాంచాలి నల్లనిది; పాండవులు చక్కనివారు. ఇట్లెన్నో యుదాహరణము లున్నవి. కావున నల్లనివాఁడనిరోయక వజ్రపాణిం జేపట్టుము. అతఁడు వేయికన్నులులేని వజ్రపాణి. రక్కసులచేఁ బెక్కుసారులు కయ్యములనోడిపోని వజ్రపాణి. మునిశాపంబును జెందనివజ్రపాణి. సాధ్యములోకమందున్న వజ్రపాణి.

కర్పూ—రాజ్యములేని వజ్రపాణి. ప్రాజ్యతలేనివజ్రపాణి యని చెప్పుము.

చిత్ర—అమ్మా ! ఆలాగు నిరసింపఁగూడదు. అందఱకు రాజ్యములుండునా ? శ్రీకృష్ణునకేమి రాజ్యము గలదు ? రుక్మిణీసత్యభామ మొదలగు కాంతలెంతమంది గుణములకువలచి యాతనిఁ జెట్టఁబట్టలేదు.

కర్పూ—ఆయనకిదివఱ కొకభార్యయున్నది గదా !

చిత్ర—ఉండిననేమి ? చిన్నదానవయ్యు నీవె పెద్దభార్య వగు

దువు. నిన్నుఁ జేపట్టినపిదప నామెకు గౌరవము కడముట్టును. ఆమె నీకు దాసియై యుండును.

కర్పూ—హరిహరీ! తండ్రీ! ఆయన చేపట్టి యెంతో సుఖపడవలెనని వచ్చి సంతానవతియై మహాపతివ్రతయై యాతని సేవించిన యిల్లాలిని నేను దాసిగా నేలుదునా? అట్టిపాడుపని యెన్నఁడు నేఁ జేయను. నాదురదృష్టముచేత నొకవేళ నాతనిచేఁ బట్టుటయే సంభవించునేని నేనాయనకు రెండవపత్నినై యామెకే నేను దాసినై యూడిగములు సేయుదునుగాని యా సాధ్వి మనస్సునకు రవంతయేని నొప్పిగలిగింపను సుమీ! నీవు లక్ష్మీదేవిని శంకరునిఁ బ్రసంగవశమునఁ బేరొక్కొంటివి. నారాయణుని యందున్న గుణములు నీవజ్రపాణియందున్నవా? దేవతలసామ్యము పనికిరాదు. దేనికయిన మనస్సుప్రధానము. మహారాజునకు మందిరములుకావలెను. విరాగికి విపినములు కావలెను. మనసునకు నచ్చినవాఁడె మన్మథుఁడు; నచ్చనివాఁడు నాగుఁబాము.

చిత్ర—ఇంతకు వజ్రపాణినీకు నచ్చెనా, లేదా?

కర్పూ—తండ్రీ! అడుగుచుంటివి గాన జెప్పెద వినుము. అతనిచేయి బట్టుటకంటె శాశ్వతబ్రహ్మచర్యమున నుంట మేలు.

చిత్ర—బిడ్డా! నీవాతని చేపట్టుటవలన మనకు గొప్పపయుపకారమగును. అదియేదందువేని—వజ్రపాణియు వానియన్నయగు దండపాణియు మనపక్షమున నున్నారు. నీవు వజ్రపాణిని జేపట్టుదువేని వారు హేమచంద్రుని వంశమును సింహాసనమునుండి కూలఁద్రోసి కాశ్మీరరాజ్యమునకు నన్నభిషిక్తుఁ జేయుదురు. నేను పెద్దవాఁడను. నాలుగైదేండ్లురాజ్యము చేసి చనిపోదును. నాయనంతరమున నీతముఁడు విజయసేనుఁడు రాజగును.

కర్పూ—(చెవులుమూసికొని) హరిహరీ! ఎంతమాట! చిత్రి

మసేనుని రాజ్యభ్రష్టుం జేయుదురా? అందుకని నేను వజ్రపాణి పాణిగ్రహణము జేయవలెనా? నావివాహ మిట్టి దుష్కార్యమునకై నుపయోగింపఁబడునా? కటకటా! అట్టిపాడుపనిలో నేనెన్నఁడు బాల్గొనను. విక్రమసేనుఁడు తండ్రిలేనిబిడ్డ. మనమందఱమును వానికి సాయము జేసి రాజ్యమునందతని సుప్రతిష్ఠితునిఁ జేయుటకు మాఱుగా నిట్టి దుష్కార్యము సేయందగునే? ఈకార్యము నింద్యము. దూష్యము, నరకహేతువు. తండ్రీ! అట్టిపని నెన్నఁడు సేయకుము. విక్రమసేనుఁడు విజయసేనుఁడుం గూడ నా తమ్ములే. ఎవరు గద్దె నెక్కినను నాకు దద్దయు సంతసమే. కాని, పైతృకంబగురాజ్యమునకు విక్రమసేనుఁడే యర్హుఁడు. అతఁడు రాజగుటే ధర్మము. ధర్మేతరములగు మాటలు నాకడఁ జెప్పవలదు.

చిత్రి—(రోసముతో) నయమున భయమున నే నెన్నివిధములఁ జెప్పిన నామాటలు నీమనసున కెక్కకున్నవి. తలక్రిందుగాఁ దపస్సుచేసినను నీకు మకరందుఁడు భర్త గాఁడు. నిన్ను వజ్రపాణికే పెండ్లిచేసెదను జూడు.

కర్పూ—(రోసముతో) తండ్రీ! అంతవఱకు వచ్చునేని నాశరీరమగ్ని కాహుతిఁ జేసెద. అంత కవకాశము లేదేని—ఇదిగో! నాచేతి వజ్రపుటుంగరము. కర్పూరమంజరీశవమునే నీవు వజ్రపాణికి వివాహము సేయవలయునుగాని, యీ మేనఁ బ్రాణములుండఁగాఁ జేయఁజాలవు. ఒకవేళ నీవతనిచేత నామెడలోఁ ద్రాడుగట్టించి సంకల్పసిద్ధుఁడగుదువేని యది నామెడ కురిత్రాడగునుగాని మంగళసూత్రము గాదు. నీవు శూరుఁడవు. చలముగలవాఁడవు. నేను నీకడుపునఁ బుట్టిన కూఁతును. నీరక్తమే నానాళములలోఁ బ్రవహించుచున్నది. నీచలమే నాలోఁ బ్రతిఫలించుచున్నది. నేను మనస్సుచేత మకరందుని వివాహమాడితిని. దేహముచేత వివాహముగా నేని, యీ దేహ-

మితరులకొఱ కుపయోగ పడకపోవుఁగాక! బలవంతముగఁ జచ్చి మఱియొకజన్మమెత్తియైన నతనిం జేపట్టెద.

చిత్రి—బలవన్మరణమునఁ బిశాచమగుదువు.

కర్పూ—వజ్రపాణిని వివాహమాడి వానిభార్య యనిపించు కొనుటకన్నఁ బిశాచమైనను మంచిదే. రక్కసియైనను మంచిదే. ఆ పెనుభూతముతోఁ గాఁపురముసేయుటకన్న భూతమునైనను మంచిదే. వివాహము సామాన్య మనుకొంటివా? నీయిచ్చవచ్చినట్లు సేయుట కిది బొమ్మలపెండ్లి గాదు. రెండుహృదయము లొకహృదయము కావలె. రెండుమనస్సు లొకమనస్సు కావలె. భర్త చంద్రుఁడు, భార్య వెన్నెల. మగఁడు సూర్యుఁడు; మగనాలు కాంతి. గృహస్థుఁడు పూవు. ఇల్లాలు తావి. ఏకమనస్సుతో వా రవినాభావముగ నుండవలయు. బలాత్కారవివాహములు పనికిరావు.

చిత్రి—నీవు చచ్చిననుసరే! వివాహమాడి చావుము.

కర్పూ—ఆహాహా! నీవంటి తండ్రి ప్రపంచమున లేఁడు. నే మృతినొందిననుసరే నీకార్యమైనం జాలుఁగాఁబోలు!

చిత్రి—సరే! జాగ్రత్తగానుండుము. నీవు నాకు ధర్మప్రశ్నములు చెప్పఁదొడఁగితివి. దీనిఫల మనుభవింతువుగాక!

అని గాటమగు రోసమునఁ జవాలున లేచి గదివిడిచి యవ్వలకుం బోయెను.

పదమూఁడవ ప్రకరణము.

ఆశాదేవత జగన్మోహనాకారముఁ దాల్చి హస్తమునఁ బహురసభరితమైన రాజ్యఫలంబును బట్టుకొని మొగమునఁ జిఱునవ్వు వెన్నెలలు గాయ "నన్ను మెప్పించితివేని యీఫలంబు నీయదియ

నీయదియ! త్వరపడుము. ప్రయత్నింపుము" అని యూరించుచుఁ బలు తెఱంగులఁ బురికొల్పుటం జేసి చిత్రభానుఁడు స్వలాభపరాయణుఁడై కన్నబిడ్డసౌఖ్యము వీటఁబుచ్చి నిష్కరుణుఁడై కర్పూరమంజరి నట్లు తూలనాడి తన శయ్యాగారమునకుం జని నేత్రములనియెడు గోలుములనుండి రూక్షవీక్షణములను విస్ఫులింగములు చెదిరిపడ మొగము జేవురుబూసిన తెఱఁగున శోణమయి భయంకరముగఁ దోఁపఁ బండ్లు పటపటఁ గొఱుకుచు నిందుమణిం బిలిచి తనకుం గూఁతునకుం జరిగిన సంభాషణమంతయుఁ జెప్పి యామె పెంకెతనమునకుఁ దగిన దండన చేయునట్లు ప్రతినబట్టెను.

ఇందుమణి మిక్కిలి భయపడి కూఁతుకడకుఁ బోయి శాంతవచనములతో నిట్లనియె. "బిడ్డా! మీతండ్రిగారి స్వభావ మెఱిఁగియుండియు నీవాయన కంత కోపముఁ దెప్పింపఁదగునా? తండ్రిమాట వినవలదా? పితృవాక్యపాలనము నీవంటి విద్యావతియే చేయనిపక్షమున సామాన్యబాలికలు చేయుదురా? నీవు తండ్రిని దిరస్కరించితివని లోకమున వెల్లడియైన నది మన కప్రతిష్ఠగాదా? నీవు మిక్కిలి కఠినముగా మాటాడితివఁట! అట్టి కఠినోక్తులు తగునా?" అని మందలించుటయుఁ గర్పూరమంజరి "అమ్మా! తండ్రిమాట వినఁదగినదే. పితృవాక్యపాలన ముత్తమధర్మము. కాని, వివాహము పేరుపెట్టి నాకు దున్నపోతునో పెద్దపులినో లేక మఱియొక మోటపశువునో గట్టిపెట్టవలెనని తండ్రిగారు స్వలాభపరాయణులై సమకట్టినప్పుడు నే నాయనమాట నెట్లు శిరమునఁ దాల్తును? ధర్మము చెప్పినప్పుడు తండ్రిమాట గ్రాహ్యము. అధర్మము పలికినప్పుడు గ్రాహ్యముగాదు. తండ్రి యసత్యమాడుమన్న నాడవలెనా? జనకుఁడు నరహత్య సలుపుమన్న సలుపవలెనా? తండ్రి నీతిమాలి వర్తింపుమన్న వర్తింపవలెనా? ఆయన యధర్మము పలికెనుగావున నే నాయన యాన దాఁటితిని." అని బదులు చెప్పెను.

"బిడ్డా! చదువుకొన్నదానవు. నీకు నేను జెప్పఁజాలనుగాని యొక్కమాట వినుము! మహాత్ముఁడైన భీష్ముఁడు తండ్రిసుఖము కొఱకు స్వసుఖనిరభిలాషియై వివాహము మానుకొని బ్రహ్మచర్య దీక్షాపరతంత్రుఁడై లోకవంద్యుఁ డయ్యెను. వివాహమేగాదు రాజ్యముగూడ జనకుని సుఖమునిమిత్తము తృణప్రాయముగాఁ బరిత్యజించెను. రఘురాముఁడు జనకుని శాసనంబున రాజ్యపరిత్యాగంబుఁ గావించి సుకుమారియైన జనకకుమారితోఁగూడ వనములకేగి పితృవాక్యపాలకులలో నగ్రగణ్యుఁ డయ్యెను. చెప్పఁబూనిన నిట్టి వనేకములు గలవు. వారి తెఱంగున నీవును నీజనకునినిమిత్తము స్వసౌఖ్యముల నాసింపక యాయన ప్రీతికొఱకు నీదేహము నర్పింపరాదె!" యని యిందుమణి యుత్తరము చెప్పెను.

"తల్లీ! రాజ్యములు వదలవచ్చును. వివాహములు మానవచ్చును. నేనును వలయునేని వివాహము మాని బ్రహ్మచారిణినై తపోవనమున కరిగి జపమాత్ర జరిపెద. అది తండ్రిగారి కిష్టమగునేమో కనుఁగొనుము. కాని, యాసురపిశాచమునుమాత్రము చేఁబట్టను. వివాహమాడదలఁచితినా నామనసువచ్చిన రాజకుమారుని నాకు నచ్చిన గుణములుగలవానిని — నాకందోయి నలరించెడు లావణ్యవంతుని — నాహృదయము రంజింపఁగల రసికశిఖామణిని — నాప్రాణమునకుఁ బ్రాణమైనవాని — నామనోరథము సఫలము సేయువాని — నామేనికి గంధకుంభంబాతవలె నుండువాని — నొకలోకవంద్యుని — గుణరత్నాకరుని — సత్కులీనుని, విద్యావంతునిఁ జేపట్టెద. లేదా గార్గివలె శాశ్వత బ్రహ్మచర్య వ్రతమవలంబించి నారలుగట్టి కందమూలములు నాకలములు దిని జడలుదాల్చి మేను శుష్కింపఁజేసి కోరికలు మొలకెత్తకుండఁజేసి పరమపదము నందెద. ఈ రెండు దారులేగాని మధ్యమార్గమునేనొల్ల. దాంపత్యమన నెట్టిదో యెఱుఁ

గుదువా? అదియు సుఖదుఃఖములయందద్వైతము. సర్వావస్థలలో ననంగతము. ఉదయమునకు విశ్రామము. ఆజన్మాంతము బరస్పరానంద సంధాయకము. అట్టిదికాని పెండ్లి పెండ్లిగాదు. తల్లీ! ఇన్నిమాటలెందుకు? విదర్భరాజపుత్రికయగు దమయంతి జగత్త్రియ నాయకులు వర ప్రదాతలు మహామహిమాఢ్యులునగు దేవతలువచ్చి తమ్ము వరింపుమని ప్రార్థించినను వారిం గ్రేగంటిచూపులనైనఁ దనుపక మానవుఁడు- తనవలపుకాఁడునైన నిషధరాజును వరించెను. మఱియొక విదర్భరాజపుత్రిక రుక్మిణి తలిదండ్రులు నన్నదమ్ములు, బంధుమిత్రులు తన్ను శిశుపాలునకిచ్చి పెండ్లిచేయ నిశ్చయించినను వారి కన్నుఁబ్రామి యతిరహస్యముగ శ్రీకృష్ణుని యొద్దకుఁ దనకునమ్మికగల యొక బ్రాహ్మణుని రాయబారమంపి తన మనోరథమాయనకెఱిగించి యాయనచేబలాత్కారముగాఁగొనిపోఁబడి రాక్షసవిధిచే నాయనను వివాహమాడెను. అదిగాక సాక్షాన్నారాయణావతారుఁడైన శ్రీకృష్ణుని యొక్కయు శేషావతారుఁడైన బలభద్రునియొక్కయుఁ జెల్లెలు, వసుదేవుని కూఁతురు, సుగుణభద్ర సుభద్ర తన్ను బలదేవుఁడు దుర్యోధనునకీయఁ దలఁచినను మేనత్తకొడుకగు నర్జునుని వలచి వలపించి పితృభ్రాతృవచన తిరస్కారముఁ గావించి యాతని వెంటఁ బోయెను. తల్లీ! వారి సాదృశ్యమేల తేఁగూడదు? నాచెప్పిన పలుకులన్నియుఁ జక్కఁగఁ బరిశీలించి తండ్రిగారి కోపమును శమింపఁ జేయుము. ఇంతకన్న నాచెప్పునదిలేదు." అని కర్పూరమంజరి బ్రతిమాలాడవచ్చిన తల్లి కుత్తరమిచ్చెను.

పుత్రిక గట్టిపట్టుపట్టియున్నదనియుఁ దనమాటలామె తలకెక్కవనియు గ్రహించి యిందుమణి మాఱుమాటాడక పడకగదికిఁబోయి తనయునునయంబులుగూడఁ దనయ యెడనిష్ప్రయోజనంబులైనవని యాగ్రహావిష్టుఁడైనభర్తకెఱింగించి యతని యాగ్రహము ద్విగుణముఁ జేసెను.

చిత్రభానుఁడా రేయి కన్నుమూయలేదు. చాలసేపు తోఁచక నటునిటుఁ బచారుచేసి తానుతలపెట్టిన కార్యము ఫలోన్ముఖమునకు వచ్చినప్పుడు తానెన్నఁడుఁ దలఁపని విధమునఁ గూఁతురు వలన భగ్నమైనదని చింతించి కార్యసాధనము జేయుట యెటులనా యని విచారింపఁదొడఁగెను. గాఢముగ నిద్రించుచున్న రుద్రభట్టును మేల్కొల్పి కార్యాలోచనము జేయవలయునని యొకటి రెండుసారులు వాని శయనించిన తావునకుఁ బోవ సమకట్టి యాతనికి నిద్రాభంగము సేయుట యనుచితమని మరలఁ దనలోఁదానే సమర్థించుకొని యూర కుండెను. అంత వేకువజాము య్యెను. తెల్లవాఱఁబోవుచున్నది. మేలుకొనుఁడో హో యని కాలపురుషుండు వైచిన కేకవోలెఁ గొక్కొరొకో యని కోడికూసెను. ఆకూఁత వినఁగానే రుద్రభట్టు మేల్కొని యఱచేతులు జాపాడఁజేసి కన్నులు నులుముకొని పుష్పదంత విరచితమైన మహిమ్నస్తవము పారాయణముఁ జేసికొనుచుండెను. అప్పుడు చిత్రభానుఁడు సమీపించి యాస్తవము ముగిసినపిదపఁ గడచిన రేయి దనకుం గూఁతునకు జరిగిన సంవాదప్రకారము సమగ్రముగా విన్నవించి యిట్లనియె.

"స్వామీ! మీయాశీర్వచన ప్రభావమునఁ గార్యము దాదాపుగఁ బంటకు సిద్ధమైనది. పరమమూర్ఖురాలైన నాకూఁతువలనఁ బోటుపాటెఱిఁగిన సముద్రముపాటువడినప్పుడు వెనుకకుఁ దగ్గినట్లు కార్యము యథాస్థానమునకుఁ బోవుచున్నది. ప్రధానముచేసినంగాని మనకు సేనాపతులు తోడుపడరు, వారితోడులేనియెడల మన మిచ్చటఁ జిల్లిగవ్వకైన మాఱము. బాలికమూఢయై నామాటలఁద్రోసిపుచ్చుచున్నది. వజ్రపాణి చక్కనివాఁడుగాఁడట. సవతియున్నదఁట. మాళవ రాజనందనుఁడగు మకరందుఁడు మహీతలమున వెలసిన మన్మథుఁడఁట! అతనినేగాని వివాహమాడదఁట. బుద్ధివిశేషమున శుక్రబృహ

స్వతులను జీరికింగొనని మీరే యుపాయాంతర మన్వేషించి తప్పు దారింబడిన యిక్కార్యమును సరియైన త్రోవకుఁ ద్రిప్పవలయును."

అనవుడు రుద్రభట్టు మెల్లగా "ఆలాగా! బాలికకడు మూర్ఖురాలుగానున్నదే. చదువుకొనిన యాఁడుది, చదువునేర్చిన మగవాఁడు పనికిరారని మొదటి నుండియు నేను వాదించుచుంటిని. నీకూఁతురు ముద్దుముద్దియగాక ముద్దులుమూటగట్టునట్టు విద్యయాలు నేర్చి పెద్ద పండితురాలయినదని తద్దయు సంతసించితిమిగాని తుదకు నీకెదురు త్రొమ్మమ్మీఁది కంపటివలెనుండి సంతాపకారిణియగునని యూహింపవైతివి. 'న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి' యని మనువు వెట్టివాఁడై చెప్పెనా! మనువుమాటలు మనముఁ పెడచెవిని బెట్టుటచే మన కూఁతులు మనము తెచ్చిన మనువుల నొల్లక మన మనువు లన్నరకు గొనక యిచ్చవచ్చిన తెఱంగున మెలఁగుచున్నారు. తేలుకకు నల్లు పామునకు విసపుతిత్తి, బెబ్బులికి వాఁడికోఱ యెట్టిదో పడఁతికి జదువట్టిది. స్త్రీని నేలఁబెట్టి అణచివేయవలెను గాని స్వాతంత్ర్య మీయఁగూడదు. వారియెడ జాలిపడఁగూడదు" అని చేతులతో నభినయించుచు మొగముఁ ద్రిప్పుచు వెండియు నిట్లనియె "వివాహమునకు నాఁడుదానికి స్వతంత్రభావమా? తావలచినవానిని పెండ్లి చేసికొనుటా? రుక్మిణితోను సుభద్రతోను తనకు సామ్యమా? నక్క యెక్కడ, దేవలోక మెక్కడ? తల్లిదండ్రులు తెచ్చిన సంబంధ మంగీకరించి చచ్చినట్లు పడియుండవలసినదే గాని యాఁడుబిడ్డవలపులు గిలపులు నిలిపి మనసు వచ్చిన వానిని పెండ్లియాడుటా? పూర్వకాలపుమాట నేను చెప్పను గాని యీ కాలమున స్వయంవరమనఁగా నాఁడుపిల్ల తన చూపులకు నచ్చినవానిని దగుల్కొని పోవుటయే. ఈ వెఱ్ఱి యాగడములు సాగనీయఁ గూడదు. రాజా! నేనింత కఠినముగాఁ బల్కితినని మనసులో వేఱువిధముగాఁ దలఁపకుము నాబిడ్డయొకటి నీబిడ్డయొకటిగాదు

అదియే నాబిడ్డయగునేని, నీ తెఱంగున నాతో వితండ వాదము సేయు నేని దాని శరీరము ఖండఖండములుచేయనా? ఇట్లనుట చేత నీబిడ్డం జంపుమనుటగాదు సుమీ! నామనస్సు మండిపోవుటచేత నిట్లంటిని. ఇందు కొక్కటే యుపాయమున్నది. కాలహరణమైనఁ గార్యము చెడును. దండపాణిని వజ్రపాణినిబిలిచి ప్రధానముచేయుదము. కర్పూరమంజరివివాహమున కంగీకరించినదని మనమువారితోఁ జెప్పుదము. అబద్ధమెట్లుచెప్పుదునాయని నీమనస్సుశంకింపవచ్చును ఇట్టివిషయమున శంకలుపనికి రావు. మనము తెల్లవాఱలేచి యెన్నియబద్ధములునుడువుట లేదు? రాజనీతికసత్యము కన్నతల్లి. సత్యముసవతితల్లి. రాజనీతి యసత్యమునఁబుట్టి యసత్యమునఁ బెరుగుచున్నది. అది యసత్యాత్మకము రాజయినవాఁడు రాజనీతి నవలంబింపకతప్పదు. ప్రాణవిత్త మానభంగములందు సూనృతంబువిడిచి యనృతంబు నాశ్రయింపవచ్చునని భగవానుండైన శుక్రుఁ డుపదేశింపలేదా? అందుచేత నిశ్శంకముగా మన మసత్యమును సత్యముగా మార్చి మాటాడవచ్చును. ప్రధానముచేయుదుమని వారికిఁ జెప్పిపంపుము. ఎల్లుండి మిక్కిలి మంచిది. తిథివారనక్షత్రములుసరిగాఁ గుదిరినవి. తారాబలచంద్రబలములు సమకూడినవి. ఆదినమునఁ దప్పక ప్రధానముజరుగునని వారికిం దెలుపుము. అతిరహస్యముగా జరుగవలెనని మాత్రము చెప్పుము. వానిసన్నిధిని నీవూరకుండుము. కర్పూరమంజరి సమ్మతించినదని నేనే చెప్పెద. వానితో నిన్నేవలచినదని చెప్పెద. నీదర్శనమునకై నిరీక్షించుచున్నదనియెద. నీచేయిబట్టెడుభాగ్య మెప్పుడు లభించునాయని యువ్విళ్ళూరుచున్నదనియెద. నీపేరే యామెకు హరినామస్మరణమనియెద. నీవిజయములే పాడుచున్నదనియెద. అదియిదియననేల! ఏమనవలెనో యన్నియు ననియెద. భగవంతుఁడు కపటోపాయములకు గట్టితలయిచ్చినాఁడు. వాటిని వాగ్రూపమున వెల్లడించుటకు నాలుకనిచ్చినాఁ

డు. ఆశక్తి నీకింక వినియోగించెద." అని నిశ్శంకముగఁ బలుకుచున్న రుద్రభట్టును జూచి చిత్రభానుఁడు "స్వామీ! ఎటువంటి క్లిష్టమార్గములనైన మీబుద్ధిరథము నిరాఘాటసంచారముఁ గలిగియుండును. చికిలిచేసిన కత్తివంటి మీబుద్ధి యెట్టిసంకటకార్యములనైన ఛేదించును. మీమాటలు విషాదముచే జడములైన నామనస్సునకు నవయువములకు నెంతో చైతన్యముగలిగించినవి. మీరుచెప్పినట్లు జేసెదఁగాని కొట్టుకొనకు మనము వివాహముచేయఁబోవుదుమేని దండపాణియు వజ్రపాణియు మనము వంచించితిమని యాగ్రహించి యెదురుతిరిగి యపకారము సేయరా?, ఈలోపున బాలికయభిమతముఁ దెలిసి కోపించి కార్యభంగము సేయరా? బాలిక యీవార్త విని యాత్మహత్య చేసికొనదుగదా? ఈమూఁడుశంకలు నామనంబును బీడించుచున్నవి. దీనికేమియుపాయము?" అనిపలికెను.

నిశ్శంకహృదయుఁడైన రుద్రభట్టు ప్రత్యుత్తరమునకై వెదకుకొనక తక్షణమే యిట్లనియెను. "కర్పూరమంజరికి వానిపై వలపు లేదనుమాట లోకమునఁ బొక్కకుండ మనము గోప్యముగ నుంచవలెను. ఈవార్త మనలో జీర్ణముకావలెను. ఎవ్వరియొద్ద నిది యెత్తవద్దని నీభార్యతో నొక్కి వక్కాణింపుము. చెలికత్తెలీమాట జారి విడిచిరేని బ్రతికియుండఁగానే నేలం బాతిపెట్టింతుమని చెప్పుము. సలసలకాఁగుచున్న నూనెలోఁ బాఱవేయించి వడియములట్లు వేయింతుమని చెప్పుము. ఇట్లు చేసితిమేని యీమాట పైకిఁ బొక్కదు. మన కార్యమయినతరువాత వివాహము మనము సేయలేకపోయినను మనను వాఁడేమి సేయఁగలఁడు? బాలిక మొదట పెండ్లి కంగీకరించి పిదప దుర్బోధలవలన మానుకొన్నదని చెప్పవచ్చును. అదివినక వాఁడు తెగసీల్గి పెంకితనముచేసెనా వానిజుట్టు మనచేతిలో నుండును గనుక నోరు మూయించి శిరచ్ఛేదము జేయించెదము. బాలికయాత్మహత్య

చేసికొనునేమో యని నీకు శంకగదా! చేసికొన్నపక్షమున నీపీడయే పోయినదని నమ్ముము. ఏదోరోగమువచ్చి చచ్చినదని మనము చెప్పవచ్చును. దైవికమున కేమిచేయఁగలమని వాఁడు తన యదృష్టమును నిందించుకొనుచు నూరకుండి యెప్పటియట్ల మనకు సాయము జేయును. ఆమె బలవన్మరణమునొందిన నవ్వార్త లోకమునకుఁ దెలియకుండఁ జేసి నీబిడ్డ చెలికత్తెయైన మల్లికనో చంద్రికనో దెచ్చి యదే కర్పూరమంజరియని వానికి వివాహము చేయుదము. వీఁడు చిన్నప్పుడెప్పుడో బాలికం జూచియుండును గాని యౌవనమున నెప్పుడుఁ జూడలేదు గదా! "శతకోటి దరిద్రాణా మనంత కోట్యుపాయాః" అని ప్రాచీనులు చెప్పియేయున్నారు. 'నందో రాజా భవిష్యతి' యని వినలేదే! నాఁటికొక్క దైవముండదా! భక్తవత్సలుఁడైన మహేశ్వరుఁడు నాశిష్యుని కార్యము భంగము సేయునా? వెనుకటియట్లు నేనెప్పుడో యొకనాఁటిరాత్రి రెండుజాములవేళ మహేశ్వరసాక్షాత్కారము జేసికొని నాకభీష్టసిద్ధిచేయుమని కోరెదను. భయపడకు."

చిత్రభానున కతఁడు చేసినయుపదేశము సమంజసముగా నుండెను. మూఁడవనాఁడు ప్రధానమునకు సుముహూర్తము నిశ్చయింపఁబడినదని యతఁడు వారి కెఱిఁగించెను. వారాదినమున రాత్రి జాముప్రొద్దుపోయినతరువాతఁ దమకాప్తులైన యిరువురు బ్రాహ్మణులం దోడ్కొని పసపు, కుంకుమ, పండ్లు, యగరు, చందనము, సుగంధపుష్పములు, వెలలేని యాభరణములు, మేలైన పట్టుచీరెలుఁ దెచ్చి తమతోడవచ్చిన సేవకులను వీధిలో నిలిపి వారైన నెఱుఁగకుండ నింటిలోని వారెఱుఁగకుండ రుద్రభట్టు నెదుటఁబెట్టిరి. యథాక్రమముగాఁ బ్రధానముజరిగెను. ఆకార్య మతిరహస్యముగా నుంచవలసినదని వచ్చినబ్రాహ్మణులతో రుద్రభట్టు చిత్రభానుఁడుఁ జెప్పిరి. రుద్రభట్టు కర్పూరమంజరి వానిసమాగమమున కెంతహాం

బడుచున్నదని మిక్కిలి దృఢముగాఁ జెప్పెను. వజ్రపాణి మేరమీఱిన యానందమునొంది కర్పూరమంజరీ పాణిగ్రహణమహోత్సవమునకై యూటలూరఁ దొడఁగెను. భవిష్యత్కాలమునఁ దనకూఁతురు కాశ్మీరదేశపు రాణియగునని దండపాణి పరమానందమునొందెను. ప్రధానము ముగిసినపిదప వారు నిజనివాసముల కరిగిరి. చిత్రభానుఁడు రుద్రభట్టు తాము త్రవ్విన మహాకూపమున నాపదడఁగెనని చెప్పుకొని నవ్వుకొని పిమ్మట నిద్రపోయిరి.

పదునాలుగవ ప్రకరణము.

తెల్లవాఱఁజొచ్చెను. "కాశ్మీరరాజ్యలక్ష్మిని దుష్టవశము జేసికొనుటకై గొప్పకుట్ర జరుగుచున్నది. రాజభక్తులందఱు వెంటనే మేలుకొనుఁడోహో" యని కాలపురుషుఁడు పెట్టుబొబ్బవలె జాము కోడికూసెను. విషాదమాలిన్యముపోవఁ జిత్రభానుని మొగము తెలివొందినట్లు తూర్పుదెస తెల్లవాఱెను. విక్రమసేనుని పక్షముననున్న మిత్రులు క్రమక్రమముగా సిక్కె యంతరించుచున్న వారని తెలియఁజేయుటకో యన చుక్కలదృశ్యములు కాఁజొచ్చెను. రాజ్యలక్ష్మి పరహస్తగతమగుచున్నది. పరమేశ్వరా! కావుకావుమని పక్షులుసైత మఱచుచున్నవో యన్నట్లు కాకులు కావుకావుమని కూయఁజొచ్చెను. అరవిందాదేవి మనంబున నెలకొన్న కొంచెపుటాసలుగూడ నడఁగుచుండినట్లు తెల్లవారుజామున నున్న చిలుపవెన్నెలలు క్రమక్రమముగా క్షీణించెను. దినమనియెడు కాంత నల్లచీర విడిచి తెల్లచీర కట్టినట్లు చీఁకటిపోయి వెలుఁగు పొడమెను. క్రొత్తవేసముతో శ్రీనగ

రంబునఁ జిత్రభానుఁడు పొడసూపినట్లు పొడుపు గొండమీఁదఁ జిత్ర వర్ణములతో భానుఁ డుదయించెను. ఎవ్వరికిం గానఁబడకుండఁ బై పైనిజరుగు చిత్రభానుని ప్రయత్నంబులట్ల యుదయకాల ప్రభాకరుని లేయెండలు మునుముందు నేలపైఁ బ్రసరింపక యిండ్లమీఁదను జెట్ల మీఁదను వ్యాపింపఁజొచ్చెను. ఆతనిజతనంబులు క్రమక్రమంబుగ నిట్టి పురంబున వ్యాపించునని తెలుపుటకో యన లేయెండ లించుకించుక తీవ్రములై నేలం బఱువఁజొచ్చెను.

వైదికకర్మనిరతులగు బ్రాహ్మణోత్తములు స్నానముచేసి ప్రాతస్సంధ్యావిధులఁ దీర్చి భగవానుఁడగు భాస్కరున కర్ఘ్యప్రదానమొసఁగి నిత్యనైమిత్తికములకుం జొచ్చిరి. మూర్ఛనుండి లేచిన జంతువువోలెఁ బ్రపంచమంతయు వెండియుఁ జైతన్యముగలిగి వికాసవంతమయ్యెను. మానవులు తమతమవ్యాపారములయందుఁ బ్రవేశించిరి. రుద్రభట్టు తనమొగ మప్పటికిఁ బ్రజలకుఁ జూపఁదలఁచుకొనలేదుగావున దొడ్డిలోనున్న బావికడనే స్నానముచేసి ప్రాతరనుష్ఠానములఁ దీర్చికొని, వ్యాఘ్రసనమునఁ గూర్చుండియుండఁ జిత్రభానుఁ డాయనకడకుఁ బోయి నమస్కరించి యెట్టయెదుట నాసీనుఁడయ్యెను. "రాజా! సుఖమున నిద్రపట్టినదా?" యని రుద్రభట్టడిగెను. "దేవా! మీయనుగ్రహమున మనోవిచారములెల్ల దూరములగుటచే నిద్రపట్టినది. కాని, "రాజా!" యని పిలుచుచున్నారేమి? అది లభింపలేదే?" యని చిత్రభానుఁడు బదులుచెప్పెను. అప్పుడు రుద్రభట్టు చిఱునవ్వు మొగమున నంకురింప నిట్లనియె— "లభింపలేదా! నీమట్టుకు లభింపలేదని తోఁచుచున్నదిగాని, నాబుద్ధికి లభించినట్లు తోఁచుచున్నది. నీవు కాశ్మీరసింహాసన మెక్కినట్లు, నీశిరంబున నానారత్నవిరాజితమగు కనకకిరీటము భాసిల్లుచున్నట్లు బహుపుణ్యనదీజలంబులం దెచ్చి భూసురులు వేదోక్తముగ నీ కభిషేకము చేయుచున్నట్లు,

న ౖముంటి మహీపాలురు తమ మకుటకాంతుల నీపాదములకు నీరాం జనంబిచ్చునట్లు వంగి నీకు నమస్కరించినట్లు,హస్తకంకణంబులు ఘలు ఘల్లుమని మొఱయ రాజులు కానుకలుగాఁబంపినయంగనలు నీకు వింజామరలు విసరుచున్నట్లు, హెగ్గడలు కైవారము సేయుచున్నట్లు ప్రెగ్గడలు రాజకార్యముల నివేదించుచున్నట్లు, రాయబారులు విన యంబునఁ దమతమ రాజుల సందేశంబున నెఱిఁగించుచున్నట్లు నీవు వా రిమనవిసనవులవిని మెచ్చి తలయూఁచి కృపారసపూరితములగు క్రీగం టిచూపులఁ జూచుచున్నట్లు నామనోనేత్రమున కిప్పుడే పొడగట్టుచు న్నది. సర్వాలంకార శోభితమగు మదపుటేనుఁగు నెక్కి నీవు శ్రీనగ రంబున నూరేగుచున్నట్లు నేలవేల్పులు గంభీరస్వరమున నిన్నా సీర్వదించుచున్నట్లు పౌరాంగనలు నీపై నక్షతలు లాజలు పూవులు జల్లి మందహాస విలసితములగు సుందరవదనారవిందములతో నిన్నుంజూచి యానందించి పసిఁడిపళ్లెరంబులఁ గప్పురంపుటారతులిచ్చి నట్లు నామనోలోచనమునకుఁ గానవచ్చుచున్నది. కాకపోయెడు కా ర్యంబు నామనంబున నింతదృఢముగా ముద్రితుడినట్లు నిలువదు. పర మేశ్వరానుగ్రహము నీపై సంపూర్ణముగాఁగలదు. తెల్లవాఱుజాము న భగవంతుండగు చంద్రశేఖరుఁడు నాకు స్వప్నమున సాక్షాత్క రించి మీఁదఁ జేయివైచి తట్టి "వత్సా! నీ సంకల్పమీడేఱును. నీ వింకఁ విచారంబుదక్కియుండుము. చాణక్యుఁడు చంద్రగుప్తునిమగ ధ రాజ్యంబునఁబ్రతిష్ఠించిన చందంబుననీవు చిత్రభానునిఁగాశ్మీరసింహాస నంబున నిలుపఁగలవుసుమీ" యని యానతిచ్చెను.అంతలోనాకు మెల కువవచ్చెను. శాంతరసమొలుకు నామూర్తిని, సువర్ణములవంటి సువ ర్ణములతోఁగూడిన యా చల్లనిమాటలను మఱియొకసారి కని వినవలె నని కుతూహలము పొడముచున్నది. మరలనెప్పుడోగాని లభింపదు. ఇఁక మనకార్యసిద్ధియైనట్లే. మనదే యాలస్యము. రాజ్యలక్ష్మి రాక్షసి

వంటిది. అది కామరూపిణి. చిఱునవ్వునవ్వి యొకనితో మేలమాడు ను. భయంకరాకారిణియై యొకనిని బెదరించును. ఎండమావులవలె దన చుట్టునికి నిజముని భ్రమింపఁజేసి వేఱొకనిబేలుపుచ్చును. ఒకని నిజముగా ననుగ్రహించి బాగుచేయును. దానినెప్పుడు నమ్మరాదు మాంత్రికుఁడు పిశాచము దొరకినప్పుడు మంత్రప్రభావమునఁ బట్టు కొని దిగ్బంధనముజేసి కదలనీక మెదలనీక దనవశము జేసికొనినట్లు రాజనీతికోవిదు లదను జిక్కినప్పుడు రాజ్యలక్ష్మింబట్టుకొని బంధింప వలయు. ఇప్పు డయ్యదను వచ్చినది. మనదే యాలస్యము. కార్య మునకు దిగవలయు."

అనవుడు చిత్రభానుఁ డుత్సాహపూరితుఁడై "ఏమిచేయవల యునో యిప్పుడె యానతిండు. చేసెద." నని బదులుచెప్ప రుద్రభట్టు వాని కిట్లనియె. "నీమనారిమంత్రియగు జయంతుని, మున్నునీతో వచ్చిన విదర్భరాజసేనాపతి సుగ్రసేనుని విదర్భకుఁబంపి యిచ్చటిపరి స్థితులు విదర్భరాజునకువిన్నవించి గొప్పసేనందిసికొని సాధ్యమైనంత వేగముగా రమ్మనుము. ఇక్కడ దండపాణియు వజ్రపాణియు దోడ్డా నివచ్చు సేనలకుఁదోడుగ విదర్భసేనయుండవలయు. అదియే మనకు ముఖ్యాధారము. అది ప్రథమకర్తవ్యము. తరువాత మనకరటకుని వాక్యవాయువులు ప్రశాంతమైన సేనాసముద్రమున సంక్షోభతరంగ ములను సృజియించినవి. పింగళుఁడు రాజకుటుంబము మనస్సునఁ బెట్టి నచిచ్చు నేఁటికినిమండుచునేయుండి మంత్రులయెడ విశ్వాసమును ద గ్ధముచేసియుంచును. రాజ్యలక్ష్మిని సమీపించుటకు మార్గమేర్పడినది' అనవుడు చిత్రభానుఁడు "ప్రథమమున నేమి సేయవలయునో యది యానతిండు. అట్టిపనికిఁగూడ మీరుసుముహూర్తము నిర్ణయింపుఁడు. అమరేంద్రునకుఁ బృహస్పతియట్లు, దానవేశ్వరునకుఁ శుక్రుఁడట్లు మీరు మాకుధర్మోపదేష్టలు విజయము మీమాటననుసరించి పోవు

ను.* అనివినయమున మనవిచేయ రుద్రభట్టు వెండియునిట్లనియె. "రాజా! సేనానివేశమునకుఁబోయి పాములవాఁడు నాగస్వరముతో వల్మీకములలో నిద్రించుపాములను లేవఁగొట్టి యాడించునట్లు చిత్రవిచిత్రములు మహోత్సాహభరితములునగు నీవచోగుంఫనలచేత సైనికులంబ్రబోధించి పురికొల్పుము. సింధుగాంధరనాయకులుఖండయాత్రలు నీ వానునాటకమున కితివృత్తములగుఁగాక! నీ యున్నగారి మరణము నాందియగుఁగాక! మణివర్మప్రముఖులు ప్రతినాయకులగుదురుగాక! నీవు కథానాయకుఁడవు. రాజ్యలక్ష్మి కథానాయిక. ఈనాటకమునకు నేనే సూత్రధారుఁడను. నీవువినిపించుకలాప మెంతరసవంతముగా నుండిన నంతత్వరలో నీకు జయముచేకూఱును. నీమాటలకుంజొక్కి సైనికులు తియ్యనీటికిఁ జేప లెక్కినట్లు నిన్ననుసరింపఁగలెను. ప్రస్తుతము నేనువచ్చుటకు వీలులేదు. అయినను నాయాశీర్వచనమె నిన్ననుసరించి నీకు జయమునాపాదించును. రేపురేయి మంచిముహూర్తమున్నది. మనశిష్యులు సైనికులమనస్సులు కలఁచెదరుగాక!

అనవుడు జిత్రభానుఁడు "మహాప్రసాదము స్వామీ! యట్లచేసెద" నని వానికడ సెలవుపుచ్చుకొని యానలకుంబోయి తద్విషయప్రయత్నములనుండెను.

మఱునాఁడు తెల్లవాఱుజామున సేనానివేశమున నొక కలకలముగలిగెను. తలపై నాకుపచ్చని పద్దపాగ నమర్చి మోఁకాళ్ళంటుచున్న పాతనిలువుటంగి దొడిగి, మెడలోనొకగవ్వలదండవైచుకొని జనులు ధర్మార్థమిచ్చిన పాతగుడ్డలు రెండుభుజములపై వైచుకొని మెడలోఁగట్టుకొన్న కంచుగంట మాటిమాటికి కంగుకంగుమని మోఱయ నెడమభుజమునుండి వీఁపుమీఁది కొక కట్టుకుఁ దగిలించిన సంచి వ్రేలుచుండఁ గుడిచేతిలోనున్న ఢక్కఢుణఢుణమువాయించుచు భయంకరముగా క్షుద్రదేవతల నాహ్వానించుచు నొకసాయిలఁవాడు

సైన్యనివేశమందలి వీథులలోఁ దిరుగఁజొచ్చెను. గంట మ్రోఁతయు డక్కచప్పుడును వానిపద్ద కేకలును నిద్రించుచున్న సైనికులకు వారి యాఁడువాండ్రకు మేలుకొలుపులయ్యెను. అందఱు లేచి వానిం జూచుటకు గుమ్మములలో నిలిచిరి. సాయిలవాఁ డిట్లు సంభాషించెను.

"ఆ! కాళీ! పల్కవే, భద్రకాళీ! పల్కవే, జగజ్జనీ! పల్కవే, భైరవీ పల్కవే, శాంకరీ, పల్కవే, తల్లీ నిజముపల్కవే, యక్షిణీ! పల్కవే, దుర్గా! పల్కవే, చెప్పవే నిజముచెప్పవే, సాయిలరామ జోగినోట పల్కవే, సత్యముచెప్పవే, ఈదేశమునకు గొప్పకీడు రాఁ దలఁచియున్నది. పడమటినుండి పగ రాఁదలఁచియున్నది. దక్షిణము నుండి దండు రాఁదలఁచి యున్నది. రాత్రి రెండుజాములప్పుడు నల్ల చీరకట్టుకొన్న యాఁడది మొగమున పెద్దకుంకుమబొట్టు పెట్టుకొన్న యాఁడది, కాళ్లకు గజ్జలుకట్టుకొన్న యాఁడది, చీపురుపట్టుకొని యూడ్చుచున్నది. ఈరాజ్యములో సిరులన్నిఁటిని తానాలాగే యూడ్చెదనన్నమాట. మనుష్యుల జీవాలన్నియు నూడ్చెదనన్నమాట. తనువులుదక్కవన్నమాట, ఆతల్లి దుర్గకు నీదేశముమీఁద దయదప్పినది. ఇది పరరాజులపాలై పోనున్నది. గట్టివానిని బట్టుకొన్న పక్షమున రానున్న యాపద తప్పిపోవును. చిన్నవారివల్లఁగాదు. చిఱుతవారివల్లఁ గాదు. ఆఁడవాళ్ళవల్లఁగాదు. జాగ్రత్త జాగర్త! భద్రము! భద్రము! మేలుకొనుఁడు! మేలుకొనుఁడు! మూసినకన్నులు తెఱువుఁడీ, మోస పోకుఁడీ. ప్రాణాలు దక్కించుకొనండి! బాగుపడుండి."

ఆమాటలువిని మనస్సులలో భయము శంకయు చెలగొన వానింబిలిచి కొందఱు "ఏమియాపదవచ్చు! నీకెట్లు తెలిసినది?" యని ప్రశ్నించిరి. ఆప్రశ్నలకు వాఁడిట్లనియె. "ఏమియాపదని చెప్పుదును! మానములు దక్కవు. మాటలుదక్కవు. తనువులుదక్కవు ధనములు దక్కవు. నీకెట్లు తెలిసినదని మీరడుగవద్దు. మేము భద్రకాళికి పెం

ప్రుడు కొడుకులము. ఎల్లమూరికన్నా మాయిలు వేల్పు. శంకరుండా రాణి సాయిలరామజోగిని నేను. అతఁడు రమ్మంటే యాత్రకు వచ్చేను. పొమ్మంటే యాత్రకు పోవుదు. పలుకుమన్న పలుకుదు. నిలువుమన్న నిలుచుదు. అయ్యో! ఆకలి. నానోట పలికించుచున్నది. ఇట్టిప్రశ్నల మీరు వేసితిరా తల్లికోపించి యిప్పుడే నిప్పులవాన గురిపించును. అట్టిప్రశ్నలడుగఁబోకుఁడు. అది మీకు మేలుగాదు. అదిమీకు మంచి గాదు. కొఱవిబెట్టి తలగోఁకికొనవద్దు."

అతనిమాటలు విన్నతోడనే యెల్లవారును భయమున గడ గడ వడఁకిరి. బుద్ధిమంతులగు పెద్దవాండ్రు ప్రశ్న లడుగువారిని జీవాట్లుపెట్టి యాయువ్యమును నూన్పిరి. కొందఱు "స్వామీ! సాయిలరామజోగీ! మాతప్పు మన్నింపు" మని దండములుపెట్టిరి. కొందఱు నూకలు బియ్యము వస్త్రములు మొదలగు కానుకలు భక్తి యుక్తులై యాతనికి సమర్పించిరి. కాని, యాతఁడు నానిం గైకొనక యిట్లులనియె. "నాకు బట్టలువద్దు పాఁతలువద్దు. బియ్యమునకు రాలేదు. బిచ్చమునకు రాలేదు. నూకలువద్దు. కోఁకలువద్దు. మీ మీఁద దయచేత జగజ్జనని దుర్గ పంపఁగా వచ్చితిని. హెచ్చరించితిని. మేలుదారి తెల్పితిని. పోవుచున్నాను. పోవుచున్నాను. జాగ్రత్త! జాగ్రత్త!" అని పలుకవలసిన పలుకులు పలికి కలిగింపఁదలఁచిన యుల జడి గలిగించి వెలుఁగు రాకముందె తనదారింబోయెను.

అంతట సైనికులు పరిపరివిధములు నవ్విషయమై చర్చింపఁ దొడఁగిరి. "ఎవఁడో బిచ్చగాఁడు పిలువనిపేరంటముగవచ్చి వానికిఁ దోఁచిన కూఁతలుగూసి పోయినాఁడ"ని కొందఱనిరి. "బిచ్చగాఁడైన పక్షమున మనముసమర్పించిన తండులములు వస్త్రములు ధనము నేల గ్రహింపకపోవు నందుచేత నతఁడు తక్కిన సాయిలవాండ్రవలె జను లనుబీడించి తిరిపమెత్తువాఁడుగాఁడు. [illegible]తిప్రభావమున క్షుద్రదేవ

తల వశపఱచుకొన్నవాఁడుగాని సామాన్యుఁడు గాఁ"డని కొందఱు పలికిరి. నట్టికూఁతలుగా వానిమాటలు త్రోసిపుచ్చరా'దని కొందఱు వచించిరి. "నల్లచీరగట్టుకొన్న యాఁడుది చీపురుపుచ్చుకొని యూడ్చుట శ్రేయస్కరముగా"దని కొందఱు వక్కాణించిరి.

అట్లు వారు గుంపులుగుంపులుగఁ జేరి ప్రాతఃకాలమునఁ బలు తెఱంగులఁ బ్రసంగించుచుండ నంతలో దండపాణి యశ్వారూఢుఁడై యచ్చోటికిఁ బోయెను. సైనికులు లేచి జోహారులుచేసిరి. "అట్లు గుంపులు గుంపులుగా జేరుటకు హేతువే"మని యాసేనాపతియడుగ వారు వేకువను జరిగిన వృత్తాంతమంతయుఁ బూసగ్రుచ్చినట్లు జెప్పిరి. అదివిని దండపాణి యచ్చెరువుపడి "ఏమీ! నల్లచీరగట్టుకొన్న యాఁడుదియా? చీపురుపుచ్చుకొని యూడ్చుచున్నదా? చిన్నవాండ్రవల్లగాదు. చిఱుత వాండ్రవల్ల కాదని చెప్పినాఁడా? గొప్పవారియండఁ జేరుమన్నాఁడా? జగజ్జననియైన మహాకాళి తనకీదేవరహస్యములు చెప్పినదన్నాఁడా! సరే! మనకేదో మూడఁదలఁచుకొన్నది. సోయిలవాండ్రమాటలు కల్లలని మనము త్రోసివేయరాదు. వారికి క్షుద్రదేవతలు ప్రత్యక్షమగుచుందురు. కల్లు మాంసము మొదలగు పదార్థములు నివేదించి వారా దేవతలను వశముజేసికొందురు. అందుచే నాగతానాగతములు వారికిఁ దెలియుచుండును. నల్లచీరగట్టుకొన్న యాఁడుది మనపాలిఁటి నాశనదేవత. ఇదిచాల దుశ్శకునము. దీనికిం దగినప్రతిక్రియ మనము చేసికొనవలెను. పడమటనుండి పగవచ్చునని వాఁడు చెప్పెనుగదా! పడమటిపగ యనఁగా గాంధారదేశపు దండయాత్ర. దక్షిణమునుండి దండువచ్చుననఁగా సింధురాజు దండెత్తుట. ఇది మీరెఱుఁగుగా బోలు! సస్యచ్ఛన్నమై ఱాళ్ళు విసరినట్లు ఫలవంతమగు దేశమును గొట్టి యాక్రమించుట కనేకులు సిద్ధమగుదురు. మనోజ్ఞవస్తు వెల్లవారి కాసగొల్పును. అట్లే కాశ్మీరరాజ్యము రాజసింహముల కామిషము

గానున్నది. ఆరాజులిద్దఱు వచ్చి చెఱియొకప్రక్కముట్టడించిరా తలు
పుసందునఁబడిన వెలగకాయవలె మనము నలిగిపోదుము. కావున
మనము దీనికిఁ దగినప్రతీకారము సేయవలయు" నని వారి కుపదే
శించెను. ఎట్టిప్రతిక్రియ! ఏమిప్రతిక్రియ ? యని వారు తొందరతో
నడిగిరి.

అడుగుటయు నతఁడు స్వరము కొంచెము తగ్గించి "యెట్టిప్రతి
క్రియ యని చెప్పుదును? దానికొక్కటే మందున్నది" అని స్వరము
హెచ్చించి "మనరాజు బాలుఁడు. ఆలముల ముక్కాకలు దేఱిన మీ
వంటి పోటుబంట్లను మొనగాఁడై నిలిచి మిమ్ము రణరంగములకుఁ
దోడుకొనిపోయి మీమనస్సులు, నుత్సాహరసముతో నిండించి పురి
కొల్పి మీచేత సాహసక్రియలు చేయించి మనదేశమును రక్షింపఁ
గల మేటిశూరుఁ డొక్కఁడున్నాఁ"డని యూరకుండెను. అతఁ
డెవ్వఁడెవ్వఁడని యందఱడిగిరి. "అతఁడా—అతఁడా—చెప్పనా?
మీరు నాచెప్పినచొప్పున చేయుదురా!" యని యతఁడు సందిగ్ధమన
స్కుఁడై పల్కెను. "మీరుచెప్పినచొప్పునఁ దప్పక చేయుదుము.
తప్పక చేయుదుము" అని వారైకకంఠ్యముగఁ బల్కిరి. "అతఁ
డీరాత్రివచ్చి స్వయముగానే మీతో మాటాడునులెండి. నేనిప్పు
డాయనపేరు మీతోఁజెప్పను. భానుదర్శనమునఁ దామరలువిచ్చినట్లు
వానింజూచి మీమొగములు వికసింపఁగలవు. చంద్రదర్శనమున
స్రవించు చంద్రకాంతశిలలవలె మీమనస్సులు వానిఁజూచినంతనె యు
త్సాహరసపూరితములై యుండగలవు. పేరుచెప్పువాని నన్నడుగవద్దు.
నేఁటిరాత్రి జామయినతరువాత మీకడకాయనవచ్చును. మీరు భో
జనములుచేసి సిద్ధముగనుండుఁడు" అని దండపాణి వారికినచ్చఁజెప్పి
యథేచ్ఛంబోయెను. ఆవచ్చునట్టి మహావీరుఁ డెవఁడై యుండునో
యని సైనికు లూహించుచు వారిరాక నిరీక్షించుచుండిరి.

పదియైదవ ప్రకరణము.

క్రమక్రమముగ సాయంకాలమయ్యెను. దీర్ఘప్రయాణముచేసి న తెలువరి గమ్యస్థానముఁజేరి విశ్రమించుతెఱఁగున భానుఁడు పశ్చిమాచలశృంగము నలంకరించెను. చరమగిరిమీఁద వ్రేలాడు జపాకుసుమగుచ్ఛమునలె నావృద్ధభానుని బింబము కట్టెఱ్ఱనై చూపఱకనులకు విందుసేయుచుండెను. చిన్నానాఁటిగుణములు చరమకాలమున నయిన విడువ వనుటకు దృష్టాంతరముగ నుదయవేళనున్న యారుణ్యమే ప్రభాకరునియందు సాయంకాలమునఁగూడ గనఁబడెను. ఆశ్రమచతుష్టయములలోఁ గట్టకడపటిదగు సన్న్యాసమును గర్మసాక్షియయిన ప్రభాకరుఁడు స్వీకరించి ధరియించిన కాషాయాంబరమో యనునట్లుసంధ్యారాగము నభోమండలమున వ్యాపించి దర్శనీయమయ్యెను. మహాసౌధముమీఁదనుండి క్రమక్రమముగాఁ గ్రిందికిదిగుసట్టిపురుషునట్లు క్రమక్రమంబుగా దివాకరుఁడు క్రిందికిదిగిదిగి యస్తమించి యగోచరుఁడయ్యెను. చండశాసనుఁడగు పరమేశ్వరుని నియమప్రకార మెవ్వరి ధర్మము వారు నిర్వర్తింతురని తెలియఁజేయుటకో యన సూర్యాస్తమయానంతరము వకలవరమునఁ జంద్రోదయమయ్యెను. జనులకానందోదయమయ్యెను. కాలపురుషుండు గప్పుకొన్న తెల్లపట్టుపుట్టంబువలె విశ్వమంతట వెన్నెల వ్యాపించెను. మహాపురుషుని తేజము ముందఱ నెందుకుం బనికిరాని యల్పపురుషుల పరిభావముంబలె లెక్కకుమిక్కిలి యగుచుక్కల వెలుంగు శీతమయూఖుని తేటవెన్నెలలముందఱ వెలవెల బోయెను. చల్లదనముల సీమయైన చందమామను జూచినతోడనే యెల్లజీవుల కనులు చల్లఁబడెను. ఉల్లములు చల్లఁబడెను. సేనానివేశములో సైనికులందఱుఁ దమకొఱకై రాదలఁచిన యాపద్బాంధవునిఁజూడ నబలాటపడుచుఁ బెందలకడభోజనములుచేసి తెల్లబట్టపర

చినట్లు చంద్రికాపసరణముచేత వెలయుచున్న బయలునేల కరిగి గుంపులుగూడి తద్విషయికములైన ప్రసంగములు జేయుచుండిరి. ఎవరువచ్చినను నాతఁడేమోయని యెత్తులెత్తి చూచుచుండిరి.

అంతలో దండపాణి యొకపురుషుని వెంటఁబెట్టుకొని యచ్చోటికివచ్చెను. అప్పురుషుఁడు కనఁబడినతోడనే "చిత్రభానుఁడు చిత్రభానుఁ" డని సైనికులు మెల్లమెల్లఁగా ననఁజొచ్చిరి. అందఱినోటఁ జిత్రభానుని పేరేయుండెను. అందఱికన్నులకు జిత్రభానుఁడే కనఁబడెను. చంద్రప్రభయు భానుప్రభయునేక కాలమున సంభవించినపక్షమున నెట్టియాశ్చర్యముజనించునో నాఁటిరేయి జనులఁకట్టి యాశ్చర్యము జనించెను. ఇతఁడు హరిద్వారమునఁ జచ్చినాఁడని వింటిమిగాదా యని యొకరు "కాదుకా దీనడును నిక్కడనేయున్నాఁ" డని యొకరు భ్రాతృమరణహేతు వితఁడే గాదా యనియొకఁడు నదిపట్టినమాట యని యొకఁడు పురమునుండి వీనిని వెడలనడువ మణివర్మ సమకట్టెఁ గాదాయని యొకరు గేవిగారుండుమనినారని యొకరు సైనికులు తమలోఁ దారు నానావిధముల భాషింపఁజొచ్చిరి. అప్పుడు దండపాణి యచ్చటఁజేసిన జనులనుగూర్చుండఁబనిచి యుపోద్ఘాతముగా నిట్లు చెప్పెను.

"వీరులారా! అనేకయుద్ధములఁ బేరుగాంచిన శూరులారా! మీకు మొనగాఁడై మీదేశము పరాక్రాంతము గాకుండఁజేయఁగల మహావీరుఁడు మీయెట్టయెదుటకువచ్చి యున్నాఁడు. మీకీయన చిరపరిచితుఁడుగాని క్రొత్తవాఁడు గాఁడు. ఈమహాశూరుని ప్రజ్ఞావిశేషములు మీరునావంటివానివలన వినఁగోరుట చిన్నదివ్వెసాయమున సూర్యబింబమునుజూఁడ గోరుటవంటిదని తలంచి యీమహాభాగుని విక్రమవిహారములు వర్ణింప నిచ్చగింపను. కుమారస్వామి దేవతలకు దళవాయియై మొక్కలు లగు రక్కసుల నుక్కడంచి దేవ

లోకము నుద్ధరించిన తెలుంగున నీరాజకుమారుఁడు శత్రుసైన్యముల నుఱుమాడి మీ దేశమునకు సౌఖ్య మాపాదింపఁగలఁడు. ఈయన హేమచంద్రమహారాజు తమ్ముఁడు, చిత్రభానుఁడు. అన్నగారి కుటుంబమును బరామర్శ చేయుటకును దనకు శక్యమైన సాయము జేయుటకును వచ్చియున్నాఁడు. విల్లుపట్టె నా రఘురాముని భృగురామునిఁ దలపించును. ఇతఁడు బాణంబువిడిచెనా శత్రువుఁడు ప్రాణంబు విడుచును. ఇతఁడు కలియుగార్జునుఁడు. మనల నాపత్సముద్రమునుండి యుద్ధరింపఁగలవాఁడయిదే. మన విచారాంధకారమును మాపఁగల భానుమండలమిదే! మనసంతాపమడఁచి చల్లనినీడనిచ్చు వృక్షమిదే. కావున వీనినాశ్రయింపుఁడు. ఆయన చెప్పెడుమాటల సావధానులై యాకర్ణింపుఁడు" అనియతఁడు విరమించెను.

"జయము! చిత్రభానుఁడా జయము!" అనిసభాసదులలో ననేకులరచిరి. "స్వాగతము! మీకు స్వాగతము!" అని కొందఱు కేకలువైచిరి. "మీవచనామృతమునువర్షించి మాసంతాపముఁ దీర్పుఁ" డని కొందఱు బిగ్గఱగఁ జెప్పిరి. అదివిని సభాస్థారులలోఁ దనకనుకూలమైనభావము పొడమినదని తెలిసికొని ధైర్యము దెచ్చికొని చిత్రభానుఁడు ముందరకువచ్చి సభాసదులముందఱనిలిచి యీవిధముగాఁ బ్రసంగించెను.

మహాయోధులారా! దండపాణిచెప్పినట్లు మీకు నేను క్రొత్తవాఁడనుగాను. పూర్వపరిచితుఁడనె. హేమచంద్రమహారాజు తమ్ముఁడనని విక్రమసేనునిఁ రెండవ కొడుకునని నాపేరు చిత్రభానుఁడని మీరందఱెఱుఁగుదురు. మీలోననేకుల నేను మున్ను మాయన్నగారియనుగ్రహమునకుఁ బాత్రమయిన కాలమునఁ జూచియుంటిని. కొన్నియుద్ధముల మిమ్ముఁగొనిపోయి గెల్చియుంటిని. మీవలన నేను పేరుగాంచియుంటిని. నావలనమీరు కీర్తిగాంచియుండితిరి. కాలవశమున

మంత్రులమాయలచేత నాకును మాయన్నకును మనంబుల స్పర్ధలు జనించినవి. చాటుననుండి సమిధలువైచి సచివులు వైరాగ్నిని బ్రజ్వలింపఁజేసిరి. ఆయగ్ని మాసోదరుల సహజమైత్రిని దగ్ధము జేసినది. ప్రేమను భస్మపటలముగావించినది. అప్పుడు మాయన్న మంత్రులమాటలువిని నిరపరాధిని-నిష్కపటిని-నిర్మలచిత్తుని-నిజసోదరుని నిరాధారునిఁజేసి స్వదేశమునుండి వెడలనడఁచెను. అపుడు నేను సపుత్రముగా సకళత్రముగా నూరువిడిచి-దేశమువిడిచి-బంధుమిత్రులవిడిచిపోయి దారపుత్రుల విదర్భలో నిలిపి యత్తవారింట నుంచుటయనుచితమని భావించి రాచబిడ్డనగుటచే నాత్మగౌరవమును బాటించి దేశములపాలై తిరిగితిని. నాపడినకష్టములన్నియు వరుసగా మీకుఁజెప్పఁబూనితినేని మీమనస్సులు విచారసముద్రమున మునుంగును కన్నీరువరదలై పాఱును ఒక్కొక్కసారి యాత్మహత్య చేసికొనుట యుక్తమని ప్రయత్నించితిని. అదినామిత్రులు వారించిరి పక్షులకయిన గూడులుండును. పులులకయిన దలఁదాచుకొనుటకు పొదలుండును. సింగములకైన గుహలుండును. నాకంతమాత్రమైన నెలవులేకపోయినది. రాచవాఁడనగుటచే నొకరినడుగఁజాల ఆగర్భసుకుమారుఁడనగుటచే మేను వంచి పనిచేయఁజాల. అభిమానధనుఁడనగుటచే నీచవృత్తులం దిగఁజాల అన్నములేక-బట్టలేక-నిలువనీడలేక--చుట్టములులేక--పక్కములులేక యేకాకినై చిరకాలము తిరిగితిరిగి యీశ్వరానుగ్రహమున నెట్టెటో బ్రతికి యుంటిని. దైవమునేనమ్మియుంటిని. శివునినమ్మినవాఁడు చెడిపోవఁడని నానమ్మిక. ఎందుకుబ్రతికించెనో దైవమునన్ను బ్రతికించెను. స్వప్నావస్థయందైన నేనుమాయన్నగారిని దూషింపలేదు. నాదురదృష్టమును నిందించుకొంటిని గాని మాసోదరుని నిందింపలేదు. ఆయననిష్కళంకచరితుఁడు. నిరుపమానత్యాగశీలి. లోకోత్తరచరితుఁడు. అగ్నికి ధూమము పేరిటమాలిన్యముగలదు. చంద్రునకు మ

చ్చఁగలదు. కాని యమ్మహాత్ముని చరిత్రమునకు మచ్చ లేదు. అతఁడు నేలపై నవతరించిన నారాయణుఁడే. అట్టివాని నీచల్లని సమయమున జ్ఞప్తికిఁ దెచ్చుకొని మనమందఱము ధన్యులమగుదముగాక! అట్టి మహారాజును-అట్టిదయాశాలిని-అట్టిశాంతచిత్తుని-అట్టిపరమపవిత్రుని నట్టి లోకమిత్రుని నట్టి సుగుణరత్నాకరుని. హా! దురాత్ములెవ్వరో దారుణవధముపాలు చేసిరిగదా! హా! హేమహాచంద్రా!! హా! భ్రాతృవత్సలా" అని కన్నులనీరు జోటజోటఁగార మాటాడలేక దుఃఖపరవశుడై నిలువఁబడలేక నేలపైఁ జదికిలంబడెను. అతని దుఃఖముఁ జూడఁగానే సభాసదులకుఁగూడ మిక్కిలి విషాదము జనించెను. వారును బాష్పధారలచేతఁ దమ దుఃఖము బ్రకటించిరి. అనంతరమునఁ జిత్రభానుఁడు వెండియు నిట్లు బ్రసంగించెను.

"ఆమహాత్ముని జంపించినవారెవ్వరో నేనెఱుఁగుదును. కానివారి పేర్లిప్పుడిక్కడఁ జెప్పను. పాపమెన్నటికయిన బయలుపడకమానదు. మగనిజంపి మొగసాలలో మొఱ్ఱలెత్తినది యను సామెత నిజముగా నాపైఁ ద్రోహము జంపించిన దురాత్ములే తమమీఁద నెవ్వరికనుమానములేకుండఁ జేసికొనుటకై నేనే యాఘాతకృత్యముఁ జేసితినని లోకమునఁ బ్రవాదముబుట్టించిరి. ఎక్కడో నరులుచేరని నట్టడవులలోఁ గాకులయిన లేనికాఱడవులలో మృగములయట్లనేనును నాకు ఫలములు దింపోట్టబోసుకొని గాలక్షేపముచేయుచుండ దుస్సహమయినయపవాదము వారు నాపైఁబడవైచిరి. మహేశ్వరపూజా నిరతరములైన యీహస్తములా యిట్టిఘాతక కృత్యము జేయుట! మహానీయులగుమునిజనులకు నమస్కరించునట్టి యీచేతులా- యన్న నెత్తురుతోటి యపవిత్రములగుట? ఛీ! అట్టిపని నేనా చేయుట? విక్రమ నేనునికొండుకా యీనింద్యకర్మకుఁ బాల్పగుట? ఈయపవాదము వచ్చిననాఁటంగోలె నాహృదయము విషాదాగ్నిచే మండిపోవుచున్నది. ఈసంతాపముచే

తనే నేను చిక్కినగమైతిని. నాహృదయ మెవ్వరయినఁ బరీక్షించినచూ
తురేని యది సంతాపమను యగ్నిలోఁ బడి కాలిపోవుచున్నట్లు దెలి
యును. నరుఁ డెట్టిదైన మోయఁగలఁడు. గాని నిందాభారము మో
యఁజాలఁడు. నింద పడుటకంటె మరణించుట మేలు. నాపైనున్న యప
వాదము బాపుకొనుటకే నిటు వచ్చితిని. నిర్దోషుఁడనుగ నింద పైబడి
నను సజ్జనుఁడు దానిని బాపుకొనుట కర్తవ్యము. కర్తవ్యమగుటచేతనే
గదా సాక్షాన్నారాయణావతారుండైన ఘనుఁడగు శ్రీకృష్ణుఁడు
శమంతకమణిహరణనిమిత్తముగ నపనింద తనపైఁబడినపుడు తానా
దోషమెఱుఁగకపోయినను లోకాపవాదమును బాపుకొనుటకై దేశదేశ
ములు తిరిగి జాంబవంతుని గుహలోని కరిగి యోడించి గెలిచికొని యా
భల్లూకపతి భవనములోనుండి మణిని గ్రహించి సత్రాజిత్తునకిచ్చి
నిందాభారమును దించి న్యాయమును జనులకు జేసికొనెను. కర్తవ్య
మగుటచేతనే కదా యిక్ష్వాకువంశజుండైన రాముఁడు నిర్మలచా
రిత్రయైన జనకరాజకన్యకను నిందపాలుగానైన శంకింపక గహ
నాంతరములకుఁ బంపెను. మానవులకుఁ బ్రాణముకన్న సత్కీర్తి
ప్రియము. అతఁడసువులనైన విడుచునుగాని సద్గుణము విడువఁడు.
అందుచే నేనట్టి మహాపాతకముఁ జేసినవాఁడను గాను. మీరెల్లరు
నమ్ముఁడు. మున్ను మీమనంబుల దురాత్ములచే నాటఁబడిన యనుమా
నబీజంబులఁ బెల్లగింపవలయునని మోఁకరించి వేడుచున్నాను.
ఏమి మీయనుమానములు తీరెనా లేదా? నాయందు శంకాశల్యములు
మీమనంబుల నాటించుచున్నవా?" అనిపల్కఁగా నాగరకులు వారిలో ననే
కులు "లేదనుమానము లేదు. శంకలు లేవు" యని కేకలు వైచిరి.
వైచుటయుఁ జిత్రభానుఁడు "మంచిది యిప్పుడు నేను ధన్యుఁడనైతిని.
ఇప్పుడు నేను మనుష్యుఁడనని తలంచుచున్నాను. ఇప్పుడు నేను రాచ
బిడ్డనని గర్వించుచున్నాను. ఈమహాజనాభిప్రాయమే మో నాకు

ధైర్యము గలిగించుచున్నది. ఇంక నే ప్రస్తుతాంశములను గూర్చి కొన్ని మాటలు చెప్పి విరమించెద" నని యుత్తేజంగున బలికెను.

"యోధులారా! పరమసాధులారా! మన దేశము కల్పవృక్షములు లేని స్వర్గఖండము. ఈనేల యంతయు రత్నగర్భ. సింధునది తన బాహువులతోఁ గాశ్మీరదేశలక్ష్మిని గాఢాలింగనము చేసికొన్నదో యన్నట్లు లుపనదుల నెల్లనెల్ల యెడల వ్యాపింపఁజేసి దేశమును సారవంతము జేయుచున్నది. ఎక్కడఁజూచిన తీయని నీరు. ఎక్కడఁజూచిన ఫలవృక్షములు ఎక్కడఁజూచిన బచ్చిపంటలు ఎక్కడఁజూచిన తృణకాష్ఠజలసమృద్ధి ఎక్కడఁజూచిన గామధేనువులవంటి పాడిమొదవులు ఎక్కడఁజూచిన ధనధాన్యసమృద్ధి. ఇక్కడి పడఁతులు చక్కదనమున వేల్పుటువిదల నెక్కిరింపఁగలరు. పుష్పోద్యానములు-ఈనేల యేళ్లు-నీపూఁదోటలు-నీనగరములు-మధురగానములు సేయు నీవిహంగములు-నీనానావిధ జంతుసంతానము జూచిన నెవనికి ప్రకృష్టము? ఎవని నోరూరదు? ఎవని కాన పట్టదు? ఎవనిచిత్తము గరింపదు? నవలావణ్యవిరాజమానమగు నుంగనిన్నప్పుడు పరమయోగియైన వికలచిత్తుఁడగునట్లు వనంబులనియెడు శిరోజములు సరస్సులనియెడు నేత్రములు నదులనియెడు ముత్యాలహారములును వసుంధరయనియెడు మేను గల దేశాంగనంజూచి చుట్టుప్రక్కలనున్న రాజులు మంచివారైనను నాసపడుట సహజము. అందు ముఖ్యముగా నేలిక బాలకుఁడై నప్పుడు వట్టివాగుల్లాల వాడకెల్ల పదినెయైనట్లు దేశ మెల్లరాజులకు లోకువయై యాసలకు గురియై యుండును. ఇప్పుడు గాంధారరాజు మనదేశముపై దండువెడలఁబోవుచున్నాఁడు. ఈవార్త మీరు వినియే యుందురు. విశేషించి సింధురాజు నాడ దీనిపైఁ గన్నువైచినాఁడు. చియ్యపట్టిన మేకను జూచిన బెబ్బులుల నోరూరదా? పడమటినుండి గాంధారులు దక్షిణమునుండి సింధురాజు మనపై దాడివెడలిన ముక్క

పచ్చలారనిముద్దుబాలుఁడు దేశమును రక్షింపఁగలఁడా! తన్నుఁగాచు కొనఁగలఁడా? సైన్యమును నడుపఁగలఁడా? సన్నాహము సేయఁగలఁడా? చేయ గలఁడనుకొనుము. మంత్రులతనికిఁ గాళ్ళసంకెలలు. వారు పదవుల కాసపడియు నగరిహారముల కాసపడియు, ధనములఁ గోరియు సౌఖ్య సాధనములఁ గోరియు పగఱతోఁ జేరి దేశమును వారికప్పగింపఁ దలఁచుచున్నారు. ఇంతకన్న రాజద్రోహముగలదా! ఇంతకన్న దేశ ద్రోహముగలదా? ఇంతకన్నఁ బాపముగలదా? ఇట్టి యమాత్యుల-స్వామిద్రోహులను వర్గాంతులను దేశద్రోహులను బహిర్ముఖవిష కుంభములను గోముఖవ్యాఘ్రములను గొంతెనేసిన బాగున్నదా? మే నిచర్మమొలిపించిన దోషమున్నదా? ప్రాణముండఁగ నిప్పులంబొరలించినఁ దప్పున్నదా? పాపములేదు. లేదు దోషములేదు. కాని రాజు బాలుఁడు, సాధుశీలుఁడు, క్షత్రియుఁడు. అమాత్యవశ్య పరపురుషవిముఖుఁడు. మంత్రులె నామె చెవులు. మంత్రులె నామె కన్నులు. మంత్రులె నామె చేతులు. ఇట్టిస్థితిలో నామె యేమిచేయఁగలఁడు! బాలుఁడేమిచేయఁగలఁడు? కావున మీదేశ సంరక్షణము యోధులయిన మీరు మహాయుధపాణులైన మీరు-శూరాగ్రేసరులయిన మీరు స్వేచ్ఛాభిమానులైన మీరు-రాజభక్తులైన మీరు నేఁడు చేపట్టవలయు. దానిం జేసి దేశసంరక్షణమేగాక మీయాత్మసంరక్షణము రాజకుటుంబ రక్షణము మొదలగునవన్నియు జరుగును. మిమ్మిప్పుడు పట్టుటకుఁ దగిన దక్షతయు నేర్పరచుకొని నగరము చక్కఁజేసికొని దురాచారుల మేమమీఱకుండ బంధించి వలయు సాధనసామగ్రుల సమకూర్చుకొని పన్నుట బగిఱపైఁ నడువవలయు. యోగ్యులైనను ముందునా పంతఱుపురశత్రువుల గెలుతురుగదా! తగిన మొనగాఁడుండిన గాంధారరాజుగర్వము క్షణములో నణఁపవచ్చును. సింధురాజుసేన త్రుటిలో నణఁపవచ్చును. మీకందర కిష్ట

మైన మొదల దండపాణి వజ్రపాణి ప్రముఖుల సాయముగాని నేనే గాంధార [illegible] జయము చేకూర్చెను. కాశ్మీరరాజ్యము సురక్షితమైయున్నది. నా బుద్ధిప్రయత్నముగాని నా ప్రజ్ఞ జూపుట నాయిష్టము కాదు. జనవాక్యంతు కర్తవ్యం అన్నను లోకోక్తినిబట్టి మీ అందఱ కోరిక యేమో యదియే చేయుట నాయిష్టము. మీ యభిమత మెఱిగింపుడు." అని యుపన్యాసము విరమించెను. వెంటనే పెక్కండ్రు లేచి "అయ్యా! మీరే మమ్ము నడుపుడు. రాజ్యమును గాపాడుడు. దురాత్ములైన యామంత్రుల బంధింపుడు. స్వామిద్రోహుల నణచివేయుడు." అని బిగ్గరగా నఱచిరి. తొందరపడుట కర్తవ్యము గాదని కొందఱు లోలోపల ననుకొనిరి. కొందఱట్లు కాదని మూలిగిరి. కొందఱు స్పష్టముగా దెలియకుండ గొణగుకొనిరి.

మొత్తము మీద సైనికులలోఁ బెక్కండ్రు చిత్రభానుని గంభీరవచఃప్రవాహమున సమ్మోహితులైరి. జనసామాన్యమునకు నేదేని కొకవిషయమును [illegible] గట్టిమేటికి నిప్పుపెట్టుట. అది చాల చురుకుగా [illegible] జనసామాన్యము [illegible] వర్తించును. [illegible] నిజము. [illegible] మించిన శక్తిలేదు. [illegible] సాహసోత్సుకులబల్కి [illegible] యని భావింపవలెను. మదించిన [illegible] వేలకుక్క [illegible] జనసామాన్యస్వభావ మిట్టిదని యెఱిఁగిన [illegible] చిత్రభానుఁడు వారి చెవులలో నయ్యుపన్యాసమును [illegible]. [illegible] "రండు! లెండు! చిత్రభానుని [illegible]. దేశము గాపాడుఁడు. ద్రోహులఁ దుదముట్టింపుఁడు." అను కేకలు వినంబడెను.

అప్పుడు చిత్రభానుఁడు "యోధులారా! మీరిఁకను శాం తింపుఁడు. సాహసించి చెట్టిపని చేయ[illegible] ములు చేయవలెను. అవిచారిత సకల [illegible] బుద్ధితో నుండుఁడు. మఱి కౌరవ్య [illegible] స్వకార్యపరతంత్రులగు మంత్రులు [illegible] పుచ్చి ప్రయాణింతురు. వారి[illegible] ఱేపో నేను వచ్చి మిమ్ముం గోట[illegible]. ఇప్పటికి నాకు సెలవొసంగుఁడు." [illegible] తననిలయంబునకుం బోయె [illegible] ల గుంపులుగుంపులుగా [illegible]. "అతఁడే తమ్ము [illegible] ఆ హాహా! వానిభార్యాపుత్రులు [illegible] యెం తదుఃఖపడెదరో యని కొందఱును, [illegible] సాహసముతో యం దొక్కటి [illegible], వాని[illegible] తరము లేదని కొందఱునుఁ బలికిరి.

"ఈవెంగలిమూఁక[illegible] య తఁడు స్వకార్యసాధనము [illegible]. కాని యిట్టివా రల్పని [illegible] చిత్రభానుని వలలోని చేఁపలయిరి. వారిచే[illegible]రి. రెండు జాములరాత్రియైనపిదప నెల్లవారు స్వగృహంబులకుం బోయి నిద్రించిరి.

విక్రమసేనుని మీఁదఁ బడువా[illegible] మానసము సంపూర్ణవిశ్వాసము[illegible] తెల్లవారుజామున లేచి [illegible] నడచిన రేయి చిత్రభానుఁడు నెఱపిన చిత్రవృత్తాంతమును దెలిపిరి. వారును కలఁత

జెందిన [illegible] మణిసర్మ నిలయమున కరిగి చిత్రభానునిసాహసమును, [illegible] ద్రోహమును, సైనికుల మహోత్సాహమును దెలిపిరి. [illegible] మాధవసేనుఁడు వారితో నిట్లనియె.

"[illegible]! [illegible] వచ్చునని నేను మున్నే కనిపెట్టితిని. [illegible] విశేషించి చిత్రభానుని మాయ [illegible] ద్రోహులుగాఁ బరిగణించినది. [illegible] దములచేత భంగపడును. మానవులు [illegible] పోవుదురు. దేవి కెవ్వరో మన మీఁద [illegible] ద్వేషముఁ గలిగించిరి. ఇప్పుడు మన [illegible] సైత్యరోగమున రుచిచెడిన జిహ్వ [illegible]. అట్టి యోగాముల విచారింపక సేవకుల [illegible] సంచనలమాయలం బడినవా [illegible]. ఇప్పు డొకపనిచేయుట కర్తవ్యము. [illegible] సైనికులనందఱ వారితోఁ జేరకుండఁ [illegible] మాధవసేనునిముఖమున నీవృత్తాంత మెఱిఁగించెద. [illegible]. ఇంతకు విక్రమసేనునకు రాజకుటుంబమునకు [illegible]. మనకు దుర్దినములు వచ్చినవి. చిత్రభాను [illegible] గనంబడుచున్నది. అఘటనఘటనాసమర్థు [illegible] మనమెట్లు తెలిసికొనఁగలము! [illegible] పనిచేయుఁడు. నేనును మాధవసేనుని బిలిపించి కర్తవ్యము చేసెదను."

[illegible] వానిపనిచిన తెఱఁగునఁ జేయఁజనిరి. [illegible] మాధవసేనుని బిలువనంపి దేవి కావృత్తాంతము దెలియఁబంపెను.

పదియాఱవ ప్రకరణము.



రాజ్యవ్యాపారము లీలంగున నుండ వజ్రపాణి గృహవ్యాపార మెట్లుండవలెనో యట్లుండెను. శ్రీధరుని మొగము జూచుటకుఁగోరి సత్యుఁడు ధర్మపత్నియైన సునందను మున్ను సంతోషపెట్టు గారవించుట మానెను. వెనుకటియట్లు దంపతు లిష్టాగోష్ఠి సల్లాపములకు నవకాశము లేకపోయెను. విరసోక్తులేగాని యానాఁడెల్లప్పుడు సరసోక్తులు రాకపోయెను. అంతఃపురమున క్షణకాలమైన సరసము నిలువకపోయెను. ఏదో కారణము గల్పించుకొని యామె యతనితోఁ బలుకఁబోవ సత్యుఁడు తగినయుత్తరము జెప్పక విసుగుకొనుచుండెను. ఆమె సహనావేశమే వానికిఁ గిట్టకపోయెను. దానికిఁ గారణమేమని యామె బహువిధంబుల నరసెనుగాని కారణము కనుపించలేదు. కారణ మరయుమని పలుమాఱు పరిచారికల నంపెను గాని వారును గృతకృత్యలు కాలేకపోయిరి. ఇట్లు సునంద పతిప్రేమను సత్యుఁడు మఱచుచుండ భర్తచేసిన యనాదరణమునకు సునంద చింతింపఁజొచ్చెను. అట్లు దంపతు లిద్దఱు వేర్వేఱు కారణములచే మనస్తాపము నొందుచుండుటచే గృహము శోభావిహీనమైయుండెను.

ఒకనాఁడు వజ్రపాణి గాఢనిద్రపోవుచుండెను. సునంద మందమతియై తన పానుపుమీఁదఁ బండుకొని నిద్దుర రాక ధ్యానసంస్థగూర్చి యిట్లు తలపోసెను. "మిక్కిలి మక్కువగల నా ప్రాణేశ్వరుఁ డాకస్మికముగ నూతనపురుషుఁడట్లు నాయెడ నిష్ఠురుఁడగుట కారణమేమి? నే నెఱిఁగినంతవఱకు నాచేసిన యపచారమేమియు లేదు. ఎప్పటియట్ల వినయవృత్తిగలిగియుంటి. మునుపటియట్ల నాయాయన మనస్సు రంజించుటకై యత్నించుచుంటి. ఆయన సన్నిధి నెల్లప్పుడుండుచుంటి. నాపాలిదైవమని నమ్మికొంటి. ఆయనయడుగులు కన్నుల నద్దుకొను

చుంటిని. ఇఱుప్రొద్దులు రుచ్యంబులగు భక్ష్యంబులు సేవకులచేతఁ జేయించి సమర్పించుచుంటిని. గీచినగీటు దాఁటకుంటిని. అనృతము చెప్పితినా? అప్రియము [illegible]నా? పరపురుషులతో సంభాషించితినా? ఎన్నఁడేని [illegible] [illegible]నా? కన్యాయముచేసితినా? అత్తలమీఁద [illegible] [illegible] అయుక్తముగం [illegible] [illegible] [illegible] [illegible] వారికిఁ [illegible] [illegible] [illegible] [illegible]ము. [illegible] [illegible] [illegible] [illegible] పలుకరు. [illegible] [illegible] [illegible] మీఁద [illegible] [illegible]ముండి [illegible] [illegible] [illegible] తెలియుటయే [illegible] [illegible] [illegible] [illegible]నప్పుడు [illegible] [illegible] పడఁతి జీవిత[illegible]? [illegible] [illegible] [illegible] ఆ మన కొంతము [illegible] [illegible]కే? [illegible] తప్పేమో చెప్పక [illegible] [illegible] [illegible] [illegible] చూపిన దిద్దు[illegible] [illegible] [illegible]" యని చింతించుచు రెండు [illegible] [illegible] [illegible] వెచ్చనియూ[illegible] [illegible] [illegible] [illegible]లు విగిడించెను. [illegible] [illegible] [illegible]! కర్పూరమంజరీ! [illegible]సిగ్గుపడి [illegible]" [illegible]

[illegible] [illegible] [illegible]డనే [illegible] మగని [illegible] [illegible] [illegible]యైన తాళముచెవి దొరకినట్లయ్యెను. కర్పూరమం[illegible] [illegible] [illegible]. ఆమెకు వివాహము [illegible] [illegible]. ఆమె యసాధారణలావణ్యవతియని

యెఱుఁగును. ఆమెచూపుతూపు లెవ్వరిపైఁబడునో వారి హృదయములు గాయములుపడునని యామె యెఱుఁగును. అప్పుడామె వెండియు నిట్లు తలపోసెను. "చిత్రభాను పుత్రికయైన కర్పూరమంజరిపై నీయనకు వలపునిలిచినదని నిద్రావశమున నప్రయత్నముగ నీయన నోట వెడలినమాటలవలనఁ దెలిసినది. ఈయనంగూర్చి యామెయే మేలుపడెనా లేక యాలోకైక సుందరి నిమిత్త మీయనే పరితపించుచుండెనా? ఎట్లయిననేమి? బంగారమువంటి నా కాఁపురము చెడిపోయినది. నిక్షేపమువంటి నాసంసారము నిస్సారమగుచున్నది. ఒకయొఱలో రెండుకత్తు లిముడునా? ఒకయర్ధశరీరములో నిరువురు పడఁతులు నిలుచుట కవకాశమున్నదా? ఒకతెను ద్రోసిరా జనవలె, రెండవదాని నచ్చోట నెలకొల్పవలె. ఇంతకన్న గత్యంతర మేమున్నది? పెద్దదానను. జవ్వనము కొంతవఱకుఁ జెల్లిపోయినదానను. పగని మనసు రంజింపఁజాలనిదానను. నేనే యొత్తిగిలయుఁగాని నిండు జవ్వనంబును నెఱజాణతనంబును జక్కదనంబును సౌకుమార్యంబును గల లేమ తొలఁగిపోవునా? అఱువదియవయేఁట యగ్నిగుండమన్నట్లు పదునైదేండ్లు కాఁపురముజేసి సంతానవతినైన నాకు నీనాఁటికి సవతిపోరా! నేను వయసుమరలినదాన నగుటచే మిసమిసలాడు లేజవ్వనంబుగల క్రొత్తపెండ్లికూఁతురు మీఁదనే యీయనకు గౌరవముండును గాని నామీఁద లేశమైననుండదు. ఆమె యడుగులకు మడుగులొగ్గుచు నామె చిఱునవ్వుల కలరుచు, నామెబొమముడుల కడలుచుఁ బ్రొద్దులుపుచ్చవలయుఁ గాఁబోలు! హా! పరమేశ్వరా!" యని విచారించుచు నొకమాఱు పాన్పుమీఁదినుండిలేచి యిట్టటు దిరుగుచు నొకమాఱు పండుకొనుచు నొకమాఱు భర్తను లేపఁదలఁచి నిద్రాభంగము సేయఁగూడదని మరల వెనుకకుఁబోయి తెగులు లేని వేదనం బడుచుండెను.

అంతలో నాలవజాము కోడికూసెను. కోడికూసినకొలఁది నేపటికిఁ గాకులు కావుకావుమని యఱచెను. అప్పుడు వజ్రపాణికి మెలఁకువవచ్చెను. వచ్చినతోడనే యతఁడు మంచముమీఁద లేచికూర్చుండి కన్నులు తుడుచుకొని మహేశ్వరధ్యానము చేసికొని మంచము దిగెను. సునంద చేతులుజోడించి మగనియడుగులమీఁదబడి కన్నీటితో వాటిం దడుపఁజొచ్చెను. అతఁడు మిక్కిలి విస్మితుఁడై విస్మయమునకు భయముతోడుగ మిక్కిలితొట్రుపాటుతో "సునందా! ఏమిది? యేమిది? ఎన్నఁడు లేనిపని చేయుచుంటివి. నీకేమికష్టము వచ్చినది? బిడ్డలు సుఖముగ నున్నారా? నీపుట్టినింటివారుండి యేదేని చెడువార్త వచ్చినదా? నీశరీరమున నేదేని రుగ్మత కలిగినదా? చెప్పు చెప్పుము. అని పాదములపైనున్న పాణిగృహీతిని చేతులతో లేవనెత్తెను. ఆమె కన్నీరు విడుచుటయేగాని యాతనిమాటలకు బదులు చెప్పదయ్యె.

అతఁడు భయము రెట్టింపఁ గా నామె నెమ్మొగముఁ జేయివైచి తట్టి కల్యాణీ! భయములేదు. చెప్పు చెప్పు. పాడుకల యేదేని గంటివా? భయపడకు చెప్పు చెప్పు"మని వెండియు నుచ్చరించెను. కొంతవడి కామె యెట్టకేలకు గద్గదస్వరముతో నిట్లనియె. "బిడ్డలింతవఱకు సుఖముగా నున్నారు. ఇఁకమీఁద నాకే సౌఖ్యముండదని విచారించుచున్నాను. నాపుట్టినదినాదికి నేటివఱకుఁ గుశలమే. ఇఁకముందది యుండదని వెఱచుచున్నాను. నాకింతవఱకు రుగ్మతలేదు. ఇఁకముందు జీవితశంక గలుగవచ్చునని భయపడుచున్నాను. పాడుకల నేనేమియుఁ గానలేదు. దేవరవారికే యాపద వచ్చినదని మనవి చేయుచున్నాను.

అప్పలుకులువిని వజ్రపాణి వెల్లబోయి "సుందరీ! నీపలుకులు నాకర్థముకాలేదు. ఇప్పుడు నాకాపద రానున్నది. విస్పష్టముగాఁ జెప్పి నామనస్సుఁ జక్కఁజేయు"మని పలికెను. అనవుడు సునందకంత

గాన్ధర్వము కొంతవఱకు దిగఁబడ స్పష్టమైనభాషతో నిట్లుత్తరము జెప్పెను. "అయ్యా! నేను మీకంటికిఁ బెద్దపిశాచమువలె గనఁబడుచుండుటచేత నాసంభాషణము పిశాచభాషవలె మీకుఁదోఁచుచున్నది. మీమనస్సు చక్కఁజేయుట నావంటి దానికి శక్యమా? కొంత కాలము నుండి దుర్గంధమునకుఁ దొలఁగినట్లు నాకు మీరు దవ్వుదవ్వుగఁ దొలఁగుచున్నారు. కర్పూరమంజరి కాయముయొక్క దుర్గంధము తొలఁగి పోవునుగదా! నాకంపు దొలఁగించుకొని వెంటనే మీకింపుగలుగు నట్లు కర్పూరమంజరిని హృదయమునంత ధరింపుఁడు. భర్త భరింప లేని మగనాండ్రను గావులు భరించును. వాఁగులు భరించును. భగవానుఁడైన పావకుఁడు భరించును. మనసులోఁ గర్పూరమంజరిపై మీకు మక్కువగలదని యెఱుఁగకపోను. మీ వైఖరియంతయు మాఱిపోవుట నేగనిపెట్టుచుంటిని. కంటిచూపుకసవయ్యె. నోటిమాట యరుదయ్యె. కలలోనైన నేఁబసకిరాక కర్పూరమంజరి కావలసివచ్చె. ఎనలేని యామమత యేయేటఁ గలసె! ఆప్రేమ యెందఱిఁగె! ఆవిశ్వాసమే దేశాంతర మఱిగె? ఇంతలోనే నాకింత యవస్థ కలుగునని నేనెన్నఁడు దలంపనైతి. ఒకరాటను రెండుపశువులం గట్టిన నవి యొండొంటిం బొడుచుకొని చచ్చును. నేను కొంతకాలమైన సుఖమనుభవించినదానను. పదికాలములపాటు కాపురముచేసినదానను. సంతానవంతురాలను. కొంతవయసు మీఱినదానను. జవ్వనము సడలిన దానను. కావున నాకు సెలవొసంగుఁడు. భర్తకుఁ బ్రియము సేయుటయే భార్యకు ధర్మముగనుక నాచకన్నయానగు నేను మీకును భూమికిని భారముగానున్న నామేను విడిచి మీకన్నుల చల్లవారమైన వన్నెలాడికై తావొసంగెదను. అదే! నిదురించుచున్న మాచిన్నబిడ్డలం గాచికొనుఁడు. సవతితల్లి కష్పగింపక మీరే కనిపెట్టుఁడు. మీరు విక్రమశాలురై యనేకరణరంగముల విజయములు గాంచి విఖ్యా

తులుబడసిన మహాత్ములరు. ఇట్టిమహనీయులకు భార్యనైనందుకు
నేను సంతసించుచున్నాను. ఐదువ తనువుఁ బసుపుకుంకుముతోఁ
గాటికిఁబోయిన కాంత కడుధన్యురాలు. అందుచే నాకు సెలవొసం
గుఁడు. రేపు తెల్లవారకమునుపే మీకన్నులు చల్లనగునట్లు మీ
మనస్సు చక్కఁబడునట్లు—మీమనోరథము సిద్ధించునట్లు—మీ సం
కల్పమున కాటంకముదీరునట్లు—మీయుద్యమము సఫలమగునట్లు—
తగినమగఁడు గావలెనని తహతహపడుచున్న యాతలిరుఁబోఁడి తపము
ఫలించునట్లు—నేను చేయఁదలఁచిన కార్యముఁ జేసెద" అని రోషా
వేశంబున నాయెలనాఁగ యింక నేమియో పలుకఁబోవుచుండ వజ్ర
పాణి యెఱ్ఱఁబడిన యామెకన్నులను దృఢనిశ్చయము దెలుపుచున్న
యామె మొగమును-గంపించుచున్న గాత్రమును-తొట్రుపడుచున్న
యామెమాటలను జూచి విని యేమియుందోఁచక భయవిహ్వలుఁడై
యామె రెండుచేతులు బట్టుకొని యిట్లనియె.

"కల్యాణీ! నీమాటలనుబట్టి కలలో నేను కర్పూరమంజరియను
మాట దలపెట్టితినని తేటపడుచున్నది. నీవు విస్పష్టముగఁ జెప్పక
పోయినను నీసంభాషణమువలన నది గ్రహింపవచ్చును. స్వప్నములు
నీవెఱుగనివిగావు. అదృష్టపూర్వములు నశ్రుతపూర్వములు స్వప్న
మున మనము గనుచుందుము. స్వర్గమునకుఁ బోయినట్లు కలగందు
ము. అప్పుడేమేమో పలవరింతుము. అవియన్నియు నిజములగునా?
చిత్రభానుని కూఁతురు కర్పూరమంజరియని యొకర్తె కలదు. ఆపేరు
నాకుమిక్కిలి చిత్రముగా నున్నది. అది క్రొత్తపేరు. రమణీయమైన
పేరు. మనోహరమైన పేరు. అందుచేత నాకీనారి యాఁడుబిడ్డ పుట్టు
నేని దానికాపేరుపెట్టవలెనని సంకల్పించుకొని తఱచుగా మనసు
లో దాని స్మరియించుచుందును. అందుచేఁ గలలో నప్పేరు పలవరిం
చితి గాఁబోలు! ఇంతమాత్రమునకై యింతగోడవ కావలెనా? క

ర్పూరమంజరి త్రిలోకసుందరి. లేజవ్వని. అట్టిదానిని వయస్సుచెల్లిన నాకిచ్చి తండ్రి పెండ్లిసేయునా ? నాయందమును నాచందమునుజూచి యాబాల నన్ను వరించునా ! ఇటువంటి పిచ్చితలంపులు తలలోఁ బెట్టుకొని సాహసంబులు చేయఁదలంతువా ? నేను కొంతకాలము నుండి యెప్పటియట్లనీతోఁ జనవుగా మాటలాడకపోవుటకు గొప్పకారణముగలదు. రాజ్యవ్యవహారములు యథాపూర్వముగ లేవు. పరిస్థితులు మాఱినవి. సేనలలో గొప్పకలఁతబయలు దేఱినది. వైదేశికులు మనదేశముపై దాడివెట్ట గమకించుచున్నారు. నిరంతరము పాఱికిం బ్రతిక్రియలు వెదకుచు నామనస్సు స్థిమితముగాలేదు. అందుచే నట్లుంటిని. అంతేగాని నామనస్సులో నీపై నలుకలేదు. నీవె నాయర్ధాంగము. నీవె నాబహిఃప్రాణము. నీకన్న నాకు వేఱులేదు. కఠినోక్తులు గట్టిపెట్టుము. సాహసము లుపసంహరింపుము. నన్ను మన్నింపుము. బిడ్డల నడలఁ జేయకుము. నా కప్రతిష్ఠ ఘటింపకుము. నేను మనోవాక్కాయ కర్మములనీయెడ నెట్టివిరుద్ధభావములేని వాఁడను. నమ్ముము. మనకుటుంబము పరువుగలది. అవసరముమాలిన యల్లరిచేసి యప్రతిష్ట సంఘటింపకుము" అని బతిమాలుటయు సునంద "సరే ! మీచిత్తము వచ్చినట్లు చేయుఁడు. బహుభార్యాపరిగ్రహణమునకు మీ కధికారము గలదు. పరకాంతాసక్తులయిన పురుషులు తఱుచుగా ననృతంబునకు వెఱువరు. వారు చేయుబాసలు, ప్రమాణములు, విశ్వసింపఁదగినవి కావు. వారిసంభాషణలకు సత్యమునకు, జీఁకటికిఁ వెలుతురునకుఁగల దూరముండును. పాలముంచుటకు నీటముంచుటకు మీరె సమర్థులు. ప్రాణేశ్వరుఁడె దైవంబని నమ్మి యిల్లాలి నుసురుపెట్టఁ గూడదు." అని కఠినముగాఁజెప్పి గదివిడచిలోనికిఁ బోయెను.

పజ్రపాణి కలలోఁ దానుప్రేలిన ప్రేలాపనలవలన కార్యమిం

కీడువచ్చినదని విచారించి యామె సాహసకృత్యములఁ జేసినపక్ష మున మానహానియు లోకనిందయుఁ దనకు సంప్రాప్తించుటయే గాక కర్పూరమంజరీ పాణిగ్రహణ మహోత్సవముగూడ తప్పిపోవచ్చునని భయపడి యిల్లాలినదివఱకే తిరస్కారభావమునఁ జూచుటతప్పని గ్రహించి యింక మీఁద నామెనులాలించి గౌరవించుటయే కార్యసాధకమని నిశ్చయించెను. కాని యతఁడు మిక్కిలి యాలస్యముగా మేల్కొనెను. తనయనునయములామెయెడఁ బనిసేయలేదు. తనమాటయెడ నామెకు విశ్వాసము గలుగలేదు. ఆమె హృదయమెంతమాత్రియు మారలేదు. ఆమె యింటనుండుచున్నను మనస్సు మహోవాయువశమున సంచరించుచు నెన్నెన్నో పాట్లు పడుచుండెను. స్త్రీలకు సాహసము మెండని యతఁడు పెద్దలవలనఁ బలుమాఱు వినియుండుటచే నామె యాత్మహత్యచేసికొననేమో యనుభయమున నతఁడా పగ లిల్లు గదలక నారాత్రియు నిద్రపోవక జాగ్రత్తగనుండెను. ఆరేయి యామెయు నిదురింపనేలేదు. మంచముమీఁద గూర్చున్నది కూర్చున్నట్లె యుండెను. పండుకొమ్మని భర్తయెన్నివిధముల బతిమాలినను శయనింపదు. ఆరేయి సతీపతుల జాగరణముతోనే గడచెను.

మఱునాఁటినుండి సునంద కుమతి చలించెను. ఊరకయె నవ్వును. కారణము లేకయె పెద్దపెట్టున నేడ్చును. ఆహారము ముట్టదు. “కర్పూరమంజరీ, కర్పూరమంజరీ” యని పిలుచును. ఒకచోటస్థిరముగా నిలువక గృహమునందు, గృహముచుట్టునున్న దొడ్డియందుఁ దిరుగుచుండును. నిష్కారణముగా బిడ్డలం గసిరికొట్టును. పరిచారికులం దిట్టును. అయ్యయ్యో! నన్ను సేవకులు కొట్టుచున్నారని కేకలు వేయును. తినుటకే దేని బెట్టిన విసము పెట్టుచున్నారో యని యఱచును. మాటిమాటికి మొత్తుకొనును. రొమ్ము మోదుకొనును. విలువ

గలమువ్వలువలుదెచ్చి చింపును. ఏలచింపెదవన బొమ్మలకు బట్టలు కావలెననును. అద్దములు పగులఁగొట్టును. అట్టిపనిచేయవలదని భర్త నివారింప తలగోడకుఁ గొట్టుకొనును. చీనిచీనాంబరములు మైలపడినవని తడుపును. తన యమూల్యాభరణములఁ దీసి పరిచారికలంబిలిచి యొకొక్కరికొక్కొకనగ పంచిపెట్టును. ఇల్లుకాలిపోవునని పాకబెట్టి పొయిలో నిప్పులార్పును. కర్పూరమంజరి యాకొకఁటి కనుకొన ముఁగనఁబడఁ జొచ్చెను. తనవెనుక నామెనడచుచున్నట్లు చెప్పును. కర్పూరమంజరియటక మీఁదనున్నదని నిచ్చెననైచుకొని యాటక మీఁదనెక్కును. పెరటిలోనున్న పొదరిండ్లలోను గృహమందలి చీఁకటిభాగములలోను మంచముక్రిందను, బజులుగుట్టలలోను భోషాణమునందును నిలువెత్తునున్న గుండిగలలోను, కర్పూరమంజరి యున్నదని శోధించిచూచును. కర్పూరమంజరి యింట్లు ప్రవేశించినదని చెప్పి కవాటములు బంధించును. నిశ్శబ్దముగానున్న సమయమునను భర్తం బిలిచి "యదిగో కర్పూరమంజరి. వీధిలోనుండి నన్నుఁబిలచుచున్నది. వినఁబడినదా" యని యడుగును. "పిలుచుటలేదు. నీది వట్టిభ్రమ" యని భర్త బదులుచెప్ప "అయ్యో! అంతబిగ్గరగాఁ బిలుచుచున్నప్పుడు మీకు వినఁబడకపోవుచున్నది? ఇదె వట్టిమాట. నాకంటిలో దుమ్ముగొట్టవలెనని మీకీలాగునన్నారు." అని కొఱకొఱమనుచు భర్తం దూలనాడును. ఛీ! నాయింటికి రాకు నాభర్తం బిలచుటకు నీవెవ్వతెవే! వచ్చితివా నీనెత్తురు కంటఁజూచెద. రాచకూఁతురవైనయెడల రా, నేను రాచబిడ్డనే" యని కత్తిచేతఁబూని కర్పూరమంజరి వీధిలోనున్నదాని తలుపులుదెఱచి పరుగెత్తబోవును.

వజ్రపాణి తన నూతనవధూ సమాగమము ప్రయత్నవిరోధముగాఁ బరిణమించినందుకుఁ దద్దయువిచారించి యది స్వయంకృ

తాపరాధమేయని నిశ్చయించి పశ్చాత్తాపమునొందిన గార్యములేకని గ్రహించి యామెను నలుగురుపరిచారికల కప్పగించి తలకు నిమ్మకాయలురుద్ది స్నానముచేయించుచు గదిలోనుండి యావలకురాకుండఁ దలుపులు మూయించుచు నొకవైద్యునింబిలిచి చికిత్సచేయింపఁ జొచ్చెను.

వైద్యుఁడు చేయిచూచుటకురాఁగా "ఛీదుర్మార్గుడా! నీవు కర్పూరమంజరికిఁ దండ్రివటరా నీవు కన్యాదానముచేయుటకు వచ్చితివా?" యని మీఁద నుమ్మివైచెను. పరిచారికల కప్పుడప్పుడు చెంపకాయలు దగులుచువచ్చెను. బిడ్డలు తల్లియవస్థఁజూచి తండ్రిం గౌఁగిలించుకొని యేడ్చిరి. బిడ్డలదైన్యముఁజూచి తండ్రియు బాష్పాకులితలోచనుఁడయ్యెను. లోకైకసుందరిని బెండ్లియాడి భూలోకస్వర్గమనుభవింపఁదలఁచుచుండఁగా భూలోకనరకమనుభవింపవలసి వచ్చినదే యని యతఁ డింతింతయనరాని చింతచే నుక్కిరిబిక్కిరిచుండెను.

వలవంతలు వంతలుగా మాఱుట యత్యద్భుతముగదా! మనుజుఁడు తలఁచినదొక్కటి. దైవముగావించినదొక్కటి యనుసామెత వజ్రపాణియెడల నిజమయ్యెను. మానవుఁడాకాశమున మేడలు గట్టయత్నించును. స్వర్గమర్త్యపాతాళముల కేక సూత్రము పన్నును. కాని యఘటనఘటనాసమర్థుఁడును, సర్వశక్తుఁడును సర్వనియామకుండును నైనపరమేశ్వరుఁడు తఱచుగా వారితలంపుల భగ్నము చేయుచుండును.

పదునేడవ ప్రకరణము.

"మల్లికా! ఏమియుపాయమే నీవెంతో చతురమతివని సఖీజనము చెప్పుకొనును. జనకుఁడు నన్ను నజరిపాణికిచ్చుటకుఁ గృతనిశ్చయుఁడైనాఁడు. పట్టినమకరందుని చెట్టఁ బట్టవలె; లేదా నావంటి దైవోపహతలకుఁ బ్రాణసఖియైన మృత్యుదేవతను గాఢాలింగనముఁ జేసికొనవలెను. ఇంతియేగాని మఱియొక పురుషుని కేలువట్టనోపను. అతఁడు నవమన్మథుఁడేగాని, మర్త్యలోకమునకు దిగివచ్చిన జయంతుఁడుగాని, పురుషాకృతి దాల్చిన వసంతుఁడుగాని, యా మదనునింగన్నతండ్రిగాని యెవఁడైన నాకక్కఱలేదు. ఆతనిం గలియు టెట్లు? ఎక్కడయుజ్జయినీ పట్టణము! ఎక్కడశ్రీనగరము! ఎన్నివందల యామడలదూరమున్నదే! మనశబ్దము నపుంసకలింగమని పాణిని, శాకల్యుఁడు మొదలగు వైయ్యాకరణులు వచించిరి. కాని యది నపుంసకలింగము గాదు. నపుంసకములకు సంచలన మెక్కడిదే! నపుంసకమైనయెడల నిమేషమాత్రమున నిన్నివందల యామడ ప్రయాణము జేసి మహానుభావుఁడైన మకరందుని కడకెట్లు పోఁగలదే! 'ప్రమాదోధీమతామపి' యన్నట్లు మహామేధావంతులగు వైయాకరణులుగూడ శాస్త్రరచనలలోఁ బొరపడియుందురు. నామనస్సు నిజముగా నపుంసకమైన నేనెంతసంతోషింతునే! నపుంసకములైన కాళ్ళవలెఁ దీఁగలవలె నిదియొకచోటఁ బడియుండిన నెంతబాగుండునే? దీని కీసంచలన మెక్కడినుండి కలిగినదే? ఇంతవేగ మెక్కడినుండి వచ్చినదే? ఒక్కనిముసమైన నాదగ్గఱనుండదేమే! నేనన్న దీనికింత గిట్టకున్నదేమే! ఇది కోఁతివంటిదిగదా! దీనిని బంధించుట కేశృంఖలములు లేవుగదా చతురమతివి నీవట్టి సంకెళ్లనిర్మింపలేవుగదా? నీ తెలివి తెల్లవాఱినట్లే యున్నది. నాకుఁబనికివచ్చు నుపాయమేదియు నీకడలేదు ఓసీ! ఆ

మహానుభావుని పాణిగ్రహణభాగ్యము చేకూడినను జేకూడక పోయినను చిఱునవ్వు వెన్నెలలు గ్రక్కు నాతని ముఖచంద్రమండలము నొక్కసారి చూపవే. ఈ మహోపకారమునకు నీఋణమెన్నఁడైనఁ దీర్చుకొనం దునే. ఆహాహా! ఏమే యాముఖలావణ్యము. ఏమే యాకర్ణాంతములైన యాసోగకన్నులతీరు ఏమే యామీసకల సిరికి నివాసమైన తెలిదామరపువ్వులనెవ్వఁడుచేసెనో యాకన్నుల నాతఁడే చేసెను. శరత్కాలచంద్రమండల మెవ్వఁడు నిర్మించెనో యాతని మొగము నాతఁడే నిర్మించెను. బంగార మెవ్వఁడు సృజియించెనో వానినెమ్మేను నాతఁడే సృజియించెను. వెన్నెల నెవ్వఁడు గావించెనో యామందహాసముల నాతఁడే గావించెను. చందమామలోని లావణ్యము వసంతుని మార్దవము పచ్చవిల్తుని చక్కఁదనము మూఁడును మూఁడుపాళ్ళువైచి చతురాస్యుఁడు తన పురుషసృష్టి సార్థకమగునట్లు వీని జేసి యుండును. చెలీ! అట్టిపురుషుని సందర్శించుటెట్లు? ఒక్కసారియతని జూచి యీమేను విడువవలెనని యున్నది. ఏల యిట్టిపని యందువా విను. అతఁడతి దూరమునందుండుటచేతను నావంటి కన్నియలు పెక్కండ్రు వాని కిచ్ఛామాత్రమున సులభముగా లభింపఁ గలుగుట చేతను నతనికాలి గోటికయినఁ బరిచర్య సేయుటకు నేను తగియుండక పోవుటచేతను నతని దాసీజనంబులోనైనఁ జేరి యాతని యూడిగము సేయ నేఁదలపెట్టినను నాజనకుఁడు నన్ను విడిచిపెట్టక పోవుటచేతను నాకాతని చరణంబు దుర్లభమనియు మరణంబ శరణంబనియు నిశ్చయించుకొంటిని. కాని యాతనిఁ జూచి ప్రాణంబు విడువవలఁతు. ఆహాహా! పులుఁగు లెంతయదృష్టవంతులే. ఱెక్కలకలిమిచే నవి యెక్కడికరుగదలంచిన నవి యక్కడికరిగిపోవునుగదా. విమానసంచారముచేయు దేవతాంగన లెంతయదృష్టవంతులే. ఎవడైన నొక్కజోగి మనకడకువచ్చి ప్రవరాఖ్యునకుంబలె మనకు నొక్కపాదలేపనమిచ్చిన దాని

ప్రభావమున మన మొకసారి యుజ్జయినికి ఱెప్పపాటు కాలమునఁబోయి యతని దర్శించి నమస్కరించి రాఁగలుగుదుముగదా! మందభాగ్యలకు మనకట్టి యదృష్టము పట్టునా? పోనీ! నిరాశ జెందుదమన్న మేన నసురులున్నంతవఱ కాశాబంధము తెగదు. అసువులతోడనే యాశలు నశించును. స్వతంత్రించిపోవుదమన్న పనికిమాలిన యీరాచ కొలమునఁబుట్టితిమిగదా! అడవులలో యథేచ్ఛముగా సంచరించు చెంచు కన్నియలు తొలిమేనులు నేమిమేలునోములు నోచిరే! ఈ పాడురాచ కులమునఁ బుట్టిన కతమున మావంటి కన్నియల సూర్యంపశ్యలై చీఁకటిలువోలె మేడలలో మిద్దెలలో నడఁగియుండవలయును. జంతువులకు స్వేచ్ఛయున్నది. పక్షులకు స్వేచ్ఛయున్నది. కీటకములకు స్వేచ్ఛయున్నది. సరీసృపములకు స్వేచ్ఛయున్నది. కాని చైతన్యముగలిగి జ్ఞానసంపత్తిగలిగి మెలఁగు నెలంతులకు స్వాతంత్ర్యమన్నది లేదు. 'న స్త్రీస్వాతంత్ర్యమర్హతి' యని మనువుచేసిన శాసనమెట్లు లోకమునఁ బ్రవర్తిల్లుచున్నదే! ఈశాసన మెన్నటికయిన మాసిపోవునే! సఖీ! నాకోరికలిసుక పాతరవలెఁ దఱుగకున్నవి. ఎన్నో చెప్పితినని నీకు విసుగుగలుగుచున్నదిగాఁబోలు చెప్పినవి చెప్పఁగా నిఁక చెప్పినన్ని యున్నవి. ఎన్ని దినములు చెప్పినను దఱుగవు. చెప్పుటకు మాటలుచాలవు. వాల్మీకిగాని వేదవ్యాసుఁడుగాని వేదవ్యాసుని యబ్బగాని మనసులోనున్న యూహాల సరియైన మాటలలోఁ దెలిపి సంపూర్ణ భావప్రకటనము చేయఁగలఁడే. అది కవికే గాదు రవికైన సాధ్యముగాదు. అట్టిచో నేనెట్లు నీకు నచ్చఁ జెప్పఁ గలను? అదియునుఁగాక వలవంతయొక్క తీవ్రపు వేఁడిమి వలవంతయను చిచ్చునఁబడి మాడెడువారికేగాని పెఱవారికిం దెలియదు కన్నియవైనను నీపుణ్యమున నీకట్టియలమట కలుగదయ్యె మల్లికా! తల్లి కడనైనఁ జెప్పనోల్లని గుట్టుమట్టులు నీకడఁ జెప్పకొంటి తల్లి కని పెమ్మట మీ కప్పగించినది. కావున నీవు తల్లికన్న నెక్కుడు

దానవు. అందుచే నాయుత్తలికము తఱుఁగునట్లు తగిన తెఱంగు నీవచేయ వలయు. అట్టియదృష్టము నాకబ్బునా?" అనికన్నదోయి నీటికతమున మంచుఁగ్రమ్మిన కెందామరతేకుల చందంబున నలర నామె విచారాక్రాంతయై యటమీఁదఁ బలుకలేక యూరకుండెను. మల్లిక తన చెఱంగుతో నామెకన్నీరు తుడిచి "సఖీ! నేఁడు నీ కడుపులోనున్న దెల్ల వెళ్ళఁబుచ్చితివి. మనస్సును గలఁచునట్టి విషయములు వమనములవలె బైకివచ్చినేని మానిసికి సుఖమగుచుండును. దుఃఖములు మిత్రులతోఁ జెప్పికొన్నఁ గొంతవఱకుపశమించును. చెలికాండ్రతోఁ జెప్పికొన్నపక్షమున నానందమతిశయించును. కావున నీకుఁ గొంత హృదయభారము తగ్గిపోవును. ధైర్యము దెచ్చుకొనుము. విచారములవల్లఁ గార్యములుగావు. ధైర్యకవచముఁ బూనిన వారిని గష్టములు బాధింపఁజాలవు. నాచేతనైన సాయము నేఁ జేసెద. ఏమి చేయుదునాయని విచారించుచున్నాను. ఉపాయము తోఁచకున్నది." యని బదులు చెప్పెను.

"ఓసీ! నా విచారము కొంత తగ్గింపఁదలఁచుచున్నావు. నాహృదయమిందుకేని జాలకపడలేదు. నామనోవ్యథ తగ్గలేదు. అతని కటాక్ష వీక్షణములు ప్రసరింపవలె. నామనస్సు చల్లఁబడవలె. నీవంటి బుద్ధిమంతురాలి కొరకు నుపాయమైనఁ బొడఁగట్టకపోవుట నాదురదృష్టము. అయిన వ్యథముగానాలోచింపుము నేను నాతమ్ముఁడు విజయసేనుఁడట్లు మగపుట్టువు పుట్టక కట్టిఁడి యాఁడుపుట్టువు పుట్టిన కతమున నట్టి బెట్టిదంబులు వాటిల్లె. సఖీ! స్త్రీ జన్మమెత్తఁ గూడదే. అందులో రాచకన్నియయై పుట్టఁగిట్టదు. పేదవారింటనైపుట్టి యిచ్చవచ్చిన మగని చెట్టబట్టి సుఖింపనైతినిగదా" యని కర్పూరమంజరి పలుకుచుండ మల్లికయందుకొని "నెచ్చెలీ! నీ కష్టములు వినుచున్నచో పేదలకష్టములు పేదలకుండును. సకలసౌఖ్యము

లుండి స్వాతంత్ర్యములేక నీవు విచారించుచున్నావు. స్వాతంత్ర్యముండియే సౌఖ్యములేక కడలేనికష్టములంబడు కటికిపేదలయవస్థ వర్ణింపఁదరమా? జలచరములస్థితి స్థలచరములకు రాదు. జలస్థలచరముల స్థితి ఖచరములగు పక్షులకు రాదు. సుఖమున్నచోట దుఃఖము తప్పక యుండును. క్రీనీడ దీపమువెనుకనే యుండును. ఛాయ సూర్యుననుసరించియేయుండును. పేదదానవైనంతమాత్రమున దుఃఖపడవు. భాగ్యవంతురాలయినంతమాత్రమునఁ గష్టపడవు. ప్రస్తుతస్థితినిబట్టి యిట్లనుకొందువు. దానికేమి! అతనితోనిక సమాగమము దుర్లభమని నాయనువిషయమునుగూర్చి విచారించుచున్నాను. పోనీ! తెలుపుము. విదర్భ రాజనందనయగు రుక్మిణి తనమనోరథసిద్ధికై వాసుదేవునికడకు బ్రాహ్మణుని దూతగాఁబంపినట్లు మనముకూడ నెవ్వరినైన సుకరందు కడకంపుదమా?" యనిపలికెను.

"పంపవచ్చును గాని మనము సంపూర్ణముగా విశ్వసింపఁదగిన బ్రాహ్మణుఁడు మనకెవ్వఁడు దొరకును! రుక్మిణీదేవికున్న స్వాతంత్ర్యము మనకుఁగలదా? పోతుటీఁగయైన మనయింటఁ జొరరాదు. ఎట్లో సూర్యచంద్రులుమాత్రము మనయావరణలోఁ బ్రవేశించుచున్నారు. మనకట్టిపురుషుని దర్శనమెట్లగును! మాతండ్రి యిటలేనప్పుడు నీవెవ్వరినైనఁ దోడ్కొనివచ్చుటకయిన వీలులేకుండ మనకిట్టు హిమాలయపర్వతమువలె మనకడ్డముగనున్నాఁడు. ఇతనివైఖరిఁజూచి మాతండ్రికేవో దురాలోచనలు చెప్పుచున్నట్లు తోచును. ఇతనివలన మనకుఁగొంతయపకారము జరుగుచున్నదని నాయభిప్రాయము. ఎట్లైనను బ్రాహ్మణసందేశము వలనుపడదు. మఱియొక యుపాయము నన్వేషింపుము." అని యామె బదులుచెప్పెను.

"పోనీ యెవరినిబంపుమని యెదవు?" అని మల్లికయడిగెను. చెలీ! యెవ్వరిబంపుమని నేనుచెప్పగలను. వెళ్లెడువారికి ధైర్యముం

డవలె, పలుకున నేర్చవలసినపాత్రములుగలవు. దాఁటవలసిన యేళ్ళు గలవు. ఎక్కవలసిన కొండలుగలవు. తొలఁగవలసిన మృగములుగలవు. ఎదిరించి [illegible] దొంగలు దారులు గాచియుందురు. వారి బారి పడకుండ తప్పించుకొనవలయును. ఎదిరి నెఱజాణతనముండవలయును. [illegible] — అను పరిస్థితులకడకుఁ బోవునప్పుడు సమయాసమయము తెలిసికొనవలయును. [illegible] కోపహేతువుగావచ్చును. [illegible] ప్రయత్నము నిష్ఫలమగును. [illegible] మాటనేర్పుండవలయును. సమయోచిత [illegible] బుద్ధికలవారు ప్రపంచమున మిక్కిలి తక్కువగాఁగలరు. [illegible] మనసు నొవ్వకుండ వారికిష్టులగువారి [illegible] కార్యంబు సాధించుకొనునట్టి నేర్పరితనము [illegible] గలవు. ఇట్టిగుణములుగలవారు మనకెట్లు లభింతురు? [illegible] నట్టిగుణసంపద నా చెలికత్తెయొద్ద [illegible] ముగము సఁదోఁపఁ గర్పూరమంజరి పలుకక మల్లిక "సఖీ! నే నాయిట్టిపనికిఁ జాలినదానను. ఇది పురుషులకు సాధ్యము [illegible]. ఆఁడదానికలవియగునే! ఇట్టి సాహసంబున కొకట్టుటకు నెంతవలంతినే! కొండ లెక్కఁగలనా? ఏఱులు దాటఁగలనా? మొకముల బారిబడకుండ తప్పించుకొనఁగలనా? ముష్కరములగు తస్కరుల చేతఁబడకుండ దాటిపోఁగలనా? ఏ బాటసారులగుంపునయినఁ గలసిపోయి సుఖప్రయాణము చేయఁగలననుకొనుము. ఉజ్జయిని జేరుదుననుకొనుము. ఆయుధపాణులచే సురక్షితమైన రాచనగరు బ్రవేశింపఁగలనా? [illegible] రాజు [illegible] మగునా? అగుననుకొనుము. [illegible] ఒకవేళనాదరించి మాటలాడుననుకొనుము. నెంతజాణతనముగలిగి పూర్వోత్తరవిరోధము లేకుండ సందర్భశుద్ధిచెడకుండ నాతని మనసు నొవ్వకుండఁ గార్యముపొసఁగునట్లు మా

టలాడగలనా! ఇది నాకుఁదగనిబగవు. నాకు శక్యముకాని కార్యము. నాకనుచితమైనకర్మము. కావున నింకొక్కని నియోగింపుము" అని యుత్తరమిచ్చి తనయసామర్థ్యమును జెప్పుకొనియెను.

"సఖీ! నీవేమిట్లన్న గాక్యసాహసము లెట్లు? పోనీ! ప్రయత్న ముడుగుదమన్న నాపాపిణ మానసము తాళఁజాలకున్నదిగాని యున్నది. నిరాశయను గాలి యింతగఁ దగిలిన నా ప్రాణములు కొట్టుకొని పోవుచున్నవి. అతనిచేత నేను నిరాకరింపఁబడిన యీ దుర్దశ. అనుదినమున నేమూలనున్న నేనుఁ జేయు ప్రయత్నము నిష్ఫలమగును. పోనీ, యీమహారాజ కుమారుని వంటి గుణశాలి నన్ను రక్షింపఁడు దునన్న నట్టిసాహస విక్రమాదు లేడి? అట్టి రాధేయుఁడేఁడీ? అట్టిపండితారాధ్యుఁడెవ్వఁడు? అట్టి రసికశిఖామణి యేఁడీ? అట్టి సౌందర్యము లోకమందెవ్వరిదేమి! నక్షత్రములయందుఁ జంద్రునివలె; రత్నములలో వజ్రమట్లు చుక్కలలోఁ జంద్రుఁడట్లు పువ్వులలోఁ గమలము వలెనే యట్లు, మృగములలో సింహమట్లు, నాకందఱిలో నతఁడే సాటి లేనివాఁడై దండిమగలకు దండిమగఁడై, సద్గుణ సంపన్నుఁడై, రాజరాజై శోభిల్లుచున్నాఁడు. ఇట్లనుటచే నితఁడు రాజకుమారుఁడని నీవు తలంపకుము. అట్లుచేయుట నాసంకల్పమునకు విరుద్ధమైన మకరందుని గుణవర్ణనము యథార్థముగ నేఁజేయుచుంటిని. అట్టివాని నొట్టఁబట్టనిచో నీజన్మమేల? వానిఁ బట్టుకొన్నచో, అడవిలోనే వెన్నెలవలె మన జన్మ డవిలోనే వేలను రాలి చిచ్చికి మంటిలోఁ గలిసినట్లు నాబిడ్డయునైన అజవ్వనము నాచక్కఁదనము మంటిపాలు గావలసినది. కావున నను చిరకాలస్నేహముఁదలంచియైన, నాయందలి దయచేతనైన సహజమైన నీసౌజన్యాతిశయమువలననైన నాపనుపు నేయుము. సత్కార్యసిద్ధికొఱకుఁ బోవుచుంటి గావున నీకేయాపదలు రావు.' అని గడ్డము పట్టి బ్రతిమాలుకొనెను.

"చెలీ? నన్ను బ్రతిమాలనక్కఱలేదమ్మా. ఈమేను మీఁది నేను తినుచున్నన్నము మీఁది, నాకట్టుబట్ట మీఁది. ఈశరీరము మీ యిచ్చవచ్చినట్లు చేసికొనవచ్చును. ఒకవేళ మధ్యమార్గమున నేనే బెబ్బులినోటనైనఁ బడి మృతినొందినను నేను విచారింపను. ఏలయన దానియాఁకలిదీర్చినదాన నగుదును. ఏహానిలేకుండ సుఖముగ జేరితినా ప్రియసఖి కార్యము జేసినదాన నగుదును. ఎట్లయిన నీపనుపు జేసి నాతనువు ధన్యము జేసికొనియెద. కాని, మీతండ్రితోఁ జెప్పి యిల్లు గదలవలయు. ఏవంకబెట్టి మాయనకడ సెలవు పుచ్చుకొందును. నాతల్లిదండ్రులు మూఁడుగాళ్లముదుసలులయిరి. వారు రమ్మనినాకు వర్తమాన మంపిరి. తప్పక చేపోవలెనని చెప్పిపోయెద ననియుంగరము నాకిమ్ము. ఆయన కానవాలు జూపెదను. నీవేదైన లేఖ యిచ్చెదవా? అట్లయిన వ్రాసి యిమ్ము. ఏమి చెప్పుమనెదవో చెప్పుము. ఈ రేయి మీ యయ్యకడ సెలవుగైకొని తెలవాఱఁ బైలుదేఱిపోయెద. మీనాయనగారు నన్నొంటిగఁ బోనియ్యరు. నమ్మఁదగిన యిద్దఱు రక్షకులను నా వెంట నంపుదురు. సరే ఆనల్లమందుతాతకు నాలుగు గంజాయాకులిచ్చితినా కునికిపాట్లు బడుచు దారిలో నేచెట్టుకిందనో కూర్చుండును అప్పుడు జేపరమేశా యని దాఁటుదును. ఇంక శాంతింపవమ్మా!" యని యామెచిత్తమూఱడిల్లునట్లు మల్లిక పలికెను.

కర్పూరమంజరి ముఖారవిందము వికసించెను. నేత్రములు విశాలములయ్యెను. చిఱునవ్వు మొగమున నలంకరించెను. శరీరమందంతట నుత్సాహరసము వ్యాపించెను. ఆనందము పట్టజాలక యామె మల్లికను గౌఁగలించుకొని "సఖీజనమనఁగా సుఖదుఃఖసమానమైనజనము. నానిమిత్తమున నీప్రాణములనైన విడువఁదలఁచితివిగదా! నీఋణము వేయిజన్మములకైనను నేను దీర్పఁగలనా?" యని వెండియు నిట్లనియె.

"ఓసీ! ఏమిచెప్పుమని నీతోఁ జెప్పుదును. అదిచెప్పు మిది

చెప్పు మని నేఁజెప్పఁజాలను. చెప్పవలసిన దంతయుఁ జెప్పుము. నా యలమట యంతయుఁజెప్పుము. నీవుచూచినదంతయుఁ జెప్పుము. చెప్పఁగూడనిదంతయు విడిచిపెట్టుము. సమయోచితముగాఁజెప్పుము. మిక్కిలి దీనముగాఁజెప్పిన లోకువవగును. ఎక్కువబెట్టుసరిగాఁజెప్పినఁ గార్యము చెడును. కార్యశకటమును నడిమిత్రోవ నడిపింపవలయును. పరులతో సంభాషించునప్పుడు వానిం జేరకుము. విసుగుగానున్నప్పుడు పలుకరింపకుము. విచారాక్రాంతుఁడైనప్పుడు నీసోదెచెప్పకుము. ఒంటిగానున్నప్పుడు చిత్తముప్రసన్నమైయున్నప్పుడు మొగముకళ కలలాడుచున్నప్పుడు దీర్ఘాలోచనాపరతంత్రుఁడు కానప్పుడు మెల్లగఁ జేరవిన్నవింపుము. నాశరీరమాయనదె యనుము. నాప్రాణమాయనదే యనుము. నామనస్సాయనదె యనుము. నాహృదయమాయనదె యనుము. నాజీవితమతనియాధీనమనుము. పరమేశ్వరుని నమ్ముకొని ప్రయాణము సేయుము. అంతటఁగార్యసిద్ధికగతిలాభములకము. ఇదిగో! నాయుంగరముతీసికొమ్ము. ఇదియాతనికిచ్చిరమ్ము. ఆయనయేదేని మరలనిచ్చినఁ గనులనద్దుకొందుననుము. పొమ్ము శుభమగుగాక !"

ఆరేఖమల్లిక చిత్రభానునితో మాతాపితృసందర్శనార్థము పోవుదునని చెప్పి యాయన నొడఁబఱిచి మఱునాఁడు పఱువాత వృద్ధ కంచుకియైనజంబుకుని చిత్రభానునియాజ్ఞాప్రకారము వెంటఁబెట్టుకొని బైలుదేఱెను.

రెండుదినములుగడచెను. మూఁడవనాఁడు తెల్లవాఱుజామున వీథిగుమ్మముకడ నేడుపువినఁబడెను. అప్పుడే మేలకువవచ్చిన సేవకులు తలుపుదెఱచి యదియేమోయనిచూచునప్పటికి వెక్కివెక్కి యేడ్చుచు జంబుకుఁడునిలిచెను. వారువానినట్లోలోపలికిఁదెచ్చిరి. నాఁకటిలో నరుగుమీఁదఁగూర్చుండి వాఁడువెక్కివెక్కి యేడువఁజొచ్చెను. సేవకులుకలవరముపడిరి. అదివినియింటివారందఱు లేచిరి. వానిని లోపలికి

దోడ్కొనిరమ్మని చిత్రభానుఁడాజ్ఞాపింప సేవకులట్లుచేసిరి. ఆదుఃఖమునకుఁ గారణమేమని చిత్రభానుఁడు, రుద్రభట్టు, వానినెన్నివిధములనడిగినను వాఁడు వారిపలుకులువినిపించుకొనక "అయ్యో! అయ్యో! నాతల్లీ! నాతల్లీ!" యని బొమ్మమోఁదుకొని యేడువఁ జొచ్చెనేగాని యుత్తరమీయఁజాలకపోయెను. చిత్రభానుఁడుచీవాట్లు పెట్టెను. సేవకులేడువవద్దని బ్రతిమాలిరి. ఎట్టకేలకు వాఁడిట్లుబదులు చెప్పెను.

"ఏమిచెప్పుదునుతండ్రీ! శైలుదేఱిననాఁటిరాత్రియే నేనును మల్లికయు నొకసత్రపుటరుగుమీఁదఁ బండుకొనఁగా దగ్గఱయడవిలో నుండి పెద్దపులి వచ్చి దానిని లాగుకొనిపోయెను. నేను దుడ్డుకఱ్ఱ పుచ్చుకొనితఱిమికొట్టితినిగాని యదిమల్లికనువిడువక పాఱిపోయెను. ముసలిముండకొడుకును నన్నైనఁదీసికొనిపోయినదికాదు. దుంపలాటి బిడ్డనుదీసికొనిపోయినది" అనిపెద్దపెట్టుననేడ్చెను.

సేవకులాశ్చర్యపడిరి. కర్పూరమంజరి వగపుచే నేలఁజదికిలఁబడెను. చిత్రభానుఁడు కటకటాయనెను. చంద్రికయు నిందుమణియు గర్పూరమంజరిని లోనికిందీసికొనిపోయి పానుపుజేర్చిరి.

ఆమెకిప్పుడు రెండువిచారములుపట్టెను. ప్రాణమిత్రమైన మల్లికమరణమొందుటయొకటి తనసందేశముమకరందునకందకపోవుట మఱియొకటి. ఇవియొకదానికంటె నొకటిబలవత్తరమయినవిషాదకారణములు. మధ్యాహ్నము జంబుకునిబిలిచి యామె జంబుకా నిజముచెప్పు చెప్పు మల్లికను బెబ్బులియీడ్చికొనిపోవుచుండ నీవు చూచితివా?" యనిగుచ్చిగుచ్చియడిగెను. "అమ్మా! మీపాదములసాక్షి. పెద్దపులిలాగుకొనిపోవుచుండఁగా నేనుకన్నులారఁజూచితిని" అనివాఁడుబదులుచెప్పెను. అన్నివిధముల దైవముతన్ను బాధచేసెనని కర్పూరమంజరిదుఃఖపరవశయై రెండవసఖియైనచంద్రికతో నట్టెటో కాలక్షేపము చేయుచుండెను.

పదునేనిమిదవ ప్రకరణము.



మణివర్మనియుక్తుఁడై మాధవసేనుఁడు రాచనగరునకరిగి కంచుకిచేతఁ దనరాక నరవిందాదేవి కెఱిఁగించి యామెయాజ్ఞాప్రకారము లోని కరిగి యథోచితసత్కారముల నంది సుఖాసీనుఁడై మణివర్మ చెప్పినట్లు చిత్రభానుఁడు సేనానివేశమునఁ జేసినచర్యలెల్ల వినిపించెను. అది వినఁగానే యామెగుండె జల్లుమనెను. రాజకుటుంబమునకు మూఁడఁదలఁచినయాపద యామెయెట్టయెదుటఁ గనఁబడెను. ప్రక్కనున్న విక్రమసేనునిం జూచి యాదేవి విచారసూచకమగు హీనస్వరముతో నిట్లనియె. "నాయనా! కాశ్మీరరాజ్యవృక్షమునకుఁ బురుగులు పట్టినవి. ఈకీటకములు తరువును నిర్మూలముచేసినంగాని విడువవు. దొంగయు మనుష్యుఁడేయనుసామెతనుబట్టిమనకు హితులెవ్వరోయహితులెవ్వరో తెలిసికొనఁజాలకున్నాము. ఎవరినినమ్మవచ్చునో యెవరినినమ్మఁగూడదో మనమెఱుఁగము. ఇదిచూడ నాకొక్కశ్లోకము జ్ఞాపకమువచ్చుచున్నది. చిన్ననాట మాతండ్రి మహేంద్రదేవుఁడు నాకు విద్దెగఱపుటకై తర్కవాచస్పతియని బిరుదు బొందినజయదేవుఁడను పండితుని నియమించెను. ఆయనప్రస్తావవశమున నొకనాఁడీశ్లోకముఁజదివి నాకర్థము చెప్పెను. అదిమిక్కిలిరసవంతమగుటచే నేనుదానినివల్లించితిని. క్రొత్తకుండ మీఁద జేసిన సంస్కారమట్లులేతమనస్సు మీఁదఁబడినభావములు మఱపునకురాక యాజీవితాంతముండును గనుక నాకిప్పటికి నది జ్ఞాపకమే.

శ్లో. అగ్రే వ్యాధః కరధృతధనుః పార్శ్వయోర్జ్వాలమాలాః
పృష్ఠే వహ్నిర్దహతి విపినం సన్నిధౌ సారమేయాః
ఏణీ గర్భా దలసగమనా బాలికాః పాదలగ్నాః
లక్ష్మీనాథ! త్వ మసి శరణం కిం కరోమి క్వ యామి.

"కుమారా! దీనిభావమిది. 'ఒకమగలేడిదురవస్థలోనుండి యిట్లు విచారించినదఁట. ఎట్టయెదుటఁ జేతవిల్లుబూని కిరాతుఁడు నిలిచి యున్నాఁడు. కావున ముందుకుఁ బాఱిపోవుటకు వీలులేదు. వెనుకకుఁ బాఱిపోవుదమన్న వెనుకప్రక్క భయంకరమై కాఱుచిచ్చు వనముం గాల్చుచున్నది. ప్రక్కలకుఁ బఱుగెత్తుదమన్నఁ గిరాతుఁడు వలలు పన్నియున్నాఁడు. సమీపమందు వేఁటకుక్కలు సిద్ధముగానున్నవి. ఆఁడులేడి చూలుదాల్చియున్నది. పరుగెత్తఁదలఁచుకొన్నను వీలు లేదు. పైఁగా బిడ్డలుకాళ్ళకడ్డముగాఁదగులుచున్నవి. ఓలక్ష్మీనాధా నీవేశరణము. నేనేమిచేయుదును. ఎక్కడికిఁబోవుదును.'

మనయవస్థయు నట్లేయున్నది. మంత్రులనమ్ముదమన్న వారు సింధుగాంధారరాజులకు వశులై కానుకలకై మనరాజ్యమును మనలను విక్రయింపఁదలచుకొన్నారు. సేనాపతులు సేనను శత్రుభానునికి వశము చేయఁదలఁచుకొన్నారు. శత్రుభానుఁడు సోదరునిం గడతేర్చినట్లే నన్నును సోదరపుత్రులను మాపుమాపఁదలఁచుచున్నాఁడు. నాయనా! మీరుచిన్నవాండ్రు. లోకానుభవము లేనివాండ్రు. నేనో కోటదాఁటి వెళ్ళుటకు వీలులేని యాఁడుదానను. దీనజనమందారుఁడై దేవతా శిరోమణియై సకలలోకరక్షకుఁడై వెలయుచున్న శ్రీమన్నా రాయణుఁడే మనల రక్షింపవలయు. అగతికులకుఁ గతియు ననాధులకు నాధుఁడు నైనజగన్నాథుఁడు నాఁడు విరటుపుత్రికకడుపులోనున్న పరీక్షితుని సురక్షితుఁ జేసినట్లు మిమ్ముఁ గాచుగాక! మనుష్యయత్న మనునడ్డుగట్లు భగవదిచ్ఛ యనుప్రవాహమును వారింపఁ జాలవు." అని నిష్ఠురముగాను దయనీయముగాను సంభాషించుచున్న దేవినుద్దేశించి మాధవసేనుఁడు వినయముగ నిట్లనియె—

"తల్లీ! నేనును మణివర్మయు రాజకుటుంబమునెడ నమితవిశ్వాసముగలిగి చేతులుగట్టికొని మీపనులు చేయుటకు సిద్ధముగనున్నను.

మాయెడ మీకు లేశమైన నమ్మకము లేదు. మేము మీవిశ్వాసమునకు వెలియైయున్నాము. చండాలురకుం దొలంగు బ్రాహ్మణులట్లు కుష్ఠరోగులకుం దొలంగు సుశరీరులట్లు దుర్గంధమునకు దూరముగఁ బోవు మానవులట్లు మీరు మమ్ముఁ బరిత్యజించుచున్నారు. చిత్రభానుని దుస్తంత్రము లనియెడు పెద్దయేలువచ్చి మిట్టపల్లముల నేకము జేసినవి. అందుచే నేది మెఱకయో యేది పల్లమో తెలియక మీకు జలమంతయు మేటిమొనళ్ళతో నిండిన యపారమగు ప్రదేశమని భయమందుచున్నారు. మాయెట్లు [illegible] [illegible] మా పూర్వచారిత్రములు మీకడ [illegible] [illegible] గావు. మేమేమి చేయుదుము? మా [illegible] దేశము [illegible] మట్లు మీకు రుచింపదయ్యె. ఇప్పటికిని మేము మీ [illegible] బద్ధులము. మీప్రియకింకరులము. మీకు [illegible]. [illegible] మీయిష్టవచ్చిన కార్యములు చేయుచుండుము. అట్టి [illegible] మీరట్లు తూలనాడినను మాకింకను [illegible] మీకడ [illegible]. అతండు చిత్రభానునకు మీకుఁ గూడ విరోధము [illegible] చేయుచున్నాఁడు. గదాధర శూలపాణులు మీకుఁ బరమ [illegible] రాజభక్తులు. మీ [illegible] రాజభక్తులు [illegible] [illegible] పగతులతోఁ జేసుదురేమోగాని [illegible] మేయున్నారు. మీద మీచిత్తము."

అని మాధవసేనుఁడు తనవిశ్వాసమును దృఢముగాఁ దెల్పుటయు విక్రమసేనుఁడు తల్లికిట్లనియె. "అమ్మా! నీకు నేఁజెప్పఁదగినవాఁడనుగాను. అయినను నాపలుకులు సరిగా విచారింపుము. మాధవసేనునిమాటలు నాకు నచ్చినవి. సైన్యములు పరాధీనములగుచుండుటచేతఁ గార్యభారము యమాత్యులమీఁదఁ బెట్టి మీతండ్రియైన మహేంద్రదేవుని కడకును మాతండ్రికి పరమమిత్రమైన సుద

ర్శనుని కడకును సాహాయ్యము నిమిత్తము సందేశములంపుట మంచి ది. నాబుద్ధికింజూడ మాధవసేనుఁడే యిప్పనికిఁ దగినవాఁడు. మీఁద నీయిష్టము" అనుటయు నరవిందాదేవి కొంతసేపు మనంబున నాలో చించి "కుమారా! నీవు రాజవు. శాస్త్రజ్ఞానము గలవాఁడవు. చక్క గానాలోచించి యేదికర్తవ్యమో చేయుము. నాబుద్ధి కేదారియుఁ బొ డకట్టుటలేదు. మనకందఱుఁ బగతురేయగుటచేత మనమానప్రాణ ములు చిత్రభానునిచేతఁ గోల్పోవుటకంటెఁ జిరపరిచితులైన మణివర్మ మాధవసేనులచేతనే గోల్పోవుట యుక్తము. కావున గోత్రకటికవాని నేనమ్మినట్లు వీరినే నమ్ముకొనియుందము. మణివర్మతో మంతనముండి మాధవసేనుఁడే సుదర్శనునికడకు మాతండ్రికడకు సందేశము గొం పోవుఁగాక!" అని పలికెను.

అనవుడు మాధవసేనుఁడు చింతిల్లుచు "తల్లీ! మేమెన్నివిధ ముల మొఱవెట్టుకొనుచున్నను మీరింకనుమమ్ము చిత్రభాను ప్రము ఖులతో సమానులుగాఁ జేయుచున్నారు. కాని కాలక్రమమున మా ప్రవర్తనమే మాపలుకులకు వ్యాఖ్యానమగుఁగాక! నేను మణివర్మ తో నాలోచించి మహేంద్రదేవునికడకు సుదర్శనునికడకు సందే శముగొనిపోయి సాధ్యమైనంత వేగముగా వారిని సేనలతోఁ గూడఁ దోడ్కొనివచ్చెద. మహేంద్రదేవునకు సుదర్శనునకును మీరుజాబులు వ్రాసి సిద్ధముగ నుంచుఁడు. నేనుమణివర్మతోఁ జెప్పి రేపె పయనము జేసెద. నాకు సెలవొసంగుఁడు." అని పలికి వారి యనుమతి వడసి పోయెను. అతఁడు చన్నపిదప నరవిందాదేవి కుమారునిఁజూచి "నా యనా! నాతండ్రికి వ్రాయవలసినజాబు నేనేవ్రాసెద. సుదర్శనుఁడు పరపురుషుఁడగుటచే నేనాతనిపేర నేమియువ్రాయనొల్ల. ఆజాబునీవ లిఖింపుము" అనిచెప్పి తనగదిలోనికరిగి జనకునిపేర జాబువ్రాయఁ దొడగెను. విక్రమసేనుఁడు తనజాబువ్రాసి తల్లికిట్లు వినిపించెను.

“శ్రీమన్మాళవమహీపాలు రగు స్వస్తిశ్రీ సుదర్శన మహారాజుగారికి—కాశ్మీరపాలకుఁ డగు విక్రమసేనుఁడు వినయపూర్వకముగా నమస్కరించి చేసిన విజ్ఞాపనము.

నాకు మీపరిచయభాగ్యము లేకపోయినను మాజనకుఁడు హేమచంద్ర మహారాజుగారును మీరును వారణాసీ నగరమున సబ్రహ్మచారులై సహాధ్యాయులై ప్రాణమిత్రులై యుండినందున నేను మీకుఁ బుత్రప్రాయుఁడననియు మీరునాకు జనక ప్రాయులనియు భావించి చనవుగల్పించుకొని యీలేఖవ్రాసి పంపుకొంటిని. ఈలేఖం దెచ్చినయతఁడు మాకమాత్యుఁడు. మాధవసేనుఁడు సింధుగాంధిర వల్లభులు మాదేశముపై దాడివెడలుదురని లోకమునఁ బ్రవాదము గలిగినది అదియటుండ మాపినతండ్రి చిత్రభానుఁడు మజ్జనకునిచే దేశభ్రష్టుఁడు గావింపఁ బడియు నతని మరణానంతరమున శ్రీనగరముఁజొచ్చి చన్న యన్న మీఁదను నిందున్న యన్నబిడ్డలమీఁదను నెంతో ప్రేమ నభినయించి సేనల సేనాపతులఁ దనవశముజేసికొని యేదో ద్రోహము సేయఁదలఁచుచున్నాఁడు. మాతండ్రిగారి దారుణమరణముఁ దలంచియు బాలుఁడను నిస్సహాయుఁడను నైన నాదీనస్థితిఁ దలఁచియుఁ బగతురబారినుండియు నాప్తుఁడట్లు మేఁకవన్నె పులియైయున్న మాపినతండ్రి బారినుండియు మమ్ముఁ దప్పించి కాశ్మీరరాజ్య పరిరక్షణము సేయఁ బ్రార్థించుచున్నాఁడను. హేమచంద్రమహారాజు బ్రతికియున్నవాఁడని మీరుభావింపుఁడు ‘మిత్ర మాపది జానీయా’ త్తను న్యాయమునులెన్నగా గమనింపుఁడు. ఆర్తరక్షణపరాయణులు, దయాసాగరులు, పరోపకార ధురంధరులు, నిష్కళంకచరిత్రులు, మత్పితృసఖులు నగు మీకు నేనింతకన్న విస్తరించి వ్రాయనక్కఱలేదు. ఈయమా

త్వుఁడే తక్కిన విషయము లన్నిఁటిని మీకుం దెలుపఁగలఁడు. వేయేల! కాశ్మీరరాజ్య ప్రభువునకు రమణీయ మాళవకాశ్మీరంబులక్కచెల్లెండ్రట్ల సుఖించుచుండునని కోరెదను.

ఇట్లు విన్నవించు విధేయుఁడు,

విక్రమసేనుఁడు

ఆజాబు నా [illegible] గొంతెత్తి వినుపింప విని సంతసించి యరవిందాదేవి తన ప్రాణసఖియగు మిత్రుఁడు లిఖించిన జాబును ముసలికంచుకి ... కాశ్మీరవర్మకడకంపెను. అతఁడది చూచి మాధవసేనునకు బదులువ్రాసి పంపెను.

పందొమ్మిదవ ప్రకరణము.

ఒకానొక సంవత్సరమున వర్షించినట్లు నాఁటి రేయి గాఢచీఁకటులు నలుల మేఘములు నల్లపూసలు బూసినట్లు గగనమునిండి కాటుకవానలు గురిసినట్లు నలుదెసలవ్యాపించి దుష్టుఁడగు యజమానునికిఁ జేసిన సేవయుంబోలె సృష్టి నిష్ఫలముగునట్లు చేసెను. శ్రీనగరమంతయు నిద్రామోహితమై నిస్తరంగసముద్రమట్లుండెను. పగలెల్ల బహువ్యాపారపరతంత్రులై శ్రమపడియుండుటం జేసి నగరవాసులలో దాదాపుగ నందఱు గాఢనిద్రంబడి విశ్రాంతిసుఖ మనుభవించుచుండిరి. పరస్త్రీవ్యామోహార్తులు పరకాంతాసక్తులు మొదలగు దుర్వినీతులుమాత్రము గృహంబులువిడి యెఱనిమిత్తము సంచరించుదుష్టమృగంబులవలె భయపడుచు రాచబాటలువిడిచి సందుగొందులంబడి

ముసుఁగులువైచికొని వలయుసాధనసామగ్రిం గ్రహించి తమనీడలు చూచి తామెశంకించుచుఁ దమదుర్వ్యాకయునవె లోకమెల్లనిండిన యాగాఢాంధకారమున సంచరించుచుండిరి. ఆకాశలక్ష్మి తనవేయి కన్నులుదెఱచి నేలపై జరుగుచున్నదంతయుఁ గనిపెట్టుచున్నదోయను నట్లు నభోమండలమున లెక్కలేని చుక్కలు మిణుకుమిణుకుమని మెఱయఁజొచ్చెను. నూతనపురుషులు మున్నెన్నఁడు జొఱని సందులలోఁజొచ్చిన ఆవుల మోరలెత్తి కుక్కలుమొఱుగఁజొచ్చెను. నగర రక్షణమునిమిత్తము నియోగింపఁబడిన రాజభటులు కొంతసేపు తిరిగి యేయరుఁగుమీఁదనో యేకాంతముగానున్న నిద్రాదేవికి విధేయులై యారాధనము చేయుచుండిరి. తెఱపిలేనిదరిద్రపుబాధ పడురోగులమూల్గులు నిలువనీడలేక వీథులలో [illegible] పాంథులగుఱ్ఱులు చెట్లమీఁదనుండు [illegible] పైనఁజెప్పినకుక్కలమొఱుగులుదప్పఁ బట్టణమున నిశ్శబ్దభంగమేదియు లేదు.

సేనానివేశమున మాత్రము రేయి మిక్కిలిసందడి గలిగియుండెను. సైనికులు తమతమ యాయుధంబులు ధరించి సమరసన్నద్ధులై మహోత్సాహభరితులై యుండిరి. దండపాణియు, వజ్రపాణియుఁ గవచంబులుదొడిగి శిరస్త్రాణంబులుధరించి యాయుధహస్తులై డాలు కత్తులు, విండ్లు నమ్ములు మొదలగు నాయుధవిశేషంబులఁ బూని సైనికులలో ముఖ్యులగువారితో వారువారు చేయవలసినకృత్యంబులనుపదేశించుచుండిరి. సైనికులలోఁ గొందఱు దండపాణిం గలసి యీసన్నాహమెందుకని ప్రశ్నింపనాతఁడు "ఈసన్నాహము మన రాజకుటుంబరక్షణార్థమే గాంధారరాజపరిజనులు మాఱువేసములు వైచుకొని మనపట్టణంబున సంచరించుచున్నారు. వారింబట్టుకలయు అందునిమిత్తమై యాయుధహస్తులగు వేయిమంది జోదులము మేము తోడ్కొనిపోవుచున్నాము" అనిబదులు చెప్పెను.

"అట్టివారింబట్టుటకు వేయిమందిచాలుదురుగదా! తక్కిన సైనికులనందఱ సిద్ధముగనుండవలయునని యేలచెప్పవలయు?" నని వారుమరలనడిగిరి. అందుకు దండపాణి యిట్లనియె. "మీరు సైనికులు మేము సేనాపతులము. మే మాయుధములు పూనుమన్న మీరు పూనవలసినదె. ఎవరితలఁగొట్టుమన్న వారితలఁగొట్టవలసినదె. ఎక్కడికిఁ బొమ్మన్న నక్కడికిఁబోవలసినదె. ఏమిసేయుమన్న నది సేయవలసినదె ప్రశ్నలువేయుటకు మీకధికారములేదు ప్రియసమరసన్నాహముచేసి దండనాయకులుయుద్ధమునడిపించుచున్నపుడు ప్రతిసైనికుఁడు నిలువంబడి యెక్కడికి? ఈదండయాత్రయెందుకు? ఇది న్యాయము మరియన్యాయమని వితర్కమారంభించినపక్షమున రాజ్యతంత్రమెక్కడి ముసముజరుగునా? సమరముజరుగునా? జయములభించునా? ఎవరిధర్మము వారు చేయవలయును. రాజాజ్ఞ మేము మన్నింపవలె. మాయాజ్ఞ మీరు మన్నింపవలె. ఇట్టిప్రశ్నలెవరైనఁ జేసిరేని వట్టి వారిశిరస్సులు వెంటనేఖండింపఁబడును" అని దండపాణి కఠినముగా బలికెను. ఆయుత్తరముతో వారు ప్రశ్నలుమానిరి. అప్పుడు దండపాణి సైనికులనందఱ భాగులుగానిలువఁబెట్టి వారితో నిట్లనియె "ఈసమయమున రణదుందుభులు వాయింపఁగూడదు. నాయాజ్ఞలేక మీరు కేకలువేయఁగూడదు. ఒండొరులతో మాటలాడఁగూడదు. నడచునప్పుడు కాలిచప్పుడు గాఁగూడదు. నేనుముందు నడచెదను నావెంటనే గోవువెంటఁదగిలిపోవు దూడవలె మీరురావలయును నేనెవ్వరియింటి దగ్గఱ నిలిచెదనో మీరచ్చటనిలువవలయును. నేనెవ్వరిబంధింపుమన్న వారిని బంధింపవలయును. నిష్ఫలమైనప్రశ్నలడుగఁగూడదు. దీపములు చేతఁబట్టఁగూడదు. అయిదుగురు రొక్కొక్కగుంపుగా నిలువవలె. వారికి [illegible] వేయిమందియు రెండువందలు చిన్నబారులుగాఁదీరి నడువవలయు. ఈనిబంధన

లన్నియు మనంబునఁ బెట్టుకొని నా వెంటరండు." అని సేనాపతియాన తీయ సైనికులప్పుడే మొదలు లేచి యొక్కొక్క బారుగాఁ జేరి యొకరి వెనుక నొకరు నిలువఁబడిరి. మొట్టమొదట దండపాణి యశ్వారూఢుఁడై నడువ జొచ్చెను. వజ్రపాణి సేనవెనుక గుఱ్ఱమెక్కి రాఁజొచ్చెను. నిశ్శబ్దముగా మనుష్యవాహిని ప్రవహించుచున్నట్లు చిన్నసేన నడచి పట్టణముఁ జేరెను.

రెండుజాములు రాత్రి యయ్యెను. పట్టణద్వారముకడ నాజానేయతురంగమెక్కి సకలశస్త్రాస్త్రములు ధరించి యాయుధపాణి యైన యొకమహాయోధుఁడు వారిం గలిసికొనెను. వాని కిరుప్రక్కల పట్టుకత్తులతో నలుగురు జోదు లంగరక్షకులుగా నుండిరి. గాఢాంధకారమగుటచే సైనికులాతని నెవరో తెలిసికొనలేకపోయిరి. కాని దండపాణి తన గుఱ్ఱము నాతని గుఱ్ఱము సమీపమునకు దీసికొనిపోయి మెల్లగా "సంకేతసమయమునకు వచ్చితివా" యని ప్రశ్నించెను. ఇంతకుమున్నె వచ్చితినని యాతఁడు బదులు చెప్పెను. "మున్ను మనము యనుకొన్నట్లు వారిం బట్టుకొనవలసిన దేనా?" యని దండపాణి యడిగెను. "ఆహా! సందియ మేమి! అదే ప్రథమ కర్తవ్యము. తరువాత పిలువఁబట్టి రెండవపని" యని యాతఁడు ప్రత్యుత్తరమిచ్చెను.

ఈసంభాషణము గుఱ్ఱములమీఁదనె వారు చేసిరి. సైన్యము నిశ్శబ్దముగా వెనుకవచ్చుచుండెను. వారు క్రమముగా రాజవీథిం బ్రవేశించి యటనుండి కొన్ని ప్రక్కవీథులం దాఁటి విశాలమైన యావరణము నయ్యావరణములో రమణీయమై యొప్పారుచున్న యుద్యానము నయ్యుద్యానమధ్యమున మనోహరమైన సౌధము గలయొకస్థలముఁ జేరిరి. సింహద్వారము బంధింపఁబడియుండెను. గోడ యెత్తుగ నుండెను. దండపాణి నలుగురుజోదులం బిలిచి "యీ గోడ దాఁటి లోపలికి దుమికి తలుపు దీయుఁ"డని యాజ్ఞాపించెను. వెంటనే యొకయోధుఁడు కూర్చుండెను.

వానిభుజములపై నింకొకయోధుఁడెక్కెను. అంతట మొదటివాఁడు లేవఁగా వానిభుజములపై నారోహణముచేసిన సైనికుఁడు గోడమీఁదికెక్కి యాగోడ చేరియున్న చెట్టెక్కి మెల్లగా నావరణములోనికి దిగెను. అట్లె యిద్దఱుమువ్వురు చేసి లోపలఁబ్రవేశించి మొదటివానికిఁదోడై కవాటముఁ దెఱచిరి.

దండపాణి నాలుగుదిక్కుల నావరణమునం బ్రవేశింపుమని తక్కినవారికిఁ జెప్పి యన్నిదెసలఁ గావలియుంచి యింటిలోనుండి యీఁగయైనఁ బ్రాకారముదాఁటిపోకుండఁ జూడుమని యానతిచ్చెను. సైనికులు కట్టుదిట్టముగా నట్లుచేసిరి.

లోపలి గృహద్వారములకు సూక్ష్మాగ్రములుగల యినుపబొగడలు వేయఁబడియుండెను. గ్రంథులనుసుమ నినుపరేకులు తాపటముచేయఁబడెను. భుజములతోఁ గంటెనఁ దలుపులూడి రావని దండపాణి యుపదేశముమీఁద నిరువురు సైనికులు గొడ్డండ్లుదీసికొని తలుపులు పగులఁగొట్ట నారంభించిరి. చప్పుడువిని యింటిలోనందఱు మేల్కొనిరి. ఎవరువారని యింటిలోనుండి యొకవృద్ధుఁడు గంభీరముగఁ గేకవైచెను. మేడక్రిందనున్న వారందఱు దొంగలుదొంగలని యాక్రందనముఁ జేసిరి. చుట్టుప్రక్కలనున్నవారు కొందఱాచప్పుడును గృహములోనున్నవారి యాక్రందనమును నాలకించి వీధిలోనికి రాఁబోయిరి. కాని సైనికులు వారిని సందుదాటి రాకుండఁ జేసిరి. తలుపులంతలోఁ బగిలిపోయెను.

దండపాణి, వజ్రపాణి, చిత్రభానుఁడు లోపలఁబ్రవేశించిరి. గృహదీపికలు వెలుఁగుచుండుటచేత వానిసాయమున వారు మేడమీఁదికిఁ గొందఱు సైనికులఁ దీసికొనిపోవ సమకట్టిరి. మేడతలుపులుగూడ బంధింపఁబడెను. గృహమునందున్న స్త్రీలు బాలురు సేవకులు దొంగ

లు దొంగలని గృహమునంతయుఁ బ్రతిధ్వనులిచ్చు నట్లాక్రందనము జేయుచుండిరి. మేడతలుపులుగూడ గొడ్డలి పెట్టులవలన భేదింపఁబ డెను. మున్ను పేర్కొనఁబడిన ముప్పురునాయకులు కొంతమంది సైనికులం దీసికొని మేడమీఁదికరిగిరి. మేడమీఁద విశాలమయిన చావడిలో దొంగలనెదిరింపవలెనని చేతఖడ్గములుబూని నిలువంబడి యున్న వృద్ధుని మణివర్మనుజూచి చిత్రభానుఁడు "సైనికులారా! వీనిచేతిలోనిఖడ్గము లాగుకొని చెక్కలు విఱచికట్టుఁడు" అని యా జ్ఞాపించెను.

అప్పలుకులతని నోటనుండి వెలువడినవో లేవో వెంటనే యొ కసేవకుఁడు ఖడ్గమూడఁదీసికొనెను. మఱియిద్దఱు మాంసహీనములై శల్యచర్మావశిష్టములయిన యాతనిచెక్కలంబట్టుకొని వెనుకకుఁదీసి మోటుత్రాళ్ళతో విఱిచికట్టిరి. మణివర్మ వారింజూచినతోడనే విస్మి తుఁడై మొదటమాటలాడలేకపోయెను. తరువాతనిందుకతో టుప్రాటు లోనుండి వెలువడి మాటలాడఁ గమకించుచుండఁగనే నోటమాటరాక మును పే యాదారుణకృత్యముజరిగెను. "మీరావచ్చినవారు? అర్ధరా త్రమున నిల్లుజొచ్చుటచేతను గొడ్డళ్ళతో దలుపులు బగులఁగొట్టుటచేత ను నేను దొంగలనుకొన్నాను. దొంగలు ధనము హరింతురు. మీరు ప్రాణధనముహరింప వచ్చినారు. చిత్రభానుఁడువచ్చి యిట్టిదుండగ ముసేయుటలో నాశ్చర్యములేదు. కాని దండపాణీ! ఆవిధమున దేవి గారియొద్దను నాయొద్దను నీవును సీతమ్మఁడును రాజభక్తి నభినయించి మీకపకార మెన్నఁడుసేయనివాని నేదోషమెఱుంగనివాని-బిత్రువి హీనుని-విక్రమసేనుని ద్రోహభావమున విడిచి యీతనిఁజేరుట మి మ్మొ మొదటినుండియు నెంతోగౌరవమునఁ జూచి మహోన్నత ప దవిలోనికిఁ దెచ్చిన నన్ను-శతవృద్ధుని బద్ధునిఁ జేయుట మహాశ్చర్య ముగొల్పుచున్నది. పూవుదండయనుకొన్నది పాముయినది. ఇంద్ర

నీలము మసిబొగ్గయినది. మీకు గొప్పచేసిన రాజద్రోహమునకు మీ యన్నదమ్ములు [illegible] లోకములు రెంటనుగూడఁ దగినఫలం బనుభవింతురు." అని సుదేష్ణ [illegible] కోపావేశమున నెఱ్ఱబాఱిన మొగము తోఁ దడబడు [illegible] దడముతగిలి యావృద్ధామాత్యు [illegible] యిట్లనెను.

ఓరీ, దురాత్మా! స్వామిద్రోహీ! [illegible] కాదు. వృద్ధ జంబుకమా! విక్రమసేనునివంటి [illegible] ద్రోహముచేసిన [illegible] ఇట్టియటకు నీకు నోరెట్లాడెరా? [illegible] లేదా? సిగ్గు లేదా? మహానుభావుఁడైన [illegible] మోసములుపన్ని చంపించి విక్రమసేనుని [illegible] డవు నీవు. మొదటి నుండియు నాకును [illegible] గలిగించి వైరానలము వృద్ధినొందించి [illegible] నడపించినపాపాత్ముఁడవు నీవు. విక్రమసేనుండు [illegible] రాజ్యమంతయు నేకచ్ఛత్రముగ [illegible] ధనము [illegible] దోఁచుకొని కుబేరుఁడవగుచున్న [illegible] డవు నీవు. సింధుగాంధార మహీధవులను [illegible] దేశము [illegible] యాహ్వానించి [illegible] గ్రహించి దేశమును - దేశ [illegible] రాజకుటుంబమును మాకుల గౌరవమును వారికి విక్రయింప [illegible] నీచాత్ముఁడవు నీవే. పామువలె మాయ [illegible] యుంచి [illegible] కాతనిఁ దునుమబెట్టించిన పాతకుఁడవు నీవే. [illegible] మన ప్రాణముఁ గోలుపోయెను. రాజ్యము [illegible] బడ్డ [illegible] యాయన బలవన్మరణమునొంద [illegible] లెక్కగింపుచుంటివి. మాయన్న బిడ్డలను భార్యను [illegible] నవిటకు వచ్చియుండ నన్నూరువిడిచి పొమ్మని యాజ్ఞాపించు యమాత్యశేఖరుఁడవు నీవేగావా? నన్ను బో

మ్మనుటకు నీ వెవ్వఁడవు? ఈరాజ్యము నీయబ్బసొమ్మా? నీతాతసొమ్మా! నాయన్న రాజ్యము. నాతండ్రి రాజ్యము. మాయన్న చెవులలో విసము వోసి నాఁడు నన్ను వెడలఁగొట్టించి నేఁడు ను నట్టియాటలే యాడఁజూచితివి. నీయాట లంతనేఁడుసమయము వచ్చినది. నీమర్మచరిత్రము వెల్లడియగు కాలము వచ్చినది. నీమలినవర్తనపుగోడకు నేఁటిదనుక మాయన్న యనువెల్లవేచి జగద్వంచనముఁ జేసితివి. ఇప్పు డేమిచేసెదవు! కాశ్మీరరాజ్య ప్రధానమంత్రుల భుజములు విఱిచి కట్టఁబడిన దేమి? మీస్వాతంత్ర్యము లిప్పుడు సాఁగవేమి! ఇప్పుడయిన బుద్ధిగలిగి బ్రతుకుము." అని యతఁ డూరకుండ దండపాణి "అయ్యా మావారి యైశ్వర్యముగా నున్నదా? మేమువిక్రమసేనుని మోసపుచ్చితిమా? ఇంకను మహైశ్వర్యము జూచెదవుగాక నీకన్న మేమెక్కువ వంచకులముగాము. నీవు గావించినద్రోహములకన్న మేమెక్కువ ద్రోహములు చేయఁజాలము. నీవు ద్రోహముల పుట్టవు. నీపితామహుల గొప్పతనము దూషింపనవసరములేదు. నీచేసిన యపచారములకిన్నిటికి ఫలముగా భగవంతుఁడే పాట్లుదెచ్చె" నని యతఁడు తన్ను మొట్టనాడినమాటల కుత్తరమిచ్చెను.

అప్పుడు మహేన్ద్రసింగము పండ్లూడిపోవుటంజేసి కొంతబోసిగానున్న నోటనుండి కొన్నిమాటలు తెలియకుండునట్లు వారికిట్లనియె "చిత్రభానుఁడా! పిల్లి కన్నులుమూసికొని పాలుద్రావి తన్నెవ్వరుఁ జూడలేదని సంతసించును. అట్లు నీకావించిన మహాపాతకములు లోకు లెఱుఁగరని నీవు భ్రమించి పరమపవిత్రుఁడట్లు నిష్కళంకవర్తనుడట్లు నిరపరాధులగు నితరులపై దోషారోపణముఁ జేయుచుంటివి. నీ వర్తనము చక్కఁగా నరసియే నీయన్న నీవు పాముకన్నఁ దేళ్లుకన్నఁ బెబ్బులికన్నఁ గ్రూరుఁడవని నిన్ను దేశభ్రష్టునిఁ జేసెను. నీ సంచారములన్నియు వక్రములు. నీపలుకు లన్నియు ననృతములు. నీ

చైనము లన్నియు దురాచారములు. నీది హృదయము గాదు. రాతిముక్క.. నీ కంతఃకరణము లేదు. దయలేదు. దాక్షిణ్యములేదు. ఎగ్గులేదు. సిగ్గులేదు. ఆశాదేవత నిన్నావహించినది. భ్రాతృహంతవు ఏకగర్భజనితుండైన సోదరుని జంపించిన మహాపాతకునకు ఆనెత్తురు కూడు భుజించి సుఖింపఁదలఁచిన పరమదుర్మార్గునకు-జగద్వంచనమే ప్రధానవ్యాపారముగాఁగలఖలునకు నీకుఁ గ్రుడ్డివానికిఁ బట్టపగలుగూడ నంధకారమయమై తోఁచునట్లు, మావంటి రాజభక్తులు, మావంటి ధర్మమార్గానుచరులు, మావంటి నిరపరాధులు, దురాచారులుగాఁ గనఁబడుటలో నాశ్చర్యమేమున్నది? నీవు మీయన్నగారి దారపుత్రుల బరామర్శించుటకు రాలేదు. ఆపసికూనలం గూడఁ గడతేర్చి యీగద్దియ నాక్రమింపఁ దలఁచివచ్చితివి. ఆయభిప్రాయముతోనె మేదో మొఱబెట్టి యీదండనాథుల వశముఁజేసి కొంటివి. ఈసేన స్వాయత్తము జేసికొంటివి. ఈమూర్ఖులు నీమాయలలోఁబడిరి. సింధుగాంధారరాజుల దండయాత్రా కథలు నీకల్పించిన ప్రబంధములు. అవియెల్ల నీదు స్తంత్రములు. ఈవంకబెట్టి వీరిం జంకఁ బెట్టుకొంటివి హతవిధి హేమచంద్రునకు, వానికుటుంబమునకుఁ బ్రతికూలుఁడై యుండుటంజేసి నీయాగడములు సాఁగుచున్నవి. పరమేశ్వరుఁడొక్కడున్నపక్షమున- నతఁడు దయాళుఁడైన పక్షమున-శిష్టజనసంరక్షణంబును, దుష్టజనశిక్షణంబును వానికి నైజములైనపక్షమున--ధర్మమనున దీప్రపంచమున నున్న పక్షమున—"సత్యమేవ జయతేనానృతమ్మ"నువేదవాక్యములు సత్యములైనపక్షమున వేదశాస్త్రంబులుపరిభావంతములైన పక్షమున నేఁడుగాకున్న మఱియొకనాఁడయిన నీవొనర్చిన మహాపాతకములకుఁ బ్రతిఫలముగా నీవు భగ్నమనోరథుఁడవై సర్వవిదములు జెడినీచమరణంబు నొందకపోవు. నీచేసిన దుశ్చేష్టలు వ్రాయజాలక చిత్రగుప్తుఁడు సైతము నీయంతముఁ గోరుచుండును. నీనిమిత్త

పై యమధర్మరాజు క్రొత్తనరకము నిర్మింపవలెను. విక్రమసేనుని గర్భము చెడఁ బుట్టితివి. కాశ్మీరరాజ కుటుంబమునకుఁ గళంకముఁ దెచ్చితివి. హరిశ్చంద్రుఁడు, రామచంద్రుఁడు భీష్ముఁడు, యుధిష్ఠిరుఁడు రఘువు, రంతిదేవుఁడు మొదలగు మహాత్ములైన రాజశ్రేష్ఠులకు జన్మకారణమైన క్షత్రియ వంశము నీవలన మలినమై యపవిత్రమైనది. చల్లని చంద్రుఁడు పొడమిన పాలసంద్రమునందు హాలాహలము పుట్టినట్లు ధర్మస్వరూపుఁడు హేమచంద్రుఁడు పొడమిన వంశమునఁ బరమనీచుఁడవు పరమపాతకుఁడవు నీవు సంభవించితివి. నీవెన్ని ధర్మపన్నములు జెప్పిన నమ్మువాఁడఁగాను. నీయందింకనైన నాకు గౌరవముగాని భయముగాని లేదు. నీబంట్లు నాకించుకేనియు నెగ్గుసేయఁగాలేరు." అని యంతతో నాఁగక మఱిపెక్కు వెంగేయు సూక్తవచనంబులఁ బలుకఁ బోవుచుండ నొక సేవకుఁడు "స్వామీ! వీని ధిక్కారముత్తరింతునా? సెలవయిన వీనితలతాటికాయవలె మీయడుగులకడఁ బడవేయుదు. దేవరవారికి వీనియందు నింతశాంతమేందు" కని ఖడ్గపాణియై ముందడుగు వచ్చెను. చిత్రభానుఁడు వానిని వారించి ఓయీ నీభక్తికి సంతసించితిని. బంటువైన నీకున్న భక్తిలో సహస్రాంశము పాపకర్మునకున్న పక్షమున మా రాజ్యమింతటి కేలవచ్చును? కాని వీనిని వీనితప్పును చంపవద్దు. ఈచాటుచావు వీనికింతగను. బహిరంగ ప్రదేశమున జెట్టునకుఁగట్టి యురితీసి మహాపాపుని దినములుచేఁబెట్టఁగిన వీనిమాంసము కాకులు గ్రద్దలు దినునట్లు చేసి కళేబరము నడవి భూమిలోఁ బడవేయవలెను. కావున వీనినిప్పటికి రక్షించితి" నని బంటు నావలకుఁ ద్రోసివైచెను.

"ఓహో! నన్నిప్పటికి నీవు రక్షించితివా! దయాళుఁడవు గావున మహోపకారముఁ జేసితివి. నేను మరణమునకు భీతిల్లువాఁడను గాను. నీవంటిపందలు మరణమునకు వెఱతురు గాని, నేను వెఱువ.

నేను వృద్ధుఁడను. రేపో నేఁడో చావవలసిన వాఁడను. నీచేత జచ్చినను నేదో తెగులుచేతఁ జచ్చినను నాకొక్కటే. పరమేశ్వరుఁడు ప్రపంచమున మానవ వినాశముకొఱకుఁ గొన్ని తావుల మహామారకములయిన తెవుళ్ళను, మఱికొన్ని తావుల నీవంటి దురాత్ములను సృజించుచుండును. రోగములును మీవంటివారును సన్నిహితజ్ఞాతులు. జగద్వినాశనమునకై జనియించుచుందురు. నేను మరణించినను జీవించినంత కాలము విశ్వాసముతో స్వామికార్య నిర్వహణ ధురీణుఁడనగుటచేతను, మనోమాలిన్యము లేక నడచుటచేతను, పరవంచనావిముఖుఁడనగుటచేతను, నాకుత్తమగతులు ప్రాపించునని నమ్మికగలదు. జన్మాంతర మొందినను నేను మరల నరజన్మమే పొందుదును. ఇంక నీవు మృతినొందితివేని మహానరకములలో స్త్రీహంతలు శిశుహంతలు గురుహంతలు మాతాపితృభ్రాతృహంతలు మొదలగు మహాపాతకులు పోవు దుర్గతులకుఁ బోవుదువు. ఒకవేళ జన్మాంతర మొందినను, నుత్తమమగు మానవజన్మమెత్తక పాము పెద్దపులి మొదలగు ఘాతుకమృగ జన్మమో లేక, హేయమైన కీటకజన్మమో నీవెత్తుదువు. మరణాంతరమున నాకళేబరమును నీవెక్కడ బాఱవైచినను నాకువిచారము లేదు. నా మాంసము పక్షులు తిని యాకలిదీర్చికొనుటచేఁ "పరోపకారార్థమిదం శరీర' మన్నమాట యొక్కింత సార్థకమైన దని నేను సంతసింతును. శరీరము భగవానుఁడైన యగ్నిదేవున కాహుతి యైనను మంటిపాలైనను, విహంగముల కాహారమైనను, నా మనంబునకు విచారంబు గలుగదు. విగత ప్రాణమయిన వెనుక వట్టి కట్టెవంటి యీ దేహ మేమైన నేమి? అది నీ నైచ్యమునే తెలియఁ జేయును. నీ దౌర్జన్యమునే ప్రకటించును. నీ ఘాతుకవృత్తినే వెల్లడించు. నీ క్రౌర్యమునే చాటును. అది నేచూడఁబోను.' అని మణివర్మ నిశ్చయముగా నిశ్చలమనస్సుతోఁ బత్రిభానుని దూలనాడెను."

"ఓహో! నేను వందను. నీవు వంతివాఁడవు. నీకు భయము లేదు. నిజమే! ఇదియొక్కటియే నీనోట వెడలినసత్యము. నీకు దేవుని భయము లేదు. పాపభయము లేదు. లోకాపవాదభయము లేదు. నీవంటివారికే యుత్తమగతులు పచ్చివపక్షము జారులకుత్తమగతులు చోరుల కుత్తమగతులు, రాజద్రోహుల కుత్తమగతులు, నీవు జేరుదువేని యవియుత్తమగతులన్న నేను గోల్పోవుదును. నీపేదరితనమే మెఱుఁగుదుముగాని నీవు ధనమెందు దాఁచితివో చెప్పుము. కాశ్మీరరాజ్యమంతయు దోఁచుకొని నీ యిల్లు నిధినిక్షేపములతోఁ నింపితివని వినుచున్నాము. అవియెల్లనిక్కడ గ్రక్కుము.' అనిచిత్రభానుఁడు వాక్రుచ్చెను.

"నేను ధనము సంపాదించినమాటకల్ల. మానధనము నాకడఁగలదు. యశోధనము కొంతకలదు. ధర్మసాధనమే నా ధనము. ఇంతకన్న నాదగ్గఱ ధనములేదు' అని మణివర్మ చెప్పెను.

ఆహా! నీకుమానధనములు యశోధనములుగూడగలవా? భూమిమీఁదనవతరించిన దంభుఁడవే నీవు. ఈయాత్మస్తుతి కేమిగాని ధనమెక్కడనున్నదో చూపుము. చూపవేని నీగ్రుడ్లు దీయించెద. నీనెత్తురుకుక్కలు నాకునట్లు గజ్జముల గొట్టి కశలతోఁ జీమలచింతకు నిన్నుఁ గట్టించి కొట్టించెద ఓరీ! జోదులారా! గుడ్డ లాముదములో ముంచి వీనిచేతులకుం గాళ్ళకుం జుట్టినిప్పంటించుఁడు. అవికాగడాలవలె వెలుఁగవలయు. అప్పుడుగాని వీఁడుధనము దాఁచినచాటుచోటులు జూపఁడు. నేనన్నంతపని జేయించెద. జాగ్రత్త. నీవువృద్ధుఁడవని బ్రాహ్మణుఁడవనిచూచువాఁడనుగాను. వజ్రపాణీ! మేడదిగి వెళ్లి స్త్రీలశరీరములమీఁద నున్న నగలన్నియుఁ దీసికొనిరమ్ము. తమయంతట తాము నగలనొసగరేని సాహసికులగు నీబంట్లను వారిమీఁది కం

పి యంగనలని సంశయింపక, సర్వాభరణములు దీయింపుము. ఆఁడు వాండ్రను స్పృశించి యవమానించిరని పరపురుషులాడిరని నీయవారిని దండింపుఁడు." అని చిత్రభానుఁడు శాసించెను.

ఆ వృద్ధ సుమంగళి యిట్లనియె. "నీ కావించు పాపముల దండలో నింకను కొన్ని మిగిలియున్నవి. ఇప్పుడు తలపెట్టిన దుష్కార్యములు దండము పూర్తి చేయఁగాను కాఁబోలు! సుభ్రూదీయించి నను నాకు వెట్టితేమి. [illegible] నీవంటి పాపాత్ములను జూడవలసివచ్చెను. బాహ్యదేహములు [illegible] మనోనేత్రముతో ఫాలనేత్రుని జూడుము. [illegible] ఎన్ని దెబ్బలు నీవు నన్నుఁ గశలతోఁ గొట్టించితివో [illegible] నాపక్షమున దండధరుఁడు నీ కిచ్చును. [illegible] నాశరీరము మరణానంతరము [illegible] కావలసినదే. [illegible] మై పక్షమున [illegible]! [illegible] యెంతకైనను తెగించున్న [illegible] నిర్యోగించునని విచారి[illegible]. [illegible] ధర్మమును [illegible] మహాపతివ్రతలగు [illegible] పడియున్న పసిండి [illegible] నిర్విచారముగాఁ గంటఁ [illegible] యబ్బా యనక [illegible] తులుగా [illegible]. అట్టి మావంటి వాండ్ర యబలలే యట్టి సాహసములు [illegible] మగవాఁడవయిన నేను క్షణము సేపు భగవానుని [illegible] త్రిప గాఁగలించుకొనియుండఁజాలనా? "[illegible] బంధ మోక్షయోః" అని యమృతబిందూపనిషత్తు [illegible]. మనుష్యనిబంధమునకుఁగాని మోక్షమునకుఁగాని [illegible]. [illegible] వారికి మున్నిదు మాకాలుబట్టి, గండకత్తెర పుష్పమాల, అగ్నిప్రవేశమా

రామప్రవేశము, మరణము దేశాంతరప్రయాణము. కావున మమ్మునీ బెదిరింపులు వెఱపింపఁజాలవు. అవి చిన్నబిడ్డలకడఁజెప్పుము. నేను మృత్యుదేవతకు సమీపమందున్నవాఁడను. నా శిరోజములుగల యాభయంకరముఖ మీవఱకే నాకగపడుచున్నది. వృద్ధుని జంపినను యప్రతిష్ఠ నీకువచ్చుటకై నీకేదుర్బుద్ధిపుట్టినదిగాని నేనెట్లయిన మరణింపకమానను. నాకడ ధనము మాత్రము లేదు. నీయిచ్చవచ్చినట్లు చేసికొమ్ము. బ్రాహ్మణుఁడని వృద్ధుఁడని శంకలుగాని జాలిగాని నీకుండునని నే నెన్నఁడు దలంపలేదు."

ఈసంభాషణము జరుగుచుండఁగానే వజ్రపాణి సౌధముదిగి దిగువభాగమునకువచ్చి మణివర్మభార్య మొదలగు స్త్రీజనముల నిర్బంధించి సమస్తాభరణములను దీసికొని తెచ్చెను. అంతటఁజిత్రభానుఁడు వీఁడు ధనమున్నతావు చూపుటలేదు. కావున వీనిని కారాగృహపాలుచేయవలయు. అప్పుడిచ్చుటచేయుఁదగును. వీనిం గారాగృహమున బంధింపుఁడు. అచ్చటనే చిత్రవధచేయుదము. వజ్రపాణీ! ఆయాభరణంబులు నీకడనే యుంచుము. మఱికొందఱు జోదులను వెంటనిచ్చి వీనిఁ గారాగృహమునకంపుము. అచ్చట వీనినిబంధించి నిరంతరము పహరాభటులు కావలియుండవలయు" నని యానతియ్య 'నట్లే' యనివజ్రపాణి మొదలగువారలు నలుగురు కొలువుబంట్లబిలిచి మణివర్మఁ దోడ్కొనిపొమ్మని చెప్పెను. వారాతని రమ్మని లాగి తోడ్కొనిపోయిరి.

కాలవశమున వచ్చుసుఖదుఃఖముల ననుభవింపకతీఱదని లోకజ్ఞానసంపన్నుఁడగు మణివర్మ తననివాసగృహమును విడిచి కారాగృహమున కరిగెను. చిత్రభానుఁడు ససైన్యముగా దండనాథయుక్తుండై పిమ్మట మాధవసేను గృహమునకరిగెను. అదియుఁగవాటభేదముఁజేసి ప్రవేశించి చూచునప్పటికయ్యమాత్యుఁడు లేకపోయెను. వానిగృహ

ముంగూడ దోచుకొని పాఱిపిమ్మట కోడికూయువేళకు గదాధరుని యింటికింజని చూచునప్పటికిం దింది యాతనియిల్లు కొల్లవెట్టి పిమ్మట శూలపాణి, ... వానిబంధించి యాతనిగృహముందోచు కొనిరి. అంతలో ... సమయ్యెను.

ముప్పదియవప్రకరణము.

... తాను చిత్రభానుఁడవశేషము ... వెలసివచ్చినందుకు విలపించుచున్నట్లు ... దిక్కులు నలుదెసల నెసం గెను. చిత్రభానునిబారి బడకుండ దన్నుఁగావుమని యామె పరమేశ్వరుని ... కాకులు కావుకావుమని యఱ చెను. ... చిత్రభానునిముఖంబుపగిది భానుమం డలము ... కనంబడెను. రా జ్యాపహారేచ్ఛ ... క్రమక్రమం బుగ ... లయ్యెను. చిత్రభానునిపన్ను గడలు ... వెల్లడియైనట్లు చీఁకటి యంతరించి వెలుఁగుదోఁచెను.

చిత్రభానుని మాజ్ఞాప్రకారము సైనికులు గదాధరశూలపా ణులంగూడఁ జెఱసాలలో బంధించి కార్యకృత్యంబులఁదీర్చికొను టకు నిజనివాసంబులకేగిరి. దండపాణియు వజ్రపాణియు నిర్వర్తిత కార్యకృత్యులై ... సమేతముగ జాముప్రొద్దెక్కునప్పటికి సేనానివేశముఁజేరిరి. ప్రతిబుసేనునియెడ భక్తిగల సైనికు లనేకులు మణిపర్ణునియొక్కయు గదాధరశూలపాణులయొక్కయు బంధనముఁ విని

శోకించిరి. వారల్పసంఖ్యాకులయినను దమ్మునడపించునాయకుఁడున్న పక్షమున మహోత్సాహముతో వెంటచేచని వృద్ధానంతుని సేనాపతులను బంధముక్తులఁ జేయఁదలంచిరిగాని [illegible] సయితము కారాబద్ధులగుటచే సత్కృతిఁ జేయలేక [illegible] హేమచంద్రకుటుంబమునకు విముఖులై యున్నారని తలంచియూరకుండిరి. తక్కినవాండ్రందఱు మనసులో విక్రమసేనునిమీఁద నొకవిధమభిమానమున్నను దమయభిమానము నిప్పుడు [illegible] పక్షముఁ జేకుట లాభకరమని చిత్రభానుని [illegible]. బలహీనుల విడిచి బలవంతులఁ జేకుట లోకులకు నైజమే కదా!

మణివర్మప్రముఖులను జిత్రభానుఁడు జెయిలులో నుంచెనని వారి యిండ్లుకొల్లగొనెనని నగరమంతట వెల్లడియయ్యెను. చిత్రభానుని బిట్టలుకయను పిట్టపిడుగు లింకెవ్వరిపైఁ బడనున్నవోయని పౌరులలో ననేకులు గుండెలు చేతఁబట్టుకొనియుండిరి. విక్రమసేనునికొలువులోనున్న గొప్పయుద్యోగస్థులు చిన్నయుద్యోగస్థులుంగూడ భీతచేతస్కులయిరి. ధనవంతులు చిత్రభానుఁడు తమయిండ్లు గొల్లబెట్టునేమో యనుభయమునఁ దమతమవిత్తంబులు [illegible] భూగర్భంబున నిక్షేపించిరి. ఎక్కడఁజూచినఁ జిత్రభానునిదుండగములే ప్రజలు చెప్పుకొనఁజొచ్చిరి.

ఆవిషయము రాచనగరునందుఁగూడ దెలిసెను. విక్రమసేనుఁడు మిక్కిలి యాశ్చర్యమునొంది తల్లి కావార్త నెఱింగించెను. అరవిందాదేవి పిడుగువంటి యవ్వార్త విని "కటకటా! వృద్ధుఁడైన మణివర్మ కారాబద్ధుడయ్యెనే" యని జాలినొంది గిరిధరాదులుఁగూడ బంధింపబడుటచేఁ దమకు గృహమందున్న పరిచారకులు దప్ప నితరులయిన యాప్తులు నగరమందు లేరని విచారించి యేక్షణమందో తమకుఁ

గూడ నేదో మహాపాయము వాటిల్లునని నిశ్చయించుకొనిరి. మాధవ సేనుడు సుశర్మునకు రాజ్యభారమప్పగించి సాయము గొని తెచ్చు నప్పటికిఁ గార్యము పాడయ్యెననియు మరల రావలసిన యిక్కటులన్నియుఁ దప్పుననియు వారు తలంచుచుండిరి.

అంతలో [illegible] పర్వతములమీఁదికిఁజనిన సైనికసహస్రము వెంటరాఁ జంద్రభానుఁడు [illegible] శత్రుబాణములు తనకేమియుఁ [illegible] కోటను [illegible]. రాత్రి [illegible]. [illegible] పురజనులు భయభ్రాంతులైరి. కొందఱు [illegible] దాఁగికొనిరి. కొందఱు మేడలెక్కి చూచిరి. కొందఱు [illegible] బయటనై పోయిరి. అంతఱు [illegible]. "హా! హేమచంద్రా! [illegible]!" అని కొందఱు వెచ్చనూర్పు విచారించిరి.

అట్లు సేనాసమేతముగఁ జంద్రభానుఁడు కోటకుంజనియె. భయపడి కాపలివాండ్రు [illegible]. ఎవరియాటంకము లేక సత్రముముగ [illegible] చంద్రభానుఁడు ససైన్యముగఁ గొలువుకూటముఁజొచ్చి యందు [illegible]. అంతఃపురమున హాహాకారములు చెలఁగెను. [illegible] భయపడి యున్నకడకు బోయెను. కర్పూరమంజరి [illegible] దేహసౌందర్యము లపైఁబడెను. ఆమె [illegible] నోరు [illegible] లేక గోడకుఁ జేరఁబడి కూర్చుండెను. అంతలోఁ జంద్రభానుఁ డంతఃపుర చారకుని రావించి విక్రమసింహుని [illegible] చూడవలయునని చెప్పెను. ఆ కంచుకియు [illegible] చెప్పెను. అప్పుడు చంద్రభానుఁడు ఖడ్గహస్తుఁడై యంతఃపురముఁబ్రవేశించి విక్ర

మసేనుఁ డెదుర్కొని సన్మానింప లోపలిగది జొచ్చి, యుచితాసనమునఁ గూర్చుండెను. విక్రమసేనహర్షవర్ధనులు వానికిరుప్రక్కల నిలుచఁబడియుండ వారినొకచోఁ గూర్చుండఁబనిచెను. ప్రక్కగదిలో సుగంధాదేవియుండెను. అప్పుడు చిత్రభానుఁడు తనకు నివఁబడునట్లు కుమారులతో నిట్లనియె.

"కుమారా! నేనిప్పుడు సేనాసమేతముగ నీకోటఁజొచ్చితినని నీవు భయంపడనక్కఱలేదు. నేను నీకెట్టి కీడుఁ జేయఁదలంచి రాలేదు. నామనస్సు స్ఫటికమువలె నిష్కళంకమైయున్నది. మీయెడ నాకెట్టి ద్వేషమునులేదు. కాశ్మీరరాజ్యము నీయది. నీవు గాశ్మీర ధరిత్రీభువవు. నీతమ్ముఁడు హర్షవర్ధనుఁడు యువరాజు. నీవు రాజవైనను [illegible] నుమతిలేక నీసేనాపతులను నీదళములను వశముచేసికొని నే [illegible] రేయి గొన్ని సాహసంబులుచేసి నేఁడు మహాసాహసంబున సేనాసమేతముగ నీకోటకువచ్చుటకుఁ గారణంబేమియని నీవె [illegible] బాలుఁడవగుటచే భయమున నీవనుకొన్నను నట్టిదని [illegible] భావించి దానికుత్తరము నేజెప్పవలసినవాఁడ. కాశ్మీరరాజ్యమును జూడ నెండలకో కన్నెఱ్ఱగానున్నది. గాంధారసుంధరాధిపుఁడు నీపై దండువెడలఁదలఁచియున్నాఁడు. చతురంగబలసన్నాహము జరుగుచున్నది. ఈవలకే యాతఁడు బయలుదేరియుండును. [illegible]నుండి సింధునాయకుఁడగు పరంతపుఁడు బెబ్బులి మేకపైఁ గవియునట్లు మనవిషయంబుపై నుఱుకఁదలఁచుచున్నాఁడు. [illegible] పరంతపుఁడనుటకు సందియములేదు. భాగ్యవర్ధనుఁడు మన దేశము జయించి నిజభాగ్యవర్ధనుఁడగును. ఆవరపాలురిద్దఱు [illegible] మనసేనాపతులలో గొందఱిని వశవర్తులుగాఁ జేసికొనుచున్నారు. మనప్రధానామాత్యుఁడు మణివర్మయు, ద్వితీయ[illegible]వసేనుఁడును బరమనీచులై యాత్మలాభపరాయణులై [illegible]

దేశమును బరరాజులకు విక్రయింపఁదలఁచుచున్నారు. దానికిందగిన సాక్ష్యము నాకడ నున్నది. మాయన్న వారియందే విశ్వాసముంచి చెడియె. మీరును వారినే నమ్మి చెడుచున్నారు. మాయన్నఁ జంపించిన మహాపాతకుఁడు మణివర్మ. కొన్ని గ్రామముల కాసపడి కొంతధనమున కాసపడి గొప్పబిరుదుల కాసపడి మేటిపదవుల కాసపడి కాశ్మీరమును గోవును కటికవానికమ్మినట్లు సింధుగాంధార రాజుల కమ్మఁ మణివర్మ దలఁచుచున్నవాఁడు. మణివర్మయనగా దేనెబూసినకత్తి. మణివర్మయనఁగా మేఁకవన్నె పులి. మణివర్మయనఁగా బ్రాహ్మణవేషముతో నున్న చండాలుఁడు. మణివర్మప్రకృతిలోఁ బాము. నీవు బాలుఁడవు. నీతల్లి శుద్ధాంతకాంతగావున మీరిట్టివి గాని వ్యవహారమెట్టిదో యెఱుఁగదు నీవు నీతండ్రివలెనే మాయావులను తెలిసికొనలేని వాఁడవు ఎవరేమి చెప్పినను దానిని నమ్ముదువు. తెల్లనివన్నియు పాలనియు నల్లనివన్నియు నీళ్లనియు విశ్వసింతువు. రాజనీతియందు నీవు సంపూర్ణకుశలుండవుగావు పాపము నీకు వయస్సేది! ఒకచెంపగొట్టినఁ బాలు నొకచెంపగొట్టిన నీరు గారు లేఁతప్రాయముగదా! అంతలోనే విద్యాభ్యాసము సమగ్రముగాకుండ జనకునిచావు రాజ్యభారవహనము మనోవ్యథాప్రారంభము మున్నగు నిక్కట్లు గలిగినవి. దేశమిట్టి దుర్దశలో నుండుటచే నిన్న రేయి దుస్తంత్రకారకుఁడును దేశద్రోహియు రాజద్రోహియు నైన మణివర్మను బట్టి బంధించితిని. మాయలాఁడు మాధవసేనుఁడు లేఁడట. వాఁడు వచ్చినతోడనే బంధించెదను. గదాధర శూలపాణులు మణివర్మ శిష్యులై యీ దళములను మనకు విరుద్ధముగా నడపింపఁ దలఁచుచున్నారని తెలిసి వారినిఁగూడఁ గారాగృహబద్ధులఁ జేసితి. సింధుగాంధారప్రభువులు చతురంగబలములతో మహాసన్నాహముతోఁ దండువిడిసినను మనకింక భయములేదు. అంతశ్శత్రువులయిన మణివర్మప్రముఖులు బంధింపఁబడిరి గావున బాహ్యశత్రువులు సులభముగా నిర్జింపఁబడు

దురు. ఇఁక మీరందఱు గుండెలపైఁ జేతులు వైచికొని హాయిగా నిద్రింపవచ్చును. మన సైన్యమునంతను నేనే నడపి కదనరంగమునకుం గొంపోయి బల్లిదులగు పగతుఱ జయించి చెల్లాచెదరుగఁ దోలి కాశ్మీరరాజ్యలక్ష్మిని సుస్థిరముగఁ జేసెద. మీరెందే యుండుఁడు. నీవు చేతవిల్లుదాల్పకుండ జెక్కుచెదరకుండ మెడలోని పువ్వులదండ యైనఁ నలుగకుండ మేనం జెమ్మటయైనఁ గ్రమ్మకుండ నవలీలగ నరిబలంబుల జయింపఁ గలవు మేమందఱము మీబంట్లము. ఈదండపాణియు వజ్రపాణియు నీకుద్రోహులుగారు! రాజ్యపరిరక్షణము నిమిత్తము నీనిమిత్తము వారు నన్ననుసరించిరి. నాయన్న రాజ్యము-నాయన్న బిడ్డలరాజ్యము-పరాక్రాంతమగుచుండ నా కన్నులఁ గానట్లు నేనూరక జూచుచుండుటకంత యభిమానహీనుఁడనా? పరాక్రమశూన్యుఁడనా? పుట్టినది రాచపుట్టుకగాదా? మూతిమీఁదనున్నది మీసముగాదా? చేతఁబట్టినది ఖడ్గముగాదా? నాయన్నకును నాకు మనస్పర్ధలుండిన నుండుఁగాక! 'మరణాంతాని వైరాణి' యని మహానుభావుఁడైన వాల్మీకి చెప్పియున్నాఁడు. ఆమనస్పర్ధలాయనతోనే పోయినవి. పసిబాలురయిన మీకాపదవచ్చినఁ బ్రతిక్రియగావింపక నేనూరకుండఁగలనా? మీయాపద నాయాపదగాదా? నీవింక భయపడకుము. శంకవిడువుము మూర్ఖులు నీకనేకవిధముల దుర్బోధచేయుదురు. వానిం జెవిబెట్టకుము. నాయుపదేశము మనంబున నిలుపుకొందువేని నీకు లగ్గగు. నాయంతరంగశుద్ధియు నాధర్మప్రవర్తనము నానిష్కామవ్యాపారము కాలక్రమంబున నీవ యెఱుంగఁ గలవు. ధాత్రి నిష్కంటకము చేసి నీకప్పగించి తపోవనంబున కరుగవలెనని నాసంకల్పము నాకే విధమైన కోరికలు లేవు. సుఖదుఃఖముల ననుభవించితిని. కాశ్మీర రాజ్యము పరహస్తగతము గాకుండఁ జూచుటయే నామనోరథము. కుమారా దీనికి నీవేమందువు?' అని చిత్రభానుఁడు దీర్ఘోపన్యాసము చేయుటయు

విక్రమసేనుఁడు విని యేమనుటకుఁ దోఁచక పినతండ్రివైపు జూచుచుం డెను. "కుమారా! నీయభిప్రాయ మేమని యతఁడు మరలనడిగెను."

"అయ్యా! నేనేమి చెప్పఁగలను? మీరు పెద్దలు. సర్వధర్మములు తెలిసినవారు. సింధుగాంధారరాజుల దండయాత్రలగుఱించియు మనము వారి నిమిత్తమై చేయవలసిన ప్రతిక్రియలగుఱించియు ముందు [illegible] నాతోఁ డమీరాలోచింపలేదు. మణివర్మప్రముఖులును గారాబద్ధులై జేయునప్పుడు నా చెవిని వేయలేదు. అన్నియు జరిగిన పిదప [illegible] నన్నడిగిన నేనేమి చెప్పఁగలను? మీరెట్లుండుమని సెలవిచ్చిన నట్లేయుండెద. ఎవఱు చేయుమన్నది చేసెద. ఈనగరము విడిచిపొమ్మన్న నాతల్లి [illegible] వెంటఁబెట్టుకొని పాంచాలమునకుఁగాని మఱియొక దేశమునకుఁగాని పోయెద. మీతండ్రియెక్కినగద్దె మీరేయెక్కుఁడు. అంతఃపుర [illegible] రాజ్యములేయున్నవా! అందఱకై శ్వర్యములేయున్నవా! నాయభిమానము [illegible] లేదు. మీయిచ్చవచ్చిన తెఱంగున మీరు సేయవచ్చును." అని విక్రమసేనుఁడు మొగముచిన్నవుచ్చుకొని యుత్తరము చెప్పెను.

"కుమారా! తొందరపడకుము. మీరు దేశమువిడిచి వెళ్ళనేల? మణివర్మప్రముఖులపై నీకు సంపూర్ణ విశ్వాసముగలదు. గావున వారింబంధించుట [illegible] నీ [illegible] సమ్మతమని ముందుజెప్పనయితి. సేనలను సేనాపతులను వశము జేసికొంటివని యంటివి. నీపని నిమిత్తము నేను వారి కోడ తెచ్చితినిగాని నాపనికి గాదు. నేను వారిని వశముచేసికొనలేదు. వారికే నేను వశుఁడనైతిని. నీతో జెప్పి చేసినను జెప్పకచేసినను నీపనిచేయుటయే నాకుఁ బ్రధానము. కావున నిదియొక తప్పుగ [illegible]. నీవు మీయమ్మతోడ స్తిమితముగా నాలోచించుకొనుము." అని చిత్రభానుఁడు విక్రమసేనుని వీడుకొని కొలువుకూటమునకువచ్చి తన నిమిత్తమై కనిపెట్టుకొనియున్న

సైనికులను సేనాపతులను గలసికొని వారితోఁగూడి కోటవిడిచి స్వగృహంబునకుంబోయెను. దండనాథులు సైనికులు వానికడ సెలవు గైకొని స్వగృహములకుం జనిరి.

అటఁ జిత్రభానుఁడు చన్నపిదప నరవిందాదేవి విక్రమసేనుం బిలిచి యిట్లనియె. "కుమారా! చిత్రభానుఁడు మనయెడ నభిమానముగల వారినందఱ బంధించినాఁడు. సైన్యమును వశపఱచుకొన్నాఁడు. దండనాథులు వానికి వశంవదులైరి. మణివర్మ మొట్టమొదటనుండియుఁ జేసిన యుపదేశము మనముఁ జెవిబెట్టకపోవుటఁ జేసి యింతవఱకువచ్చినది. అతఁడే ఋజుమార్గవర్తనుఁడు. సింధుగాంధారవల్లభులంగూడి యతఁడు దుస్తంత్రములు పన్నెనని మనమునిశ్చయించుట పొరపాటేమో! కాని యాజాబు లతఁడు వ్రాసినవైయెవఁడో సృష్టించినాఁడని యాతఁడు మొఱపెట్టుకొన్నను మనము విననైతిమి. ఆతని విశ్వసించినచో నింతవఱకు రాకపోవునేమో? 'స్త్రీబుద్ధిః ప్రళయాంతకః' యను నార్యోక్తి నావంటి బుద్ధిహీనురాలి చేష్టలంబట్టి పుట్టియుండవచ్చును ఈవైపరీత్యమునకు నేనే కారణమునైతిని. బిడ్డా! చేతులార నీభాగ్యమును నేను వెడలఁగొట్టితిని. ఇప్పుడేమి చేయుదుము? మనరాజ్యవ్యాపారము చుక్కానిలేని యోడపగిది నున్నది" అని విచారించుచున్న తల్లింజూచి విక్రమసేనుఁడు "అమ్మా! నీవు విచారింపవలదు. కార్యములు కన్నీటి కాలువలన మునిఁగిపోవును. కన్నీరు కార్యములను సరిగాఁ జూడనియ్యదు. దుఃఖము దుర్బలలక్షణము. ధైర్యమెన్నటికి మునుఁగనినావ. దానినెక్కిన వారు సురక్షితముగా దుఃఖసాగరమీఁది యవ్వలియొడ్డుఁ జేరుదురు. నీవు ధృతిఁదాల్చియుంటివా మేముత్సాహవంతులమగుదుము. నీవు ధృతిదప్పిన మామతిచలించు. కావున ధైర్యము నూఁతగోల విడువకుము." అని చెప్పి యామె నూరడించెను.

చిత్రభానుఁడు మధ్యాహ్నమున దండపాణి వజ్రపాణులం

బిలిచి "విక్రమసేనుఁడు మాతృభ్రాతృసమేతుఁడై దేశమువిడిచి పాం చాలమునకుం బోయెద నని చెప్పె. అతఁడు గాని వానిపరిజనము గాని చుట్టములు గాని కోట దాఁటి పోకుండ నన్నిద్వారములయొద్ద నన్నిబురుజులయొద్ద ముక్కాకలందేరిన మేటిమగలఁ గావలి యుం చుఁడు. మాధవసేనుని జాడలరయుఁడు. అతఁ డేదో రాజకార్యము మీఁదనే పైకిపోయియుండునని నేఁ దలంచెద"నని చెప్పి వారింబనిచి మణివర్మమాధవసేనులకు బదులుగా నూతనమంత్రిల నియమింపఁ దలఁచి యెవ్వరిని నియమింతుమని గుదిభట్టుతో నాలోచించెను. అతఁడుకొంచెము సేపాలోచించి "నీకుమంత్రులెందుకు? నీవుమహేం ద్రుఁడవు. నేనుబృహస్పతి యట్లునకలవిషయముల ధర్మోపదేశముఁ జేయుచుండెద. నామనస్సేనీమనస్సు. నేనునీకు హితమేయుపదేశిం తును. నీచేత హితమే చేయింతును. ఒకవేళ మంత్రిల నియోగింపవల సివచ్చిన నిక్కడివారిని నియోగింపకుము. సమర్థులయినయమాత్యు లను విదర్భాపురమునుండి రావింతము. ఇక్కడివారు నమ్మఁదగిన వారుకారు. నీబుద్ధిబలము వినియోగించి నీవొక్కఁడవేపాలించు చుండుము." అనియుపదేశించెను.

అదిలెస్సగానున్నదని భావించి చిత్రభానుఁడు నాఁడు మొదలు కొని ప్రతిదినముఁ గోటకుంబోవుచుఁ గొలువుకూటమున విక్రమసే నుని గద్దెపైనునిచి ప్రక్కను దానొకచిఱుగద్దియ వేయించుకొని కూ ర్చుండి దండనాథులను సామంతులను నగరమందలి ప్రధానపురుషు లనురావించి కొలువుదీర్చి రాజ్యవ్యాపారములను విక్రమసేనుని పేరం జక్కఁబెట్టఁదొడఁగెను.

ప్రజలలో నసేకులాతనివర్తనముఁజూచి సముచితముగా నున్నదని మెచ్చిరి. నగరమందలిసంక్షోభము క్రమక్రమముగా డిం దుపడెను. చిత్రభానునిపట్ల దుర్నయమెద్దియులేదని పౌరులుచెప్పుకొన

జొచ్చిరి. వ్యవహారము మిక్కిలికట్టుదిట్టముగా జరుగఁజొచ్చెను. జారులుచోరులుమున్నగు దుండగులు చండశాసనుఁడగు చిత్రభానునకు భయంపడఁజొచ్చిరి. దేశమందు బందిపోటులు మున్నగునల్లరులు క్రమక్రమముగ నడఁగెను. అరవిందాదేవియు విక్రమసేనుఁడును జిత్రభానునిమనస్సనియెడు నోడ యేకడకుఁబోవునో యేరేవు జేరునో తెలియక యీతనివర్తనమంతయు నాటక మనియు నభినయ మనియు దలంచుచుండిరి.

మణివర్మకడ విశేషధనమున్నదని చిత్రభానుఁడు సంపూర్ణముగనమ్మి యతనినెట్లయిన హింసించి యానిక్షేపమును గనుగొనవలెనని ప్రయత్నములుచేయుచుండెను. దండపాణింబిలిచి యొకనాఁడతఁడు మణివర్మను మిక్కిలికఠినముగా హింసించి విత్తంబుదాఁచిన చోటు దెలిసికొమ్మని యానతిచ్చెను. దండపాణి "స్వామీ! ఇంటిలోనేమూలనో యతఁడు సొమ్మునుపాతిపెట్టియుండును. కావున మనమిల్లంతయుఁ ద్రవ్వించిచూతము. అక్కడనది కానఁబడనినాఁడు వానిని హింసింపవచ్చు" నని యుత్తరమిచ్చెను. "అదిలెస్సగానున్నదని యకార్యమునకుఁ జిత్రభానుఁ డంగీకరించెను.

మఱునాఁడు ఖనికులచేత నిల్లంతయు నొక్కనిలువులోతు ద్రవ్వించిరి. ఎముకలు మసిబొగ్గులు ప్రాతకుండపెంకులు కొన్ని రాగిశాసనములు మున్నగునవేకానఁబడియెనుగాని యొక్కరూకయైన నచ్చటఁ గనబడలేదు. అవ్వార్త దండపాణి చిత్రభానున కెఱిఁగింప నాతఁడు భగ్నమనోరథుఁడై మణివర్మ మఱెచ్చటనో ధనముదాఁచి యుండుననినమ్మి వానిం గ్రూరదండనలపాలు చేసిన నత్తావుబయటబడునని నిశ్చయించెను. ఒకనాఁడుసాయంకాలము చిత్రభానుఁడు దండపాణియు వజ్రపాణియు మఱిపదుగురు భీకరాకారులగు బంటులు మణివర్మయున్న కారాగృహముఁ జొచ్చిరి "నీవార్జించినధనరాసులు

మణులు మొదలగు నమూల్యపదార్థములు నీవెచ్చటదాచితివో చెప్పెదవా లేక దారుణవధపాలయ్యెదవా" యని చిత్రభానుఁడడిగెను.

"ధనము నాకడ లేదని యిదివఱకే చెప్పితిని నన్ను మీ రెంత హింసించినను ఫలితము లేగాని నా కేమియు నాకడ గ్రహింపలేరు. నెత్తురుచుక్కలేగాని మణులు మీకు దొరకవు. చివికిపోయిన యెముకలేగాని పసిఁడికణికలు మీకు లభింపవు. చర్మమేగాని భర్మము మీకు లభింపదు. ఏదో నంకబెట్టి నన్ను హింసించుటయే మీ సంకల్పమైన మీరట్లు చేయవచ్చును. పాపము మూటఁగట్టుకొనుటయే మీ కోరిక యైనయెడల నట్లు చేయవచ్చును. అకారణ పీడనము నీయభిమత మేని నన్ను నీయిచ్చ వచ్చినట్లు హింసింపవచ్చును. పరమేశ్వరుఁడు సాక్షిగా భూమ్యాకాశములు సాక్షులుగా నే సత్యము బలుకుచుంటిని ధనము నాకడ లేదు. నాశరీరము నేఁడె నేలఁబడ కింధనముగా మీ రిడినను యావజ్జీవము బంధనమునఁ బెట్టినను ధనము మాత్రము నేను మీకియ్యజాల" నని యమ్ముసలిమంత్రి యుత్తరమిచ్చెను.

"వీనిప్రమాణములు నమ్మఁజాలము. వీనికాలు సేతులకు గుడ్డలు చుట్టి కాల్పుఁ" డని చిత్రభానుఁడాజ్ఞాపించెను. "అట్లేగాక!" యని మొఱకులగు కొఱబంట్లామూకముగఁ గుడ్డలు తడిపి వానిచేతులకు మోచేతులవఱకుఁ గాళ్ళకు మోకాళ్లవఱకుఁ జుట్టిరి. ఒకఁడు సమిధలు వైచి యగ్నిహోత్రము రవులుకొల్పుచుండెను. మణివర్మ లేశమును భయపడక విషాదముంజూపక కూర్చుండి కన్నులు మూసి నమక చమకములతో మహేశ్వరుని లోలోన ధ్యానించుకొనుచు మరణమునకు సిద్ధముగా నుండెను. "ఇదే గుడ్డలకు నిప్పంటించుచున్నాము. క్షణములో భస్మమయ్యెదవు. జాగ్రత్త! ధనమెక్కడనున్నదో చెప్పు" మని దుష్కృత్యులగు బంట్లు మఱియొకసారి యడిగిరి. మణివర్మ ధ్యానపరుఁడై నిరుత్తరుఁడయ్యెను.

"స్వామీ! ముమ్మాటికి నేనే? నిష్కళంకుఁడా" యని చిత్రభానునివంక దిరిగి యొకఁ డడిగెను. చిత్రభానుఁడు దండపాణివంకఁ జూచెను. దండపాణి కప్పని యిష్టము లేకపోయినను దనయేలిక యాగ్రహము వచ్చునేమో యని యతఁడు పలుకక వజ్రపాణివైపు జూచెను. ఆయాజానుబాహువులు ముసలితనమందైన వన్నె దఱుఁగని యావచ్చని మేను విశాలమై యుప్పుడు ముడుతలతో నిండియున్న ఫాలభాగమును మాంసహీనములై వ్రేలుచున్న చర్మమును జూడ సేనాపతుల కిరువురకు మనస్సు కరిగెను. వారు చిత్రభానున కుత్తరమీయ కూరకుండిరి.

"చంచలులారా! మీమనస్సులు చలించినవి. మీరు సేనాపతులై పరసేనల రూపుమాపుటకే గాని పరిచితులకడ మీరు పనికిరారు. మోమోటము జాలి మిమ్ము లముచున్నవి. ఓరీ! నీవు బాగుగా మంటజేయుము రా" యని మాటసరిగా ముగించెనో లేదో యంతలో వృద్ధకంచుకియగు జంబుకుఁడు వచ్చి "స్వామీ! కర్పూరమంజరి కర్పూరమంజరియని" యేడ్చుచుఁ బలికెను. "ఏమిరా! కర్పూరమంజరి కేమి?" యని చిత్రభానుఁడు తొట్రుపడియడిగెను. "ఉరిబెట్టుకొనె. ఉరిబెట్టుకొనె" నని వగర్చుచు వాఁడు చెప్పెను. చిత్రభానుఁడు భయసంభ్రమములతో విసవిస నడచుచుఁ బోయెను. దండపాణియు వజ్రపాణియు వానివెనువెంటఁ జనిరి. సేవకులు నాఁడప్పని చాలించి మణివర్మకట్లు విప్పి తలుపులు బిగించి యావలకుం బోయిరి. వజ్రపాణి జంబుకుని బిలిచి మెల్లగాఁ గర్పూరమంజరి యురివెట్టుకొనుటకుఁ గారణ మడిగెను. "చెలికత్తెయైన మల్లిక పెద్దపులిచేఁ బట్టువడి చచ్చిపోవుటచే బెంగపెట్టుకొని యామె మాధవీలతతో మెడకురిపెట్టుకొన్నది" యని యతఁడు బదులు చెప్పెను. "బ్రతికియున్నదా మృతినొందినదా?" యని మరల వానినడిగెను. "ఏమో తెలియదు. మాటలేదు. చూపులేదు. నాడిలేదు. బ్రతికియున్నదో చచ్చిపోయినదో నే నెఱుఁగను" అని వాఁడుత్తరము చెప్పెను.

ఇరువదియొకటవప్రకరణము.

సునంద మతి యించుకేనియుఁ జక్కబడలేదు. ఆమెయున్మాదము నానాటికి హెచ్చుచుండెను. ఇంటనున్నచెంబులు తాను మోయఁగల చిన్నబిందెలు తననగలు దీసికొనిపోయి యామెదొడ్డిలోనున్ననూతిలోఁ బడవైచుచుండును. అట్లు పాఱవైచెదవేమమ్మా యని సేవకు లడిగినప్పుడు "అయ్యో! కర్పూరమంజరి యెత్తుకొనిపోవును. అందుకని దాఁచుచున్నాన" అని బదులుచెప్పును. రమారమి సంవత్సరమువయస్సుగల యామెచిన్నబిడ్డ నొకనాఁడు చంకఁబెట్టుకొని బావికడకుఁ గొనిపోయెను. వెంటనే పరిచారిక యొకర్తు పరుగెత్తుకొనిపోయి "ఏమమ్మా! బిడ్డ నేమిచేసెదవు?" అనియడుగ "ఓసీ! కర్పూరమంజరి పిసంగేసికొనిపోవును. కాఁబట్టి యీనూతిలో బండుకొనఁబెట్టెద" నని బదులుచెప్పెను. వెంటనే యప్పనికత్తె బిడ్డకుఁ బ్రాణభంగ మగునని యామెచేతిలోనుండి బిడ్డను బలవంతముగా లాగుకొనెను. ఆపెనఁగులాటలో సునంద సేవకురాలిని గట్టిగా గఱచి నాలుగుమూఁడుచోట్ల గాయములు చేసెను. గదిలోఁ బెట్టి తాళమువైచినప్పుడు కడుపునొప్పి వచ్చినదని కాలునొప్పి వచ్చినదని లేనిపోనివంకలు బెట్టి తలుపు దీయుమని పెద్దపెద్దకేకలు వేయును. పరిచారకు లాయవస్థల సరకుసేయకపోయిరేని గదిలోఁ దనతల గోడకుఁబెట్టి గట్టిగఁగొట్టుకొనును. తలుపుదీసినపక్షమున నేదో చెఱుపు జేయుచుండును. రెండుమూఁడుపిల్లికూనలను సేవకులు చూడకుండ నూతిలోఁ బడవైచి చంపెను. ఆమెయవస్థఁజూచి వజ్రపాణి మిక్కిలి ఖేదమునొందుచుండెను. ఎట్టిగట్టివైద్యులచేతఁ జికిత్సచేయించినను నామె యున్మాదము హెచ్చెనేగాని తగ్గలేదు. మనోవ్యాధికి మందు లేదుగదా! రాత్రిలు సునంద తాను నిద్రపోవుట లేదు సరేకదా

భర్తృకుం జెట్టుపిక్కలవారికిఁ గంటిమీఁద గునుకు లేకుండ నడచుచుండెను. ఎవరో యెదుట నున్నట్లు భావించి వారితో వాదము సేయుచుండును.

కర్పూరమంజరిని వజ్రపాణి కిచ్చి వివాహముచేయుట నిశ్చయమయినదని యీయమె యున్మాదమువల్లనో ప్రధానమయిననాఁడు వచ్చినబ్రాహ్మణులవెంగలితనముననో యెట్లో పట్టణమునం బొక్కెను. పెండ్లి లేదు. పేరంటము లేదు. ముందామునుపటిభార్యకు మాత్రము వజ్రపాణి పిచ్చియెత్తించినాఁడు గదా" యని లోకులు చెప్పుకొని చాటుచాటున వాని నెగతాళిసేయఁ జొచ్చిరి. ఎందఱు హసించినను నెంద ఱధిక్షేపించినను మఱెందఱు నిందించినను భార్య యున్మాదినియైనను గర్పూరమంజరిముఖముఁ దనమనోనేత్రముతోఁ జూచుచు సకలసంతాపహారక మయినయామె దృఢాలింగనము దనకుఁ జేకురినట్లు భావించుచు నప్పుడప్పుడు స్వప్నములలో నామెసమాగమసుఖము క్షణకాల మనుభవించుచు వజ్రపాణి యిల్లాలిదురవస్థ కెడనెడ వగచుచున్నను మొత్తముమీఁద సంతోషముతోడనే దినములు పుచ్చుచుండెను. విశేషించి రాజ్యము చిత్రభానునివశమగుటచేఁ దన కింకను గొప్పపదవులు చేకూరుననియాసపడి యుండెను. కర్పూరమంజరి యురిబెట్టుకొన్ననాఁడు చిత్రభానునివెంట నరిగి యామె బ్రతికియున్నదో లేదో తెలిసికొనుటకును రతీదేవికిఁ బ్రతిరూపమని పేరువడసిన యాకన్నియ మేనివన్నెయు ముఖవిలాసమును నొకసారి జూడవలయుననియు నాఁడు భయసంభ్రమములతోఁ బోవుచుండ నంతలో నతనిసేవకుఁడు పరుగుపరుగున వచ్చి వగర్చుచు "మహాప్రభూ! మహాప్రభూ! ఇల్లు— ఇల్లు—" అని యఱచెను. "ఏమియిల్లు! ఏమియిల్లు? వేగము చెప్పుదురా" యని యతఁ డచ్చట నాఁగి యడుగ "మనయిల్లు కాలిపోవుచున్నది స్వామీ! రండి

రండి" యని యేడ్చుచుఁ బలికెను. "అయ్యో! అయ్యో! ఏమిరా యిది" యని వజ్రపాణి నడచుచు వానిని బ్రశ్నింప నాసేవకుఁడు నడచుచునే వాని కిట్లుత్తరముఁ జెప్పెను.

"స్వామీ! ఏమి చెప్పుదును? సేవకుల కందఱకు నిద్రపట్టినది. అమ్మగారు దీపము చేతఁబుచ్చుకొని మీరు పఱుపులుకట్టించుటకై యీనడుమ దెప్పించిన దూదిబుంగల నంటించినారు. ఇంటిలో నా భాగమంతయుఁ బూర్తిగా నంటుకొన్నతరువాతఁ గాని మా కెవ్వరికి మెలఁకువ రాలేదు. అంతలోఁ జుట్టుప్రక్కలవారు వచ్చి యిల్లంటు కొన్నదని కేకలువైచిరి. పొగ నలుదెసలం గ్రమ్మెను. మంట లెగసి మిన్నుముట్టెను. మీబిడ్డలం దీసికొని మేము బయటఁబడుటయే మిక్కిలి కష్టమయ్యెను. ఇంటిలోని సామాను దీయుటకయిన నవకాశము లేకపోయెను. దైవానుగ్రహమువలన బిడ్డలను దేవిగారిని మాత్రము బ్రతికించితిమి. ఆమె నీవలకు రమ్మన్న రాదు. చలిమంట కాగెద నిక్కడ నుండనీయండి యని బలుకఁ జొచ్చెను. చేతులు పట్టుకొని యామెను బలాత్కారముగా నీవలకు లాగితిమి."

ఈసంభాషణము జరుగుచుండఁగనె వారిరువురు వారియిల్లున్నవీధికి వచ్చిరి. ఆకోలాహల మేమని వర్ణింపవచ్చును? ఆకలకల మెంత యని చెప్పఁగలము! అత్తఱి గాలి విసరుగా వీచుచుండుటచే వజ్రపాణిగృహమే గాక నిరుగుపొరుగుననున్న రెండిండ్లు గూడఁ బరశురామప్రీతి యయ్యెను. వజ్రపాణి సర్వస్వము వీతిహోత్రున కాహుతియయ్యెను. నగలు నాణెములు చీనిచీనాంబరములు విండ్లు నమ్ములు నమ్ములపొదులు చిత్తరువులు రొక్కము సమస్తము దగ్ధమయ్యెను. ఇదియంతయు దగ్ధమైనను నతఁడు విచారింపకపోవును గాని తనమనోరథము తనపాలిటిచింతామణి తననిధి తననిక్షేపమునైన కర్పూరమంజరియు నురివెట్టుకొని విగతజీవయైనదని యతని కింతింత

యనరాని విషాదము గలిగెను. కర్పూరమంజరి లేకపోవుటచేఁ దన యిల్లుగాలినలోపము భార్య యున్మత్తయయినలోపము ఘోరముగా గనఁబడజొచ్చెను. పాప మతనికా రాత్రి పండుకొనుటకుఁ దావు లేదు. మఱునాఁడు పండుకొనుటకు నెలవులేదు. కట్టుకొనుటకు బట్టలులేవు. ఇంటిముందర నిలువఁగానే పిల్లలు తండ్రిం గౌఁగలించుకొని యేడ్చిరి. సునంద భర్తయెదుటకుఁబోయినిలిచి "ఏమండి! బాగున్నదా! మనము క్రొత్తయిల్లు కట్టుకొందము కర్పూరమంజరి రాకుండఁజేసితిని. చూచితిరా" యని నవ్వుచుఁ బలికెను. అతఁడే మియు ననక స్తంభమువలె నిలబడి తనదురవస్థను దలంచుకొని తన గృహమువలెనే మండిపోవుచున్న తనమనస్సును జల్లార్చుకొనలేక తన యింటియెదుట నున్నయొకయరుగుపైఁ జదికిలఁబడెను. బిడ్డలును వానితోఁ జని యతని కిరుప్రక్కలఁ గూర్చుండి కొంతసే పక్కడనే వట్టినేలఁ బండుకొని నిదురించిరి. తనువొత్తని మెత్తనిపాన్పులనత్తి మిల్లు తనబిడ్డలు బెడ్డలుగుచ్చుకొనునట్లు గటికినేలఁబవ్వళించి యొడలెఱుంగక నిదురింపఁజూచి యతఁడుకన్నుల నీరు వెట్టుకొని యిరుగు పొరుగువారి సమాశ్వాసములవలన నూఱడిల్లి పొరుగువారు పాన్పు దెచ్చి పండుకొమ్మన్నను బండుకొనక రేయియెల్ల మేల్కొని తద్గృహమందే దృష్టినిలిపియుండెను. కాలుచున్న యాగృహముఁ జూచుచున్నప్పుడతఁడు తనమనోరథమెల్లనట్లె దగ్ధమయినదని తనయాశలెల్ల బూడిదయైనవని, తనసౌఖ్యములెల్ల నేలపాలయినవని విచారించి తనభవిష్యదవస్థ యెట్లుండునో యనితలపోయఁజొచ్చెను.

అంతలోఁ దెల్లవాఱెను. తొల్లియతిరమణీయముగానున్న తన భవనమొక్కరాత్రిలో భస్మమగుట కతఁడు మిక్కిలి యాశ్చర్యమొందెను. ఆమాఁడినబోడిగోడల-నాకాలుచున్న-దూలముల నా

వ్రేలుచున్న పెంకుల-నాకూలుచున్న వాసములఁజూచి యతఁడు కాల
గతి మిక్కిలి చిత్రమయినదనియు దానికన్న విచిత్రమయినది మఱి
యొకటి లేదనియు నీశ్వరేచ్ఛ యగమ్యగోచరమనియుఁ బ్రపంచమంత
యు వినశ్వరమనియుఁ బెద్దలు చెప్పుమాటల స్మరించుకొనెను.

ఇరువదిరెండవ ప్రకరణము.

సిప్రానది భాగీరథీ మొదలగు మహానదులవలె మహావాహిని
గాకపోయినను ముక్తిప్రదములయిన నగరములలో నొకటియని
పురాణప్రసిద్ధిగాంచి మహాకాళేశ్వరస్వామికి నిలయమై వెలయు నుజ్జ
యినీనగరమునఁ బ్రవహించుటచే నదియు నొకపుణ్యనదిగాఁ బరిగ
ణింపఁబడుచుండును. అక్కాలమునఁ బ్రతిదినముఁ దీర్థవాసులు వందల
కొలందివచ్చి యయ్యేటస్నానము జేసి మహాకాళేశ్వరునిదర్శించి స్థల
పురాణమునువినిగతకల్మషులైనట్లు సంతసించి పోవుచుందురు. అయ్యే
టియొడ్డున రామణీయకపురాశియనందగుపూఁదోఁటయొకటికలదు.
అయ్యలరుదోఁటనడుమఁ గమలాకరంబగు కమలాకరంబొండు న
యనోత్సవము చేయుచుండు. దానియొడ్డునఁ జూచువారికన్నులకు
విందులుసేయు సౌధమొండునిర్మింపఁబడియె. సిప్రానదీతరంగములఁ
గౌఁగలించుకొని యాసంపర్కమునఁ గడుంగడుజల్లనై యటనుండి
యెలతోఁటఁజొచ్చి కుసుమపరిమళంబులఁ జూఱఁగొని మెల్లమెల్లగ
మలయానిలుఁడుకొలంకుఁజొచ్చి యన్నిటితుంపురుల మేనదాల్చి
గవాక్షద్వారమున సౌధంబుజొచ్చి యందున్నవారి నానందపరవశులఁ
జేయుచుండును. మాళవరాజనందనుఁడగు మకరందుఁడు తఱచుగా న
య్యుద్యానమున విహరించుచుండును. ప్రాయికముగా నక్కాలంబున

జలకమాడుచుండును. వేమాఱు వేడుకచెలికాఁడు చంద్రచూడునిం గూడి మేడమీఁదఁ గూర్చుండి మలయమారుత సుఖమనుభవించి యుద్యానవనరామణీయకము సందర్శించి కనులం దనుపుకొనుచుండును. వసంతసమయములందును శరత్కాలములందును రాకాచంద్రమండలము నిండువెన్నెలలు గాయునప్పుడు నమ్మేడ నంటియున్న పాలరాతి మిద్దెపైఁ గూరుచుండి చల్లనిపండువెన్నెలల సుఖమనుభవించుచుండును.

ఒకనాఁడు కర్పూరమంజరీవిరహమున నతఁడింటికిఁ బోవక నా యెలదోఁటలోనేయుండి సాయంకాలమయినపిదప జగన్మోహనం బగు ధవళప్రభతో నుదయించిన శరత్కాలసంపూర్ణచంద్రమండలమును జూచి దానివలనఁ దనప్రియురాలి మొగంబును బండువెన్నెలలవలన నామెలావణ్యమును స్మరణకురాఁగ మిద్దెపైఁగూర్చుండి "ఓ చందమామా! మేడమీఁదనుండువారికిఁ గ్రిందివారుసేయు పనులెల్ల నగపడునట్లు గగనప్రాసాదమధిష్ఠించిన నీకు సకలభూతచేష్టలుఁ గరతలామలకముగదా? నీవుచల్లనివాఁడవు కావున నాగ్రహము లేనివాఁడవు. కాఁబట్టి నిన్నొకప్రశ్నయడిగెదను దయచేసిచెప్పుము. నీవు కాశ్మీరమునకరిగితివా? శ్రీనగరముంజూచితివా? అందుమాకర్పూరమంజరి కనఁబడినదా? ఆమెసుఖముగానున్నదా? ఏమి! యుత్తరము చెప్పవు? ఔను నీవేలచెప్పెదవు? ఆమెమొగమునకు నివాళినిచ్చుటకయినను నీనెమ్మొగము పనికిరాదుగదా! కళంకితమైనది నీమొగము. అకళంకమైనదామెవదనము. ఎంతవారికయిననీర్ష్యయుండకపోవునా? అందుచేసిగ్గుపడి నీవామెంజూచియుండవు. నిన్నడిగిన ప్రయోజనమేమి?" అని కామార్తుఁడు చేతనంబులంబలె నచేతనంబులంగూడ సంబోధింతురను నార్యోక్తి నిజముగఁ జిత్తవికారమున జాబిల్లింజూచి యసంబద్ధప్రలాపములుచేయు మిత్రునిదగ్గరి చంద్రచూడుఁడుమీఁదఁ

జేయివయిచి తట్టి తన మొగము నతని మొగముకడఁ జేర్చి "వయస్యా! ఇదియేమి నీకు వెఱ్ఱియెత్తినదా? లేక నీలేఁదోటలో నేదయ్యమయిన సోఁకినదా? లేక మద్యపానముఁ జేసితివా? చందమామకు నోరున్నదా నాలుకయున్నదా నీవడిగిన ప్రశ్నల కుత్తరము జెప్పుటకు? చంద్రుఁడనఁగా మన వంటి పురుషుఁడనుకొంటివా? నీవు జ్యోతిశ్శాస్త్రవేత్తవు. చంద్రుఁడనగా సూర్యానువర్తియగు గ్రహమని నీ వెఱుఁగవా? చాలు చాలు! నేను హిమవంతునివంటి ధైర్యసారము గలవాఁడను గనుక భయపడ లేదుగాని, మఱి యొకరు నీయసంబద్ధసంభాషణములు విన్న బెదరి మేడదూకి పాఱిపోదురు. 'నీకలాపమిఁకఁ గట్టిపెట్టు' మని మందలించెను.

అప్పుడు మకరందుఁడు చంద్రచూడుని చేయిబట్టుకొని మెల్లగ సట్లనియె — "మిత్రమా! నీవు నన్నెఱుఁగనివానివలె భాషించెదవేల? స్వప్నమునైన నేను మద్యపానము సేయుదునా? భూతములు పిశాచములు పిఱికివాండ్రపైఁ బడునుగాని నాపైఁ బడవు. కర్పూరమంజరీ వియోగదుఃఖము దుస్సహమగుటచే నేనేమేమో కొన్ని యసందర్భములు పలికియుంటిని. దానంజేసి నామతి చలించెనని నీవు శంకింపకుము. ఎంత వారించినను నామనస్సు కర్పూరమంజరీ సముఖమున కరుగక మానినదిగాదు. దానిమాటలలో నేమితీఁపియున్నదో-దాని మొగమున నెంత యాకర్షణశక్తియున్నదో- దానిసాన్నిధ్యమం దేమివిశేషమున్నదో-దానికన్నులలో నేమి వశీకరణప్రభావమున్నదో-నే నెఱుంగనుగాని నామనస్సు వేయిసార్లు పిలిచినను గొలుసులు వైచిలాగినను నాకడకు రాకున్నది. అది దానిమాయలలోఁ బడినది. దాని చెలిమికత్తెలు పన్నిన వలలలో నదితగులుకొని యుండవలయును! మాటలాడించు శక్తి మనస్సునకగదా? అది దగ్గఱలేనప్పుడు-దగ్గఱనున్నను సరిగా లేనప్పుడు నోరు తనయిచ్చవచ్చినట్లు పేలును. చంద్రచూడుఁడా! నీవు చూచి

తివో లేదో, చూచినను మెచ్చితివో లేదో, కాని, కర్పూరమంజరి సౌం
దర్యము వర్ణనాతీతమని చెప్పుట వర్తనముగాదు. దానిసోయగంబుఁ
గనువిచ్చి యొక్కసారి జూచునేనిఁ గాలకంఠుని కఠోరహుంకారంబు
న మూర్ఛిల్లి యాతని కంటిమంటల మ్రగ్గిన మన్మథుఁడు తన నియతిని
రతిని విడిచి మరల దాని కొఱకై భూమండలంబున కవతరించి సాంగుఁ
డై యనంగశబ్దముఁ బోఁగొట్టుకొనఁడే? వసంతుఁడు తాను జూచుభా
గ్యముగలవాఁడగునేనిఁ జివురుటాకులు మేనుగాఁ జేసికొని మాధవీల
తాదులు కరచరణంబులుగా నిర్మించుకొని ఫలరసంబులు రక్తంబుగా
నమర్చుకొని కలువరేకులు కన్నులుగాఁ గావించుకొని దొండపండు
లు మోవిగాఁ బెట్టుకొని శుకపికంబులనుండి పలుకులు పుడికిపుచ్చు
కొని మాటలుగాఁ జేసికొని మూర్తిమంతుఁడై దన్ను వరింపుమని దాని
యడుగుఁదోయిఁబడి వేఁడుకొనఁడే? అది నలకూబరుని కంటఁబడిన
గడుముసలిదై శృంగారరస మెల్లఁగోల్పోయిన రంభను సవ్యాలకుం
ద్రోసివయిచి జవ్వనియగు నివ్వనజాక్షికై తహతహంబడఁడే? నా
రిమాటయేల! సంసారములరోసి సౌఖ్యముల బాసి కాంతారాంతర
వాసులై గాలియు దుంపలు నాకులు నలుసులు దిని చెట్లనీడల వసియిం
చుచుఁ జర్మంబులం దాల్చు బ్రహ్మజ్ఞాన సంపన్నులైన మానులు
సైతము పల్లమునకుం బోవునీరువగిది జపములు తపములు పాలించి
నిష్ఠలు నీటఁగలిపి దాని వెంటంబడరే! ఆ చక్కఁదనముఁ గవులు వర్ణింపఁజా
లరు. చిత్రకారులు చిత్రింపఁజాలరు."

అనుమండఁ జంద్రచూడుఁడు "మిత్రమా! ఆమెకై నీవింత
తహతహఁ బడుచుంటివి. నిన్నామె వలచునా? లేక యిది చదురుదం
డుగ భాగవతమా?" యనియడిగెను. "మిత్రుఁడా! ఆప్రశ్నకు నే న
త్తరము జెప్పఁగలనా? నాచక్కదనము, నా తెలివితేటలు, నాజవ్వని
యడుగుఁదామరలకు దాస్యముచేయుటకయుఁ దగవని నేఁదలంచెద.

ఎందఱురాజకుమారు లామెకేలువట్ట యత్నించుచున్నారో యెందఱు
నృపకుమారుల దూతలామెకడ దర్శనముగాక వేచియున్నారో యెం
దఱు లేఖలనువ్రాసి విజ్ఞాపనము లంపుకొనుచున్నారో, యెందఱు
దానితండ్రిం బతిమాలుచున్నారో యెందఱుదాని పొందుగూర్పు
మని దానిచెలికత్తెలకు లంచములిచ్చుచున్నారో యెందఱామె
మనఃప్రీతికై కట్నములు కానుకలు నంపుచున్నారో, యెందఱామె
చేఁ దిరస్కృతులై లజ్జావశంబునఁ దలయెత్తుకొనలేక యున్నారో,
యెందఱామె సమాగమముఁ దమకలభించునని యువ్విళులూరుచు
న్నారో! నన్నా యామెవలచుట? నాకా యాసమాగమ సౌఖ్యము
గలుగుట! నేనా యంతపుణ్యముచేసినవాఁడను? మిత్రుఁడా! మనస్సు
కున్న వేగము మనుష్యునికేలయుండఁగూడదు! తిరస్కరిణీవిద్యాప్ర
భావము నేఁడు కలియుగమందున్నపక్షమున దేవదూతయై నలుఁడు
పరులకంటఁ బడకుండ విదర్భాపురముఁజొచ్చి దమయంతీసమాగ
మముఁ బడసి యామెకర్ణంబున నేత్రంబులనుసంభాషణంబునశ్రవణం
బులను ధన్యంబులఁ జేసికొనినట్లు నేనును బ్రియురాలిదర్శించి నాన
యనశ్రవణంబులఁ జరితార్థములఁ జేసి. ననే? చిలుకవారువము నెక్కు
చిగురువిలుతుఁడును, గరుడగమనుఁడగు కమలలోచనుఁడును నెంత
ధన్యులో గదా? క్షణములోఁ గామితప్రదేశంబులకరిగి కృతార్థులవు
చుందురు గదా! మానవునకేశక్తియు లేదుగదా! మనుష్యుని దౌర్బ
ల్య మిట్టివిషయముల స్పష్టముగఁ గనఁబడుచుండును. ఆమెచిత్తవృత్తి
యెట్లున్నదో తెలియదు. మిత్రుఁడా! నీవు మాఱువేసమున శ్రీనగ
రమునకుఁబోయి తెలిసికొనలేవుగదా!" అని మకరందుఁడు పరిపరివిధ
ములఁ బ్రియురాలిచక్కదనముఁ దలంచి గుణములఁ దలఁచి తనకా
మెనుసంప్రాప్తించువిధ మెఱుఁగక వ్యథలుపడుచుండ మిత్రుఁడగుచం
ద్రచూడుఁడు వానివిరహసంతాపముం జూచిపరిహసించుచునిట్లనియె.

"వయస్యా! నీవులేదన్నను నేను నమ్మఁజాల. నీతల చెడిపోయి నది. ఏదో పిశాచము నిన్నావహించినది. తోఁటలలో దొడ్లలోనపరాహ్ణ మనక యర్ధరాత్రి మనక తిరుగఁగూడదు. నీకు భూతవైద్యము చేయింపవలెను. లేనిచో నిటువంటిపిచ్చియేమిటి? ప్రపంచములో నామె కన్న నందగత్తియ లేదందువు. ఆమెతల దన్నినవా రెందఱో యుండవచ్చును. కాదాయనంటె కొంచెమెట్టతోలు.ఆలుచిప్పలవంటికన్నులు. ఈమాత్రపువారు లోకముననుండకపోరు. తావలచినది రంభ తామునిఁగినది గంగ యన్నట్లు నీకంటికామె రంభలాగు మేనకలాగు కనఁబడుచున్నది. ఆమె నిన్ను మెచ్చకపోయినయెడల మఱియొక దానిని పెండ్లిచేసికొనవచ్చునులే. పెండ్లాలు దొరకకపోరు. నావంటి దరిద్రునకు వివాహముగాదుగాని నీకేమితక్కువయ్యా! ఈమెదాఁటి పోయినయెడల నేనేవెళ్ళి మఱొకదానిని గుదిర్చెదనులే." అనవుడు మకరందుఁడు "మిత్రుఁడా! వలపెట్టిదో యెఱుఁగని ఘోటకబ్రహ్మచారికి నీకు సుందరాంగులను మెచ్చుకొనుటగూడ దెలియునా! వలపులోని తీపి నీకపరిచితంబు గొడ్రాలు ప్రసవవేదన నెఱుఁగనట్లు బ్రహ్మచారి విరహతాపము నెఱుఁగఁజాలఁడు. ఆయెలనాగ నాకుఁ జేకుఱదేని నేను జన్మాంతముదాఁక బ్రహ్మచారినై యుండెద. కాని మఱియొకదాని కేలువట్టుఁ" అని మఱియేమో చెప్పఁబోవుచుండ నంతలో సేవకుఁడకుదెంచి "మహాప్రభో! ఎవ్వఁడో నూతనపురుషుఁడు మీకొఱకై వచ్చియున్నాఁడు" మీదర్శనము గోరుచున్నాఁడు. అని విన్నవించెను.

"పూవుదోఁటలోనున్ననన్ను నడిరేయి వెదకికొనుచువచ్చిన వారెవ్వరు చెపుమా! సరే! తోడ్కొనిరమ్ము" అని మకరందుఁ డానతిచ్చెను. సేవకుఁడాపురుషుని వెంటఁ బెట్టుకొని మకరందునిజూపి క్రిందికి దిగిపోయెను. నూతనపురుషుఁడు మకరందునకు వంగి జోహారు చేసి నిలువంబడియెను.

తెల్లని మొగము, తలమీఁద తెల్లనిపాగా, మోకాళ్ళనుదాకు తెల్లని నిలువుటంగి, పాదములను స్పృశించు తెల్లనిలాగు గల యప్పురుషుని జూచిమకరందుఁడు "మీ రేయూరు? మీ రేమిపనిమీఁద వచ్చిరి" అనియడిగెను. "అయ్యా! నాది కాశ్మీరదేశము. శ్రీనగరము కాఁపురము. నేను చిత్రభానుని సేవకుఁడను. నన్ను జయంధరుఁడందురు. ఆయనసందేశము మీకుఁదెచ్చితిని" అని యప్పురుషుఁడుత్తరము జెప్పెను.

"సందేశము నాకా, మాతండ్రిగారికా?" యని యతఁడు మరల నడిగెను. "స్వామీ! మీకే" యని యతఁడు బదులుచెప్ప "సరే! కూర్చుండి వినిపింపు" మని మకరందుఁడు పలికెను. అనవుడు జయంధరుఁడిట్లు విన్నవించెను. "దేవా! చిత్రభానుఁడు కాశ్మీరరాజ్యమును స్వాధీనము జేసికొని పాలింపఁబ్రయత్నించుచున్నాఁడు. అందు మీ సాహాయ్యమును గోరుచున్నాఁడు. అట్లు తోడుపడుదురేని తన కూఁతురు కర్పూరమంజరిని మీకిచ్చి వివాహముసేయఁ దలఁచుచున్నాఁడు." అనుచుండఁ జంద్రచూడుఁ డడ్డమువచ్చి "ఆమె కీతనిపై వలపున్నదా? బలవంతవివాహమా?" యని యడిగెను. నావుడు జయంధరుఁడు వెండియు నిట్లనియె. "స్వామీ! చిత్తగింపుఁడు. ఆమోహనాంగి మిమ్మేగాని మఱెవ్వరిని వివాహమాడదఁట. మకరందుఁడే నాబహిఃప్రాణము. ఆయన నన్ను వివాహమాడఁడేని నేను బ్రహ్మచారిణినై జీవితముగడపెదను గాని మఱియొక రాజకుమారుని కేలువట్టనని శపథంబు జేసెను. మీనిమిత్తమే తపము సేయుచున్నది. ఆమె శ్రీనగరముననున్నను మనస్సు నిరంతర ముజ్జయినిలో నుండును. విరహతాపమున నామె చిక్కి సగమైనది. రాజకుమారా! మీరు చేపట్టరేని యామె జీవింపదు. ఆశాబంధమే యామెనింతవఱకు నిలిపినది. ఆమె యవస్థఁజూచి తండ్రి మీకడకుఁ నన్నుంబంపెను. మీ రామెను

రెండుసారులు చూచియుండిరఁట. వెనుకనొకసారి విదర్భలో జ్వరపీడితయైనప్పుడు మంచిమందు లిచ్చి బ్రదికించిరఁట. రెండవసారి భిల్లుల బారినుండితప్పించి కాపాడిరఁట. ఆరక్షణమురక్షణముగాదు. నేఁడు గాచుటయే కాచుట. మీహస్తస్పర్శన మామె తాపము జల్లార్చును. మీముఖదర్శన మామె యలమటఁదీర్చును. ప్రస్తుత మామె స్వప్నములలో మిమ్ము దఱచుగాఁ జూచుటం జేసియు, మీ నామస్మరణంబు గావించుటం జేసియు నామె జపించుచున్నదిగాని లేనిచో నీపాటి కామె మఱియొకలాగైయుండును. మఱియు చెప్పవలసిన విషయములున్నవిగాని మగవాఁడనగు నేను శుద్ధాంతవాసినియైన యాఁడుదాని గుట్టు నింతకన్న విప్పిచెప్పనొప్పదు. అంతయు నీవే భావించుకొనుము" అని యూరకుండుటయుఁ జంద్రచూడుఁడు "సాహాయ్యము జేయని పక్షమున మీరాజు కూఁతును మకరందున కీయఁడాయేమి?" యని యడుగ జయంధరుఁడు "స్వామీ! అట్టిపరిస్థితి తటస్థించునేని గర్పూరమంజరి చిత్తమెట్టులుండునో చెప్పఁజాలను. ఐన నింతవలవంత గల కాంత తండ్రి కిష్టములేకున్నను దానెవ్వరిగూర్చి మేలుపడెనో యాతనినే వరించునుగాని వేఱుతెఱంగునఁ జేయునా?" యని బదులు చెప్పెను.

అదివిని మకరందుఁడు తనలో "హృదయమా! నీకింకను శాంతిఁగలుగదు. ఆయిందువదన హృదయము నిన్నుఁ గలియఁగోరుచున్నది గాని దానిలో నింకను మిషగలదు. తండ్రికి నేను సాయపడినఁగాని యది చేకుఱదు. నేనన్యథా వర్తించితినేని గర్పూరమంజరి చిత్తవృత్తి యెట్లుండునో గదా! దేవుఁడు వరమిచ్చినను నర్చకుఁడు వరమీయఁడన్నట్లు కూఁతు మేలుపడుచున్నను దండ్రి యంతరాయముఁగలిఁగింపవచ్చునుగదా! అయినను నామీఁద నామెవలపు నిలిపినదను చల్లనివార్త శ్రవణానందకరముగా వింటిని. ఇదియేచాలు. ఈ

పునాదిపై నాయాశాసౌధముం గట్టవచ్చును” అని తలంచి బహిరంగముగా నిట్లనియె. “జయంధరా! సాయముచేయుటకుఁగాని చేయక పోవుటకుగాని నేస్వతంత్రుఁడను గాదుగదా! ఇందుకు నాతండ్రిగారు సుదర్శనమహారాజుగారె ప్రమాణము. ఈవిషయమై వారితో నే బ్రసంగించి కర్తవ్యముగావించెద. నీవు మాయతిథివై యుండుము. మాపట్టణమునఁ జూడవలసినవిశేషములఁ జూడుము. కర్పూరమంజరి నన్నువలచి యనుగ్రహించిన దని శుభవర్తమానము చెప్పుటచే నిదిగో నీహారము నీకుఁ బారితోషికముగా నిచ్చుచున్నాను. గ్రహింపుము.”

అనవుడు మహాప్రసాదమని జయంధరుఁడు దానిం గ్రహించి “దేవా! మీకు నాపైఁగలదయకు సంతసించితిని. నేను మీయతిథినై యుండఁజాల. నాకీనగరమునఁ జుట్టములుగలరు. వారికడ నుండెద. సెలవొసంగుఁడు.” అని వంగి నమస్కరించి వాని యనుజ్ఞవడసి యచ్చోటు వాసిపోయెను.

అవ్వెనుక మకరందుఁడు చంద్రచూడుంజూచి “మిత్రమా! ఈతనివాలకము చిత్రముగానున్నది. నడక యాఁడుదానినడక. మాట లాఁడుదాని మాటలు పలుకు నప్పుడచ్చముగ నాఁడుదివలె గన్నులు త్రిప్పును. చేతులతో నభినయించును. ముదుకఁడగు బ్రహ్మదేవుఁడు మతిలేక యాఁడుదానిం జేయఁబోయి పొరపాటున మగవానిం జేసెఁగాఁబోలు!” నని యామెమాటలచమత్కృతిని సందేశార్థములను దలంచుకొనుచు నారేయిగడపెను.

తెల్లవాఱెను. మకరందుఁడు రేయియంతయు జాగరము సేయుటచే మిక్కిలి బడలి పరిజాగరణభారము నడలుటకయి వనలక్ష్మి మించు టద్దమువలె నున్నయక్కొలంకునీట స్నానమాడెను. చంద్రచూడుఁడు మిద్దెమీఁద గొడ్డువలెఁ బండుకొని గాఢముగ గుఱ్ఱుపట్టి నిద్రపోవుచుండెను. ప్రభాకరుని లేతకిరణములునయిత మాతనిని మేలు

కొలుపలేకపోయెను. మకరందుఁడు కూర్చుండినను నిలిచియుండినను స్నానమాడుచుండినను, నిటునటు దిరుగుచుండినను నతని మనస్సు సర్వావస్థలయందుఁ గర్పూరమంజరిమీఁదనే యుండెను. ఆమె తన్ను ప్రేమించునో లేదో యని మున్ను సంశయించుచుండెను. ఆమె తన్ను గాఢముగా వలచియున్నదని యిప్పుడు తెలిసినను జనకుని నియమమునుబట్టి యామె తనకు దుర్లభురాలని బెంగపెట్టుకొనెను. "ఏమిచేయుదు నిందెవరు నాకుఁ దోడుపడుదు" రని బూవుఁదోఁటలో నడయాడుచుండ సేవకుఁడొక్కఁడు వచ్చి "మహాప్రభూ! నాయన గారి సెలవైనది. దయచేయుఁడు" అని మనవిచేసెను. "ఇదే వచ్చు చున్నా" నని యాతఁడు వానివెంటం జనియె.

సుదర్శనమహారాజు స్నానము జేసి సౌగతమతప్రకారము నిర్వర్తింపవలసిన ప్రాతఃకాలకృత్యముల నియమపరతంత్రుఁడై నెఱపి పరిశుద్ధవస్త్రముల ధరియించి యంతఃపురమున రాయబారులకు దర్శనం బిచ్చు గదిలో నున్నతాసనంబునం గూర్చుండెను. ఆతని యెట్టయెదుట వృద్ధుఁడైన యొకబ్రాహ్మణుఁడు సముచితంబగు పీఠమునఁ గూర్చుండి సుదర్శనుఁ డడుగుప్రశ్నలకుత్తరము చెప్పుచుండెను. అంతలో మకరందుఁ డచ్చటికిఁబోయి తండ్రికి నమస్కరించి వానియనుమతిని బ్రక్కం గూర్చుండెను. సుదర్శనుఁడు "కుమారా! మన యెదుట నున్న యాబ్రాహ్మణుఁడు కాశ్మీరరాజమంత్రులలో నొకఁడగు మాధవసేనుఁడు. హేమచంద్రుని జ్యేష్ఠకుమారుఁడగు విక్రమసేనుని పంపున నన్నుం జూడవచ్చె. సందేశార్థములన్నియు విక్రమసేనుఁడు వ్రాసి యిచ్చిన లేఖలోఁగలవు. అది నీవొకసారి చూడు" మని యాజాబతనికిచ్చెను. మకరందుఁడు లేఖ నామూలాగ్రముగాఁ జదువుకొని విషయములన్నియు గ్రహించి మరల దానిని దండ్రిచేతికిచ్చెను. అంతట సుదర్శనుఁడు కుమారు నుద్దేశించి యిట్లనియె. వత్సా! బాలుఁడైన

విక్రమసేనుని జాబు జూచినదిమొదలుకొని నాకడుపు జాలిపెంపున జుమ్మలుచుట్టుచున్నది. హేమచంద్రునిం దలఁచిన నాకిప్పుడు సైతము గంట నీరువచ్చును. అతఁడు నేను సహాధ్యాయులము. అతనివంటి పరిశుద్ధుఁడు లోకమున లేఁడు. మంచితనము మూర్తీభవించినదని చెప్పవచ్చును. అట్టిమహారాజు దుర్మరణము పాలగుటయు, మాయలమారియగు చిత్రభానుఁడు రాజ్యమాక్రమింప దలఁచుటయు, విక్రమసేనుఁడు బాలుఁడగుటయు, దండనాథాది నియోగులు స్వామిద్రోహులగుటయుఁ దలంచిచూడ మనమవశ్యమాతనికిఁ దోడుపడవలయునని దోఁచుచున్నది. ఇంతకన్న హేమచంద్రునకు నేనేమి సాయముచేయగలను? అతఁడు సంతసింపకపోయినను వానియాత్మయైన నాయభిమానమునకు సంతసించును. నీవిందు కేమందువు? ఇదె నీకుసమ్మతమగునేని నేఁడు మొదలు సమరసన్నాహంబుగావించి కతిపయదివసములలోఁ జతురంగబలంబులం దోడ్కొని మనదండనాథుఁడైన కంఠీరవదేవుఁడును, నీవును శ్రీనగరమునకుం బోవలయును. నేనిచ్చటనుండి రాజకార్యముల నడిపెద. అట్లు పోవుటకు నీకిష్టములేదేని సేనాసమేతుఁడనై నేన కాశ్మీరమునకుంబోవుదు. నీవు నగరమునుండి నాస్థానమున రాజ్యపాలనము నెఱపుచుండుము."

అనవుడు తనప్రియత్న మక్కఱలేకయే పిత్రుప్రేరణంబునఁ దాను గాశ్మీరమునకుఁ బోవుటకవకాశము గలిగినదని కర్పూరమంజరీ దర్శనాభిలాష ముందరికిఁ ద్రోయ నతఁడు "దేవా! మీచిత్తమెట్లోయట్లుచేసెద. నన్నుబొమ్మన్న నేనపోదు. ఇచట నుండుమన్న నుందు. దేవరవారేప్రమాణము. కాని పెద్దలగుటచే మీరుకదలుటకు వీలులేదు. కంఠీరవదేవునిసాయమున నేనపోయి కార్యంబు నిర్వర్తించెదనని విన్నవించెను. "వత్సా! నాకదిపరమసంతోషము. నీవెంటరత్నసేనుని వానికుమారుఁడగు భద్రసేనుని తీసికొనిపొమ్ము. చంద్ర

చూడుఁడు పిఱికివాఁడు. యుద్ధమన్న వెఱచును. అతఁడు నీతోఁ రాఁడు కావున భద్రసేనుఁడే నీకుచెలికాఁడై హితోపదేష్టయై చేదోడై వాదోడై మెలఁగును." అని సుదర్శనుఁ డానతిచ్చెను.

అప్పుడు మాధవసేనుఁడులేచి చేతులుజోడించి వారుగావించిన యుపకారమునకుఁ దనకృతజ్ఞతఁదెల్పుచునిట్లనెను. "మహాప్రభూ! నేనువచ్చునప్పుడు మీరేమందురో యని మిక్కిలి సంశయించుచు వచ్చితిని. మీరుబాలుఁడగు విక్రమసేనుని మొకఁ జూపిన దయ నిరుపమానము. మిత్రులన్న నాపద్బాంధవులన్న మీరే. చనిపోయిన మిత్రుని దలంచి చిన్నవాఁడగు, వానికుమారున కెవ్వ రుపకారము సేయుదురు? పరోపకారార్థ మిదంశరీరమను వాక్యము, మీ యందు సార్థమైనది. మా రాజుపక్షమున మా రాజమాతపక్షమున, సమాత్యుల పక్షమున మీకు నే ననేక కృతజ్ఞతాపూర్వకవందనము లాచరించు చున్నవాఁడ. పాంచాలనరపాలుఁడగు మహేంద్రదేవుని దర్శనము చేసివచ్చితిని అతఁడుకూడఁ దనవాహినులను సాయముచేయుఁదలఁచినాఁడు. మీరుభయులు గూడి రేని చిత్రభానుని బరాజితుని జేయుట మిక్కిలి సులభము. నాకనుజ్ఞ నొసంగుదురేని మరలబాంచాలమునకరిగి పాంచాలసైన్యముఁ దోడుకొని నేను కాశ్మీరమునకుఁబోయి మీరాక కెదురుచూచుచుందునని వారిముకల గైకొని మాధవసేనుఁ డు వెడలిపోయెను.

అతఁడు నిర్గమించుటయు సుకరందుఁడు పరిస్థితులన్ని మాటి నందుకుఁ దనలో నిట్లువిచారించెను. "ఇప్పుడు నేనేమిచేయుదును! విక్రమసేనునికి సాయముసేయుమని మాధవసేనుఁడువచ్చె. తనకుఁ దోడుపడుమని చిత్రభానుఁడు దూతనంపె. చిత్రభాను పుత్రికయందు నామనసు లగ్నమైయున్నది. ఆమెకై నేనాతనిఁ జేపట్టుట యుక్తముగాదా! కాని ధర్మమాలోచించినపక్షమున బినతండ్రిచే వంచితు

డైన విక్రమసేనునికే నేను దోహపడవలయు. నామన స్సుయ్యాల లూఁగుచున్నది. ప్రాణసఖీసహాంగమునుఁ గోలుపోవుదునా, ధర్మపరిత్యాగము చేయుదునా? వివాహము లేకపోయినను సరే ధర్మమే నే ననుసరించెదఁ. "యతో ధర్మ స్తతో జయః" యను నార్యోక్తి సార్థకము గాకపోవునా!

ఇరువది మూఁడవ ప్రకరణము.

ధర్మదేవత మూర్తీభవించినట్లు జితప్రభానుఁడు కాశ్మీరమునఁ బ్రజాపాలనము సేయుచుండెను. సుప్రభట్టు ప్రజలకు బహిరంగముగ దర్శనమీయక చిత్రభానునకు నన్ని విషయముల దనుజనాయకునకు శుక్రాచార్యులట్లు హితోపదేశము చేయుచుండెను. విక్రమసేన హర్షవర్ధనులకుఁ దనమీఁద నెంతమాత్రము ననుమానము లేకుండునట్లు జితప్రభానుఁడు ప్రవర్తించుచుండెను. రాజకుమారులచేతఁ బగలు విద్యాభ్యాసము చేయించుచుండును. తగినశిక్షకుల నేర్పఱచి సాయంకాలములవారికి విలువిద్దియ నేర్పించుచుండెను. ప్రతికార్యమునందును విక్రమసేనునియాలోచన మడుగుచుండును. సింధుగాంధారవసుంధరాధిపులదండయాత్ర లెందుచేతనో, యాఁగిపోయెను. రాజ్యనౌకయొక్క చుక్కాని దాను ద్రిప్పుచుండుటచే బరరాజులు భయంపడిరి. దండయాత్రలు మానిరని యతఁడు సైనికులతోడను దండనాథులతోడను, నృపకుమారులతోడను నగరవాసులతోడను పలుమాఱు చెప్పుచు వచ్చెను. మఱివర్మను మొదటఁ దలఁచినట్లు చిత్రభానుఁడు ధన మునిమిత్రమే హింసింపలేదు గాని కారాగృహమందు బంధించియుంచెను. అతనికట్టి సౌకర్యములు నోడఁగూర్పఁబడ లేదు. స్నానమునకు

జలమైన నతనికి దుర్లభమయ్యెను. దినమున కొక్కసారి జొన్నరొట్టె లభింపఁజొచ్చెను. కటికనేలం బండుకొనుచుండెను. మాసినగుడ్డలైన నుదికించుకొనుట కుత్తరవులేదు. త్రాగుట మొదలయిన యెల్లపనులకు నొక్క మంటిముంతమాత్రము వానికీయఁబడెను. జీవమునకయిన నుండనిచ్చుటకు దండపాణి మాటసాయమె ముఖ్యకారణమై యుండవచ్చును. పురరాలో చనమీఁద దండపాణి కిష్టము లేనిపని గావించుట తనకు శ్రేయస్కరము గాదనితలంచి చిత్రభానుఁడు హింసా ప్రకరణమునుండి మరలియుండవచ్చును.

చిత్రభానుఁడు వేఁటయందు మిక్కిలి తమకముగలవాఁడు. మృగయాక్రీడయందుఁ దనకు సహాయుఁడైన విజయసేనునకును విక్రమసేన హర్షవర్ధనులకును నభిరుచి గలిగించెను. వేఁట పేరు చెప్పినవారు మిక్కిలి యుత్సాహముతో వెడలుచుండెడివారు. విక్రమసేనుఁడు చిన్ననాఁట నుండియు మృగయాక్రీడ కలవడినవాఁడగుటం జేసి వేఁటకితఁడు ముందడుగు వేయుచుండెను. రెండుమూఁడుసారులు పినతండ్రి వెంట వారును మృగయాక్రీడలకరిగి సాయంకాలమున కింటికివచ్చిరి. ఎన్నఁడో యేదో యపకారము చేయునని మహాభయము బిడ్డలకుఁ దల్లికి నుండినను చిత్రభానుని వర్తనముకొంతవఱకు వారికి నమ్మిక గలిగించుచుండెను. అయినను వారు జాగరూకులై యుండిరి.

అట్లుండ నొకనాఁడు చిత్రభానుఁడు విక్రమసేన హర్షవర్ధనులు విజయసేనుఁడు దండపాణి వజ్రపాణులు మఱికొంద ఱాప్తులుఁ బరివేష్టింపఁ గొలువుండి నగరవాసుల వ్యవహారములఁ దీర్పులు చెప్పుచుండ సూర్యాస్తమయసమయమున మసకచీఁకటులు పడుచుండ నొకయాటవికుఁడు గోచిపెట్టుకొని కంబళిమీఁదఁ గప్పుకొని చేతనొక దుడ్డుకఱ్ఱఁ బట్టుకొని పరుగుపరుగునఁ గొలువుకూటమునొచ్చి "దండాలుసామీ! దండా" లని నేలసాగిలంబడి మొక్కనిలిచెను. "ఎవఁడవు నీవు?

ఏమిపనిమీఁద వచ్చితి" వని చిత్రభానుఁడడిగెను. అందుకువాఁడు ప్రభువుతో నిట్లు మనవిచేసెను.

"నేను గొల్లలచిన్నవాఁడను దేవరా! మంచుకొండదగ్గఱ చాఱలమెకములు చిఱుతపులులు సివంగులు పెచ్చుపెఱిఁగి మాపసరములను గసగస నమలివేయుచున్నవి దొరా! పసులమందలుతగ్గిపోయినవి. ఏలినవారు వేటలాడి యామెకాలను చంపి మాకింతకూడుపెట్టవలె దేవరా! లేకున్న మేము బ్రతుకఁజాలము. పసరాలే మాసొమ్ములు పసరాలేమా బ్రతుకులు రక్షించు దేవరా! రక్షించు"అని మొఱవెట్టెను.

వాని కుయ్యాలించి చిత్రభానుఁడు కన్నకొడుకును నన్నకొడుకులను జూచి "వేఁటకై పురిగొనఁ మా? గోరక్షణముకన్నఁ బుణ్యకార్యము లేదు. అది యుభయతారకమయిన సత్కార్యము. పాపమీ పేదగొల్లలు మనకవశ్యము రక్షణీయులు." అని యడుగ వారు మువ్వురు వల్లెయని యుత్సాహముతోఁ బలికిరి. మఱునాఁడుదయమున మృగయాత్రకుఁ గావలసిన సన్నాహమంతయుఁ జేయఁబడెను. ఉరులు, నుత్తులు, వేఁటకుక్కలు, జగుజుగండెలు, దీపములు, బోనులు, విండ్లు, సమ్మెలు, బల్లెములు పట్టుకొని వాటినుపయోగించుటయందు నేర్పరులగు వేఁటకాండ్రు మహోత్సాహముతో గొలువఁ జిత్రభానుఁడు వేఁటకై బయలుదేఱెను.

"మంచుకొండ చాలదూరము. కొన్నిదినములకుఁగాని వచ్చుటకు వీలులేదు. ఎప్పటివార్త లప్పటికిఁ దెలియవు. మనస్థితి బాగులేదు. ఏనమట్టిదో తెలియదు. కావున మీరు పోవలదు. నాయనలారా" యని యరవిందాదేవి బిడ్డలం బతిమాలెనుగాని వేఁట తమకము వారిని ముందుకు గెంటెను. మహోత్సాహముతో మువ్వురుకుమారు లొకరథ మెక్కిరి. చిత్రభానుఁ డొకరథ మెక్కెను. పరివారము కాలినడచెను. దండపాణియు స్వల్పసైన్యముతో వారి వెను

వెంట జనెను. ఆబలఁగమెల్ల హిమవత్పర్వత ప్రాంతమున కరికి గుడారములలో బసచేసి యైదుదినములు వేఁటాడి మిక్కిలి మెకములఁ జెక్కంటి నుక్కడించి గొల్లపల్లెలయుఁ యిక్కటులఁ దొలఁగించిరి.

విక్రమసేనుఁడు మూఁడుపులులం గొట్టెను. హర్షవర్ధనుఁడొక్క చిఱుతం జంపెను. విజయసేనుఁడు రెండు భల్లూకములఁ గడతేర్చెను. చిత్రభానుఁడు రెండు సింగంబులం గూల్చెను. దండపాణి రాత్రివేళ మంచెమీఁద బొంచుండి చెఱువులో నీరుద్రావుచుండ గొప్ప పులియనుకొని యొకగాడిదను జంపెను. అయిదుదినములు వేఁటాడి విశ్రాంతినిమిత్తమై వారు గుడారములు విడచి సమీపమున నొక కొండమీఁదనున్న చిన్నకోటలో విడిసిరి. అక్కడ రెండుదినములు గడపిరి. అక్కడి ప్రకృతిసౌందర్య మతిమనోహరముగా నుండెను. ఆయున్నతప్రదేశమునుండి చూడఁ బ్రథమచరమసంధ్యారాగముల విశేషశోభాసౌభాగ్యము పద్మరాగమణీయకాంతులను మించి వారి కన్నుదోయి కమితానందముఁ గూర్చెను. ఆకాశము నందుకొనుటకు హిమవంతుఁడు చాఁచినదీర్ఘబాహువులో యన్నట్లు వెలయుమహోన్నత శృంగములతోడను, కొండరాజు తొడిగిన తెల్లని నిలువుటంగీయో యనునట్లు విలసిల్లు మంచుతోడను చేవయు నున్నతియు దట్టమయిన యాకులగలిమియుఁ గలిగి సూర్యరశ్మినడ్డగించు మహావృక్షములతోడను నింద్రధనుస్సువలె నానావర్ణములుగలిగి నలుగెలంకులఁ బరుగులెత్తు విహంగములతోడను, ప్రాయములు నైశ్వర్యములు నిల్లే యతివేగంబునఁ గడచిపోవునని నీతి లోకంబునకుం దెలుపుటకో యన నతివేగంబున మీఁదినుండి క్రిందికిఁ బ్రవహించు సెలయేళ్లతోడను, కొండగుహలు ప్రతిధ్వనులిచ్చునట్లు బొబ్బలిడు బొబ్బ మెకంబులు బెబ్బులులు మొదలగు ఘాతుకమృగంబులతోడను విల్లు చేబూని మెకంబుల వేఁటాడుటకయి విసవిస నడచిపోవు వేఁటకాం

డ్రితోడను, వేటకాండ్రు వెనువెంట వారి కమ్ములనందించుచు నుత్సాహముఁ గలిగించుచు నడచు కిరాతాంగనలతోడను విరాజిల్లు నమ్మంచుగొండం జూచి విక్రమసేనుఁడు మును పెన్నఁడుఁ బట్టణంబులఁ జూచినప్పుడు పొందని మహానందము నొంది తమ్మునకు విజయసేనునకు, వనంబులకు నుపవనంబులకుఁ గలభేదంబు దెలుపుచుఁ దొల్లి యిందే మహేశ్వరుంగూర్చి గౌరి యఖండతపంబు గావించె. ఇందే జగంబునకు మాతాపితలు పురాణదంపతులు నైనపార్వతీపరమేశ్వరులకుఁ గల్యాణమహోత్సవము జరిగె. ఇందే సప్తమహర్షులు ననేకయాగములుజేసి హవిర్భాగములచే వేల్పులం దనిపిరి. ఇందే నరనారాయణ నివాసమైన బదరికాశ్రమ మున్నది. ఇందే గంగానది మొట్టమొదట నెలవుజేసికొన్నది" యని తత్సంబంధములయిన పురాణగాథల వర్ణించుచు నా రెండుదినములు గడపెను. రెండవనాఁటిరేయి వారందఱు సుఖముగా భుజియించి ప్రియభాషణంబులు సలిపి పండుకొనిరి. విక్రమసేనుఁడు హర్షవర్ధనుఁడు నొకగదిలో శయనించిరి. చిత్రభానుఁడు విజయసేనుడు మఱియొకగదిలోఁ బవళించిరి. కొలఁది పరివారము నచ్చటనుంచి కార్యాంతరములమీఁద దండపాణి యా సాయంకాలమే పట్టణాభిముఖుఁడై పోయెను.

విక్రమసేన హర్షవర్ధనులు గాఢనిద్రావసక్తులై యెప్పటియట్ల ప్రభాతకాలమున మేల్కొని లేచిరి లేచిచూచునప్పటికి విజయసేనుఁడు చిత్రభానుఁడు వారి కగపడలేదు. ఏఁబదెనుంది యాయుధహస్తులయిన సైనికులును తమకు పనులు నుపచారములు మొదలగునవి చేయుటకు సిద్ధము ముగ్గురు సేవకులు మాత్రము గనఁబడిరి. "పినతండ్రి యెందరిగెనని విక్రమసేనుఁడు సైనికులలోఁ బ్రధానపురుషుఁడగు శక్తిసన్నయను వాని నడిగెను. "మహాప్రభూ! ఏదో తొందరపని మీఁద వారు మిమ్ము లేపుటకైన నవకాశము లేక గుమాసుని నిఁగిలిన

పరివారమును వెంటఁగొని నిన్న నడిరేయి పురమునకుం జనిరి. ఇట్లు మీతో మనవిసేయుమని నాకానతిచ్చి" రని యాతఁడు బదులు చెప్పెను.

"ఏమీ! తొందరపనిగలిగెనదా? మమ్ముఁ లేపుటకైన నవకాశము లేకపోయెనదా: కుమారుని బరివారమును వెంటఁగొని చనెనా? ఆహా! మాయమ్మ పోవలదని చేసిన హితోపదేశమును నేను నిరాకరించి మోసపోతినిగదా!" యని విక్రమసేనుఁడు తమ్ముని జూచి "హర్షవర్ధనా! ఎంతయు మోసము వాటిల్లినది. మనల నిందువిడిచి బుద్ధిపూర్వకముగా విజయసేనునిం దోడ్కొని చిత్రభానుఁడు పురమున కరిగినాఁడు. దురాత్ముఁడను వేఁటకు నే నొక్కఁడనురాక నిన్నుఁ గూడ దీసికొనివచ్చితినిగదా మనరాకకై యెంతో యాత్రముతో నిరీక్షించుచుండు మనతల్లి మనము గానఁబడకపోవుటచే నెంతగుందునో, యెంత బెంగపెట్టుకొనునో, యామె చిత్తమెంత క్షోభించునో, ఆ మెహృదయము భిన్నముగాకయుండునా! ఇంకనామె యన్నము దినునా? నిదురించునా! మనకది కారాగృహముగాని గృహముగాదు: మనమిక మీఁద బందితులముగాని రాజపుత్రులముగాము. ఈఘాతుకకృత్యము చేయుటకే యతఁ డీవేఁటపన్నుగడ పన్నినాఁడు. అతని సంకల్పము ముప్పాతిక నెఱవేరినది. మనకిందు దిక్కులేక మనమొఱలువినువారు లేక మనసంతాప మార్చువారు లేక మనకోరికల దీర్చువారు లేక యీవనవృక్షములట్ల యెన్నఁడో నాశనమొందవలసియుండును. అహా! ఏమిగతి! తమ్ముఁడా నేఁబోయిన విచారము లేదు. నీవయిన నమ్మకొఱకుండిన బాగుండును గదా!" యని విచారగతుఁడై పలికెను.

అదివిని హర్షవర్ధనుఁడు "అన్నయ్యా! నీవేలపోవలె నేనెందు కుండవలె నేను నీతోడివాఁడనే. ఉండిన నిరువురముండము. పోయిన నిరువురము పోదము. నీవుచెప్పినట్లుతల్లి పొందుతల్లడమింతింతగాదు.

ఆమె జీవింపనేజీవింపదు. అమ్మ దూరదృష్టిగలదై యిట్టియాపదల శంకించి మనలం బోవద్దన్నది. మనమామె మాటవిన్నాముకాము. మాతృశాసనతిరస్కారమునకుఁ దగినఫల మనుభవింపవలయునుగదా" యని దీనాననుఁడై ప్రత్యుత్తరమిచ్చెను.

ఆదినమునవారు వంటలుచేసి సేవకులుపిలిచినను బతిమాలినను భుజింపలేదు. శక్తివర్మ వారికడఁజేరి "ప్రభువులారా! భోజనము సేయుఁడు. ఎన్నిదినములు మానెదరు? ఇది యొక్కనాఁటిదిగాదు. మీకిదిశాశ్వతమైనచెఱ. మీరీయిల్లుగదలి యావలికిఁబోకుండ మమ్ము మీపినతండ్రి కాఁపుఁబెట్టెను. నాచిన్నియన్నలారా! అంతటిమహారాజు గర్భమునఁబుట్టి యంతటి మహైశ్వర్యము ననుభవించి తుదకిట్టి దురవస్థపాలయినమిమ్ముఁజూడ మిక్కిలి కఠినుండనయిన నాహృదయముగూడ చలించుచున్నది. మేమేమి చేయఁగలము? సేవకులము. దుర్భరమయిన కుటుంబరక్షణమునకుఁగా శరీరమన్యుల కమ్ముకొన్నాము. ప్రభువులయాజ్ఞ శిరసావహింపవలయు. లేనిచో మాబుఱ్ఱలెగిరిపోవును. మాకూఁడు పడిపోవును. కడుపుకక్కుర్తికై ప్రభువుల కడఁగొలువుచేసి యిట్టిదుష్కార్యములు చేయవలసి వచ్చినందుకు మేము మిక్కిలి దుఃఖపడుచున్నాము మాకు స్వాధీనమయిన పనిలేదు. సేవకులంతఃకరణము చంపుకొని గుండెరాయిచేసికొని యుండవలయు మేము మనుష్యులలో లెక్కగాదు. కాబట్టి మమ్ముల క్షమింపుఁడు నాయనలారా" యని కంటనీరు పెట్టుకొనెను.

"శక్తివర్మా! నీవేమిచేయఁగలవు? మేమదృష్టవంతుల మయిన పక్షమున మాతండ్రికట్టి దుర్మరణమేల కలుగును? చిత్రభానున కిట్టి దుర్బుద్ధి యేలపుట్టును? ఒకరిని నిందింపనేల? మాభాగ్యమునే నిందించుకొందుము నీవువిచారింపకుము" అని విక్రమసేనుఁడు వాని నూఱడించెను.

ఇరువది నాల్గవ ప్రకరణము.

చిత్రభానుఁడు వేఁటనుండి కుమారునితోడను బలగముతోడను మరలివచ్చెనని విని యరవిందాదేవి తనకొడుకులుగూడ వచ్చుచున్నారని వారింజూచి యానందింప నుబలాటపడుచుండ వారెంతసేపటికి రారయిరి. ఆమె సాయంకాలమువఱకు వారినిమిత్తము నిరీక్షించి యాత్ర యంతకంత కెక్కువకాఁగఁ దన నందనులు రాకపోవుటకుఁ గారణమేమో తెలిసికొనిరమ్మని దండపాణియొద్దకు సేవకుల నంపెను. తనకావిషయ మెంతమాత్రము తెలియదని యాతఁ డుత్తరము జెప్పెను. బెంగ యినుమడింపఁ బుత్రవత్సలయయిన యా దేవి నలుగురు బంట్లు నాలుగుప్రక్కలకంపి వేటకాండ్రను దద్విషయమై కనుఁగొనిరమ్మని పంపెను. తమకావిషయము తెలియదని వాండ్రును జెప్పిరి.

అరవిందాదేవి తొట్రుపాటు వర్ణనాతీతమయ్యెను. అప్పుడామె వృద్ధకంచుకియయిన ముంజునింబిలిచి చిత్రభానునియొద్దకరిగి తద్విషయ మరసిరమ్మని పంపెను. వాఁడును సత్వరంబ యరిగి యతనికిజోహారొనర్చి వినయపూర్వకముగా రాజకుమారు లేలరాలేదని యడిగెను అతనికిఁ జిత్రభానుఁడిట్లనియె. "కుమారులు సేమముగానున్నారు. మంచుకొండ చరియలలో నొకదానిమీఁద మనోహరమైన కోటఁ గలదు. వారక్కడ గొంతకాలముండి యవ్వన సౌందర్యము శైల సౌందర్యముఁ జూడవలయునని కోరుటచే వారినక్కడ నుంచివచ్చితిని. భయములేదని మీరాణిగారితోఁ జెప్పు. పో."

ఆమాటవిని ముంజుఁడు వెంటనే రాజనగరున కరిగి యేమి యుత్తరము వచ్చునోయని తత్తరపడుచున్న రాణికెఱింగించెను. అమ్మాటలు శూలపుంబోటులువలె నామెకర్ణములనాఁట నిలువనేరక నేల గూర్చుండి "అయ్యో? నర్మదా! నర్మదా! దురాత్ముఁడయిన చిత్ర

భానుఁడు నాకొడుకులఁ గడతేర్చినాఁడేతల్లీ! కటకటా! నాపసిపాపల నితఁడు తకకడుపునఁబెట్టుకొననే. అయ్యో! ఏమిసేయుదునే! నర్మదా! ఏదోఘాతుక కృత్యము జరిగినదే. ఓసీ! నేనునిలువలేను. నా గుండెలు కొట్టుకొనుచున్నవి. మనస్సు మండుచున్నది. ఒడలు వడఁకుచున్నది. తల తిరుగుచున్నది. కన్నులుచీకట్లు గ్రమ్ముచున్నవి. నీవు వచ్చి పట్టుకొనవేనన్ను. ఎవరితోఁ జెప్పుకొందునే! మణివర్మలేఁడు మాధవసేనుఁడులేడు. గధాధర శూలపాణులులేరు. ఎంతదిక్కుమాలినదాన నైతినే! ఇప్పుడేమియుపాయమే ? ఆలోచన చెప్పువారయినలేరే! నీవేమనియెదవే!" యని పరిపరివిధముల నాక్రోశింపఁ దొడఁగెను.

ఆమెదుఃఖముజూచి నర్మదవెఱపుంజాలియు మల్లడిగొన నేమి చెప్పుటకుందోఁచక నెట్లుసమాశ్వాసించుటకు నుపాయము గానక "అమ్మా! నేను పోయి నీమఱఁదిగారిని గనుఁగొని వత్తునా" యని యనెను. "ఓసీ! నీవుకాదు వెళ్ళవలసినది. నన్నేయచ్చటికిఁ దీసికొని పొమ్ము. నేనాయిందుమణి యడుగులమీఁదను గర్పూరమంజరిపాదములయొద్దను బడి నాచిన్నియన్నల నాకర్పింపుమని ప్రార్థించెద. తీసికొనిరా. రథము తీసికొనిరా. జాఁగుసేయకు. నిమేషమాత్రమాలసించితివా యేమిజరుగునో నీవేయెఱుఁగఁగలవు" అని కఠినముగాఁ బలుకుటయు నర్మద యప్పని తప్పదని సారథినొక్కనిం బిలిచి యరదంబు పన్నించి దేవినందుఁ గూర్చుండఁబెట్టి దాను నామెప్రక్కను గూర్చుండెను.

కోటకావలి నిమిత్తము చిత్రభానునిచే నియమింపబడిన యొ అనుజోదులు స్యందనము నిలిపి కోటలోఁ బండి యావలికెవరింబోని య్యవలదని చిత్రభానునియాజ్ఞ యయినదని తెలిపిరి. అప్పలుకులు విని మహాగ్రహపూరితచిత్తయై కోపావేశంబునఁ బలుకులు తడబ

డ నరవింద రథములోనుండి బిగ్గరగా "ఓరీ! ఎవఁడురా నాస్యందన మాఁపఁగలవాఁడు ? ఈరథ మెవ్వరిదిగా దలంచితివి. హేమచంద్రమహారాజ పట్టమహిషియుఁ గుమార విక్ర సేనుని మాతయునగు నరవిం దదిగా గ్రహింపుఁడు. ఆనయిచ్చుటకుఁ జిత్రభానుఁ డెవ్వఁడు? నిలుపుటకు మీ రెవ్వరు? సూతుఁడా! రథము సాఁగనిమ్ము. ఎవ్వరేనినడ్డమువచ్చిన నేనే రథము దిగి గుఱ్ఱముముందర నడచెద. వారిప్రభువు నాజ్ఞాప్రకారము నన్నుం జంపుమనియీబంట్ల తోఁ జెప్పుము" అని పలికెను. భీషణమ్మైన యాభాషణములు ధైర్యశోషణముగావింప నాజ్ఞోదులు భయకంపితులై యేమియుఁ ననఁజాలక నోర్తిగిలిరి. రథము నిరంతరాయముగ సాఁగి చిత్రభానుని గృహముముందరి కరిగి నిలిచెను. కుమారవియోగ సంజనితమయిన మనస్తాపమున నొడలెఱుఁగక దేవియెదుటనున్న వారెవ్వరో తెలిసి కొనకయే ధర్మద దారిజూప సింహద్వారముదాఁటి లోపలికవాటము లుదాఁటి యభ్యంతరమందిరమున కరిగెను. అరిగి "యిందుమణి యెక్కడ? ఇందుమణి యెక్కడ?" నని విచారించి సేవకులవలన నామెయున్న చోటెఱిఁగి యాతావునకుం జనెను.

అప్పుడు కర్పూరమంజరియు నిందుమణియు నొకమంచముపై గూరుచుండి యేదో మాటలాడుచుండిరి. విజయసేనుఁ డామెరాక జూచి విసవిస మేడమీఁదికరిగి తండ్రి కెఱిఁగించెను. అరవిందాదేవి తనయింటికి వచ్చునని చిత్రభానుఁడెన్నఁడు దలఁపలేదు. అతఁ డదరి పడెను. రుద్రభట్టు మహాశ్చర్యము నొందెను. వెంటనే చిత్రభానుఁడు మేడదిగి క్రిందికివచ్చెను. అరవిందాదేవి గదిప్రవేశించినతోడనే మహాశ్చర్యముచేఁ గన్నులు పెద్దవిచేసి చూచి యిందుమణియుఁ గర్పూరమంజరియు మంచముమీఁదినుండి దిగ్గునలేచి నిలిచిరి. అర వింద వారియిరువురపాదములపైఁ బడి "అమ్మా! పుత్రభిక్షము పెట్టుఁడు పుత్రభిక్షము పెట్టుఁడు" అని వేఁడుకొనెను.

ఆగోడవ వారేమియు నెఱుంగకపోవుటచే వారిరువురుఁ దెల్లబోయి చేతులతోఁ నామెనెత్తి "అయ్యో! ఇదియేమివెఱ్ఱి? మాయుడుగులమీఁద బడఁజెల్లునా? తల్లీ! మీముందర మేమెంతవారము? బిడ్డలకేమియాపద వాటిల్లెను?" అని తొట్రుపాటుతోఁ బలికిరి. అందు కరవింద వారంజూచి తనకొడుకులు చిత్రభానునితో వేఁటకరుగుట, బలగమంతయువచ్చినను వారు రాకపోవుట, కొండకోటలో నున్నారని చిత్రభానుఁడు చెప్పుట మొదలగు వృత్తాంతమంతయుగద్గదస్వరముతో దుఃఖపూరితయై తెలిపి "తల్లీ! కర్పూరమంజరీ! నీవు నాకన్నకూఁతువుగాకున్నను నిన్నే నాబిడ్డగాఁ జూచుకొంటి. ఇద్దఱు మగబిడ్డలు నాకొక యాఁడు బిడ్డ యని సంతసించుచుంటిని. అమ్మా! నీతమ్ముల రక్షింపుము. తమ్ములం జూపుమని నీ తండ్రి నడుగుము. చూపఁడేని ఇదిగో! నేను రాచకూఁతురను సాహసంబులందు ముందంజవేయుదానను. ఇదిగో! నాచిన్నకత్తి మొలలోనున్నది. ఇప్పుడే నీతండ్రి చూచుచుండ నీవు నీతల్లియుఁ జూచుచుండఁ బొడుచుకొని బిడ్డలకు దూరమై, భర్తకు దూరమై, వసుంధరాదేవికిని మీకును భారమైన యీశరీరము మీతండ్రిపాదములయొద్ద విడిచెదను. ఆయన కనులు చల్లఁబడుఁగాక! ఇదివఱకే భ్రాతృహంతయని పేరువచ్చినది. ఇప్పుడు శిశుహంతయైనాఁడని నాయనుమానము. ఇప్పుడు నాచావుచే నాయన పాపశరీరమునకు మకుటమేర్పడును. బిడ్డా! కర్పూరమంజరీ! పద. నీతండ్రియొద్దకుఁ బద. తల్లీ! యిందుమతీ! పద నీపతికడకు పద" అని మిక్కిలి యార్తయై తీవ్రముగ భాషించెను.

చిత్రభానుఁడు ప్రక్కగదిలోనుండి యప్పలుకులు వినుచుండెను. రుద్రభట్టు వానప్రక్కనేయుండి యతని చెవిలో నేదో గుసగుసలాడుచుండెను. కర్పూరమంజరి యామె దీనదశఁ జూచి మెత్తనిచిత్తము మిక్కిలి యుత్తలపాటునొందఁ దత్క్షణంబునఁ దండ్రికడ

కరిగి "నాయనా! ఏమిది? తమ్ములేమయిరి? ఎందుండిరి. కుశలముగనున్నారా? ఆమెబిడ్డల నామెకప్పగింపుము. నీకే యపవాదమేల? ఇదివఱకే నీతలపైఁబడిన లోకాపవాదములు చాలవా? ఆదుర్యశోభారమున నీవెగాక మేముగూడ గ్రుంగిపోవుచుంటిమి. ఆయపకీర్తియను నంధకారమువలన మనకులప్రతిష్ఠ నల్లఁబడినది. సత్వర మామెబిడ్డల నప్పగింపుము" అని మందలించెను.

చిత్రభానుఁడు బిడ్డనుడువుల నాలించి "అమ్మాయి! నీతమ్ములు కుశలముగనున్నారు. ఏల యీమె తొందర? వారు హేమవత్పర్వతసౌందర్యముఁ జూడ నుబలాటపడుటచే నచ్చట నునిచితిని. పది దినములలో వత్తురు. మహారాజ్ఞి అంతఃపురవాసిని ఈమయేమి, యీరాత్రి తొందరతో వచ్చుటేమి! ఇంత మనక్షోభమెందుకు? ఏమిమునిఁగిపోయినది. ఇప్పుడు కోటకు జనుమనుము" అని నిర్విచారముగ నుత్తరమిచ్చెను.

అదివిని యరవిందాదేవి మహారోషమున నిట్లనియె.— "ఏమి మునిఁగిపోయినదా? నామనస్సు దుఃఖమున మునిఁగిపోయినది. మీ పలుకులు నే నమ్మఁజాలను. ఒకవేళ వారు బ్రతికియేయుండిన వారని నీవు చెఱలో బంధించితివి. అందుకే యమాయకులైన పసిబిడ్డలను మాయమాటలుచెప్పి వేఁటవంకబెట్టి దూరము తీసికొనిపోతివి. నేను రాణినా? నేను రాణినిగాను. నేను నీదాసిని. నా రాణితనము నాఁడేపోయినది. నేను కోటకుంజనను. నాబిడ్డలులేని కోట శ్మశానముగాని కోటగాదు. నాచిన్నియన్నలులేని నగరుఁ నట్టడవిగాని నగరు కాదు. నాబహిఃప్రాణములు లేనియాభవనము సముద్రముగాని భవనముగాదు. ఆకోట నేఁ బ్రవేశింపను. నాబిడ్డలఁ జూచినదాఁక యానగరులో నే నడుగుపెట్టను. నన్నుఁజంపి శవమును శ్మశానమునకయినఁ బంపుము. లేదా నాకొడుకులయొద్దకయినఁ బంపుము. వారింజూడమి

నాకన్నులు వాఁచిపోయినవి. ఏరీ! నారత్నాలరాసులు? ఏరీ! నాబంగారుబొమ్మలు? ఏరీ! నావరాలకుప్పలు. ఏరీ! నాసింగపుఁగొదములు. ఏరీ! నాముద్దులమూటలు. ఏరీ! నా గారాల కాణాచులు. చూపవా? ఇదిగో చూరకత్తి పొడిచిచంపు. నీచేతులతోనే నన్ను నాభర్తయొద్దకుఁ బంపు." అని యతని కాళ్లసమీపమున నేలపై సాగిలఁబడెను.

అప్పలుకులు విన్నవారందఱు భయమున గడగడవడఁకిరి. ఱాతిగుండెగల చిత్రభానుని మేనుసయితము కంపించెను. "ఇది మనకుఁ దగదు. ఆమెను బిడ్డలయొద్దకైనఁ బంపుఁడు. లేదా, బిడ్డల నామెయొద్దకైనఁ దీసికొనిరండు" అని యిందుమణి చెప్పెను. "తండ్రీ! నాగుండెలు ప్రేలుచున్నవి. నాతమ్ములం దీసికొనివచ్చి యీమెకుం జూపుము. నేనువారిం జూడనలఁతు" నని కర్పూరమంజరి జనకునితోఁబలికెను. అప్పలుకులు విని చిత్రభానుఁడు "ఆమెయు మీరు నింతనిష్ఠురోక్తులు బలుకనేల! ఆమె నిప్పుడె బిడ్డలయొద్దకు బనిచెద. ఉండుఁడు" యని యువ్వలికిం జని కరటకపింగళులం బిలిచి వారితో నేదో పరసమయములు చెప్పి మరల వచ్చి, యీసేవకు లిరువురు నీరథముపైవచ్చి నిన్ను నీబిడ్డలున్నచోటికిఁ దీసికొనిపోఁగలరు. వదినె! రథమెక్కుము. నర్మదంగూడ దీసికొనిపొమ్ము నీవు నీబిడ్డలంగలిసి మరల నిక్కడికి సుఖముగా వత్తువుగాక! " అని చెప్పెను.

"నాకిదే మహోపకారము. ఇదేపోయివచ్చెద" నని వారినందఱి నామంత్రణముచేసి యరవిందాదేవి నర్మదంగూడి యరదమెక్కెను. కరటకపింగళులు సారథికిరువంకల నయ్యరదముమీఁదనే కూర్చుండిరి. పయనముసాగెను. కరకటపింగళులు చూపినదారినె సూతుఁడు స్యందనముఁ దోలెను.

అట్లు రెండుదినములు వారు ప్రయాణముచేసి రెండవనాఁటి సాయంకాలమునకు నట్టడవుల నడుమనున్న యొకచిన్న కొండకోటం

చేరిరి. ఆకోటచుట్టుఁ గొండలుగలవు. ఒకటిరెండుచెంచుల పల్లియలు గలవు. "ప్రయాణశ్రమచే మేము మిక్కిలి యలసితిమి రెండుదినము లిక్కడ విశ్రమించి పిమ్మట మీకొండకలున్న చోటికిఁ బోవుదు"మని కరటకపింగళులా దేవితోఁ జెప్పిమిక్కిలి కష్టముమీఁద నామె నొడంబఱిచిరి. వారక్కడనుండగానే ముప్పదుగురు జోదులు సాయుధులై వచ్చి వారిం జేరిరి. ఈబలగమెందుకని యనర్మదాదేవి కరటకపింగళుల నడుగ మనము కొండలోనుండి పయనము సేయవలయు. మన కంగరక్షగా మీమఱఁది పంపె" నని వారుత్తరము చెప్పిరి.

ఆబలగముచేరిన మఱునాటిరేయి నెల్లరు గాఢనిద్రం దగిలి యుండఁ గరటకపింగళులు నిదురించుచున్న సూతుని మెడ కురిబోసి వానిం గడతేర్చి యొకకొండవాఁగునం బాఱవయిచి యశ్వముమీఁద నెక్కి దానిం దోలుకొని శ్రీనగరమునకుం జనిరి, మఱునాఁ డుదయమునఁ గరటకపింగళులను సూతునిం గానక యనర్మదాదేవి వారేమయిరని యంగరక్షకుల నాయకు నడుగ నతఁ డిట్లనియె.

"అమ్మా! ఈకొండకోల మీకుఁ జెఱసాల. మీ రిందుండవలయు. మిమ్మిటనుండి కదలనీయఁగూడదని చిత్రభానుఁ డానతిచ్చెను. సూతుఁడేమయ్యెనో మేఱుఁగము. కరటకపింగళులు నిన్నరేయి శ్రీనగరమునకుం బోయియుందురు. మీకు గావలసిన సకల పదార్థములు దెచ్చి యీయవలయునని మీమఱఁది యానతిచ్చె. మీ కేవికావలయునో యవి నర్మదచేత మాకెఱిఁగింతురేని మేమవి తెచ్చి మీకు సమర్పించువారము." అని యున్నదున్నట్లుగ రక్షకనాయకుఁడు పలుక దనకొడుకుల నచిరకాలమునఁ గలసికొనఁగలుగుదునని పుట్టెడాస పెట్టుకొనియున్న యాదేవి పిడుగడఁచినట్లు నిశ్చేష్టయై నేలంగూలెను. నర్మదయు దుఃఖాక్రాంతమనస్కయై యామెమొగంబునఁ జల్లనినీరు జల్లి సాధ్యములైన శైత్యోపచారములం జేసెను.

అంతఁ గొండొకవడికా దేవి మూర్ఛనుండి మేల్కని "హా! కుమారు
లారా! మిమ్మింక జూచెడుభాగ్యము నాకు లేదు. మీరు జీవించియు
న్నారను నమ్మికయే నాకుఁబోయినది. ఆదురాత్ముఁడు మి మ్మేమమూ
రోపాయములనో కడతేర్చి యుండును. నన్నుమాత్రము చేతులారఁ
జంపక మీనిమిత్త మాజన్మాంతము విలపింపుమని నాగరకులు రాని
నట్టడవిలోఁ బడవైచె. ఇఁక నేమిసేయుదు? నర్మదా! ఇఁక నీబ్రతు
కెందుకే! తీసికొనిరావే విసము! జానెడుత్రాఁడు తేవే! చిన్నకత్తి నా
చేతికియ్యవే! నాచిన్నయన్నలారా! అటువంటిప్రాణేశ్వరుఁడు గతిం
చినను మీరిరువురు నా రెండుకన్నులనుకొని నాబహిఃప్రాణములను
కొని నాకన్నుల చలువమానుమనుకొని నాతపఃఫలములనుకొని నేను
బోయినమొదల మీకు సుఖములు జరుగవని, నేను ప్రాణేశ్వరుతో
సహగమనముచేయక, తరువాతనయిన నసువులు విడువక జీవించి
యుంటి. ఇఁక నాజీవనమువలనఁ బ్రయోజనమేమి? హా! యెంత
దురవస్థ ప్రాప్తించినది. ఓ చిత్రభానుహతక! నాకారాగృహనివాస
మునకు నేను విచారింపను. నామరణమునకు నేను చింతిల్లను. రాజ్య
ములేదని విచారింపను. సామ్రాజ్యమంతయు నీ వేలుకొన్ననునరే.
కోటిసామ్రాజ్యములకన్న నెక్కుడుప్రియములయిన నాగారాబు
బిడ్డల నాచిన్నకూనల నాకియ్యరాదా? వారిమొగములే నాకు
సామ్రాజ్యసుఖము నిచ్చును. వారిమాటలే నాకు ధనములమూటలు
నా తండ్రులారా! జీవించియున్నపక్షమున మీరెంత మరపిల్లుచు
న్నారో? మీరెంత కష్టపడుచున్నారో! ఆదురాత్ముఁడు మిమ్మె
హింసలుపాలు చేయుచున్నాఁడో? జీవచ్ఛవము నయిన నన్నును బరలో
కగతుఁడైనమీతండ్రి నిదలఁచి మీరెంతగుందుచున్నారో? మిమ్మాతఁడు
వధించియుండిన బలవన్మరణ సమయమున మీరెంత సంక్షోభించిరో
అయ్యో! తనయులారా, పలుకరేమి? నన్ను కౌగలింపరేమి! నాకభ

యమునం గనరేమి! హర్షవర్ధనా! హర్షము వర్ధిల్లజేయవేమి? అయ్యో! హర్షముగాదు — బాష్పవర్షము వర్ధిల్లఁ జేయుచున్నావు. విక్రమసేనా! రావేమి? నాయుంగరదీర్పవేమి? హా, హేమచంద్రభూపాల! నీబిడ్డలగతియెట్లయినదో చూచితివా" అని విలపించుచు నాఁటినాఁటికి మూర్ఛిల్లుచుఁ జిత్రభానుని దెగడుచు విధిని దూఱుచుఁ దనదురదృష్టమును నిందించుకొనుచుఁ గొడుకుల సుగుణంబుల నుగ్గడించుచు సౌందర్యంబుల వర్ణించుచు మూర్తీభవించిన శోకదేవతవలె నుండెను. ఆనాఁడు మొదలుకొని యామె యన్నము ముట్టకుండెను. నిద్రఁబోవదాయెను. నర్మద యాత్మహత్యఁ జేసికొనకుండ నామెను బలుతెఱంగులఁ గాపాడుచుండెను.

అట్లయి నాలుగు దినములు గడచినపిదప నొకనాఁటి నిశిరేయి రక్షకభటులు నర్మదయుఁ గాఢముగ నిద్రించియుండఁగ నరసింగాదేవి చప్పుడుగాకుండ గడియ యూడదీసి తలుపుఁ దెఱచి మెల్లమెల్లగ నావలకుం జనియెను. తెల్లవాఱువఱకు నర్మదకు మెలఁకువ రాలేదు. మెలఁకువవచ్చినయనంతర మామె దేవింగానక మనంబు కలఁతఁజెంద నాగృహము నాలుగుప్రక్కల వెదకి కావలివాండ్రకా వార్త నెఱిఁగించెను. వారుం జుట్టుప్రక్కల కొండలు గుహలు వనములు వెదకి తాము నామె యెందుంగానఁబడలేదని చెప్పిరి. నర్మద రాణియవస్థకుఁ దనయేకాకిత్వమునకు బిట్టువగచుచుఁ దన్నావలకుఁ బోనిమ్మని కావలివాండ్రను వేఁడుకొనెను. రాజు సెలవులేక యట్లు చేయుటకు వీలులేదని వారు చెప్పిరి. దేవి మతిచెడి తమ్ము బేలుపుచ్చి యర్ధరాత్రమున నెందో యరిగినదని యంగరక్షకులనాయకుఁడు చిత్రభానునకుఁ దెలుపుమని సేవకులనంపెను.

“నర్మదను విడువవలదనియు నారాణి యక్కడనే యుండవలసినదనియుఁ జిత్రభానుఁడు మరల వారికుత్తరువులంపెను. పదిదినములు

గడచినపిదప నొకనాఁ డొకచారుఁడు దేవి తప్పిపోయినదని చెప్పుకొను చున్న యంగరక్షకులతో నిట్లనియె. "అయ్యా! ఇక్కడికినాలుగుక్రోసుల దూరమున నొకగొప్పవాఁగున్నది. నేను వేఁటకుఁ బోయినప్పు డందులో నొకయాఁడుదాని శవము గనఁబడినది. మొగము చేఁపలు తినివేయుటచే నానవాలు తెలియలేదు. వ్రేళ్ళుగూడ చేఁపలు కొఱికి వైచినవి. విగ్రహము చక్కనిది. అది రాణిగారి శవము కావచ్చును. మీఁద మీచిత్తము." అని వాఁడెఱిఁగింప నాబంటులు బధ్గించి 'ఇప్పుడు శవమును జూడనేల? పోయినదెట్లో పోయినది" యని యూరకుండిరి.

అవస్థలు తప్పినప్పు డెంతవారయినను దమబంటులకుఁగూడఁ జులకనయగుదురుకదా!

ఇరువదియైదవ ప్రకరణము

హేమచంద్రుని కుటుంబమును రాజధానికిఁ బాపి కొండల వాలు గుట్టలపాలుచేసి చిత్రభానుఁడు తాను మునుపు నివాసముచేయు చుండిన గృహమునువిడిచి కోటలోఁ బ్రవేశించెను. పేరునకు విక్రమ సేనుఁడే రాజని చెప్పుచున్నను నిజముగాఁ జిత్రభానుఁడే కాశ్మీరదేశ మహారాజై రాజ్యవ్యాపారములయథేచ్ఛముగా నిరంకుశముగా నిర్భ యముగాఁ జక్కఁబెట్టుచుండెను. అంతవఱకు జిత్రభానుని యింటఁ దాఁగియుండి ప్రజలకుఁ దనమోము జూప సాహసించుచుండిన రుద్ర భట్టు చిత్రభానుని మంత్రియై సకలకార్యములయందుఁ దా నుపద్ర ష్టయై కొలువుకూటమున సింహాసనప్రక్కనే కూర్చుండి సభాసదుల యు, రాయబారులయు మన్ననలువడయుచుండెను. ఆతని మొగము

కంఠధ్వని బాహువులతీరు, కన్నులసొంకము మున్ను గుహాలో హేమచంద్రుని బేలుపుచ్చిన హరిశర్మ మొగమువలె నున్నదని పోలికలవలనఁ గొందఱు గ్రహించి యట్లుండుటకుఁ గారణమేమని యనుగఁ దలపెట్టిరిగాని చిత్రభానున కందువలనఁ గోపమువచ్చునేమో యని శంకించి యూరకుండిరి. విక్రమసేనమహారాజవర్యు లెందున్నవారని యెట్లున్నవారని యెవ్వరేని యెప్పుడేనడుగ వారు మాతృసమేతముగా కాశ్మీరపర్వతప్రాంతములందలి కొండకోటలో సుఖముగానున్నారనియుఁ బ్రకృతిసౌందర్యము వారిని సమాకర్షించుటచే నచ్చోటువిడిచి రాఁజాలకున్నారనియు నెప్పటివార్తలప్పుడు తెలియుచున్నవనియు సత్యుఁడు చెప్పుచుండెను. అమ్మాటలువిని బంధుగులును ముఖ్యముగఁ గమ్మారమంజరియునమ్మి వారి కేయపాయము లేదని భావించు చుండిరి.

ఇట్లుండ నొకనాఁడు వేగులవాండ్రు చిత్రభానునికడకు వచ్చి వానితో నిట్లువిన్నవించిరి. "దేవా! మాధవసేనుఁడు పురికొల్ప మాళవరాజసైన్యములు మనపై దండు విడియుచున్నవి. ఆ సేనను వారి సేనానాయకుఁడగు కంఠీరవదేవుఁడు మొనగాఁడై నడుపుచున్నాఁడు. మాళవరాజనందనుఁడగు మకరందుఁడు మీతోఁ బోరుటకు స్వయముగా నరుదెంచుచున్నాఁడు. ఇరువదివేలు కాల్వురు, ఐదువేలాశ్వికులు నేనూరుమహాగజములు వారివెంటవచ్చుచున్నవి. అవిగాక వేనవేలు శిబిరానుచరులు, బహుసహస్రములు పశువులు, పశువులకుఁగడి సైనికుల భోజనపదార్థములు మితిమీరియున్నవి. వారు ఉజ్జయినీపురము బయలుదేరఁగానే దేవరవారి కావృత్తాంతము దెలియఁజేయ మిక్కిలి వేగముగా వచ్చితిమి. మీఁద దేవరచిత్తము."

అనవుడు చిత్రభానుఁడు తుళ్ళిపడి "ఆలాగా! మనమింక జాగరూకతమైయుండవలయు." నని వారిం బనిచి దండపాణిని వజ్రపాణిని

తక్కిన చమూపతులను బిలువనంపి చారులు తనకు విన్నవించిన వృత్తాంతమంతయు వారికెఱింగించి సమరసన్నాహము చేయింపుమని యానతిచ్చెను.

వెంటనే సేనాపతులు క్రొత్తసైనికులం జేర్చుకొని వారికి విలువిద్దియ నేర్పి సాంగ్రామికశాస్త్రమునం బరిచితులం జేసిరి. కోట బురుజులు సుదృఢతరంబుగం జేసిరి. అగడ్తనిండ నీరు నెక్కించిరి. కోటలలో రెండేండ్లు పగవారు ముట్టడించినను సైనికులు చిక్కుపడకుండునట్లు సంభారములు నిలువ జేయజొచ్చిరి. ప్రతికోటయందు-ముఖ్యముగ శ్రీనగరకోటయందు శస్త్రచికిత్సకులను నియమించి వారికిం గావలసిన పరికరముల సమకూర్చిరి. ముప్పదివేలకాల్బలము, బదివేలయాశ్వికబలము సహస్రగజబలము నచిరకాలములో సిద్ధమయ్యెను.

చిత్రభానుఁడు తనయాప్తసేవకుఁడైన కంటకానిం బిలిచి యిట్లుచెప్పెను. "ఓరీ! విదర్భరాజసైన్యములు మనకుం దోడుపడుటకు బైలుదేరెనని చారులు నన్నుచెప్పిరి. నీవు మధ్యమార్గమున వారింగలిసికొని వారు శ్రీనగరమునకు వచ్చుటకుమారుగా మనపక్షమున మాళవదేశముమీఁద దండువిడిసి యాదేశమును స్వాధీనముచేసికొని సుదర్శనుని సింహాసనభ్రష్టునిం జేయవలయునని చెప్పవలయు. ఇవిగో నా ముద్రవైచిన జాబులు. జయంతునకు నుగ్రసేనునకు నే నిచ్చుచున్నాఁడ. వీనింగొనిపోయి వారికిం జూపుము. ఇప్పుడు మాళవదేశమును జయించుట మిక్కిలి సులభము. ఏలయన వారిసేనయంతయు మనమీఁదికివచ్చుచున్నది. ఉజ్జయినిలో నిప్పుడు సైన్యము స్వల్పముగానుండును. అందుచే నారాజ్య మవలీలగా మనవారిచేతం బడును. నేం జెప్పిన మాటలేగాక నీవును నీబుద్ధికిం దోఁచినట్లు సమయోచితములగు మాటలు చెప్పి మునుపైఁ గత్తికట్టినందుకు మాళవరాజునకు బుద్ధివచ్చునట్లు చేయుము. సుదర్శనుఁడు స్వయంకృతాపరాధఫల మనుభవించుఁగాక!

మిక్కిలి వేగముగా నడచు నొంటెపై నెక్కి పదుగు రాశ్వికులం దోడు కొని బేహారి వేషమున నీవు పొమ్ము. నీవిదివఱకు నాకొఱకుఁ బడిన కష్టములకు నీకు మేము కాశ్మీరమునందో, మాళవదేశమునందో, నీవు కోరుకొన్నచోట నాలుగుమూఁ డగ్రహారము లియ్యఁదలంచు కొన్నాము. నీవును, బింగళుఁడును నాకు రెండు కన్నులై, రెండు ప్రక్కలై, రెండు చేతులై, రెండు కాళ్లై, యుపకరించుట చేసి నా ప్రయత్నములు ఫలోన్ముఖము లయినవి." అని పలుక కరటకుఁడు "స్వామీ! మావలన నేమున్నది? దేవరవారి యాజ్ఞాబలమే మాచేత నన్నిపనులు చేయించినది. అట్లే పోయివచ్చెద" నని పలికి మఱునాఁడు పయనమై పోయెను.

మకరందుఁడు మహాసేనాసమేతుఁడై యమరసింహనందనుఁడగు భద్రసేనుఁడు తనకు సహకారియై మనోరంజనము సేయుచుండ, చండశాసనుఁడగు కంఠీరవదేవుఁడు సేనలు మఱల మహాసన్నాహముతో నుజ్జయిని వెడలి కర్పూరమంజరీ సమాగమనాభిలాష తన్నుఁ ద్వర పెట్ట నిరంతర ప్రయాణంబులు సేయుచుండెను.

చిత్రభానుఁడును సంగ్రామసన్నాహములఁ జేయుచు నొక నాఁటిరేయి రుద్రభట్టుంగూడి కార్యాలోచనము సేయుచు దండపాణిం బిలువనంపెను. అప్పుడు రెండుజాముల రాత్రియయ్యె. దండపాణి కోటఁజొచ్చి రుద్రభట్టసమేతుఁడై యున్న చిత్రభానుం జూచి పిలువనంపిన కారణమేమని యడిగెను. చిత్రభానుఁడు కొంచెము సేపు సందేహించి "శంకింపక చెప్పవయ్యా! దండపాణి మనవాఁడే" యని రుద్రభట్టు పురికొల్ప మెల్లమెల్లఁగ నిట్లనియె.

"మిత్రుఁడా! నీసాయమున స్వర్గతుల్యమగు కాశ్మీరదేశము నేఁడు నాపాదాక్రాంతమై యున్నది. నీ తోడ్పాటువలన నే నిప్పుడు రాజమహేంద్రుఁడ నగుటకు సిద్ధముగ నున్నాఁడను. ఇప్పుడు నే నిం

కను నా స్త్రీ రాజును గాలేను. ఆ కొఱత గూడ నీవే తీర్పవలయు. రాజ్యకార్యభారమంతయు నేను జక్కఁబెట్టుచున్నను రాజు విక్రమసేనుఁడే గదా? నేను వానిసేవకుఁడనే గదా? నా శాసనములపయి వాని పేరు, వాని ముద్రయు, ముద్రింపవలయుఁ గదా? రాయబారులతో వానిప్రతినిధి నని మాటలాడవలయుఁ గాని 'యహ మస్మి' యని స్వతంత్రముగ నేను బలుకుటకు వీలులేదు గదా? ఈ నైచ్యము నాకెంతమాత్రము సహ్యముగ లేదు. ఈ బంధమునుండి తొలఁగింపవలసినవాఁడవు నీవు. నన్ను సమర్థుఁడ వీవే." అని పెంచియుఁ బలుకఁ బోవుచుండ నంతలో వాని మాటలకడ్డముపోయి "ఇందు నేఁ జేయవలసిన దేమున్నది? మీరు రాజెట్లగుదురు? పట్టాభిషేకము జేయుమన్న మేము జేసెదము. అట్లు చేయుమని సెలవా?" యని యడిగెను.

అడుగుటయుఁ జిత్రభానుఁ డట్లనియె "మిత్రుఁడా! రెండుప్రక్కల రెండు బల్లెములట్లు విక్రమసేనహర్షవర్ధనులు జీవించి యుండ నేను పట్టాభిషేక మెట్లు చేసికొందును? నేను రాజు నెట్లగుదును? రాజ్యము నిష్కంటకమయిన తరువాతఁ గదా నేను గద్దెనెక్కుట. ఆ రెండుముండ్లు పెఱికివైచిన తరువాత సుఖముగా నేను గద్దెమీఁదఁ గూర్చుండెదను. అప్పుడు పట్టాభిషేకము జేసికొనియెద."

"అట్లయిన నిప్పు డేమిచేయవలయును?" అని దండపాణి యాత్రముగా నడిగెను. "ఏమిచేయవలయునో యెఱుఁగవా!" యని చిఱునవ్వునవ్వి చిత్రభానుఁడు రుద్రభట్టు మొగము జూచెను. రుద్రభట్టు దండపాణిమీఁదఁ జేయివైచి "కర్తవ్యము నీకు మేము దెలుపవలయునా? ఆ రాచబిడ్డల నిద్దఱ నీవు కడతేర్చితివా మన యెత్తికోలు తుదనెగ్గును. ఇది నీచేతిలోని పని" యని పలికెను.

అప్పలుకులు దండపాణిశ్రోత్రములకు మిక్కిలి దారుణములై వినంబడెను. అతఁ డదరిపడెను. గుండె ఝల్లుమనెను. "అయ్యో! రాజకుమారులం గడతేర్చుటా? అబ్బబ్బ! అది నా కిష్టము లేదు. ఆపని నేను చేయుటా? హరిహరీ! ఎన్నటికిని. ఆ పలుకులు నాతోఁ జెప్పకుఁడు. రాజ్యవిహీనులై నా దేశాంతరగతులై వారి తల్లి కడుపుచల్లగా- హాయిగ చంద్రునివలెను బ్రతికియుండవలయును గాని, యిట్టిదుర్దశపాలు గాఁగూడదు. ఇన్నాళ్ళు పాపము ఛీ ఛీ! ఈ పాపమునకు నే నొడిగట్టఁజాలను. ఇది నే నేయఁజాలను, నన్ను మన్నింపుము." అని భయాక్రాంతుఁడై పలికెను.

అతని వాలకము జూచి చిత్రబాహుఁడు ముసిముసినవ్వులు నవ్వి యిట్లనియె. "దండపాణీ! నీవు నీ పేరునకుఁ దగినట్లు యమధర్మరాజు వలె నిర్దయుఁడవనుకొంటిని గాని యింత దాక్షిణ్యయుఁడవని నేననుకొనలేదు. భయపడకుము. ధైర్యము దెచ్చుకో! నే చెప్పినట్లు యమధర్మరాజట్లు- మృత్యుదేవత యట్లు- జాలిలేక యుండవలయును."

"అయ్యో! వారు నాకేమపకారము చేసిరని వారిని నేను గడతేర్చుదును? సంగ్రామమున శత్రువు లెదుర్పడ్డ సామాన్యమొగములుజూచిన వారి నెవ్వరును హింసింపఁ జేతులు వచ్చునా? వారిఁ జంప నెవరిమనసొప్పును? అందును వారి తండ్రి నన్నెంతో కష్టకాలమునఁ బ్రదికించెను. నాకోరిక నెరవేర్చెను. రాజభక్తి యుండవలదా? దానికేమి కృతజ్ఞతయుండవలదా? కృతజ్ఞత కేమి! మానవలక్షణమైన జాలియుండవలదా? అబ్బబ్బ! ఆమాట నాతోఁ జెప్ప వద్దు. మనకు రాజ్యము స్వాధీనమైనది. ఈ జాలి మన కేందుకు? వారిదారిని వారినుండనీ! వారు బిచ్చమెత్తుకొనియైన బ్రతుకఁగలరు" అని దండపాణి స్పష్టముగాఁ బలికెను.

అది విని చిత్రభానుఁడు వెఱచి వానిమనసు నొడంబఱుప నిట్లు [illegible] "చండపాణి! నీవు తప్పుదారిం బడుచున్నావు. [illegible] [illegible] రాజుగాఁడు. నేను రాజును నా [illegible] నీవు [illegible] [illegible] నీవు శిరసావహింపవల యును. [illegible] [illegible] [illegible] తెలివితక్కువ [illegible] [illegible] [illegible] [illegible]. మనహృదయము లోక [illegible] [illegible] [illegible], [illegible] [illegible] ముల [illegible]. [illegible] [illegible] సురంధరులు-ముఖ్యముగా దండ నాయకులు [illegible] [illegible] రాయణుఁడను రుద్రుఁడట్లు, జంతుజాల [illegible] [illegible] [illegible] [illegible] [illegible] దరిరాకుండ [illegible] [illegible] [illegible] [illegible]. మృత్యుదేవత యెం తెంగో [illegible] [illegible] [illegible] నెందఱిఁ గబళించుటలేదు! [illegible] [illegible] [illegible] నాకేయుపకారము జేసిరంటివి, అట్లయిన నీకె [illegible] [illegible] నేను నీ శత్రుసైనికుల వేలకొలఁది మందిని యుద్ధములో [illegible] నీవేల చంపుచుంటివి? వారెన్న డైన నీకెగ్గు [illegible] [illegible] [illegible] చేసిరా? [illegible] [illegible] చేయనీ, యుపకారము చేయనీ- [illegible] [illegible] [illegible] [illegible] సౌందర్యము నీవనిశము [illegible] నీ [illegible] నీ [illegible] [illegible] గలిగింపఁగూ డదు. [illegible] నీ [illegible] [illegible]నింపఁగూడదు [illegible] [illegible] ముల [illegible] [illegible] [illegible] మాపరించు నీవాఁడి కత్తికి నెఱఁ జేయవలయు"

అనుచుండ [illegible] [illegible] నందు [illegible] వానిని ట్లు హెచ్చరించె- "చండపాణీ! నీకిందు [illegible] మెఱిఁగించెద వినుము! మరణ ము సకలజంతువులకు సహజము. ఎప్పుడో ప్రతిజంతువు చావక మా నదు. మరణము [illegible] [illegible] జంతువులం బలాత్కారముగఁ జంపున

ప్పుడు కత్తియెట్టినిమిత్తమాత్రమో చంపువాఁడు నట్టినిమిత్తమాత్రుఁ
డే. భగవంతుఁడైన శ్రీకృష్ణుఁడు భగవద్గీతలో నీవలెనే కలుకుదనము
విడిచి పిఱికితనముఁ బూనిన యర్జునున కేమియుపదేశించెను? నీవు శ
రీరమునేగాని యాత్మను హింసింపఁజాలవు. ఆత్మకుఁ జావులేదు. దా
నికి నాశములేదు. శరీర మాత్మతొడిగెడు యంగీ. నరుఁడు ప్రాఁతబట్టల
విడిచి క్రొత్తబట్టలఁగట్టుకొన్నట్లు, ప్రాఁతయిల్లు విడిచి క్రొత్త యింటఁ
బ్రవేశించినట్లు, మునుపటిదేహమువిడిచి యాత్మ క్రొత్తదేహము స్వీ
కరించును. బ్రహ్మయీవిధముగా నాశిశువులకిద్దఱకు మరణము విధిం
చెను. విధినిర్ణయ మనతిక్రమణీయము. నీవుగాకున్న మఱియొకఁడైన
వారిం జంపును. అకాలమరణము వారి మొగముల మూఁడుబంతుల
వ్రాసియున్నాఁడు. అది నీవు తుడిచివేయఁజాలవు. ఈపనిచేసిన నీకు
దోసములేదు. ఒకనిశిరస్సు ఖండింపుమని రాజానతిచ్చును. అట్లు
ఖండించిన సేవకుని కేమైనపాపముగలదా? పాపముగాని, పుణ్యము
గాని యది రాజుదే. అదియునుఁగాక నే నేజంతువును జంపనని నీవు
ముక్కుమూసికొని కూర్చుండఁగలవా? వేఁటాడియెన్నిజంతువులం
జంపుచున్నావు. నీపొట్టనింపుకొనుటకై యెన్ని మేకముల నెన్నిపులుఁ
గుల హింసించుచున్నావు? ఎన్నినల్లులఁ జంపుచున్నావు! జలముద్రాగు
నప్పుడెన్ని కీటకముల నీవెఱుఁగక మ్రింగుచున్నావు. ఉచ్ఛ్వాసని
శ్వాసములలో వాయువుతోఁగలిసి నీకంటికగపడని పరమాణుతుల్య
ములగు కీటకము లెన్నివేలు నీకడుపులోనికిఁ బోవుచున్నవో యె
ఱుఁగుదువా? అదియెల్ల హింసగాదా? హింసలేకుండ నీవుక్షణమయిన
జీవింపఁగలవా? ఈవెఱ్ఱిమాటలు విద్వాంసులకడఁ గట్టిపెట్టుము. లో
కములోఁ జంపువాఁడు లేఁడు. చంపఁబడువాఁడు లేఁడు. స్వలాభము
నిమిత్తమైమనము వేలనుజంపినట్లు నల్లుల నలిపినట్లు—క్రూరమృగ
ములఁ గూల్చినట్లు—మనకడ్డమువచ్చినమానవులసమితము దయాదా
క్షిణ్యములేక జంకుగొంకులేక సంహరింపవలయు.”

అనుచుండఁ జిత్రభానుఁ డడ్డమువచ్చి "మిత్రుఁడా! అన్నిటి కేమి? ఈవిషయమాలోచింతము. విక్రమసేనహర్షవర్ధనులు బ్రతికి యుండిన నేఁడు మాళవరాజు వచ్చుచున్నట్లె మనపైఁ గోపమువచ్చిన ప్పుడు పరరాజులు వారిని గద్దెనెక్కించుటకై వచ్చుచునేయుందురు. వారున్నంతకాలము మనకీ యలజడియున్నదే. వారస్తమించినఁగాని మనకీశ్రమ యస్తమింపదు. అదిగాక యీ రాజ్యము నాదియని నీవు తలంపకుము. నేనిప్పుడు గద్దెయెక్కినను వయస్సుమళ్ళినవాఁడనగుటచే నచిరకాలమున మృతినొందుదును. ఆటమీఁద రాజుగావలసినవాఁడు నీయల్లుఁడు విజయసేనుఁడు. ఆబాలకుల సంహరించుట నానిమిత్తముగాదు. నీయల్లునినిమిత్తము. నీకూఁతురునిమిత్తము. జాగ్రత్తగా నాలోచించుకో! మాళవసైన్యము రాకమునుపే మనమీపనిచేయవలయును. వారి నీలోఁగడ తేర్చితిమా మాళవసైన్యములు తమప్రయత్నములు వ్యర్థమని మరలిపోవును. ముందువెనుక లాలోచించుకొనుము" అని కొంతయుత్సాహముతోఁ నచ్చఁజెప్పెను.

రుద్రభట్టు చేసిన తత్త్వోపదేశము కొంతవఱకు దండపాణిమతము మార్చెను. పిమ్మట విజయసేననిదే కాశ్మీరరాజ్యమని చిత్రభానుఁడు వక్కాణించినతోడనే దండపాణిమనస్సు సంపూర్ణముగ మారెను. విక్రమసేన హర్షవర్ధనులు తనయల్లుని సింహాసనారోహణమున కంతరాయము గలిగించునట్టి కంటకములని వానికిందోఁచెను. ఆత్మలాభపరాయణత వానిమనస్సులోనున్న కృతజ్ఞతను రాజభక్తిని జాలిఁ ద్రోసివైచి యాస్థానము నాక్రమించెను. అతని హృదయ మప్పుడు ఱాయియైపోయెను (?). అప్పుడతఁడు "సరే! మీచిత్తమువచ్చినట్లుచేసెద. ఏనాఁడు నేను మీవశము (?) జేసితినో యానాఁడే నాశరీరము గూడ మీవశము (?) జేసితిని. ఈచేతులు మీవి. వీనిచేత మీయిచ్ఛవచ్చినపని జేయించుకొనుఁడు." అని యుత్తరమిచ్చెను.

అప్పుడు చిత్రభానుఁడు, సంతసించి వానిం గౌఁగలించుకొని మిత్రుఁడన్న నీవే మిత్రుఁడవని ప్రశంసించెను. దండపాణి వంటి మనుష్యుఁడు ప్రపంచమున మఱియొకఁడు లేఁడని, రుద్రభట్టు కొనియాడెను. అప్పుడు చిత్రభానుఁడు వెండియు వానిని కిట్లనియె—"నీవు రేపుదయమున నేపొమ్ము. అక్కడ శక్తివర్మ యున్నాఁడు. అతఁడు నీకీవిషయమునఁ దప్పక తోడుపడును. వాఁడు మనకు విధేయుఁడు. కార్యసాధకుఁడవయిన నీకు నేను వేఱ జెప్పనక్కఱలేదు. నీకుశుభములఁ గాక పొమ్ము." అంతట రుద్రభట్టునకు నమస్కరించి చిత్రభానుని కడ సెలవుగై కొని పోయెను.

ఇరువదియేడవ ప్రకరణము.

దండపాణి వడిగాఁ బయనముచేసి రాజకుమారులు వసియించుకొండకోటకు మిక్కిలి సమీపముననున్న యొకపల్లియఁ జేరి యందలి గ్రామాధికారియింట విడిసి తనరాక రాజపుత్రులకుఁ దెలియకుండ శక్తివర్మను బిలుచుకొనిరమ్మని యొకసేవకునంపెను. వాఁడును సత్వరమరిగి సేనాధిపతి సెలవయినదని రహస్యముగఁ దెలిపి శక్తివర్మం దోడ్కొనిపోయెను. దండపాణి వానింజూచి సముచితసత్కారములుజేసి పరిజనంబునంతను నావలకంపి వానినొకగదిలోనికిఁ బిలుచుకొని పోయి చిత్రభానుని శాసనంబునఁ దాను గావింపఁదలఁచిన దారుణకర్మ మతనికెఱిఁగించి తనకుసాయము జేయుమనికోరెను.

ఆపలుకులు చెవినిబడినతోడనే శక్తివర్మ భయంబును విస్మయంబును మనంబునఁ బెనఁగొన దండపాణికిట్లనియె. "అయ్యో! నీవు పిల్లలుగలవాఁడవు. నేను బిడ్డలంగన్నవాఁడను. కటికవాఁడైనఁ జేయ

వెలయచు నీఘోరకృత్యమును నీవు స్వయముగాఁ జేయ నెట్లువచ్చితివో నేనూహింపఁజాలకున్నాను. మిక్కిలి యల్పపదవిలోనుండి మిక్కిలి యున్నతపదవికి నిన్నుఁదీసికొనివచ్చి నీవృద్ధికెల్లఁగారణమయిన హేమచంద్రునిఁ గలఁచియైన నీపనిమానవచ్చునే బెబ్బులిబారినుండి నిన్నును జలగండమునుండి నీకొడుకును బ్రతికించిన విక్రమసేనుని దలంచియైన నీకౄరకర్మము మానవచ్చునే! అనాథయై దిక్కుమాలి విలపించుచున్న యరవిందాదేవిని స్మరించియైన నీపాపకర్మమునకుం దొలఁగగవచ్చునే. ముద్దులుమూటగట్టు నాబిడ్డల చక్కదనమును సౌకుమార్యముఁ జూచియయిన నీదుష్కార్యము విడువవచ్చునే! ఆకుటుంబముతోఁ జిరకాలసంబంధముగలిగి వారివలన బాగుపడిననీకు నిప్పనిసేయుటకు మనసెట్లొప్పెనయ్యా? నీమనస్సొప్పిన నొప్పెఁగాక! ఇట్టి దుష్కార్యమునకు నేఁదోడుపడఁజాల. నాయుద్యోగమునుండి నన్ను రాజుతొలఁగించినను సరే—నాకుమరణదండన విధించినను సరే—నే నిప్పని యొల్ల. రాజకుమారవధము జేసి యానెత్తుటికూఁడు దిని మనుటకంటె నాఁకలిచేఁ జచ్చుట మంచిది. చావలేకున్న బిచ్చమెత్తి బతుకుటమంచిది. గోచిపెట్టుకొని యడవిలో ముక్కుమూసికొని తపము సేయుట మంచిది. అంతెగాని యీపనినేఁ జేయఁజాల" నని కూర్చున్నచోటునుండి చివాలున లేచినిలిచెను.

దండపాణియుఁ దనపీఠమునుండి లేచి శక్తివర్మచేయిపట్టుకొని "ఓయీ! నీమాటలఫలమేమో నీ వూహింపలేకున్నావు. రాజాజ్ఞాతిరస్కారము కోడెత్రాఁచుతోఁ జెరలాటమువంటిది. అదికత్తిమీఁది సాము. నిప్పులు కొంగునఁ గట్టుకొనుట. జాగ్రత! అతఁడలిగినా నీ శిరచ్ఛేదముఁ జేయింపక మానఁడుసుమీ!" యని బెదరించెను.

"ఇటువంటి సత్కార్యమున శిరస్సు పోయినను మంచిదే. నీబిభీషికలకు నేను భయపడువాఁడను గాను. ఈశ్వరేచ్ఛ యెట్లున్నదో

యట్లు జరుగుఁగాక!" యని శక్తివర్మ యవ్వలకుఁబోయెను. పోయి యతఁడు తనకుఁ బ్రాణమిత్రుఁడు రక్షకభటులలో ముఖ్యుఁడునయిన చండుని బిలిచి తనకును దండపాణికింజరిగిన సంభాషణమంతయు రహస్యముగ నెఱింగించి కర్తవ్యమేమని యతని యాలోచన మడిగెను. చండుఁడు శక్తివర్మవలెనే దుష్కార్య విముఖమయిన చిత్తవృత్తిగలవాఁడగుటంజేసి యతఁడు చేసినపని ప్రశస్తముగానున్నదని ప్రశంసించెను. "మిత్రుఁడా నీవుమెచ్చుటంజేసి నాకెంతో ధైర్యము వచ్చినది. అట్లయిన మనకు రాఁదలఁచిన యపాయముఁ దప్పించుటకయి నాకొకయుపాయము దోఁచుచున్నది. అది వినుము" అని శక్తివర్మ చండునిచెవిలో రహస్యముగాఁ గొంతసేపు గుసగుసలాడెను.

అంతలో సాయంకాలమయ్యెను. కాలపురుషుని శరీరమందలి వ్రణమువలె సూర్యబింబమెఱ్ఱనై పశ్చిమాద్రిసంగమమునఁ గానఁబడియెను. ఆవ్రణమునుండి దొరంగు నెత్తురోయన సంధ్యారాగము కెంపెఱ్ఱనై దెసలవ్యాపించెను. వ్రణబాధచేఁగాలపురుషుండు మూల్గుచున్నప్పుడు గల్గుధ్వనియోయన గూఁడులఁ జేరఁబాఱు పులుఁగులయెలుఁగు లెసంగెను. నెత్తురు గడిగి వైచి కాలపురుషుని పానుపుపైఁబఱచిన నల్లదుప్పటియోయనునట్లు కాఱుచీఁకటులు విశ్వమంతయు వ్యాపించెను. వ్రణసంబంధమయిన దుర్గంధము పొడమకుండ నాపాన్పున వయిచిన హారతికర్పూరపుఁ బలుకులో యనునట్లు నభోభాగమున నక్షత్రములు విరాజిల్లెను.

విక్రమసేన హర్షవర్ధనులు సూర్యాస్తమయ మైనతోడనే పరమేశ్వరునిహృదయపీఠమున నునిచి ధ్యానముచేసి మాతృవియోగదుఃఖమున నన్నముసరిగా రుచింపకున్నను నేదోవిధముగా సేవకుల వేఁడికోలుచేఁ గొంచెముభుజించి పడకగదిఁజేరి యేదోయాలోచించుకొనుచు నొండొరులతోఁ బలుకకయూరకుండిరి. కొంతసేపటికి "తమ్ముఁ

డా! ఏమిటినీవాలోచించుచున్నావు?" అని విక్రమసేనుఁడు హర్షవర్ధనునడిగెను.

"అన్నయ్యా! నాకేమియులేదు. నిన్నరాత్రి మనయమ్మకనఁబడినట్లు,నాచెక్కిలినొక్కుచున్నాడనట్లు, ఇంతచిక్కిపోయినావేమితండ్రీ యని నన్నడిగినట్లు, నేను నాదుఃఖమును జెప్పుకొనినట్లు నేకలగంటిని. అందుచేత నేనియదలఁచుకొని విచారపడుచున్నాను. బాష్పపూరితమయిన యామె ముఖము నాకిప్పుడుగూడ గనఁబడుచున్నది. అన్నయ్యా! ఇఁక మన యమ్మ మొగమెప్పుడును జూడలేముగదా? ఆమెయొడిలోఁ బవళించుకొను భాగ్యము కలుగదుకదా? నిండారు ప్రేమతోనామె మనకుఁ బక్కనఁ జిన్నతనమున బాయసము పెట్టించి యారగింపుమని బతిమాలు సుఖదినములు రావుగదా? అహా! అన్నయ్యా ఎన్నఁడు తల్లితోఁగలసి మనము సుఖించితిమో యెన్నఁడు సుఖపడితిమో యవన్నియు స్వప్నవృత్తాంతములే యయ్యెను." అని పలుకులు చెప్పి వెక్కివెక్కి యేడ్చెను.

విక్రమసేనుఁడు ఆశ్రుపాతముతోఁ దనమంచము మీఁదినుండి లేచి తమ్మునికడకుఁబోయి తమ్ముని మంచము మీఁదఁ గూర్చుండి వెనుకప్రక్కనుండి రెండు చేతులుచాచి తమ్ముని గాఁగిలించి "నాయనా! విచారింపకుము. కలిమిలేములు కావడికుండలు. ఐశ్వర్యమనుభవించి కష్టమువద్దన్నఁ బోవునా? సుఖదుఃఖములు దివారాత్రములవలెఁ బర్యాయముగ వచ్చుచుండును. వానిని వారించుట కెవరికిం దరముగాదు. ఇఁక నమ్మనుజూచు భాగ్యము మనకుఁగలుగదు. ఏమన ధర్మదేవతయే నీయమ్మకై యామె కృశించియున్నది. ఈ పుత్రశోకమునఁ గూడ నామె యీపాటికి మృతినొందును. చిత్రభానుఁడు మనలఁగూడ బ్రతుకనీయఁడు. ఏదో మాయోపాయమున మనలంగడతేర్చి సింహాసనమెక్కుటకై యతఁడు ప్రయత్నించుచుండును. అందు

చే మనకష్టములు చాల కాలముండవు. బంధమునుండి గాకపోయినను దేహబంధమునుండి మన కచిరకాలములో విముక్తి కలుగును. అది యునుమేలే. ఈజీవన్మరణముకన్న నిజముగా మరణమే మనకు మహోపకారముగా వచ్చును." అని [illegible] చుండనంతలో దండపాణివీధిగుమ్మమునకడకు [illegible] ద్వారముకడ జండుగు శక్తివర్మయు నేదోమాటలాడు [illegible] వారిరువురు లేచినిలిచిరి. "శక్తివర్మ! నీ [illegible]" యని యతఁడడిగెను. "అయ్యా! [illegible] ముందువెనుక లాలోచించుకొని నీకుఁదోడ్పడ [illegible] నాచేసినతప్పు క్షమింపుఁడు! [illegible] సాయపడుదును." అని శక్తివర్మ బదులుచెప్పెను.

"శహబాస్! [illegible] తలుపుదీయుము." అని దండపాణి [illegible] శక్తివర్మ తాళముఁదీసి తలుపు తెఱచెను. [illegible] దగిఱ యుండిరి. [illegible] శక్తివర్మ [illegible] లో ప్రవేశించి తలుపులుబిగించి "[illegible]! [illegible] సిద్ధముగానుంచుము. [illegible] యును." అని [illegible] దొడ్డిలో [illegible]. తలుపుచప్పుడువిని "[illegible]" [illegible] సంశయపడుచుండ [illegible] మనుష్యులు వచ్చుచున్నట్లు గానఁబడెను. "నేను దండపాణిని; [illegible] శక్తివర్మ" అని [illegible] స్వరముతో మాటవినబడెను. "[illegible] ఏమిది మామీఁద నింతదయవచ్చినది? [illegible] సేమమరసి రమ్మని మిమ్ముఁ బంపిరా! లేక [illegible] మీఁద నీ [illegible] ములకువచ్చి పూర్వవైరముచే మాకుశల [illegible] మీరే స్వయ

ముగా వచ్చిరా? ఎట్లయిననేమి మీరాకవలన మాకిప్పుడు పంచప్రాణములు లేచివచ్చినవి. ఎల్లచుట్టములంజూచినంతయానందము మాకిప్పుడుగలుగుచున్నది. ఓహో! ఇది యెంతసుదినము? నేఁటిప్రాతఃకాలమున మేమెవ్వరిమొగము జూచితిమో కాని మీదర్శన లాభము గలిగినది. రమ్ము! రమ్ము! ఈపానుపుమీఁదఁ గూర్చుండుము. మాయమ్మ సుఖముగానున్నదా? మావియోగదుఃఖమున మేనువిడిచినదా" యని విక్రమసేనుఁడు వానిని సబహుమానముగా గారవించిపలికెను. తల్లిసేమముగురించి యేమిచెప్పునోయని వినుటకై హర్షవర్ధనుఁడు మిక్కిలి తత్తఱపడుచుండెను. అప్పుడు దండపాణి పరుషస్వరముతో "మీయమ్మయెట్లున్నదో నేనెఱుఁగను. ఎక్కడనున్నదో నేనెఱుఁగను. చిత్రభానుఁడుపంపుటచేత నేనిక్కడకు వచ్చితిని." అని బదులు చెప్పెను.

"అహా! మాచిననాయన దయార్ద్రహృదయుఁడై మమ్ముబంధవిముక్తులఁ జేయుమని నిన్నంపెనా? మాకు మేలుదినములు వచ్చినవా? కాని మాయమ్మ యెక్కడనున్నదో నీవెఱుఁగవా? మాతాతమహేంద్రదేవుఁడామెను దీసికొనిపోయెనా?" యని విక్రమసేనుఁడు కొంతసంతోషముతోను గొంతవిచారముతోను బలికెను "ఆహా! దేహబంధ విముక్తులఁ జేయుమని మీచిననాయన నన్నుబంపినాఁడు" అని తనలోననుకొని దండపాణి బహిరంగముగా నిట్లనియె.

"కుమారులారా! నేను మీకిప్పుడు గొప్ప యప్రియము దెలుపవచ్చితిని. నేను మిక్కిలి మందభాగ్యుఁడను. ఘోరవార్త దెలుపుట ఘోరకృత్యముసేయుట నాపాలఁబడినది. ఇది రాజశాసనమగుటచేఁ జేయకతప్పదు. నేను చెప్పుటకెంతో శంకించుచున్నాను—" అనవుడు విక్రమసేనుఁడు చిన్నవోయి మెల్లగా "నయ్యా! మీరుచెప్పఁ దలఁచినది చెప్పవచ్చును. చేయఁదలంచినది చేయవచ్చును. మీకార్య

ము వలదనువారు లేరు. అడ్డగించువారు లేరు." అనిపలికెను. హర్షవర్ధనుఁడు నిశ్చేష్టుఁడై కూర్చుండెను. అంతట దండపాణికిని విక్రమసేన హర్షవర్ధనులకును నీక్రింది విధముగా సంభాషణజరిగెను.

దండ—కుమారులారా! యీరాత్రి మిమ్ముద్దఱ సంహరింప వలసినదని చిత్రభానుఁడు నన్నుఁబంపె.

విక్ర—ఆఁ! ఆఁ! సంహరింపుమనియె పంపెనా?

హర్ష—అయ్యో! తల్లీ! (అని పాన్పుపై మూర్ఛవోయెను.)

విక్ర—అప్పని చేయనిశ్చయించి నీవువచ్చితివా?

దండ—ఆహా! నిశ్చయించుకొనియే వచ్చితిని. (అని మొలనుండి కత్తిదీసెను.)

విక్ర—ఈఘాతుకకృత్యమును జేయ నీమనసొప్పినదా?

దండ—మనసొప్పిన నేమి, యొప్పకున్న నేమి? రాజాజ్ఞ చేయక తప్పదుగదా?

విక్ర—ఎవఁడు నీరాజు? నేను కానా?

దండ—చిత్రభానుఁడు మారాజు. నీవుకావు. నీవు కారాగృహవాసివి.

విక్ర—ఎవఁడు నన్ను కారాగృహవాసిని జేసినది? ఎవఁడు నన్ను రాజ్యభ్రష్టుఁ జేసినవాఁడు?

దండ—నీపినతండ్రి చిత్రభానుఁడు.

విక్ర—అయ్యో! దండపాణీ! నీనోట నెటువంటి నిష్ఠురోక్తులు వినవలసివచ్చెను. నాతండ్రిమరణమునకుఁ గారణభూతుఁడయిన మా పినతండ్రిమాయలలోఁబడి నీవు నీరాజుంజంపవచ్చితివా? చిన్నికుమారులమనియైన సందియము లేదా నీకు? అనాథులమన్న మాటయయిన నీకు దోఁచలేదా? నీది హృదయముకాదా? నీవు మానవుఁడవు కావా? ఘాతుకమృగంబవా? దానవుఁడవా? ఘాతుకమృగములు సయితము

తమజాతిమృగముల జోలికిఁ బోవు. దానవులు వైరము లేకుండఁ దమ తోడిదానవులఁ దుదముట్టింపరు. నీకును నాకు నెన్నఁడైన వైరమున్నదా? నిన్నెన్నఁడైన నే తూలనాడితినా? నీమనసు నొచ్చునట్టి పరుషోక్తులాడితినా? నీకార్యములకు నే నాటంకము గల్పించితినా? ఏల మాపై నీకింత నిష్కారణక్రోధము? ఏల యింతనిర్దయ? నీహృదయము పుష్పసుకుమారమయినదే! ఇంతకఠినమెట్లయ్యెను. ఈ కాఠిన్యమును న్నెన్నఁడు నేఁ జూడలేదే! నామీఁద నీవు చూపెడు నాదయారస మెందుఁబోయె? ఆప్రేమపూర్వకభాషణంబు లెందరిగె? అయ్యో! దండపాణీ! నీవెంతలో నిట్లు మాఱితివి? నీహృదయము మాఱినను నా హృదయము నీదెస మాఱలేదు. నీవు నాకు వెనుకటి దండపాణివై యున్నావు. నాఁడు వేఁటలో బెబ్బులి గొబ్బున నీపైఁబడుచుండ వినవిన వెంట నమ్ముఁ దొడిగి నేను దానిం గూలనేసి నీప్రాణము రక్షించినప్పుడు నీపై నాకెట్టి ప్రేమగలదో నేఁడును నా కట్టిప్రేమయే కలదు. నేను మహారాజనందనుఁడనయ్యు- కడుసుకుమారుఁడనయ్యు నత్తఱి విలువగల దువ్వలువలు దాల్చియున్నవాఁడనయ్యుఁ- జెఱువులోఁబడి మునుఁగులువేయు నీకుఁ బ్రాణములు గోల్పోవసిద్ధముగానున్న నీకొడుకును గాపాడుటకై చెఱువులో నుఱికిననాఁడు నీపై నాకెట్టి కూర్మిగలదో నేఁడు నట్టికూర్మియే గలదు. ఈహృదయము నీహృదయము వంటిది కాదు. కాఁబోయి యందుకు దీనిని దప్పక దండింపవలయు కావున నీచేతిలో దీపపువెలుఁగునఁ దళతళమెఱయుచున్న నీఖడ్గపుం గొనతో ముందుగా నాహృదయముం బొడిచి దాని నీవలకుఁ దీయుము. ఇదిగో! నాహస్తము. నాఁడు బెబ్బులిని నీనిమిత్తమై కోలం గూలనేసిన హస్తమిది. నీకఱకుకత్తితో నీచేతిని ముందుగా నఱకుము. నీకుమారుని నిమిత్తమై ముందువెనుక లాలోచింపకుండఁ జెఱువులోఁబడిన యీశరీరమును నీవాఁడికత్తితోఁ దుత్తునియలు చేయుము. ఇదిగో! నాశరీరమును నీ కప్పగించుచున్నాను.

అంతలో నతనిచేతి కత్తి పిడికగ్గుఱఁ జమటపట్టుటం జేసి యా ఖడ్గము జాఱి క్రిందఁబడెను. అప్పుడు విక్రమసేనుఁడు మఱల సంభాషణ మందుకొని యిట్లనియె.

"దండపాణీ! సంపూర్ణజ్ఞానముగలిగి, చైతన్యముగలిగి, యుక్తాయుక్తవివేకముగలిగి, ఘాతుకకృత్యము చేయఁదలఁచి వచ్చిన నీకన్న చైతన్యశూన్యమైన యీ కత్తియే మంచిదని తోఁచుచున్నది. ఈ దుష్కార్యము చేయఁజాలక కాఁబోలది క్రిందఁబడెను. అయినను నీవు చిత్రభానున కెట్లు వశవర్తివో యీకత్తియు నీకట్లు వశవర్తిని యగుటచే మాపినతండ్రి చెప్పినచొప్పున నీవు చేయఁదలఁచుకొనినట్లే, నీవు సేయుచున్న ట్లీకృపాణియుఁ జేయఁదలఁచుచున్నది. నా ప్రాణములమీఁద నా కంత యాసలేదు. ఈ కారాగృహవాసముకన్న స్వర్గలోకవాసమే నాకు సౌఖ్యప్రదము. అచ్చట మాతండ్రితోడనే నేఁ గూర్చుండెదను. మాపినతండ్రివలన భయములేనిచోట దండపాణిఖడ్గమునకుఁ బ్రచారములేనిచోట రాజద్రోహులు లేనిచోట ధనమునకై యెట్టి ఘాతుకకృత్యమైనఁ జేయకోడంబడెడు నీచులు లేనిచోట నేను సుఖముగా నుండెద. కాని! యదిగో! నీయెట్టయెదుట నామంచముపై మూర్ఛిల్లియున్న యీపసిపాపని నా గారాబుతమ్ముని హేమచంద్రుని రెండవపుత్రుని నరవిందాదేవి ముద్దులపట్టిని సకలజననయనానందకరుని నిండుచందురునకు వన్నెలుదిద్దఁగల మొగముగలవాని చక్కెరవిల్తునిదలపించు చక్కఁదనమువాని నీవెన్నిసారులోఁ జిన్ననాఁట నెత్తికొని ముద్దులాడినవాని, మాహర్షవర్ధనుని బ్రతికింపుము. మాతండ్రి నిమిత్తమై యాతనిని జీవింపనిమ్ము. మహాశోకసముద్రముననున్న మాతల్లినిమిత్తమై యాతని బ్రతికియుండనిమ్ము. నానిమిత్తమై యతనిని జీవింపనిమ్ము. హేమచంద్రునివంశము నిర్మూలముగాకుండ నీమొలకకు నీదయారసముపోసి పెంచుము. ఈతఁడు

మీచిత్రభానుని రాజ్యమున కద్దురాఁడు. వానికి సన్యాసమిప్పించి వనాంతరములకంపుము. ఇదిగో వానిని బ్రతికింపుమని చేతులు జోడించి నీపాదములకు మ్రొక్కుచున్నాను. నీవు బాసచేసితివేని నేను సుఖముగా శరీరము వాయుదును. నాకు నీకడఁగల చనవుచెం పున నీవరమిమ్మని నిన్ను వేఁడుకొనియెద."

దయనీయములయిన యాతని పలుకులు శక్తివర్మహృదయ మును గరఁగించి గన్నీరు స్రవింపఁజేసెను. కాని స్వలాభపరాయ ణతచే శిలీభూతమైన దండపాణి హృదయమును మాత్ర మవికరఁగింప లేకపోయెను. "విక్రమసేనా! నీవేఁడికోలు నిష్ప్రయోజనము. చిత్ర భానునియాన నేను సంపూర్ణముగాఁ జెల్లింపవచ్చితిని. మీయిరువు రంజంపి గాని నే నిచ్చోటు విడువ. నీతమ్మునిచావు నీవు చూడలేవు గావున ముందు నిన్నే వధించెద. నేను సగమునగముపనులు చేయు వాఁడనుగాను" అని దండపాణి ప్రత్యుత్తరమిచ్చుచుండ నంతలో హర్షవర్ధనుఁడు మూర్ఛదేలసి "అన్నయ్యా! అన్నయ్యా! బ్రతికియు న్నావా! అన్నయ్యా! అన్నయ్యా! నన్నొకసారి కౌఁగలించుకో నుము." అని కోరెను.

విక్రమసేనుఁ డట్లు చేయుట కటుపోవుచుండ దండపాణి వాని నాఁపి "కౌఁగలింతలు గిరుగిలింత లిప్పుడెందు" కని బిగ్గరగాఁ బలి కెను. అప్పుడు హర్షవర్ధనుఁడు మెల్లగా లేచి "దండపాణీ! మాయన్న నుజూడకుండ నే జీవింపఁజాలను. నాకీబ్రతుకుమీఁద నేవ పుట్టినది. కావున నన్ను జంపి మాయన్నను బ్రతికింపుము. మాయన్న చాలమం చివాఁడు. చదువుకొన్నవాఁడు. నాకడపటిప్రార్థనమంగీకరించివానిని జీవింపనిమ్ము. వానికి మీరాజ్యమక్కఱలేదు. ఏగాంధారదేశమున కయినఁ బోయి బ్రతుకు" నని కేలుమొగిచి మ్రొక్కెను. "ఓహో అన్నను బ్రతికింపుమని తమ్ముఁడు, తమ్ముని బ్రతికింపుమని యన్న

ప్రార్థనలుచేయనారంభించిరా! మీటక్కరితనములు నాకడసాగిరావు మీ పంచాంగముఁ గట్టిపెట్టుఁడు" అని దండపాణి నిష్ఠురముగాఁ బలికి హర్షవర్ధనుని దనచేతితో నొకప్రక్కకు గెంటి "శక్తివర్మా! వీని నావలి కీడ్చుకొనిపో." అని యానతిచ్చెను. శక్తివర్మ యాబాలునింబట్టుకొని ప్రక్కనున్న మఱియొక గదిలోనికిఁ దీసికొనిపోయి లోపలఁబెట్టి తలుపు వైచెను.

"అయ్యో! అయ్యో దండపాణీ! అయ్యో! శక్తివర్మా! కడపటి సారి మాయన్నను గౌఁగలించుకొననిండు కడపటిసారి మాయన్న ముఖారవిందముఁ జూడనిండు! చివరవఱ కతనిసన్నిధినే నన్నుండ నిండు!" అని హర్షవర్ధనుఁడు మొఱపెట్టఁజొచ్చెను.

"దండపాణీ! దండపాణీ! ఒక్కనిముషమాగుము. ఒక్కసారి నన్నావలిగదిలోనికిఁబోనిమ్ము. ఒక్కసారి నాతమ్మునినాలింగనముఁ జేసికొననిమ్ము! ఒక్కసారి వానిని ముద్దాడనిమ్ము. అధమపతు మీ వరమయిన నాకు దయసేయుమయ్యా! నీకెంతో పుణ్యముండును." అని విక్రమసేనుఁడు ప్రార్థించెను.

"చాలుచాలు! నీకలాపము గట్టిపెట్టుము. పండుకొనుము. ఇప్పుడే ముందుగా నీశిరఃకర్తన మాచరించెద" నని దండపాణి పలుకుచుండ నంతలో గోయిత్రవ్వ చండుఁ డచ్చటికి వచ్చెను. "చండా! శక్తివర్మా! వీనిని నేలఁబడవయిచి కాలుసేతులు పట్టుకొనుఁడు" అని యాతఁ డానతిచ్చెను. "అయ్యా! నన్ను బలాత్కారముగాఁ బండుకొనఁబెట్టనక్కఱలేదు. నా కాలుసేతులు పట్టుకొననక్కఱలేదు. నేనీసమయమునఁగూడ మీ కేవిధమయిన కష్టమును గలిగింపను. ఇదిగో! పండుకొనుచున్నాను." అని విక్రమసేనుఁడు నేలఁబండుకొని చేతులు జోడించి "నారాయణా! నారాయణా! నారాయణా!" యని హరినామస్మరణ చేయుచుండెను. దండపాణి ఖడ్గ

మునెత్తి యెత్తిక్రిందికిఁగొట్టిన నొక్కయేటున శ్రమలేకుండఁ దల తెగిపడునో చూచుటకు నిలిచి ఖడ్గ మెత్తెను. అంతలో శక్తివర్మ కనుసన్నసేతను వెంటనే చండుఁడు దండపాణిమెడలో నొకత్రాడు తగిలించి తాను ధరించుకొనియున్న యుంగరములోనుండి రెండవకొనపోనిచ్చి శక్తికొలఁది లాగెను.

ఇది యొక్కపాటుకాలమున జరిగెను. లాగినతోడనే చేతిలోనున్న కత్తి చేతిలోనుండఁగానే దండపాణి 'ఆ! ఆ!' యని మూల్గుచు గొనక వివశుఁడై వెనుకకుఁ బడెను. నిముసములో నతనిప్రాణము పోయెను. కన్నులు మూసికొని హరిధ్యానము సేయుచున్న విక్రమ సేనుఁడు కన్నులు తెఱచి చూచునప్పటికి శక్తివర్మయుఁ జండుఁడును నేలఁబడియున్న దండపాణిని దలయొకరు, పాదములొకరుఁబట్టుకొని యావలకుం గొనిపోవుచుండిరి.

అన్నయ్యా! అన్నయ్యా! యని యావలిగదిలోనుండి హర్షవర్ధనుని మోహనాంగి గదిలోఁ బలుకుచుండెను. విక్రమసేనుఁడు లేచి కూర్చుండి సంతోషవిస్మయసంభ్రమంబులు మితిమీఱి పరవశుని జేయ నేమిదియని యూహింపఁజాలక గ్రుడ్లప్పగించి చూచుచుండెను. చండుఁడును శక్తివర్మయును దండపాణికళేబరమును బాలురనిమిత్తము త్రవ్వియుంచినగోతిలోఁ బడవయిచి పూడ్చిరి.

పరమేశ్వరునిలీల లెవ్వఁడు గ్రహింపఁ గలఁడు! ఆత్మలాభ పరాయణుఁడై యధర్మమనక యకార్యమనక ఘాతుకమృగములీల రాజనందనుల వధింపఁదలఁచివచ్చిన దండపాణి కృపాణినైన నెత్తకమునుపె యసువులఁబాసి క్షణములో దండధరునివీటికివిందయ్యెను ఉత్తరక్షణము నెవఁడెఱుఁగఁడని పెద్దలు చెప్పుమాట నిశ్చయముగదా! మానవుఁడు తనమనంబున నాకసంబున మేడలుగట్టి పదునాల్గులోకములఁ బాలింపఁ దలఁచుచుండును. దైవము వానిసంకల్పముల వికల్పములఁ జేయుచుండును.

అట్లు వారిరువురు దండపాణిని మహీగర్భమునఁబూడ్చి రాజనందనులకడకువచ్చి గదితలుపులుతీసి హర్షపరవశులై వెలుపలకుఁ దీసికొని వచ్చి "కుమారులారా! దండపాణి తానుత్రవ్వుకొన్నగోతిలోఁ దానే పడెను. అదురాత్మునిపాపమే యాతని జంపినది. మీరింక లెండు. మిమ్ముఁ జెఱనుండి విడిపించి యావలకుఁ దోడ్కొనిపోయెదము. మీరు మావలన నెట్టియుపాయమును శంకింపకుఁడు. మేము రాజభక్తులము. మీపాదసేవకులము. చిత్రభానుసిద్ధుఁడనువాని మేము సహింపఁజాలక వానిచేఁ బ్రేరితుఁడై మిమ్ముఁ వధింపవచ్చిన దండపాణిని మట్టుపెట్టితిమి. మిమ్ము సురక్షితముగా [illegible] సేనకుం గొనిపోయెదము. మీఁద దైవమున్నాఁడు. మనభాగ్యము సరిగానుండునేల భాగ్యవర్ధనుఁడు మీకుఁ దోడుపడవచ్చును. ఇఁక నాలస్యముచేయుటకు వీలులేదు. రండు! సేవకులు మేలుకొనకముందే పోవుదము."

అనవుడు నకుమారులు "శక్తివర్మా! నీ యిష్టము వచ్చినట్లు చేయుఁడు" అని బదులుచెప్పిరి. అంతట శక్తివర్మయుఁ జండుఁడును వారిచేతులుబట్టుకొని నిశ్శబ్దముగా నావలకుఁ దోడ్కొనిపోయిరి. అప్పటికి రెండుజాములరాత్రి మించెను. సేవకులలో నొక్కరుఁడు మేలుకొనలేదు! చప్పుడుగాకుండఁ దలుపు వైచి వారు నలువురును నాగాఢాంధకారమున బైలుదేఱి మెల్లమెల్లగానడచి తెల్లవారునప్పటి కొకయామడపోయి యొకపల్లియఁజేరి ప్రాతఃకాలకృత్యములులచ్చటఁ దీర్చుకొన్నపిదప శక్తివర్మ చండబలునుఁగాంచి సహాస్యముగ నిట్లనియె—"రాకొమరులు దండపాణియు, నపుడు నేనును హఠాత్తుగా నదృశ్యులమయితిమని కావలివాండ్రు నేఁటియుదయమునఁ దెలిసికొని భయంపడి వడివడిగాఁబోయి చిత్రభానున కెఱిఁగింతురు. దండపాణి బిడ్డలం జంపక తన్ను వంచించెనేమో యని శంకించి యారాజు బిడ్డలను మనలను వెదకుటకై నలుదెసలకు సేనల నంపును.

అతఁ డావులించినవారి క్షేమము తెంచును. మనముపట్టుబడితిమా భంగము వాటిల్లు. కావున నీవు చిత్రభానునికడకుఁ బోయి యాతనిం దప్పదారిం బెట్టుము. ఈవిధముగా నతనితోఁ జెప్పుము." అని యాతని చెవిలో నొకరహస్యము జెప్పి పొమ్మనియెను. చంద్రుఁడును నతనియుపదేశము మంచిదేయని రాజసుతులం జూచి "తక్షశిలలో నేను వెండియు గలిసికొనియెద. మీ రక్కడ నుండుఁడు" అని చెప్పి వారిని వీడ్కొని పోయెను.

విక్రమసేనుఁడు చండశక్తివర్మలకుఁ దన కృతజ్ఞతం దెలిపి ముందు జేయవలసినపని యేదని శక్తివర్మ నడిగెను. "గాంధారదేశము నకరిగి భాగ్యవర్ధనుని సాహాయ్యమడుగుట సమంజస" మని యతఁ డుత్తరము జెప్పి వారినందు కొంపోవుటకై దారిబత్తెము నిమిత్తము విక్రమసేనుని మేనిమీఁదనున్న యాభరణంబులలో నొకదానిని విక్రయించి రొక్కముచేఁబూని వారి యన్నపానాదులకుఁ గొఱవ లేకుండఁ జేసి మార్గాయాసము లేకుండ బండ్లమీఁద నెక్కించి వారిమనఃఖేదములు బాపుటకు వినోదములైన కథలుజెప్పుచు గ్రామీణుల చిత్రచిత్రములయిన యాచారవ్యవహారములం జూపుచుఁ బయనము చేయించుచుండెను.

కొండకోటకడఁ గావలి యున్న సైనికులు వంటవాండ్రు మొదలగు పరిచారకులు బాలకులను చండ శక్తివర్మలం గానక యేదో మోసముజరిగినదని చండశాసనుఁడను చిత్రభానుని యలుకకు భయపడి తమలో నొకపెద్దం బిలిచి యవ్వార్త రాజునకు విన్నవింపఁబనిచిరి.

ఇరువదియేడవప్రకరణము.

"ఈపాటికి దండపాణి గ్రామదేవతకు మేకపోతును బలి యిచ్చిన చందమున నాదారిలో ముండ్లవలె నున్న యాడింభకుల నిరువుర నఱికియుండును. బ్రతికియున్నప్పుడువలెనే యాపిల్లలిరువురు నొండొరుల కేలువట్టి యమునియింటికిఁ జని యీపాటికిఁ బ్రాంతకాఁపులయి యుందురు. ఉయ్యాలలో నిద్రపోయినట్లు వారీపాటికి గోతిలోఁ బెద్దనిద్దురపోవుచుందురు. ఇప్పుడో రేపో మాపో యాశుభవార్త నాకు రాకమానదు. ఇంక వారితల్లిం గూడ బెగటార్చినంగాని నావ్రతము సమాప్తముగాదు." అని చిత్రభానుఁ డొకనాఁడు తనలోఁ దాను వితర్కించుకొనుచుండ నంతలో ద్వారపాలకుఁడు "దేవా! దండపాణికడనుండి మనచందుఁడు వచ్చియున్నాఁ" డని విన్నవించెను. సత్వరము ప్రవేశపెట్టుమని యతఁ డాజ్ఞ నొసంగఁ జండుఁడు ద్వారపాలక ప్రేరితుఁడై రాజదర్శనము జేసెను. చిత్రభానుఁడు వానిసేమ మడిగి దండపాణి పంపిన సందేశమేమని యడుగ నతఁడు వినయంబున నిట్లనియె.

"దేవా! దండపాణి విజ్ఞాపన మిది—స్వామీ! దేవరవారి యాజ్ఞానుసారముగ నేను సురక్షితముగా మంచుకొండకుఁ బడమటి ప్రక్క నున్న మనకొండకోటఁ జేరి, చండశక్తివర్మలసాయమున నిరువురబాలకుల నాకత్తికెఱ జేసి, లోభిధనమునునిక్షేపించినట్లు వారిం గోతిలోఁ బెట్టి పూడ్చి కృతకృత్యుఁడనై దేవరవారి యనుగ్రహమునకుం బాత్రమునయితిని. స్వామికార్య నిర్వహణప్రవీణుఁడ నగుటచే నేనుఁ జరితార్థుఁడనయితిని. కానిపితృవిహీనులయి యగతికులలయినబాలకుల నిష్కారణముగా వధించుటంజేసి నామనస్సుమిక్కిలి

దుఃఖపరవశమై యున్నది. ఈమహాపాతకము బాపుకొనుటకు నేను
ను, శక్తివర్మయుఁ దీర్థయాత్రలు సలుపవలెనని సంకల్పించుకొంటిమి.
ఈమహాదోషమునకేనాఁడు జగత్త్రయపావనకరమగు భాగీరథీజలము కడు
గవలయు. బదరీనారాయణ సందర్శనమే మాయాత్మలకుఁ బ్రశాంతి
నొసంగవలయు. కురుక్షేత్రనివాసమే మాచిత్తసంక్షోభము మాన్పవ
లయు. సరయూనదీ జలపానమే మాహృదయములను జల్లపఱుపవల
యు. కాశీపుర మహాక్షేత్రమున కరిగి మేము పావనులమగుటకు దేవర
వారు సెలవియ్యవలయునని ప్రార్థించుచున్నాము. మాళవరాజ్య
సైన్యములు మనపొలిమేరల వచ్చి విడియున్నప్పటికి మేము వెండియు
దేవరవారిదర్శనము జేసి [illegible] సమరంబు గావింపఁజనము. నేనెప్పుడు
మీకు విధేయుఁడనై బలుసేనాని నన్ను మన్నింపవలయు' నని
మహాప్రభూ! దేవవారికి సేనాపతి మనవిసేయుమనినాఁడు"

ఆపలుకులు విని చిత్రభానుఁడు తానొనర్చికొన్నట్లు రాజనంద
నుల దండపాణిపుత్రిం దింపఁజేసి [illegible] మిక్కిలి సంతసిల్లి "చండుఁడా!
దండపాణి [illegible]నుఁడు [illegible] పుట్టినవాఁడు రుద్రుండునుం
బోలె మానవసంహారంబు సేయుచుండును. అందుచే ననుదినము విచా
రించుచునె యుండవలయు. ఇంతమాత్రమున కతఁడు పశ్చాత్తప్తుఁ
డై తీర్థయాత్రలు సేయవలయునా? ఎట్టో యతఁడు మనశ్శాంతి
గావించుకొనుఁగాక!" అని [illegible] కృత్యమునకుఁ దోడ్పడి
నందుకు రాజు చండునకుఁ గొనుపరిశుద్ధమైన ముత్యాల సరమొకటి పారి
తోషికముగా నిచ్చెను. ఆసరసరంబు గైకొని చండుఁడు తనకృతజ్ఞ
తఁ దెలిపి చేతులు జోడించి తానుఁగూడ తీర్థయాత్రలు సేయఁగుతూ
హ[illegible] శక్తివర్మ దండపాణులం గలిసికొనుటకు
సెలవిమ్మని ప్రార్థించెను. అట్లుకాక యవనినృపతి యానతియ్య నతఁడు

యదేచ్ఛం జని నిరంతర ప్రయాణంబుల రాజపుత్రి సమేతుఁడయిన శక్తిపర్వ్యుం గలిసికొని తనకును జిత్రభానునకును జరిగిన సంభాషణ మంతయుఁ జెప్పి వారల సంతసింపఁజేసెను. వారు నలుగురు క్రమ క్రమంబుగా నడచి కాశ్మీర గాంధార దేశముల సరిహద్దుఁ జేరిరి.

ఇఁకఁ జిత్రభానుఁడు మునునాఁ డనుకొనినట్లు దనప్రియసే వకు నొక్కనిఁ బిలిచి వానిచెవిలో నేదో రహస్య ముపదేశించెను. అదివిని వాఁడు తనపనిమీఁద బోయెను. ఆసాయంకాలమునఁ గొండ కోటకడనున్న రక్షకభటులతోఁ జెప్పనది "బ్రాహ్మణుఁడు, దండపా ణియు, జండశక్తిపర్వ్యులు నేఁటిరాత్రి వత్తురు" అని చిత్రభా నునితో విన్నవించిరి. అదివిని చిత్రభానుఁడు "తద్విషయమై మే మరసెదము. మీరెక్కడఁ గాపలియుండనక్క ఱ లేదు. సర్వరు నిరండు" డని మూసలిచ్చి వానిని బం పెను. రాత్రిజామగునప్పటికి నగరపుకోటను నొక సేవకుఁడు పరుగు పరుగునవచ్చి తత్క్షణమే రాజదర్శనము చేయవలెనని కోరెను. ద్వార పాలకులు వానిరాక నరపాలునకెఱిఁగించి వానిని వెంటఁగొని యా లెంకను లోనికంపెను. అప్పుడు వాఁడు చిత్రభానుని సాష్టాంగపడి మ్రొక్కి వెక్కివెక్కి యేడ్వ నారంభించెను. చిత్రభానుఁ డంతట బెదరినట్లభినయించి కారణమడిగెను. ఇంటిలోని సేవకులందఱు మిక్కిలి భయపడి, చుట్టు ప్రక్కలఁ జేరి యక్కజంపడి చూచుచుండిరి. అప్పుడా సేవకుఁడు వాని తో నిట్లు విన్నవించెను—"స్వామీ! ఏమని విన్నవింతును? విక్రమ సేనహర్షవర్ధనులు శక్తిపర్వ్యుతోఁ గలిసి కొండకోనలయందు బైలుదేఱి సిం గములవేఁటాడుటకై పరిసరారణ్యము గలిగిరి. ఒక మగాఁడుసింగము రెండుమగసింగములు నొకపాడిలో నప్పుడే చంపి తెచ్చిన యొకయెద్దు ను భక్షించుచుండెను. ఆమహాప్రాణులు మువ్వురు పల్లె నారితోడఁగి తీ

వరిబాణంబులు సంధించి మూఁడుసింగంబులపై మూఁడుబాణంబుల నేసిరి. ఎఱమీఁదనున్న వేమో యాసింగములు ప్రళయకాలరుద్రుఁడట్లు మహాక్రోధపరవశములై తమపైఁబడినబాణము లెంతవేగమునఁ బోయెనో యంతవేగమున వచ్చి మువ్వురిపైఁబడి తత్క్షణమే యామువ్వురం గడతేర్చెను. శక్తివర్మ కేమి కాని మహాప్రభో! రాజకుమారులు పోయినందుకు నేను మిక్కిలి విచారించుచున్నాను. ఇంతకు దైవనిర్ణయమిట్లున్నది" యనిమరల నేడ్వఁ జొచ్చెను.

అవ్వచనంబులు కర్ణంబులసోఁకుటయు "హా! కుమారులారా" యని యతఁడు మూర్ఛిల్లెను. సేవకులందఱు మిక్కిలి కలఁతనొంది హాహాకారములు చేసిరి. ఇందుమణియుఁ గర్పూరమంజరియు లోపలినుండివచ్చి శైత్యోపచారములు చేయించి కారణ మేమని యడిగిరి. వార్తాహారుఁడయిన యాకింకరుఁడే యావృత్తాంతము మరలఁజెప్పి పెద్దపెట్టున నేడ్చెను. కర్పూరమంజరి యవ్వార్త విని యతిశోకమగ్నయయ్యెను. ఇందుమణికన్నులనుండి బొటబొట బాష్పములు దొరఁగెను. సేవకు లందఱు "కటకటా! ఎంతకష్ట మని విలపించిరి. చిత్రభానుఁడు శైత్యోపచారములవలన సేదదేఱి "హా! కుమారులారా! మిమ్ముఁబాసి నేనెట్లుజీవింతును రా! మీతల్లి యీవార్త విని యెంత శోకించుచున్నదో కదా? అయ్యో! మాయన్నగారివంశమైన లేకపోయినదే. ఓమాలదైవమా! నాఁడు హేమచంద్రునకట్లు దారుణమరణము విధించితివి. గుణరత్నాకరులు—లోకైకసుందరులు—నగునాతని బిడ్డలనైనం జూచి సంతసింపకుండ వారింగూడ నీపొట్టంబెట్టుకొంటివా? పాపాత్మురాలా! మృత్యుదేవీ! నీకంటికిఁ బేలగింజయుఁబెద్దయయ్యెనే? నీయాఁకలి దీర్చుకొనుట కింతకన్న నీకు మఱియొకజంతువు దొరకలేదా? ఆచక్కఁదనమేమి! ఆలావణ్యమేమి! ఆవినయసంపదయేమి! ఆ

విజ్ఞానమేమి? హా! అంతటి గుణసంపన్న ... పతిం బ్రతికనిచ్చు
నా? అహో! ... యిూరోగంబులో ... నెట్లు?
ఆకొలువు ... నన్ను ... ! ఏది
చూచినను ... ! ఏమిచేయుదు?
విజయనగర ... ఆకొండకోట
లోనుండవలసిన ... యునజను సులభమైన
యుత్సాహముచే ... నెట్టి ... నవ్వరి.
విధినిర్ణయము ... అయ్యయ్యో!
ఆపాదుసింగి ... దుర్మార్గుడవు,
పాపిష్ఠుడవు, ... నుకాల్పజాలవ
యితివే! మృత్యుదేవత ... నీవేమి
చేయగలవు!" ... .

... ఉన్న
... . ఆమె
నిజముగా ... లేని భావించుచు
న్నంతయును ... యుండెను. ... యా
మె నిదురయేవి లేదు. ... బా
లకులు ... తమ ... ఎదుట
నిలిచి ... చెప్పినట్లు—నామె
భావింపజొచ్చెను. ... యైన పిమ్మట ... భానుడు
గాఢముగా నిద్రించి ప్రభాతము ... మరలఉదయింపనారంభించెను.
గడియప్రొద్దెక్కునప్పటికి ... మరణవార్త పట్టణమంతయు
వ్యాపించెను. హేమచంద్రుని ... పట్టణ మెట్టిదుః
ఖాంధకారమగ్న ... యుండెను. ప్రతిగృహము
నుండి హాహాకారములు ... . వారింపజాలి ... యుం

డునని కొందఱనిరి. వేఁటలో సింగము వేటుతప్పించుకొని మీఁద బడినప్పుడు చిత్రభానుఁడేమిచేయఁగలఁడని కొందఱు వచించిరి. తండ్రికిం గొడుకులకుఁగూడ దారుణమరణమే విధి నిర్ణయించుటయాశ్చర్యమని కొందఱు భాషించిరి. ఆనాఁడు చంటిబిడ్డలు, రోగులు, వృద్ధులు దక్కఁ దక్కిన పురజనులు భోజనములే చేయలేదనుట యతిశయోక్తి గాదు.

మఱునాఁడు నుదయమునఁ జిత్రభానుఁడు కొలువుకూటమున కనఁగలేదు. మంత్రిసామంత ప్రముఖ సేనాపతులు చిత్రభానుని సందర్శించి పరామర్శచేసిరి. రాజనులలోని ప్రముఖులుగూడనట్లుచేసిరి. చూడవచ్చినవారితోనట్టె యెవ్వరుఁ జిత్రభానుఁడు గొడ్డఱచిన ట్లఱచి యేడ్చెను. బహుసంఘములు రాజకుమారుల గుణములఁ బ్రశంసించుచుఁ దన దుఃఖమును బ్రకటింపఁ జొచ్చెను. ఆనాటకిమంతయు నెఱిఁగియు యుక్తిభక్తు ప్రక్కనవారితోఁ దుఃఖోపశమన వాక్యములం జెప్పుచు నితిహాసంబులలోని గాథలు దెలుపుచుఁ బ్రక్కనఁ గూరుచుండెను. అది మొదలుకొని దుఃఖాతిశయమునఁ జిత్రభానుఁడు పదిదినములు కొలువుకూటమునకుఁ బోవనే లేదు. రాజ్యవ్యాపారములఁ జూడనే లేదు. రాయబారులకు దర్శనమియ్యనే లేదు. ఆలుబిడ్డలతోనయిన మనసిచ్చి మాటాడలేదు. ఇది నటన మని కొందఱు నిజమని కొందఱు, పురజనులు చెప్పుకొనసాఁగిరి.

ఇరువదియెనిమిదవప్రకరణము.

పాంచాలదేశాధీశ్వరుఁడగు మహేంద్రదేవుఁడు తనకూఁతురు మనుమలు మహోపద్రవసముద్రమున మునిఁగిపోవుదురని మాధవ

సేనుఁడు తెలిపినతోడనే వృద్ధుఁడయ్యుఁ గాశ్మీరముపై దండువిడియుటకుఁ జిత్రభానుని దండించుటకు సమరసన్నాహము జేసెను. అలన్యమమృతం విష'మ్మన్నట్లు వారిసన్నాహము సిద్ధమగునప్పటికి హేమచంద్రునికుటుంబమునకు రావలసినకష్టములన్నియు వచ్చెను. అయినను వారది గుర్తెఱుంగక కాశ్మీరముపై దండయాత్ర జరిపిరి. మహేంద్రదేవుఁడు వృద్ధుఁడు. అతనికిం గొడుకులు లేరు. అధికారము వహించెనని యోగు లందఱు పరస్పరమత్సరగ్రస్తులయి రాజకార్యనిర్వాహణముకన్న నొండొరులరొడఁ గలతమద్వేషములకుఁ బ్రతిక్రియలు చేసికొనుటలో, నెక్కువ శ్రద్ధ గలిగి చిర కాలము మస్తంత్రములఁ బన్నుచుండిరి. అకారణముగఁ బాంచాలసైన్యము దుర్బలమై యుండెను. మహేంద్రదేవుఁడు కాశ్మీరమునకుఁ బోయి తన మనుమలఁ దన కప్పగింపు మనియు దేశము విడిచిపొమ్మనియుఁ జిత్రభానునకు సందేశమంపెను. చిత్రభానుఁ డారాయబారిని బరాభవించి తగినయుత్తరము జెప్పకయే పంపెను. పాంచాలసేనాపతులలోఁ గొందఱు లంచగొండులై చిత్రభానునకు వశులైరి. పాంచాలకాశ్మీరసైన్యములకు యుద్ధము జరిగెను. మహేంద్రదేవుఁడు యుద్ధమునఁ బరాజితుఁడై రాజధానికిఁ బాఱిపోయెను. రాజభక్తి గలసైనికులెల్లఁ దమ కోపినకొలఁది పోరాటముసల్పి మ్రందిరి. ప్రాణభీతిగల యోధులు చిత్రభానుని కోడి నలుదెసలకుం బరుగులెత్తి ప్రాణములఁ గాచుకొనిరి. మాధవసేనుఁడును భగ్నమనోరథుఁడై పలాయనమె శరణంబుగాఁ జేసికొనెను. పాంచాలదేశమును గొల్లకొట్టింపవలె నని రుద్రభట్టునుపదేశమునఁ జిత్రభానుఁడు సంకల్పించెనుగాని సాహసారంభముతో మాళవరాజసైన్యములు దమపై వచ్చుచుండుటం జేసి యతఁ డాసంకల్పమును వదలుకొని మకరందుని దాఁకుటకు సర్వసన్నాహములు సేయుచుండెను.

అంతలో మకరందుని సేనలు పొడకట్టెను. మాళవసైనికులు మహోత్సాహముతోఁ బోరాటంబున కెదురుచూచుచుండిరి. నగరంబునకుఁ బడమటివైపున మాళవసైన్యములు విడిసెను. కాశ్మీర నగరముఁ జూచినంతోడనే మకరందునకుఁ గర్పూరమంజరి జ్ఞప్తికి వచ్చెను. తన కామెపై నెంత ప్రేమయున్నదో నామెకుఁ దనపై నెంత మక్కువ యున్నను "హా నామెతండ్రికి విరోధినై కాశ్మీరముపై దండువిడిసియుంటినే నాకుఁ దాఁ గూఁతుఁ గనకీయఁడనియుఁ గన్నియయుఁ దండ్రికిం బగతుఁడైన రాకొమరుని కేలు పట్టుటకిచ్చగింపదనియు నిశ్చయించి తనదురదృష్టమునకుఁగా వగచుచుండెను. మకరందుఁడు యుద్ధసన్నద్ధుఁడై వచ్చియున్నవాఁ డని వినినదిమొదలుకొని కర్పూరమంజరి తనపై నతనికిఁ బ్రేమగాని యున్నను బగతునిబిడ్డ యగుటచేఁ దనకేలుపట్టఁడనియుఁ, దనతండ్రికి నాతనిమూలమున శక్యమైనన్ని యంతరాయములఁ గల్పించునని నిశ్చయించి తన యాశ యడుగంటె నని వాపోవఁజొచ్చెను.

ఉజ్జయినిలో నాఁడు మకరందునకుఁ జిత్రభానునిసందేశ మెఱిఁగింపఁబోయిన జయంధరుఁడు మాళవరాజన్యుండా దారముతోఁ గలసి పయనము జేసినపక్షమున సురక్షితముగాఁ దనయూరు జేరవచ్చునని దాని ననుసరించి పోయి రెండుదినములు శిబిరమున నుండి యకస్మికముగా నదృశ్యుఁడై కాశ్మీరనగరద్వారముకడ నిలిచి మకరందుని రాయబారి నని చెప్పి కోటలోఁ బ్రవేశించి క్రమక్రమంబునఁ గక్ష్యాంతరంబులు గడచి ద్వారపాలునిచేతఁ జిత్రభానునిసమీపమునకుఁ గొనిపోఁబడెను. చిత్రభానుఁడు వానిఁ జూచి "మకరందుఁడు మాకేమిసందేశములఁ బంపి"నని యడిగెను.

అనవుడు జయంధరుఁ డిట్లనియె. "దేవా! ఆగ్రహింపకుండురేని చిన్నవిన్నపము జేసెద నాచేసినయపరాధంబు క్షమింపుఁడు.

నేను మకరందుని రాయబారిని గాను. మీయంతఃపురపరిచారిక యయినచంద్రిక నాప్రాణమిత్రము. ఈసందడిసమయమున నన్ను లోపలికి మీబంట్లు రానీయరని శంకించి మకరందునిదూత నని చెప్పితిని. చంద్రికతో నొక్కసారి మాటలాడవలయు దేవరవా రనుజ్ఞ నొసఁగుదు రేని యట్లుచేసి, పోయెద." అనవుడు విస్మితుండై చిత్రభానుఁడు "ఏమీ! చంద్రికమిత్రమవా నీవు? సరే! అట్లయిన దాని బిలిపించె నుందు" మని చంద్రికను రావించెను. అది వచ్చి యాతని మొగముఁ జూచి "ఇతఁ డెవరో నే నెఱుఁగ" నని చెప్పెను. "అయ్యో! నన్నెఱుఁగవటే! ఇంతలోనే మఱచితివఁటే! మహాప్రభూ! దేవరవారే నన్ను గుర్తింపలేదా? నేను మీయింటనే పెరిఁగితిని. మీయన్నముల నీడనే బ్రతికితిని. మీయనుగ్రహముచేతనే వర్ధిల్లితిని. అమ్మగారు నన్నెఱుఁగుదురు. మీయమ్మాయి నన్నెఱుఁగును. దేవరవారు రాజకార్యములగొడవలోనుండి మఱచిరి." అని జయంధరుఁడు నవ్వుచుఁ బలికెను.

ఆకథ కడుఁ జిత్రముగా నుండుటచేఁ జిత్రభానుఁడు కర్పూరమంజరిని నిందుమణిని నచ్చటికి రావించి యప్పురుషుని గుర్తింపుమని చెప్పెను. అమ్మా! నన్ను మీ రెఱుఁగరా యని జయంధరుఁడు బలుకఁ గర్పూరమంజరి తెప్పపాటువేయక చూచి ముఖవైఖరియుఁ గంఠధ్వనియుఁ దనకుఁ బూర్వపరిచితములైనట్లు తోఁపఁ జప్పటులు చఱచి "నాయనా! ఈవిగ్రహము పురుషవిగ్రహము గాదు. మల్లికయే మాఱువేసము వైచికొని యిల్లువచ్చెనని నాకుఁదోచుచున్నది" యని నవ్వుచుఁ జెప్పెను. అప్పలుకులు విని చంద్రిక "ఔనండి! ఇది నిజముగా మనమల్లికయే. ఏమే! నీసరసము చట్టుబండలుగాను" అని దగ్గఱకుఁబోయి తలపాగ నూడఁదీసెను. అప్పుడు దీపములవెలుఁగున దాని మొగము విస్పష్టమై కనఁబడెను. "అయ్యో! నిన్ను పెద్దపులి

యీడ్చుకొనిపోయి చంపెనని జంబుకుఁడు చెప్పె. ఎట్లు బ్రతికి వచ్చితివే" యని చిత్రభానుఁ డడిగెను. "స్వామీ! మనజంబుకుఁడు గంజాయిత్రాగి యామైకముతోఁ బాడుకొని నన్ను బెబ్బులి యీడ్చికొనిపోయినట్లు కలగని యుండవచ్చును. దానిమత్తుచేతఁ బయనములో నాకు సాయముచేయుటకు మాఱుగా నా కంతరాయములు గలిగించుటం జేసి వానిని వదలించుకొని నే నావలికిఁ బోతిని. ఆలాహిరికాఁడు కలయే నిజమనుకొని నన్ను వంచించిపోయిననన్నుఁ గానక మీతో నట్లు మనవిచేసియుండవచ్చును" అని మల్లిక మందహాససుందరమైనవదనముతో నుత్తరమిచ్చెను. అదివిని నవ్వి చిత్రభానుఁడు "ఓసీ! నీయాఁడువేసముకన్న మగవేసమే బాగున్నదే. చాలు. నీవుచేసినప్రతిజ్ఞ చాలును. నీప్రతిజ్ఞకు సంతసించితిమి. ఈపాటికి నీవభ్యంతరమందిరమునకుఁ బో!" అనిమందలింపఁ జంద్రిక దానిచేయి బట్టుకొని లోపలికిఁ దీసికొనిపోయెను. ఇందుమణియుఁ గర్పూరమంజరియు లోపలికరిగిరి. పిమ్మటఁ గొంతకాలము పరస్పరవియోగదుఃఖమున సంతప్తులయినచెచ్చెలులకు విస్రంభసంభాషణ మారంభమయ్యెను. అప్పుడు చంద్రిక ముందుగా నిట్లనియె. "ఓసీ! మల్లికా! నీవు మృతినొందితివని మే మతిదుఃఖముపాలయితిమి. నీనిమిత్తము బెంగపెట్టుకొని కర్పూరమంజరి యురిపెట్టుకొన్నది. ఆయుశ్శేషముండుటచే నే నడనే యురి కనిపెట్టి పెద్దపెట్టున మొఱ్ఱలుపెట్టితిని. నాకుగ్యాలించి వెంటనే కంచుకులు పరువెత్తుకొనివచ్చి యీమెను రక్షించిరి. మెడకుఁ బిగించుకొన్న తీఁగత్రాడు దీయుటకయిన నాకుఁ జేతులు వచ్చినవి కావు. నా యొడలు వడఁకెను. దైవానుగ్రహమున నెట్లో బ్రదికెను.


"అమ్మా! ఉరిపెట్టుకొన్నావా? అమ్మా! ప్రాణసఖీ! ఎంత పనిచేసితివమ్మా! నీవు లేనియెడల సంసార మసారము. మధ్యమలోక

ము దీపరహితము. జగము జీర్ణారణ్యము. మానవులనేత్రేంద్రియము నిష్ఫలము. మాకుమరణమే శరణము లోకమును శోకమగ్నముఁ జేసెదవా! మన్మథుని గర్వహీనుఁ జేసెదవా! నీ కింతసాహసముగూడనా! నావంటి నెచ్చెలులు నీ కెందఱో లభింతురు. నాకొఱకై ప్రాణము నీ వఁదగునా!" యని యామెసాహసమును గర్హించి మల్లిక సఖప్రమాద విశేషంబులఁ జెప్పి వారిని బ్రొద్దుపోవునఱకు నలరించెను. ఆమాటలు వినుచుఁ జంద్రిక మెల్లగ నిద్రపోయెను.

అనంతరము కర్పూరమంజరి మల్లికను దనకు మిక్కిలిదగ్గఱగ రమ్మని పిలిచి యిట్లనియె.—"మల్లికా! నిన్నుఁజూచి కొన్నిమాసములే యయినను జిరకాలమునుండి చూడనట్లు కన్నులు వాఁచిపోయినవే. నిన్నుఁజూడఁగా నాప్రాణము లేచి వచ్చినది. హృదయము ముప్పొంగినది. మనస్సు సంతోషముఁ బట్టఁజాలకున్నది. కన్నుల ఆవు తీరినది నీవొక్కతవయైనను వేయిమందిచుట్టములు వచ్చినట్లున్నది. ఇంతకుఁ గార్యసిద్ధియైనఁగా లేక నీప్రయాణమునకు దేహశ్రమము మాత్రమే ఫలమా!" అనిపలుక స్నేహస్నిగ్ధభాషణముల మల్లిక మరల నెచ్చెలి కిట్లనియె. "సఖీ! నీకునాయెడఁ జిన్నటనుండియు నిట్టిప్రేమయే గలదు. అట్లు నీవనుకొనుటకు నీసౌజన్యమే కారణము గాని నాయందలి గుణవిశేషము గాదు. బెంగపెట్టుకొనకు. కార్యసిద్ధి కొంతవఱ కయినది. నా ప్రయాణము వ్యర్థము కాలేదు. బహుశ్రమలుపడి నే నుజ్జయినిఁ జేరి వేడుకచెలికానితోఁగూడి వెన్నెలలో ముచ్చటలాడుచున్న మకరందుని జూడ మగవేసముతో వెళ్ళితిని. మగవేసమేల ధరింపవలెనందువో! మహాత్ముఁ డయిన మకరందుఁడు పరస్త్రీలతో మాటలాడఁడు. జవ్వనుల మొగ మయినఁ జూడఁడు. కావున నాగుణాకరుని మగవేసమునం జూచుట మంచిదని యట్లుచేసితి.

నీహృదయ మాతనియందు లగ్నమైనమాట విన్నవించితిని. అతఁడును నీనిమిత్తమై పరితపించుచుండెనని వేడుకచెలికాఁడగు చంద్రిమాడునివలనఁ దరువాత వింటిని. కాని, యతఁడు మీతండ్రిపై దాడి వెడలియున్నాఁడు. మునుపే నీతండ్రి వీనియల్లునిగ నొల్లకయున్నాఁడు. ఇప్పు డీతనిమీఁద మీయయ్యయలుక నూఱురెట్లు హెచ్చెను. కావున సుఖసుఖాన మీతండ్రి నిన్నీతనికియ్యఁడు. ఇందుకు దైవమే న్యాయముగా దౌత్యము వహింపవలెను గాని మనుష్యులవలనఁ గాదు. పరమేశ్వరుఁ డఘటనఘటనా సమర్థుఁడు"

అదివిని కర్పూరమంజరి "ప్రియసఖీ! నీపలుకులలోఁ గొంత యాస యున్నది. కొంతయాస లేదు. అతఁడు నాయం దనురక్తుఁడై యుండుటఁ జేసి యాశాబంధము తెగకయున్నది. మాయయ్యకు విరోధియగుటం జేసి వెంటనే నిరాశ యంకురించుచున్నది. ఆశానిరాశలనడుమ నామనం బూఁగాడుచున్నది. ఈకలహ మెట్లు పరిణమించునో తెలియదు. ఇందు మకరందునకు మరణమే సంభవించునేని నా మనోరథము లాతనితో మంటఁగలియునుగదా. లేక పోరితంబున మాయయ్య కడతేరునేని దండ్రిం జంపినవాని నెట్లు చేపట్టఁగలను? దైవ మొక్కఁడే యిందు సాయము జేయఁ దగినవాఁడు. నేను గౌరీసేవానిరతురాల నగుదునేని భగవతి కాత్యాయని నామనోరథ మీడేర్చుఁ గాక!" యని తన మనోవేదన చెలిమికత్తెకెఱిఁగించి రేయి చాల గడచుటచే నిట్టూర్పు విడుచుచుఁ బండుకొని కన్నుమూసెను. మల్లిక మార్గాయాసముచే మిక్కిలియలసియుండుకతనఁ బడినదే పాటుగా గాఢనిద్రసుఖ మనుభవించెను.





ఇరువది తొమ్మిదవ ప్రకరణము.



ప్రభాతమయ్యెను. తీర్థయాత్రలు సేవింపనరిగిన దండపాణి రాకపోవుటంజేసి చిత్రభానుఁడు విషణ్ణహృదయుఁడై యుండెను. వజ్రపాణి యంతకుమున్ను రెండుమూఁడుసారులు తనయన్న యెందుండెనని చిత్రభాను నడుగ నతఁడు కార్యాంతరంబుల దేశాంతరంబుల కరిగెనని యుత్తరము చెప్పెనేకాని యథార్థము వచింపనేలేదు. అన్న రాక దవ్వయినకొలఁది వజ్రపాణి కనుమానము హెచ్చెను. అతని మనంబు పరిపరివిధంబులం బోయెను. "ఏమహారాజునొద్దకయినఁ జిత్రభానుఁడు వానినిరాయబారిగాఁ బంప, నారాజు వానియసువు లపహరించియుండునా? మార్గమధ్యంబునఁ జోరకిరాతాది భయంబున మ్రందియుండునా? రోగపీడితుఁడై దేహత్యాగముచేసి యుండునా? వైరాగ్యంబున సన్యసించియుండునా!" యని వజ్రపాణి పలుతెఱంగుల నూహించును నిదమిద్ధమని నిశ్చయముచేయలేక యానాఁడుదయమునఁ జిత్రభానుని సందర్శించి తనసోదరుని విషయమునఁ దనకుఁగల సందియముల నెఱిఁగించి నిశ్చయవార్తఁ దెలుపుమని వేఁడెను చిత్రభానుఁడు వానిసంశయములఁ బాప సత్యయదార్థమంతయుఁ జెప్పి యిట్లనియె. "నీయన్ననుగూర్చి నీవెంతబెంగగొంటివో నేనును నంతబెంగఁ గొనియున్నవాఁడ. అతఁడు లేకపోవుటచే నాసేనాముఖము తిలకహీనమై యున్నది. నాకుడిచేయి పడిపోయినట్లున్నది. మాశివరాజసైన్యములు పెచ్చుపెఱిఁగి యున్నవి. అతఁడు లేఁడన్నమాట వారికిఁ దెలిసికొఁబోలు గర్వోన్మత్తులై వారు సంచరించుచున్నారు. నీవు మేటిమొనగాఁడవు, మహాశూరుఁడవు నని నే నెఱుఁగుదును. అయినను నతనికి నీవు నీ వతనికిఁ దోడై నయెడల మాశివసైన్యంబు

తేగావు—మహేంద్రసైన్యంబులకున్ దైన్యంబునొందకమానవు. నీ వొంటిగాఁడ వయితివని నేను విచారించుచున్నాను. నే నొంటిఱెక్కతోనున్న పక్షివలె నున్నాను. నీవు మాయన్నకొఱకై బెంగబెట్టుకొనకుము. ఈయుద్ధమునకు వెంటనే కరటకపింగళులను గాశీ హరిద్వారబదరీనారాయణాది క్షేత్రములకంపి మాయన్ననిమిత్తమై వెదకింతము. చిత్రభానుఁడే మాయన్నయనుకొనుము."

వజ్రపాణి కాపలుకులంత దుఃఖోపశమనముఁ జేయకపోయినను సంశయనివృత్తిఁ జేసినందున నాతని మనస్సు కొంత పరిశాంతి జెందెను. ఆమఱునాఁడు యుద్ధము సేయుట కిరువురు నిశ్చయించుకొనిరి. ఉభయసైన్యంబుల భేరీభాంకరణంబులు దెసల మాఱుమ్రోఁగెను. ఉభయసేనలలోని బంట్లకు నుత్సాహము మిక్కుటమై యుండెను. గజబృంహితంబులు, హయహేషితంబులు, రథనేమిధ్వనులు, పదాతుల యుత్సాహరసభరిత వచనములు మిన్నుముట్టెను. ఆనాఁటిరేయి నా పక్కఁ జిత్రభానుఁడు వజ్రపాణి మొదలగువారును, నీపక్క మకరందుఁడు, కంఠీరవదేవుఁడు మున్నగువారును దమతమ సెలవుల నుచితస్థానముల నిలిచి పిఱికితనము పటాపంచలై పోవునట్లు—వీరరసము మనంబుల నిండియుండునట్లు గయ్యంబులకు సైనికులం బురికొల్పుచుండిరి.

అంతలోఁ దెల్లవాఱెను. ఉభయులమనంబుల నెలకొన్నక్రోధాగ్నివలె భానుమండలము కానఁబడియెను. ఆక్రోధాగ్నిమంటలో యనఁ దొలిసంజకెంజాయలు దెసల నలముకొనెను. మంట లెగసినతోడనే నంతరించు పొగచందంబున మంచు క్రమక్రమంబుగ నదృశ్యమయ్యెను. సైన్యములు మేనం బూసికొన్న వీరగంధముల చందంబున తేయెండలు వ్యాపింపఁ దొడఁగెను. రణదుందుభులు మొఱసి సన్నసేయ నుభయసేనలు తలపడెను. ప

నుంగుల నేనుఁగులు దాఁకెను. అశ్వికు లాశ్వికులం దలపడిరి. పదాతులు పదాతులం గలిసి పోరాడిరి. సాయంకాలమువఱకుఁ గయ్యము ఘోరముగా జరిగెను. ఒకమాఱు జయము వారికిఁ జేకూరినట్లు మఱియొకసారి వీరికిఁ జేకూఱినట్లు దోఁచెను.

కంఠీరవదేవుఁడు కంఠీరవంబట్లు పోరాడి యపరాహ్ణంబున వజ్రపాణిప్రయుక్తమయినవాలుటమ్మునఁ దెగటారి నేలంగూలె. ఆతఁడీల్గినకొంత సేపటికిఁ జిత్రభానుండు ప్రయోగించినకఱకుటమ్మున మకరందునకు గాయము తగుల నతఁడు మూర్ఛిల్లె. చికిత్సకులకు పరిజనులు స్కంధావారమునకు వానిం గొనిపోయిరి. మదపుటేనుఁగుమీఁద మకరందుఁడు కనఁబడక పోయినతోడనే పరసైన్యంబులు మకరందుఁడు మ్రిందెనని కోలాహలముచేసి సంతోషసూచకముగా రణదుందుభులు మ్రోయించిరి. ఛత్రసేనుఁడు తనమిత్రునకుఁ బ్రమాదకరమైనగాయంబు తగిలెనేమో యని శంకించి చికిత్సకులచేత వ్రణపట్టికలు వేయించి సమయోచితమైనయుపచారంబులు చేయించుటకు వెంటనే శిబిరంబున కరిగెను.

పరసైన్యంబులకోలాహలంబులు విని మాళవసైన్యంబులు భీతిల్లి పలాయనము సేయఁ జొచ్చెను. తెలివివచ్చినతోడనే తనగాయమునయింత లెక్కసేయక జోటజోటుఁగాఁ గ్రొన్నెత్తురుపోవలతో మకరందుఁడు మరల నశ్వము నెక్కి యెలుఁగెత్తి కయ్యమునకుఁ దనసైన్యంబులఁ బురికొల్పెఁ గాని వంచినతల యెత్తక భటులు పోయిన పోకం బోయిరి. విజయలక్ష్మి చిత్రభానునిం జేపట్టెను. పరసైన్యంబులు మాళవులం జెదిరితఱిమి కత్తుల నఱికియు బల్లెములం బొడిచియు, నమ్ముల నేసియు, గదలం జదిమియు నాశనము చేయఁజొచ్చెను

మకరందుఁడు ధైర్యము విడువక రణముఖంబున నిలువ ఛత్రసేనుఁడు మఱికొందఱుభటులు వాని కపాయంబు శంకించి బలిమిని

గుఱ్ఱ మెక్కించి యావలకుఁ దీసికొనిపోయిరి. గాయములకుఁ జికిత్స చేయఁబడలేదు. నెత్తురోడికకకగట్టి పాఱుచుండెను. దాహముచేనాల్క యిగుర్చుకొనిపోవుచున్నను వెనుక పగవారు తఱుముచున్నకతమున మంచితీర్థము త్రాగుటకయిన నవకాశము లేకపోయెను. నెత్తురు మిక్కిలి మేననుండి పోవుటచేనతఁడు దుర్బలుఁడై సోలిపోవఁ జొచ్చె. భద్రసేనుఁ డాతనిగుఱ్ఱముమీఁదనే యెక్కి వానిం దనఱొమ్మునకుం జేరవైచుకొని పట్టుకొనియుండెను. అశ్వము సుశిక్షితమైన దగుటచే యజమానునవస్థ నెఱిఁగి మిక్కిలివేగమునఁ బరుగెత్తఁజొచ్చెను. శిబిరము విడిచి కొంతదూరము వారు పరుగెత్తి యొకచిన్నపల్లియం జేరిరి. అప్పటికి సాయంకాల మగుటచే శత్రువులకు వీరిజాడ తెలియలేదు. కావున వారు మిక్కిలి వేగమున ముందుకుసాగి పోయిరి. భద్రసేనుఁడు మకరందుని మెల్లగాఁదోడ్కొనిపోయి వ్రణచికిత్సకుఁ డాగ్రామమున నున్నాఁడాయని యడిగి తెలిసికొని గ్రామీణు లొక మంగలివానిం జూప వానిచే నారేయి యారాత్రమునకుఁ దగుచికిత్సలు చేయించెను.

మకరందునకుఁ దీవ్రమైనజ్వరము వచ్చెను. కలఁతనిద్దురయే గాని గాఢమగునిద్దుర పట్టలేదు. నాలుగైదుసారులు దాహము త్రాగెను. పెక్కుసారులు పలువరించెను. అం దొకసారి "కర్పూరమంజరీ! ఎంతకాలమునకుఁ గనఁబడితివి!" అని నిదురలోనే మందహాసపురస్సరముగాఁ బలికెను. వెంటవచ్చిననలుగురు సేవకులు మార్గమధ్యమున శత్రుబాణప్రహారముల నీల్గుటచే వాని కంగరక్ష సేయవలసినవాఁడు భద్రసేనుఁ డొక్కఁడే యయ్యెను.

ఎంతదూరము పోయినను మకరందునిజాడలు. పొడకట్టమి మకరందుం బట్టుకొనుటకై వెడలినచిన్నబలఁగము వెనుకకుఁదిరిగి వచ్చి పరిసరంబున నున్నపల్లియల శోధింపఁదొడఁగెను. గాయము

తగిలినమూఁడవనాఁడు మంగలి కట్టువిప్పి పుండు మానుదలపట్టినదని యుఁ బ్రాణాపాయములేదనియుఁ జెప్పెను. అదివిని మకరందుఁ డిట్లనియె "భద్రసేనుఁడా సంగరంబున గాయముతగిలి నేను మూర్ఛిల్లి నప్పుడు నన్నక్కడ నుండనీయక నీవు నన్ను శిబిరమునకుఁ గొనిపోయి మిక్కిలి తప్పుచేసితివి. మనసేనలు పరాజయము నందుచున్నప్పుడు గాయము లెక్కసేయక యశ్వారూఢుఁడనై నేను మరల సమర రంగమునకు వచ్చునప్పుడును నీవు నన్ను కూడ నిలువనీయక పగతుఱు పట్టుకొందురని భయపడి యిటు తీసికొనివచ్చితివి. నీ విట్లు చేయని పక్షమున నే నీపాటికి మృతినొంది వీరస్వర్గమునకు బ్రాఁతకాపునై యుండుదునుగదా! నా కట్టి గౌరవముఁ గలుగనీకపోతివి. నా ప్రాణ రక్షణమే చూచుకొంటివి గాని దీనికన్న వేయిమడుఁగు లధికమైన నాప్రతిష్ఠారక్షణము జూడవయితివి. నీ యుద్దేశము మంచిదైనను నీకార్యము శ్లాఘాపాత్రము గాదు. రణముఖంబున క్షత్రియుఁడు మడమ త్రిప్పక వెనుకంజ యిడక పగవారితోఁ బోరవలయు, లేదా తనకై ప్రాణంబుల నర్పించు వీరయోధ సహస్రమధ్యమునఁ గానుం బడి ప్రాణములు విడిచి కదనరంగ మలంకరింపవలయు. అట్టి పుత్రుని వలననే తల్లి వీరమాత యగును. అట్టిమగనివలనఁ భార్య వీరపత్ని యగును. నామరణమునకన్న మకరందుఁడు పిఱికియై పోరినుండి పాఱెనని లోకులు చెప్పుకొందురేమో యనుదానికి నే నెంతయు భయపడుచున్నాఁడ. ప్రాణాపాయము లేదని చికిత్సకుఁడు చెప్పినం దున నాకు సంతసము లేదు."

అనవుడు భద్రసేనుఁడు "మిత్రుఁడా! "జీవన్ భద్రాణి పశ్యతి' యనునార్యోక్తి వినవే? బ్రతికియుండిన నెన్నో శుభములు గానవచ్చు. ఎందఱో పగతుఱ గెలువవచ్చు. ఎన్నో విజయములఁ బడయవచ్చు. ఎంతో యశోధనము నార్జింపవచ్చు. ఊరక చచ్చిపోయినను

ప్రయోజనము? "శరీర మాద్యం ఖలు ధర్మసాధన"మ్మనుమాట వినవె? నిన్నెఱిఁగినవా రెవ్వరుగ నిన్నుఁ జికిత్సింపకయని యధిక్షేపింపరు. సమరములో నీవు మహాద్భుతముగఁ బనిసేయలేదే! అదిగాక సమరమున నీయంతట నీవు విడిచి రాలేదు. నీవు సొమ్మసిల్లినప్పుడు దుర్బలుఁడవైనప్పుడు నిన్ను బలిమిం దోడ్కొనివచ్చితిమి. గాయము మానినవెనుక కాయము దృఢమయినవెనుక నీవు మరలఁ బగతుఱపైఁజని గెలువవచ్చు." అనియుక్కుమారుని సమాశ్వాసించెను.

మకరందునినిమిత్త మన్వేషించుచున్న సైనికులనాయకుఁడు ప్రసేనుఁడు నాఁటియుదయమున నె యాపల్లియఁ జొచ్చి గ్రామాధికారులం బిలిపించి మకరందునిజాడలు తెలియునా యని యడిగెను. నిజముగా వారతనిని జూడకపోవుటచేఁ దా మేమియు నెఱుఁగనట్లు జెప్పిరి. అతఁడది నమ్మక ప్రతియిల్లు శోధింపుమని సైనికుల కానతిచ్చెను. ఇచ్చినదే చాలునని దుండగులయిన యాసైనికులు వంటయిండ్లనక పడకగదులనక యటకలనక దొడ్లనక తోఁటలనక యెల్లతావుల వెదకి యంగనల నవమానించి తమకుఁ గావలసినపదార్థముల నెల్లఁ జెప్పియుఁ జెప్పకయుఁ దీసికొని పోయిరి.

అట్లు వెదకుచు నిల్లిల్లుఁ దిరుగుచుండ నొకమంగలియింటిలోఁ గంబళిపఱచినసులకమంచముపైఁ బండుకొన్న యొకపురుషుఁడు, వాని ప్రక్కం దాటియాకులచాపపైఁ గూర్చున్న యొక్కపురుషుఁడు సైనికుల కగపడిరి. ఆమంగలిగుడిసెలో వారు దీపములయట్లు వెలుఁగుచుండిరి. ఇద్దఱును సుందరపురుషులే. ఇద్దఱు విశాలనేత్రులే. ఇద్దఱు మనోహరవర్చస్కులే. ఇరువురు నాజానుబాహులే. ఇరువురు స్ఫురద్రూపులే. అగుటచే సైనికనాయకుఁడు వారిలో నొకఁడై యుండునని ప్రసేనుఁ డూహించి మంచముపైఁ బండుకొన్నపురుషునిం జూచి నీపేరేమని యడిగెను. "నాపేరు మకరందుఁ"డని యతఁ డుత్తరము చెప్పెను.

వెంటనే భద్రసేనుఁడు లేచి "అయ్యా! మకరందుఁ డతఁడు గాఁడు. నాపేరు మకరందుఁడు" అని పలికెను. "నిజము చెప్పుఁడు ఇం దెవ్వరు మకరందుఁడు?" అని మరల నతఁ డడిగెను. "నేనే మకరందుఁడ. నేనే సుదర్శననందనుఁడ." నని మకరందుఁడు వెండియు నుత్తరమిచ్చెను. "అతఁడు కాఁడు. నేనే మాళవరాజనందనుఁడ" నని భద్రసేనుఁడు బదులు చెప్పెను. "మిత్రుఁడా! అబద్ధమాడకుము" అని మకరందుఁడు "మిత్రుఁడా! అసత్యము పలుకకుము" అని భద్రసేనుఁడును నొండొరులం గర్హించుకొనుచు మాటలాడిరి. "అతఁడు మామంత్రికుమారుఁ డైనభద్రసేనుఁడు. నేను మకరందుఁడ" నని మరల నాతఁడు పలికెను. "అయ్యా! యాతఁడు నామిత్రుఁడు భద్రసేనుఁడు. నేనే మకరందుఁడ" నని వెండియు భద్రసేనుఁడు వక్కాణించెను.

పౌరిసంభాషణము ప్రసేననకును, సైనికులకును, జికిత్సకుఁడగుమంగలికిని, నచ్చట గుమిగూడిన గ్రామీణులకును మహాశ్చర్యముఁ గలిగించెను. అత్తఱిఁ బ్రసేనుఁ డిట్లనియె "అహా! మీచరిత్రము మిక్కిలి చిత్రముగానున్నది. ఎవ్వఁడు రాజనందనుఁడో యెవఁడు వానిమిత్రుఁడో తెలియుట లేదు. మీరు మాకు శత్రువు లయినను మీయుదారభావమును మేము ప్రశంసింపక తప్పదు. ఇందు మంత్రినందనుఁడు తనస్వామికి మాగునిప్రాణమును గాచి తనప్రాణము పగఱ కప్పగింపఁ దలఁచుచున్నాఁడు. ఓహో! అతనిచరిత్రము మిక్కిలి శ్లాఘ్యము. రాజనందనుఁడు తనమేను దాఁచుకొనక తనకొఱకై నిష్కారణముగాఁ దనమిత్రుఁ డేల పోవలెనని యథార్థము చెప్పుచున్నాఁడు. మంత్రినందనుఁడు బొంకుట పరోపకారార్థము. రాజనందనుఁడు సత్యముపలుకుట పరోపకారార్థము. వీరిం గన్నతల్లిదండ్రులు ధన్యులు వీరిజన్మలు చరితార్థములు. అయినను మాకుఁ

బగతుఁడగుటచే వీరినిరువుర నేనిప్పుడు బంధించి మారాజుకడకుఁగొని పోక తప్పదు. ఓహో! క్షాత్రధర్మము నిష్కరుణముగదా! నే నన్యథా వర్తింతునేని నాచేతులతో నాకంఠముఁ గోసికొన్నవాఁడనగుదును. అయ్యా! మీరిరువురు లెండు. నావెంట రండు"

అప్పుడు భద్రసేనుఁడు ప్రసేనునిం జూచి "అయ్యా! మీరు సాయుధులుగనున్నారు. మేమిద్దఱమున్నాము. నీవామూఁకకు మొనగాఁడవు. నీవొక్కఁడవాయుధముఁబూని మాతోఁ బోరి మమ్ము గెలిచి యటమీఁద మమ్ము బంధించి తీసికొనిపొమ్ము. లేదా మమ్ముఁ జంపుము అంతియ కాని క్షత్రియవంశమునం బుట్టి మీవెంట బందెలదొడ్డికిఁ బోవుపశువులవలె మిన్నక వత్తుమా?" యని వీరరస ముట్టిపడునట్లు ప్రత్యుత్తర మిచ్చెను. నావుడు ప్రసేనుఁడు "నీమిత్రుని రమ్మను నీవు కాదు. అని వచియింప మకరందుఁడు చివాలున మంచమునుండి లేచి వద్దు! వద్దు! నీగాయము ప్రమాదకర మగునని వెనుక భద్రసేనుఁడు వాదించి వారించుచున్నను వినక ప్రక్కనున్నఖడ్గము దీసికొని "వీరుఁడా! నీమాటయే చెల్లుఁగాక!" యని ప్రసేనునియెట్టయెదుట నిలిచెను.

భద్రసేనుఁడు వానిని వారింప బహువిధప్రయత్నములఁ జేసెఁగాని గాయపడినవానిని సులభముగా గెలువవచ్చునని నీచమతితోఁ బ్రసేనుఁడు వానినే కోరుకొనుటచేతను మకరందుఁడు లేనియుత్సాహముఁ దెచ్చుకొని సమరసన్నద్ధుఁ డగుటచేతను, భద్రసేనుఁడు చేయునది లేక వారి నప్పగించి చూడవలసి వచ్చెను. అప్పుడు ప్రసేనునకు మకరందునకు భయంకర మగు ఖడ్గయుద్ధము జరిగెను.

ఖడ్గములపరస్పరసంఘట్టనమువలన జనించినవిస్ఫులింగములు ప్రసేనమకరందులనేత్రగోళములనుండి వెలువడుక్రోధాగ్నివిస్ఫులింగములతో వియ్యమొందెను. ప్రసేనుఁడు భీషణభాషణంబులతో

మాళవరాజనందనుని బలుమారు లధిక్షేపించెనుగాని యతఁడు వాటికి దన కటారికత్తిపోటులచేతనేగాని మాటలచేతఁ బ్రత్యుత్తరమియ్యలేదు. ప్రేక్షకులు మహాశ్చర్యముతో నా ద్వంద్వయుద్ధముఁ దిలకింపఁ జొచ్చిరి. వెనుకటిగాయముచేత రక్తక్షయము జెందిన తనచెలికాని కేసమయమున నెట్టియపాయము సంభవించునో యని భద్రిసేనునిగుండె కడు భయంబునం గొట్టుకొనుచుండెను. ఎట్టకేలకు నూతనముగాఁ గయ్యమునకుఁ దలపడినభద్రిసేనునికన్న మహాయుద్ధపరిశ్రాంతుఁడై గాయమునఁ జిక్కి సురిక్కియున్న మకరందుఁడే మిన్నయని యెల్లవారికిం దోఁచెను.

భద్రిసేనుఁడు పరిశ్రాంతుఁ డయ్యెను. మకరందుని ఖడ్గప్రహారమున నాతని చేయి తెగి నేలం బడెను. మకరందుఁడును మేన ముచ్చెమటలు గ్రమ్మ నతిశ్రాంతుఁడై నేలఁ జదికిలంబడెను. అప్పుడు ప్రసేనునిబంటులు తమనాయకుఁడు నేలం గూలుట జూచి సైపక హుమ్మని యుంకించి మకరందునిమీఁదికి దుమికిరి. తోడనే భద్రిసేనుఁడు యొఱలోనుండి తనకరవాలు నూడఁబెఱికి యమ్మూకపైఁబడి ముందుకువచ్చిన యేవురుబంట్లను నఱికితక్కినవారిపయిఁబడెను. వెంటనే వారు వానియెదుట నిలువలేక గాలికెగిరిపోవు దూదిపింజల చందంబున నలుదెసలకుం బరువెత్తిరి.

చూపరు మకరందునియొక్కయు, భద్రిసేనునియొక్కయు సౌజన్యంబును, సౌహార్దంబును, విక్రమంబును వేయినోళ్ళం గొనియాడిరి. అప్పుడు భద్రిసేనుఁడు తా మచ్చోటనుండుట క్షేమంబుగా దని మిత్రునకుం దెలిపి ముందుగా నయ్యూరు విడిచి పరిసరంబుననున్న యడవికిం జని యటమీఁదఁ దమకర్తవ్యమును విచారింపఁ జొచ్చిరి.

ముప్పదియవ ప్రకరణము.



అనఘ! నాదేవి కన్నెక గాఢనిద్రలోనున్నప్పుడు కావలివాండ్రకుం దెలియకుండ నిజనివాసంబు విడిచి యొకరేయి యెందేని జనియెనని చెప్పఁబడియెగదా. అంతఃపుర మెన్నఁడు విడిచి యెఱుఁగని యాసుకుమారాంగి, యసూర్యంపశ్యయైన యాసుకుమారాజ్ఞి, మేడ నెక్కిన నలసిపోవు నా మెఱుఁగుఁబోణి, పులుఁగుల యెలుంగులు విని కలంగు నయ్యాదిగర్భేశ్వరి, మహాటవులలో నెండయనక గొండయనక మెట్టయనక పల్లమనక వెఱవక చూడక సంచారంబు నర్జించి యేమృగంబులైనఁ దనమీఁదఁ బడి చంపకపోవునో, తన్ను మ్రింగిన బాగుండునని యేపాపముఁ నెఱుఁగని యే సెలయేటినీటిలో నయినఁ గొట్టుకొని పోయిన యుక్తమని తలఁచి పోవఁ జొచ్చెను. ముండ్లుగ్రుచ్చుకొనుటచే నామె పాదములు పుండ్లయ్యెను. పొదలకుం దొలఁగక వానిం దాకిపోవుటచే మేను గీఁచుకొనిపోయి నెత్తురులోడుచుండెను. ఎండలో నడుచుటచే నడుగులు పొడపొడఁబొక్కెను. శిరోజములు మొగమున వీఁపునఁ జెల్లాచెదరై పడియుండెను.

మూఁడవనాఁడు మధ్యాహ్నము రెండుజాములవేళ నామె దుర్భరముగా నున్న తనజీవితమును దుదముట్టింపవలె నని సంకల్పించి యొక యేటియొడ్డుఁ జేరి వస్త్రము బిగించి కట్టుకొని సూర్యునికి నమస్కారములు చేసి యెత్తుగానున్న చోటు జూచుకొని యటనుండి గుభాలున నయ్యేటినీట మునిఁగెను. మునిఁకి రెండుమునుకలు వైచెను. రెండవమునుక వైచి తేలునప్పటికి నామెశిరస్సు కాషాయాంబరధారియగు నొకభిక్షువు చేతంబట్టి శిరోజములు గ్రహించి యవ్వలి కీడ్చెను. కడుపునిండ నీరుండుటచే నామెకు సరిగా స్మారకము లేదు, ఆభిక్షువు

తనశిష్యుని సాయమున నామె నొకచెట్టుక్రిందఁ బడవయిచి సమయోచితోపచారములఁ జేసి నీరు గ్రుక్కించెను. అంతట నామెకుఁ దెలివి వచ్చెను. పిమ్మట నాభిక్షు వామెను జూచి యాత్మహత్యకుఁ గారణ మేమని యడిగి యామె పూర్వవృత్తాంతమును గూర్చి ప్రశ్నించెను. ఆమె కొంతసేపు ప్రత్యుత్తరము జెప్పక కష్టపడక మౌనముద్రవహించి యగ్గురుశిష్యులు ప్రశ్నలనియెడు ముల్లు మాటి మాటికిఁ గ్రుచ్చుటచే సహింపక యెట్టకేల కిట్లనియె.

"అయ్యా! మీరునాకు బరమశత్రులు గాని మిత్రులుగారు. నామనంబు నతిదారుణంబుగా బాధించుచున్న దుఃఖాగ్ని నేనందుండి నేను విముక్తిఁబొందుటకు సాధన చేసికొనుచుండఁగ దాని సాగనీయక నాకు మీరు మహాపకారముఁ జేసితిరి. మీకీ దానవలనఁ బాపమే కాని పుణ్యములేదు. ప్రాణిశోకనష్టశక్తి శేషను నాకుఁ జల్లని గంగానదీజలములు సుఖప్రాయనము లగును. నా శరీరము దహనముచే నన్నుఁ గాపాడింపుడు. ఈప్రాణముల మీరు నాకై కాచితిరి. కఠినమగు దుస్సహవిషము గ్రుక్కుడువడిన నరకయాతనల కంటె నీ ప్రాణములుపోఁగొట్టుకొనుటయే నాకు నిర్భాగ్యురాలగు నాకు ప్రాణత్యాగమే నాకు సుఖము. శరీరవిసర్జనమే నామనోవేదనకు మందు. కావున నాయందు దయనుంచి నన్నుఁ బావనిమ్ము!"

అని వేఁడుకొన నాభిక్షువు ప్రత్యుత్తరమిచ్చె "తల్లీ! మేము భిక్షువులము. బౌద్ధులము. జీవహింస మాకుఁ బనికిరాదు. మా యెదుట చూచి చూచి నిన్నుఁ జావనిత్తుమే! నీకు మరణమే విధింపఁబడిన మొదల నాకంటఁ బడకపోయియుందువు. మేము తక్షశిలకుఁ బోవుచున్నాము. అక్కడ వేనవేలు యోగినులున్నారు. నిన్నక్కడకుఁ దీసికొనిపోదుము. మావెంట రమ్ము! భగవానుఁడయిన శాక్యసింహుని ధర్మంబులు విని నీ కిష్టమయినపక్షమున వాని ననుసరించి దుఃఖసాగరము నీఁ

దఁగలవు. నీ వైఖరిఁ జూడ మహారాజాంతఃపురవాసినివలెఁ గానఁబడుచున్నావు. నీకిష్టమగునేని నీచరిత్రము మాకుఁ జెప్పుము." అని పలికిరి. అప్పు డామె తనవృత్తాంత మంతయు వారి కెఱిఁగింప వారు కాశ్మీరమహారాజపత్నియుఁ బాంచాలరాజనందనయు, నైనయామాదేవికిఁ బ్రాపించిన దురవస్థకు నెంతే దురపిల్లి యతిగౌరవంబునఁ గడునాదరంబున నింతింతయనరాని వినయంబున, నామె కుపచారంబులు సల్పి నెమ్మనంబున ధైర్యము పురికొల్పి యాత్మహత్య మహాపాతక మని దానిపై రోఁత బుట్టించి తత్కుటీరంఁ జేర్చిరి. అక్కడ నుపనిషద్రహస్య పరిజ్ఞాతలై వైదిక మతావలంబకులైన సన్యాసులును, శాస్త్రాధ్యయనములనిమిత్తమై వచ్చి విద్యలం గఱచుచున్న బ్రహ్మచారులను, ధర్మపథము, త్రిపిటకము, హీనాయనము, మహాయనము మొదలగు బౌద్ధగ్రంథపఠనంబులచే ధన్యులై, విశాలములగు విహారములందు విడిసియున్న బౌద్ధభిక్షువులను, బరమనిష్ఠాగరిష్ఠలై బ్రహ్మచర్యవ్రత దీక్షాపరతంత్రలై యగ్నిశిఖల వలెఁ బవిత్రలైన భిక్షుణీజనమును, జూచి సంతసించి యాభిక్షుణీసమూహమునఁ గలసి కాలక్షేపముఁ జేయఁ జొచ్చెను.

అట్లు శక్తివర్మ సింగపుఁగొదమలవంటి యాకొమరులఁ దీసికొని కాశ్మీరగాంధారదేశముల సరిహద్దులం జేరునప్పటికిఁ జంపుఁడు నిరంతరము లయినప్రయాణంబులం జేసి వారిం గలిసికొనెను. గాంధారదేశపు సరిహద్దులం బాలించు వీరసేనుఁడు లోకోత్తరలావణ్యవిశేషంబులు గలరాకొమరుల నెమ్మొగములు జూచి వారు సామాన్యులు గా రని గ్రహించి వారిని రావించి వారిచరిత్రములడిగి శక్తివర్మ ముఖమున నంతయుఁ దెలిసి జాలినొంది యతిస్నేహంబున వారిం గౌరవించి రాజకుమారులకుం దగినయూడిగంబులఁ జేయించి యందలము లెక్కించి చందునకు శక్తివర్మకు నశ్వముల నిచ్చి యిట్లనియె-

"మా మహారాజుగారు భాగ్యవర్ధనుఁడు సత్పురుషుఁడు. మీచరిత్ర ము విన్న జాలిగొంది మీకు సాయముఁ జేయును. ఆయనకుం గొడుకులు లేరు. సౌదామిని యనుకూఁతురు గలదు. పదునాలుగేండ్ల ప్రాయము గలది. మిక్కిలి చక్కనిది. తగినవరుని సంపాదింపలేక యాయన మేఱమీఱినవిచారము నొందుచున్నాఁడు. అందుచే నాయనకు మీరాక పరమసంతోషజనకమై యున్నది. కావున మీరీవాహనం బులెక్కి యచ్చోటికిం జనుఁడు. నేను మీరాకవారికిం దెలుపఁగాఁ దెలియఁ బఱచెద."*

అనవుడు శక్తివర్మ మహాప్రసాదమని వానిమన్నన నంగీకరించి కృతజ్ఞతఁ దెలిపి బాలకులం దోడ్కొని గాంధారనగరంబునకుం జనియెను. గాంధారనాథునకుఁ భాగ్యవర్ధనుఁడు వీరిని బాలురం జూచుకొని సంతసించి రాజకుమారుల నమస్కరింపఁ బోవుచుండ వారి రమ్మని తనయమాత్యు నంపి నాఁడు తన యంతఃపురమునకుఁ దెచ్చినపిదప వారిని కౌఁగిలించుకొని మెండుగా సన్మానించి సంతుష్టిగా నెత్తో రాజోచితములకుఁ బనికివచ్చునట్టి యమూల్యవస్త్రములం గానుకల నాభరణంబుల నిచ్చి యభ్యంతరమందిరంబున నివసింపఁజేసెను. చంద్రశక్తివర్మలకును దగిన గౌరవంబు సలిపెను. ఆరేయి రాజకుమారులవలన శక్తివర్మవలన మంచువలెకడ నున్న కొండకోనలో జరిగిన దారుణవృత్తాంత మంతయు విని భాగ్యవర్ధనుఁడు వారిమంత్రిణు మహా దుఃఖపరవశులై దాని నాఁపుకొనలేక బాలకుల చేష్టలఁ జిత్రముగాఁ దని దార్జన్యమును వేయితెఱంగుల గర్హించి యక్కిరాతునకు భగవంతుఁడు తగినదండనము చేయఁడే యని పెక్కువిధముల బలికిరి. బాలకులం జూచినదిమొదలుకొని భాగ్యవర్ధనుఁడు వారియెడ నత్యంతస్నేహంబు గలిగి విక్రమసేనునకుఁ దనగారాబుకూఁతురగు సౌదామిని నిచ్చి పెండ్లిచేయవలెనని యుఁ దనతమ్ముని కూఁతురయిన చిత్రరేఖ

ను హర్షవర్ధనున కిచ్చి వివాహము సేయవలె ననియు నిశ్చయించి జ్యేష్ఠునిఁ గాశ్మీరసింహాసనమునఁ గూర్చుండఁ బెట్టవలయు నని సంకల్పించెను. తనమనోనిశ్చయమును మంత్రులకు సేనాపతులకు రహస్యముగఁ జెప్పి దండయాత్రా సన్నాహమును జేయింపుమని యానతిచ్చెను. ఆనతిచ్చుటయే తడవుగా రాజకార్యపరతంత్రులగుమంత్రులు గజరథతురగ పదాతిసైన్యంబుల నాయత్తము సేయఁ జొచ్చిరి.

గాంధార రాజాంతఃపురమున రాజకుమారులుసకలసౌఖ్యముల ననుభవించుచున్నను దల్లిజాడ తమకుఁ దమజాడ తల్లికిఁ దెలియకపోవుటచే నెల్లప్పుడు మాతృవియోగదుఃఖమున గ్రుక్కుచుండిరి. ఆ మెజాడలు నరయుటకై నిపుణులగు వేగులవాండ్రంబంపుమని భాగ్యవర్ధనునిం బ్రార్థించిరి. అతఁడు వారియభీష్టప్రకారము జేసెను.

మాధవసేనుఁడు, మహేంద్రదేవునిబలములు పరాజయము నొందినతోడనే తాను పరాజితుఁడై మహేంద్రదేవునితోడఁ బ్రాంచాలపురమునకరిగి యపజయమువలన నిర్విణ్ణుఁడై యున్న యా ముదుసలిజేనికి ధైర్యము గొలిపి యుత్సాహము పుట్టునట్లు పూర్వరాజులచరిత్రంబులు పురాణగాథలు జెప్పి జయము తప్పక సేకూరు నని నమ్మికపుట్టఁబలికెను. అతఁడును మాధవసేనుని దనకు హితోపదేశకునిగా నేర్పఱచుకొని రాజభక్తిశూన్యులయిన నియోగులఁదొలఁగించి స్వామిభక్తి యుక్తుల నధికారములందు నియోగించి మరల సమరసన్నాహము జేయింపఁజొచ్చెను. ఈసారి యుద్ధములో జయము యిన సేకురవలయు లేదా, తనప్రాణములయినసమరరంగమున కర్పింపవలె ననియు మాధవసేనుఁడునిశ్చయించుకొని యతఁడు దృఢప్రయత్నము జేయఁజొచ్చెను.

అట గర్గసేనుఁడు మాళవరాజసైన్యము లోఁబడిపోయి నానాముఖంబులకుం బరుగులెత్తుటఁజూచి మరల, సేనంగూడఁగట్టుటకుబహు

ప్రయత్నములఁ గావించెను. ఆతని ప్రయత్నము లరణ్యరోదనము లయ్యెను. ఆతని మనస్సు పరాజయమువలన జనించిన పరాభవమునను దనకొడుకు రాజుకొడుకుం గానఁ బడమిఁ బొడమిన విషాదమువల్లను మిక్కిలి దుఃఖనిలయమై యుండెను. "నన్ను నమ్మి నాసామర్థ్యమందు విశ్వాసము గలిగి తనకొడుకున కేయపాయము రాకుండ నేను జేయఁగల నని మనోనిశ్చయముగలిగి సేనల నావశముజేసి పంపినందుకు నేనింతచేసితిని. పోనీ! జయాపజయములు దైవికములు. వాటికేమి మఱియొకసారి గెలువవచ్చు ననుకొందము. అతఁడు తనకుమారుని నా కప్పగించె. చంద్రప్రభాదేవి పంచప్రాణము లాతని మీఁదనె పెట్టుకొనియుండు. ఆతలిదండ్రులు వారికొడు కేఁడనియడిగిన నేమిచెప్పుదును? ఇంక మాభద్రసేనునిమాట నే నేమనుకొందును? పరమమిత్రులయినయక్కుమారు లిరువురు సమరమున మడిసియుందురా? పగతురచేఁ జిక్కియుందురా? ఏమిగతి! ఏమయిన నేమి. నేను మాళవంబున కరిగి సునర్మునిం గాంచి దండయాత్రా విషయము లాతనికిఁ జెప్పి సమాశ్వాసించి మరల యుద్ధసన్నాహము జేయించెదను. ఈపరాభవవ్రణము విజయంబను నౌషధంబునం గాని [illegible]." అని రత్నసేనుఁడు తనలో వితర్కించి యోడ నడిసము[illegible] లినప్పుడు దానిచెక్క నొకదానిం బట్టుకొని నాఁడు మీఁ[illegible] ప్రాణములు దక్కించుకొను బాటసారివోలె నాతఁడు హతశేష [illegible] గూర్చుకొని యుజ్జయినీనగర సమీపమునకుం బోయెను. [illegible] టికి మాళవదేశస్థితి యెట్లుండవలెనో యట్లుండెను.

మగటిమి నెఱపఁగల సైనికు లంతయుఁ గాశ్మీరదేశమున [illegible] డు విడియుటకుఁ బోయినందున విదర్భరాజుసైన్యంబులు గట్టిగొళ్లెములు లేని తలుపులు గలయింట దొంగలు సులభముగఁ జొచ్చినట్లు లాహారశూన్యమై కృశించియున్న వానిమేన రోగములు దూఱినట్లు

మాళవముఁ జొచ్చి యచటనా యానమున నిలిచియున్న యల్పసైన్యముల నోడించి రాజధాని నాక్రమించుకొని సుదర్శనునిం బాఱఁద్రోలి కోటలో విడిసెను.

సుదర్శనుఁడు సకళత్రముగ సపరివారముగ ఘూర్జరదేశముం జొచ్చి యా రాజుతోడఁ బూర్వమిత్త్రుఁడగుటచే వాని కతిథియై వాని సాయమునఁ దనల మాళవరాజ్యముపై దండు విడియవలయునని ప్రయత్నము సేయుచుండెను.

రత్నసేనుఁడా వృత్తాంతమంతయు విని విధి కాశ్మీరరాజ కుటుంబమునకే కాక మాళవరాజకుటుంబమునకుఁ గూడ విముఖుఁడై యుండుటఁ దెలిసికొని రాజధానికిం బోవక తనవెంటనున్న యల్ప పరివారముతో ఘూర్జరదేశమునకుం జని యా రాజున కాశ్రితుఁడై దీనుఁడై యున్న సుదర్శనుం గాంచి తన యాత్రా పర్యవసానముం జెప్పి మకరందు భార్యనే కలుగజాలు తెలియనేరని విన్నవించెను. పుత్త్రవియోగము రాజ్యభ్రంశముకన్న నావరపాలున కధికసంతాపముఁ గలిగించెను. ఎల్లదేశములయందు నాతనివారలు భద్రసేనుని వార్తలు దెలిసికొనుటకై పరువులైన మనుష్యులఁ బంపుచునే యుండెఁ డాతండప్పుడు. పుత్త్రవియోగముచేఁ గుందుచున్నను రత్నసేనుఁడు మాళవరాజ్యమును దన సుదర్శనుని మరల బ్రతిష్ఠించుటయే ప్రధానకృత్యముగఁ జేసికొని ఘూర్జరనృపుని యనుగ్రహము నకుఁ బాత్రమై సేనల ప్రోగుజేయుటలోను దదితరసన్నాహము జేయుటలోను శక్తిమేరకుఁ జేయుచుండెను.

మఱి యంత నచట మకరందుఁడు బరాక్రమించుచుఁడై గాయపడినాఁడని కర్పూరతిలక కర్పూరమంజరి యనిలేచి విషాదమునొంది నిద్రాహారంబులు వర్జించి యంతఃపురమున నత్యంతము పరితపింపఁజొచ్చెను. ప్రసేనుఁడు కడతేఱెనని తమ భయభ్రాంతులై పాఱివచ్చిన మాళవ శేషసైనికులు

చిత్రభానుని కావృత్తాంత మెఱింగించుచుండఁ జాటుననుండి విని మల్లిక పరుగుపరుగునఁ గర్పూరమంజరికడకుఁ బోయి "సఖీ! నీఁ బ్రియు మెఱింగించెద. ప్రియు మెఱిగించెద" ననిరొప్పెను. "ఓసీ! మరణమునకు సిద్ధముగా నున్నదానికిఁ బ్రియుమేమున్నవే!" యని యామె విసుగుతోఁ బలికెను. "సఖీ! అమంగళము నోట రానీకుము. మకరందుఁడు సుఖముగా నున్నాఁడు. గాయము కుదిరినదఁట. అది కుదురుటయే గాదు. మనసేనాధిపతులలో నొకఁడైన ప్రసేనుని స్వామ్యాయుద్ధమునఁ దాఁకి బాహ్యసంతోషిబలము చూడ నతనికిఁ గలిగినదఁట. శౌర్యరాశియైన ప్రసేనుఁడు చచ్చినందుకు మీతండ్రిగారు చింతిల్లుచున్నారు." అని మల్లిక విన్నవించెను.

అప్పలుకులు కర్ణరంధ్రములఁ జొచ్చినతోడనే పండుకొనియున్న కర్పూరమంజరి దిగ్గునలేచి పాన్పుపైఁ గూర్చుండి "మల్లికా! ఏమేమి? ఆయన సుఖముగా నున్నాఁడా? నిజముగా నాకుఁ బ్రియ మెఱిఁగించితివే. ఇదిగో! ఈ యుంగరము నీవు పారితోషికముగా గ్రహింపుము. నా కాయనపాణిగ్రహణభాగ్యము లభించినను లభించకపోయినను జీవించి యున్నవాఁడనియు, సుఖముగా నున్నవాఁడనియు వింటి నదియె చాలు!" ననిపలికి కొంతయూరటఁ గలిగి వెండియు నెన్నఁడైన నాతనిసందర్శనము జేయు పుణ్యకాలము లభింపఁజేయుమని కాత్యాయనిదేవిని బ్రార్థించెను. మల్లిక యామె కోరిక నెఱవేర్పుమని భగవతి గౌరిని దాను వేఁడుకొని "సఖీ! తప్పక నీ కాతనిసమాగమము గలుగునని యెంచుచేతనో నాకు గొప్పయాస గలదమ్మా! అందుచేత నీ వూరటగలిగి యుండుము." అని ధైర్యము జెప్పెను. "ఓసీ! నీవంతకన్న నేమనియెదవు? నీప్రియసఖి బెంగటిల్లి చిక్కి శల్యమై మృతినొందు ననుభయమున నీ వాశాగుటికలు నాచేత మ్రింగింపఁజూచుచున్నావు. ఏమైన సగఁ

గాక! మా సుఖమేయుఁగలము!" అని నిట్టూర్పు విడిచి వెండియుఁ బాష్పము పైఁ బడఁ గార్చెను.

అప్పు డిద్దఱును మకరందభద్రసేనులు కొండొక వృక్షచ్ఛాయఁ జేరి యేమిచేయవలయునని సమాలోచనము సేయఁజొచ్చిరి. అప్పుడు మకరందుఁడు మిత్రుని కిట్లనియె. "భద్రసేన! నే నుజ్జయినికిఁ బోయి [illegible] నే నెంతో మొనగాఁడ నని మహాసైన్యముం [illegible] పై దండు వెడలి యుద్ధమునం దోడిపోయి నా [illegible] గము విడిచి పాఱిపోయి యిప్పు డే మొగము పెట్టుకొని యుజ్జయినిం బ్రవేశింతును! నాయం దెంతో గౌరవముంచు నుజ్జయినీపురవాసుల మొగము లెట్లు చూతును? సిగ్గు లేక నా తండ్రి మొగ మెట్లు చూతును? నే నాయన కడుపుచెడఁ బుట్టితిని. నా జననముచేఁ బవిత్రమైన మాళవరాజవంశమునకుఁ గళంకము గలిగినది. చంద్రికాదేవి వీరమాత యగుటకు మాఱుగా భీరుమాత యైనది. కర్పూరమంజరీ పాణిగ్రహణము నాకు సంప్రాప్తింపక పోవుట యేమో [illegible]. నావంటి పందను బెండ్లి చేసికొన్న పక్షమున నామె వీరపత్ని కాక భీరుపత్ని యై నాటి రాజకన్యకలలోఁ దల వంచుకొనవలసి యుండును. హేమచంద్రుని తనయులకు సాయము జేసి వారి [illegible] నే నంత జేసితినిగదా! ఆబిడ్డ లేమయిరో తెలియదు. ఛీ! నా బ్రతుకేల? మిత్రుఁడా నేనింక నింటికి రాను. భగవానుఁ డైన బుద్ధదేవుని కపిలవస్తునగరమున కరిగి భిక్షువునై యుండెదఁ. లేదా, భిక్షుకసాహస్రము గల తక్షశిలకుఁ జని వారి శిష్యుఁడనై జ్ఞానసంపాదనముఁ జేసెద. పరాభవాగ్నిదగ్ధమగుచున్న నామనస్సును శాంతింపఁజేయ నన్య దారి పొడకట్టుట లేదు."

అత్యంతనిర్వేదద్యోతకము లయిన యాతని వచనముల నాలకించి భద్రసేనుఁడు నవ్వి "మిత్రమా! వజ్రము మెత్తపడినది. అగ్ని వేఁడిం

గోల్పోయినది. ఏమి! యీవిచిత్రము. నీకింత యధైర్యము గలుగనేల! యుద్ధములు జూదములవంటివి. రణముల జయాపజయములు జూదమందలి జయాపజయములవంటివి. ఎట్టు [illegible] పడెడు వాఁడు. భారతయుద్ధమునఁ బాండవులు కౌరవులచే [illegible] సారులు భంగపడలేదు? కాని యెట్టకేలకు వారు గెలువలేదే. శ్రీమన్నారాయణుని యవతార మయినకృష్ణుఁడు జరాసంధునిచేఁ బలుసారులు కయ్యమున నోడిపోయి యెట్టకేలకు వానిని భీమార్జునసహాయంబున సంహరింపలేదే! కావున నొకసారి యోడినఁ [illegible] సిగ్గుపడి సమరపరాఙ్ముఖుఁడు కాఁగూడదు. [illegible] యాజ్ఞ న్నాశంతముఁ బ్రయత్నించుచుండవలసినదె. [illegible] మానవుని వెలుతురునుండి తీసికొనిపోయి [illegible] వేయును. ధైర్యమును తేప విపత్సమయములం దాపుకు [illegible] ధైర్యము వంటి మిత్రము మఱియొకటి లేదు. [illegible] భయము లేదుకాని ధైర్యమిత్రముచు విడి[illegible]. కావున వైరాగ్యమును విడిచి మీ [illegible] తల్లిదండ్రులను సందర్శించి దుఃఖోపశమనము [illegible] మహా సన్నాహము జేసి శాత్రవులపై దం[illegible] గెలువుము. జయమువలనఁ గలిగెడు [illegible] గప్పిపుచ్చఁగలదు. లెమ్ము! లెమ్ము!" [illegible] పూరితమయినపలుకులు పలికెను. అప్పలుకులు [illegible] "మిత్రుడా! పరాభవం బనుమేఘపటలముచేత [illegible] నా మనస్సు జ్ఞానతేజముం గోల్పోయి [illegible] నీపలుకులు యుక్తియుక్తములై యున్నవి. [illegible] మార్గాయాసమున నేను మిక్కిలి డస్సినాఁడ. [illegible] మంచి నీరుదొరకిన సేదదేరి పయనము సేయఁగలుగుదు. [illegible] యీనట్టడవి

లో నెట్లులభించు!" నని నిట్టూర్పు విడిచి చెట్టునీడం బండుకొని
యెను "మిత్రుఁడా! భయపడకు. అడవులలో నేరులు, వాగులు, చెఱువులు నుండకపోవు. నేనీసమీపమున నెందయిన జలాశయ మున్నదేమో యరసి యుండినం దెచ్చెద. ఈనీడను విశ్రమింపుము" అనిపలికి తోడనే యాతఁడు జలము నన్వేషింప బైలుదేరెను.

అమితమైన యాయాసమున నలసియున్నకతమున మకరందు డను సుహృన్మహచ్ఛాయను బండుకొనినతోడనే నిద్రపట్టెను. నిద్ర సుఖమెఱుఁగదన్న సామెత నిజము గదా! చంద్రశాలలలో దాసదాసీ విలాసినీజనములు వట్టివేళ్ళవీవనల విసర మెత్తనిహంసతూలికాతల్పం బులపైఁ బవ్వళించు మహారాజకుమారునకు నట్టడవిలోఁ జెట్టునీడ వట్టి నేలఁ బండుకొన్నను సుఖనిద్రపట్టెను. భద్రసేనుఁడు వనంబునఁ గొంత తడవు తిరిగి మనోహరములయిన తామరపువ్వులతోడను, జల్లని తియ్యనీటితోడను నిండియున్న చెఱువుగనుఁగొని రాశీభూతము లయిన తన పుణ్యములాగా దానిని భావించి విశాలములయిన తామరాకులు దొన్నెలుగాఁ గట్టి నాలుగుదొన్నెలనిండ నీరునించి మిత్రుని నోరెండిపోవునేమో యనుభయమున నతివేగంబున వచ్చి చెట్టుకడఁజూడ నప్పటికి మకరందుఁ డక్కడ లేకపోయెను. భయము విస్మయము, సందియము మనంబున ముప్పిరిగొన నతఁడు దాహమున కాగలేక నీరుకొఱకు కెడలెనేమో యని శంకించి "మకరం దుఁడా! మకరందుఁడా!" యని యెలుఁగెత్తి పిలిచెను. అప్పలుకుల కుత్తరము లేదు. వెంటనే సందియములు హెచ్చెను. మనస్సు విషా దాక్రాంత మయ్యెను. శరీరమందుఁ జేవ డిందుపడియెను. నిలువలేక చెట్టునకుఁ జేరఁబడి కూర్చుండి యతఁ డిట్లు విచారించెను. "ఇతఁ డేమైయుండును? అతిపిపాసావశమున మృతినొందినచోఁ గళేబర మిం దుండవలెనుగదా! అట్లు కాదు. దుష్టమృగము లేవైన దస్సి బల

హీనుఁడై యున్న యీతనిఁ గొనిపోయియుండునా? [illegible] చోరులు, కిరాతులు వీనిం జంపి యుందురా? హా! విధీ! ఆబాల్యవర్ధితసేహము [illegible] మాకు మహారణ్యమధ్యమున నెడబాటు గలిగించితివా! [illegible] సేయుదు నెవ్వరి నడుగుదు, నెందుఁబోదు? [illegible] చుఁ గానఁబడఁడేని యిందే శరీరము విడిచెద" నని [illegible] యని నిర్ణయించుకొనక రాము మిత్రు నన్వేషించుటకై [illegible].

ముప్పదియొకటవ ప్రకరణము.

పట్టినదెల్ల బంగరగా మయినట్లు చిత్రభానునకుఁ [illegible] వాత జయముతరువాత జయము చేకూరుచు [illegible] గొప్పఖ్యాతి గలిగెను. కాశ్మీరదేశప్రజలెల్ల [illegible] జయముఁ దెలిసినతరువాత "భళి! చిత్రభానుఁడా. [illegible] సింపఁజొచ్చిరి. ఆవిజయములు వానిపూర్వదోష [illegible] జొచ్చెను. ప్రజలు విక్రమసేనహర్షవర్ధనుల మాటయే [illegible], అరవిందాదేవి యెచ్చటనున్నది! యనియడుగువా [illegible]. రాజభక్తులు, సదాచారులు మాత్రము చిత్రభాను [illegible] నిమిత్తమై చేసినదురితములను గర్హించి విక్రమసేన [illegible] తించియుఁ దల్లిం గూర్చియు విచారించుచుండిరి. [illegible] నకు మేరలేకపోయెను. అతఁడు నేనుండియు సభ [illegible] నట్లు వర్తింపఁజొచ్చెను. దానికిం దగినట్లు [illegible] వానివిక్రమంబుల వినుతింపఁ దొడఁగెను.

ఒకనాఁడు వారిపవ్వుఁ గూర్చుండి [illegible] వశమున గుదిర్భ ట్టెట్టనియె—"రాజా! నా చెప్పిన [illegible]

వైతివిగదా! మహేంద్రదేవుఁడోడె. మాళవసైన్యమోడె. మకరందుఁడు కథావశేషుఁ డయ్యె. సుదర్శనుఁడు రాజ్యశూన్యుఁ డయ్యె. నీప్రతాపాగ్నికిఁ బగతుఁడదళములు మిడుతలై పోయినవి. భరతఖండమునందు నేఁటికాలమున నిన్నుమించినరాజులు లేరు. రామరంతిదేవమహాభిషమాంధాతృప్రముఖు లగురాజన్యులతోడ సమానుఁడ వైతివి. నీయశోలతలు హిమాలయము మొదలుకొని రామసేతువునటుకుఁ గలభారతవర్ష మంతట నాటుకొన్నవి. అనేకమహీపాలురు నీసఖ్యము నపేక్షించుచున్నారు. రత్నగర్భలవంటిగాములు గలమాళవపాంచాలదేశంబులు నీపాదాక్రాంతము లైయున్నవి. రాజులు నీయానఁ బూలదండవలె శిరంబున ధరించుచున్నారు. రాజన్యమకుటమాణిక్యకాంతులు నీపాదపద్మములకు నీరాజనము వెట్టుకాలము సంప్రాప్తించినది. కష్టములు గట్టెక్కినవి. ఇంక నీవు పట్టాభిషేకముఁ జేసికొనుము. తద్విషయికప్రయత్నముఁ జేయించెద. నీవనుజ్ఞ నిత్తువేని దానికిం దగుసుముహూర్తము నిర్ణయించి వలయుపనులం బ్రారంభించెద." అనిపలుక జీవభానుఁడు "పట్టాభిషేకమున కంత తొందర యేమి? ఎప్పుడో చేసికొనవచ్చును. మాళవపాంచాలురు మరల వత్తురేమో చూడవలయుఁగదా!" యనిబదులుచెప్పెను.

"మాళవపాంచాలురు మరల వచ్చుటా! చచ్చినవాఁడు మరల బ్రతుకఁడు. పగిలినకుండ మరల నదుకుకొనదు. నేల నొలికిననీరు మరల నెత్తుట సాధ్యమా? మహేంద్రదేవుఁడు శతవృద్ధుఁడు. రాజ్యవృక్షమునకుఁ జీడపురుగులు పట్టినవి. మాళవుఁడు బౌద్ధుఁడు. నాస్తికుఁడు. పరమేశ్వరుఁడు నాస్తికులఁ దల యెత్తనిచ్చునా? ఆస్తికులలో నగ్రగణ్యుఁడ వయిననీచేత భక్తవత్సలుఁ డగుపరమేశ్వరుఁడు లోకద్రోహు లగుబౌద్ధులను నాశనము జేయింపఁ దలఁచినాఁడు కాని యీసందర్భమున నిన్నొక్కవర మడిగెద. అది యేదన క్రొత్తగా

జయింపఁ బడి మనయధీన మయినమాళవదేశమునకు నీకుమారుని విజయసేనుని రాజుగాను నన్నాతనిమంత్రిగాను నీవు నియోగింప వలయు నని నాకోరిక. ఈముద్దుచెల్లింపుము. ఈవేఁడుకోలు ననుగ్రహింపుము. ఈవరమొసఁగుదువేని ముఖ్యమైననాప్రతిష్ఠ మరల బ్రతిష్ఠింపఁబడును సుదర్శనుఁడు చేసినపరాభవమువలన నేను తొల్లి పూవులమ్మినయూరిలోఁ గట్టె లమ్మితిని. నీయనుగ్రహ మున్నపక్షమున వెండియుఁ గట్టె లమ్మినయూరులోఁ బూవు లమ్మెద. పూవు లమ్మటే కాదు. ఉజ్జయినీపట్టణమును మంగలమునం బెట్టి వేచెద బౌద్ధవిహారముల నెల్ల నేలమట్టము జేయించెద. వాటితావునఁ శివాలయముల నిర్మించెద. నాస్తికాధముఁడయినసుదర్శనునినివాసములైన నపవిత్రము లయినయాయంతఃపురముల, మేడల, మిద్దెలఁ బంపు రామప్రీతి గావించి నిర్మూలించి యచ్చట ముండ్లకంపలు వేయించి జిల్లేడుమొలకల నాటించెద. అంతే గాదు సుదర్శనుఁడు నన్ను నిండు కొలువుకూటములోఁ బరాభవించి దేశభ్రష్టుఁ జేసిననాఁడు సభాభవనమం దుండియు నన్నుఁబురస్కరించుకొని యొక్కమాటయినఁనాడక యూరకుండిన యధముల సందఱ బుద్ధివచ్చునట్లు తగురీతి దండించెద. అదియునుఁగాక పలుమాఱు నాతో దైవాస్తిక్యమునుగూర్చియు వేదప్రామాణ్యాదులఁ గూర్చియు, వాదులుసల్పి రాజు వారిపక్షమున నున్నకతమున వానిబలమున నన్నోడించి యుపహసించిన చపసింహుఁడు, హిరణ్యమిశ్రుఁడు, సత్యమిహిరుఁడు మొదలగు మానవాధముల నాస్తికబ్రువుల బౌద్ధపాంసనులఁ బంచు కొలచినట్లు మెడత్రాళ్ళ నొలిపించియు బ్రతికియుండఁగానె గడ్డివాములలోఁ బెట్టి కాల్పించియుఁ జెఱుకుగట్టులట్లు గానుగలలో వైచి పూంచింపియు, నానాహింసలపాలు జేసి చిరకాలంబుననుండి నామనంబున మండుచున్న క్రోధాగ్నిని వారినెత్తురులవలనఁ జల్లార్చుకొనియెద. కేసరి యనునమాత్యు

...క్షించెను. అతఁడెప్పటికిని నాపతుమువాఁడే. మొన్న జరిగిన ... నాతఁడే వైదర్భుల కాయువుపట్లు చెప్పి ... మధీనము జేసినాఁడట. ఇదియె నీవు నాకుఁ జేసిన ... హోపకారము." అని తీవ్రముగా రుద్రభట్టు విన్న ... చిఱునవ్వు నవ్వి "మహాత్మా! చిరకాల ... పేటికలో నడఁగియుండిన క్రోధసర్పము నేఁ ... నిప్పు డూడుచున్నదే. ఇంతవఱకు రాజుదున్న క్రోధా ... కాంతః పూర్తిలో నింతదారుణమయిన క్రోధా ... డఁగియున్నదో యెఱుఁగకున్నాను. మీరు మహాను ... దరిద్రములు మీయధీనములు. క్రోధాదుల నడఁపఁ గలరు. ... ప్రజ్వలింపఁ జేయఁగలరు. అట్లు మీకోరిక ... ముందుగా నేను వజ్రపాణియు, మాళవమున ... సైన్యములు స్వయముగాఁ దెచ్చి నీ దేశ మధీనము జేసి ... వచ్చినతరువాత నాపట్టాభిషేకము శరత్కాల ము ... అభిషేకమయినవెనుక విజయసేనుని మి ... మీరు నాకుఁ జేసిన మహోపకారములకు నేను ... మీకోరిక చేయుట యబ్బురమా? మీ రడిగినది ... కోరిక. సద్బ్రాహ్మణు లగుటచే మీరు నిస్పృహు లు. ... డిగిరా, యాందోళిక లడిగిరా? గజము లడిగితిరా? ... హారము లడిగితిరా? యగ్రహారము లడిగితిరా? ... కోరిక తీర్చినయెడల నాజన్మమేల? ఈకోరిక యేగాదు- రాజ్యము ... పాదములకడ సమర్పించెద. రాజ్యమే కాదు— ప్రాణము ... నిచ్చెద." అని కృతజ్ఞతాపూర్వకముగ సంభాషించి ... యిచ్చెను.

... సమయంబునకుఁ గృతజ్ఞతకుఁ జాలసంతసించి రుద్రభట్టు

"రాజా! బూడిద బూసికొని, నీర్కావిగుడ్డం గట్టుకొని పండ్లు, పాలు, దిని తపంబు జేసికొను పరమవైదికులకు రాజసర్వము లేల మాన్యాందోళికలేల హారములేల, యగ్రహారములేల? ఆ యోగిశ్రేష్ఠులకు లై భగవంతునివలనఁ బ్రజాపాలనాధికారము జన్మముచే బడసి వహించిన మీవంటి ప్రభువులకు విధినిర్ణయములు. కృష్ణాజినములు, దర్భాసనములు రుద్రాక్షములు జటాజూటములును మునులకొఱకు మాత్రము నిర్మింపఁబడినవి. ఆశలు జయించినవారె బ్రాహ్మణులుగాని అసంతుష్టిగల బ్రాహ్మణుఁడు సంతుష్టిగల క్షత్రియుఁడు నశించునని వినలేదా? రాజా! ఇంక నీపట్టాభిషేక ప్రయత్నములు వర్ణించెద. నామంతరాజులకును సాటిమేటి నృపులకును నభిషేకమహోత్సవమునకు రమ్మని సగౌరవంబుగా నాహ్వానములఁ బంపెదను. సరయువు, సరస్వతి, భాగీరథి యమున మొదలగు పవిత్రనదులయందలి జలములు స్వాధ్యాయవేత్తలయిన బ్రాహ్మణోత్తములచేతఁ దెప్పించెద. ప్రతిదేవాలయమున నీయభ్యుదయమునిమిత్తమై యభిషేకము చేయించెద. నగరమందంతటను సూర్యరశ్మి గనఁబడకుండ పందిళ్లు వేయించి యనఁటి కంబముల నాటించి తోరణములఁ గట్టించి విభవవిభూతులయందు శృంగారలక్ష్మి ఘలుఘల్లుమని తాండవనృత్యము సల్పునట్లు—దేవేంద్రుఁడు తనవీటికన్న నిది యందముగా నున్నదని వెఱఁగున్నఁ దెఱచి చూచి వెఱఁగుపడునట్లు—పుర మలంకరించెద. దశసహస్ర భూసురోత్తముల నందఱ రావించెద., సంతర్పణముల సమారాధనములఁ జేయించెద. భూరిదక్షిణలచే వారిని దనిపి సంతోషించెద. బ్రాహ్మణాశీర్వాదములతోడను, బ్రజలయానందధ్వనులతోడను, మంగళతూర్యరావంబులతోడను, వారవిలాసినీ గానధ్వానములతోడను, భూనభోంతరములు నిండునట్లు—దశదిశలు మారుమ్రోయునట్లు—గగనము బీటలువాఱునట్లు—మహేంద్రుఁడు నన్ను మించెనని ఘూర్ణిల్లునటులా

[illegible] వీఁ డెవఁడురా నూతనముగా వచ్చెనని గుండెలు పీచుపీ
చు[illegible] బెరిబెరి చూచునట్లు- చూపఱునీపురము కలియుగవైకుంఠ
[illegible]చునట్లు—నీకీర్తి యాచంద్రతారార్కము భూమిపై
[illegible]ట్లు—మహోత్సవముఁ జేయించెదఁ జూడు. అని యుత్సా
[illegible] వెల్లివిరియఁ బలికెను. చిత్రభానుఁడు రుద్రభట్టుం జూచి
[illegible] నవ్వ్వలు నవ్వ తలయూఁచెను.

[illegible]నంతరము వజ్రపాణి వచ్చుటయు నతనిని జయములవిష
[illegible]శేఖరుండి పట్టాభిషేకానంతరము నావచ్చని పందిళ్లలోనే
[illegible] ంజరి నిచ్చి వివాహము జేయించునట్లు జెప్పి పంచెను. వ
[illegible] యాసన్నవివాహమహోత్సవమున కువ్విళ్లూరుచుఁ బిచ్చిద
[illegible]యిల్లాలిని బిడ్డలను వివాహమున కడ్డురాకుండ నామెపుట్టి
ని[illegible]టికిఁ బంపెను.

మున్నూటరెండవ ప్రకరణము.

పూర్వప్రకరణమున వర్ణింపఁబడిన ప్రసంగము జరిగిన రెండవ
నా[illegible]భానుఁడు [illegible]ద్రభట్టు కోటలో నొకగదిలోఁ గూర్చుండి
[illegible]వమంత్రములఁ గూర్చి ప్రసంగించుచుండఁ బదుగురు రాజభటుల
[illegible] సుషేణుండను చిన్నసేనాపతి దర్శనాపేక్షియై ద్వారపా
ల[illegible] వసరాక తెలిసి కెఱిఁగించెను. రావచ్చునని ప్రభు వాన
తీ[illegible]ఁడు లోని కరిగి జోహారు చేసి యిట్లువిన్నవించెను. "మహా
ప్రభూ! దేవరవారిపంపున నల్పసేనం దీసికొనిపోయి యొకయడవిలో
[illegible] జనమారుఁడగు మకరంధుని బట్టుకొంటిని. ఆతఁడు ప్రియా

ణశేషమునఁ గాఁబోలు చెట్టునీడను సొమ్మసిలి నిద్రపోవుచుండె. ని ద్రాపరవశుఁడై యుండఁగానె కాళ్ళకుఁ జేతులకు సంకెళ్ళు [illegible] గుడ్డతో నొకడోలికఁగట్టి యందు వానింబడవై [illegible] తోడ్తె [illegible]"

అదివిని చిత్రభానుఁడు మహాసంతోషముతో "ఏమీ! [illegible] వాఁ డేఁడీ!" యని ససంభ్రమముగాఁ బలికెను. "అహా [illegible] పట్టువడినాఁడా?" యని రుద్రభట్టుఅడిగెను. "స్వామీ! [illegible] లో నున్నాఁడు సెలవైనయెడల దోడ్తెత్తు" నని సుషేణు [illegible] ముజెప్పఁ దోడ్కొనిరమ్మని రాజు సెలవొసంగ నా [illegible] కనుండి మకరందుని ప్రభువుసన్నిధికి [illegible] నతఁడు సరిగా నడువలేక తొట్రుపడుచు రాజసన్నిధిం జే [illegible]

వెనుకటి కయ్యమునఁ గలిగిన గాయ [illegible] వలన రక్తహీనుఁడై సొక్కినవాని, మార్గాయాసముం బడసి [illegible] వాడినపూవు [illegible] బోలె వసివాడియున్నవాని, శృంఖలాబద్ధములైన కాలు సేతు [illegible], నల్లకలువ రేకులకు వన్నెలు దిద్దువిశాలనేత్రములవాని, [illegible] నైన మెచ్చని సోయగమువాని, శరత్కాల [illegible] సాటియగు నెమ్మొగమువాని, మాళవరాజకుమారు [illegible] చిత్రభానుఁడు వాని చెలువంబునకు నచ్చెరు [illegible] "ఆహా! [illegible] దనము! ఏమి యీముఖవిలాసము! ఏమి యీసన్నలత్రీరు! [illegible] ధ్యమున నే నింతచక్కని రాకొమరునిం జూడలేదు. [illegible] నే మాకర్పూరమంజరిమనస్సు వీనియందు లగ్నమై యున్నది [illegible] మీసం దున్నజవ్వని యీభూలోకమన్మథునిఁ జూచి [illegible] పొందునకై యాసింపకుండునా? ఇట్టి సుకు [illegible], [illegible] కారుని నే నెట్లు కారాగృహబద్ధుఁ జేయుదును? [illegible] గదా?" యని తనలో వితర్కించి "సుషేణ! ఇతనిని గా [illegible] మున బంధింపుము" అని యానతిచ్చెను. "పాముపిల్లకు [illegible]

పక విడుచుట ధర్మముగాదు. రాజా! మీఁద నీచిత్తము" అని రుద్ర
భట్టు చెప్పెను.

"ఓహో! నీవు రుద్రభట్టువుకావా? మాతండ్రిని వంచించి త
త్స్థలముగా దేశభ్రష్టుడవై యుండఁజేరి యీరాజునకు దుర్బుద్ధులుగఱ
పుచుంటివా? కారణము లేక నాకించుకయు భయము లేదు. పాపకర్ముఁ
డవైన నీకే మరణభయముగలదు. పుట్టినవాఁడు గిట్టక మానఁడు;
గిట్టినవాఁడు పుట్టక మానఁడు." అని మకరందుఁడు రుద్రభట్టున కు
త్తరము చెప్పెను. అంతలో సేవకులు వానిని మెల్లగా నావలకుఁ దీసి
కొనిపోయి కారాగృహమున బంధించిరి.

"మల్లికా! నీ వేమో చంద్రికతో రహస్యముగాఁ జెప్పుచుంటి
వని యేమే! మిత్రిసకముతో మకరందుఁ డనుమాట నాచెవిని
బడెను. యథార్థము చెప్పవే! అతఁ డేమైనాఁడే? ప్రాణముతోను
న్నాఁడా? నామీఁద నానపెట్టి చెప్పవే!" యని కర్పూరమంజరి
యడుగ మల్లిక చెప్పకుండిన నది యామెకుఁ దెలియకమానదని
మకరందుఁడు కారాబద్ధుడైన వార్త యామె కెఱిఁగించెను.

అది విని కర్పూరమంజరి యింతింత యనరానివంతందగిలి
మల్లికఁజూచి యిట్లనియె, "ఓసి! మెత్తనిచిగురుటాకుల మెచ్చనియా
యడుగులు సంకెళ్ళ నెట్లోర్చునే? ఆబాహులతికలు శృంఖలాబద్ధము
లై యెంత నలిగెనో! యెంతో యంతఃపురవాసముఁ జేయు నాసుకుమారి
కారాగృహమున నెట్లుండఁగలఁడే? కటికినేలం బవ్వళింపఁగలఁడే?
తినుటకు వీలులేని యామోటుకూఁడు నాసుకుమారి తినఁగలఁడటే: అ
య్యయ్యో! ఎంతకష్ట మెంతకష్టము. అదియటుండ నాతండ్రి వానిం
బ్రతుకనిచ్చునఁటే? ఆనాఁడు నాకొరకై బ్రతుకనిచ్చెను క్షుద్రమనస్కుఁ
డైన రుద్రభట్టు వానిని వధింపుమని నాతండ్రిం బురికొల్పి కృతకృ
త్యుఁడు గాకపోవునే! అయ్యయ్యో! నేనున్నతావుననే వాని కవసాన

సంప్రాప్తించుచున్నదా!" యని పరిపరిభంగుల విలపింపఁ జొచ్చె నాఁటంగోలె నామె పట్టినేలం బవ్వళింప నారంభించెను. ఆహా రము వర్జింప సంకల్పించెను. చెలికత్తెలు బతిమలాడ నించు కింక దిని యూరకుండును. చెఱసాలలో నతఁడెట్లు కష్టపడుచుండెనో యంతఃపురమం దుండియుఁ దాను నట్టికష్ట మనుభవింపవలెనని సంకల్పించెను. వివాహమైన తరువాత భార్య పతివ్రతయై భర్తృమార్గ మనుసరించుట లోకమం దున్నదిగాని పాణిగ్రహణము గాకముందే కామించినపతిఁ గోఁడి దేలోకమని యాతనికొఱకై కష్టములు పడుట యెందుఁ జూడలేదని చెలికత్తె లామెతో నని యప్పటినుండి మరల్పఁ బ్రయత్నించినను నామె మానదయ్యె.

అట మకరందుఁడు కారాగృహవాసి యయ్యుఁ దనహృదయమునఁ గర్పూరమంజరిని నిలుపుకొని యన్నపానాదులఁ దెచ్చినపరిచారకులను గావలివాండ్రను, గర్పూరమంజరీకుశలవార్తల నడుగుచు నామెంగూర్చియే స్వప్నములఁ గాంచుచు నామెతో మనస్సమాగమసుఖము బడయుచు నామెం గలసికొనుటకు నుపాయమేదియైన లభించునాయని నిరంతరముఁ జింతించుచుఁ గాలము పుచ్చుచుండెను.

మకరందునిఁ జూచినది మొదలుకొని సుదర్శనునిమీఁదఁ గల దీర్ఘక్రోధముచేత రుద్రభట్టు మకరందుని జంపింపవలయునని దృఢసంకల్పము గలిగియుండెను. వాని చక్కఁదనముఁ జూచియు, వానిపైఁ దనకూఁతున కనురాగ ముండుటచే వానిని వధించిన దనకూఁతు రేమగునోయని సందేహము గల్గియు రుద్రభట్టు ప్రేరణచేసినను జిత్రభానుఁడు మాళవరాజనందనుని జంపింపక యూరకుండెను. అందుచే రుద్రభట్టుకు మనస్స్థిమితము లేకపోయెను. త్వరితముగా వానినెట్లు తుదముట్టింపవచ్చునని యుపాయములు వెదకుచు నొకనాఁడు వజ్రపాణిం బిలిచి యిట్లనియె—"వజ్రపాణి! నీవొక్క హితోపదేశముఁ

జేసెద. అది నీమనస్సులోనే యుంచుకొమ్ము! చిత్రభానునకైన తెలియనియ్యవద్దు. ఈయుపదేశము నాకడుపులో జన్మించి నీకడుపు న నన్తమింపవలయు. కర్పూరమంజరిని చిత్రభానునకు నిచ్చి వివాహ మేయుందలంచినమాట నిజము. కాని, కర్పూరమంజరి యామకరంద ని వలచినది. నీయందు దానికు లేశమయిన ననురాగము లేదు. అను రాగము లేకపోవుటయే గాదు. నీపేరు విన్న నామెకుం దలయేటు. దానికిం దోడుగా వీండిక్కడికి వచ్చుట యనర్థకము. దానిని వెంటనే సంహ రింపవలసినదని చిత్రభానునకు నేను రెండుమూడుసారులు చెప్పి తిని. ఎందుచేతనో యతండు సంహారింపక యూరకున్నాడు. కావు న నక్కుమారుని దెగటార్చుటకు నీవునుబట్టుపట్టి చిత్రభానునొడం బఱుపుము. వానిరక్తము కన్నులం జూచినంగాని నీవు నిద్రపోకుము. వానిమీంద నాకేమియుం గోపము లేదు. కాని, నీవివాహము నిమి త్తమై నేనీయలమటం బొందుచుంటిని. నీవు కర్పూరమంజరి కేలు వట్టిననాండు నాకన్నులు చల్లంబడును. చిత్రభానుని పట్టాభిషేకముం జూచి, నీపాణిగ్రహణమహోత్సవముం జూచి, యనంతరము నేఁతపం బుచేసికొన హిమవాలయమున కరిగెద. ఈరెండే నాసంకల్పములు. అందు మొదటిది జరిగినట్లె. రెండవదియు జరిగినట్లేగాని వీనిం దెగ టార్చిన నిస్సందేహముగా నది జరుగును. కావున నప్పని యతివేగం బున జరుగునట్లు బ్రయత్నింపుము."

ఆపలుకులు చెవిని బడినతోడనే వజ్రపాణివజ్రహృదయము నీరయిపోయెను. పోవుటయు సతండు కఠినస్వరముతో రుద్రభట్టున కిట్లనియె. "అయ్యా! కర్పూరమంజరి నన్నే వలచినదని నానిమిత్తమే పరితపించుచున్నదని నానామమే స్మరియించుచున్నదని ప్రధానమైన నాండు నీవే గదా చెప్పితివి. ఆనోటితోనే యామెకు నాయందు దను రక్తిలేదని నాపేరువిన్నం దలయేటని యెట్లు చెప్పుచుంటివి? ఈరెం

డుమాటలలో నేది నిజము?" అని యడిగెను. అడుగుటయు రుద్రభ ట్టు తనమాటలకుఁ గలపరస్పర వైరుధ్యము మనంబునకుఁ గట్టిన య్యిక్కట్టునుండి తప్పించుకొనుటకు వెంటనే యుపాయ మన్వేషించి యిట్లనియె "ప్రధానమయినదినములలో నాబాలికి యక్షి నిన్నువల చి యుండెను. ఈపడుచు మకరందుని జూచెనఁట! చూచినదాదిగా వానికై పరితపించుచున్నదఁట! పసుమకన్నెలకు బాగోగులు గలవా! ఎదుటనున్నవాఁడే పెండ్లికొడుకు. అంతేగాని నామా టలలో వైరుధ్యము లేదు. లేదు కావుననే నిమేలుకోరి వెంటనె చెప్పితిని. నాఁడట్లు నీతోఁ జెప్పియున్నమాట నాకు జ్ఞాపకములే దా? కావున నీవు నామీఁద నిసుమంతపడక నీకార్యసిద్ధికై పాటుప డుము."

ఆమాటలు వజ్రపాణికి నచ్చెను. మఱునాఁ డావిషయమై చి త్రభానునితో నొక్కిచెప్పవలెనని యతఁడు సంకల్పించుకొని యింటి కిఁ జనెను. అతఁడు పోవునప్పటికి వాని యత్తవారియూరినుండి వచ్చిన యొక సేవకుఁడు నమస్కరించి యొక జాబు చేతికిచ్చెను. ఆజాబు తీసికొని యామూలాగ్రముగఁ జదువుకొని "ఓ. దైవమా" యని నేలఁ గూలఁబడెను. సేవకులు "స్వామీ! ఏమి యాపదవాటిల్లె" ననియు డుగ నతఁ డుత్తరము చెప్పక జాబు చేతికిచ్చెను. వారు జాబు చదు వుకొని "అయ్యో! మనందాదేవి యున్మాదపరవశయయి నూతిలోఁ బడి మరణించెనఁట! తల్లితండ్రుల దుఃఖము వర్ణనాతీతమయ్యెనఁట. హా యెంతకష్టము. ఇలు కాలిపోయినది. ఇల్లాలు కూలిపోయినది. గోరు చుట్టుపై రోఁకటిపోటన్నమాట నిజమాయెను" అని విచారింపఁదొడఁ గిరి. అప్పుడు వజ్రపాణికి దుఃఖముతోఁ గూడఁ బశ్చాత్తాపము గలిగెను. తనయనాదరణమువల్లనే, తనదుష్ప్రియసంభాషణములవల్లనే, తనయజా గ్రత్తవల్లనే, భార్యకు మనశ్చాంచల్యము గలిగినదనియు నెల్లయిన

నామెమరణమునకుఁ దానే కారణమనియు భావించి వాపోవఁజొచ్చె ను. ఆవార్త తెలిసినతోడనే మిత్రులు బంధువులు వచ్చి సమయోచితసంభాషణంబుల నూఱడించిరి. వజ్రపాణి మఱునాఁ డుదయమున నవ్వార్తఁ జిత్రభానునకుఁ దెలిపి పయనమై యత్తవారియూరు జేరి మాతృహీను లయినబిడ్డల నోదార్చి యుత్తరక్రియలు సమాప్తమగువఱకు నక్కడనే యుండెను.

కల్హాలిమరణవార్త వినినతోడనే యతఁడు విషాదపరీతమనస్కుఁడైనను దినములు గడచినకొలఁది దృఢచిత్తుఁడై కర్పూరమంజరీపాణిగ్రహణమునకు మొదటియాటంకము భార్యమరణముతోఁ దీఱె ననియు, మకరందునివధతో రెండవది గతించిపోవు ననియు, దైవము తన కనుకూలుఁడై యపకారరూపకమైనయుపకారముచేసె ననియు భావించి యొకవిధముగా సంతసింపఁజొచ్చెను.

ముప్పదిమూఁడవ ప్రకరణము.

జనకునిక్రూరస్వభావమును, రుద్రభట్టుయొక్కదుష్టప్రవృత్తియు లెస్సగా నెఱిఁగినదగుటచేఁ గర్పూరమంజరి మకరందునకు వారిరువురి వలన నేదే నపాయము వాటిల్లవచ్చు నని శంకింపఁజొచ్చెను. ఆతనికి బంధమోక్షణముచేయవలెనని మల్లికతోఁ బలుమాఱు జెప్పుచుండును. ఎన్నివిధంబులఁ జూచినను శక్యము గాకపోయెను. అందువలనఁ గర్పూరమంజరిమనస్సు తామరాకులోనినీటివలె స్థిమితము లేక యుండెను. మల్లిక కర్పూరమంజరికి మనస్సంతోషమునుగూర్ప మకరందునిఁ జెఱనుండి విడిపించుటకై యెన్నోపన్నుగడలు పన్నుచుండెను. అట్టిసమయమునఁ జిత్రభానుఁడు మృగయాక్రీడనిమిత్తము

రాజధానివిడిచి సపరివారముగా నరణ్యముల కరిగెను. విజయసేనుఁడు రుద్రభట్టు రాజ్యవ్యాపారములఁ జూచుటకై నగరమం దుండిరి. అత్తఱిఁ గన్యాంతఃపురమునఁ జరించు సుల్లికం బిలిచి "ఓసీ! మాయయ్య వేఁటకరిగెను. నిన్నసాయంకాల మాయన యభ్యంజనస్నానముచేసి వ్రేలియుంగరముఁ దీసి యొకపీటపైఁ బెట్టెను. నేఁటిప్రాతఃకాలమున వేఁట కరుగునప్పుడు దానిని దీసికొనుట మఱచిపోయెను. అది నాకు దొరకినది. ఆయంగుళీయకము నీకిచ్చెద. మాళవరాజనందనునిబంధమోక్షణమున కది యుపయోగపడునేమో విచారింపుము. ఇట్టివిషయములలో నీవు మిక్కిలి నిపుణురాలవు కావున లెస్సగా నాలోచించి మాళవరాజకుటుంబము నుద్ధరింపుము. మాలెండ్రి రాకమునుపే యీ పని జరుగవలయును. అతఁడు వచ్చినా యిఁక నాసయుండదని నాయభిప్రాయము. మకరందుఁడు తనమీఁదఁ గత్తిఁ గట్టి కయ్యమునకు వచ్చెనని యాయనమీఁద మాయయ్యకుఁ గ్రోధము. శత్రువైన సుదర్శనునిపూనఁ దగుటచే రుద్రభట్టునకు ద్వేషము. వజ్రపాణికి నాకతమున వానిపైమత్సరము. కావున నీనగర మతని కగ్నిహోత్రపుంబుంత. ఎంతవేగముగా విమోచనమైన నంతక్షేమము. ప్రాణిగ్రహణమైనను సరే, కాకపోయినను సరే! ఆమన్మథమన్మథుఁడు బ్రతికినం జాలును. ఇందు నీవు కృతకృత్యవగుదువేని నాకు మహోపకారము జేసినదాన వగుదువు." అని బహువిధముల బ్రతిమాలి చెప్పెను.

"అమ్మా! ఉంగర మిటుపెట్టుము. దీనివలనఁ గార్యసాధన మయ్యెనా మంచిదె. కానియెడల నీయుంగరము నీకుఁ దెచ్చియిచ్చెద నెట్లయిన నాతని బంధవిముక్తుని జేయవలయు ననియేనాసంకల్పము. ఆసుకుమారుని గారాగృహమున నుంచుట దిరిశెనపువ్వు నెండలో వైచుటయని నేనెంతో విచారించుచున్నదానను. నాకే యింతమనోవ్యథయుండఁగా నీమన సెంత కుములుచున్నదో చెప్పవలయునా"

యని యంగుళీయకముఁ దీసికొని యాతఁడేయి చాలసేపు నిక్కివోవక దానినుపయోగించువిధము నాలోచింపఁ దొడఁగెను. ఎట్టకేల కాతని కొక యుపాయము పొడకట్టెను. మఱునాఁ డుదయమున కర్పూరమంజరినిఁ జూచి మీతండ్రి వ్రాసిన లేఖ యేదయిన నీయొద్దఁ గలదా? యని యడిగెను.

"ముందు విదర్భలో నున్నప్పుడు మాయయ్య వ్రాసినజాబొకటి నాకడఁ గలదు. అది యెందుకు? కావలసిన నిచ్చెద" నని యామె బదులు చెప్పెను. "ఎందుకని నీవడుగకు. దానియొక్క పిదప దాని ప్రయోజనముఁ జెప్పెద. ముందా లేఖ నిటు దెమ్ము" అని యామెకడనుండి జాబుం గైకొని రహస్యముగా నొకగదిలోఁ గూర్చుండి యేదో వ్రాసి యేదో పన్నుగడ బన్ని కర్పూరమంజరికడ సెలవు గైకొని యెందే నరిగెను.

సాయంకాల మయ్యెను. ప్రభాకరుండ స్తమించెను. జగమునందెల్లెడ నిండియున్న యజ్ఞానమునవలెనే కారుచీఁకటులు నలుదెసల వ్యాపించెను. చరమాద్రిఁ గ్రుంగిన భానుఁడు ధరించిన యనంతకోట్యవతారములో యనునట్లు దీపములు ప్రతిగృహంబున నలంకరించెను. సుషేణుఁడు తనగృహంబున బిడ్డలముద్దులాడుచు నుండెను. అప్పు డొక సేవకుఁడు వానిదర్శనముఁ జేసి నమస్కరించి యెట్టయెదుట నిలిచెను. "నీవెవ్వఁడవు? ఏమిపనిమీఁద వచ్చితివి?" అని యాతఁ డడుగ నా సేవకుఁ డిట్లనియె. "మహాప్రభూ! చిత్రభానుమహారాజుగారిసన్నిధినుండి వచ్చితిని. ఆయన యీజాబు మీకిమ్మని నాచేతి కిచ్చె." నని యొకలేఖ చేతికిచ్చెను. సుషేణుఁడు దీపపువెలుఁగునఁ దానినిట్లు జదువుకొనెను.—

"చిరంజీవి యైన సేనాపతిసుషేణునకు, కాశ్మీరమహీపాలుఁడు చిత్రభానుఁడు వ్రాసిన శాసనము. మకరందునితండ్రియగుసుదర్శనున

కును, మాకును సంధిజరిగినందునను, సుగర్భుఁడు మాకు విధేయుఁడై సామంతరాజై ప్రతియేటఁ గప్పముగట్ట నొప్పుకొనినందునను మకరందుని బంధమునుండి మేము విడిపింప నిశ్చయించినారము. కావున నీ వీజాబుజూచిన క్షణమే యా మకరందుని జెఱనుండి విడిపింప వలసినది. ఇతఁడు మాళవరాజపుత్రుఁడు. వీనిపేరు వినయంధరుఁడు. మాకును, మాళవరాజునకును వీనిద్వారముననే యుత్తరప్రత్యుత్తరములు జరుగుచున్నవి. నీకు నమ్మిక గలుగుటకై నానామాక్షరములు గలయంగుళీయకము వీనిచేతికిచ్చి పంపుచున్నాఁడను. ఇది యానవాలుగా గ్రహించి నీవు వెంటనే వాని విడిచిపుచ్చునది.

ఇట్లు,

కాశ్మీరనాయకుఁడు, చిత్రభానుఁడు”

లేఖఁ జదువుకొని సుషేణుఁడు పరిభవగ్రాయుంగర మేదియని యడిగెను. తోడనే వినయంధరుఁడు దాని నతని కిచ్చెను. అది పుచ్చుకొని యాసేనాని దానిమీఁదిగుఱుతులను బలుమాఱుశోధించి యది తనప్రభువుదే యని తెలిసికొని తత్క్షణమే వినయంధరుని వెంటఁబెట్టుకొని కారాగృహమునకుఁ గరిగి సంకెలలు దెంపించి మకరందుం జూచి “నిన్ను విడిపింపుమని మహారాజుగారియాజ్ఞ యైనది. నీయిష్టమువచ్చినచోటికిఁబొమ్ము!” అనిచెప్పెను. మకరందుఁడు మిక్కిలి యాశ్చర్యపడి పెద్దపులినోటఁ దలయిడి చావకుండఁ బైకివచ్చినవానివలె తన్ను భావించుకొని చిత్రభానుఁడు తన్ను విడిపించుట కేమి కారణముండుననుచు వితర్కించుచుఁ గారాగృహమునుండి వెలువడి వీథిలోనికి వచ్చెను. అత్తఱి వినయంధరుఁడు వానిం గలసికొని “దేవా! నేను మీ కాప్తుఁడను. మీరు నన్నిప్పుడు గుర్తింపలేరు. మీరిప్పుడు బంధవిముక్తులయినను మీ కపాయము తప్పలేదు. ఇచ్చోటు విడిచి యీక్షణమే మీరు వెడలిపోవలయు. నగరము వెలు

వల మీనిమిత్తమై నేను కల్యాణలక్షణసంపన్నమై యతివేగవంతమైన యాజానేయతురంగమును సిద్ధముచేసి యుంచితిని. అచ్చోటనే మీ కాహారముగూడ నేర్పఱచితిని. నావెంటవచ్చి యాయాహారము భుజించి యా యశ్వమెక్కి పయనము జేసి తెల్లవాఱకమున్నఁ జాలదవ్వేఁగవలయు. ఎందుకని ప్రశ్నింపక నాచెప్పినచొప్పున మీరు చేయుఁడు. కర్పూరమంజరీపాణిగ్రహణ మయినతరువాత నేనిట్లుచేయుటకుఁ గారణము లామెవలననే తెలియఁగలవు." అని విన్నవించెను. అప్పలుకులు విని వెండియు నెట్టిప్రశ్నయు నడుగక మకరందుఁడు వినయంధరునివెంట నరిగి యాహారముభుజించి యాహయము నెక్కి యథేచ్ఛంజనియెను. వినయంధరుఁడు వానిని సాగనంపి నగరంబుఁ బ్రవేశించెను.

మఱునాఁ డుదయమున మల్లిక కర్పూరమంజరిం గలసికొని మకరందుఁడు బంధముక్తుఁడై కడచిన రేయి సురక్షితముగా నావలకుఁ బోయె నని విన్నవించెను. కర్ణామృతము లయినయప్పలుకులు విని కర్పూరమంజరి సంతోషమున వికసితముఖియై "సఖీ! నన్నుఁ గాఁగిలించుకొనుము. నీవు మాళవేంద్రునకుఁ బుత్రభిక్షము బెట్టితివే. సఖియన్న నీవే సఖివి. ఆఁడుదానవన్న నీవే యాఁడుదానవు. వేయిజన్మములకైన నీఋణముఁ దీర్చికొనఁగలనఁటే!" యని కృతజ్ఞతం దెలిపి బహూకరించెను. అప్పుడు వారీక్రిందివిధముగా మాటలాడిరి.

మల్లిక—అమ్మా! నేను చేసినదేమున్నది? దైవ మనుకూలమైనపక్షమున నెట్టికార్యమైనఁ జులకనగా సాధింపవచ్చును. అప్పుడు గుండులు నీటిలోఁ దేలును ప్రతికూలమైన బెండులు మునుంగును. మనయత్నము నిమిత్తమాత్రము; కార్యసిద్ధి యీశ్వరాయత్తము. ఇంతకు నీవు సంకల్పసిద్ధురాలవు.

కర్పూ—ఓసీ! అతఁడెట్లు విముక్తుఁడయ్యెనో చెప్పవే?

మల్లిక—చెప్పెదనులే తొందరేమి! ఆతఁడు కొంతసేపు నడంచుకొనుము.

కర్పూర—పోనీ, యుంగర మెక్కడనున్నదో చెప్పుము?

మల్లిక—ఉంగరము సుషేణునియొద్దనున్నది.

కర్పూర—అతనియొద్ద కెట్లుపోయినది?

మల్లిక—వినయంధరుఁ డాతని కిచ్చెను.

కర్పూర—వినయంధరుఁ డెవ్వఁడు?

మల్లిక—నీకు నమ్మినబంటు.

కర్పూ—ఏమిది! నానమ్మినబంటా? నాకడ నెవ్వఁడైన నిట్టి వాఁడు పనిచేయుచున్నాఁడఁటె? మనకంచుకిజనములోనైన నట్టివాఁడున్నాఁడా?

మల్లిక—ఉండనీ, లేకపోనీ. అతఁడు నీలెంక.

కర్పూర—(కోపముతో) ఓసీ! మల్లిక, మద్యపానము జేసితివా? లేక నిన్నే దేనిఁ బిశాచ మావహించినదా?

మల్లిక—మహారాజులకు, మహారాజపుత్రికలకు, మద్యము సులభముగా లభించునుగాని పేదదానికి నాకెట్లు దొరకును? నేనే పిశాచమునై యెల్లవారి నన్నమునకు, వస్త్రమునకుఁ బీకికొని తినుచుండ నన్ను వేఱొకపిశాచ మావహించునా!

కర్పూ—ఈయసందర్భప్రలాపములఁ జూడ మకరందుఁడు సురక్షితముగా నటనుండి దాఁటెనో లేదో యనిసందియము గలుగుచున్నది.

మల్లిక—నేను మల్లిక నగుదునో కానో యనువిషయమును గూర్చి సందేహపడుచున్నావా?

కర్పూ—నీవు మల్లికవే! సందియము లేదు.

మల్లిక—అట్లయిన మకరందుఁడు దాఁటిపోవుటలో సందియము లేదు.

కర్పూ—ఓసీ! నీవక్రోక్తులు కట్టిపెట్టి వినయంధరుఁ డెవ్వఁడో సరిగఁ జెప్పవే?

మల్లిక—అమ్మా! నాఁటిజయంధరుఁడే, నేఁటివినయంధరుఁడు.

కర్పూ—జయంధరుఁ డెవ్వఁడే నాకు జ్ఞాపకము లేదు?

మల్లిక—కర్పూరమంజరిపక్షమున నుజ్జయిని కరిగి యామె వలపు మకరందుని కెఱిఁగించినవాఁడె జయంధరుఁడు.

కర్పూ—(సంతోషముతో) ఓసీ! నీయిల్లు బంగారుగాను. నీవు మగవేషము దాల్చి వినయంధరుఁ డని పేరుపెట్టుకొని నుపేణుని వంచించితివా యేమి?

మల్లిక—అమ్మా! నాచేతఁ బగటివేషములు రాత్రివేషములు వేయించి మీ రంతఃపురమునఁ గూర్చుండి మీతలపెట్టిన కార్యములందు సిద్ధిఁ గాంచుచుందురు.

కర్పూ—ఓసీ! నీప్రజ్ఞ శ్లాఘాపాత్రమే! నీ వేమహారాజునొద్దనైన మంత్రిత్వముఁ జేయఁ దగుదువె.

మల్లిక—నీవు మకరందుని జేపట్టి మాళవంబునకు మహారాజ్ఞివైనప్పుడు నీకడ మంత్రిత్వము జేసెదనులే. అప్పుడుమాత్రము నన్ను మఱచిపోకుము.

కర్పూ—సఖీ! నాశరీరమును నేను మఱతునేని నాప్రాణమును నేను మఱతునేని నిన్ను మఱతును. కాని నరశ్రీసంభాషణము లేకుండ జరిగినవృత్తాంత మంతయుఁ జెప్పుము?

మల్లిక—అమ్మా! చెప్పుట కేమున్నది! పరిచారికనైనను జనువుగల, వ్రాయుట లెస్సగా నేర్చినదాన నగుటచే మకరందుని వెంటనే పిడిపింపుమని మీయయ్యవ్రాసిన శ్లోకజాబు వ్రాసితిని.

అక్షరములు మీయయ్యవ్రాసినయక్షరములవలె నున్నవి.

కర్ణూ — గదిలోఁ గూర్చుండి చేసినపని యిదియా!

మల్లిక — మ జేమి చేసితి ననుకొంటివి? తలుపులు మూసికొని తపము జేసికొంటి ననుకొంటివా? అజాబునకుఁ దోడుగా నుంగరమానవాలు జూపితిని. దానితో నంతపని జరిగినది.

అని తనకావించినకృషి యంతయును మల్లిక సవిస్తరముగాఁ జెప్పి యామె నానందసముద్రమున ముంచెను.

ముప్పదినాలుగవ ప్రకరణము

అట్లరణ్యమునఁ బ్రియమిత్రునిం గానక భద్రసేనుఁడు పొదలు గుహలు చెఱువులు వాఁగులు మొదలగు సమస్త ప్రదేశములు వెదకివెదకి వేసారి మకరందునదశ యిట్టిది యిదమిత్థమని నిర్ణయింపఁ జాలక, స్వదేశమునకరుగుట కంతకుముందే యిష్టములేక పాంచాలదేశమునకుం బోయి యటనుండి మిత్రునిజాడ లరయవచ్చునని రాజధానియైన కన్యాకుబ్జమునకుం జనెను. చని తనరాక మంత్రుల కెఱింగించుటయు, వారు మాళవరాజపుత్రుఁడైన రత్నసేనునికొడుకగుటచే వానిని గడుంగడు గౌరవించిరి. పూర్వపరిచితుఁడగు మాధవసేనుఁడు వానిరాకకు మిక్కిలి సంతసించి మకరందునిజాడ లడిగి తెలియఁజాలక యొంతేని వగచెను.

మకరందుఁడు నాఁటిరేయియెల్ల నయ్యుత్తమ తురంగంబు నెక్కి యెల్లవాఱునప్పటికిఁ జాలదవ్వరిగి యచ్చటఁ బ్రాతఃకాలకృత్యముల నిర్వర్తించుకొని గుఱ్ఱమునకు మేఁతవైచి దానికి విశ్రాంతి నొసంగి దానునొక్కచోట విశ్రమించి మధ్యాహ్నము మఱలఁ బయన

మై సాయంకాలమగునప్పటికిఁ గాశ్మీరదేశపుంబొలిమేరదాఁటి పాంచాలదేశముం జొచ్చెను. ఒక గ్రామమునం దారాత్రి విశ్రమించి యపాయము గతించినందున స్తిమితమనస్కుఁడై యతఁడు మెల్లమెల్లగాఁ బయనముజేసి తాను మిక్కిలిడస్సిపోకుండఁ బ్రాణాపాయము దాఁటించిన గుఱ్ఱము చెడిపోకుండఁ బయనంబులు సేసి కతిపయదినంబులకు రాజధానియగు కన్యాకుబ్జముఁ జేరెను. చేరి రాచనగరుముందట గుఱ్ఱము నిలిపి తననామధేయాదులు ప్రతీహారివలన మహేంద్రదేవునకు విన్నవింప నారాజన్యుఁడు మకరందునిఁ దనమందిరమునకు రావించి సన్మానించి యాతనివలన రణమందలి పరాజయమును, దానివెనుక జరిగిన కార్యహానివార్తలును విని విస్మయమును జాలియు నొంది యచ్చటఁ గొన్నిదినంబులుండుమని వేఁడెను. అట్లుకాకయని బహువిధముల వారిచే సత్కృతుఁడై యచ్చటనుండితనమిత్రుఁడగు భద్రసేను నచ్చటం గలసికొని కౌఁగలించుకొని యాకస్మికముగాఁ దానగపడకపోవుటకుఁ జిత్రభానుప్రేరితులైన సైనికులు తన్నుఁబట్టుకొనుటయే కారణమని చెప్పి తనచరిత్రకథనముచేత వానిం దుఃఖపరవశుం జేసెను.

అంతరంగము గలసినమిత్రులు కలసినప్పుడు గల్గునానంద మనుభవైకవేద్యమే గాని వర్ణింప నలవిగాదు. అయ్యిరువురుఁ దమక్షేమవార్తలు దమజాడలు దెలియక దుఃఖిల్లుచుండు తల్లిదండ్రులకుఁ దెలియఁజేయింపఁదగునని మహేంద్రదేవునితోఁ జెప్ప నాతఁడు విశ్వాసముగలబంట్ల నప్పనికై మాళవంబునకుఁబంపెను. పిమ్మటఁ గొన్నిదినములచ్చటనుండి కాశ్మీరరాజ్యముపై మరల దండువెడలవలయునని మహేంద్రదేవునితోఁ జెప్పి మాధవసేనునితోడను, దక్కిన పాంచాలమంత్రులతోడను, మంతనంబుండి యాసారి వేఱువేఱుగాఁగాక మాళవపాంచాలసైన్యము లేకమై పోరాటము సలిపినఁ దప్పక జయంబు

సేకూరునని యట్లు చేయునట్లు వారి నొడంబఱచిరి. అవ్వల మకరందభద్రసేనులు పరుసనై తమదేశంబునకుం జనిరి. వారరుగునప్పటికి సుదర్శనుఁడు రత్నసేనుఁడు ఘూర్జరంబుననుండిరి. అందుచేవారు రాజధానికిం జనక ఘూర్జరవిషయంబునకుం జని మహారాజాధిరాజై శ్రీమంతుఁడై పండితులకుఁ గవులకుఁ జేఁతలకు సాములకు నాశ్రితులకు నాశ్రయుఁడై సుగుణరాశియై, భూలోకమందారమై యున్నసుదర్శనమహీపాలుఁడు కాలవక్రగతిచేత రాజ్యభ్రష్టుఁడై కుంజరంబు దోమకుత్తుకం జొచ్చిన తెఱంగునఁ దనకన్న నన్నివిధంబులం దక్కువవాఁడగు ఘూర్జరేంద్రుని యింట నతిథియై వానిపంచ నుండవలసి వచ్చినందుకుఁ దద్దయు విచారించి ముందుగా నమ్మహీపాలునిం గనుంగొనిరి. సుదర్శనుఁడు తన బిడ్డను, మంత్రిబిడ్డనుగూడఁ గౌఁగిలించికొని "నాకు నేఁడు వేయి రాజ్యములు చేకురినట్లు సంతసించుచున్నాఁడను. ఇఁక రాజ్యసంపాదనము సులభము. మీరాగమనమే శుభాగమనము. ఈదినము సుదినము. దుర్దినములు నేఁటితోఁ గతించినవి. నాకుఁ జిరమిత్రుఁడును, సాధుశీలుఁడు నైన ఘూర్జరనాయకుఁడు సేన నాయత్తము చేసియున్నాఁడు. ఇంక మనము మీసేనం గైకొని మనరాజ్యంబు మనము సంపాదింపవలయు" నని చెప్పి మిత్రపుత్రుల మానందమొందెను. రత్నసేనుఁడు కుమారాగమనమునఁ జే నానందపరవశుఁ డయ్యెను. చంద్రప్రభాదేవి మరల వచ్చి తనకంటఁబడి యడుగులకు మ్రొక్కిన కొడుకును లేవనెత్తి హర్షబాష్పములచే నాతని మూర్ధము నభిషేకించెను.

సైన్యము దండయాత్రకుఁ దగియుండుటచే మకరందుఁడు సేనాపతియై ఘూర్జరసైన్యము మాళవదేశంబునకుఁ దీసికొనిపోయెను. రాజ్య మాక్రమించుకొనియుండిన వైరులకును, మకరందుని నాయకత్వమునందున్న ఘూర్జరులకును, సంపడకయ్యము జరిగెను. మాళ

వేంద్రకుమారుని ప్రతాపాగ్నికి వైదర్భులు శలభములైరి. రాజవాహనుని సేన సంపూర్ణముగాఁ బరాజయమొందెను. హతశేషులు నానాముఖములఁ బరుగులెత్తిరి. మకరందుఁడు సుదర్శనుని మరల మాళవరాజ్యసింహాసనము నందుఁ బ్రతిష్ఠించెను. రత్నసేనుఁడు యథాపూర్వకముగ సమాత్యుఁడయ్యెను. కేసరి రెండవసారియుఁ ద్రోహియై వైదర్భులతోఁగూడి వారివలనలంచములు గ్రహించి దేశాపకారి యగుటచే వానింబట్టి సుదర్శనుఁడు కారాగృహంబున నుంచెను. దేశమునం బ్రశాంతము నెలకొన్నపిదప మకరందుఁడు కాశ్మీరదేశ దండయాత్రకై సైన్యసన్నాహము జేయఁబూనెను.

అటఁ జిత్రభానుఁడు వేఁటనుండి రాజధానికి మరలివచ్చినపిదప సుషేణుఁడు వానిని దర్శించి "దేవరవారియాజ్ఞా ప్రకారము మకరందుని విడిచిపుచ్చితి" నని మనవిచేసెను. అదివిని చిత్రభానుఁ డదరిపడి "ఏమీ! నాయాజ్ఞాప్రకారము మకరందుని విడిచితివా? మూర్ఖుఁడా! అనృతము లాడి నన్ను వంచించెదవా?" యనిబిట్టులుకతోఁ బలికెను. "దేవా! శాంతింపుఁడు ఇదిగో! మీరాజాజ్ఞ. ఇదే మీ రాజవాలుగాఁ బంపిన యుంగరము." అని సుషేణుఁడు రెంటినిం జూపెను. "ఎవఁ డీ యుంగరమును దెచ్చినవాఁడు?" అని మరల రాజడిగెను. "ఎవఁడో వినయంధరుఁడఁట! మాళవసచివుఁడఁట! మీరు పంప వచ్చినాఁడట" యనిసుషేణుఁడు బదులుచెప్పెను. అదివిని చిత్రభానుఁడు త్రాఁచుబాము వలెనెగిరిపడి "దురాత్ముఁ డెవఁడో మోసముజేసెను. నాయుంగరము! నావ్రేలినుండి జాఱిపోయియుండవచ్చును. అదితీసికొని నాసేవకులు నన్ను వంచించియుందురు. అంతఃపురమందు నగరమందుఁగూడ నెందరో ద్రోహులున్నారు. ఆద్రోహులలో నెవఁడోకఁడైయుండవచ్చును. అయ్యయో! పరమశత్రువు దాఁటిపోయెనే! వాఁడు మనకడనుండిన సుదర్శనుఁడు కాళ్లబేరమునకు వచ్చునే! ఛీ! దురాత్మా!

నీమొగము జూడఁగూడదు. ఇదియంతయు నీవలననే జరిగినది. అతని స్థానమున నిన్నే కారాగృహమునం దుంచెద." నని రాజభటులం బిలిచి చెఱలో సుషేణుని బంధింపుమని యానతిచ్చెను. నిర్దోషియైన సుషేణుఁడు నిష్కారణముగా బంధింపఁబడినందుకుఁ గర్పూరమంజరి మనస్సున మిక్కిలి విచారించెను. చిత్రభానునకు నంతఃపురసేవకులపై నెంతో యనుమానము గలిగెనుగాని కర్పూరమంజరిపైఁ గలుగలేదు. నిజస్థితి దెలియక పోవుటచే నతఁ డెవ్వరిని దండింపఁ జాలకపోయెను గంజాయిమత్తుచేత జంబుకుఁడు చిత్రభానుని ప్రశ్నలకు నసందర్భములైనయుత్తరములు చెప్పుటచే బెత్తముతో నాలుగుదెబ్బలు తినెను.

అట గంధారవల్లభుఁడైన భాగ్యవర్ధనుఁడు విక్రమసేనుని గద్దెనెక్కించుటకు నిశ్చయించి కాశ్మీరముపై దాడివెడలుటకు మహాసన్నాహము సేయుచుండఁగా తనకడనున్న శక్తివర్మం జూచి యిట్లనియె. "ఓయీ! నీవు మాకతమునఁ బాంచాలవల్లభుఁడైన మహేంద్రదేవునికడకు సందేశముఁ గొనిపోవలయును. మహేంద్రదేవుఁడును సమరసన్నాహము చేయుచున్నాఁడని చారులవలన వినియుంటిని. అతఁడొకసారి మే మొకసారి వేర్వేఱుగాఁ జిత్రభానునిం దాఁకిన జయము చేకురకపోవచ్చును. ఉభయసైన్యంబులు గలిసి యేకముఖముగాఁ బోరిన జయ మవలీలగాఁ జేకురును. కావున శరత్కాలమునఁ గార్తికమాసమున శుద్ధపూర్ణిమనాటికిఁ దనసైన్యమును దోడ్కొని కాశ్మీరముఁ బ్రవేశింపు మని యామహారాజుతోఁ జెప్పుము. అనాఁటికి మనము గజరథతురంగాది చతురంగబలంబులతో నాదేశముఁ బ్రవేశింతము. నాముద్రగల జాబుగూడ నిచ్చుచున్నాను. ఇది యాషాఢమాసముగదా! వర్షకాల మాసన్నమగుచున్నది. అదియుద్ధమునకు వీలైన సమయముగాదు. నీవు స్వల్పపరివార సమేతుఁడవై వెంటనే పొమ్ము." అని యానతిచ్చుటయు శక్తివర్మ మహాప్రసాద

మని జాబులనందుకొని మితపరివారముతోఁ బాంచాలమునకరిగి రాజధానిం బ్రవేశించి మహేంద్రదేవుని సందర్శించి సందేశార్థ మెఱిఁగించెను. అతఁడు సందేశార్థమునకు సమ్మతము దెలిపి తనమనుమలు భాగ్యవర్ధనుని చెంత సుఖక్షేమవార్త విని మిక్కిలిసంతసించి దౌహిత్రీపౌత్రీణులు పత్నిం బొందినందుకు శక్తివర్మకు రత్నాభరణములు పారితోషికముగ నిచ్చి గౌరవించెను.

పిమ్మట శక్తివర్మ యాస్థపాలునికడ సెలవుగైకొని గాంధారమున కరిగి మహేంద్రదేవుఁడు సందేశార్థము నంగీకరించెనని విన్నవించెను. మాళవ పాంచాల గాంధారదేశములం దొక్కసారిగా దండయాత్రాప్రయత్నములు మిక్కిలి త్వరితముగాఁ జరుగఁజొచ్చెను. కార్తికమాస శుక్లపక్షమునఁ గాశ్మీరమునకు ససైన్యముగా రావలయునని మహేంద్రదేవుఁడు సుదర్శనునకు వ్రాయఁబంపెను. అతఁడు దాని నంగీకరించెను. మాధవసేనుఁడు శక్తివర్మవలనఁ రాజకుమారుల క్షేమ మెఱిఁగి ముగ్గురురాజు లేకమగుటచేఁ దప్పక చిత్రభానుఁడు కూలిపోవునని నిశ్చయించి "కార్తికమాస మెప్పుడువచ్చు నెప్పుడు సేనలు కాశ్మీరముఁజొచ్చు, నెప్పుడు చిత్రభానుఁడుజచ్చు" నని యాశుభదినముల కెదురుచూచుచుండెను.

విద్యాపీఠ మైనతక్షశిలలో నేఁటేఁట శ్రావణమాసమున గొప్ప విద్యాపరీక్ష జరుగుచుండును. అత్తఱి విద్యార్థుల వారు వారు నేర్చిన శాస్త్రములలోఁ బండితులు పరీక్షించి యర్హులగువారికి విద్యానిధి సాహిత్యచక్రవర్తి వేదాంతకేసరి మొదలగుబిరుదములును మిక్కిలి విలువగలశాలువలును ధనమును బారితోషికములుగా నొసంగబడుచుండెను. ఆవిద్యాపీఠమంతయు గాంధారరాజులపోషణముక్రింద నుండుటచే భాగ్యవర్ధనుఁ డేఁటేటఁ బరీక్షాసమయమున కక్కడికివచ్చుచుండును. ఆసంవత్సరమును భాగ్యవర్ధనుఁడు విక్రమసేనహర్షవర్ధనుల

వెంటఁబెట్టుకొని తక్షశిలకుఁ బోయెను. పండితులచే విద్యార్థులు పరీక్షింపఁబడిరి. శ్రోతలు మహానందభరితులగునట్లు సామవేదము గానముచేయఁబడెను. మందిరములు ప్రతిధ్వను లిచ్చునట్లు ఋక్కులు యజస్సులు నధ్యయనము చేయఁబడెను పూర్వమీమాంసకులు నుత్తరమీమాంసకులు, నుచ్చైస్స్వనములతో సలిపి తమ తమ శాస్త్రములే సరియని సిద్ధాంతీకరించుటకు మహావాదములు సలిపిరి. కపిలుని నిరీశ్వర సాంఖ్యముం బతంజలిసేశ్వర సాంఖ్యము, గౌతమకాణాదులమతములు,పండితుల జిహ్వారంగములయందు నాట్యము చేసెను, బుద్ధదేవప్రోక్తము లయిన త్రిపిటకములయందును దమ్మపదాది గ్రంథములయందును దగుపరీక్షలుజరిగెను. భిక్షుకులకు, సన్యాసులకుఁ గాషాయాంబరములు, విద్వాంసులకు విలువగల సేలువలు విద్యార్థులకు వస్త్రములు పై దేశికులకులగు పండితులకు ధనములు మొదలగునవి భాగ్యవర్ధనుఁడు విరివిగానిచ్చి విద్వజ్జనవంద్యుఁడయ్యెను

విక్రమసేనహర్షవర్ధనులు తత్పురముఁ జూడఁబోయి యొకబౌద్ధవిహారమున భిక్షుణీవేషముతోనున్న యొకయంగనంజూచి మొదట నెవ్వరోయనుకొని సాఁగి కొన్నియడుగులు నడచి మరల ననుమానము దోఁప వెనుకకు నడచి యాపడఁతియెట్టయెదుట నిలిచిరి. ఆమె తల వంచి వారివంక జూడక యేదో యాలోచించుచున్నట్లుండెను. "అన్నయ్యా! అమ్మ-అమ్మ చూడు. చూడు" అని హర్షవర్ధనుఁడు మెల్లగాననెను. "ఔను! ఆనవాలుపట్టుటకు వీలులేకుండ వెఱ్ఱిదానివలె నున్నది." అని విక్రమసేనుఁడు దగ్గఱకుఁబోయి "అమ్మా! అమ్మా!" యని పిలిచెను. ఆమెతలయెత్తిచూచెను. ఎట్టయెదుట నామె తపఃఫలములువలె బంగారుబొమ్మలవలె నిరువురుసూనులు కనఁబడిరి. కనఁబడినతోడనే యామె యానందపరవశయై లేచి నిలువఁబడి యిరువురు బిడ్డల నొక్కసారి కౌఁగలించుకొని 'నాయనా! బ్రతికియున్నారా!

నాయనా! నీవు విక్రమసేనుండవేనా? నాయనా! నీవు హర్షవర్ధనుఁడవేనా! మీరు నా చిన్నియన్నలేనా? దృష్టిదోషముచేత నే నెవరిబిడ్డలనో నాతనయులుగా భావించుచున్నానా?" యని మహాసంభ్రమముతోఁ బలికెను. "అమ్మా! నేను విక్రమసేనుఁడనే. నేను హర్షవర్ధనుండనే. తల్లీ! నీ వెంతమార్పు జెందితివి! మేమే సరిగా గుర్తింపలేకపోతిమి" అని వారు తల్లిని గౌఁగలించుకొనిరి. భిక్షుకభిక్షుణీజనములు మాతాపుత్రుల సమాగమ సౌఖ్యమును గన్నులారఁ జూచి సంతసించి యభినందించిరి. బిడ్డలు తల్లిని భాగ్యవర్ధనునివిడిదికిం దీసికొనిపోయి యాతని కెఱిఁగించిరి. అతఁ డామెను బహూకరించి మాతాపుత్రుల సమాగమము భావికాలశుభమునకు సూచకమని వక్కాణించెను. తల్లియు బిడ్డలుఁ దమతమకష్టముల నొండొరులకుం జెప్పుకొని తత్తత్సమయోచితముగా దుఃఖమును నానందమును నొందుచువచ్చిరి. అచ్చటఁ గొన్ని దినములుండి భాగ్యవర్ధనుఁడు విక్రమసేనహర్షవర్ధనులను నరవిందాదేవిని దోడుకొని స్వనగరంబున కరిగి యుద్ధసన్నాహముఁ జేయుచుండెను.

ఆవర్షర్తు వతిరమణీయముగా నుండెను. గ్రీష్మకాలమునఁ బ్రభాకరుని చండమయూఖముల తైక్ష్ణ్యమునకు గగనమంతయు బీటలువాఱఁ గాలపురుషుఁడు బీటలుగానఁబడకుండ మెత్తినబురదయో యనునట్లు నభోమండలమంతయు మేఘపటలసంఛన్నమై కనఁబడెను భీష్మంబగు గ్రీష్మమునఁ దాపమునకోర్వలేక తహతహం బడినభూదేవి మేనఁ జల్లుకొన్న పన్నీరోయన వెల్లివిరిసి నేలఁబడుచున్న యాకాశగంగయో యన వర్షములు సాంద్రములై కురిసెను. ఉఱుములధణంధణాధణాధ్వానములతోడను, నెడనెడ ఘుణిల ఘిల ఘిల్లనిపడి మెఱపిట్టపిడుగుల చప్పుడులతోడను బెక బెక బెకలాడు గోదురుకప్పలయులివులతోడను, బ్రహ్మాండము ప్రతిధ్వనించుచుండెను. భగ్నమనోరథులై పరితపిం

చు వారికి నెడనెడం బాడకట్టునల్పాశలంబోలెం దళతళతళమని కన్నులకు మిఱుమిట్లుగొలుపునట్లు మెఱుపులు మెఱయం జొచ్చెను. గ్రీష్మకాలమునం బ్రభాకరుని చండతైక్ష్ణ్యముచేత నెండి సుక్కినజలాశయశిశువులను వెండియుం బ్రకృతిలక్ష్మి దృఢగాత్రులం జేయుటకు నొసంగెడుస్తన్యమో యనం బయోధరములనుండి శుద్ధపయోధారల వెల్లివిరియునట్లొసంగెను. నదీనదంబులు పొంగెను. వాగులునిండెను తటాకములు జలపూర్ణము లయ్యెను. ప్రపంచ మంతయు జలమయ మయ్యెను. మార్గంబు లరికట్టంబడెను. ప్రయాణములు దుస్సాధ్యములయ్యెను. ప్రపంచమంతయుం జల్లంగా నున్నను నావర్షకాలమున మకరందునిమనస్సు వియోగవేదనాసంతప్తమగుటం జేసి యతఁడు సౌఖ్యముం గనక నిరాశామేఘచ్ఛన్నము లయినయాదినములను దుర్దినములనుగా భావించి కాల మెట్టెటో గడుపం జొచ్చెను. కర్పూరమంజరియు మకరందుఁడట్లు ప్రియవిరహసంతాపమునం బొక్కుచు నాదుర్దినము లెన్నటికైన గతింపకపోవునా,యనిమంచికాలమున కెదురుచూచుచుండెను.

ముప్పదియైదవ ప్రకరణము.

శరత్కాలము ప్రాపించెను. అయ్యది పరమేశ్వరసృష్టికిం బ్రతిసృష్టి చేయంజాలు మహాకవివాక్ప్రౌఢిమకును చిత్రకారుని తూలికానైపుణ్యమునకును నతీతమై సౌందర్యనిలయమై యతిశోభావంతమై యలరం జొచ్చెను. భూమండలమున రాజేంద్రులు ధనుస్సులు పూని విజృంభింతురుగావునం దనధనుస్సుతో నింక బనిలే దనికాం బోలు మహేంద్రుఁడు తనచాపంబును గగనమునందుం బ్రదర్శింపక

దాఁచెను. వానకాఁగున మేఘమండలముచే నాచ్ఛాదితుం డయిన
సహస్రమయూఖుఁడు బంధవిముక్తుఁ డయినమహాతేజశ్శాలియుం
బోలె మున్ను జడమైనబ్రహ్మాండమున కంతకు వెండియు నఖండ
చైతన్యము గలుగునట్లు దేదీప్యమానప్రభలతో వెలుఁగఁజొచ్చెను.
దిక్కులు ప్రసన్నములయ్యెను. బురద లెండ నేల గట్టిపడెను. జనుల
గమనాగమనముల కనుకూలముగా బాటలేర్పడెను. మున్ను కూలం
కషములై దేశంబులపై దండువెడలి గృహారామక్షేత్రాదుల నాశ
నంబుఁ జేసినమహావాహినులు తమగాంభీర్యముం గోల్పోయి విజృం
భణము నెడలి సామాన్యజనులు తమ్ము దాఁటిపోవుపాటి రేవులు గలిగి
కల్మషరహితములైన నిర్మలోదకములు గలిగి యక్కడక్కడఁ దమ
తిప్పలు బైలుపడఁ దొంటియైశ్వర్య మంతయుం గోలుపోయి గర్వ
హీనులై నెల్లవారికిఁ జులకనౌ పేదల ట్లుండెను. సరోవరములు పగలు
వికసించి కనుపండువు సేయు తామరలతోడను, రాత్రులు వికాసము
జెంది నయనాభిరామంబు లగుకలువలతోడను వెలయుచు నిరంతర
మందహాసమునఁ గళకళలాడు నెమ్మొగంబులు గలవిలాసవతులట్లు
శోభిల్లుచుండెను. ఏసరసుఁడు తనయింటికి వచ్చిన నాసరసునిఁ గౌఁగిఁ
టఁ జేర్చి యాదరించువెలవెలఁదుకలట్లు సరోవరంబులు పట్టపగంట
దర్శనంబిచ్చుప్రభాకరుని, రేలఁ గానఁబడు శీతమయూఖునిఁ బద్మదళ
హస్తములతోడను గలువఱేకులచేతులతోడను గౌఁగిలించుకొనుచు
వారికరస్పర్శల ధన్యత నొందుచుండును. ఆకాశమున నగస్త్యనక్ష
త్రము [illegible]. రాకాచంద్రమండలము నిశల నిష్కళంకమై నిరు
[illegible] మై [illegible]తాంతమనోహరమై నేత్రపర్వమైనపండువెన్నెలలు
[illegible]ముఁ జొచ్చెను. నిశాలక్ష్మి వెన్నెలయను తెల్లకువ్వాలువ గట్టి నక్షత్ర
[illegible] సరముఁ దాల్చి వర్ణనాతీతమైనశోభ గలిగి
[illegible]ల్లుచుండెను. [illegible]లన్నియుఁ బండఁబాఱెను. వసుంధర

సస్యభరితమై చూలుదాల్చి నెలలునిండినపడంతుకవలె దర్శనీయమై యొప్పెను. ఎప్పుడు శరత్కాలము వచ్చు, నెప్పుడు మహావాహినీ సమూహములఁ గొని కాశ్మీరముపై దండువిడియ నగునని నిరీక్షించుచున్న గాంధారపాంచాలమాళవేంద్రులకు మూపుదాల్చినతమమనోరథముంబోలె నాశరదృతువు కనంబడెను.

గాంధారసైన్యంబులు భీష్మంబులై గ్రీష్మంబట్లు పరసైన్యంబుల శోషింపఁజేయఁగలిగి యుండె. బాణవర్షంబులఁ బగతుర ముంపఁజాలి పాంచాలసైన్యంబులు వర్షర్తువు ట్లుండెను. మాళవేంద్రసేనలు శీతకాలంబట్లు ఎల్లవారి గడగడ వడఁకింపఁజాలియుండెను బాణంబులు, తూణంబులు, సరదంబులు, ద్విరదంబులు, ధనుస్సులు క్షుభితమనస్సులు, హయంబులు, భటచయంబులుఁ గలిగి మూఁడు సేనలు నేకకాలమున సన్నిధియయినముక్కారులట్లు, ముచ్చిచ్చులట్లు ముక్కాఁకలఁ దేరి మువ్వన్నెనలువలుఁ దాల్చినజోడుగలిగి బెలుదేఱి కార్తికశుద్ధపూర్ణిమనాఁటికిఁ గాశ్మీరదేశముం బ్రవేశించెను. తనచేఁ బరాజితులైనమాళవపాంచాలభూపతులు మఱల మూఁకలం గూర్చుకొని తనపై నెత్తివత్తురని చిత్రభానుఁడు తలంచుచుండెనుగాని గాంధారనాయకుఁడు తనపై దాడివెడలునని యూహించెన్నఁడును దలంచియుండలేదు. మువ్వురురాజులును సకలసమరసన్నాహంబు జేసికొని దనపై దండువిడియుచున్నారని చారులవలన విని చిత్రభానుఁడు తత్తఱపడి తనసేనలఁ జక్కజేయఁజొచ్చెను. విశ్వాసింపఁదగినబంట్లను దండపాణిని వెదకుటకై కాశీమొదలగుమహాక్షేత్రములకుఁ బంపెను. క్రొత్తజోదుల సేనలోఁ జేర్చుకొనెను. మగఁటిమి గలజోదులను జిన్నదండనాథులుగఁ జేసెను. వలయు ప్రయత్నము లన్నియుఁ జేసెను. వైదర్భులను సాయమురమ్మని సందేశమంపెనుగాని వారు మకరందునిచేఁ బరాజితులై నిశ్చేష్టముగాఁ జెదిరిపోవుటచే నెట్టిసా

హాయ్యముం జేయఁజాలరయిరి. కావునఁ జిత్రభానుఁ డసహాయుఁడై తనలావును నమ్ముకొనియుండవలసినవాఁ డయ్యెను.

యథానిర్దిష్టముగఁ గార్తికశుద్ధపూర్ణిమనాఁటికి మూఁడుసైన్యములు శ్రీనగరపరిసరంబుల విడిసెను. గాంధారవల్లభుఁడు, పాంచాలనాయకుఁడు, మాళవరాజనందనుఁడగుమకరందుఁడు నొండొరులం గలసికొని కుశలంబు లరసి సమరం బెట్లు జరుగవలయునో యావిధానమునుగూర్చి తర్కించిరి. భాగ్యవర్ధనమహేంద్రదేవులు తమదళంబులకుం గూడ మకరందుని దండనాథుఁగ జేసి యాతనియాజ్ఞాప్రకారము నడువవలసినదని తమసేనానాయకుల కాజ్ఞ నొసఁగిరి. భాగ్యవర్ధనునివెంట వచ్చిన విక్రమసేనహర్షవర్ధనులు, పాంచాలసైన్యముతో వచ్చినమాధవసేనుని గూడుకొని తమకై వేరుగ వెట్టుకొనినయావృద్ధమంత్రి కానందముఁ గలిగించిరి. విక్రమసేనుఁడు గాంధారసైన్యమున నొకభాగమునకు దండనాథుఁడై మకరందుని యాజ్ఞ నిర్వర్తించుచుండెను. గాంధారవల్లభుఁడు మకరందమహేంద్రదేవులతో నాలోచించి తనయమాత్యుఁడగు జీవసిద్ధినిఁ జిత్రభానునికడకు రాయబారిగాఁ బంపెను. ఆతఁడును గాశ్మీరనరపాలునికడఁ జెప్పవలసినసందేశార్థము లన్నియు జాగరూకతతో సంగ్రహించుకొని చిత్రభానునిసందర్శనము వేఁడి వానియనుమతమున సన్నిధి కరిగి సత్కృతుఁడై తన సందేశమును నెఱిఁగింప ననుజ్ఞ వేఁడెను. అప్పుడు వారీక్రిందివిధమున ముచ్చటించిరి.

జీవ——మహారాజా! మాప్రభువగుభాగ్యవర్ధనుఁడు సంగ్రహముగా సందేశ మెఱిఁగించి రమ్మని పంపెను. ఆసందేశమిది: గతించినదానిని మరల త్రవ్వుకొనుట నిష్ప్రయోజనము. విక్రమసేనుని గాశ్మీరసింహాసన మెక్కించి హర్షవర్ధనుని యువరాజుజేసి నీవు సకుటుంబముగాఁ గాశ్మీరరాజ్యము విడిచి పోదువా లేక, కయ్యమున

కియ్యకొందువా? ఇందు నీ కేదిఇష్టమో దానిం జేయుము. ఇంతే సందేశము.

చిత్ర—ఇంకను విక్రమసేనహర్షవర్ధను లెక్కడ? వారు మృతి నొందిరి. చచ్చినవానిని రాజుం జేయుటెట్లు? యువరాజుం జేయుటెట్లు?

జీవ—రాజా! నీవు మేలుకొనియుండియుం గలంగనుచున్నావు. విక్రమసేనహర్షవర్ధనులు జీవించియున్నారు. దండపాణి త్రవ్వించిన గోతిలో దండపాణియే పడిపోయెను. రాజకుమారులు బయటం గలంచి వచ్చితాం జచ్చె. నీనారాయణసముద్రంబునందు మునింగిపోక రాజపుత్రులు సురక్షితులయి గాంధారమునందు నున్నారు. ఇదిగో నిటు వచ్చియున్నారు.

చిత్ర—(తెల్లబోయి) ఏమేమీ! బ్రతికియున్నారా? ఇది పరిహాసమా? నీవు మతి తప్పి మాటలాడుచున్నావా?

జీవ—పరిహాసముగాదు. మత్తసంభాషణముగాదు. నిజము.

చిత్ర—బ్రతికి యున్నను నా చిన్నినాయనలు! రాజ్యము నే నియ్యను. వెంటనే యిచ్చోటు విడిచి పొమ్ము. శీఘ్ర నీ ప్రాణములు దక్కవు.

జీవ—చిత్తము. ఇదే సెలవుపుచ్చుకొనుచున్నాను. (అని వెడలిపోయెను)

అప్పలుకులు వినినదాదిగా జిత్రభానుసుమనస్సు మిక్కిలి సంక్షుభిత మయ్యెను. "ఏమీ! దండపాణి మృతినొందెనా? రాజకుమారులు బ్రదికి యున్నారా? రాకుమారులు చచ్చిరని దండపాణి తీర్థయాత్రలు సేయించుచున్నాడని వందంతు చెప్పినమాట యబద్ధమా? చండశక్తి వార్తలను వంచించి యుండునా? అయ్యయ్యో! సర్వము జెడిపోయినది. నాకట్టిన మేడలు కూలిపోయినవి.' అని తనలోం

జింతించుకొనుచు రుద్రభట్టుకడకుఁ బోయి జీవసిద్ధిసందేశ మెఱిఁగించెను. అతఁడును మొదట నమ్మాట నమ్మక యెట్టకేలకు రాయబారమునం దబద్ధముండ దని నిశ్చయించి యెట్లయిన సమరసన్నాహమే కర్తవ్య మని యుపదేశించెను.

చిత్రభానుని ధైర్యము సడలెను. సందేశార్థము పిడుగడచినట్లు వానియుత్సాహము నడంచెను. దండపాణి వచ్చుననునాస యడుగంటెను. అట్టి క్లిష్టసమయమున భ్రాతృమరణవార్త వజ్రపాణి కెఱిఁగింపఁగూడ దని యవ్వార్తఁ దనమనంబుననే యడంచుకొనెను. దండపాణి లేకపోవుటయు వెనుకటియుద్ధములో మెఱయులవంటిజోదులు, దండనాథులు హతు లగుటయు, బొక్కసములోనిధనము తన్నిమిత్తమై వ్యయమగుటయు రాజకుమారులు బ్రతికియుండుటయు మున్నగువిషయములు చిత్రభానున కమితవిషాదముఁ గలిగించెను. ధనము చాలమి నగరమందున్న సంపన్ను లగు బేహారులను నితరగృహస్థులను రావించి యుద్ధమునిమిత్తము తనకు సొమ్ముగావలె నని చెప్పి యిమ్మని యడిగెను. ఇచ్చినవారిని మఱియంత హెచ్చుగా నిమ్మనియు, లేదన్నవారిని దప్పక యియ్యవలసిన దనియు నిర్బంధించి హింసించెను. ప్రజలు భయభ్రాంతులై చిత్రభానుని దూషించి వానివినాశమును గోరిరి. కొందఱు పాఱిపోయిరి. పరుగెత్తినవారిని యతఁడు పట్టితెప్పించి శిరచ్ఛేదముఁ జేయించి వారియిండ్లు దోపించెను. తనజయమునిమిత్తము దేవాలయంబులఁ బ్రార్థనలు చేయవలసిన దని బ్రాహ్మణోత్తముల నియోగించెను. రాజువలన భూరిసంభావనల నపేక్షించిన బ్రాహ్మణోత్తములు వానికి జయముబ్రసాదింపు మని పరమేశ్వరుం బ్రార్థించిరి. దేశాభిమాను లగుబ్రాహ్మణులు మరల వాని కపజయమును మరల విక్రమసేనునిబ్రతిష్ఠయుఁ గావలె నని సర్వేశ్వరుని వేఁడుకొనిరి. రుద్రభట్టు చిత్రభానునివిజయమునిమి

త్తమై గ్రహశాంతులు చేయనారంభించెను. గ్రహదోషనివారణార్థము బ్రాహ్మణులకు భూరిదానము లిప్పించెను.

జీవసిద్ధి తనసందేశపర్యవసానమును భాగ్యవర్ధనాదిప్రభువుల కెఱిఁగింప వారు యుద్ధసన్నద్ధులయిరి. రణభేరులు మ్రోఁగి కోటలో నున్నయంగనలగుండియలు జలుజల్లు మనఁజేసెను. ఆభయంకరధ్వానములకు నభమునఁ బారెడుపిట్టలు చుట్టుచుట్టుకొని బిట్టఱచుచు నేలం బడియెను. గాంధారసైన్యములు పట్టణమున కుత్తరమునను బాంచాలవాహినులు పడమటను, మాళవసైన్యములు దక్షిణమునను విడిసి స్కంధావారమును నిర్మించుకొనెను. ఊరికిఁ దూర్పున సింధువున కుపనదియైన జీలమునునది ప్రవహించుచుండుటచే నచ్చట నెవ్వరును విడియుటకు వీలులేకపోయెను. కార్తికశుద్ధ పంచమినాఁటియుదయమున యుద్ధ మారంభమయ్యెను. చిత్రభానుఁ డిష్టదేవతలకుఁ గృహదేవతలకు వేదవేదాంగపారంగతు లగువిప్రులకు రుద్రభట్టునకు నమస్కరించి కడపటివారి యాశీర్వచనములఁబడసి కవచంబును శిరస్త్రాణంబును దొడిగి విల్లుబూని వజ్రపాణియుఁ గుమారుఁడు విజయసేనుఁడు దక్కినసేనాపతులు వెంటరా రణరంగముఁ జొచ్చెను. అతఁడు తనసైన్యమును మూఁడుభాగములుచేసి యొకభాగంబునకుఁ దాను మొనగాఁడై భాగ్యవర్ధనుని మీఁదికి నడిపెను. రెండవభాగమునకుఁ దనకుమారుఁడైనవిజయసేనుని దండనాథునిగఁ జేసి కొందఱుచిన్న సేనాపతులను వానికి సాయమిచ్చి మహేంద్రదేవుని మీఁదికంపెను. మూఁడవభాగము వజ్రపాణికిచ్చి మకరందుని మీఁదికంపెను. నాలుగుసైన్యంబులఘోషము నాలుగుసముద్రములమహాఘోషము ననుకరించెను. సమరము కురుపాండవయుద్ధమును జూపఱకు స్మరణకుఁ దెచ్చెను. ముందుగాఁ జిత్రభానుఁడు భాగ్యవర్ధనుం దలపడెను. విజయసేనుఁడు మహేంద్రదేవుని దాఁకెను. వజ్రపాణి మకరందునిమీఁదకుఁ

జనెను. గ్రద్దఱెక్కలు గట్టినవాలుటమ్ములు యోధులచేతులనున్న విండ్లనడుఁగొఱిక్కా ఆమబ్బులనుండి వర్షధారలట్లు జివ్వుజివ్వునఁ బడఁజొచ్చెను. ఖడ్గపాణులగుజోదులచేనఱుకఁబడినవీరులశిరంబులుమృత్యుదేవత తిని పాఱవైచిన తాటిపండ్లయట్లు ముంజలట్లు నామెపానపాత్రంబులట్లు తోఁచెను. పాదంబులు తెగిన యూర్ధ్వభాగంబులు శిరంబులు లేని మొండెంబులు, బాహువులు తెగి కొమ్మలు తెగినమ్రానులట్లు గచుపట్టు కళేబరములు మిక్కిలిభయంకరములై కానఁబడియెను చచ్చినవారు, మరణవేదనఁ బడుచున్నవారు, ప్రాణములు గుటగుటలాడుచున్నవారు, కట్టకడపటిశ్వాసలు విడుచుచున్నవారు, దాహపీడితులై మాటాడలేక సన్నలు చేయువారు, పేఁచూపులఁజూచువారు, ప్రాణావసాన సమయమున గూండ్రించువారు, బాధపడలేక యఱచువారు, హరిహరీ యనువారు, నయి పడినజోదులు పలుతెఱంగులగు నవస్థలకుఁ బాలయిరి.

కయ్యము మూఁడుదినములు జరిగెను. మొదటినాఁ డెవ్వరు గెలిచిరో యెవ్వ రోడిరో చెప్పుటకు వీలులేకపోయెను. రెండవనాఁడు విజయసేనుఁడు మహేంద్రదేవునివాలుటమ్మున మూర్ఛిల్లి యొడలు తెలియక పడియెను. తోడనే యంగరక్షకులు వానిని శిబిరమునకుం గొనిపోయిరి. వానిసైనికులు పగఱకు వెన్నిచ్చి పరుగిడిరి. చిత్రభానుఁ డవ్వార్త విని తనగారాబుకొడుకున్న నెలవునకరిగి శస్త్రవేదనాపరవశుఁడై నయాతనిం జూచి జీవనాశ లేదని విచారాక్రాంతుఁడయ్యెను. మనుష్యున్న యల్పోత్సాహముగూడ వానినివిడిచెను. "కుమారా! నీ నిమిత్తమే గదా యీ రాజ్యము సంపాదించుట? నీనిమిత్తమేగదా మాయలుపన్ని యెన్నెన్నో పాపములుచేయుట? తండ్రీ! నీవు లేనిచో నాకీసమునే మేల? సామ్రాజ్యమేల?" యనిగుట్టు గలవాఁడగుటచే లోలోపల దుఃఖపడి పైకి గాంభీర్యము వెలిపుచ్చి సైనికుల

మనంబుల నుత్సాహముం బురికొల్పుచుం గుమారునకుం దగుచికిత్సలం జేయింపఁజొచ్చెను. చిత్రభానుని యుత్సాహమట్లె వానిసైన్యమును రెండవనాఁటికిఁ బలుచఁబడెను. మూఁడవనాఁటిమధ్యాహ్నమున మకరంద్వునిచే వజ్రపాణి తెగటారెను. పాప మాతనికిఁ గర్పూరమంజరీపాణిగ్రహణమహోత్సవము లభింపకున్నను వీరపురుషోచితమయిన శస్త్రమరణము గలుగుటచే మందారమంజరీసమేతలయిన యచ్చరమచ్చెకంటులకేలువట్టు భాగ్యము నందెను. దండపాణి లేకపోవుటచేతను విజయసేనుఁడు గాయపడుటచేతను, వజ్రపాణి నిహతుండగుటచేతను, చిత్రభానునియుత్సాహాగ్ని చల్లవడెను. వాని సేనలు గాంధారుల పోటులకును పాంచాలురయోటులకును, మాళవుల ప్రహారములకును, నిలువలేక వెనుకదిరిగిచూడకపరుగెత్తిరి కొందఱు ప్రాణరక్షణమునకై నదిలోఁబడియీఁదిచచ్చిరి. కొందఱు మొసళ్లపాలయిరి. కొందఱు దూరముకొట్టుకొనిపోయిరి. యుద్ధభూమి గుఱ్ఱములయుఁ బదాతులయు, నేనుఁగులయుఁబీనుఁగులతోడ నతిభయంకరమై హేయమై మృత్యుదేవతరాజధానివలె నుండెను.

చిత్రభానుఁడు శత్రువులు తఱిమి తఱిమి మీఁదమీఁదికి రాఁగ సేనలు లేక యుత్సాహములేక నూఱుమందిసైనికులతో యుద్ధభూమి విడిచిపోయెను. జీవసిద్ధి కొంత సేనతో వానివెనువెంట నంటిపోయి తఱిమి దాదాపుగ నందఱుంజంపె. చిత్రభానునకు రెండుకన్నులట్లు రెండుచేతులట్లు బనిచేసిన కరటకపింగళులు వెంటరా నతఁడు గత్యంతరములేక ప్రాణరక్షణముకొఱకు జలములలోఁ బడెను. ఈఁతయందు మిక్కిలి పరిశ్రమచేసినవాఁడగుటచేతను నప్పటికి సాయంకాలమగుటచేతను జీఁకటిచాటున నెట్టెటో దూర మీఁదికొనిపోయి రెండుజాముల రాత్రివేళ కవ్వలియొడ్డుం జేరి తడిబట్టలతో గడగడ వడఁకుచు నేకాకియై యవ్వలియొడ్డుఁ జేరి తనయవస్థం జూచి భవి

వృత్తాంతమునుగూర్చి తనలోఁదాను వితర్కించుకొనుచుండఁ గరటకపింగళులును దడిసిన బట్టలతో వచ్చి వానిం గలసికొనిరి. ఆసాయంకాలమున యుద్ధభూమియందు నెత్తురు లేరులై ప్రవహించెనను ట యతిశయోక్తిగాదు. ఏనుఁగుతొండము లనెడు తూములనుండి నెత్తుటివఱదలు వసుంధరపై విచ్చలవిడిగఁ బ్రవహించెను. ఆనెత్తురు వసుంధరాదేవిదాల్చినకుసుంభారుణవస్త్రమట్లు-మృత్యుదేవత యింట సంతోషమునఁ జల్లుకొన్న వసంతమట్లు-నాకసమునుండి నేలకు విజృంభించిన సంజకెంజాయయట్లు నెఱసెను.

చిత్రభానుఁడురణరంగమువిడిచిపాఱిపోయినపిదపమకరందుఁడు "భానుఁ డస్తమించె. చిత్రభానుఁ డస్తమించినట్లెయింకసైన్యములు శిబిరమునకుం జనుఁ" డని యానతిచ్చి కోటచుట్టుఁ గొంతసేనఁ గావలిపెట్టెను. చిత్రభానుని పరాజయమును బలాయనమును విని రుద్రభట్టు తద్దయు వగచి కోటయొక్క దొడ్డిగుమ్మముఁ దెఱచి పాఱిపోవుచుండెను. మాళవసైనికులలోఁ గొందఱా ప్రాంతమును గాచుచుండుటచే వారాతనిం బట్టి మకరందుని కప్పగించిరి. మకరందుఁడు వానిని మాధవసేనునికడకుఁ గొంపోయెను. అతఁడు పేదకుఁ బెన్నిధి దొరకినట్లు సంతసించి కాలుసేతులు గట్టిగా బంధింపఁ జేసి వాని నొకగుడారమునఁ బడవైచి చుట్టు నమ్మికగల బంట్లం గావలియుంచెను.

ముప్పది యాఱవ ప్రకరణము.

మఱునాఁ డుదయమున భాగ్యవర్ధనుఁడు మకరందమహేంద్రదేవులను దన స్కంధావారమునకు రావించి కోటస్వాధీనముజేసికొనుటకై పోవలె నని చెప్పెను. అప్పుడు మకరందుఁ డిట్లనియె. "కోటలోఁ జిత్రభానునికుటుంబ మున్నది. వారు శుద్ధాంతకాంతలు. చిత్ర

భానుఁ డనేకదురితములు చేసియుంట నిజము. కాని యాతని యాలుబిడ్డ లాదోసములం బాలుకొనలేదు. కావున వారి కేవిధమైన యవమానముగాని, యగౌరవముగాని మనము తలపెట్టఁగూడదు. అదియునుఁగాక గాయపడిన విజయసేనుఁడుఁగూడఁ గోటలో నున్నాఁడు. ఆతనియెడ మన మనాదరణము జూపఁగూడదు. మఱియొక మాటగూడ జెప్పఁ దలఁచితిని. సమరవిజయగర్వముచే మన సైనికులు సేనాపతులు శ్రీనగరమును గొల్లగొట్ట నుబలాటపడుచుందురు పురజనుల కించుకేనియు నలజడి కలుగఁగూడ దని నామతము. వారు చేసిన యపరాధ మేమియు లేదు. నాపలికిన పలుకులు మీకు సమ్మతము లగునేని మనమందఱముఁ గోట నాక్రమించుకొందము" అనవుఁడు విక్రమసేనుఁ డిట్లనియె. "మకరందునిపలుకులు నాకు సమ్మతములు. మాపినతల్లి యిందుమణి సాధుశీల. కర్పూరమంజరి తన సోదరుఁ డగువిజయసేనునియెడ నెంతయభిమానము గలిగియున్నదో మాయెడ నంతయభిమానము నంతప్రేమ గలిగియున్నది. విజయసేనుఁడు దుర్జనుఁడు గాఁడు. తండ్రి దుశ్చరితుఁ డనుకారణమున పినదండ్రితనయుని హింసించుటధర్మముగాఁదు. నాపినతండ్రి దండ్యుఁడుగాని తత్కుటుంబముగాదు. పురజనులునాయందనురక్తులు. కావున వారు మనయాదరంబునకుం బాత్రములు."

వారిరువురపలుకులు సహేతుకముగా నుండుటచే మహేంద్రభాగ్యవర్ధనులు వారు చెప్పినచొప్పున నడువఁ దలంచిరి. వారందఱు మాధవసేనునిగూడ వెంటఁబెట్టుకొని యాయుధపాణు లైనకొందఱు సైనికులఁ దోడ్కొని కోటం బ్రవేశించిరి వారివలనఁ దమకేమి యపాయము వాటిల్లునో యని భయపడుచున్న యంతఃపురజనంబునకును బరిజనంబునకును నభయప్రదానంబు చేసిరి. విక్రమసేనహర్షవర్ధనులు జీవించియున్నారని తెలిసినప్పటినుండియుఁ గర్పూరమంజరి మిక్కిలి

సంతసించి వారిం జూడ నభిలషించుచుండెను. విక్రమసేనుఁడు భ్రాతృసమేతుఁడై యంతఃపురమున కరిగి యిందుమణికి నమస్కరించి యెట్టయెదుట నిలిచెను. ఆమె వానిని మెల్లగా దీవించి తనభర్తృవిషయమై విచారించుచుఁ దలవంచుకొని యుండెను. కర్పూరమంజరి విక్రమసేనహర్షవర్ధనులను గౌఁగిలించుకొని హర్షవర్ధనుని ముద్దుపెట్టుకొని "తమ్ములారా! మీ రిద్దరు నాకంటఁబడినందుకు నామనస్సు పరమానందము నొందుచున్నది. వెనుకటిదంతయు మఱచిపోయెను. మీయమ్మ యెక్కడనున్నది?" అని వారిం బరామర్శ చేసెను. అప్పుడు విక్రమసేనుఁడు "అక్కా! దైవానుగ్రహమున వెండియు నిన్నుఁ జూచుభాగ్యము గలిగినది. పాపిష్ఠుఁడగు వెండియు నుజ్జీవింపఁజేయఁ దలఁచుకొనలేదు. మీకు మావలన నెట్టిభయము లేదు. చేతులారఁ జేసికొన్న దుష్కృతఫలము మీతండ్రి యనుభవించును. విజయసేనునకుఁగూడ మా కెట్టి కీడుతలంపులు లేవు. మీరు నిర్భయముగా నుండుఁడు." అని చెప్పి యనంతరము విజయసేనునికడకుఁ బోయి వానికిఁగూడ నభయం బొసంగి వ్రణవైద్యుల రావించి వానికిం జికిత్సలు చేయఁ బనిచెను. పిమ్మట వారందఱు వెండియు స్కంధావారంబునకుం జనిరి.

మాధవసేనుఁడు పట్టణంబునకుం జని మణివర్మయొక్కయు శూలపాణి గదాధరులయొక్కయు, దుస్థితిఁ దెలిసికొనివచ్చి వారిని బంధవిముక్తులఁ జేయుమని విక్రమసేనునితోఁ జెప్పెను. అట్లు కాక యని కొంతపరివారమునిచ్చి యతఁ డాకార్యముచేయుటకు మాధవసేనుని నియోగించెను.

మాధవసేనుఁడు పరివారసమేతుఁడై కారాగారంబున కరిగి యుపవాసంబులచేతను, దేహపీడచేతను, మనోవిచారముచేతను మిక్కిలి కృశించి యానవాలుపట్టుటకయిన వీలులేనిస్థితిలోనున్న

తనమిత్రుని మలినవస్త్రధారుని గృశీభూతగాత్రునిఁ గనుఁగొని కన్ను
ల వేఁడికన్నీరొలుక గాఢాలింగనముఁ జేసికొని సమరవృత్తాంత
మంతయు నాతనికిఁ జెప్పి విక్రమసేనునివిజయ మెఱిఁగించి బంధ
విముక్తునిఁ జేసెను. అనంతరము గదాధరశూలపాణులఁ గూడ నాతఁడు
విడిపించెను. వారుమువ్వురును తోడనే గృహంబులకుం జనక తమకృ
తజ్ఞతను రాజభక్తిని బాలుఁడైన విక్రమసేనునకుం దెలుప నాతని
నిలయంబునకుం బోయి యెట్టయెదుట నిలిచిరి. సుమిత్రుఁ జూచిన
తోడనే విక్రమసేనుఁడు లేచి నమస్కరించి కౌఁగిలించి "తాతగారు!
మాకొఱకై మీరు చెప్పరాని యిడుమలు బడితిరి. మిమ్ము వెండి
యు మేము చూతుమనుకొనలేదు. మొదటఁ బ్రతికూలముగానున్న
దైవము తుదకు మన కనుకూలుఁడయ్యె." అని పరామర్శపూ
ర్వకమగు పలుకులు పలికెను. మణివర్మ తాతని యమ్మునిఁ గనుఁగొన
గల్గినందుకు సంతసించి యత్తే మూర్ధాభిషేకము జరుగునని సూచిం
చుటకో యన నానందాశ్రువులచే వానిశిరంబు నభిషేకించి "నాచి
న్నియన్నలారా! మృత్యుదేవతకోఱలనడుమఁ జిక్కియు నదృష్టవశ
మున జీవింపఁగల్గితిరి. దురాత్ముఁడైన పితృఘాతకుఁడు రణమునఁ జచ్చి
నాఁడా, చేసినపాపము సద్దికిఁగట్టి యనుభవింపకపోవునా? లేదా వ్రణశేష
ము, రణశేషము, ఋణశేషము నుంచఁగూడ
దని పెద్దలు చెప్పుదురు. వానిని పిచ్చలపిడిగాఁ దిరుగనిచ్చినచో పిచ్చి
కుక్కను గ్రామమున విడిచినట్లె. కావున సైన్యమునంపి వానిం బట్టి
తెప్పింపుము." అని బహూకరించి హితోపదేశముఁ జేసి సెలవు గై
కొనియెను. గదాధరశూలపాణులును దమకృతజ్ఞతఁ దెలిపి చనిరి.

అనంతరము రుద్రభట్టు నేమిచేయఁ దగునని భాగ్యవర్ధనుఁడు
మకరంద మహేంద్రదేవులను, మాధవసేనుని విక్రమసేనహర్షవర్ధను
లను బిలిపించి యడిగెను. మకరందుఁడు వానిని దేశమునుండి వెడలఁ
గొట్టుట కర్తవ్యమని పలికెను. వానిని యావజ్జీవము కారాగృహమున

నుంచఁదగునని విక్రమసేనుఁ డనెను. "బ్రాహ్మణో న హంతవ్యః" యని ధర్మశాస్త్రము చెప్పుచున్నదికనుక నామనుమఁడు చెప్పినట్లు మకరందుఁడు చెప్పినట్లు జేయుట సముచితమని వృద్ధుఁడైనసమహేంద్ర దేవుఁడు వాక్రుచ్చెను. మాధవసేనుఁడు వారిమాటల కిష్టపడక రోషా వేశముగలిగి యిట్లనియె. "అయ్యా! మీరందఱు మూర్ధాభిషిక్తులు ధర్మాధర్మ విచక్షణులు. మీ రెఱుఁగని ధర్మములు లేవు. నేను మీ కేవిషయమునం జెప్పఁదగినవాఁడను గాను. అయినను నాదొక్క చిన్నమనవిగలదు. ఇతఁడు బ్రాహ్మణుఁ డగుటచేనవధ్యుఁడని పాంచా లవల్లభుఁడు పలికె. ఆయభిప్రాయముచేతనే విక్రమసేనుఁడు యావజ్జీ వకారాగృహవాసము విధించె. పరమదయాళువగుటచే మకరందుఁడు వానిని దేశభ్రష్టుఁ జేయుమనియె. మీమాటలు నాకు సరిపడవు. వాఁడు బ్రాహ్మణుఁడుగాఁడు చండాలుఁడు. చండాలుఁ డనుట చం డాలుర నవమానించుట. చండాలురు గూడ వీనికర్మలంజూచి సిగ్గుప డవలయును. కటికవాండ్రుసైతము వీనిచర్యలం జూచి కంపింతురు. వీఁడే మాఁశర్మయనుపేరుపెట్టుకొని చిత్రభానుంగూడి హేమచంద్ర మహారాజుం జంపించెను. వీనియుపదేశంబుననే చిత్రభానుఁడు బాలకు ల దారుణంబుగఁ జంపింపఁదలఁచె. అగ్నికి వాయువు తోడైనట్లు దు రాచారుఁడైన చిత్రభానునకు వీఁడుమంత్రియై యుపదేష్టయై యుం డెను. వీఁడు చేయనిపాతకము లేదు. వీనియెడ దయబూనుట యను చితము. వీనియెడ జాలిబూనుట పాతకమున కభ్యుదయము గలిగిం చుట. అధర్మమును బ్రోదిసేయుట. జాతముచేత విప్రుఁడైనంతమా త్రమున దురాచారుల క్షమించుట శ్లాఘాపాత్రముగాదు. కావున వీనిని దారుణవధముపాలుచేయుట మంచిది. ఏనుఁగుకాలిక్రింద వైచి త్రొక్కించియో కొరతవేసియో వీనిని తుదముట్టింపవలయు." అప్ప లుకులు విని భాగ్యవర్ధనుఁడు వాని నట్లచేయుట యుక్తమనిపలికెను.

మీయిష్టమని మహేంద్రదేవుఁ డూరకుండెను. అంతకుమున్ను పెద్దలు చెప్పినట్లు వినకపోవుటచేఁ దమకెన్నో యిడుములు కల్గినవని యెఱిఁగి విక్రమసేనుఁడు వారిమాట కెదురాడఁడయ్యె. మకరందుఁడు వధింపవలదని పలుమాఱు చెప్పెను గాని వానిమాట సాగదయ్యె. మంత్రిభట్టుం దోడ్కొనిరమ్మని భాగ్యవర్ధనుఁ డాజ్ఞయిచ్చెను. సంకెళ్ళబరువున మెలమెల్లగ నడుగులిడి నడచుచు గతగర్వుఁడై దీనాననుఁడై మంత్రిభట్టు రాజసన్నిధిం బ్రవేశించెను. అతనిం జూచి భాగ్యవర్ధనుఁ డిట్లనియె. "బ్రాహ్మణుఁడా! చిత్రభానునితోఁ గలిసి కాశ్మీరరాజకుటుంబమునెడ నీవు పొనర్చినమహాఘాతుకకృత్యములకు నీకు మరణదండన విధించినారము. మదపుటేనుఁగుకాలిక్రిందవైచి త్రొక్కించి నిన్నంతమొందించుట సముచితం బని సభాసదులు నిర్ణయించిరి. నీవర్చస్సుచూడ బ్రహ్మతేజ ముట్టిపడుచున్నది. అదిగాక నీవు వేదవేదాంగపారగుఁడ వని కూడ వింటిని. అట్టినీవ యుక్కటికము లేక యక్కటికవానిచందమున దుష్కార్యంబులం బొనర్చితివి. కావునఁ దత్ఫల మనుభవింపుము" అనియానతీయ వృద్ధభట్టు బాష్పాకులితలోచనుఁడై "మహాప్రభువులారా! నావయస్సును, నాకులమును, నావిద్యను, మీ రాలోచించి నన్ను క్షమింపవలయునని ప్రార్థించుచున్నాఁడ. నా యాలుబిడ్డలకు దిక్కెవ్వరు లేరు. నేను మిక్కిలి పేదవాఁడను. మీశరణముఁ జొచ్చినాఁడను. మీపాదము లాశ్రయించి బ్రతుకవలసినవాఁడను" అని బాలుఁడట్లు వెక్కి వెక్కి యేడ్చెను.

మకరందుఁడు చూడలేక చోటువాసి యవ్వలికిం బోయెను. మాధవసేనుఁడు "మహారాజులారా! ఇతఁడు నాటకమండలిపాత్రిమట్లు సకలరసము లభినయింపఁగలఁడు. ఇప్పు డేడ్చి మీహృదయంబులు గరఁగింపఁగలఁడు కావున మీరు మెత్తపడవద్దు. ఇతఁ డింతక

న్నను దారుణమైనశిక్షల కర్హుఁడు. బ్రతికియుండఁగా వీనిం గాల్చి నను దోసము లేదు. ఇట్టికలుషాత్మునిసంపర్కమువలన నతిపవిత్ర మగునగ్నిహోత్రుఁడు మలినుం డగును. కావున నిదే వీనికిఁ దగిన శిక్ష యని కఠినముగాఁ బలికెను.

"బ్రాహ్మణుఁడా! నీమీఁద నెవ్వరికిం జాలి లేదు. 'అవశ్య మనుభోక్తవ్యం కృతం కర్మ శుభాశుభ' మ్మని మీవంటిపెద్దలే చెప్పి నారు. కావున నీవు చేసినవ్యవసాయమునఁ బండినపంట నీవ కుడువ వలయు. కార్యమొకఁడు చేయ ఫలము మఱియొకఁ డనుభవించునా? మాయారూపము దాల్చి హేమచంద్రునివంటి రాజచంద్రుని బొట్టం బెట్టుకొంటివి. అట్టినృపచంద్రుఁడు మరల మనకు లభించునా? ఛీ! నీమొగముఁ జూడఁగూడదు పొమ్ము." అని భాగ్యవర్ధనుఁడు కోపో ద్రేకుఁడై పలికెను. అంతట సేవకు లాతని నవ్వలికిం దోడ్కొని పోయిరి.

గాంధార రాజులయొద్ద కాళరాత్రియనుమదపుటేనుఁగు కలదు. సేవకులు దానిం దోడితెచ్చి గాంధారస్కంధావారమునకు నట్టయె దుట నిలువంబెట్టి వలదు వలదని పెద్దపెట్టున నేడ్చుచున్నరుద్రభట్టును లాగియు గెంటియుఁ ద్రోసియు నాదంతావళమునంతికమ్మునకుఁ దీసికొనిపోయి యొకయినుపగొలుసుఁ దెచ్చి రుద్రభట్టునడుమునకుఁ గట్టి దానినేనుఁగుకాలికిబంధించిరి. అప్పుడు రుద్రభట్టు తన కట్టిదారు ణమరణము విధి నిర్ణయించె నని మనస్సమాధానము జేసికొని కన్నులు మూసికొని పరమేశ్వరునిధ్యానము జేసి నేలం బండుకొని యెను. మావటీఁడు మత్తేభము నంకుశంబునం బొడిచి ముందుకు నడిపించెను. తోడనే యయ్యిభ ఘీంకరించి యతిభారములై రోళ్ల వలె నున్నతనపాదములు రుద్రభట్టువక్షస్థలంబునఁ బెట్టి త్రొక్కి తొండమున వాని లేవనెత్తి గిఱ్ఱునఁద్రిప్పి నేలఁ బడవైచెను. రుద్ర

భట్టు గొన్నిత్తురులు గైకొని యమమందిరమునకుం జనియెను. సైనికులందఱు మహాభయముతో విస్మయముతో నాతనిదుర్మరణముఁజూచి జాలినొందిరి. శ్రీనగరపౌరు లాబాలగోపాలముగ నవ్వార్త విని సంతసించిరి.

గాంధారనాయకుఁడు మణివర్మచేసినహితోపదేశము ననుసరించి చిత్రభానునిఁ బట్టి చంపుటో లేక బ్రతికియుండఁగా శ్రీనగరంబునకుం గొనితెచ్చుటో కర్తవ్య మని కొంతసేనతో జీవసిద్ధిని వానికొఱకై పంపెను. జీవసిద్ధియు నది దాఁటి వానిజాడ లరయుచుఁ బరిసరంబుల నున్నయరణ్యములు వెదకుచుఁ గొంతద వ్వరిగెను. ఒకయేటియొడ్డున నొకకొండగుహలోఁ జిత్రభానుఁడు కరటకపింగళసమేతుఁడై తనయాప్తసేవకులు పిట్టలం గొట్టితెచ్చి యిచ్చినమాంసంబును గొన్నిపండ్లను మెసవి కాలక్షేపము సేయుచుండెను. ఒకనాఁటి సాయంకాలము చీఁకటిపడినవెనుక నాగుహలో ముగ్వురుఁగూర్చుండి తమదురవస్థను వగచుచుండఁ బింగళుఁడు విచారాక్రాంతుఁడై యిట్లనియెను. "మహాప్రభూ! దేవరవారినిమిత్తమై మేము మేరు దాచుకొనక యేపని జేయుమన్న నాపని జేసితిమి. మీరు మీయన్నం జంపునపుడు మేమెంతో సాయము జేసితిమి. ఎన్నోమాయవేషములం దాల్చితిమి. నేను విశారదనామముతో మాళవదూత ననిబొంకి మీయన్నమనసు కలఁచితిని. గాంధారదేశబ్రాహ్మణవేషము, సాయిలవానివేషము, కరటకుఁడు నైచి యెంతో చిత్రముగాఁ గథాకలాపము వినిపించి సైనికుల కుద్రేకముఁ గలిగించెను. నేనును మహేంద్రదేవునిపురోహితవేషము వేసి సూయన యుంగరము దొంగలించుకొనివచ్చి రాజకుటుంబముమనసు కలచితిని. మీరు వేఁటకు వెళ్లఁదలఁచినప్పుడు నేనె గొల్లవాఁడ నైతిని. రాకొమరులు పులినోటఁ బడి చచ్చిరని శేనెబొంకితిని. మీయానదాఁటక యెన్నిదుస్తంత్రముల

నై నంబన్నితిని. కాని దైవము మన కనుకూలముగ లేకపోవుటంజేసి మనప్రయత్నములన్నియు భగ్నములయ్యెను. ఇంక నేమిచేయుదము? ఎందుంబోవుదము? మాబ్రతుకు, మాసుఖము, మీతో నున్నది. ఆలుబిడ్డలకు దూరమైతిమి. అన్నవస్త్రములకు వెలియైతిమి. పరమేశ్వరుండు మనమీంద నిర్దయుండగుటకుం గారణమేమో" యనియంగ లార్చుచుండం జిత్రభానుండు దైన్యసూచకమగు హీనస్వరముతో "ఓరీ! మీవలన లోపములేదు. నే నేయాట లాడుమన్న నది యాడి తిరి. అయినను మనము దైవోపహతుల మగుటచే నపజయమైనది. అయినను మేనం బ్రాణములుండ మనప్రయత్నము విడువందగదు. ఈయాటవికులం గూర్చుకొని క్రిమక్రమముగా దేశపుంగొననున్న గ్రామముల నాక్రమించి మెల్లగ విజృంభింతము." అనిపలుకుచుండ మనుష్యులు నడచివచ్చుచున్నజాడ వారికి వినవయ్యెను. వెంటనే పింగళుండు గుహావెలుపలికి వచ్చి శబ్దమూలకించి మనుష్యుల యడుగులచప్పుడువలెం గొంతదూరము వినంబడుచున్నది. మనలం బట్టం బగతులు వచ్చుచున్నారేమో? ఈవలకురండు. పాఱిపోదము." అని తొట్రుపాటుతోం బలికెను. అదివిని వెంటనే లోపలనున్న యిరువురు వెలుపలికి వచ్చి శబ్దమూలకించిరి. అంతలో జీవసిద్ధిసైన్యము మిక్కిలి దగ్గఱకు వచ్చుటచే నేవకసమేతుండై చిత్రభానుండు ప్రాణరక్షణమునకై పఱవెత్తసాగెను. అదికనిపెట్టి జీవసిద్ధియు సైనికులును వారిం దఱుమనారంభించిరి. కాలిలో ముండ్లు విఱుగుటంజేసి పింగళ కుండు నడువలేక యొ చోటంబడెను. సైనికులు వానిం బట్టి తుత్తుని యలుగాం జెక్కివైచిరి. చిత్రభానుండు తనపాదములు పరుగెత్తనిచ్చి నంతవేగముగాం బరుగెత్తుచు నొకచెంచుపల్లియ దాసి యయ్యూరు వెలుపల నున్నపాడునూతిలోం బడెను. చీంకటిచాటున నది కానంబడకపోవుటచే నట్టిప్రమాదము సంభవించెను. అందు నీరులేదు గాని

పాములు, జెఱ్ఱులు, కండచీమలు మొదలగునవి విశేషముగ నుండెను. తేళ్ళుకుట్టెను. పాములు కఱచెను. కండచీమలు పీకెను. ఆతఁ డాబాధలుపడలేక పెద్దపెట్టున నఱచి మరణవేదన బొందెను. చెంచుపల్లియలోనివారందఱు నడలి మేల్కొనిరి. అంతలో నాతఁ డెక్కడున్నాఁడో నెవ్వరుఁ జెప్పనక్కఱలేకయే వానియఱపులే యెఱిఁగించుటచే జీవసిద్ధి యారాతిరికడకుఁబోయి సైన్యసమేతుఁడై దానియొద్దున నిలిచెను. కొంతసేపటికిఁ గ్రమక్రమముగాఁ జిత్రభానుఁడు స్మారకము దప్పి హీనస్వరంబున నేమేమో గొణుగుకొనుచుఁ గాలధర్మము నొందెను.

మఱునాఁ డుదయమువఱకు జీవసిద్ధి యచ్చట నుండి శవముం దీయించి సైనికులతో నిట్లనియె. "ఆహా! చూచితిరా? యెంతయున్నతవంశముననో జన్మించెను. ఎన్నివిద్యలనో నేర్చెను. కాని దురాశాపీడితుఁడై దుస్సాహసములంజేసి దుర్న్యయంబున గొడిగట్టి దుస్తంత్రంబులఁబన్ని దుష్కార్యములాచరించితుదకీదురవస్థందెచ్చికొనియె. రాజద్రోహియయ్యెను. భ్రాతృద్రోహియయ్యెను. దేశద్రోహియయ్యెను. శిశుహంతకాఁదలఁచెను. తరువాతి నరక మున్నదో లేదో గాని యీనూతిలోఁ బడినదిమొదలుకొని ప్రాణముపోవువఱకు భూలోకమందె నరకక్లేశమనుభవించెను. శిష్టజనసంరక్షణంబును దుష్టజనసంశిక్షణంబును జేయ దీక్షవహించినదా క్షాయణీవల్లభుఁడు పరమేశ్వరుఁడు పాపఫలంబు దురాత్ముల ననుభవించునట్లు జేయకపోవునా? పాప మెన్నటికిని జయముగాంచదనియు, సత్యమే జయించుననియు ధర్మమే సర్వోత్కృష్టమైనదనియుఁ దుదకు వారికి మిగిలినది పాపమేయనియు నీచరిత్రమువల్ల నేర్చికొనవచ్చును."

అనిపలుమఱు వ్యసించి శవమును భాగ్యవర్ధనవిక్రమసేనులకుఁ జూపఁదలఁచి కట్టుగట్టించి దానిపైఁబెట్టించి సేవకులచేత మో

యించుకొని నదియొడ్డునఁబెట్టించి నది దాఁటి తాను స్కంధావారమునకుం జని విక్రమసేనునకు భాగ్యవర్ధనునకు మకరందునకు మాధవసేనునకు నవ్వార్త జెప్పి రహస్యముగ వారిని నదిదాటించి యావలియొడ్డునకుఁ దీసికొనిపోయి శవముం జూపెను. చిత్రభానుఁ డస్తమించె నని వారప్పుడు నిజముగా నెఱిఁగి సంతుష్టు లయిరి. విక్రమసేనుఁడు వానిదురవస్థకు విచారించి బాష్పాకులితలోచనుఁ డయ్యెను. మాధవసేనుఁడు చేతులారఁ జేసికొన్నది యనుభవింపకతప్పునా యనెను. మకరందుఁడు జాలిపడెను. మరల నడవికిం గొనిపోయి యచ్చటనే దహనసంస్కారము చేయుఁడని భాగ్యవర్ధనుఁ డాజ్ఞ యిచ్చెను. ఆవార్త చిత్రభానునికుటుంబమునకుఁ దెలియకుండ రహస్యముగ నుంచుమని కాలాంతరమునఁ దెలియఁజేయవచ్చునని విక్రమసేనుఁడు వారినిగోరెను. శాస్త్రచోదితములైనయుత్తరక్రియలు లేక తనవారలకు విచారించునాప్తజనము లేక, దిక్కులేక చిత్రభానుఁడు వనమధ్యంబున నెండుటాకులు గాలినట్లు దగ్ధుఁడయి యపకీర్తికాయము ను లోకంబున విడిచి పోయెను. చిత్రభానుఁడు నూతఁబడినరాత్రి కరటకుఁడు పేరఁకలిగొన్నపెద్దపులివాఁతం బడి యంతకపురంబుఁ జేరెను.

ముప్పదియేడవ ప్రకరణము.

చిత్రభానుఁడు మృతినొందినవెనుక నొకమాసమువఱకు నూరకుండి భాగ్యవర్ధనుఁడు మకరందమహేంద్రదేవులతో నాలోచించి విక్రమసేనునకుఁబట్టాభిషేకము సేయ నిశ్చయించెను. మాతామహుఁడైనమహేంద్రదేవుఁడు నానాదేశాధీశ్వరులకు మనుమనియభిషేకమహోత్సవమునకు రావలయునని యాహ్వానముల నంపెను. మాళ

వేంద్రుఁడైనసుదర్శనుఁడు సింధునాయకుఁడైనపరంతపుఁడు ఘూర్జరవల్లభుఁడైన కువలయేశ్వరుఁడు మున్నగుమహీనాయకులు తమతమ పరివారములతో మహావైభవమున వచ్చి శ్రీనగరమునఁ దమనిమిత్తఁ మేర్పఱుపఁబడినవిడిదలలో విడిసిరి.

నగరమంతయు సింగారింపఁబడెను. ఎచ్చోటఁజూచినఁ బచ్చని పందిళ్ళు. ఏద్వారమునఁజూచినఁ గనుపండువుసేయుతోరణములు. ఏగుమ్మముముందరఁ గనుఁగొన్న గొలలతోనిండిన యనఁటికంబములు. ఏగోడలు వీక్షించిన నతిమనోహరములైనచిత్తరువులు. ఏమేడలఁ జూచినఁ బట్టుపతాకములు. ఏనెలవునదర్శించిన సర్వాలంకారశోభితలైన విలాసవతులు. యమున, సింధు, భాగీరథి, సరస్వతీ, ప్రముఖములగుపుణ్యవాహినులతోయంబులు హేమకుంభములతోఁ దెప్పింపఁబడెను. ప్రకృతిజనంబులలో ముఖ్యులు తన్మహోత్సవదర్శనార్థమై వచ్చిరి. భాగ్యవర్ధనుని యానతి బూని చండశక్తివర్మలు తగుపరివారముతో గాంధారనగరమున కరిగి కుమారాభిషేకమహోత్సవము గనుఁగొనుటకై యరవిందాదేవిని దోడితెచ్చిరి. తల్లియుం గొడుకులుఁ గలసికొని పరస్పరాలింగనసుఖంబు ననుభవించిరి.

సిద్ధాంతులు నిర్ణయించినసుముహూర్తంబున మహారాజులయు, సామంతులయు, మంత్రులయుఁ, జుట్టములయుఁ బ్రకృతిజనంబులయు సన్నిధిని బురోహితుఁడగునిగమశర్మ విక్రమసేనుని గాశ్మీరసింహాసనంబునఁ గూర్చుండఁబెట్టి పుణ్యనదీతోయంబులతో నభిషేకించెను. అరవిందాదేవిసహజమగుమాతృవాత్సల్యముచేతఁ గన్నుదమ్ములనుండి దొరఁగునానందబాష్పములతోఁ బుణ్యనదీజలములఁ బవిత్రమైనకుమారునిమూర్ధమున వెండియు నభిషేకించెను. ఉదయశైలము నలంకరించినభానుమండలమట్లు నవరత్నఖచితమైన సువర్ణపీఠము నధిష్ఠించిన దేదీప్యమానప్రభలతో విరాజిల్లుమణిమయమకుటంబు నొదలఁ

దాల్చి, కుమారభావంబుదాల్చి వచ్చినహేమచంద్రుఁడుంబోలె వెలు
యు విక్రమసేనునిం జూచి మహేంద్రదేవప్రముఖబాంధవులు సుదర్శ
నాదిమిత్రులు, భాగ్యవర్ధనప్రముఖులగునాప్తులు నానందించిరి. వంది
మాగధులు కైవారము జేసిరి. వైతాళికులు జయగీతములఁ బాడిరి.
వృద్ధు లాశీర్వదించిరి. ప్రకృతిజనంబులు భళి భళీ యని ప్రశంసించి
సంతసించిరి. విరివిగా జరిగినయన్నదానమునఁ బేదలు సంతుష్టులైరి.
భూరిసంభావన లందుకొని కవులు, పండితులు, బహుశ్లోకగర్భితము
లైనదీవనలనిచ్చిరి. నగరమంతయు నుత్సవమయమయ్యెను. ఒకచో వి
ప్రులవేదఘోషములు, వేఱొకచోఁ బణ్యాంగనలయాటలు, గొండొక
చోఁబుణ్యాంగనలపాటలు, నొకమూలగానవినోదములు, నొకనెలవునఁ
బండితశిరోమణులవాదములు నొకతావున మిత్రులసరససల్లాపములు
నొకయెడ బాంధవులపరస్పరపరామర్శలు నిట్లునగరమంతయు మహా
నందమయమై నయనపర్వమై మనోహరమై యుండెను.

ఉత్సవానంతరమున విక్రమసేనుఁడు తనకుండమ్మనకుఁ బ్రా
ణప్రదాతలైనచండుని శక్తివర్మను బిలిపించి వారి రాజభక్తిని గొని
యాడి చెరిమూఁడుగ్రామములు పన్నులులేకుండ నగ్రహారములుగా
నొసఁగెను. అదియునుఁగాక తమనిమిత్తమై కష్టపడినవారికిఁ, బ్రాణ
ములుగోల్పడినవారికి, నుచితరీతిని బారితోషికముల నొసంగి, వారి
కుటుంబములకు జీవనాధారముగల్పించెను. చిత్రభానునియొక్కయు
దండపాణి వజ్రపాణులయొక్కయు దుర్బోధనలవలన వికలచిత్తులై
తనపైఁదిరుగుబాటుచేసినసైనికుల నందఱను క్షమించి మరలసైన్య
మునఁ జేర్చుకొనెను. మణివర్మను, మాధవసేనుని, మంత్రులుగా
నియమించెను. గదాధర, శూలపాణులు సేనాపతులైరి.

భాగ్యవర్ధనుఁడు తన గారాబుకూఁతురైన సౌదామినిని విక్ర
మసేనునకును, దనతమ్మునికూఁతురగు చిత్రరేఖను హర్షవర్ధనునకును,
నిచ్చి వివాహము సేయసంకల్పించినట్లు మహేంద్రదేవునితోడను,

నరవిందాదేవితోడను, జెప్పి వారియనుమతివడసి మాఖమాసంబునఁ గళ్యాణంబులు జరుపఁదలఁచి సుముహూర్తము నిశ్చయించెను. మహేంద్రదేవుఁడు తానతివృద్ధుఁడై రాజ్యభారము నిర్వహింప లేకుండుటచేఁ దనరాజ్యమున హర్షవర్ధను నభిషేకించి వానికి యుక్తవయసువచ్చువఱకుఁ దా నాతనికిఁ దోడ్పడి యుండి యనంతరము దపోవనమున కరుగ నిశ్చయించెను. భాగ్యవర్ధనుఁడును దనకుం దమ్మునకుఁ బురుషసంతతి లేనందునఁ దనపరోక్షమునవిక్రమసేనుఁడేగాంధార దేశమునకుఁ గూడ నేలికగాఁగలఁడని యెల్లరాజులయెదుట నొక్కివక్కాణించెను.

సుదర్శనుఁడు మకరందుని మిత్రుఁడగు చంద్రచూఁడునివలనఁ దనకుమారుఁడు కర్పూరమంజరిపై వలపునిలుపుటవినియున్నకతమున విక్రమసేనుని పట్టాభిషేకమహోత్సవము నిమిత్తము నిర్మింపఁబడిన పచ్చని పందిళ్లలోనే కర్పూరమంజరిని మకరందునకు వివాహము సేయు టుచితమని యరవిందాదేవికిని నిందుమణికిని నిగమశర్మముఖమున సందేశమంపెను. అరవిందాదేవి యాసందేశము నాదరముతో విని యావివాహము నంగీకరించెను. భర్తృమరణవార్త తెలియకపోయినను నిందుమణి మహాపతివ్రత యగుటచే నాతనికొఱకై చింతగాని యన్యులతో మాటలాడక సరిగా నన్నము ముట్టక నిదురపోవక దుఃఖపరవశయై యుండియు, సంప్రాప్తయౌవన యైనకూఁతు నవివాహితగాఁ జిరకాలముంచుట యనుచితంబని తలంచి యనుకూలుఁడైన వరుఁడు చేకూరినప్పుడు వాని కామెనీయకపోవుట యధర్మమని భావించి యరవిందాదేవిం బిలచి యిట్లనియె "అక్కా! మీమఱఁదితోఁబాటు నేనును మీకు లేనిదానినే యని భావింపుఁడు మీమఱఁదివలన మీకైన మహోపకారముల నెల్ల మరచిపోండు. చిన్ననాఁటనుండి కర్పూరమంజరిని నీవె పెంచితివి. అది నీబిడ్డకాని

నా బిడ్డ కాదు. కడుపునఁ గాంచుటచే నేను తల్లి నైతిని, పెంచుటచే నీవు తల్లి వైతివి. దానికి నామీఁదకన్న నీమీఁదనే మక్కువ మెండు. నేను బహుకారణములచేఁ బ్రజలముఖము జూడఁజాల కావునఁ గర్పూరమంజరిని మాళవరాజనందనుఁ డగు మకరందునకిచ్చి పెండ్లి చేయించుము. జనకునికి జడిసి యబ్బాలిక పైకిఁ జెప్పలేదుగాని యామె రహస్యముగ బౌద్ధమతమును స్వీకరించినది. వెనక దండ్రితోఁ గూడ నొకసారి బుద్ధదేవుని సిద్ధాంతములఁ బ్రసంగించుచు గంభీరముగ మాటలాడెను. అందుచే బౌద్ధధర్మప్రకార మామెకు వివాహము సేయించుము." అని పలికి యాగకుండ వచ్చుబాష్పధారలను చీరచెరఁగుతో దుడుచుకొనియెను. "ఇందుముఖీ! విచారింపకు. నీమనోభీష్టము నేను నెఱవేర్చెద. నీకు విక్రమసేన హర్షవర్ధనులతో ముగ్గురుకొడుకులనుకొనుము. నీవు చెప్పినట్లు కర్పూరమంజరి నాబిడ్డయే. కర్పూరమంజరికి శుభముహూర్తమున వివాహముచేయించెద." నని యరవిందాదేవి నుడివి యామె యలమట దీర్చి వివాహమునకు ముహూర్తమేర్పఱచి యావార్త సుదర్శనున కెఱింగించెను. సుదర్శనుఁడును వెంటనే వార్తాహరుల నుజ్జయినికంపి చంద్రప్రభాదేవిని రత్నసేనప్రముఖులగు మంత్రులను రావించెను. అరవిందాదేవి వేగగమనముగల యొంటెలమీఁదఁ బ్రయాణనైపుణిగల పరిజనుల విదర్భకంపి వివాహమునిమిత్తము సకుటుంబసపరివారముగా రాజవాహనుని రమ్మని యాహ్వానమంపెను. అందఱును వివాహమహోత్సవదర్శనార్థము వచ్చిరి. తక్షశిలనుండియు మఱి యితరప్రదేశములనుండియు బౌద్ధభిక్షుక భిక్షుణీజనములు తండోపతండములుగ వచ్చి శ్రీనగరమున విడిసిరి. కామందకి యను బౌద్ధయోగినియు, జినదాసుఁడను బౌద్ధగురువును విజయముచేసి సౌగతధర్మప్రకారము సకలబంధుమిత్ర సమక్షమునఁ గర్పూరమంజరిని మకరందునకిచ్చి వివా

హము చేసిరి. ఆదంపతులంజూచి జయజయ ధ్వనులు సేయనివారు భళీయని ప్రశంసింపనివారు "ఆహా! బ్రహ్మనిర్మాణకౌశల"మ్మనని వారు "దాంపత్యమన నిదే దాంపత్య"మని యననివారు సంతోష మొందనివారు, హర్షసూచకముగఁ జప్పటులు చరువనివారు నచ్చట గుమిగూడిన జనులలో లేరు.

ప్రపంచములో ననుకూల దాంపత్యము కుదురుటయరిదియగుటచే విధాత తుల్యగుణములు, తుల్యరూపములు తుల్యశీలములుఁ గల దంపతులను గూర్చి నేటికాలమునకు లోకనిందబాసెనని జనులు చెప్పుకొనిరి. వివాహము మహావైభవముతో జరిగెను. పేదలకు మృష్టాన్నము లభించెను. పండితులకుఁ బారితోషికములు దొరకెను. భిక్షుకభిక్షుణీజనంబులకుఁ దగు వసనంబు లీయఁబడెను. మకరందుని మనోరథము సిద్ధించెను. కస్తూరిమంజరి కామితము కడముట్టెను.

వివాహానంతరమున సుదర్శనుఁడు విజయసేనుని నిందుమణిని నరవిందాదేవిని విక్రమసేనుని నొడంబఱచి కోడలైన కస్తూరిమంజరిని నుజ్జయినీ పురంబునకుఁ దోడ్కొనిపోయెను. రతీమన్మథులవలె నున్న యాసతీపతులం జూచి యుజ్జయినీపురవాసులు మహానందభరితులై వారిరువుర సమాగమము బహువిధములఁ బ్రశంసించిరి. సుదర్శనుఁడును జంద్రప్రభాదేవియు గుమారుని మాళవరాజ్యమున కభిషిక్తుని జేసి, తాము మందిరము విడిచి యొకవిహారమునం బ్రవేశించి బుద్ధదేవోపదిష్టములయిన ధర్మముల పారాయణము సేయుచుఁ బారమార్థికచింతతో గాలముగడుపఁదొడఁగిరి. మకరందుఁడు సతీసమేతుఁడై ప్రత్యహముఁ దల్లిదండ్రుల సందర్శించి వారిదీవనలఁ బడసి వచ్చి ధర్మమార్గానుసారముగాఁ బ్రజాపాలనము సేయుచుండెను. ప్రతిగ్రామమున నతఁడు చెఱువులు, నూతులు, బావులు త్రొవ్వించెను. పల్లెపల్లెయందు బాలురవిద్యాభివృద్ధికై పాఠశాలలు నెల

కొల్పెను. దుర్గమములగుమార్గములఁ జక్కనిరాచబాటలు నిర్మించెను. విశాలములైన యాబాటల కిరుప్రక్కల సుందరపుష్పములను, మధురఫలంబులను, సీతలచ్ఛాయలను నొసంగు వృక్షములనాటించెను ఎల్లరు ఫలంబుల ననుభవింపవచ్చును. ఎల్లరు పుష్పముల స్వీకరింపవచ్చును. ఎల్లరు నీడల సుఖింపవచ్చును. క్రోసుదూరమున కొక్కచోట బాటసారులు విడియుటకై సత్రములఁ గట్టించెను. రోగులచికిత్సలనిమిత్తము ధర్మవైద్యశాలలు స్థాపించెను. తెగులుగొంట్లగు పసరములకుసైతము నట్టి చికిత్సాశాలలే నిర్మింపఁబడెను. మాంసభక్షణము దేశమందంతట నిషేధింపఁబడెను. జీవహింస యరుదయ్యెను. జంతువులయెడ సహితము నిష్కారుణముగాఁ బ్రవర్తించినవారు రాజదండనలకుఁ బాత్రములైరి. తల్లిదండ్రులయెడ భక్తి గురుజనంబులయెడ గౌరవము క్షుద్రజంతువులయెడ దయ, పరస్త్రీలయెడ సోదరీభావము, వికలాంగులయెడ నిరుపేదలయెడ జాలి, మొదలగు సద్గుణంబులు "యథా రాజా తథా ప్రజా" యనుసామెత నిజముగా రాజునడతనుండి ప్రజలు నేర్చుకొని ధర్మాచరణముచేత రాజుమనస్సు రంజింపఁజేసిరి. మకరందునకుఁ బరరాజులలో శత్రువులు లేకపోయిరి. అజాతశత్రుఁ డనుశబ్దము సరిగాపదునొకండక్షౌహిణులు శత్రువులుగల యుధిష్ఠిరునకుఁ జెల్లినదనియు నిజముగా నమ్మాట మకరందునకే చెల్లుననియు నాకాలపువారందరుఁ జెప్పుకొనుచుండిరి మగధనాయకుని మందిరములందు మకరందునికీర్తియు, ఘూర్జరాధిపునికొలువుకూటంబున మకరందునిప్రశంసయు, శూరసేననృపాలుని శుద్ధాంతములయందు మకరందునిపేరె వెయ్యేల! దేశమం దెల్లెడ నాతనియశోలతలు బ్రాఁకెననుట యతిశయోక్తిగాదు. మకరందుఁడు తనప్రజలలో దండ్రిలేనివారికిఁ దండ్రియై భ్రాతృహీనులకుభ్రాతృఁడై మిత్రులు లేనివారికి మిత్రుఁడై ధనములేనివారికి ధనమై బలములేనివారికి బల

మై "దుర్బలస్య బలం రాజా" యనులోకోక్తని సార్థకము జేసెను. అతఁడు దురాచారులకు దుర్నిరీక్ష్యుఁడై యుత్తముల కుపగమ్యుఁడై, విద్వజ్జనులకు వేలుపుంబెట్టై పేదలపాలిటిపెన్నిధానమై సర్వజనరంజకుఁడై దుష్టజనభంజకుఁడై ప్రజ తనకు శరీరముగాఁ బ్రజా శరీరమునకుఁ దా నాత్మగా, నుండునట్లు మెలంగి ధర్మమార్గమునుండి యించుకేనియుం దొలఁగక, దనచేఁత లితరనేతలకు మార్గదర్శకములుగా మహీపాలనముచేయఁజొచ్చెను. కర్పూరమంజరి సహధర్మచారిణియనుపేరు సార్థకమగునట్లు కాంతలలో నీయింతి మేలుబంతి యని పేరువచ్చునట్లుమహాపతివ్రతలలో నగ్రగణ్యయై యత్తమామలకు విధేయయై బంధువులకుఁ బరమానురక్తయై మహారాజపత్నియయ్యు గరువంబించుకయులేక నెల్లయంగనలకు దర్శనంబిచ్చుచు సాదరంబుగ మాటలాడుచుఁ దల్లిలేనివారికిఁ దల్లియై యాడుబిడ్డలు లేనివారికి బిడ్డయై, గతిలేనివారికి గతియై, జనులప్రేమకు భక్తికిఁ బాత్రమై యుండెను. ఆమె పేదలగు బాలింతరాండ్రకుఁ బథ్యపానంబు లంపును. సూలింతరాండ్రకు సూడిద లంపును. పేదలయాకుటిండ్లకు, గుడిసెలకు సయితము బోయి వారిసుఖదుఃఖముల నరయుచుండును. వారికిఁ గావలసినధనసాహాయ్యము జేయుచుండును. ఆదంపతులు ప్రజలనే బిడ్డలుగా భావించి, వారియానందము తమయానందముగ, వారియభ్యుదయము తమయభ్యుదయముగ వారికష్టములు తమకష్టములుగ వారికలిమి దమకలిమిగ వారిలేమి దమలేమిగ భావించి వారిసుఖమునకై యెల్లప్పుడుఁ బాటుపడు చుండురు.

కర్పూరమంజరికి లోకైకసుందరుఁడగు నొకకుమారుఁడును, జగన్మోహనాకార యగునొకకూఁతురుం గలిగిరి. పాడిదప్పక రాజు పాలించుటం జేసి జనులు పాడిపంటలు గలిగి సిరిసంపదలు గలిగి వర్థిల్లుచుండిరి.

భాగ్యవర్ధనునిమరణానంతరమున విక్రమసేనుఁడు గాంధారమునకుఁగూడ రాజయ్యెను. మహేంద్రదేవునిపరోక్షమున హర్షవర్ధనుఁడు పాంచాలమునకుఁ బ్రభువయ్యెను. మాళవపాంచాల గాంధార, కాశ్మీరదేశంబు లక్కసెల్లెండ్రిట్లు బరస్పరమైత్రి గలిగి సిరులతోఁ దులదూఁగుచుండెను. ఇందుమణియు, విజయసేనుఁడును గర్పూరమంజరీవివాహమైనవెనుక గొన్ని మాసములుదనుక శ్రీనగరమునం దుండి పిమ్మట మకరందుఁ డాహ్వానము సేయ, నుజ్జయినికింబోయి యచ్చటనే నివసించి యుండిరి. విజయసేనుఁడు కాలక్రమంబున మాళవసైన్యంబుల కధిపతియై మేటిదండనాయకుఁడని పేరుపొంది మకరందుని యాదరమునకు భాజనమయ్యెను. అనుకూలవతి యగుకర్పూరమంజరి యిల్లాలుగ భద్రసేనుఁడు మంత్రిగ విజసేనుఁడు దండనాదుఁడుగ ధర్మము మిత్రంబుగ సత్యంబు చుట్టంబుగ మకరందుఁడు జూదమాడి సిరులు గోల్పోవనినలుఁడు చండాలసేవ జేయనిహరిశ్చంద్రుఁడు వేశ్యాలోలుఁడుగాని పురూరవసుఁడు నని ప్రజలు ప్రశంసింపఁ జిరకాలము రాజ్యపాలనము జేసెను.

సమాప్తము.



విష్ణువర్ధనుఁడు



విష్ణువర్ధనుఁడు

రాజమహేంద్రవరము రాజధానిగఁ జేసికొని క్రీస్తుశకము 7 వ శతాబ్దము మొదలు 12 వ శతాబ్దమువరకు మనయాంధ్రదేశమును బాలించిన చాళుక్యవంశపురాజులలో ననేకులకు విష్ణువర్ధనుఁడను బిరుదు గలదు. ఆకాలమునందు మన తెనుఁగుదేశము వేఁగీదేశమని గ్రంథములలోఁ బేర్కొనఁబడుచు వచ్చినది. ప్రస్తుతమేలూరువద్ద నున్న వేఁగి యనుగ్రామము పూర్వ మీదేశమునకు రాజధానిగ నుండెననియు రాజమహేంద్రవర మిటీవ రాజధానియైన దనియు వేఁగి రాజధానిగ నుండుటచేతనే దీనికి వేఁగీదేశ మని పేరు వచ్చిన దనియుఁ గొందఱు చెప్పుచున్నారు. మొదట రాజధాని యేదైనను వేఁగీదేశమునకు రాజమహేంద్రవరము కొంతకాలము రాజధానియై యాంధ్రదేశముఖమునకు మనోహరకస్తూరితిలకమై యాంధ్రమహాభారతజన్మస్థానమై భరతఖండంబునఁ బేరువహించినది. ఈపట్టణ మేలిన రాజులును భాషాభిమానమునకు బలపరాక్రమమునకుఁ బేరుపడి యుండిరి. అందు భారతము నన్నయభట్టారకునిచేఁ గృతినందిన రాజరాజనరేంద్రుఁ డగ్రగణ్యుఁడని చెప్పవచ్చును. ఈతనికి విష్ణువర్ధనుఁడను బిరుదు గలదు. ఈబిరుద మీతని పూర్వులలో ననేకులకుఁ గూడ గలదు. ఆంధ్రదేశపరిపాలకులైనచాళుక్యులకీబిరుద మెట్లుగలిగినదో తెలిసికొనుట యవశ్యము. అట్లు తెలిసికొనుటకొక చిన్నకథ వినవలయు.

మొట్టమొదట నాంధ్రదేశమునకు వచ్చిన చాళుక్యరాజు మహాతేజశ్శాలియై దేశముల నాక్రమించుకొని రాజ్యము సేయుచుండ శత్రురాజులాతని దాడికోర్చి యాతని నెట్లైన దేశమునుండి పారదోలవలయునని ననేకోపాయంబుల నాలోచించిరి. చాళుక్యరాజు బాహుబలసంపన్నుఁ డగుటచే నుర్విరీక్ష్య

ప్రభావంతుఁడై చాలకాలము నిరంకుశప్రభుత్వము నెఱపెను. తేజ
శ్శాలుల కెప్పుడును వైరు లధికముగుట సహజముకదా! చాళుక్యరా
జునకు శత్రుమండలము నానాటి కధికమయ్యెను. చుట్టుపక్కల నున్న
రాజులందఱు గట్టుగట్టి మహాసైన్యములఁ గూర్చుకొని చాళుక్యరా
జుమీఁదికి దండెత్తిరి. అసాధారణభుజబలశాలి యగుచాళుక్యభూ
పాలుఁడు పలుమాఱు లారాజుల వేరువేర రణరంగమునఁ బరాజితులఁ
జేసినవాఁడగుటచేతను, నెంతటెంతలు మేటిమగల నైన గడ్డిపరకలుగఁ
జూచునట్టిస్వభావము గలవాఁడగుటచేతను, తన బాహుబలంబునందును
దన సేనాబలంబునందును మితిమీఱిన విశ్వాసముగలవాఁడగుటచేత
తను జంకు గొంకు లేక వివాహమునకుఁ దరలివెళ్ళిన విధంబున సం
గ్రామరంగమునకుఁ జతురంగబలసమేతుఁడై బ్రాహ్మణాశీర్వాదపు
రస్సరముగ మహావైభవముతోఁ జరిగెను. యుద్ధమునందు జయమునే
ప్రతీక్షించుచుండుటచేత జాళుక్యమహీపాలుఁడు తన విజయంబును
శత్రువుల పరాజయంబును, తన సైన్యంబుల విజృంభణంబును, బగ
వారి పలాయనంబును, తన స్వేచ్ఛాకీర్తిని వైరుల యపకృష్టను, కన్ను
లారఁగాంచి యానందించుటకై చిరకాలమునుండి రణరంగంబులఁ జూడ
వేడుకపడుచున్న తన పట్టమహిషిని బంగారపు హౌదాతో నలంక
రింపబడిన మదపుటేనుగుపై నెక్కించి తోడ్కొని పోదలంచెను. ఆ
మెతోఁ నంతఃపురము వదలి సఖీజనంబులు పరిచారికలు వందలకొల
ది యుద్ధదర్శనకుతూహలముతోఁ రాఁదలంచిరి. అప్పుడు చాళుక్య
రాజుపట్టమహిషి గర్భవతియై యుండెను. ఆచూలాలి కాఱవమాస
ము గడచుచుండెను. చెలికత్తెలు చుట్టములు నీకేమి సూడిదలు కా
వలయునని యడుగ నామె నాకు సూడిదలేమియు నక్కఱలేదని చె
ప్పుచు వచ్చెను. భర్త యామె సన్నిధానమునకరిగి "దేవీ! నీయభీష్ట
మేదో నెఱవేర్చెద. చిరకాలమునకు గర్భవతివైన నీకు నే నియ్యరా

నికోరిక లేదు. సందేహింపక యడుగు" మని వేడికొనియెను. అనవు
డాదేవి యిట్లనియె. "జగద్విఖ్యాతమైన దేవరవారి భుజవీర్యంబు రణ
రంగమున కారుచిచ్చువలె విజృంభించునపుడు నేను స్వయముగ జూడవ
లయు నని చిరకాలమునుండి కుతూహలము గలదు. ఇప్పుడు మీరు
దండయాత్రకు వెడలుచున్నట్లు వింటిని. నన్ను గూడ వెంటబెట్టు
కొని పోవలయు నని ప్రార్థించుచున్నదానను" అనవుడు చాళుక్య
వల్లభుం డగు వల్లభు డిట్లనియె! "దేవీ! నాయభీష్టంబును నియభీష్టం
బును నొక్కటియే యైనది. చిరకాలమునుండి నా సంగ్రామకేళి నీకుం
జూపి నయనోత్సవము గావింప దలంచుచుంటిని. నేనే నిన్ను పిలుచు
కొని పోవలయునని తలంచుచుండ నీవే నన్నడిగితివి. నాకు బరమసం
తోషమయ్యె. రమ్ము." అని యామెను సపరివారముగ బైనచెప్పిన
విధమున యుద్ధమునకు దోడుకొనిపోయెను. ఉభయసైన్యంబులు గ
జరథ తురగ సన్నాహముతో యుద్ధరంగము జేరినవి. రణభేరీ భాం
కరణము లాకాశంబును బీటలువారునట్లు చేయుచుండెను. ఆశబ్దంబు
లకు వృక్షములపై నుండినపక్షులు భయంపడి ప్రాణములు విడిచి నేల
రాలెను. మనుష్యుల చెవులు చిల్లులుపడజొచ్చెను. అన్యోన్యవినాశన
మునకై సైనికు లుత్సాహభరితులై యెదురుచూడజొచ్చిరి. సేనాప
తులు వీరరసప్రధానము లైన పలుకులతో సైనికులం బురికొల్పిరి.
మద్యపానంబునం బరవశు లైనవిధంబున సైనికులువీరరసావిష్టులై మే
నులు మఱచి కోడిపుంజులువలె నెప్పుడు పగతురమీఁద బడుదు మని
యువ్విళులూరుచుండిరి. అప్పుడు సంగ్రామ మారంభమయ్యెను. చిత్త
జల్లువలె బాణవర్షంబు గురిసెను. ప్రాణంబులు విడుచువారు గాయం
బులు తగిలి నేలంగూలి యమ్మా నాయనా బాధకోర్వజాల దాహ
ము దాహము మంచినీళ్ళు మంచినీళ్ళని యఱచుచు దమ నెత్తురు
లో దామె పొరలాడువారు పీనుగులం దలగడలుగ జేసికొని కొం

చెముసేపు విశ్రమించువారు ప్రాణము పూర్తిగాబోవని యోధుల పైనుండి రోషావేశమున విస విస నడచువారు. గుఱిజూచి యమ్ముల నేయువారు. పగవారి యేటుల నొడుపునం దప్పించుకొనువారు. పలాయితులగువారు. పిరికితనంబున నేనుంగులయు గుఱ్ఱంబులయు చాటున దాగువారునై యుభయబలంబుల సైనికులు బహువిధంబుల వర్తింపజొచ్చిరి.

చాళుక్యరాజు సైన్యము మొట్టమొదట జయమునొందునట్లు కనబడెను. కాని, దైవయోగమున నది తలక్రిందయ్యెను. శత్రుసైన్యముల ధాటి కోడి చాళుక్యబలములు వెన్నిచ్చి పారజొచ్చెను. యుద్ధభూమి పీనుగుల పెంటయయ్యె. రణరంగమున శత్రువులకు వెన్నిచ్చి పఱచి ప్రాణముల రక్షించుటకంటె ప్రాణములున్నంతవరకు బోరాడి శౌర్యము నెఱపి శరీరము విడుచుట కర్తవ్యమని తలంచి చాళుక్యరాజు తన యేనుంగును గదలనీయక శత్రురాజుల కభిముఖుండై పోర జొచ్చెను. అఖండ రాజభక్తిగల సేనాపతులు కొందఱు చాళుక్యరాజును సమీపించి యుద్ధరంగమునుండి తొలగి ప్రాణరక్షణము చేసికొనవలసిన దని హితోపదేశము చేసిరి. అతఁడు వారిమాటలను పెడచెవిని బెట్టెను. పారిపోవుచున్న సైనికులఁ బురికొల్పి కొందఱు సేనాధిపతులు మరల దోడ్కొనివచ్చిరి. అప్పుడు కడసారి సంకుల సమరమయ్యెను. చాళుక్యరాజుపై శత్రురాజు లయిదుగురు నిరంతరాయము లగు వర్షధారల బాణపరంపర లేయజొచ్చిరి. చాళుక్యుఁడు వాటినన్నిటిని నఱకివేయుచు జగదద్భుతముగా జాలవఱకు బోరాడెను. ఎట్టకేలకు పరిశ్రాంతుఁడై యున్న సమయమున శత్రురాజుల బాణమొకటి కంఠంబునం దగిలె. బొటబొట నెత్తురు కంఠమునుండి బ్రవహించె. కనుదమ్ములు మూతవడియె. చేతినుండి విల్లు జాఱి నేలబడియె. అంబారిలోనే రాజు మృతినొందెను. పటుపుటే

నుగు తన యజమానుని పీనుగుం దోడ్కొని యుద్ధరంగమునుండి పా
రిపోయెను. సైనికులు పటాపంచలైరి. సేనాధిపతులు వెన్నిచ్చి పరు
గెత్తిరి. శత్రువులు సింహనాదము చేసిరి. పలాయనము సేయు చాళు
క్యబలములను పగవారు లేళ్ళను వేటాడినట్లు తరిమి చంపిరి. యుద్ధ
భూమి మృత్యుదేవతయొక్క భోజనశాల యయ్యెను. చాళుక్యరా
జాంతఃపురస్త్రీల యాక్రందనధ్వనులు మిన్నుముట్టెను. సైనికులు
తమ సంరక్షణమునే గాని దేవీసంరక్షణము మఱచిరి. అప్పుడు ప్రధా
నమంత్రి రాజపత్ని యున్నకడ కరిగి మేటియోధులవంటి భటులను
పదిమందిని జేర బిలిచి యిట్లనియె. "యోధులారా! మనపాలిటి
కల్పవృక్షమని చెప్పదగిన మహారాజు మనభాగ్యలోపమున బ్రజల
యదృష్టలోపమున దైవానుగ్రహలోపమున రణరంగమునందు మృ
తినొందెను. మన మిప్పుడు తలిదండ్రులు లేని బిడ్డల మైతిమి. మనకును
సమస్తప్రజలకును నిశ్చయముగ నీమహారాజె తల్లియె తండ్రియె సో
దరుఁడై యెల్లచుట్టమునై యెల్లవిధముల గాపాడెగదా! తల్లిదండ్రులు
మనలం గనుట మాత్రమేగాని తక్కినపని చేయజాలరైరి. సంరక్షణ
మంతయు నీమహారాజే గావించెను. ఆయన శౌర్యనిధానమై జగదే
కవీరుఁడై తనయశశ్చంద్రికలు దిగంతముల వ్యాపించునట్లు తన నామ
ధేయ మాచంద్రసంస్థాయి యైయుండునట్లు ముక్కున నూపిరియుం
డునంత కాలము పోరాడి చచ్చియుం బ్రతికినవాఁడై వీరస్వర్గముం
జూరగొనియె. భారతయుద్ధమందు మృతినొందిన యభిమన్యాదిమ
హాశూరుల కేగతులు గలుగు నీతనికిగూడ నట్టిగతులు గలుగు. ఆమ
హాత్ముఁ డంత తేజోరాశియై గ్రీష్మకాల సూర్యమండలమువలెవెలిగి
వెలిగి శాత్రవుల పరిపరివిధంబుల తపింపజేసి యెట్టకేలకు గాలవశం
బున నస్తమించె. జంతువులకెల్ల మరణ మొకనాటికైన దప్పదుగదా!
ఆమహారాజుకీర్తి ధ్వజమును నేలపై నిలిపిపరలోకంబునకుం జనియె.

మనమో నీచులమై రాజభక్తిహీనులమై దేశద్రోహులమై యాత్మ
ద్రోహులమై రాజద్రోహులమై ధర్మద్రోహులమై క్షణభంగురము
లై వినశ్వరములగు నీ యాపాంచభౌతికశరీరముల రక్షించుకొనుటకై స్వా
మిని విడిచి యుద్ధరంగమును విడిచి మృత్యువునకు జంకి యీవిధము
న పలాయితులమైతిమి మన సిగ్గుయే చాలును. ఇంతకంటె శిరచ్ఛే
ద మక్కఱలేదు. శిర మున్నను మెడమీఁద లేదు. యుద్ధమునందు
శత్రుశస్త్రములచే శిరములు తెగి పడియున్న యోధులకు శిరములు
లేకున్నను యశశ్శరీరములతో నిలుపఁబడిన శిరము లున్నట్లే భావిం
పవలెను. [illegible] వంటి కన్నులుగల మనశి
రస్సులతో నేమి ప్రయోజనము? కోలుపెత్తులవంటి మన దేహము
లతో నేమి ప్రయోజనము? స్వామిని సంరక్షించితిమా! దేశము
ను కాపాడితిమా! స్వామి నిమిత్తమై యీశరీర మిచ్చితిమా! మన
శరీరములే భూమికి భారములు. మనతలలు మన శరీరములకు
భారములు. నిరర్థకులమై తల్లి కడుపుచెడ బుట్టితిమి.
కులంబున కపకీర్తి దెచ్చితిమి. అటువంటి భువనైకవంద్యుఁడగు మ
హారాజును [illegible] మొండితనముతో బ్రతుకు
చుంటిమిగాని యశఃకాయు లెవ్వరును జీవింపగలరు. రాజభక్తు డెవ్వడు
రణరంగమును విడువగలఁడు. మనవంటివారి జన్మముచే దేశ మపవిత్ర
మైనది. ఎన్నఁటికైన భరింపఁగలదుగాని భూదేవి చిరకాలము రాజు
సొమ్ము తిని సమయమునకు వచ్చినప్పుడు వానికొఱకు నిలిచి పోరలేక
పఱచిపోవునట్టి వారిని భరింప జాలదు. మనము స్వామిఋ
ణము దీర్పలేనివారమైతిమి. కాని యిప్పుడు విచారించిన కార్యములేదు.
ఉపాయముల నన్వేషించుటకు సమయము లేదు. మన కొక్క కర్త
వ్యము గలదు. అది చేసి యైన మన జన్మములు ధన్యములు చేసికొం
దము; అది యేమందు రేని దేవిసంరక్షణమె మనకు ప్రధమకర్తవ్య
ము. ఆమె గర్భవతి యైయున్నది. ఆరవమాసము నడచుచున్నదట.

మెను సంరక్షించితిమా మహాతేజశ్శాలి యగుకుమారు డామె గర్భ
మున జనింపగలడు. చాళుక్య వంశము నిలుచును. రాజ్యము మరల
స్వాధీన మగును. ఆంధ్రదేశము మరల రాజన్వతియగును. పృథివి
కలంకారము కలుగును. ఇప్పుడు మన మందఱము దేవికడకు బోయి
యామె నోదార్చి యామె నెక్కుడైన సురక్షిత స్థానమునకుం
గొంపోవుదము. ఈసత్కార్యముచేత మనము చేసిన రాజద్రోహపాప
ము కొంతవఱకు కడంగును." అని సుబుద్ధి పలుక నాయోధు లందఱు
బాష్పపూరితనేత్రులై "సరే యటులు చేయుదము" అని యైకకంఠ్యముగ
బలికిరి.

చాళుక్యభూపాలుఁడు శత్రురాజుల క్రోధాగ్ని కాహుతియై
యేఁగఁగ మిగిన సైన్యాలోఁబడి పాఱెను. విజయసేనుఁడనే యామహా
రాజుపట్టపుటేనుఁగు మావటీఁడు రాజునాయకుని దుస్స్థితి నెఱింగి దేవి
కడకుం దీసికొనిపోవుటకై కదలించెను. కాని యాయేనుఁగునకుఁ జిరకాల
శత్రువగు కటకరాజు దాని గాంచి యొక సైనికుని వెంటనే రెం డమ్ము
లేసి మావటివానిని వధియించి గజంబును బోవనీక నిరోధించెను. ఆ
మదగజంబు తనయేలిక దుస్స్థితి నెఱింగియో కాక తనవాని నడ్డగించుట
చేతనో మహాకోపావిష్టమై భయంకరంబుగ ఘీంకారంబులు సేయుచు
తొండమెత్తి యడ్డమువచ్చిన జనంబులనెల్ల గుభాలు గుభాలున నేలఁ
బడునట్లు మోదుచుఁ గొందఱం గాళ్ళక్రిందవైచి చదురి తుండాగ్రం
బునఁ గొందఱనెత్తి నేలవైచికొట్టి సర్వజనభయంకరమై విహరించెను.
కటకరాజు దానియెట్టయెదుట నిలువనోపక వెనకప్రక్కనుంజని
యేనుంగుల నిరోధించుటలో మెలఁకువగల నేటకాండ్రఁ గొందర
బిలచి దాని వెనుకకాళ్ళకు సంకెళ్ళువేయుఁడని యాజ్ఞాపించెను. ప్రశ
స్యకాలదర్శులైన కాపరులు శిక్షణమునందు పేర్మిగన్న యామదపుటేనుఁగు
దరికైన వారరుగంగనేరక నలుదెసల నిలిచి యెల్లదెసలనుండి దాని

పై బాణవర్షంబు గురిపించి యామహాసత్త్వంబును నేలంగూల్చిరి. క్షణకాలంబున నదియు వీరస్వర్గంబున కరుగుచున్న యజమానుని మార్గమధ్యంబుః మోచుటకు వాహనంబులు లేవోయను భయంబున వెంటనరిగినదోయన్నట్లు మేనువిడిచె. అప్పుడు కటకేశ్వరుండు గజంబుపైనున్న బంగరుహౌదా విప్పించి యందున్న చాళుక్యరాజు కళేబరంబును నేలబడవేయించి నవరత్నంబులు చెక్కిన యాయంబారిని దన శిబిరంబునకుఁ బంపించెను. రక్తసిక్తమయిన శరీరముతో మహాసమరోత్సాహమును సూచించు మొగముతో, పిడికిటం బిగిసికొనిపోయిన విల్లుతో నస్తమించుచున్న చంద్రమండలమువలెనున్న కళలతో నేలంబడియున్న యాచాళుక్య కులసింహముం జూచి కటకరాజుదక్క తక్కిన శత్రురాజులు కన్నులనీరువెట్టుకొని లోలోపల విషాదమొందిరి. ఆవైరిరాజులలో నప్పుడొకఁడు కటకేశ్వరునితో నిట్లనియె. "రాజేంద్రా! చూడుము. ఈతండు నిద్రవోవుచున్నట్లున్నాఁడుగాని మృతినొందియున్నట్లు కనఁబడుచుండుటలేదు. మొగము కళాహీనముకాలేదు. నీబాణంబు నొవ్వఁదగిలి నప్పుడు హుమ్మని యాతఁడుంకించి యౌడుగఱచెను గాఁబోలు. ఇప్పటికిని క్రిందిపెదవికి దంతము లంటుకొని యున్నవి చూడు. కుడిచేతిపిడికిట నారియు నెడమచేతి పిడికిట విల్లును బిగిసికొనిపోయి యున్నవి చూడుము! క్షత్రియజన్మ మెత్తినందుకు మహాశూరుల కుచితమగుమరణము నొందెను. ఎత్తినవిల్లు చేతనెత్తినట్లుండఁగానె విడచెడు బాణంబులు విడుచునట్లుండఁగానె తగిలెడు బాణంబులు తగులుచుండగానె స్రవించెడు రక్తము స్రవించుచుండఁగానె మరణంబు నొందుటకంటె క్షత్రియకులప్రభూతుడగుమనుష్యున కపేక్షణీయ మింకనేమున్నది? "యశోవా మృత్యుర్వా" యశముగాని మృత్యువుగాని లభింపవలెనని పెద్దలు చెప్పుదురు. ఈతనికి రెండుం జేకూరినవి. ఈతని జన్మకారణమున

నీతనితల్లి వీరమాత యైనది. ఈతనిశౌర్యకారణమున భార్య వీర పత్ని యైనది. వంశము వీరవంశ మైనది. ఈతఁడు చచ్చినను బ్రదికి యున్నాఁడు. ఈతనితోఁ బోరుట మనకు గౌరవము సుమా!" యని మఱియు నింకేదియో చెప్పఁబోవుచుండ కటకేశ్వరుఁడు వానిమాట కడ్డువచ్చి యేమిది బట్టువానివలెఁ బొగడుచున్నావు. పగవానిం బొగ డుటకు నీకు సిగ్గైనను లేదా! నాలుక యెట్లువచ్చుచున్నది. అందఱి కంటె నతఁడేమిపౌరుషముఁజూపె. ఈతనికంటె నెక్కుడుపరాక్రమము సూపి వేనవేలు విక్రమశాలురు రణరంగమునఁ బడియున్నారు. అట్లు చచ్చినవారిలో వీఁడొకఁడు. అందఱియోధుల తల్లులు వీరమాతలె. అందఱిభార్యలు వీరపత్నులె. అందఱికన్న వీఁడెక్కువపొడిచి వేసిన దేమి లేదు. ఇతనితోఁ బోరాడుట నీకు గౌరవమేమోకాని నాకు గౌరవముకాదు. నాకును వీనికిని హస్తిమశకాంతరముకలదు, నాదర్ప మునకు నాశీలికి నాయౌన్నత్యమునకు వీనితోఁ బోరుట మిక్కిలి యగౌరవము. నాతోఁబోరుట వానికిగౌరవము. ఈనీచుఁడు నేఁటికాల మునకు నాకన్నులు చల్లగా సపరివారముగా నేలంగూలినాఁడు. ఇప్పు డు గదా నాకు కంటినిండ నిదుర. ఇప్పుడుగదా నాకు మనసునిండ తృప్తి. ఇప్పుడుగదా నాకు హృదయమునిండ సంతోషము. ఇప్పుడు గదా నామార్గము నిష్కంటకమైనది. ఇప్పుడుగదా నేను సుఖముగ భుజియింపఁగల్గుట. నేఁడుగదా నామనోరథము నెరవేరినది. ఇంక నే ధన్యుఁడనైతినని ధృతినొందిన యారాజుం బహువిధముల దూషిం చెను. అప్పుడు మిత్రమండలిలోనున్న మఱియొకరాజు కటకేశ్వరునిం జూచి "దేవా! యీతని కగ్నిసంస్కారము సేయించు టుచితము. సత్వరము సేవకున కాజ్ఞాపింపు" డని పలికెను. అదివిని కటకేశ్వరుఁడు కోపంబునఁ బండ్లు కొరుకుచు నాతని కిట్లనియె. ఏమీ! యీతనికు

నకా యగ్నిసంస్కారము? అగ్నిసంస్కారముచేయించెద. కానివీనికిఁ గాదు. వీనిరాజధానికగ్నిసంస్కారము చేయించెద. వీఁడుపాలించిన గ్రామమున కగ్నిసంస్కారముచేయించెద. వీనిబంధుకోటికి బ్రదికి యుండగనే యగ్నిసంస్కారము చేయించెద. ఈదురాత్మునకా యగ్ని సంస్కారము? చూడునాప్రతిజ్ఞ. ఈతండుపరిపాలించిన యాంధ్రదేశ మంతయు బస్మపటలము గావించెద. ఈతనిశవము నుగ్రద్దలు రాబందులు కాకులు పొడుచుకొని తినవలయునేగాని శాస్త్రయుక్తమైన యగ్నిసంస్కారము దానికిం జరుగఁగూడదు. ఈఁతడుపాలించిన గ్రామంబులన్నియుఁగొల్లగొని పరశురామప్రీతిచేయవలయు. ఈఁతఁడు కాపురమున్న మేడలు మిద్దెలు నేలఁగూల్చి యానేలయెల్ల దున్నించి జిల్లేడు నేపాళము నాటింపవలెను. ఇంతియెకాదు. ఈతనిభార్య నిండు చూలాలై యున్నదని వినియున్నాఁడను. ఆమె యెక్కడనున్నదో వెదకి పట్టుకొని చెఱసాలంబెట్టి ప్రసవించినతరువాత కూఁతుపుట్టెనేని దానింబెంచి యొకనీచునకిచ్చి పెండ్లిచేసెద. కొడుకుపుట్టెనేని తత్క్షణమే నిర్భాగ్యుఁడగు నాయర్భకుని నేనుస్వయముగా నాఖడ్గంబున కెరజేసెద. రెండవకంసుఁడనుపేరు సంపాదించెద. అప్పుడుకాని నామనస్తాపముతీరదు. నాకోర్ధాగ్ని యారాజురక్తధారలచే మూఁడువంతులు చల్లారినవి. ఆశిశువుయొక్క నెత్తురుబొట్లచే సంపూర్ణముగఁ జల్లారును. చాళుక్యవంశము భూమండలంబున నుండఁగూడదు. చాళుక్యవంశమే కాదు. చాళుక్యవంశసంబంధమైన పురుగైన లోకంబుననుండరాదు. అశ్వత్థామ జగము నిష్పాండవము చేయఁదలఁచి కృతార్థుఁడుగా లేకపోయెను. నేనులోకము నిశ్చాళుక్యముచేసి కృతకృత్యుఁడ నయ్యెద.

అని కటకేశ్వరుఁడు రాక్షసోచితము లగువచనములు బలుక నాతనితో నున్న చాళుక్యరాజశత్రువులు మహాశ్చర్యరసనిమగ్నులై

తెల్లబోయి చూచుచుండిరి. అంతఁ దొకఁడు కటకేశ్వరునితో ధైర్యముతో నిట్లనియె. "మహారాజా! వైరములు మరణాంతములై యుండవలెను. రావణుఁడు రఘురామునిచేత రణరంగమున నిహతుఁడైనవెనుక విభీషణుఁడు తన యన్న దురాత్ముఁ డగుటచేత వానికిఁ దా నగ్నిసంస్కారములు చేయఁగూడ దని వాదించెను. అప్పుడు రాముఁడు విభీషణుని మందలించి 'మరణాంతాని వైరాణి' యని ధర్మోపదేశము చేసి విభీషణునిచే దశకంఠునకు నుత్తరక్రియలు చేయించెను. రాముని యుపదేశము విభీషణున కొక్కనికే కాదు. ఆ యుపదేశము శత్రుమరణానంతరమున వైరమును వహించు మానవకోటి కెల్ల నుద్దేశింపఁ బడినది. చాళుక్యరాజు మనచే నిహతుఁడయ్యె. అతఁడు మన కింక క్రోధస్థానము కాదు. అతని శవము గ్రద్దలు పీకినను, కాకులు పొడిచినను, నక్కలు ముక్కలుగఁ జేసి మెక్కినను, క్రిమికీటకంబులు పొడిచి తినినను, దానియందలి బాధగాని యవమానముగాని యాతఁ డనుభవింపఁ జాలఁడు. శవము నవమానించుట రాతి నవమానించుట. కొయ్య నవమానించుట. ఆ యవమానము కర్తదికాని భోక్తది కాదు. ఇట్లు చేయుటచే మనలను మనమే యవమానించుకొనుచున్నాము. మనచేతి నెంతయధికార మున్నను మన బాహువులయం దెంతబల మున్నను మన మనంబున నెంత గర్వ మున్నను మనమాట కెంతచెల్లుబడి యున్నను మనము లోకసమ్మతము లగు కార్యములను జేసినంతవఱకే జనానురాగము మనపై నిలుచును గాని లోకవిరుద్ధములై యసహ్యములై యనార్యములైన దుండగములను మనము చేయుదుమేని జనులకు మనపై నేవ పుట్టక పోదు. మన కనకసింహాసనంబులు మన రత్నకిరీటంబులు వారి యంతరంగంబులందలి యభిప్రాయంబుల మార్పఁజాలవు. మన యస్త్రశస్త్రంబులను మన చతురంగబలంబులను జూచి భయపడు లోకులు

భళాభళీ యని మన పనులను పైకి మెచ్చిననను లోలోపల నీచకార్యకర్తలను వారు నిందింపకపోరు. కావున, మహాపరితాపము జూపి క్షత్రియోచిత మైనమరణము నొంది రణరంగశాయియైనయీచాళుక్యవంశాలంకారునకు నిజపౌరుషానురూప మైన గౌరవంబు సేయకపోయిన మానె, అధమాధముల కైన నవలీలగా నలవడు నగ్నిసంస్కారమైనఁ జేయించుట యుత్తమము. అదియునుఁగాక యీమహారాజు భార్యను వెదకి పట్టితెచ్చి గర్భవతి యైనయీకాంత పురుషశిశువును బ్రసవించెదుపక్షమున నాతని మీచేతులతో మీరు స్వయముగా మృతినొందింపఁ బ్రతిజ్ఞ చేసితిరి. ఇది యేటినీతి? యెట్టిధర్మము? ఏమి రాచపాడి? అసూర్యంపశ్య యగుశుద్ధాంతకాంత యాతని యిల్లాలు. ఆదేవి మహాపతివ్రత యనియు లోకోత్తరగుణరత్నభూషిత యనియు సంగనలకు మేలుబంతి యనియు నేను వినియున్నాఁడను. ఆపరమసాధ్వి మన కేమియపకారము చేసినది? ఆమెకు మనము కలిగించిన భర్తృవియోగమే చాలును. పుత్రశోకము కూడ గల్గింపవలయునా? అప్పుడు పుట్టిన పసివాఁడు మన కేమియపకారము చేయఁగలఁడు? లావు మగంటిమి గల శూరులు తమవలె నాయుధపాణు లైనశూరులతో ధర్మయుద్ధము చేసి గెలిచి సామ్రాజ్యసంపాదనము చేయనోపుదురుకాని, మాతృగర్భము నప్పుడే వెడలి గ్రుక్కెడుపా లైనసరిగఁ ద్రాగక కనులైనసరిగఁ దెరువక మంత్రసాని చేతులలో నేయుండి కావు కావు మని యఱచుచున్న నిర్భాగ్యుఁ డగునర్భకుని దుర్భరక్రోధంబున నేలపాలుసేయుట యేమిపౌరుషము? రాచపుట్టువు పుట్టి మన మిదివరకు చేసిన ఘోరకృత్యములే చాలును. వేయిజన్మములకైన నట్టి పాతకముల ఫలంబు మన మనుభవించుచుందుము. శిశుహత్యలు స్త్రీహత్యలు కూడ చేయవలయునా? భాగవత మేలచదివితివి? రామాయణ మేలవింటివి? వేదవ్యాసుఁడు భారత మేలరచియించె?

వాల్మీకి రామాయణ మేలశ్రీమపనీ భూర్జపత్రములపై లిఖించె? నీకు
ను నాకును నువంటి పాపాత్ములకును ధర్మోపదేశములు చేయుటకే
సుమా! శ్రీకృష్ణుని కీర్తివంటి కీర్తి సంపాదించుట దుర్లభముగాని కం
సుని దుర్యశమువంటి దుర్యశము సంపాదించుట సులభము. రాము
ననుసరించుట కష్టముకాని రావణు ననుసరించుట చేతిలోనిపని. స
త్కీర్తి బహుప్రయత్న సాధ్యము. చెడ్డపేరు క్షణమాత్రసాధ్యము.
అందుచేత నో కటకరాజా! నీవు తలపెట్టిన కార్యంబులు నీవిజయ
లక్ష్మీముఖంబునకు కళంకములై, నీకీర్తికి మచ్చలై, నరకలో
కమునకుం గొంపోవు సోపానములై యుండును.
కావున వానినుండి తొలంగుము. అని తనతోడిరాజు పర
మార్థగర్భిత మైనయుపదేశము చేయ నాకటకేశ్వరుండు మహాకో
పోద్దీపితుండై పండ్లు గొఱుకుచుం గన్బొమలు ముడివడ హుంకరించి
“చాలు మీయుపదేశంబులు చాలు. సామంతరాజులకు మితిమీరిన
చనువు లిచ్చినఫలంబు నాకిప్పుడు కానంబడుచున్నది. ఈయుపదేశంబు
లు సేయుమని మిమ్మెవ్వరడిగిరి? సింగపుంజూలు నూడం బెరకుటకై
యత్నింపకుండు. పెద్దపులినోట చేతులుం బెట్టకుండు. మీయుపదేశంబు
లు విన్నపక్షమున మగటిమిం బోంగొట్టుకొని తేజోవిహీనుల మై
వ్యాస వాల్మీకులవలె ముక్కు మూసికొని యుండవలెను. మాకంత
వైరాగ్య ముదయింపలేదు. భోగులముగాని జోగులము కాము.
ఉప్పు పులుసు కారము తినుచున్నంతవఱకుం బ్రతిమనుష్యుండు కామ
క్రోధ లోభ మోహ మదమాత్సర్యంబులకుం బాల్పడక మానండు. ఋ
ణశేషము వ్రణశేషము శత్రుశేషము నుండనియ్యంగూడదని యా
ర్యులు వక్కాణింతురు. అది రాజనీతి. పూర్వులు పోయిన పుంత.
శుక్రుండు చెప్పినధర్మసూక్ష్మము. చేతఖడ్గము దాల్చుచున్నాముగాని
దండము ధరించుట లేదు. భూపతులముగాని యతులము కాము.

ప్రమదావనముల నాసించు చున్నాము కాని వనముల నాసించుట లేదు. మనస్సు లహంకారపూరితము లైనవికాని యోంకారపూరితములు కాలేదు. సింహాసనముల మీఁదనేగాని బుద్ధి దర్భాసనముల మీఁద లేదు. మీరపకీర్తిగా నెంచునది మాకు కీర్తి. మీరు క్రౌర్యముగా నెంచునది మాకు శౌర్యము. మీయుపదేశంబులు మాచెవుల కెక్కవు. మాధారిని మమ్ముఁబోనిండు. మీకిష్ట మగునేని నాతో నుండుఁడు. లేదేని మీబలంబులం దీసికొని మీయిచ్చవచ్చినట్లు బొంము. చాళుక్యున కగ్నిసంస్కారంబు నేను జేయింపనొల్ల. ఆతని యిల్లాలిని విడువనొల్ల నాతని పుత్రుని రక్షింప నొల్ల. మీచేత నైనయెడల మీరామెతోఁ జేరి యామెను గాపాడుఁడు." అనిమిక్కిలి కఠినముగాఁ బలికెను. ఆమాటకు మనసు నొచ్చి యాతనితో మరల మాటలాడనొల్లక యుద్ధభూమి విడిచి యారాజు తన శిబిరమునకుం జనియెను. అప్పుడు కటకేశ్వరుఁడు తన వేగులవాండ్ర నిద్దఱను బిలచి చాళుక్యరాజు పట్టపుదేవి యెక్కడ నున్నదో కనుఁగొని రండు సత్వరము రాకపోయితి రేని నారింజపండులట్లు మీశరీరము లొలిపించెద. మీ శిరంబులు కోట కొమ్మలకుం గట్టించెద నని భీకరస్వరముతో నాజ్ఞాపించెను. అనవుడు వారు చేతులు జోడించి "దేవా! ఆమెవార్తం దెలిసికొని జాములో వచ్చెదము. మగని ప్రతాపము కన్నులారఁ గన నాయమ్మ యుద్ధభూమికె వచ్చియున్న దని వినియున్నా" మని మనవిచేసికొనిరి. "ఓహో! మగని ప్రతాపముజూడవచ్చినదా! సరిగాఁజూచినది కద? ఎటనున్నదో కనుఁగొని వేగరండు" అని వారిం బంపి యారాజు తన గుడారమునకుం జనియెను.

అంతకుమున్నె చాళుక్యభూపాలుని ప్రధాన మంత్రియు హతశేషు లగుకొందఱు సైనికులుమంత్రిపలుకులుచేఁ బ్రేరితులై తమ రాణిని దర్శింపఁబోయిరి. మంత్రి వచ్చియున్నాఁడని పరిచారికలు

రాణితో మనవిజేసిరి. రాణి బాష్పాకులితనేత్రయై గద్గదస్వరముతో నాతనింజూచి "అయ్యా! మహారాజుగారితోఁగలిసి రాక నీవొక్కఁడ వేలవచ్చితివి? ఏదీ మాపాలిటి పారిజాతవృక్షము? కూలిపోయినదా? ఏదీ నాచింతామణిరత్నము? శత్రురాజు లపహరించిరా? ఏఁడి చాళుక్యవంశాలంకారుఁడు? ఏఁడి లోకైకమహావీరుఁడు? ఏడీ నాకన్నులచందమామ? అయ్యో! యూరకుందువేమి? మీ మహారాజు మృతినొందెనా? మీయేలిక వీరస్వర్గమలంకరించెనా? హా! పాత్రేశ్వరా! రణరంగంబున మీవిక్రమంబు వీక్షింప వచ్చిన నన్ను ఘోరశత్రుమధ్యంబున నేకాకిం జేసి విడిచిపోవఁదగునా? నాతోఁ జెప్పక నన్ను వెంటఁదీసికొనిపోక మీరేకతంబ చనినమాత్రమున నేను రాఁజాలననుకొంటిరా? ఒక్కజాములో మీవెంటవచ్చెద. అగ్నిజ్వాల లనెడు మహావేగవంతంబు లగు గుఱ్ఱంబులం బూన్చిన చితి యను రథంబెక్కి నగముదారిలో మిమ్ము నేనుగలుసుకొందు నను ధైర్యము నాకుఁగలదు. మంత్రీ, చిరకాలము నీవు మహారాజును సేవించితివి. ఎల్లకార్యములయందాయనకు తోడునీడవై కుడిభుజంబవై నాలుకవై నేత్రమవై యుంటివి. సకలోపచారంబులు చేసితివి. అగ్నిసాక్షికముగా మాయిరువురకును వివాహసంస్కారంబు చేయించితివి. ఇప్పుడు రాజకళేబరమునకగ్ని సంస్కారంబు జేయింపుము. నేనును రాజకాంతల కుచిత మగుమార్గ మవలంబించెద. యుద్ధసమయమున సమితము తన్ను నేనెడబాసి యుండఁగూడదని కదా మీరాజునన్నిటకుం దోడ్కొనివచ్చె. నావియోగ మొకక్షణమైన సహింపఁజాలని యామహారాజునకు నాకు నెడబాపు సేయుట మీకుధర్మము కాదు. మీమహారాజు నిజకులోచితమైనమరణంబు నొందె. మీరాణికూడ మహాపతివ్రతోచితమైనధర్మమనుసరించు నట్లనుగ్రహింపుము. నేనుతండ్రిలేనిదానను. నీవు నాకుఁ దండ్రివి. బిడ్డకు మేలెట్లోయట్లు చేయుము." అని నవవైధవ్యదుః

ఖముచే పరిపరివిధంబులఁ బలవించి చేతులుజోడించి నమస్కరించెను ఆమె విలాపమును దీనాలాపమును వినియెల్లవారలు మాటలాడఁజాలక నొక్కమొగిని కనులనుండి బాష్పధారలు విడుచుచుండిరి. అమాత్యుఁడుఁగూడ కొంతసేపుసల్లయుండి ధైర్యఖడ్గముచే దట్టముగఁగ్రిమ్మిన దుఃఖారణ్యమును ఛేదించి రాణికిట్లనియె. "అమ్మా! వీరపత్నివైనందుకు వీరపుత్రివైనందుకు మహాపతివ్రతల కుచితము లైనపలుకులు పలుకుచుంటివి. కాని సమయోచితముగఁ బలుకుటలేదు. దుఃఖముచేతఁబరవశత్వమునొంది మాటలాడుచుంటివి. నవవైధవ్యదుఃఖ మెంతకుఁ జాలదు. నీవు నిండుచూలాల వన్నమాట మరచిపోయితివి. అంతర్వత్నులు సహగమనము చేయఁగూడ దని ధర్మశాస్త్రములు నొక్కి చెప్పుచున్నవి. చాళుక్యతేజము నీగర్భమం దున్నది. వంశప్రదీపకుఁడైననందనుఁడుదయింపగలఁడు. దుఃఖార్ణవమగ్న మగు రాజవంశము నతఁడుద్ధరింపఁగలఁడు. శత్రుకంటకములతో నిండిన నీవసుంధర నతఁడునిష్కంటకము చేయఁగలఁడు. పితృమరణంబునకుఁబ్రతిక్రియ సేయఁగలండు. అట్టి పుత్రుని గర్భమునం దిడుకొని నీవు సహగమనము చేయనగునా? శోకభరంబుచేత గ్రుంగి యిట్లనుచున్నదావవు. కావున నోతల్లీ! నీయుద్యమ ముపసంహరింపుము. బిడ్డలమైన మామాట మన్నింపుము. నీవు నాకన్న జిన్నదానవైనను రాజపత్నివగుటచేత మాతృసమానవు గావున చేతులు మోడ్చి నీకు నమస్కరించుచున్నవాఁడను. ఇది సాహసంబునకు సమయముకాదు. శత్రురాజు కడుక్రూరుఁడు. మనది పరాజయము నొందినపక్షము. మనమిక్కడ నిలువఁగూడదు. కటకేశ్వరుఁడు భయంకర ప్రతిజ్ఞలఁ జేయుచున్నాఁ డని యిప్పుడే వేగులవాండ్రు నాతోఁ జెప్పిరి. మనమిప్పుడు రాజధాని కరుగుటకు వీలులేదు. ప్రచ్ఛన్నులమయి యేపల్లెయందో కొంతకాలము గడుపవలయు. మాయుపదేశములకు వ్యతిరేకముగా

వర్తింపవలదని మరల నమస్కరించుచున్నాఁడను." అనవుడు రాణి యిట్లనియె. "అయ్యా! నీవెంతవెఱ్ఱివాఁడవు. ఆకాశముమీఁద నున్న మేఘమును జూచి ప్రచండగ్రీష్మతాప మడఁగిపోవు నని యాసపడుచున్నాఁడవు. అయినను గర్భవతులు భర్తృమార్గ మనుసరింపరా దని నీవుశాసించుటచే నీయాజ్ఞ శిరసావహించి నీవు చెప్పినచొప్పున వర్తించుదానను. నేనిప్పు డెచ్చట తల దాచికొందును? దిక్కులేనిదాని నెవ రాదరింతురు? గృహస్థులు నన్ను తమయింటఁ జేర్చుకొనుట చెరగున నగ్నిహోత్రము మూటగట్టుకొనుటగాదా! ఆహా! యెంతలో నాయవస్థ మారినది. అఖండసామ్రాజ్య మేలిన మహారాజుభార్యకు నిలువ నీడ లేదు. రాజులయవస్థ లెప్పుడు నిట్టివేకదా! మహోన్నతదశయో మహానీచదశయోగాని వారికిమధ్యదశయుండదు." అనుచుండ నొకసేవకుఁడు పరుగుపరుగున వచ్చి యమాత్యునితో నిట్లనియె. "స్వామీ! కటకరాజు రాణిగారిని బట్టి తెచ్చునిమిత్తము నాలుగుప్రక్కలకు నాలుగు సేనల బంపవలయునని సేనాపతి కాజ్ఞాపించినాఁడు. అది నాచెవులార నేవింటిని. ఒకజాములోపల నాల్గుప్రక్కలకు సైన్యములు బయలుదేరును. ఆమె రణరంగమునకు వచ్చియున్నదని వినియున్నాఁడు. మీఁద కర్తవ్యము నిశ్చయించుకొనుఁడు." అప్పలుకులు విని మంత్రి "అమ్మా! నీవును వినుచున్నావుగదా! క్షణమైన నిక్కడ నిలువఁదగదు. పోవు టెక్కడికని విచారింపవద్దు. దిక్కులేనివారికి దేవుఁడే దిక్కు. నీవు నాబిడ్డవు. నేను నిన్ను రక్షించెద. మాఱుమాటాడక నాతో రమ్ము. సైనికులారా! గుఱ్ఱములున్నవారు గుఱ్ఱము లెక్కుఁడు లేనివారు కాలినడకను రండు. దేవీసంరక్షణమే ప్రథమకర్తవ్యము. మానవతీ! , రాణిగారియేనుఁగును నడుపుము." అని తానొక గుఱ్ఱముపై నెక్కి యేబదిమంది యాశ్వికులతోడను, మఱి యేబదిమంది పదాతులతోడను, దేవిని ముందిడుకొని దైవము

పై భారము వైచి గమ్యస్థానమేదో యెఱుఁగక కర్తవ్యమేదో తెలిసికొనఁజాలక కేవల రాజభక్తిప్రేరితుఁడై పోవసాగెను.

కటకరాజు తనకు నమ్మికగలబంటు, క్రూరకార్యనిరతియుం దుఁ దన్ను జయించినవాఁడు నగు వీరవర్మయను సేనాపతిం బిలిచి యిట్లనియె. "వీరవర్మా! యెఱుఁగుదువుగదా నాప్రతిజ్ఞ? చాళుక్యరాజ్యవృక్షము కూకటివ్రేళ్ళతో నిర్మూలింప బ్రతిన జేసితిని. చెట్టు చచ్చినది. కాని వ్రేళ్ళు త్రవ్విపోయవలయును. అంతవఱకు నేను హాయిగా నిదురింపఁజాల. భుజింపఁజాల. అతనిభార్య గర్భవతియై యున్నదట. ఆమె మగనిమగఁటిమి కనులపండువుగాఁ జూచుటకై రణరంగమునకు వచ్చియున్నదట. వచ్చియుండినను భర్తృమరణము విని నతోడనే యచ్చోటు వాసి రాజధానివైపునకో మఱియొక వైపునకో పోయి యుండును. రాజధానివైపునకు నే నరిగెదను. గోదావరీ నదీపరిసరములయందు నీ వామెను వెదకి పట్టుకొనుము. పట్టుకొని నాకడకుం దీసికొనిరమ్ము. ఆమె నీచేతంజిక్కక నీవెంటరాననిపట్టు పట్టి మొండితనము చేసినపక్షమున బాణంబు ప్రయోగించి ప్రాణంబుదీయుము. కత్తికందినపక్షమునఁ బొడచి చంపుము. నీయిచ్చవచ్చిన తెఱంగు జేయుటకు నీకధికార మిచ్చుచున్నాఁడను. ఆమె దొరకెడు చోటు నేనున్న తావునకు సమీపముగా నుండినపక్షమున నాకు వెంటనే వర్తమాన మంపుము. వానిచేత వర్తమాన మంపినను నేను ఱెక్కలుకట్టుకొని వ్రాలుదును. ఆమె యే గ్రామమునం దుండునో యా గ్రామవాసు లామెను బట్టి యప్పగింపక బింకము జూపినను దండగంబులకు దొరకొనినను వెంటనే యాగ్రామమును పరశురామక్షేత్రము గావింపుము. గ్రామమునకెల్ల ప్రధానపురుషులను జెఱపట్టుము. కానలేకున్నచో మొగాండ్రను శిరచ్ఛేదము చేయింపుము. మనశాసనం బన్న జనులు భయభక్తులు గలిగి

మన్నించి శిరసావహించునట్లు చేయుము. నేను స్త్రీవధ చేయుమంటినని నీవు సందేహింపవలదు. తల్లి యని సందేహింపక రేణుకాదేవిని తండ్రియానతిచొప్పునఁ జంపిన పరశురాముని చరిత్రము జ్ఞప్తికిఁ దెచ్చుకొనుము. తాటకాప్రాణాపహరణము గావించిన దశరథరాముని మనసులో నుంచుకొనుము. పూతనాఘాతకుఁడగు వాసుదేవుని ననుసరింపుము. ఇదియునుం గాక నీకొక్క మహాతత్త్వం బెఱింగించెద. వినుము. ఆడువాండ్రు మగవాండ్రను భేదము పామరులకేగాని ప్రాజ్ఞులకు నుండఁగూడదు. మన కార్యసాధన మగునేని మగవాండ్రనాడువాండ్ర మనము సమానముగా వధింపవచ్చును. అడవికి వేఁటకరిగి నప్పుడు మనమెన్ని యాఁడుపులులం జంపుటలేదు. ఎన్ని యాఁడుజింకలం బొరిగొనుటలేదు. ముద్దుల మూటగట్టుచుండు నెన్ని యాఁడుపులుగుల మ్రింగించుటలేదు, ఆహారార్థమెన్ని యాఁడుమేఁకల, నెన్ని నాఁడుగొఱియల దెగవేయుటలేదు. పాములను తేళ్ళను జూచినప్పుడు జాలిపెంపున నాఁడుపాములనియు, నాఁడుతేళ్ళనియు, శంకించి మనముచంపక విడుచుచున్నారమా? దుష్టజంతు వగునేని నది యాఁడుదైనను మగదైనను వధింపఁదగినదే. మానవులుకూడ జంతువులే. దుష్టపురుషు నెట్లుసంహరింతుమో దుష్టస్త్రీని నట్లే సంహరింతుము. చాళుక్యరాజపత్ని నీచేతఁ జిక్కి నాకడకు వచ్చులోనఁ బ్రసవించెడు పక్షమున మాతాశిశువులను గడుజాగరూకతతో నాకడకుం దీసికొని రమ్ము. ఆపని యన్యుల కప్పగింపవలదు. నీవే స్వయముగాఁ జేయవలయును. చాళుక్యరాజపక్షపాతమున మధ్యమార్గమున ననుచరులు, మిత్రులు సేవకులు దేవీగర్భజనితమగుశిశువును హరించి దాని స్థానమున నన్యశిశువును బెట్టుదురు. ఈవిషయమున నీవప్రమత్తుఁడవై వర్తింపవలయు మగశిశువైనపక్షమున నీవు మిక్కిలి మెలఁకువగలిగి యుండవలయు. దేవియుఁ దత్పక్షమువారును మగశిశువును సర్వథా రక్షింపయత్నిం

తురు. మగశిశువును వధించుటయే నాకు పరమకర్తవ్యము. అప్పుడే చాళుక్యరాజవంశమును కూకటివ్రేళ్ళతోఁ బ్రవ్విన వాఁడ నగుదును. ఆడశిశువు జనించినపక్షమున దానిని వధింపనవసరము లేదు. తల్లియధీనమునుండి దానినిదీసికొని నాదాసదాసీజనంబులచేతఁ బెంపించి యుక్తవయస్కురాలయినపిమ్మట దాని నెవ్వరికో కులహీనున కిచ్చి వివాహము జేసెద. కులహీనున కేలయీవలయునని నీకు సంశయము దోచవచ్చును. క్షత్రియకన్యగదా యని రాచవానికిచ్చి పెండ్లిచేసిన పక్షమున వాఁడు చాళుక్యభూపాలుని యల్లుఁడనని విఱ్ఱవీగి తెగనీల్గి దుండగులం గొందఱం దనచుట్టుం జేర్చుకొని సింహాసనము నాక్రమించుకొనుటకు మరల బ్రయత్నము చేయును. మన మహాసైన్యంబులముందట వాఁడు గడ్డిపరకవంటివాఁడైనను దేశంబునఁ గొంత సంక్షోభము కొంత యుల్లర జనులకు గొంత యలజడి గలుగకపోదు. కులహీనునకిచ్చినపక్షమున జనులకువానియం దనురాగ ముండదు. జనానురాగము లేనివాఁడు రాజగుట యరిది. నాకుంబరమాప్తుఁడ వగుటచేత నామనంబునం గల తలంపు లన్నియు మర్మంబులేక నీకెఱిఁగించితి. తూచాతప్పకుండ నీవు నాయాజ్ఞ నెరవేర్పవలయు. ఇందరు సేనాపతు లుండ నిన్నే యీకార్యమున నియోగించుటకు కారణమేమో నీవే యూహించుకొనుము. నీవు నా రెండవ హృదయమవు. నీవు నా మూఁడవ హస్తమవు. నాయారవప్రాణమవు! ఇంతకంటె నీతో వేరుగా నొక్క చెప్పవలసినది లేదు. సర్వము నీవే యెఱుఁగుదువు. నా కార్యము నీకార్యము. నాయభ్యుదయము నీయభ్యుదయము" అని యేలిక తనయందు విశ్వాసముంచి పలుకుటయు వీరవర్మ చేతులు జోడించి వినయంబున నిట్లని విన్నవించె. "దేవా! దేవరవారికి నాయెడల నధికవాత్సల్యము కలదనియు నందఱకంటె నేనధికవిశ్వాసపాత్రమననియు నెఱుంగుదు. ఆదికాలంబున మీనాయనగారి పాద

రక్షులు మోయుటకై నేను నియోగింపఁబడితిని. అట్టినన్ను మీారెంతో యనుగ్రహంబున నాయందు నమ్మికయుంచి మొదట కాలిబంటుం జేసి, పిదప గుఱ్ఱపురౌతుం జేసి, పదపడి సేనాపతిని గావించి నాకుఁ బెండ్లిపేరంటములు చేసి రాజ్యంబున పేరుగలవారిలో నొకరనిగ జేసి నన్ను గౌరవపాత్రముగఁ జేసిరి. ఈమహోపకారము వేయిజన్మములకైన మరతునా? నేను మీాయాజ్ఞచేతి కీలుబొమ్మను. మీాశాసనమే నాచేతసమస్తకృత్యములు చేయించును. మీాయాజ్ఞయైన పక్షమున నేను నీచ మనక, ఘన మనక, క్రూర మనక, ఘోర మనక, మంచి యనక, చెడ్డ యనక, పాప మనక, పుణ్యమనక సమస్త కార్యములఁగావించెద. మీాపాదములయాన పంపుఁడిదె వెళ్ళివచ్చెద.

అని వీరవర్మ పలుకుటయు మహానందభరితుఁడై కటకేశ్వరుఁడు వాని వీఁపుపై హస్తమువైచి తట్టి మొగమున చిరునగ వంకురింప నిట్లనియె. "వీరవర్మ! నీకు నాయందు నట్టిభక్తియే కలదని నేనెఱుంగుదు. ఎవ్వరియెడనైన సందియముండును గాని నీయెడ నాకు సందియము లేదు. రెండువందల గుఱ్ఱపుదళమును, మూడువందల కాల్బలమును నీవు వెంటఁగొనిపోయి దేశమెల్ల వెదకుము! చాళుక్యరాజపత్ని మారువేషము వేసికొనియుండనచ్చును. కాఁబట్టి స్త్రీలనందఱఁ జక్కఁగా శోధింపవలయును. భిక్షుణీవేషంబులం దాల్చియు, కాపాలినీరూపంబుల ధరించియు, సన్యాసినీవస్త్రంబుల దాల్చియు, నీబారి బడకుండ నామెయు నామెపరిచారికలు తప్పించుకొనఁజూతురు. భిక్షుణియని వదలవలదు. సన్యాసినియని శంకింపవలదు. కాపాలినియని జంక వలదు. నెఱజాణలగు నంగనలను బంపి గర్భవతులైన యంగనలను నీకడకు రావించి వాండ్రి రూపరేఖావిలాసంబులఁ బరీక్షించి రాజపత్నీలక్షణము లున్నవేమో యఱయవలయు. రాజపత్నుల సంభాషణలు నాగరికసంభాషణల

యి యుండవచ్చు. అందుచేత మాటలాడకుండు నే యంగనలను వదలివేయవలదు. మాటలనుబట్టి కూడ మనుష్యులను గుర్తింపవచ్చును. ఒకప్పు డామె రోగినివేషముధరించి ముక్కుచు మూల్గుచు నుండవచ్చు. రోగినియని జాలిపడవద్దు. నిజమైన రోగమో యబద్ధపురోగమో తెలియువఱకు నామెను విడువవద్దు. పరపురుషులం జూడనొల్లని కాంత యని చాళుక్య రాజపత్ని నీకు గానఁబడకపోవచ్చు. ఆమె రాజపత్ని కాదని నీవు సంతుష్టుఁడవగువఱకు దానిని చేజాఱి పోనీవలదు. అవసరమగునేని మేలిముసుఁగు నీ చేతితోఁ దీసి మొగము సదానించి చూడవలయు. ఏయంగనయైన ప్రసవవేదన పడుచున్నదని నీవు విన్నపక్షమున బచ్చుకత్తెకాని, బాపనపడంతిగాని, రాచకూఁతురుగాని, కడజాతి మాలకన్యగాని, యాగృహమును జుట్టుముట్టి ప్రసవించిన వెనుక మాతా శిశువులను కన్నులారఁజూచి వారు చాళుక్యులు కారని నీవు నమ్మినవఱకు వారిని బంధించుట కర్తవ్యము. పదుగురు కుమారులున్న గృహమున నొక యందకత్తియ కానఁబడిన పక్షమున ముసిబొగ్గు నడుమ మాణిక్యంబుబోలె నామె యాగృహంబునఁ గానఁబడుటకు గారణమేమో యరయవలయు. ఆవిషయమున గృహయజమానులు చెప్పు నుత్తరంబుల మిక్కిలి మెలకువతో విచారింపవలయును. సత్రములలోను ధర్మశాలలలోను తోఁటలలోను దొడ్లలోను పొలములలోను పుంతలలోను మహావనంబులలోను కొండగుహలలోను చెట్లతొఱ్ఱలలోను గృహములయం దటకలలోను గాదులలోను చెట్లకొమ్మలలోను శ్మశానములలోను పాడుదేవాలయములలోను, మఠములలోను చుట్టము లామెను దాచియుండవచ్చును. దుష్ప్రవేశ్యములనక దుర్గములనక యట్టిచోటులెల్ల ప్రవేశించి మూలమూలల వెదుకవలయు! మఱియుఁ బ్రచ్ఛన్నులగువారు నిద్దురవోయినట్లు చచ్చినట్లు నటించి శత్రుహస్తంబులఁ జిక్కక ప్రాణములఁ గాచికొందు

రు. ఒకశవము నీకుఁ గానఁబడినప్పుడు నిజముగా నది శవమో కాదో బహువిధోపాయంబులఁ బరీక్షింప నలయు. ఇంకను నేను నీకుఁ జెప్పక విడిచిన తావు లనేకములుండవచ్చును: వేయి కనులతోఁ జూచుచు, వేయి కాళ్లతో నడచుచు, వేయి చేతులతోఁ బనిచేయుచు వేయి చెవులతో శబ్దముల నాలకించుచు వేయి బుద్ధులతో నాలోచించుచు నీ వామెను వెదుకవలయును. సజీవముగా నామెను నీవు బట్టి తెచ్చితివేని నీవేమి గోరిన దానిని నీకిచ్చెద. అర్ధరాజ్య మడిగినను నీకిచ్చి నామాట నిలుపుకొందును. నీకార్యసఫలతకై గురుని నీయిష్టదేవత లను నీ గృహదేవతలను వేడుకొనుము. మంచి ముహూర్తమునందు మంచి శకునము జూచి బయలుదేరుము. నీవెంట వచ్చు బంట్లను రౌతులను నమ్మినట్లు కనఁబడుచు మనసులో మాత్రము నమ్మవలదు. జాలిపెంపునసైన మొగమోటమునసైన గనాశచేసైన నవివేకమునసైన గర్వంబునసైన నీవు కార్యహాని సేయనోపుదువు. అట్టివాండ్ర గర్వంబు కాలోచింబుగా నడుచుచు లంచగొండుల యాగడంబులు సాగనీక యవివేకంబున కవకాశంబు నియ్యక శ్రద్ధాళుఁడవై మెలంగుము."

అని బహువిధోపాయంబుల నుపన్యసించి కటకవల్లభుఁడు తనయాజ్ఞా నర్తియై యుండునట్లు వీరవర్మచే ఘోరంబులగు ప్రమాణంబులు చేయించి వానిం బంపెను. వీరవర్మయు రెండువందల రాహుతులును మున్నూరు కాల్బలమును దన్ననుసరించి రాఁ బయనమై పోయెను. అనంతరము కటకవల్లభుడు తక్కిన సేనాపతులం గూర్చుకొని ససైన్యంబుగా చాళుక్యరాజధానిం బట్టుకొనుటకై పయనమై పోయెను. ఆపయనమందలి సైన్యముల మహాకోలాహలములు వందిమాగధుల కైవారములు భేరీభాంకరణంబులు తూర్యరావంబులు స్వస్తివాచకంబులు వర్ణించుట యసాధ్యము. భేరీభాంకరణములకు మార్గమధ్యమున వృక్షములమీఁదనున్న పక్షులు చచ్చి నేలంగూలెనని చెప్పినపక్ష

మున వారి మహాభైరవస్వన మెంత దారుణముగానుండెనో మీరూహించుకొనవచ్చును. మహాసముద్ర ఘోషమువలె సైనికుల కలకలధ్వనులు రమారమి యొక్క యామడవఱకు వినంబడియెనని చెప్పిన నాశిబిరముయొక్క కోలాహలమెట్టిదో మీరూహించుక తెలియవచ్చును. కటకవల్లభుఁడు నవరత్నఖచితమైన బంగరు హౌదాలోఁ దన పట్టపు టేనుఁగుపైఁగూర్చుండి యిరువంకల నందకత్తియలగు జాణలిరువురు వింజామరలువైవ స్తోత్రపాఠకులు జయ ! జయ ! మహారాజాధిరాజ! చాళుక్యరాజ గర్వాంధకార మహామార్తాండమండల ! అష్టదిగంత దంతావళవిశ్రాంతయశోవిశాల ! పరగండభైరవ ! భువనైకమల్ల ! యాచకజనకుముద చంద్రోదయ! యని బిరుదులపై బిరుదులం జదువుచుఁ దనమనంబున, కానందంబుగల్పింప మహావైభవముతో నరిగెను. ఏపల్లియ కఱిగిన నాపల్లియలోని పురుషులనందఱ రావించి "చాళుక్యుని నిర్మూలించితిమి. మాయధికారము నంగీకరించితిరా యంగీకరింపుఁడు! లేదా యిప్పుడే శిరచ్ఛేదంబు జేయించెద." అని వా రాలోచించుకొనుటకైనఁ దగుకాలము నొసంగక వెంటనే ప్రత్యుత్తరమిమ్మని బలవంతముపెట్టి, సందేహించినవారి బుఱ్ఱలుదీయించి యనుమతించినవారింజూచి "మాసైనికులకు కావలసిన భోజనపదార్థముల సమకూర్పుఁడు. పశువులకు మేఁత గుఱ్ఱంబులకులవలు మొదలగునవి తెచ్చి సూర్యాస్తమయమగులోపల మాకుసమర్పింపవలయు. లేదా గ్రామము కొల్లగొనుటకు మాసైనికుల కనుజ్ఞనిచ్చెద" మని పలుకుచుండును. అప్పలుకులు విని గ్రామవాసులందరు గృహంబులకరిగి "బ్రతికియుండిన బలుసాకు తినవచ్చు" నని పురులు గాదులువిప్పి తాము దాచియుంచుకొన్న ధాన్యంబుల నాతనికి సమర్పించుచు వచ్చిరి. అనంతరము పురమునందలి భాగ్యవంతులను రావించి "మీకడనున్న ధనంబుల సగము మాయుద్ధవ్యయముల క్రింద నియ్యవలయు తీసికొ

నిరండు! రాలేని చెట్లకొమ్మలకుం గట్టి యురి తీయుంచెద." నని బెదరించుచు నామాటలకుజంకి తెచ్చినవారియొద్ద ధనముస్వీకరించి తీసికొని రాకయున్నవారి యిండ్లకు సేనాపతులం బంపును ఆమొనగాండ్రుగ్రామవాసుల గృహంబులకరిగి గృహములనలుకెలంకుల వెదకి పెట్టెలు భోషాణంబులుపగులఁగొట్టి నేల ద్రవ్యముపాతిపెట్టిరేమోయని సంశయముగలచోట్ల పారలతో గడ్డపారలతో గోంపలుత్రవ్వించి ధనము కాఁనబడినపక్షమున దురాత్మా! రాజద్రోహీ! ప్రాతరాజులపక్షమును బూని క్రొత్తరాజును వంచింపఁదలచితివా? ధన మున్నదని చెప్పక దాచుకొనఁజూచితివా? రాజద్రోహివైనందుకు నిన్నిప్పుడుకొఱతను వేయించెదము. పద! పద!" యని గెంటుకొనిపోయి రాజునకు వానిం గాన్పించి వాని యాజ్ఞాప్రకార మామందభాగ్యుని వధించుచుందురు. ఒకప్పుడట్టి భాగ్యహీనుని గృహము కాల్చుచుందురు. ఇల్లంతయుం ద్రవ్వినవెనుక వానియింట నొక్క కాసైన కానఁబడక పోయినపక్షమున నారాజభటు లాగృహయజమానుని "ఓరీ, దుర్మార్గుఁడా! మాకు వృథా శ్రమ కలిగించితివి. ఱెక్కలునొప్పులు పట్టినవి. మాకింత శ్రమ కలుగఁజేసినందులకు నీవు మావెంబడివచ్చి మామూటలు మోయుము. మాబరువులు మోయునట్టి గాడిదలుకొన్ని చచ్చిపోయినవి. వాని స్థానమును నీవాక్రమింపు" మని పరిహాసముచేయుచు వానిచేత దమమూటలు మోయింతురు.

ఇట్లు కటకేశ్వరుఁడు తా నడుగుపెట్టిన చోటెల్ల నరకలోకంబుగాఁ దన సైనికులు యమకింకరులుగా సకలగ్రామంబులు భస్మపటలంబు గావించి, గ్రామస్థుల నిష్కారణంబుగ హింసించుచు గొన్నిదినంబులు పయనంబుసేసి యెట్టకేలకు విష్ణువర్ధనుని రాజధాని జేరి యూరిచుట్టునున్న మామిడితోఁటలలో గుడారములు పన్నించి యందు విడిసి, గ్రామంబు కొల్లవెట్టుమని సైనికుల కాజ్ఞ నొసం

గాను. శ్రీణప్రియమైన యీమరాట రాజుకోటనుండి వెడలఁగనే సైనికులు మహానందభరితులై కత్తులు కఠారులు బల్లెంబులు ధరియించి లేళ్ళయడవిపైఁ బులిబెబ్బులులవలెఁ బట్టణముపైఁబడిరి. అప్పటి పట్టణావస్థ నేమనివర్ణింపఁగలము? ఆడువాండ్రని సంశయములేదు. చంటిబిడ్డలని శంకలేదు. వృద్ధులని గౌరవములేదు. రోగులని జాలిలేదు. పేదలని విచారములేదు. ఎల్లగృహములపై సైనికులు పడి యింటనున్న స్త్రీల పురుషుల నొక్కచోట జేర్చి స్త్రీల శరీరముమీఁదనున్న నగల ముందుగాఁ దీయించి పుచ్చుకొని వారినక్కడనే యుంచుఁడని వారిగృహమందుగల పెట్టెలు భోషాణములు గొడ్డళ్ళతో భళ్ళుభళ్ళుమన పగులగొట్టి నగలు రొక్కము వెండిచెంబులు గిన్నెలు జరీబట్టలు చీరలు, పట్టుబట్టలురవికెలు, మొదలగుసమస్తవస్తువులంగ్రహించి యంతతో తనివినొందక భాగ్యవంతులని తోఁచినవారిని ధన మెక్కడదాచితిరో చెప్పుమని యడిగి మీరు గ్రహించినదానికంటె మావద్ద నితరధనము లేదని వారు ప్రత్యుత్తర మిచ్చినపక్షమున తొక్కలు వలిచి వారి యాలుబిడ్డలు చూచుచుండ వారిం గఱ్ఱతో మోఁది, దెబ్బలవలన వారు దేహ మెఱుంగక పడిపోయినతరువాత వారిగృహముల నాలుగుమూలలకు నిప్పంటింపఁదొడఁగిరి. కొందఱు సైనికులు స్త్రీలను బానిసలుగాఁ గొనిపోయిరి. కొందఱు ధనములు గ్రహించుటతో సంతుష్టినొందక పాతరలు త్రవ్వియు గాదులు భేదించియు ధాన్యంబులు కూడ దోఁచుకొనిరి.

అతిభయంకరమైనయీదోపుడు చూచి పురవాసులలోని ప్రముఖులు కొందఱు కటకేశ్వరుఁడు విడిసియున్న తోఁటకుం జని యాతని దర్శనముచేసి, సాష్టాంగనమస్కార మొనర్చి చేతులు జోడించి నెన్నుదుటజేర్చి యిట్లు విన్నవించుకొనిరి. "దేవా! దేవరవారు సకలధర్మంబులు దెలిసిన మహానీయులు. కత్తికట్టి దేవరవారి

తోఁ బోరవచ్చిన రాజుం దెగటార్చిరి. సైనికుల దండించిరి. అది న్యాయమే. రాజధర్మమే. వీరధర్మమే. కాని నిరపరాధులు నిరాయుధులు నిరాధారులు దయనీయులు నైనపురజనుల నీవిధంబున నిష్కారణముగ హింసించుట తగవుకాదు. పురజను లాబాలగోపాలము మహావస్థపడుచున్నారు. పురజనులు దేవరవారి కేమియపకార మొనర్చిరి! మీయాజ్ఞ నేమియతిక్రమించిరి? దేవరవారు మాకిప్పుడు ప్రభువులైరి గావున దేవరవారియెడ రాజభక్తి నెఱపుటకు, మీకతిగాఁపులై కప్పంబులు గట్టుటకు మీకు విధేయులై యుండునట్లు మీయడుగుదమ్ములకు మ్రొక్కి ప్రమాణంబులు సేయుటకు, మీయాన శిరసావహించుటకుఁ బ్రజలు సిద్ధముగ నున్నారు. చిరకాలము చాళుక్యరాజుల పరిపాలనములో నుండిన దోసముతప్ప పురవాసులు తదితరదోసము లేమియుం జేసి యెఱుంగరు. కావున నేదోసము జేయని యీపౌరులకు నేఁడు గలిగిన సంతాపమును మీదయారస వర్షంబులచేతఁ జల్లార్చి రక్షింపవలయునని వేఁడుచున్నాము. నరుఁడు ప్రకృతిరంజనముచేసినే రాజగుచున్నాఁడు. చాళుక్యులు దేశముం గెల్చినప్పుడు చాళుక్యులకు విధేయులమై యుంటిమి. ఇప్పుడుమీరు దొరలగుటచే మీకు విధేయులమై యుందుము. మీవంటి ధర్మప్రభువులు మాకు దొరలైన తర్వాత మాయాఁడువాండ్రు బానిసలగుట మాగృహంబులు పరశురామప్రీతి యగుట చెల్లునే? అల్లదె చూచుఁడు పొగలెల్లెగయుచున్నవో! ఈదెస చూడుఁడు! మంటలు తమ నాలుకలతో నాకసమును నాకుచున్నట్లున్నవి. కొంచెము చెవియొగ్గివినుఁడు! స్త్రీల యాక్రందనధ్వను లెట్లువినబడుచున్నవో పసిబిడ్డల రోదనంబులు వినలేక మాగుండెలు నీరగుచున్నవి. పశువుల విప్పుట కైనవ్యవధి లేనందున గాలుచున్న యిండ్లలోఁబడి కొన్నిపశువులు మృతినొందుచున్నవి. అదిచూడలేక వాటి యార్తధ్వనులు వినలేక మీపాద

పద్మములసన్నిధికి వచ్చితిమి. అని దీనముగా విజ్ఞాపనలుచేయు పుర జనులవంక జూచి చిఱునవ్వు తొలకాడు మొగముతో కటకేశ్వరుఁ డిట్లనియె. "రక్షించుటకు మే మెంతవారము? మే మెవ్వరము? మీ యేలిక చాళుక్యభూపాలుఁడుగదా! అతనినడుగుఁడు! అతని మంత్రు లను వేఁడుఁడు! అతని సైనికుల నాశ్రయింపుఁడు! ఆపత్సమయమున రక్షింపఁజాలని యధమపరిభువుల పరిపాలనమునందున్న ఫల మనుభ వింపుడు! కొల్లగొనట యుద్ధధర్మము. గృహదహనము వీరకర్మము. ఒకప్పుడు మరణములు కూడ తత్సంబంధమున సంభవించుచుండును. దానికి నే నేమిచేయఁగలను? పగ లనక రాత్రి యనక చావునకు భయపడక మేనలు దాచుకొనక పగవారితోఁ బలుమారులు పోరి, యెన్నెన్నో గాయములుపడి, పలుబాముల కోర్చి నన్నుఁ గొలిచి యున్నందుకు నాబంట్లకు పగవారి యూళ్లు దోచుకొమ్మని సెల విచ్చుట తప్పా? ఇంతపాటి మేలున కైనవారుతగరా? మీపాపము లట్లున్నవి. కర్మఫల మనుభవింపక తప్పదు. ఇందునేఁ జేయఁగలిగిన దేమియు లేదు. మీకోపికయుండిన నాబంట్లనే యాశ్రయించి వారి యనుగ్రహమును సంపాదించుకొనుఁడు. అంతట వారే మీయాపద గడువంబెట్టఁగలరు. పొగ లెగయుచున్న వనియు మంటలు మిన్నంటు చున్న వనియు నాడువాండ్రు సంక్షోభము నొందుచున్నారనియు, పసిబిడ్డ లేడ్చుచున్నారనియు కల్లబొల్లిమాటలు కొన్ని చెప్పి నా మనంబునొప్పింపఁదలంచితిరి. కాబోలు? మీవంటివారి పిచ్చిమాటలు విని మనోదౌర్బల్యమునకు వశుఁడనై సైనికులకు మొదట యిచ్చిన యాజ్ఞ మఱల్చువాఁడను గాను. మాటిమాటికి మీరు నాకడకు రావ లదు. నాకాలము పాడుసేయవలదు" అని ప్రత్యుత్తర మీయ నా పురవాసులు విచారగ్రస్తులై "పూర్వకృత మనుభవింపక తప్పదు. మనదురతి యిట్లున్నది. మన మేమిచేయఁగలము!" అని తమ కర్మం

బులం దూరుకొనుచు వెడలిపోయిరి. అనంతరము కటకేశ్వరుని సేనాపతి యొకఁడు చాళుక్యరాజుల కోటఁ బ్రవేశించి తమరాక విని కావలివాండ్రిందఱు పారిపోవుటం జేసి, నిర్జనమైన యాప్రదేశమంతయుఁ జూచి ధనాగారంబు లందున్న ద్రవ్యంబులం దోచుకొని, కావలసిన వస్తువులనెల్ల సంగ్రహించుకొని, రాజాంతఃపురములు నేలం గూల్పుడనియు, కోట నాశనము చేయుఁడనియు సైనికుల కాజ్ఞ యొసంగెను అప్పుడు సైనికులు పాఱలు గునపంబులు గొడ్డళ్లు కత్తులు మొదలగు నాయుధంబులు పూని, మేడలం బడఁగూల్చిరి. అంతఃపురంబుల నవనిపాలుచేసిరి. కొలువుకూటంబులు క్షోణిపాలు చేసిరి. ప్రమదావనంబులు బట్టబయలు చేసిరి. ఏనుఁగుసాలలు పీనుఁగుసాలలు చేసిరి. ఖడ్గములకు సాక్ష్యముగానివాని నగ్నిపా ల్సేసిరి. చిత్తరువులు చెరిపి వేసిరి. వెయ్యేల? సుందరవస్తువుల మనుష్యుఁ డెన్నివిధముల నాశనము చేయఁగలఁడో యన్నివిధముల వారాకోట నాశనముచేసిరి.

కటకేశ్వరుఁడు తన సేనాపతులు కొల్లపెట్టి తెచ్చిన ధనంబునెల్ల స్వీకరించి యనంతర మాయూరు విడిచిపోవ నిశ్చయించుకొని తమదగ్గఱనున్న దండనాథులలో నొక్కఁడగు కేసరివర్మను బట్టణంబునకు బరిపాలకునిగా నియమించి యాతనిం బిలిచి యిట్లనియె. "కేసరీ! ఈపదవి నీ కేసరియని యొసంగినాఁడ. ఇనుపదండము చేతబూని నీవీ దేశము పరిపాలింపవలయును. దుష్టులగు చాళుక్యరాజుల పరిపాలనములోనుండి ప్రజలు పొగరెక్కి యున్నవారు. రాజశాసనమన్న భయము లేదు. దండనాథులన్న గౌరవము లేదు. ఈపురజనులలో మన పక్షమువాఁడొకఁడు కలఁడు. ఆతనితోడ నిన్ననే ప్రసంగించితి. ఆతండు పూర్వవృత్తాంతమంతయు నఱటిపండొలిచి చేతికిచ్చినట్లు చెప్పెను చాళుక్యవల్లభుఁడు ప్రజలతో నాలోచింపక యేకార్యము చేయలేదట. ప్రజలకిష్టము లేని పన్ను నెన్నఁడు విధింపలేదట! ప్రజలయానం

గమే తనయాసంగముగా నతఁడు భావించెనట! ప్రజలకిష్టమైన మం
త్రులనేగాని యితరుల నత డంగీకరింపలేదట! ప్రజలకనిష్టముగా
వర్తించిన యుద్యోగులను వారివారి యధికారమునుండి తొలగించు
వాఁడట? ఈవిధముగా బరిపాలించినపక్షమున నెవ్వఁడైన లోకంబు
న రాజ్యముచేయుగలఁడా? ప్రజలయిష్టమే మనము చూచుకొన్నపక్ష
మున నొక్కపన్ను విధింపగలమా? ఒక్కచట్టము నిర్మింపగలమా?
ఒక్కకార్యము చేయగలమా? ఒక్కయుద్యోగిని నిజాధికారమున
నుంపగలమా? రాజ్యచక్రము రాజ యొక్క నిరంకుశాధికారమను
నిరుసుమీఁద తిరుగవలయునుగాని ప్రజలయభిప్రాయ మనునిరుసు
మీఁద తిరిగిననది తప్పక స్వల్పకాలమున జెడిపోవును. రాజు పర
మేశ్వరాంశమున బుట్టిన వాఁడు. సర్వజ్ఞుఁడగు పరమేశ్వరునికంటె కిం
చిజ్ఞుఁడగు మనుష్యుఁడెరుఁగునా! యేపనిప్రజలకు మంచిదో యదిరాజే
యెఱుంగును. రాజున కాజ్ఞాపింపఁగూడదు. రాజ్యాధికారమున కొకఁడు
మితినేర్పరుపఁగూడదు. ప్రజలు పశువులు కావున దండనీతియే ప్ర
ధాననీతి. ఖడ్గనీతికి మించిన నీతి లేదు. దెబ్బ దేవేంద్రలోకమును
జూపును. ఖడ్గమునకులొంగినట్లు ప్రజలు మాటలకు లొంగరు. బెత్త
ముదాచిన యుపాధ్యాయుఁడు విద్యార్థులను పాడుచేసిన విధముగానే
ఖడ్గముదాఁచిన రాజు ప్రజలను పాడుచేయును. ఎవరినెక్కడ నుంచ
వలయునో యక్కడనుంచవలయును. అనర్హులకధికారమిచ్చిన యెడల
వారు చెడిపోదురు. ప్రజలలో విద్యావివక్షత చేయఁగూడదు. చదు
వులునేరకయే మనుష్యులు దేవతలకు పంచాంగములు చెప్పెదరు.
చదువులునేర్చినపక్షమున వారింబట్ట పగ్గములుండవు. చదువుకొన్న
వారు రాజ్యహాని కలుగజేయుదురు. ప్రజలనెప్పుడు నమ్మఁగూడదు.
ప్రజలను నమ్మినరాజు కుక్కతోకబట్టుకొని గోదావరినీదినవానివలె
జెడిపోవును. మనరాజ్యమున పాఠశాలల నెక్కడ నిలుపవలదు. ఇది

వరకున్న పాఠశాలల నెత్తివేయింపుము. వేదాధ్యయనము మాత్రము చేసికొనుట కంగీకరింపు. స్వాధ్యాయము చదువుకొన్న బ్రాహ్మణులు జడులై ప్రపంచజ్ఞానము లేక యుందురు. గాన వారివలన నరపాలకులకెన్నడు హాని లేదు. శాస్త్రాధ్యయనము చేసిన వారివలన నెంతేని యపాయము కలదు. అందు ముఖ్యముగా హేతువాదముం దెలుపు శాస్త్రములు వర్జనీయములు. తక్కువ వర్ణములలో మూఢభక్తి ప్రోత్సాహము సేయవలయును. అందువలన జనులు నాగరికులుగాక యధోమార్గమున బడి యుందురు. వెయ్యేల! ప్రజలు రాజులకు శత్రువులుగాని మిత్రులుగారు. రాజునకు బ్రజ శరీరము. రాజు ప్రజకు నాత్మయని చెప్పువారి మాటలు కేవలమనుభవసిద్ధములుగావు. అవి పుస్తకములలోనిమాటలు. గ్రంథస్థములగు మాటలకు లోకానుభవమునకు సంబంధముండదు. ప్రజలకు విద్యలుచెప్పుట దొంగలచేతికి దీపమునిచ్చుట. బందిపోటుదొంగలచేతికి పెట్టెల తాళములిచ్చుట. కావున సర్వవిధములచేత విద్యాగంధము లోకమున వ్యాప్తముకాకుండ జేయవలయు! సమస్తరహస్యము లిందులోనే యున్నవి. ఇదిగాక మఱియొకరహస్య మెఱిగించెదవినుము. ప్రజలలో నొకానొకఁడొకకాలమున నఖండప్రజ్ఞావంతుడై మేధావంతుడై జనియించి శాస్త్రంబులనెల్ల జదివి తాను స్వతంత్రబుద్ధిగలవాడై తాజెడ్డకోతి వనమెల్ల చెరిచెనన్నట్లు లోకులకెల్ల స్వతంత్రభావమునుబోధించుచుండును. మొండిచేతులవానికిశనగలుదినుటనేర్పినట్లు రాజనీతి, యేమోయెఱుగనిమూర్ఖపుజనులకు రాజధర్మంబులు, ప్రజాధర్మంబులు, శుక్రనీతి, బృహస్పతినీతి, మానవధర్మశాస్త్రము, యాజ్ఞవల్క్యవ్యవహారకాండము మొదలగు నాయువుపట్టు గ్రంథంబులలోని మర్మంబులనెల్ల జెప్పి వారికిం బోగరుబోతుతనంబు పెంకెతనంబు నేర్పుచుండును. అట్టివాడొక్కఁడయ్యె లక్షమందిపెట్టు. అట్టివానిని యేయుపాయంబు

లచేత గడతేర్పవలయును. ఊరకున్నపక్షమున రాచపుండువలె వాఁడు క్రమక్రమముగ విజృంభించి రాజదేహమును వాడు నాశనముచేయును. స్థాలీపులాకన్యాయముగా నీకు నేను కొన్నిధర్మములే చెప్పగలిగితిని. నీబుద్ధికొలఁది నూహించుకొని దేశపాత్రములంబట్టి మెలకువతో మెలంగుచుండుము! చండశాసనుఁడని జనులు చెప్పుకొనునట్లు బిరుదు తెచ్చుకొనుము.

ఆరాజునకు నాయమాత్యునకు పరిపోవుటంజేసి యతఁడు చేతులు జోడించి తనజేని కిట్లనియె. “దేవా! ఇన్నివిధముల నాకుఁ జెప్పవలయునే? మీచిత్తవృత్తి ననుసరించి నేను ప్రజాపాలనముఁ జేసెద. ప్రజలకు లవలేశమైన స్వాతంత్ర్యమియ్యను. అట్టి యిచ్ఛ ప్రజలలో నెన్నఁడేని పొడసూపెనేని యదిచిగురించునప్పుడే త్రెంచివైచెద. ప్రజలు దేవరవారికి బానిసలై యుండునట్లు జేసెద. మనము కట్టినన్ని పన్నులు వా రిచ్చుకొనవలసినదే. ఆఁడువాండ్రమెడలలో మంగళసూత్రములు సైతము మమ్మించి కొయ్యపుస్తెలు కట్టించి మీకు రావలసినసొమ్ము ప్రోగుచేసి పంపెదఁ జూడుఁడు. మఱియు, నాబుద్ధివిశేష ముపయోగించి క్రొత్తపన్నులు సృష్టించి కట్టెద. మీధనాగారములు వర్షకాలమునందు నీళ్ళతో నిండు చెఱువులట్లు ధనరాసులతో నిండిపోవునట్లు చేసెద. మీపేరు విన్నమాత్రమున వేఁగిదేశ స్త్రీలకు గర్భనిర్భేదమగునట్లు చరించెద. నేనిప్పు డేమన్నను నవి యుత్తరకుమారప్రజ్ఞలవలెఁ దోఁచవచ్చును. ఒక్కసంవత్సరము నాపరిపాలనము జిత్తగింపుఁడు.” అని విన్నవింప నాకటకేశ్వరుఁడు తన కనుకూలుఁ డగుమంత్రి లభించెనని వానిపై రాజ్యభారము నిలిపి కళింగదేశమునఁ గొన్నిరాజ్యవ్యాపారములఁ జక్కఁబెట్టుటకై గోదావరి దాఁటి చనియెను.

ఆవిధముగా భర్తృమరణవార్త విని మంత్రిప్రేరణంబునఁ జాళుక్యరాజపత్ని కొంతపరిజనముతో బయలువెడలి కొంతదూరము చనిన వెనుక నమాత్యుఁడు సమీపించి "తల్లీ! సమరమునఁ బరాజితులమై పరిచ్ఛన్నగుప్తిమైయుండఁ దలంచినమనము మహాగజములతో నంచారికల తోడఁబోవుట యుచితముగాదు. పగతురకుమనజాడలు వీనివలనసులభముగాఁ దెలియఁగలవు. కావున గజములు హయముల విడిచి పరిజనంబునుగొంత వదలి మనము పోవుట సముచితము. మీకొకపల్లకి నిచ్చెద. దానిలోఁ గూర్చుండి పయనము సేయవచ్చును. మీఁద మీచిత్తము." అని విన్నవింప నాదేవి కాలానుసారముగా వర్తింపవలయు నని గ్రహించి యట్ల యగుఁగాక యని చెప్పెను. అమాత్యుఁ డొకపల్లకియు నెనమండ్రుగురుబోయలను సిద్ధముచేసెను. దేవి భద్రగజముమీఁదనుండి దిగి పల్లకిలోఁ గూర్చుండెను. అమాత్యుఁడు తక్కినపరివారమునకు సెలవిచ్చి యథేచ్ఛం జనుమని చెప్పి మిక్కిలి నమ్మికగల యార్వురుబంట్లను వెంటఁబెట్టుకొని తాను పల్లకివెంట నడువఁజొచ్చెను. పట్టణములు విడిచి పెద్దగ్రామములు విడిచి వారు క్రమక్రమముగా నరణ్యప్రాంతముల కరిగి యొకగ్రామముఁ జేరిరి. అమాత్యుఁడు గ్రామీణులం బిలిచి తమవృత్తాంత మంతయుం జెప్పి తల దాచుకొనుటకు నెలవొసంగు మని వేఁడెను.

అతనివేఁడికోలువిని గ్రామవాసులలో ముఖ్యు లిట్లనిరి. "అయ్యా! కటకరాజు చండశాసనుఁడు. అతఁడు వేయికన్నులతోఁ జూచుచుండును. మాగ్రామములోఁ దనశత్రుపత్ని యున్నదని వినెనేని నామెం దాఁచినందుకు మమ్ము నానావిధవధలపాలు జేయును. మాగృహముల నగ్నిహోత్రుని కాహుతులఁ జేయును. తుత్తునియలుగాఁ జెండి మమ్ముఁ గాకులకుం గ్రద్దలకు నాహారముగాఁ జేయును. మాపడంతులఁ జెఱఁబెట్టును. మాకు నష్టములేనియుపకారము జేయఁ

గలము గాని మాతలలు ద్రుంచుకొనిపోవునట్టిపనిని మేము చేయఁ జాలము. తనకుమాలినధర్మము మొదలు చెడినబేరము లేదుగదా! రాజపత్నివిషయమై మాకు విచారమున్నదిగాని యిది మాతలకుఁ దగనిపని కావున నిందు మే మెట్టిసాయముఁ జేయఁజాలము. మాతప్పు మన్నింపుఁడు."

అక్కడ నెట్టియాశలు లేకపోవుటచే మంత్రి యాదేవిని మఱియొకగ్రామమునకుం గొనిపోయెను. అక్కడివా రామెను దాఁచుట కంగీకరింపలేదు సరిగదా యాపూఁటకు సన్నము వండుకొని తినుటకయిన నెల వొసంగలేదు. అప్పు డమాత్యుఁడు తనలో నిట్లనుకొనియెను. "ఆహా! ఏమి యీకాలవైపరీత్యము? సప్తద్వీపములు గెలిచి మహీమండల మంతయు నేకచ్ఛత్రముగాఁ బరిపాలించిన నలచక్రవర్తి పుష్కరునిచేత జూదమం దోడి రాజ్యపదచ్యుతుఁడై రాజధానిని విడిచి యూరువెలుపల మూఁడహోరాత్రములు వసియించియున్నను బుష్కరునిభయంబునఁ దమరాజుం జూచుట కొక్కరయినఁ జనలేదని, వారికిఁ బట్టెఁడోగిరమయినఁ బెట్టలేదని మహాభారతమున వ్యాసమహర్షి వ్రాసినవ్రాఁతలు కేవల మతిశయోక్తు లనుకొంటిని. నవఖండమండలాధీశ్వరుఁ డగుహరిశ్చంద్రుఁడు మాలకడఁ గొలువుసేసి కాటికాపరియై తాఁచుబాము కఱువ మృతినొందినతనకుమారుని దహనము చేసికొనుటకయిన రెండుమూళ్ల నేల దొరకలేదని విచారించినట్లు పురాణములలోఁ జదివి యది కవిచాతుర్య మనుకొంటిని. ఇప్పు డవి కవికల్పితములు గావనియు సత్యములే యనియు స్వానుభవమువలనఁ దెలిసికొంటిని. ఆహా! ఏమి చాళుక్యనరపాలునిపాలనంబున సుఖించినజనులు వానివలన వన్నసలం బడసినజనులు వాని యనుగ్రహమునకుం బాత్రులయినజనులు వానియిల్లాలికి నిలువ నీడనైన నిచ్చుట లేదే! పూర్వగాథలు, దడవనేల! పురాణములపొంత

బోనేల? నేఁ డిదియెల్ల నాకన్నులముందరనే జరుగుచున్నదే! రాజపత్నినివాసమున కంగీకరింపనియీరెండుగ్రామములలోనే మనమహారాజు నూతులఁ ద్రవ్వించెను. చెఱువులు త్రవ్వించెను. బ్రాహ్మణులకు మాన్యము లిచ్చెను. అవియెక్కడైనం దలపెట్టరే. వీరందఱుఁ గృతఘ్నులే. స్వలాభపరాయణులే. కృతజ్ఞత యనునది గ్రంథములలోను నిఘంటువులలోను మాత్రమే యున్నది గాని మనుష్యుల హృదయములయందు లేదు. ఓకాలమా! నీశక్తి వర్ణనాతీతముగదే. సర్వంసహాభర్తను సన్యాసిం జేయఁగలవు. బిచ్చగానిని పృథివీశ్వరుం గావింపఁగలవు. మహాపట్టణము మసనము జేయఁగలవు; వట్టియడవి పట్టణముఁ జేయఁగలవు. నాకవెఱ్ఱియేల? లోక మెప్పుడు నిట్లె యుండును. ముందుపని చూచుకొనవలయును గాని యీశుష్కవితర్కములతోఁ బ్రయోజనమేమి?" అని మఱికొంతదూర మరిగి యొకగ్రామముకడకుఁబోయి దానిపేరేమని కొందఱుబాటసారుల నడిగెను. "ఈగ్రామముపేరు ముదివేము" అని వారుత్తరము చెప్పిరి. "ముదివేమా? వేము చేఁదు. ముదివేము మిక్కిలి చేదు. పేరు విన్నంతనే నామనస్సు కీడు శంకించుచున్నది. అయినను వృథానుమానములు కలిగి నిరాశజెంది పోఁగూడదు. పేరుంబట్టి నడచుట పరిహాసము. పిచ్చయ్య యనుపేరుగలవాఁడు మతిమంతుఁడు కావచ్చును. బృహస్పతి యనిపేరుపెట్టుకొన్నవాఁడు వెఱ్ఱివాఁడు కావచ్చును. కావున గ్రామములోనఁ గరిగి యథమపక్షము మాదినమున నైన నుండుటకు వీలగునేమో తెలిసికొనియెద. దేహ మిక్కిలి డస్సినది. బోయలలసి యున్నవారు. నాకును విశ్రాంతి గావలసి యున్నది." అని మనంబునం దలపోసి పల్లకి నూరుబైట నొకచెట్టుక్రింద దింపించి సేవకుల నక్కడఁ గావలియుంచి మంత్రితో నొక్కఁడ గ్రామంబున కరిగెను.

ఆగ్రామమునఁ జెఱువుగట్టుమీఁద నొకతాటియాకులయిల్లుండెను. ఆయింటియరుఁగులమీఁద వేదఘోషవినఁబడుచుండెను. మంత్రి తిన్నగా నచ్చటి కరిగి యీయి ల్లెవరి దని యడిగెను. “అయ్యా! ఈయిల్లు నాదే. నాపేరు విష్ణుభట్టుసోమయాజి. మీ కెవరియిల్లు కావలెను?” అని రమారమి యఱువదిసంవత్సరములువయస్సు గలవృద్ధబ్రాహ్మణుఁడు వాని కుత్తర మిచ్చెను. అమాత్యుఁడు గంభీరమయినయావాక్కు విని మూర్తీభవించినవేదములో యనునట్లు విరాజిల్లుచున్నయాపరిశాంతమూర్తికి స్ఫటికాక్షసూత్రధారికి నమస్కరించి యాతనిచే దీవనల నొంది యిట్లనియెను. “స్వామీ! మేము బాటసాగులము. మా కీపూఁట వంటచేసికొనుటకు బస కావలయును. మీరాబస నొసంగఁ గలరా?” అని యడుగుటయు నాబ్రాహ్మణుఁడు “నాకు విశాలమైనదొడ్డి యున్నది. దొడ్డిలో నొకతాటియాకులయిల్లున్నది. ఆయింట మీరు వండుకొని తినవచ్చును.” అనిచెప్పి మీతోఁగూడ నాఁడువాళ్లున్నారా? యనియడిగెను.

“ఒకర్త మాత్ర మున్నది. ఆమె పల్లకిలో నున్నది” యని మంత్రి బదులు చెప్పెను. “మంచిది మీ రాబసలోఁ బ్రవేశింపుఁడు మీరు బాహ్మణులే గదా!” యని బ్రాహ్మణుఁడు బలికెను. “ఆహా! బ్రాహ్మణులమే.” యని యమాత్యుఁడు బదులుచెప్పి యూరు బైటకుం జని పల్లకిని దనబంట్లను వెంటం గొని యాయింటం బ్రవేశించి యది సేవకులచేత బాగు చేయించి తాను దప్ప మఱియొకబ్రాహ్మణుఁడు పరివారమున లేమి తానే స్నానముచేసి బ్రాహ్మణునియింటఁ బాత్రసామగ్రి నెరువుతీసికొని వంటచేసి మార్గాయాసమున మిక్కిలి డస్సియున్న రాజపత్నికి ముం దన్నముబెట్టి తరువాత సేవకులకు భోజనముపెట్టి కట్టకడపటఁ దాను భుజించెను. భోజనానంతరమున నందఱును విశ్రమించిరి. ఆరాత్రిగూడ నచ్చటనే యుండఁ

దలఁచి బ్రాహ్మణునిసెలవు గైకొని యామంత్రి మధ్యాహ్నమట్లె పాకంబు జేసి యందఱ నారగింపఁజేసెను.

రాత్రి భోజనమైనవెనుక మంత్రి విష్ణుభట్టసోమయాజితో రహస్యముగఁ గొన్నివిషయములు మాటాడఁ దలఁచి యాతనిసన్నిధి కరిగెను. సోమయాజియు భోజనముచేసి వీధియరఁగుమీఁదఁ గొబ్బరియాకులచాఁపమీఁద గూర్చుండి యుచ్చైస్స్వనముతో సామగానము సేయుచుండెను. ఆతని సామగానముముందర వీణాగానముసైతము పనికిరా దని విన్నవారందఱుఁ బ్రశంసించు చుందురు. అందుచే జుట్టుపక్కల నున్న బ్రాహ్మణు లందఱు నాగానామృతమును వీనుజేరలతో జుఱ్ఱుకొనుటకై వచ్చి యరఁగులమీఁదఁ జేరిరి. మంత్రియు వారిలోఁ నొకఁడై యొకమూలఁ గూర్చుండి మేటియుద్గాతల నోటనుండి యావిధముగా సామముల నెన్నఁడు వినియుండమి గానామృతాస్వాదనమునం జొక్కి పరవశుఁడై యుండెను. జాము రాత్రి యగునప్పటికి సోమయాజి గానము ముగించెను. శ్రోతలు వానికడ సెలవుగైకొని తమతమ గృహంబులకుఁ జనిరి. అందఱు చనినవెనుక మంత్రి సోమయాజిని గానవిషయమున నెంతయుఁ బ్రశంసించెను. సోమయాజి చిఱునవ్వు నవ్వుకొని యథోచితముగా నుత్తరము జెప్పి యిట్లనియె. "అయ్యా! మధ్యాహ్నమునుండి మిమ్ముఁ గొన్నిమాటలడుగవలయు నని యభిలాషకలదు. ఇందుకు నన్ను మీరు మన్నింపవలయును. మీరు బ్రాహ్మణులు. అందులో మావంటివైదికులు గారు. లౌకికులు. మీపై ఖరిజూడ గొప్పపదవుల నధిష్ఠించినట్లు కనఁబడుచున్నది. మీవెంటవచ్చిన యాచూలా లెవ్వరో నే నెఱుఁగఁజాలకున్నాను. ఆమె బ్రాహ్మణస్త్రీవలెఁ గనఁబడదు. వర్ణాంతరయయినయాకాంతకును మీకుఁ గలసంబంధ మెట్టిది? అదియునుఁగాక యామె మిక్కిలి సుకుమారివలెఁ గనఁబడుచున్నది. ఆమెవాలకమును

బట్టి మహాదుఃఖములో నున్నట్టు కనఁబడుచున్నదని మాసోమదేవి చెప్పుచున్నది. ఆమెకు నీవేలవంటచేసిపెట్టవలయు! నీయూలుబిడ్డ లెచ్చట నున్నారు? ఈనందేహములు నాకుఁ దీర్పవలయు." అని బ్రాహ్మణుఁడు తనమనంబున నున్నదింతయు వెడలఁ దెలుప నమాత్యుఁడు నాఁడబోయిన తీర్థ మెదురైన దని సంతసించి సోమయాజికిట్లనియె.

"మహాత్మా! ఆవిషయమై నేను మీతోఁ జెప్పుటకే వచ్చితిని. రాత్రిసమయముగదా యెవ్వరు సన్నిధ నుండరని నే నేకాంతముగ మాటాడఁ దలఁచితిని. కాని, మీసామగానముచేత సమాకర్షింపఁబడి పలువురు వచ్చియుండుటచే నే నావిషయము బ్రస్తాపించుటకు వీలులేకపోయినది. మీరే యడుగుటంజేసి చెప్పుటకు నాకు సంతోషముగానున్నది. ఈ దేశము పాలించుచుండిన చాళుక్యవల్లభుఁడు కటకేశ్వరునితోఁ బోరి రణముఖంబునఁ బ్రాణములు విడిచె నని మీరు కర్ణాకర్ణిగ విని యుందురు. ఈమె మృతినొందిన యామహారాజుపత్ని. యుక్తర గర్భభారసన్నయై యున్నది. ఎన్నోనూడిదలు గావలసిన సమయమున—నెన్నో ముచ్చటలు తీరవలసిన సమయమున, నెన్నో కోర్కెలు సఫలము గాఁదగిన వేళ—నెందఱపడఁతుల మన్ననలో బడయువలసిన కాలమున---నవవైధవ్యదుఃఖము, సందులోఁ బ్రాణసంశయము పలాయనము మొదలగుదుర్భరక్లేశములు సంభవించినవి. స్వామీ! భగవత్సంకల్ప మెట్లుండునో చూడుము. అసూర్యంపశ్యయై యాదిగర్భేశ్వరి యైన యీ దేవి యీయవస్థలోఁ దల దాఁచుకొనుటకు నెలవు దొరకక పల్లెపల్లెయుఁ దిరుగవలసివచ్చె. ఎన్నోనూడుగులు నెన్నో మహాభవనములు నెన్నోయుద్యానవనములుగల యీమహారాజపత్నికిఁ బ్రసవించుటకై నజిన్నగుడిసె దొరకకున్నది. కటకేశ్వరుఁడు దురాచారుఁడై యీమెం బ్రాణములతోఁ బట్టి తెమ్మని తనసేనాపతుల కానతిచ్చెను.

"ఈమె నేమి సేయవలయునని యాయన సంకల్పము? వధింపఁ దలంచుకొన్నాఁడా?" యని బ్రాహ్మణుఁ డడిగెను. అనవుడు రెండి యు మంత్రి యిట్లనియె. "అదిగాదు వాని సంకల్పము. అంతకన్న దారుణకృత్యము చేయఁ దలంచుకొన్నాఁడు. ఈమెను బ్రసవించిన దనుక దానేదో యొక నెలవున నుంచి మగబిడ్డం గనినపక్షమున నయ్యర్భకుని గర్భమునుండి వెడలినతోడనే సంహరింపవలయుననియు నాఁడుశిశువు పుట్టిన దానిం బెంచి పెద్దదానింజేసి కడునీచుని కిచ్చి వివాహము సేయవలయు ననియు నాతని సంకల్పము. ఇది రణనిహతుఁ డయిన రాజుపైఁ గల ద్వేషముచేతఁ గలిగిన సంకల్పము. వైరములు మరణాంతము లన్నమాట యాతనికి స్ఫురింపలేదు. శిశుహత్య మహాపాతకమన్నమాట యాతఁ డెఱుఁగఁడు గాఁబోలు! దీర్ఘకోప ముత్తమపురుషలక్షణముగా నున్నపలుకు వాని చెవిసోకియుండదు. సోఁకిన నేమి యది సమయంబున నక్కఱకురాదు. దేవా! ఆ రాజు ప్రతిజ్ఞ లావిధముగా నున్నవి. ఈ దేవియవస్థ లీవిధముగానున్నవి. చాళుక్యవల్లభుఁడు పరిపాలించిన దేశమునందు వానిపట్టపుదేవి కూర్చుండుటకు మూరెడుచోటయిన దొరకకున్నది. అతఁ డెన్ని యాలయములు బ్రతిష్ఠించెను. ఎన్ని తటాకములు త్రవ్వించెను! ఎన్ని యారామములు నిర్మించెను! ఎన్ని యగ్రహారము లిచ్చెను! ఎందఱు పండితులఁ బోషించెను! ఎందఱుకవులకుఁ గనకాభిషేకము జేసెను! ఎందఱు సాధుల సంరక్షించెను. ఎన్నిచేసిన నేమి? ఆతనియాదరమునకుఁ బాత్రము లయినవారిలో నొక్కరయినఁ గృతజ్ఞులుకానఁబడరు. కాలమంత చిత్రముగా మాఱిపోయినది. నేనాయనమంత్రిని. మున్ను నావలన నుపకారములఁ బొందినవారుసైతము నేనేదో వారివలననుపకృతిఁ గోరుదునని నన్నుఁ జూచి మొగము చాటుచేయుచున్నారు. కటకేశ్వరుని బారిఁబడకుండ నీరాజపత్నిని గాచుటే నాసంకల్పము.

ఇందు మీరు తోడుపడవలయు నని నాసంకల్పము. మీరు వేదవేదాంగపారంగతులు. సకలధర్మకోవిదులు. మీకు నావంటివాఁడు కర్తవ్యముపదేశింప నక్కఱలేదు. ఈపుణ్యము మీరు కట్టుకొనవలయును. మఱియొకదారి నాకగుపడుట లేదు." అని యాయుదంతము నెఱిఁగించి చేతులు జోడించి యాసచివుఁడు విప్రునకు నమస్కరించెను.

బ్రాహ్మణుఁడుమిక్కిలియాశ్చర్యముతో నిట్లనియె. "అయ్యా ఇది మిక్కిలి చిత్రముగాను దైన్యముగాను నున్నది. ఈమె చాళుక్యవల్లభునిపట్టపుదేవియా? ఆహా! ఎంతలో నీమె కింతదురవస్థ సంప్రాప్తించినది. పరమేశ్వరుని చేఁతలు కించిజ్జ్ఞులయినమానవమాత్రులకు దురూహ్యములుగదా! మొన్నటిరాణి నేఁటిపేదరా లయినది. ఆహా! ఆమె యెల్లవిధముల రక్షణీయ. అయినను దురాత్ముఁడయిన కటకేశ్వరునిఁ దలంచినపుడు గుండెలు జల్లుమనకమానవు. అతఁడు దాక్షిణ్యమెఱుఁగఁడు. దయారసమాతని మనంబున నేకోశమునం గానఁబడదు. వాని దినుపగుండె. రాతిమనస్సు. ఈమెకు శరణ మిచ్చిన మాకును నామెకును మరణముసంభవించు నని శంకించుచున్నాము. ఈయూరిబ్రాహ్మణులతోడను నిచ్చటనున్న క్షత్త్రియులతోడను, ముఖ్యులయిన శూద్రులతోడను, నే నాలోచించి నీకు సమాధానము జెప్పెద. రెండుదినము లిందుండుము. ఇప్పుడు ప్రొద్దుపోయినది. పండుకొందము. వెండియు రేపుదయము గలిసికొందము. అని యాతనిం బంపి నేలవేల్పు నిద్రింపఁబోయెను. అమాత్యుఁడును బ్రాహ్మణుని సాధుభావము గ్రహించి దనకు గొంత యాశ యున్నదని తన బసకరిగి యొకచాఁపపైఁ బండుకొని నిద్రించెను.

మఱునాఁ డుదయమున సోమయాజి తనకడకు వచ్చినవారితో రహస్యముగా నీవిషయమై కొంచెకొంచెముగా ముచ్చటించి సాయం

కాలము తనయింటికి వారి నిరమ్మని చెప్పెను. వారితోడనే గాక యాగ్రామములో నున్న ముఖ్యక్షత్రియులకును నాలవజాతివారికిని గూడ దనగృహమునకు రేయి రమ్మని వర్తమాన మంపించెను. రాత్రి భోజనానంతరమున బ్రాహ్మణు లిరువదిమందియుఁ బదుగురు క్షత్రియులు, బదుగురు కాపుపెద్దలు, బ్రాహ్మణుని యింటివెనుక నున్నదొడ్డిలోఁ జేరిరి. కొందఱు తాఁటియాకుల చాఁపలమీఁదను గొందఱు కొబ్బరిచాఁపలమీఁదను గొందఱు వట్టినేలను, గూర్చుండిరి. అమాత్యుఁడు కూడ వచ్చి వారి ప్రక్కను గూర్చుండెను. విష్ణుభట్టసోమయాజి వారినడుమ నిలిచి యుండి చాళుక్యవల్లభుని మరణము మొదలుకొని యిప్పటివఱకు జరిగిన వృత్తాంత మంతయు వారలకుం జెప్పి యామె తనయింటికి వచ్చిన మాట దెలిపి యిట్లనియె. "మనమందఱము నొక్కమాటమీఁద నుండినపక్షమున నీదేవిని మనము సంరక్షింపఁగలము. కటకేశ్వరుఁడు వచ్చినను, వాని సేనాపతులు వచ్చినను, వారీమెం గనుఁగొన్నను మన మందఱము నైకమత్యము గలిగియుండినపక్షమున భయములేదు. మన మందఱ మొక్కపడవ నెక్కినము. మునిఁగిన నందఱము నశింతుము. విపత్సముద్రము నానావ దాఁటెనా మనమందఱము బ్రతుకుదుము. మొదట రాజపత్ని యగుటచే నీమె మనకు రక్షణీయ. ఆఁడుదియగుటచే నంతకుమున్న రక్షణీయ. బాలాలగుటచే మఱియు రక్షణీయ. ఏవిధముచేతఁ జూచిన నీమె మనచే రక్షణమొంద నర్హురాలయియున్నది. కటకనాథునిదండనాథులు వచ్చి నాయిల్లు సొచ్చి యీమెయెవ్వరని యడిగిన నిది నాకూఁతురని చెప్పెద. ఇంతయందకత్తియ యైన కూఁతురు నీకెట్లు గలిగిన దని వారు నన్నడుగవచ్చును. ఇంక నెన్నో ప్రశ్నలు వేయవచ్చును. ఆవిషమస్థితి నప్పటికిఁ దోఁచినయుపాయములచేఁ దప్పించుకొందు. ఈ

మెను నాయింటనే యుంచెద. ఆభారము మీకెవ్వరికిని గలుగనీయను మంచివచ్చినఁ జెడ్డవచ్చిన నేనే భరించెద. కాని దైవిక రాజికముల కు మానవుఁడు పూటపడఁజాలఁడు. ఎటువోయి యెటువచ్చునో? ఈ మెరతకార్ధము మనమందఱము నాపద బొందవలయునని నిశ్చయిం చుకొనవలెను. అందుకు సిద్ధమై యిందుకు దిగవలయును. ఇటువంటి మహాపత్తులో నున్న మహారాజపత్నిని గావక క్షణభంగురము ల యిన యీశరీరములను గాచుకొనుటకై మనము పేక్షించుట ధర్మవిరుద్ధ ము. ఘాతుక కృత్యము. అట్టిమహారాజపత్నియే యిటు గుందుచుం డ మనవంటివారము గాసిజెందిననేమి? నశించిననేమి! పోయిన నా మెతోఁ బోవుదము, బ్రతికిన నామెతో బ్రతుకుదము. లోకోత్తర మైన యిట్టిధర్మకార్యము మనముచేయుచుండ నార్తత్రాణపరాయ ణుఁడైన నారాయణుఁడు మనయండనుండి యీవిపత్సముద్రము నుండి యామెను మనలం దేల్పఁడా? తేల్పకపోవుఁగాక. మనమం దఱ మీవిధమున నశింపవలసిన యోగమే మనకు విధాత నిర్ణయించియున్నపక్షమున దాని నెవ్వఁడు తప్పింపఁ గలఁడు! ధర్మపరాఙ్ముఖులమై కాకివలెఁ గాముపలెఁ జిరకాలము జీవించుటకంటెఁ బరోపకారార్థ మిదం శరీర మ్మనుమాట సార్థక ముగా ధర్మకార్యాచరణము చేసి మరణంబునొందుట యుభయలోక తారక మైనపద్ధతి. మరణ మెప్పటికయిన రాకమానదు. మంచికా ర్యము జేసి సత్కీర్తి యనుమిత్రముతోఁ గూడి పరలోకముఁ జేరినవాని భాగ్యమే భాగ్యము. అట్టిభాగ్యము గావలయునన్న నీదేవిని రక్షిం చుటయే దానికి సాధనము. మనలో నైకమత్య ముండిన నక్కటక రజాఁగని, మఱియెవ్వఁడుగాని మనగుట్టు దెలియఁజాలఁడు. ఐకమ త్యము పంచాక్షరీమహామంత్రము. దానిని యథావిధిగ నుపదేశము నొంది జపించి పునశ్చరణము సరిగాఁ జేసి యనుష్ఠించినవారు కామి

తార్థసిద్ధి నొందుదురు. ఇది కార్యసిద్ధికరమైనమంత్రము. సుఖప్రదమైనమంత్రము. అసమానమయినమంత్రము. అమోఘమయినమంత్రము. ఐకమత్యప్రభావముచేత నేగదా స్థావరములలో స్థావరమైన మఱ్ఱిచెట్టునాకులు గుమిగూడి మహాగ్రీష్మకాలమున మధ్యాహ్నసమయమున దుర్నిరీక్ష్యప్రభాభాసమానుఁడగు చండభాస్కరుని సహస్రమయూఖముల నెదిర్చి ధిక్కరించి వాటికిం బ్రవేశంబు నీయక దన్నాశ్రయించినవారికిఁ జల్లనినీడ నిచ్చుచున్నవి? ఐకమత్యప్రభావముచేతనేగదా మిక్కిలి తేలికయై సన్నగాలికి సైతము నెగిరిపోవు గడ్డిపోఁచలు సైతము వెంటిగాఁ బేనినప్పుడు దుర్భేద్యమై మిక్కిలి విజృంభించి యొడలెఱుంగక తిరుగు మదపుటేనుఁగనైన బంధింపఁ గలుగుట? ఐకమత్యప్రభావంబుచేతనేగదా మనుష్యుని నోటి నూదినప్పుడె యెగిరిపోవు చెదపురుగులు నయితే మినుమువంటి టేకుదూలములనుగూడ దొలిచి గుల్లలుచేయుట? ఐకమత్యప్రభావముచేతనేగదా యగ్నిశిఖలవంటి కోరలతో జగద్భయంకరవ్యవహారము సేయు కోడెత్రాఁచునైనను జలిచీమలు వేనవేలు పట్టి పీడించి కదలనీయక మెదలనీయక చంపివేయఁగలుగుట? ఇంకను నైకమత్యమహామంత్రప్రభావముల వర్ణించుట కెన్నో యుదాహరణములు గలవు. కాని యిది సమయము గాదు. కాల మతిక్రమించుచున్నది. ఈమంత్రము శాంభవం చాతురీమంత్రముకన్న నష్టాక్షరీమహామంత్రముకన్న మంత్రశాస్త్రములలోఁ జెప్పఁబడిన సకలమంత్రములకన్నఁ బ్రశస్తమయిన మంత్రము. దీనిని మీరు భజింపుఁడు. ఇంక నిమొక్కటియక్కై యవృతి మెచ్చు వచింపఁగలమని మీరు సందియింపఁడవచ్చును. అట్లు సంశయింప నక్కఱలేదు. అమృతసూత్రతత్త్వముల నాయిదుగురకుఁ దెచ్చెప్పెద వినుఁడు. నిరపరాధియైన, యొకలోకమనుష్యుని మహాత్ముఁడు దప్పుటకు వచ్చెననుకొనుఁడు. మహారణ్యములో నున్న యామనుష్యుఁడు మాచ

రణంబులకు బ్రొక్కి మీశరణంబు వేఁడి మరణంబు దప్పించుకొనుట కై మీయింట దాఁగెను. చంపఁదలఁచినవాఁడు ఖడ్గపాణియై "యీ మనుష్యుఁడు నీయింట దాఁగున్నాఁడా?" యని యడుగును. అప్పుడు సూనృతవ్రతానుష్ఠానము కర్తవ్యమని తలంచి నీయింట దాగియున్న యానిర్భాగ్యుఁబట్టి యప్పగించుట మంచిదో లేక భూతదయాళుం డవై శరణాగతుని గాచుట యుత్తమధర్మమని తలంచి వాఁడు నా యింట లేఁడని బొంకుటే మంచిదో మీ రాలోచించుకొనుఁడు! ధర్మ సూక్ష్మములు గ్రహించుట మిక్కిలి కష్టము. ఆర్తరక్షణముకొఱకు నాడినయనృతము నరకహేతువుగాదు. అది సూనృతమె యగును. సూనృతముకన్న నెక్కువదై మోక్షప్రద మగును. ఒకవేళ మోక్షము రాదని సిద్ధాంతము జేయుఁడు—నరకమే ప్రాపించినను నిరపరాధిని రక్షించిన సంతోషముతో నరకమునకుఁ బోవుటే యుక్తము. నేను వాదమునిమిత్త మట్లనుచున్నాను. గాని యీ యనృతము శుభప్రదమే యగును గాని పాపహేతువుగాదు. నరకము, మోక్షము పరమేశ్వరుఁడు మనయుద్దేశములంబట్టి ప్రసాదించునుగాని కేవల చేష్టలఁబట్టి కాదు. రాజు నరహంత నొక్కని శిరచ్ఛేదము చేయుమని తలారుల కానతిచ్చును. తలవరులు వానితలఁద్రెవ్వనేతురు. తలవరుల కందేమి పాపమున్నది? అందు శిరచ్ఛేదము జేసిన వానియుద్దేశము నరహత్య జేయుట గాదు. రాజునాజ్ఞ బరిపాలించుటయే. ఈ తెఱంగుననే ధర్మాధర్మముల నెఱుంగవలయు. నేను సాంగవేదాధ్యయన ప్రవీణు లయిన బ్రాహ్మణోత్తముల వంశమున జనియించినవాఁడను. క్రతువులు చేసినవాఁడను. శిష్టుండను. సత్యసంధుడనని పేరుపడినవాఁడను. అట్టినేనే మానినీప్రాణసంరక్షణార్థ మొక్కయనృత మాడఁదలఁచుచున్నాఁడను. కావున మీరందఱు నవసరమగునేని నామార్గంబు ననుసరింపవలయునని కోరుచున్నాను. బ్రా

హ్మణులారా! మీరు భూతదయాపరులు; స్వార్థత్యాగులలో నగ్రగణ్యులు; వేదస్వరూపులు. మీరంతఱు వెనుదీయక యట్లు చేయుఁడు. క్షత్రియులారా! మీరు శరణాగత పరతంత్రులు; బాహుబలసంపన్నులు; శౌర్యనిధానులు. శరణుజొచ్చిన పావురంబును రక్షించుటకై తనమేనికండలు తఱిగియిచ్చిన శిబిచక్రవర్తి వంశస్థులు. గరుడునిచే వధింపఁబడుటకు సిద్ధముగా నుండిన నాగకుమారుని ప్రాణములఁ గాచి తాను వధ్యశిలనెక్కి తనప్రాణముల నర్పించినజీమూతవాహనుని వంశస్థులు. ఏకచక్రపురమున భిక్షాటనముచే జీవించుచు బకాసురుని బారినుండి బ్రాహ్మణకుమారుని సంరక్షించి వానికి బదులుగాఁ దనకుమారుని దంపిన కుంతీమహాదేవివంశస్థులు. అనాథరక్షణము మీకుగ్గుపాలతోఁ బెట్టినవిద్య. అభయప్రదానము మీకు వంశక్రమాగతమైనధర్మము. ఆర్తత్రాణము మీకు సహజలక్షణము. కావున మీరు లేనిపోని, సందియంబులు మనంబునం బెట్టుకొనక తొల్లి వాసుదేవుఁడు నిండుచూలాలైన యుత్తరను రక్షించినట్లు మీరీచాళుక్యనరపాలుని ధర్మపత్నిని గావవలయు. శూద్రులారా! మీరు శ్రీమన్నారాయణుని పాదరాజీవములయందు జనించుటంజేసి భువనపావనమైన యాకాశగంగకుఁ దోడఁబుట్టినవారు. అమరవాహిని మీయింటియాఁడుపడుచు. మీకు నాగలి చేఁబూని దున్నుటంజేసి యీధాత్రికి వసుంధరయని పేరుగలిగె. మానవులకేగాక సకలజంతువులకు నిజముగా నన్నప్రదాత లెవరన్న మీరె. ఎండయనక, వానయనక, చలియనక, మూఁడుకాలములు మేను వంచి యిండ్లు వాఁకిండ్లు వదలి పొలములం జేరి ముక్కారుపంటలు పండించుటంజేసి కాదే యీభూమి పాడిపంటలు గలిగి వర్ధిల్లుచుండుట? పసరములు గడ్డిగాదములు గలిగి బ్రతుకుట? చిలుకలు మొదలగు పులుఁగులు పండ్లుమెసవి జీవించుట. మీవృత్తి శ్లాఘాపాత్రము. జగదుప

కార పరాయణు లన్న మీరే. అట్టిమీరు దిక్కుమాలినయొక్క పడంతిని బొత్తిమటలో వెనదీయుదురని నేను తలంపను. ఈసందర్భమున మీ కొక్క చిన్నకథ వక్కాణించెద. అది మహాభారతమందలి శాంతిపర్వమునం దున్నది. ఎన్నోవిహంగంబులఁ జంపిన కిరాతుఁ డొక్కఁడు వానకుం దడిసి చలిచే గడగడ వడంకుచుఁ జలిగాచుకొనుటకు నెక్కడ నయిన నిప్పు దొరకునా యని యెదురుచూచుచుండ నొక్కపిట్ట చెట్టున దాఁపుననున్న పల్లియ కరిగి మండుచున్న యొకపుల్ల నోటం గఱచుకొనివచ్చి వానికడం బాఱవైచె. కొన్ని చిన్నచితుకులు పోఁగుచేసికొని వాఁ డానిప్పు పెద్దమంటచేసి చలికాఁగి పేరాఁకలిచే నకనకం బడుచున్న నదిచూచి సహింపక యాపిట్ట యాయగ్నిలోఁ బడి మృతినొంది వాని కాహారమయ్యెను. మనము మనుష్యులమై జ్ఞానసంపన్నులమై-ధర్మాధర్మపరిజ్ఞాతలమై యున్నందుకా పిట్ట చేసినమాత్రమైన స్వార్థత్యాగము చేయవలదా? సకలధర్మములలో భూతదయ యుత్కృష్టధర్మము. దానికెనవచ్చునది మఱియొకటి లేదు. మహానుభావుఁడగు భరతుఁడను రాజర్షి యొక్కజింకం బెంచి దాని నిమిత్తమున మరల జంతుజన్మమెత్తెను. ఇవి యన్నియు లోఁదలంచి యనద యయిన యీ రాజపత్నిని రక్షింపుఁడు! ఇంతకన్న నధికంబుగ నేను మీ కేమియుఁ జెప్పఁజాల. కర్తవ్యము మీకే వదలుచున్నాఁడను" అని మనస్సులు కరఁగునట్లు, మేనులు పులకరించునట్లు, హృదయములు నీరగునట్లు, మహోత్సాహము జనించునట్లు పరమశాంతుఁడైన యాబ్రాహ్మణుఁడు దీర్ఘముగ నుపన్యసించుట యు సభాసదు లందఱు నేకకంఠ్యముగ "మేము మీతోడివారమే. మేము మీతోడివారమే. ఆమెను రక్షింపుఁడు? రక్షింపుఁడు!" అని యైకకంఠ్యముగఁ బలికిరి. విభుభట్టసోమయాజి తన వచోబీజములు చవిటిపఱ్ఱలం బడక సుక్షేత్రమునఁ బడియె నని సంతసించి వెండియు

నిట్లనియె. "గ్రామీణులారా, 'సంఘే శక్తిః కలౌ యుగే' యని మహనీయు లయిన ప్రాచీనులు చెప్పియున్నారు. కావున మనమంద అ మేకమై యీమహాకార్యము చేయఁబూనుట శ్లాఘాపాత్రము. మనలో నున్నశక్తి యంతయు రాశీభూతమై కటకనాయకుని పన్నుగడలం బ్రతిఘటించుఁగాక! మీసాయము లేకున్న నిట్టికార్యము తలపైఁ బెట్టుకొనఁగలనా? అగతికు రాలయిన యీయువతికు మీసాయము పెట్టనికోటయై వజ్రకవచమై యుండుఁగాక! ఇంక మీరందఱు మీమీగృహముల కరుగుఁడు. మీకు నిద్రాభంగము జేసి శ్రమపెట్టినందుకు నన్ను మన్నింపుఁడు" అనిపలికి వారి నామంత్రణము చేయ వారు సోమయాజిని బహువిధముల శ్లాఘించి యిట్లనిరి. "మహాత్మా! మీవలన మేము నేఁడు చరితార్థుల మయితిమి. ఇట్టిమహాత్కార్యము మా చేత మీరు చేయించినందుకు మేము మిక్కిలి కృతజ్ఞులము. ముదివేము గ్రామము నేఁడు ధన్యమైనది. ఆంధ్రదేశ మున్నంతకాలము—నాంధ్రమహాజను లున్నంతకాలము—దివాకరనిశాకరులు నభోమండలమున వెలిఁగినంతకాలము—ముదివేముగ్రామము సర్వసజ్జనులకు స్తవనీయమై, దేశచారిత్రమునందుఁ బ్రఖ్యాతమై యితరగ్రామములకు మార్గదర్శకమై, త్రిలింగదేశమునకు సువర్ణాలంకారమై, మీకతమున వెలయుచుండును. గ్రహరాజగు సూర్యునిచుట్టుఁ దక్కినచిన్న గ్రహములు తిరిగి ప్రభావంతము లైనట్లు మేమెల్ల మీచుట్టుం జేరి మీవలన యశోవంతుల మగుచున్నారము. పరమపవిత్రమైన మీచరిత్రము భవిష్యత్కాలమున నాంధ్రదేశస్థులు పఠించి చరితార్థు లగుదురుగాక! ఇంక మేము సెలవుదీసికొనియెదము." అని పీడ్కొని స్వగృహంబుల కరిగి నిద్రించిరి.

అక్కడనే కూర్చుండి విప్రపుంగవుని విపులోపన్యాసమును వీనులవిందుగా వినిన యానచివుఁడు మహానందభరితుఁడై పురజను

లండఱు వెడలిపోయినవెనుక సోమయాజిం దగ్గరి వారిపాదములకు నమస్కరించి "మహాత్మా! బ్రాహ్మణుఁడవన్న నీవే బ్రాహ్మణుండవు. సోమయాజి భగవంతుం డగుశంకరుని యష్టమూర్తులలో నొకమూర్తి యని వేదములు వాకొనుచున్నవి. పరమేశ్వరుని యష్టమూర్తులలో నిజముగానీ వొకమూర్తివి. జన్నములపేరుపెట్టి విత్తంబు నార్జించి నల్లమేఁకలం జంపి చెవులకుఁ గుండలంబులం దగిలించుకొన్నంతమాత్రమున మానవుఁడు నిజముగా సోమయాజికాఁడు. మేఁకలం జంపుటచేతనే మానవుఁడు సోమయాజియగునేని మనంబున నక్కటికములేని యక్కటికవాఁడు సోమయాజియగును. కుండలధారణముచే సోమయాజి యగునేని రత్నకుండలభూషితలైన యంగనలు సోమయాజిశబ్దమున కర్హులగుదురు. నిజముగ నీవ సోమయాజివి. భూతదయ కలవాఁడు సోమయాజి. అనాథరక్షణపరాయణుఁడు సోమయాజి. ఆర్తత్రాణపరతంత్రుఁడే సోమయాజి. మహాత్మా! ఇష్టమున్న నెట్టిదుర్బలుఁడైన మహాకార్యంబులు చేయవచ్చునని మీచరిత్రము ఘోషించుచున్నది. నీకు శరీరబలమూ లేదు. ధనమాశూన్యము. వయస్సు చెల్లినది. అయినను నిట్టిమహాత్కార్యము నీమనోబలముచేత నీనీతిబలముచేత నీతపోబలముచేత నీజ్ఞానబలముచేతఁ జేయఁగడంగితివి "క్రియాసిద్ధి స్సత్వేభవతి మహతాం నోపకరణే", మహాపురుషుల కార్యసిద్ధి యుపకరణము లక్కరలేకయే వారి సత్వగుణసంపదవలన నేయగుట నిజము. స్వామీ, నేను మీకు మిక్కిలికృతజ్ఞుఁడను. చాళుక్యరాజపత్నియు మీకుగృతజ్ఞురాలు" అని వాని యౌదార్యాదిగుణములఁ బ్రశంసించి కృతజ్ఞతం దెలుపుచుండ జన్నిగట్టు వానిమాట కడ్డముపోయి "అయ్యా! యిల్లలుకఁగానే పండుగ కాదు. నే నిందుఁ జేసిన దేమియు లేదు. చేతనైనసాయమా మెకుఁ జేయుటకు సంకల్పించితిని ఈసంకల్పమాత్రమున కేనన్నింతకొనియాడవలయునా?తలపెట్టినకార్య

ముతుదనెగ్గిన వెనుక మీకృతజ్ఞతాదులుదెలుపవచ్చును. కాలగర్భమున నేమి యిమిడియున్నదో యెవరుచెప్పఁగలరు? పరమేశ్వరుఁ డేమిచే యఁ దలంచుకొన్నాఁడో మన మేమెఱుఁగుదుము? నీవింక నిదురింపఁ బొమ్ము." అని యాతని నంపి తాను నిద్రించెను. అమాత్యుఁడు రా జపత్నికడకుఁ బోయి జరిగినవృత్తాంత మంతయుఁ దెలిపెను. ఆమె యు సంతసించి మంత్రికి బ్రాహ్మణునకుఁ దనకృతజ్ఞతం దెలి పెను.

మఱునాఁడుదయమున సోమయాజియుసోమి దమ్మ యు రా జమహిషిం జూడఁబోయిరి. ఆమె లేచి యిరువురకునమస్కరించెను. విష్ణుభట్టు ప్రేమతో నామెనాశీర్వదించి యామెయువస్థనుగూర్చివిచారించి కూ ర్చుం డు మ ని యా న తి చ్చి తా ను నె ట్ట యె దు ట గూర్చుండి యిట్లులనియె. "తల్లీ! నాచేతనైనంత సాయము నీకు నేను చేసెద. అవసరమైన నీనిమిత్తము నాప్రాణము లర్పించెద. నీవు భయపడకుము. మాకు బిడ్డలులేరు. నీవే నాబిడ్డవు. ఈసోమి దమ్మ నీతల్లి. నేనునీకు జనకుండను. భగవదనుగ్రహమున నీకింకసుఖ మగునని నేను జెప్పఁగలను. ఎందుచేతనో నాయంతరాత్మ యట్లు చెప్పుచున్నది. బిడ్డా! నీ కొక్కయుపదేశము జేయవచ్చితిని. కటక నాయకుని దండనాథులు వచ్చి నీవెవ్వరని విన్నడిగెడు పక్షమున నే ను విష్ణుభట్టుసోమయాజి పుత్రికనని నీవుచెప్పుము. నాతల్లి చిన్నతన మునందె పోయిన దనుము. ఈసోమిదమ్మ సవతితల్లి యనుము. అ మ్మ యీయసత్యమాడి ప్రాణరక్షణము చేసికొనవలయు. నేను న న్నె యనువాఁడ. ఇదిసరిగా జ్ఞాపకముంచుకొనుము. భక్తవత్సలుఁ డగు పరమేశ్వరుని హృదయంబున నిలిపికొనుము. దేవదేవుని నమ్మి నవా రెన్నఁడుఁజెడిపోవరు. నమ్మనివారిలోఁజెడినవారున్నారు. మా

నుమ ప్రయత్నము దైవబలమిళితమైనప్పుడు ఫలియించును. కుమారీ! పేదపాఱుఁడ నైననే నింతకన్న నీకేమిచెప్పఁగలను. అంగబలము లేనివాఁడ. అర్థబలములేనివాఁడ. ఆయుధములులేనివాఁడ." అనవుడు నా దేవి బాష్పాకులితలోచనయై మెల్లగ నిట్లనియె "మహాత్మా! అట్టిమహారాజు చెట్టబట్టి యట్టి మహావైభవముల ననుభవించి యట్టిబ్రతుకు బ్రతికి తుదకిట్టులైతిని. ఇన్ని గ్రామములు దిరిగినను నేను తలదాచుకొనుట కయిన నెలవు దొరకినది కాదు. ఇట మీరు రక్షింపఁగలిగినను రక్షింపలేకపోయినను నాకు విచారములేదు- ముందుగా నాల్గుదినములు నిర్భయముగాఁ దలదాచుకొనుటకుఁ దావు నొసంగిరి. ఇదియే నాకిప్పుడు మహోపకారముగ నున్నది. అంతియేగాక శక్యమైనసాయము చేయుటకు వాగ్దానమొసంగిరి. ఈదానమే చాలు! అన్నదానముకన్న, వస్త్రదానముకన్న భూదానముకన్న గోదానముకన్న నభయప్రదానము శ్రేష్ఠమయినది. ఏలయన నభయప్రదానమనఁగా ప్రాణదానము. ప్రాణము నిలిచినప్పుడుగదా యన్నవస్త్రములు భూములు గోవులు నుపకరించుట? అదిలేనినాఁడు వీనిప్రయోజనమేమి? ఈయభయప్రదానమునా సుస్పష్టముబాగుండిన జాళుక్యకులసంతతికినిధానమై నాజీవచరిత్రమునందుఁ బ్రధానాంశమైయుండు. మీరంగబలము నర్థబలము నాయుధబలము లేనివారంటిరి. అంగబలములేకున్నను వేదవేదాంగబలము కలదు. అర్థబలము లేకున్నను పరమార్థబలముగలదు ఆయుధబలములేకున్నను మంత్రాయుధబలము గలదు. మహారాజులు మేటిదళములతోఁ జేయలేనిపని రాజ్యతంత్రములతోఁ జేయలేనిపని, యంత్రంబులతోఁ జేయలేనిపని మీరు మంత్రంబులతోఁ జేయఁగలరు. వేలకొలఁది యేండ్లనుండి లే ఖ్యాయాథములు గాని నాల్గువేదంబులఁ గంఠంబున నిలిపి లోకంబు

నం బ్రసరింపఁజేసిన మహానుభావులరు. మీపలుకు లమోఘంబులు. మీవంటి మహనీయు లుండఁబట్టి ధర్మంబులు నడచుచున్నవి. వానలు గురియుచున్నవి. పంటలు పండుచున్నవి. ఋతువులు క్రమంబు దప్పకసంచరించుచున్నవి. మీప్రారంభములు తప్పకఫలప్రదములగును. ఇప్పటికయినఁ గొంతపుణ్యము నేఁ జేసికొనఁబట్టి నేను మీయిల్లుఁ జేరితిని. దుఃఖాంధకారమగ్న నయినానాకు భగవంతుఁడు విష్ణుభట్టసోమయాజి యనుదీపమును బ్రసాదించెను. మీసాయంబను తేఁపచే నే నీదుఃఖసముద్రము నీఁదఁ గలనని ధైర్యము గలుగుచున్నది. నేను మీబిడ్డనన్నమాట నిశ్చయము." అని వెండియు నామె యా దంపతులకు నమస్కరించెను. వారిరువురు క్రమ్మర నామెం దీవించి గృహంబునకుం జనిరి.

కటకక్షితిపాలునియాన శిరమునఁదాల్చి వీరవర్మ కొంతదళంబును దోడుకొని చాళుక్యవల్లభుని ప్రాణవల్లభను వెదకుటకై యామెపోయినదెస ననుసరించి గ్రామగ్రామంబునకుఁ బోవుచు గ్రామవాసులం బిలువనంపి యామెజాడలనరయుచు, ననుమానము దోఁచిన పట్ల గృహంబుల శోధించుచు శోధింపవలదని బ్రతిమాలుకొన్న గ్రామస్థులవలనఁ గావలసిన ధనకనకవస్తువాహనంబులు గానుకలు గొనుచు గమ్యస్థానము లేనిపయనము సేయుచుండెను. ఒకనాఁడతఁడు సాయంకాలమున నొకయూరుబయట తోఁటబోఁ సైన్యమునునిలిపి యొక పీఠముపైఁ గూర్చుండి యొకసైనికునితో మాటలాడుచుండఁ గాళ్ళకుగజ్జలు, మొగమునఁ బట్టెనామములు, నెడమబుజమున నంచితంబుర కుడిచేతిలో ముప్పాలు గూర్చిన కట్టచిరుతలు చంకనుజోలి మెడలోఁ దులసిపూసలు గలయొకదాసరి యాతని డాసి జోహారుచేసిమొట్టమొదుట నిలువఁబడెను. అప్పుడు కనుచీఁకటిపడుటచే నతఁడు

వానిని గుర్తింపలేక "నీ వెవ్వఁడవోయి!" యని యడిగెను. "స్వామీ! నా మొగము గుర్తించుటకు వీలులేకపోయిన నాకంఠస్వరమును బట్టియైన నన్నానవాలు పట్టవచ్చునే. నేను మీపాదసేవకుఁడను సింగఁడను గా" యని వాఁడు బదులు చెప్పెను. "ఓహో! సింగఁడా? పరధ్యానమునుండి నీకంఠము గుర్తింపలేకపోతిని. వేగులవాండ్రలో నీవలెఁ జిరపరిచితుఁడనైన నన్నుఁ గూడఁ గన్నుఁ బ్రామఁగల నేర్పరి మఱియొకండు లేఁడు. నీవేగు సఫలమైనదా లేదా! ఆమె జాడ లెందైన గనబడినవా!" అని వీరవర్మ వానిం బ్రశంసించి యడిగెను. అనవుడు సింగఁ డిట్లనియె.—"స్వామీ! ఈ దాసరివేసముదాల్చి నే నామెజాడలు నరయుటకై బికిరమెత్తునెపంబున నెన్నెన్నో పల్లియలు కరిగితిని. ఏపల్లియయందును నామె కనఁబడలేదు. ఆయూరు వెళ్లినదని యీయూరు వెళ్ళినదని చెప్పువారే గాని సరియైన నెలవు చెప్పువా రెవ్వరులేరు. కాని, నేఁ గనిపెట్టిన నూతనవిషయ మొక్కటి విన్నవించెద. నేను ముదివేముగ్రామమునకుఁ బోయి బిచ్చమెత్తుచు నొకబ్రాహ్మణునిముంగిట నిలిచి పదములు పాడుచుంటిని. అప్పుడు రమారమి యిరువదియైదుసంవత్సరములు ప్రాయము గల చూలాలొకరిత నాకంటఁ బడియెను. ఆమె వితంతువని నే నూహించితిని. ఆమె యంతో చక్కనిది. అట్టి పేదబాపనియింట నుండఁ దగినది కాదు. తొలుకరమెఱుపువలె నొకగదిలోనుండి యొకగదిలోనికిఁ బోవునప్పుడు క్షణకాలమే యామె నాకంటఁబడుటచే మఱియేమియు నామెనుగూర్చి నేఁ జెప్పఁజాలను. ఇదే నా చూచిన విషయము. ఇదే నా యుఱికి వృత్తాంతము. మీఁది దేవరచిత్తము" అనవిని తలయూఁచి భూపతి తెల్లవారుజామునఁ బయనమని సైనికులకుఁ జెప్పి భోజనముచేసి పండుకొని వేకువజామున మేల్కొని

న సైన్యముగా బైలుదేఱెను. రెండుదినములు పయనముచేసిన పిదప వారు ముదివేముగ్రామముఁ జేరిరి.

వీరవర్మ యూరిబయటఁ జెఱువుగట్టునకు సమీపమునఁ దనగుఱ్ఱారములం బన్నించి యందు విడిసి గ్రామములో ముఖ్యమయిన బ్రాహ్మణులను, క్షత్రియులను, వైశ్యశూద్రులను, బిలిపించి యిట్లనియె "ఈగ్రామమునఁ జాళుక్యనరపాలునిభార్య యున్నట్లు మాకుదెలిసినది. నేను చండశాసనుఁడైన కటకేశ్వరుని సేనాపతిని. ఆమె యెచ్చటనున్నదో మీరు పట్టి యప్పగింపవలయును. అప్పగింపరేని మీమేనులు మీవి కావు మీ ప్రాణములుమీవికావు. మీయిండ్లుమీవికావుఇల్లిల్లుశోధించునట్టిశ్రమ మాకు లేకుండముందుగా నాపెందోడ్కొనివచ్చి మాకప్పగింతురేని మీకుబహుమానములిప్పించెద. బ్రాహ్మణులకుమహామహోపాధ్యాయబిరుదంబులిప్పించెద. క్షత్రియులకుఁవీరకేసరి, పరగండభైరవ, ప్రతిపక్షభయంకరప్రముఖ బిరుదంబుల నిప్పించెద. శూద్రులకు, బ్రశస్తములైనభూములు పన్నులు కట్టకుండ నిప్పించెద. ఇంక నెన్నో యుపకారంబుల జేయించెద. చెప్పుఁడు! వేగమ చెప్పుడు!" అని హెచ్చరించు సేనాపతిం జూచి వారైకకంఠ్యముగ నామె తమయూర లేదని చెప్పిరి. "ఏమేమీ! లేదా? ఏయూరను లేక యెందుఁ బోయినది? వియచ్చర లగునచ్చరమచ్చెకంటులు శకుంతలను నెచ్చెలులనడుమనుండి చెచ్చెర నెత్తుకొనిపోయినట్లు లామెను దివ్యాంగనలు తీసికొనిపోయిరా? త్రాచుబామును గరుడుఁడు తన్నుకొనిపోయినట్లు విహంగము లేవియైన ముక్కునం గఱచుకొని యెత్తుకొని తీసికొనిపోయెనా? మున్ను సీతాదేవిని భూదేవి తనగర్భంబునకు లాగికొనిపోయినట్లు లీమెంగూడఁ గొనిపోయెనా? ఏదో యూర నుండవలెఁ గాని మాయమగునా? ఇంక మీయసంబద్ధ ప్రలాపములఁ గట్టిపెట్టి యా

మెం దెచ్చి మాకుఁ గానుకగా నర్పింపుఁడు. దీనికి మీ రొడంబడ రేని నే నింతమాత్రముతో మిమ్ము విడిచిపెట్ట. మీమాటలునమ్మి పోవువాఁడనుగాను. మీయిండ్లన్నియు శోధించెద. ఆమె కానంబడి నదా మొదట నామెం దాఁచినందుకు, మీదుమిక్కిలి దాఁచి చెప్ప నందుకు, మాకు, శ్రమ గలిగించినందుకు, మిమ్ము బహువిచిత్రవధల పాలు జేసెద. జాగ్రత్త" యని మిక్కిలిభయపెట్టెను. అప్పుడు విష్ణు భట్టుసోమయాజి కొండవలె నించుకేనియుఁ జలింపక వానికిట్లు విన్న వించెను—"అయ్యా! గృహములు శోధింతునని, చిత్రవధలపాలు చేతునని మమ్ము బెదరించవద్దు. మీయిచ్చవచ్చినట్లు శోధింపుఁగా నుఁడు! మా కించుకేనియు భయములేదు. దుష్కార్యములు చేసిన వారికి భయముండును గాని మా కేమిభయము! ఆమె మాకడ లేదు. మఱియొక గ్రామమునకు వెళ్ళి వెదకికొనుటమంచిది. లేదా మమ్ముఁ జంపుటయే మీకుఁ బ్రధానమైనపక్షమున నిదిగో నాతల మీరు కానుకగాఁ దీసికొనుఁడు." అని మహాధైర్యముతోఁ బలికిన యమ్ముదుసలి పలుకుల నాలకించి వీరవర్మ యచ్చెరువడి "సరే! నేఁటికి సాయంకాలమైనదిగదా! రక్తసిక్తాంగముతో మీచాళుక్యవల్ల భుఁ డస్తమించినట్లె భాస్కరుఁ డస్తమించుచున్నాఁడు. రేపుదయ మున మీగ్రామము శోధించెద. సైనికులారా! ఈయూరినుండి యొ కపిట్టయైన నీ రేయి దాటిపోకుండ నాలుగుమూలల మేటినెగళ్లు వేసి కొని కనులుమూయకుండ నలుజాములు కాచికొనియుండుఁడు. ఈ నెగళ్ళకుఁ గావలసినపుల్ల మీమీగృహములనుండి పురజనులుపంపుఁ డు!" అనియానతిచ్చెను. గ్రామీణులు వానికడ సెలవుగైకొని యిండ్లకుఁబోయి తాము సిలువవేసికొనియున్న వంటకట్టియల మో పులుమోపులుగాఁ దెచ్చి సైనికులు బడవేయుమన్నచోట్లఁ బడవై

చిరి. గ్రామవాసులలోఁ గొందఱు భయపడి "మన మూఱుపేరేఱుఁ గనియొకానొక ర్తనిమిత్తము మానప్రాణములఁగోలుపోవనేల? అలుబిక్షలతో నన్నాముగాని సన్న్యాసులము గాముకదా! చేయలేనిధర్మము సమకట్టి నశించుట యేటిపాడి!" యని యధైర్యమునఁ దమ మిత్త్రిలతో ననఁజొచ్చిరి. ధైర్యశాలురగుమిత్త్రిలు వారిమాటలను ఖండించి మొదటఁ జేసినబాసకుఁ గట్టువడి యుండఁదగు ననియుపదేశించిరి. దైవముమీఁద భారముపైచి గ్రామస్థులారేయి తిన్నగా భుజింపక నిద్రపోవక తోఁచక యిటునటు దిరుగుచుఁ గాలక్షేపము చేయుచుండిరి. సైనికులు వంటకట్టియలతో గ్రామమున నలుదెసల నెగళ్ళువైచి మహోత్సాహముతో నిటునటు దిరుగుచుండిరి. తనకతమున ధర్మాత్ముఁడగు బ్రాహ్మణోత్తమునకు ముదివేము గ్రామవాసులకు నేమియాపద మూఁడునో యని రాజపత్ని కంటిమీఁదఁ గునుకులేక తెల్లవాఱినదాఁక బెంగపెట్టుకొనియుండెను.

ఎట్టకేలకుఁ దెల్లవాఱెను. గ్రామవాసులు గుండెలు చేతఁ బట్టుకొనియుండిరి. చలిగాలివలె భయ మెల్లవారిని గడగడ వడఁకించెను. వీరవర్మ సూర్యోదయానంతరమున మేల్కని కాల్యకృత్యములఁ దీర్చుకొని ఫలాహారముచేసి యశ్వారూఢుఁడై సైనికులు కత్తులు బల్లెములు విండ్లు నమ్ములు బూని తనవెంట భయంకరాకారులై రా, గ్రామమంతయు నొక్కసారి తిరిగెను. చిచ్చులపిడుగులవలె నాతఁ డెవ్వరియింటిమీఁదఁబడునో ముందుగా నెవ్వరిగృహము నాశనముచేయునో యని యెల్లవారు భీతచేతస్కులై యాతనివంకఁ జూచుచుండిరి. దాసరివేసము ముందు దాల్చినసింగఁడావేసముం దీసి జోదువలెఁ గటారి చేతఁబూని ముందునడుచుచు వీరవర్మకు దారిఁ జూపి విష్ణుభట్టసోమయాజిగృహంబునకుఁ దోడ్కొనిపోయి

యిదే యాగృహమని చెప్పెను. వీరవర్మ గుఱ్ఱము దిగి సోమయాజిం బిలిపించి "నీయింటఁ జాళుక్యరాజపత్ని యున్నట్లు మాకనుమానముగా నున్నది. నీగృహము శోధించెదను. ఇందుకు నీ వేమందువు?" అనియడిగెను. "మీయిచ్చవచ్చినట్లు శోధింపుఁడు. మహాధికారము చేతఁబూనిన మీవంటిప్రభువులతో నేనింతకన్న నేమి చెప్పఁగలను? దైవగతి యెట్లో యట్లు సిద్ధించుఁగాక!" యని బ్రాహ్మణుఁ డూరకుండెను. వీరవర్మ సైనికులం గొందఱఁ దోడ్కొని మాఱుమాటాడక గృహముఁజొచ్చి గదియు దొడ్డియుఁజూచి పిమ్మట వంటయింటి కరిగెను. అత్తఱి నాదేవి యుచ్చటనే తలుపుచాటున నొదిగి నిలువఁబెట్టినబంగారుబొమ్మవోలెఁ దల వంచుకొని గోడకుం జేరఁబడియుండెను. ఆమెలావణ్యము సౌకుమార్యముఁ జూచి వీరవర్మ యచ్చెరువడి "ఆమెయెవ్వతె?" యని విష్ణుభట్టు నడిగెను. "అయ్యా! ఆమె నాకూఁతురు. ఈనడుమనే యామెభర్త మృతినొందెను. నిండుచూలు దాల్చియున్నది." యని యతఁడు బదులు చెప్పెను. "ఏమయ్యా, బ్రాహ్మణుఁడా! ఈబూటకము లెక్కడ నేర్చితివి? పోతపోసిన పదియాఱువన్నెబంగారువంటి శరీరచ్ఛాయ గలిగి కొంచిలచినను జేరలకు మీఱి తమ్మిరేకులంబోలుకన్నులు గలిగి మహాదుఃఖసముద్రమున నుండియుఁ దనలావణ్యమును గోల్పోక చూపఱకన్నులకు విందు సేయుచున్న యీయిందువదన నీకూఁతురా? నీచికిలికన్నులకు నీబుఱ్ఱముక్కునకు నీబడుగుమేనునకు నీదొప్పచెవులకు నీవంకటింకరకాళ్ళకు లోకోత్తరసుందరియైన యిటువంటికూఁతురు జనించె నని నీవు చెప్పినను నమ్మువా రెవ్వరు? మసిబొగ్గులోనుండి మాణికము పుట్టఁగలదా? చాలుచాలు! ఈమెయెవరో నిజము చెప్పు. లేకున్న నిప్పుడే కొఱత నేయించెద." అని కఠినస్వరముతో నాసేనాపతి మహీసురుని మందలించెను.

నావుడు విష్ణుభట్టు వీరవర్మబిభీషికలకు వెఱపింతయు లేక యిట్లుత్తరము జెప్పెను. "అయ్యా! నాయందమునకుఁ జందమునకు నిట్టిచక్కనిచుక్క పుట్టునంటివి. తల్లిం బోలినయాఁడుబిడ్డ లుండరా? ఇది నాప్రథమభార్యకూఁతురు. ఈమె జనియించిన పైదవనాఁడె యామె స్వర్గస్థురాలయినది. ఈసోమిదమ్మ నారెండవభార్య. ఈమె వలన నాకు సంతానములేదు. ఈబిడ్డతల్లి మిక్కిలి సుందరాంగి. ఈమె తల్లినోటనుండి యూడిపడినట్లున్నది. ఈమెను నామేనల్లున కిచ్చి వివాహము చేసితిని. అతఁడీనడుమనే కాలధర్మము నొందెను. చక్కనిపడంతులు రాజకులంబుననే గాని యొండుచోట్ల బుట్టరని మీయభిప్రాయము కాఁబోలు! మహారాజాంతఃపురములయందే గాక పేదలగుడిసెలలో సైతము చక్కనివాండ్రు జనియించుచుందురు. చూపులకు విందులు సేయుచు సౌరభంబుల దెసల వెదజల్లెడుమనోహరపుష్పములు ప్రమదావనంబులయందె గాక మహాటవులయందును జనించుచుండును. మేను పులకరింపఁ జేయుమందమారుతములు పుడమిఱేఁడుల మేడలనేగాక పేదలయాకుటింట్లకడ నయితము వీచుచుండును. మసిబొగ్గునందు మానికములు పుట్టునో లేదో నే నెఱుఁగను గాని యారెండును నొక్కజాతిపదార్థమే యని శాస్త్రవేత్తలు చెప్పుదురు. పదియాఱువన్నెపసిఁడి మంటిలోఁ బొడమును. నేత్రపర్వము జేయుతామరపువ్వు బురదలోఁ బుట్టును. ప్రపంచమునందలి వైచిత్ర్యములు వర్ణనాతీతములు. చంద్రవంశపురాజులకువంశకర్త యయిన దండితారాతి యయాతి బ్రాహ్మణులలో శుక్రాచార్యునినందన యగు దేవయానిని వలచి యామెను వివాహమాడుట యధర్మమయినను భార్గవునియనుమతంబు వడసి చేపట్టెను. అనేకవిలాసినీసమన్వితుడయినయారాజును బ్రాహ్మణకన్యయే సుమీ వలపించినది. అదియునుఁ గాక త్రిలోకాధినాథుఁడయిన దేవేంద్రుని వలపుమునిపట్టిలో మంచి

తనయింటికోడిం జేసి కూయించిన దెవ్వతెయో యెఱుంగుదువా? పరమఛాందసుఁ డయినగౌతమునిభార్య యహల్య బ్రాహ్మణకన్య చక్కఁదనము రాచవారికాణాచి గాదు. అదియెల్లవారలకు సామాన్యమైనసొత్తు. అనాథ యయినయీబాలిక నాగారాబుకూఁతు రగునో కాదో యని నీకుసందియ మున్నపక్షమున గ్రామీణు లందఱిం బిలిచి యడుగుము. దుస్సహమయిన నవవైధవ్యఖేదమున మఱుఁగుచున్నయీబిడ్డను నీవంటిలోకజ్ఞుఁడు కర్ణకఠోరము లైనయీపలుకులతో నొప్పించుట పాడిగాదు. నేను పరమఛాందసుఁ డగు బ్రాహ్మణుఁడను. ఆమె యనాథ; చూలాలు. కావున నిట్టిదయనీయుల మయినమమ్ము బాధింపక వెడలి పొమ్ము."

అప్పలుకులు వినినతోడనే వీరవర్మమనంబున సందియముతోఁచెను. సాహసించి యేకార్యము జేయఁగూడ దనియు, నవివేక మనేకాపదల కాస్పద మనియు నతనికిం దట్టెను. అప్పుడు బ్రాహ్మణుఁడు చెప్పినప్రకార మాతఁడు గ్రామవాసులం బిలిపించి యాబాలిక యెవ్వరని వారి నందఱ నడిగెను. వారందఱు నైకకంఠ్యముగా 'నీమె మా సోమయాజికూఁతురే' యని పలికిరి అప్పటికిని వానికి సందియము దీరమి విష్ణుభట్టుం జూచి యిట్లనియె. "ఆర్యా! ఈమె నీకూఁతు రయినపక్షమున నామెచేతినీరు నీవు త్రావుము. అప్పుడు నాసంశయవిచ్ఛేద మగును." అనవుడు బ్రాహ్మణుఁడు సంతోషముతో "నాయనా! నాకూఁతురుచేతినీరు ద్రాగుటకు నాకు సంశయమేముండును?" అని రాజపత్నిం జూచి "బిడ్డా! ఆపంచపాత్రతో మంచితీర్థము దెచ్చి నాకిమ్మ" అని యానతిచ్చెను. అవస్థకుం దగినట్లు నడచుకొనినఁగాని కార్యసిద్ధి గాదని దేశకాలంబుల నెఱిఁగిన యాదేవి తక్షణమే స్వహస్తముతో విష్ణుభట్టునకుఁ బానీయంబులు తెచ్చి యిచ్చెను. బ్రాహ్మణుఁడు తనలో "పరమేశ్వరా! ద్వితీయ

వర్ణంబునం బుట్టినయీ బాలికచేతినీరు నేను ధర్మకార్యార్థమై యాప ద్ధర్మముగా గ్రహించుచున్నాఁడ. గావున నే నిందు దోసంబు గావించిన నీవ క్షమింపవలయు. ఉషస్తి యనుబ్రాహ్మణుఁడు పేరాఁకలిచేఁ బీడింపఁబడి మాలవానికడనుండి గుగ్గిళ్ళుదిని ప్రాణంబు నిలుపుకొనియె నని యుపనిషత్తులలో వర్ణింపఁబడియున్నది. అట్లు చేసినను నతఁడు తనబ్రాహ్మణత్వమును గోల్పోవలేదు. అట్టే నాకును నెట్టి వెలితియు గలుగకపోవుఁగాక!" యని ప్రార్థనము జేసి యామెచేతి పంచపాత్ర నందుకొని యానీరు గడగడ ద్రావెను.

దానితో వీరవర్మసందియము దీరెను. "ఈపని చాలునా, మఱియేమయినదృష్టాంతరము కావలెనా?" యని విష్ణుభట్టు వెండియు వీరవర్మ నడిగెను. "అయ్యా! చాలు చాలు! నాసందియములు తీరిపోయినవి. ఆమె క్షత్రియాంగన యయినపక్షమున ననేకక్రతువులు చేసిననీవంటిఛాందసుఁడు కోటివరాలిచ్చినను నామెచేతినీరు ద్రావఁడు నిష్ఠాగరిష్ఠుఁడయినబ్రాహ్మణశ్రేష్ఠుఁడు ప్రాణత్యాగమున కయిన నొడంబడునుగాని స్వధర్మత్యాగమునకు సమ్మతింపఁడు ఈమె నీ కూఁతురే యని నా కిప్పుడు నమ్మకము కలిగినది. అనూచానుఁడవు, పరమపూజ్యుఁడవు. నిర్మలచరిత్రుఁడవు నయిననిన్ను నే నవివేకంబున ముసుముందు దూలనాడితిని. మేము పరులకు శరీరంబుల నమ్ముకొన్న సేవకులము. కావున మాధర్మము నిర్వర్తించునప్పుడు నిష్ఠురోక్తుల నాడవలసివచ్చెను. అందుకు నన్ను మీరు క్షమియింతురుగాక! నా కింక సెలవొసంగుఁడు. ఇదే మీకు నమస్కారము." అని శాంతముతోఁ బలికి బ్రాహ్మణునకు వినతులుచేసి సపరివారముగా నాయూరు విడిచి పోయెను. అతనితోడనే గ్రామీణుల భయము పోయెను! . చాలుక్యరాజపత్నికి దిగులు దీరెను. విష్ణుభట్టువిచార మడఁగెను. సోమిదమ్మ సుముఖి యయ్యెను. గ్రామీణు లందఱు

విష్ణుభట్టుయొక్క యుదారభావమును, సమయస్ఫూర్తిని, ధర్మపర
తను వేయితెఱంగులఁ గొనియాడిరి. అమాత్యుఁడు విష్ణుభట్టునకు నమస్కరించి కౌఁగలించుకొని చేతులు పట్టుకొని "స్వామీ! చాళుక్యవంశము మరల నిలిపితిరి. మీయౌదార్యము శ్లాఘాపాత్రము. పరమశాంతుఁడవైన నీయందు క్షత్రియులయందుఁగూడ దుర్లభ్యంబగు ధైర్యలక్ష్మి సాక్షాత్కారమున్నది. ఇంక మేమెల్ల బ్రతికితిమి" యని బహువిధముల బ్రశంసించెను.

రాజపత్ని సోమయాజిపైడ, సోమిదమ్మయెడ నింతింత యనరానిభక్తి గలిగి తనకృతజ్ఞతం దెలిపి తనమెడలోనున్న వెలలేని ముత్యాలహారము దీసి విష్ణుభట్టుకంఠమునం బడవైచి యది స్వీకరింపుమని కోరెను. విష్ణుభట్టు దానిం దీసి మరల నామెమెడలోనె వైచి "తల్లీ! ఈహారమునకు నాకంఠము తావు కాదు. నాకంఠములో నుండినయది చిలుకకొయ్యకుఁ దగిలించినట్లై శోభావిహీనమై యుండును. ఏవస్తు వెక్కడ నుండవలెనో యక్కడనే యుండవలెను. స్థానభ్రంశముచేతఁ గొన్ని పదార్థములు శోభింపవు. మాకు స్ఫటికాక్షసూత్రములు రుద్రాక్షమాలికలు ధరింపఁదగినవి. ఇది గాక యీ బహుమాన మందుకొనుటకు నేను నీకుఁ జేసినమహోపకారము లేదు. సంకటసమయములో నేను మానవధర్మమునే నిర్వర్తించితిని. అందుచే నేనట్టి పారితోషికంబునకుం దగను." అని యామె వేఁడుకోలు నిరాకరించెను. బ్రాహ్మణోత్తముని నిస్పృహతకు యోగ్యతకు రాజపత్ని యాశ్చర్యపడి యట్టిబ్రాహ్మణోత్తము లక్కడక్కడ నుండుటచేతనే భరతఖండము లోకంబునఁ బ్రసిద్ధిగాంచె నని తనలో ననుకొని మహాత్మునకు నమస్కరించి యూరకుండెను.

విష్ణుభట్టు ప్రసన్నుఁడయ్యు రాజపత్నికి, మంత్రికిఁ, బరివారమునకుఁ గావలసినభోజనపదార్థములన్నియు నెట్లో సమకూర్చుచుం

డెను. అది చూచి యాదేవి విచారపడి మంత్రింబిలిచి యిట్లనియె- "అయ్యా! సోమయాజిం జూడ నాకెంతయు జాలి గలుగుచున్నది. ఆయన కడుపేదవాఁడు ఆలుమగఁడు గలిసి వారిద్దరే యున్నారు. నేను, నాపరివారముతోఁ గలిసి పెక్కండ్రమున్నాము. ఇద్దరుగలకుటుంబమే భరియించుకొనుటకుఁ గష్టపడుచున్న యామహాత్మునిపై మన భారముగూడ వయిచి క్రుంగఁదీయుట ధర్మముగాదు. మన కీబోయలతోఁ బనిలేదు. పరిజనులతో నంతకన్న బనిలేదు. వారిని వారివారి యిండ్లకుం బనుపుము. నీవును నీనిమిత్తమై పరితపించుచున్న నీయాలుబిడ్డలకడ కరిగి సుఖింపుము. నాకొఱకై యీవఱకుఁ బడినచిత్తక్షోభము దేహశ్రమయుం జాలును. ఎంతకాల మీమందభాగ్యురాలికొఱకై నీయాలుబిడ్డల వియోగదుఃఖముపాలు చేసెదవు? ఎంతకాల మీయదృష్టహీనురాలికొఱకు సంసారసుఖములకుఁ బాసి మేను గాసి జెందించెదవు? ఎంతకాలము నాకొఱకు దుర్భరమైన విదేశవాసము సలిపెదవు? నాకెంత మేలు చేయవలయునో యంతమేలు చేసితివి. చేరువనున్న పట్టణమునకు నాముత్యాలహారముం గొనిపోయి విక్రయించి యీబోయలకు నీపరిజనులకుఁ దలకొకనాలుఁగువఱహాల చొప్పున నిచ్చి పంపుము. వారు నానిమిత్తము మిక్కిలి శ్రమపడినందుకుఁ బ్రస్తుతావస్థలో నింతకన్న నెక్కువబహుమానము నొసంగఁజాల. తక్కినసొమ్ము దారిబత్తెమునకు నీవు గ్రహింపుము." అని రాజపత్ని యానతిచ్చుటయు నమాత్యుఁడు విచారముతో నిట్లనియె—"తల్లీ! ఇతరప్రేమ లన్నియు దేశభక్తికి రాజభక్తికిఁ దీసిపోవును. రాజుసొమ్ము చిరకాలము దిని సమయమువచ్చినప్పు డాతనికొఱకు, నాతనియాలుబిడ్డల కొఱకుఁ బ్రాణముల నొసంగక మేను దాచుకొనువాఁడు పరమనీచుఁడు. సజ్జనగర్హితుఁడు. వాఁ డుభయలోకములకుం జెడును. నాయాలుబిడ్డలం జూడవలె నని నాకు లేదు. అ

యైనను మీయాజ్ఞ నుల్లంఘింపఁగూడదు గావున నేనొక్కపనిచేసెద. నాకుటుంబమునుదెచ్చి యీయూరనె కాపురముపెట్టెద. మీరు సుఖప్రసవమగువఱకు నిందుండెద. కుమారుఁడు గలిగెనా యతఁడు యుక్తవయస్కుఁడగువఱకు నిందే యుండెద. కుమారికయైన నామె సంప్రాప్తయౌవనయై తగినవరుని జెట్టపట్టువరకు నిందేయుండెద. నాకుఁగల భూములమీఁద వచ్చుధాన్యము నా కుటుంబపోషణమునకు సరిపోవును. అవి తెచ్చుకొని యిందే తిని యిందేయుండి మీపాదసేవయు దైవానుగ్రహమున్న పక్షమున ఁహాచిన్నిరాజుసేవయుఁ జేసెద. ఇందుకు మీరు సెలవొసంగవలయు." అని వేఁడుకొన వానివిన్నపము నామె విష్ణుభట్టసోమయాజి కెఱిఁగించి యతని సమ్మతిబడసి యమాత్యుఁడు సకుటుంబముగా నందుండుట కంగీకరించెను.

అనంతర మతఁడు ముత్యాలహారముగైకొని రాజపత్నీకంఠాభరణమును గాలవైపరీత్యమునఁ దనచేతితో నమ్మవలసివచ్చినందుకు విషాదమునొంది దాపుననున్న యొకపట్టణంబునకుం జని రత్నపరీక్షానిపుణులగు బేహారుల కది చూపి తగినవెలకు విక్రయించి యా మొల్లంబు దెచ్చి యామె యాజ్ఞప్రకారము సేవకులకుఁ బారితోషికము లొసఁగి రాజపత్నిజాడ లెవ్వరికిం దెలియనీయవల దని నొక్కిచెప్పి ప్రమాణములు చేయించి వారివారి నివాసముల కంపెను. ఆమఱునాఁడు తానును దేవికడ సెలవుగైకొని యామెను పలుతెఱంగుల విష్ణుభట్టునకు సోమిదమ్మకు నప్పగించి బైలుదేరి రహస్యముగ రాజధానికరిగి పరాక్రాంతమైన యాపట్టణముం జూచి దుఃఖించి యర్ధరాత్రమునఁ దనకుటుంబమును వెంటఁబెట్టుకొని యూరుదాఁటి మెల్లమెల్లగఁ బయనములుచేసి ముదివేము జేరెను. ఆతఁడు రాకమునుపె విష్ణుభట్లొకయిల్లుసిద్ధముచేసి సకుటుంబముగా నతని నందుఁ బ్రవేశపెట్టెను. అనుదినము నయ్యమాత్యుఁడు

బ్రాహ్మణునియింటి కరిగి రాజపత్నిని దర్శించుచుండును. ఆతని భార్యయుం బిడ్డలుఁగూడ రాజపత్నిని బహువిధముల సేవించుచుండిరి. ఆదేవియుఁ దనవలన బ్రాహ్మణునకు నెట్టివ్యయము లేకుండఁదన చిన్నిచిన్నివస్తువుల విక్రయింపఁబనిచి యాసొమ్మునఁ దనకుఁ గావలసినపదార్థములఁ దెప్పించుకొనుచుఁ గాలక్షేపముచేయుచుండెను.

రాజపత్నికిఁ గ్రమక్రమంబున నెలలు నిండెను. గర్భభారమధికమయ్యెను. ఒకశుభముహూర్తంబున నామె ప్రసవించెను. అతిసుందరుఁ డగుకుమారుఁడు జనియించెను. వానిమేని కాంతులతో గదియెల్ల వెలుఁగఁజొచ్చెను. పుట్టినప్పుడే విష్ణుభట్టు నుద్దేశించి కావుకావు మని వేఁడుచున్నాఁడోయన్నట్లు కావుకావు మని మనోహరస్వరముతో నేడ్చెను. సోమిదమ్మ శ్రద్ధాభక్తులతో నేడవనాఁటివఱకు నెన్నమ్మకథ జెప్పి బాలారిష్టదోషములు గలుగకుండఁబ్రయత్నించి పథ్యపానములు సరిగ నడిపెను. పురుడు సలక్షణముగా వెళ్ళెను. మహారాజుగారు జీవించియున్నపక్షమున నఖండవైభవముతోఁ బుత్రోత్సవము జరిగించి జాతకరణనామకరణములు మిక్కిలి యెక్కువసంతోషముతో జరిగియుండు ననియు వారు లేకపోవుటచే నది పేదరాలి పురుడువలె జరుగుచున్నదనియు రాజపత్ని మిక్కిలి విచారించెను. విష్ణుభట్టు పదునొకండవదినమున బాలింతరాలిని స్నానముచేయించి బాలకునకు క్షత్రియకుమారోచితమయినజాతకరణము జేసి యామె యిష్టమువచ్చినపేరు పెట్టుకొమ్మని చెప్పెను. అప్పు డాదేవి యిట్లనియె "తండ్రీ! యీబాలకుఁడు నీకతంబున బ్రతికినాఁడు. వానికిని నాకును నీవ ప్రాణప్రదాతవు. కావున నీపేరే పెట్టవలె నని నాసంకల్పము." అని తనయభిప్రాయము దెల్పినయాదేవికి సోమయాజి యిట్లనియె. "బిడ్డా! నేను పేదవాఁడను అనామకుఁడను నాపేరు పెట్టనేల? నీతండ్రి పేరో బాలకునితాతపేరో మఱి యేదేవునిపేరో పెట్టుము నావంటి

యనామకుని పేరు పెట్టినందువలన నేమి ప్రయోజనము? విక్రమ శాలురగు బాలురకుఁ బిఱికిపంద లగు బ్రాహ్మణుల పేరు పెట్టఁ గూడదు.

అది విని రాజపత్ని వెండియు నిట్లనియె "తండ్రీ! నీవు పిఱికి పందవు గావు. మహాధీరుఁడవు శూరుఁడవు. ఖడ్గము చేతఁబూని పగతు అని పేరువెట్టి మనుష్యుల సంహరించినవాఁడే శూరుఁడుగాఁడు ఇండ్లు కాల్చి నరుల హింసించి గ్రామములు దోఁచుకొన్నంతమాత్ర ముచేత మనుష్యుఁడు శూరుఁడు గాఁడు. నీకున్న శూరత్వ మెవరికిని లేదు. ఎంతో మహాపద రాఁదలఁచుకొన్నను దానిని నిర్భయముగాఁ దలయొగ్గి నన్ను నీకడుపులోఁ బెట్టుకొని కాపాడితివి. మే మెందఱ నో వేఁడుకొంటిమిగాని ధైర్యము చాలక వారు మమ్ము తమయూరు నుండి పాఱఁదోలిరి. కావున నీవంటిశూరులు మహాతేజశ్శాలుర మని విఱ్ఱవీగు రాజులకన్న నధికులు ప్రశంసనీయులు. ఈవిషయమున నామనవి నాలకించి నాముద్దు సెల్లింపుము. ఈశిశువు నీవలనబ్రతికెం గావున విష్ణువర్ధనుఁ డని పేరు వెట్టెదను. వానినామమున నీనామముకలిసి యుండవలయును. విష్ణుభట్టుచే వృద్ధినొందినవాఁడు విష్ణువర్ధనుఁడు. ఇది నాకృతజ్ఞతాసూచకము. ఈసూచన నీనినామమందేగాదు. దైవా నుగ్రహమున వీఁడు బ్రతికి బాగుండెనా నీవుచేసినమహోపకారము తరతరంబులకు జ్ఞాపకముండునట్లు వీనివంశస్థు లందఱు విష్ణువర్ధనుఁ డనుబిరుదు గ్రహింతురుగాక! ఇదిమాతృశాసనము. మహాపతివ్రతా శాసనము. ఇది కృతజ్ఞతాప్రేరితము. ఇది తత్కారణమున నవిలంఘనీ యము. అనాథనై యగతికనై నేఁడు నే నీతాటియాకులయింటిలోఁ గూర్చుండి చేసిన యీశాసనము నాకుమారుఁడు వానికుమారులు వారికుమారులు వారిమనుమలు మాణిక్యకిరీటములకన్న మున్నుగాఁ దమశిరంబుల దాల్చి మన్నింతురుగాక! అట్లు మన్నింపరేని యాది.

మహాత్మనైన నేను వ్యర్థప్రతిజ్ఞనగుదును. చాళుక్యవంశము ప్రపంచము న్నంతకాలము తద్వంశస్థులగు రాజులందఱు విష్ణువర్ధనులె యగుదురు గాక! ఇతరనామములు వారికెన్ని యున్నను నితరబిరుదము లెన్ని యున్నను విష్ణువర్ధనసంజ్ఞ వారికుండితీరవలయు. తండ్రీ! నీవు నావలన లవమైన ధనము గ్రహింపనైతివి. నేను నీ కేయుపకారము జేయఁజాలను. నీవు నా కనేకోపకారములు చేసితివి. నీపేరు పెట్టుకొనునట్టివరము గూడ నిచ్చి యీమహోపకారముగూడ జేయుము. ఈతఁడు విష్ణువర్ధననామధేయుఁ డగుఁగాక!” అని యామహాత్మునకు ముమ్మాఱు ప్రదక్షిణము జేసి చేతులు జోడించి నెన్నుదురు వానియడుగుదమ్ముల సోఁకునట్లు నమస్కరించెను. మనస్సు నీరయిపోవ బ్రాహ్మణుఁడు బాష్పపూరితనేత్రుఁడై రాజపత్నిని పాదముల పైనుండి లేవఁదీయుమని సోమిదమ్మతోఁ జెప్పి యామెయట్లు సేయ “బిడ్డా! నీ కింతయుత్సాహమున్నప్పుడు నేనది నివారింపఁజాల! నీయిచ్చవచ్చినట్లు సేయుము” అని వానికి విష్ణువర్ధనుఁ డని పేరుపెట్టెను.

బాలుఁడు శుక్లపక్షచంద్రుఁడువలె క్రమక్రమమున వృద్ధిపొందఁజొచ్చెను. మూఁడవనెలలోఁ జిఱునవ్వులు మొలకలెత్తెను. నాల్గవమాసమునఁ జూపులు నిలుకడగాంచెను. ఆఱవమాసమునఁ దంతములు పొడసూపెను. ఏడవమాసమున విద్దెములు చేయసాగెను. అనంతర మన్నప్రాశము జరిగెను. పదిమాసములు నిండునప్పటికి బాలకుఁడు తప్పటడుగులిడనారంభించి పదునొకండవమాసమున నడచెను. తొమ్మిదవనెలనుండి చిన్నచిన్నమాటలు నేర్చి సంవత్సరము దాఁటఁగానే చిలుకపలుకులు పలుకఁజొచ్చెను. చక్కరకన్నఁ దీయనయినయప్పలుకులు విని విచారాంధకారమును దొలఁగించు నా చిఱునవ్వువెన్నెలలు జూచి యానందించుభాగ్యము మహారాజునకు లేకపోయెనని యామె పలుమాఱు విచారించి యిరువుర యానందము దానేయనుభవింపఁజొచ్చెను. బాలకుఁడు సోమయాజిని దా...

యనియు సోమిదమ్మ నవ్వ యనుచుఁ బిలుచుచు బిడ్డలు లేకతపించుచున్నవారిసంసారమునకు వికాసము గలిగించెను. కాలక్రమంబున బాలకుఁడైదేండ్లవాఁడయ్యెను. సోమయాజి వాని కక్షరాభ్యాసము జేసి చదువుచెప్ప నారంభించెను. ఆకుమారుఁడు కుశాగ్రబుద్ధియై గురువుపదేశించినదంతయు క్షణములో గ్రహించి తల్లికి మహానందము గలిగించెను. ఆయూరనె వారిం గనిపెట్టుకొనియున్న యమాత్యుఁడు బాలకునకు క్షత్రియకుమారులం జతగాఁగూర్చి విల్లుమొదలగుశస్త్రములయందు వానిచేతఁ గృషిచేయించెను. శాస్త్రవిద్యలయం దెంతయభిరుచి యాతనికిఁ గలిగెనో శస్త్రవిద్యయందు నంతటియభిరుచియే వానికి జనించెను. పదియారేండ్ల ప్రాయము వచ్చునప్పటి కతఁడు శాస్త్రములయందు, ధనుర్వేదమునందు, మిక్కిలి నేర్పరియై యెల్లవారలచేత మెప్పు వడయఁజొచ్చెను. ఆయూరిలోను జుట్టుపక్కలనున్న రాజకుమారులను శూద్రబాలకులను వెంటఁబెట్టుకొని ఘాతుకమృగంబుల వేఁటాడిచంపి గ్రామంబులపైఁబడి దోచుకొను బందిపోటులను దారులుగొట్టుదొంగలను నిరోధించి వధియించి యాప్రాంతము నిష్కంటకముగఁ జేసెను. ఆబలముననే క్రమక్రమముగ నధికము జేసి తానువసియించుప్రాంతమునకుఁ దానె రాజై క్రమక్రమంబునఁ బెచ్చుపెరిగి విజయంబుపై విజయంబునొంది కోటపై కోట నాక్రమించి యదృష్టముపై నదృష్టము కలిసి రా మహాసైన్యముం గూర్చుకొనియెను.

కటకేశ్వరుఁడు కన్నుదెఱచి వానిం దండించుటకు మహాసేనాసమేతుఁడై వచ్చెను. నవయౌవనోద్దీపితుఁడైనవిష్ణువర్ధనునకును జరమావస్థలోనున్న కటకేశ్వరునకును మహాసంగ్రామము జరిగెను. విష్ణువర్ధనుఁడు తన జనకునిం గడతేర్చి దేశమంతను మంగలంబునం బట్టి వేచిన తెలుంగాణఁ గటకేశ్వరుని రణముఖంబున స్వహస్తమున తాఁ జయించి పితౄణము దీర్చి కృతకృత్యుఁ డయ్యెను. కృష్ణా